# బృహదారణ్యకోపనిషత్

## ముని కాండము అధ్యాయము - 4

## ఉపోద్ఘాతము

నాలుగవ అధ్యాయములోకి వెళ్ళేముందు ఒకసారి బృహదారణ్యకోపనిషత్‌యొక్క విహంగ వీక్షణం గుర్తుతెచ్చుకుంటే, ఈ ఉపనిషత్తులో మూడు కాండములు ఉన్నాయని చూశాము.

1. మధుకాండము – 1, 2 అధ్యాయములు – ఉపదేశ కాండము
2. మునికాండము – 3, 4 అధ్యాయములు – ఉపపత్తి కాండము
3. ఖిలకాండము – 5, 6 అధ్యాయములు – ఉపాసనా కాండము

ఉపదేశ కాండములో శ్రవణం, ఉపపత్తి కాండంలో మననం జరుగుతాయి. శ్రవణం కూడా అధ్యారోప, అపవాద న్యాయం ప్రకారం సాగుతుంది. మొదటి అధ్యాయములో అధ్యారోపం, రెండవ అధ్యాయములో అపవాదం చూశాము. అలాగే ఉపపత్తి కాండములో తర్కం ఉంటుంది. అందులో కూడా రెండురకాల తర్కాలు ఉంటాయి – జల్ప ప్రధానం, వాద ప్రధానం.

జల్పంలో ఎదుటివ్యక్తిమీద గెలవటమే ముఖ్యం, జ్ఞానబోధకు ప్రాధాన్యత లేదు. వాదంలో జ్ఞానానికి ప్రాధాన్యతనిస్తారు గాని, ఎదుటివ్యక్తిమీద విజయం సాధించటానికి ప్రాముఖ్యతనివ్వరు. మునికాండంలో రెండు రకాల వాదనలు చూస్తాము. రెండు అధ్యాయాల్లోనూ యాజ్ఞవల్క్యుడు వాదిస్తాడు కాబట్టి, అతను ముని కాబట్టి, దీన్ని మునికాండము అంటారు.

మూడవ అధ్యాయములో యాజ్ఞవల్క్యుడు గొప్ప బ్రాహ్మణులైన అశ్వలుడు, కహోలుడు, గార్గి, ఆర్తభాగుడు, శాకల్యుడువంటి వారితో వాదించి, వారిని ఓడించి, వారిమీద విజయాన్ని సాధించాడు. కాని చివర్లో యాజ్ఞవల్క్యుడు అడిగిన రెండు ప్రశ్నలకు ఎవరూ జవాబు చెప్పలేకపోయారని చూశాము. వాళ్ళూ జవాబు చెప్పలేదు, ప్రశ్న వేసిన యాజ్ఞవల్క్యుడు కూడా జవాబు చెప్పలేదు. ఎందుకు? జల్పంలో జ్ఞానం ప్రధానం కాదు కాబట్టి, గెలుపే ముఖ్యం కాబట్టి. అందువల్ల ఉపనిషత్తే జవాబు చెబుతుంది.

ఇప్పుడు మనం చూడబోయే నాలుగవ అధ్యాయము వాద ప్రధానంగా ఉంటుంది. ఇక్కడ ఎదుటి వ్యక్తిని ఓడించటమో, అతని గర్వభంగం చెయ్యటమో కాదు ముఖ్యం; అతను అడిగిన విషయంలో జ్ఞానబోధ చెయ్యటం ముఖ్యం. ఈ అధ్యాయములో ఆరు బ్రాహ్మణాలు ఉన్నాయి; వాటిల్లో ఎక్కువగా యాజ్ఞవల్క్యుడే గురువు. జనక మహారాజే శిష్యుడు. ఈ ఆరు బ్రాహ్మణాల్లో మొదటి బ్రాహ్మణము ఉపాసన గురించి చెపితే, ఆఖరి బ్రాహ్మణము గురుశిష్య పరంపరలను చెబుతుంది. ఈ ఆరవ బ్రాహ్మణాన్ని వంశ బ్రాహ్మణము అంటారు. మధ్యలో ఉన్న నాలుగు బ్రాహ్మణాలూ ఆత్మవిద్యను బోధిస్తాయి. ఇదీ మునికాండములో ఉన్న నాలుగవ అధ్యాయము గురించిన వివరణ. ఇప్పుడు మొదటి బ్రాహ్మణములోకి అడుగు పెడదాము.

# 4.1 - షడాచార్య బ్రాహ్మణము

మొదటి బ్రాహ్మణాన్ని షడాచార్య బ్రాహ్మణము అంటారు. ఎందుకంటే యాజ్ఞవల్క్యుడు జనక మహారాజును కలిసి, మీరు తక్కిన ఆచార్యుల దగ్గర ఏం నేర్చుకున్నారని అడుగుతాడు. అప్పుడు జనక మహారాజు తను ఆరుగురు ఆచార్యుల దగ్గర నేర్చుకున్న విషయాలను పేర్కొంటాడు. వారు నేర్పినది సగుణబ్రహ్మ గురించి. యాజ్ఞవల్క్యుడు వారు చెప్పింది సరియైనదే అని చెబుతూ, కాని అది అసంపూర్ణంగా ఉందని, తను మరికొన్ని వివరాలు చెబుతాడు.

మంత్రం 4.1.1

**ఓమ్, జనకో హ వైదేహ ఆసాంచక్రేఽథ హ యాజ్ఞవల్క్య ఆవవ్రాజ। తగ్ం హోవాచ యాజ్ఞవల్క్య కిమర్థమచారీః పశూనిచ్ఛన్నణ్వన్తానితి। ఉభయమేవ సమ్రాడితి హోవాచ ॥**

గురుశిష్యులను పరిచయం చెయ్యటంతో ఈ అధ్యాయము మొదలవుతుంది. గురుశిష్యులను పరిచయం చెయ్యటంవల్ల రెండు విషయాలు అర్థం అవుతాయి – బ్రహ్మవిద్యను గురువుద్వారానే నేర్చుకోవాలి; గురువు సమీపంలో శిష్యుడు వినయంగా ఉండాలి.

జనకుడు చక్రవర్తి, జ్ఞాని. అంటే తనకే జ్ఞానం ఉంది, అందరూ తనను చక్రవర్తిగా గౌరవిస్తారు. అయినా యాజ్ఞవల్క్యుడు రాగానే ఆయనను సాదరంగా ఆహ్వానించి, ఆయన వద్ద బ్రహ్మవిద్య నేర్చుకోవటానికి సిద్ధపడతాడు. అంతేకాదు, జనకుడి గురుదక్షిణ కూడా చాలా సమృద్ధిగా ఉంటుంది. దీనిద్వారా కూడా గురుదక్షిణయొక్క ఆవశ్యకత తెలుస్తుంది.

**ఓమ్ జనకో హ వైదేహ ఆసాంచక్రే** – ఒకానొకప్పుడు జనకుడు తన సింహాసనంమీద కూర్చుని ఉన్నాడు. వైదేహ అంటే విదేహరాజు. కొంతమంది విదేహ జనకునియొక్క పేరు అని కూడా అంటారు. అతను జ్ఞాని కాబట్టి, అతనికి దేహ అభిమానం లేదు కాబట్టి జనకుణ్ణి విదేహ అనవచ్చు అని వారి వాదన. అందువల్ల విదేహ అంటే రాజుగానూ తీసుకోవచ్చు, రాజ్యంగానూ తీసుకోవచ్చు. ఇక్కడ మనం రాజ్యంగా తీసుకుంటాము. విదేహరాజు కూర్చున్నాడు.

**యాజ్ఞవల్క్య ఆవవ్రాజ** – అటువంటి సమయంలో యాజ్ఞవల్క్యుడు ఆయన దగ్గరకి వచ్చాడు. యాజ్ఞవల్క్యుడు ఏం కోరినా ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నాడు రాజు. అతనికి పశుసంపద కాని, ఆధ్యాత్మిక అంశాలు నేర్పే అవకాశం కాని కావాలని తెలుసు జనకునికి.

**తగ్ం హోవాచ యాజ్ఞవల్క్య కిమర్థమచారీః పశూనిచ్ఛన్నణ్వన్తానితి** – ఓ యాజ్ఞవల్క్య! దేనికోసం వచ్చారు? పశువులను కోరా, పరమాత్మ గురించి ప్రశ్నలు వినటానికా అని అడిగాడు. అణుః అంటే పరమాత్మ లేదా సూక్ష్మవస్తువు. అంటే సూక్ష్మవస్తువుమీద తను ప్రశ్నలు వేస్తే జవాబు చెప్పటానికి వచ్చాడా?

బ్రహ్మవిద్య తెలిసిన జ్ఞానికి బ్రహ్మవిద్యను ఇతరులకు బోధించాలనే తపన ఉంటుంది. అందువల్లనే నచికేతుడు ఆత్మ గురించి చెప్పమనగానే, యమధర్మరాజు మురిసిపోయాడు.

**ఉభయమేవ సమ్రాడితి హోవాచ** – వేదాంత అవసరం తీర్చుకోవటానికి, లౌకిక అవసరం కూడా తీర్చుకోవటానికి వచ్చానని బదులు చెప్పాడు యాజ్ఞవల్క్యుడు. జీవితం అంటే అన్నపానాదులు తీర్చుకోవటం మాత్రమే కాదు, దానికన్నా ఉన్నతమైనది. అందువల్ల జనకుడు కూడా వేదాంతజ్ఞానం పొందటానికి సిద్ధంగా ఉన్నాడు. ఇది ఈ బ్రాహ్మణానికి, తక్కిన బ్రాహ్మణాలకు కూడా ఉపోద్ఘాతం. ఈ విధంగా ఈ గురుశిష్యుల మధ్య సంభాషణ మొదలయింది.

## మంత్రం 4.1.2

**యత్తే కశ్చిదబ్రవీత్తచ్ఛృణవామేత్యబ్రవీన్మే జిత్వా శైలినిర్వాగ్వై బ్రహ్మేతి యథా మాతృమాన్ పితృమానాచార్యవాన్ బ్రూయాత్తథా తచ్ఛైలినిరబ్రవీద్వాగ్వై బ్రహ్మేత్యవదతో హి కిగ్ంస్యాదిత్యబ్రవీత్తు తే తస్యాయతనం ప్రతిష్ఠాం న మేఽబ్రవీదిత్యేకపాద్వా ఏతత్సమ్రాడితి స వై నో బ్రూహి యాజ్ఞవల్క్య॥ వాగేవాయతనమాకాశః ప్రతిష్ఠా ప్రజ్ఞేత్యేనదుపాసీత । కా ప్రజ్ఞతా యాజ్ఞవల్క్య । వాగేవ సమ్రాడితి హోవాచ ॥**

**వాచా వై సమ్రాడ్బన్ధుః ప్రజ్ఞాయత ఋగ్వేదో యజుర్వేదస్సామవేదోఽథర్వాఙ్గిరస ఇతిహాసః పురాణం విద్యా ఉపనిషదః శ్లోకాస్సూత్రాణ్యనువ్యాఖ్యానాని వ్యాఖ్యానానీష్టగ్ం హుతమాశితం పాయితమయం చ లోకః పరశ్చ లోకస్సర్వాణి చ భూతాని వాచైవ సమ్రాట్ ప్రజ్ఞాయన్తే వాగ్వై సమ్రాట్ పరమం బ్రహ్మ నైనం వాగ్జహాతి సర్వాణ్యేనం భూతాన్యభిక్షరన్తి దేవో భూత్వా దేవానప్యేతి య ఏవం విద్వానేతదుపాస్తే । హస్త్యృషభగ్ం సహస్రం దదామీతి హోవాచ జనకో వైదేహః । స హోవాచ యాజ్ఞవల్క్యః పితా మేఽమన్యత నాననుశిష్య హరేతేతి ॥**

రెండవ మంత్రంనుంచి ఏడవ మంత్రంవరకూ యాజ్ఞవల్క్యుడు ఆరు సగుణబ్రహ్మ ఉపాసనలను బోధిస్తాడు. ఈ ఆరు సగుణబ్రహ్మలనూ ఆరుగురు భిన్న ఆచార్యులు జనక మహారాజుకు పరిచయం చేశారు. ఆ బోధ అసంపూర్ణంగా ఉందని యాజ్ఞవల్క్యుడు దాన్ని పూర్తి చేస్తాడు. అన్ని మంత్రాలు ఇంచుమించు ఒకేలా ఉంటాయి. అందువల్ల ఈ మంత్రం అర్థాన్ని మాత్రం చూద్దాము.

**యత్తే కశ్చిదబ్రవీత్తచ్ఛృణవామేత్యబ్రవీన్మే** – ఆచార్యులు ఎవరైనా నీకు ఏదైనా చెప్పివుంటారు కదా. దానిని మేము వింటాము.

**జిత్వా శైలినిర్వాగ్వై బ్రహ్మేతి** – వాక్కే బ్రహ్మయని శైలినిజిత్వా నాకు చెప్పాడు.

**యథా మాతృమాన్ పితృమానాచార్యవాన్ బ్రూయాత్తథా తచ్ఛైలినిరబ్రవీద్వాగ్వై బ్రహ్మేతి** – ఏ విధంగానైతే తల్లిదండ్రులు, గురువు గల వ్యక్తి చెబుతాడో, ఆ విధంగా శైలినిజిత్వా వాక్కే బ్రహ్మ అని చెప్పాడు యాజ్ఞవల్క్యుడు.

**అవదతో హి కిగ్ం స్యాదితి** – ఎందుకంటే, మాట్లాడని వ్యక్తివల్ల ఏమవుతుంది?

**అబ్రవీత్తు తే తస్యాయతనం ప్రతిష్ఠామ్** – కాని ఆ వాగ్దేవతయొక్క ఆయతనం, ప్రతిష్ఠ గురించి నీకు చెప్పాడా?

**న మేఽ బ్రవీదితి** – నాకు చెప్పలేదు (జనకుడు).

**ఏకపాద్వా ఏతత్సమ్రాడితి** – ఓ సామ్రాట్! ఇదైతే ఒకే పాదం గల బ్రహ్మ.

**స వై నో బ్రూహి యాజ్ఞవల్క్య** – ఓ యాజ్ఞవల్క్యా! అయితే మీరు నాకు చెప్పండి.

ఈ విధంగా ఒక్కొక్క గురువు, ఒక్కొక్క దేవతను సగుణబ్రహ్మ కింద పరిచయం చేశారు. అలా శరీరంలో ఆరు అంగాలను తీసుకుని, వాటి అధిష్ఠానదేవతలమీద ఉపాసన చెయ్యాలి. యాజ్ఞవల్క్యుడు ఆ అధిష్ఠానదేవతల పేర్లు చెప్పడు కాని, ఆ దేవతలను సగుణబ్రహ్మగా తీసుకోవాలి. ఈ మంత్రంలో వాక్ అనే అంగాన్ని తీసుకున్నాడు గురువు. దానికి అధిష్ఠానదేవతను వాక్‌దేవతా బ్రహ్మ అన్నాడు. అంటే అగ్నిదేవత వాక్కుకి అధిష్ఠానదేవత అని మనకు తెలుసు.

నువ్వు ఒక్క ఆ దేవత గురించి మాత్రమే తెలుసుకుంటే నువ్వు పూర్తి జ్ఞానం పొందలేదు. అది ఒక పాదం మాత్రమే అంటే జ్ఞానంలో నాలుగోవంతు మాత్రమే. ఎందుకంటే పూర్ణసగుణబ్రహ్మ చతుష్పాద బ్రహ్మ. తక్కిన మూడు పాదాల గురించి కూడా తెలుసుకోవాలి. ఏమిటవి? ఆయతనం, ప్రతిష్ఠ, ఉపనిషత్తు.

ఆయతనం అంటే శరీరం; ప్రతిష్ఠ అంటే ఆశ్రయం; ఉపనిషత్తు అంటే రహస్య నామధేయం. ఈ మూడూ కలిస్తే అది చతుష్పాద సగుణబ్రహ్మ అవుతుంది. రహస్యనామంమీద ఉపాసన చెయ్యాలి. రహస్యనామం ఆ దేవత గొప్పతనాన్ని సూచిస్తుంది.

**వాగేవాయతనమాకాశః ప్రతిష్ఠా ప్రజ్ఞేత్యేనదుపాసీత** – వాక్కే ఆయతనం, ఆకాశం ప్రతిష్ఠ. ఈ బ్రహ్మను ప్రజ్ఞ అనే రహస్యనామంతో ఉపాసించాలి.

**కా ప్రజ్ఞతా యాజ్ఞవల్క్య** – ఓ యాజ్ఞవల్క్యా! ప్రజ్ఞ లక్షణం ఏమిటి?

**వాగేవ సమ్రాడితి హోవాచ** – ఓ సామ్రాట్, వాక్కే అని పలికాడు.

ఎందుకు వాక్కు అంత గొప్పదో యాజ్ఞవల్క్యుడు వివరిస్తాడు, కాని దానికి తర్వాత వద్దాము.

అన్ని మంత్రాల్లోనూ సమానంగా ఉన్న తక్కిన అంశాలను చూద్దాము. అన్ని ఉపాసనలకు ఫలం కూడా చెబుతాడు యాజ్ఞవల్క్యుడు. ఆ ఫలం కూడా సమానంగా ఉంటుంది. ఏ అంగంమీద ఉపాసన చేస్తాడో, ఆ అంగం చాలా శక్తివంతంగా ఉంటుంది.

**నైనం వాగ్జహాతి** – అతన్ని వాక్కు విడిచిపెట్టదు అంటే వాక్కు బ్రహ్మాండంగా ఉంటుందని అర్థం.

**సర్వాణ్యేనం భూతాన్యభిక్షరంతి** – సకలప్రాణులు అతనిమీద అన్నీ వర్షంలా కురిపిస్తాయి.

**దేవో భూత్వా దేవానప్యేతి య ఏవం విద్వానేతదుపాస్తే** – ఈ విధంగా ఉపాసన చేసిన వ్యక్తి దేవతయై దేవతలను పొందుతాడు.

**హస్త్యృషభగ్ం సహస్రం దదామీతి హెూవాచ జనకో వైదేహః** – ఏనుగులాంటి ఒక ఆంబోతును, వెయ్యి ఆవులను ఇస్తాను అన్నాడు జనకుడు.

**స హెూవాచ యాజ్ఞవల్క్యః పితామేఽమన్యత నాననుశిష్య హరేతేతి** – శిష్యునికి ఉపదేశం పూర్తి చెయ్యకుండా దక్షిణను తీసుకోకూడదని మా తండ్రిగారు భావించేవారు అని యాజ్ఞవల్క్యుడు చెప్పాడు. అననుశిష్య అంటే పూర్తిగా చెప్పకుండా, న హరేత – దక్షిణ తీసుకోకు.

ఈ మంత్రాలన్నిటిలో రెండు ముఖ్యమైన వాక్యాలు ఉన్నాయి. వాటిని శంకరులవారు తరచు ఉటంకిస్తుంటారు.

1. **మాతృమాన్ పితృమానాచార్యవాన్ బ్రూయాత్** – ముగ్గురి దగ్గర శిక్షణ పొందిన వ్యక్తి ఏం చెపితే అది ప్రామాణికమవుతుంది. వారు తల్లి, తండ్రి, గురువు. ఈ ముగ్గురూ ఒక వ్యక్తిని తీర్చిదిద్దితే అతను చాలా తెలివిగా, సత్యవంతునిగా, పరిపూర్ణ వ్యక్తిత్వంతో, భావోద్రేకాలకు అతీతంగా ఎదుగుతాడు. అందువల్లనే తల్లిదండ్రులలో ఏ ఒక్కరి దగ్గరో పెరిగిన పిల్లలు పరిపూర్ణ వ్యక్తిత్వాన్ని ఏర్పరచుకోవటం కష్టమవుతుంది. కఠోపనిషత్తులో కూడా ఈ ముగ్గురూ ఉన్న వ్యక్తి ఏదైనా చెపితే అది సత్యమే అని వస్తుంది. ఇక్కడ కూడా యాజ్ఞవల్క్యుడు అదే మాట చెబుతాడు. ఆరుగురు ఆచార్యులనూ మెచ్చుకుంటాడు. ఎందుకంటే ఆ ఆరుగురూ తల్లిదండ్రులు, గురువు వద్ద నేర్చుకున్నారు.

2. **దేవో భూత్వా దేవానప్యేతి** – ఏ దేవతమీద ఉపాసన చేస్తే ఆ దేవతలో ఐక్యం అవుతాడు. సాధారణంగా ఈ ఫలాన్ని మరణం తర్వాత పొందుతాడు. ఇక్కడ రెండు పదాలు చూస్తాము. దేవోభూత్వా (ఆ దేవత అయ్యి) దేవాన్ అప్యేతి – ఆ దేవతతో ఐక్యం అవుతాడు. నది సముద్రం అయి, సముద్రంతో కలుస్తుంది అంటే పునరుక్తి దోషం రాదా? రాదంటున్నారు శంకరులవారు.

**ఇహ దేవో భూత్వా పునశ్శరీర పాతోత్తరకాలం దేవానప్యేతి**

ఈ లోకంలో జీవించి ఉండగానే ఉపాసనయొక్క బలంచేత దేవతగా కొలవబడి, దేహం పడిపోయాక దేవతలనే పొందుతాడు. అతనికి దేవతలకుండే కొన్ని లక్షణాలు – స్వచ్ఛత్వం, సత్యకామత్వం, సత్యసంకల్పత్వం లాంటివి అలవడుతాయి. అందువల్ల సర్వాణి భూతాని అభిక్షరంతి అన్నాడు. అతనిమీద వరాలు కురిపిస్తారు. అంటే అతను దేవత అయ్యాక, అన్నీ పొందుతాడు.

ఇప్పుడు 2–7 మంత్రాలలో వచ్చిన ఉపాసనల వివరాలను ఈ క్రింది పట్టికలో చూద్దాము.

| మంత్రం | ఋషి | దేవత | ఆయతనం | ప్రతిష్ఠ | ఉపనిషత్తు |
|---|---|---|---|---|---|
| 2 | జిత్వా | అగ్ని | వాక్కు | ఆకాశం | ప్రజ్ఞ |
| 3 | ఉదంకుడు | వాయువు | ప్రాణం | ఆకాశం | ప్రియం |
| 4 | బర్కుడు | ఆదిత్యుడు | చక్షువు | ఆకాశం | సత్యం |
| 5 | భారద్వాజుడు | దిగ్దేవత | శ్రోత్రం | ఆకాశం | అనంతం |
| 6 | సత్యకాముడు | చంద్రుడు | మనస్సు | ఆకాశం | ఆనందం |
| 7 | శాకల్యుడు | ప్రజాపతి | హృదయం | ఆకాశం | స్థితి |

ఆకాశం అంటే అంతర్యామి బ్రాహ్మణములో చూసిన ఈశ్వరుడు. ఈశ్వరుడే అందరు దేవతలకు ప్రతిష్ఠ లేదా ఆశ్రయం.

ఇప్పుడు మనం ఇందాక వదిలేసిన మంత్రంలోని మధ్యభాగాన్ని చూద్దాము. అది వాక్కుకు ప్రజ్ఞ అనే రహస్యనామం ఎందుకు ఉందో, వివరిస్తుంది. మనం పొందే జ్ఞానంలో 90 శాతం జ్ఞానం వాక్కువల్లనే పొందుతాము.

**వాచా వై సమ్రాడ్బంధుః ప్రజ్ఞాయతే** – ఓ సామ్రాట్! వాక్కువల్లనే బంధువు తెలియబడతాడు. తల్లిదండ్రులు ఇదుగో బాబూ, ఇతను నీ బాబాయి, ఇతను నీ మామయ్య అని పరిచయం చేస్తారు. ఇటువంటి లౌకిక జ్ఞానమే కాదు, శాస్త్రజ్ఞానం కూడా వాక్కుద్వారానే పొందుతారు.

**ఋగ్వేదో యజుర్వేదస్సామవేదోఽథర్వాంగిరస** – ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణ వేదం;
**ఇతిహాసః** – రామాయణ, భాగవతాలనే ఇతిహాసాలు కాదు, వేదాల్లో వచ్చే చరిత్రలు;
**పురాణమ్** – వేదాల్లో చూసే సృష్టి ప్రక్రియలు;
**విద్యా** – వేదాల్లో ఉన్న దేవజన విద్య;
**ఉపనిషదః** – రహస్యనామాలు. ఇప్పుడు ప్రజ్ఞలాంటివి;
**శ్లోకాః** – శ్లోకాలు;
**సూత్రాణి** – సూత్రాలు. బ్రహ్మ సూత్రాలు కాదు. ఈ ఉపనిషత్తులోనే మొదట్లో విద్యాసూత్రం, అవిద్యాసూత్రం చూశాము;
**అనువ్యాఖ్యానాని** – వేదాలే సూత్రాలమీద ఇచ్చిన భాష్యం. బృహదారణ్యకోపనిషత్తే అది చెప్పిన విద్యాసూత్రం, అవిద్యా సూత్రాలను మొదటి రెండు అధ్యాయాల్లో వివరించింది. అలాగే బ్రహ్మవిద్ ఆప్నోతి పరం అనే సూత్రం తైత్తిరీయోపనిషత్తులో వస్తుంది. ఆ ఉపనిషత్తే ఆ సూత్రాన్ని విడమరచి చెబుతుంది;
**వ్యాఖ్యానాని** – మంత్రాలమీద వచ్చే భాష్యం. ఇది సప్తాన్న బ్రాహ్మణములో చూశాము. ఉపనిషత్తే ఐదారు మంత్రాలు వేరే చోటినుంచి ఉటంకించి, వాటి వివరణలను ఇస్తుంది. సూత్రంమీద భాష్యం అనువ్యాఖ్యానం; మంత్రంమీద భాష్యం వ్యాఖ్యానం;
**ఇష్టమ్** – యాగం చెయ్యటంవల్ల వచ్చే పుణ్యం;
**హుతమ్** – హోమం చెయ్యటంవల్ల వచ్చే పుణ్యం. యాగం అంటే సంకల్పం, హోమం అంటే ప్రక్షేపం అంటే అందులో వెయ్యటం;
**అశితమ్** – అన్నదానం చెయ్యటంవల్ల ఫలం;
**పాయితమ్** – జలదానం చెయ్యటంవల్ల వచ్చే ఫలం;
**అయం చ లోక** – ఈ లోకం. శంకరులవారు ఈ జన్మ అంటారు;
**పరశ్చ లోకః** – పరలోకం లేదా వచ్చే జన్మ;
**సర్వాణి చ భూతాని** – ఒక్కముక్కలో అన్ని జీవరాశుల గురించి;
**వాచైవ సమ్రాట్ ప్రజ్ఞాయంతే** – వాక్కువల్లనే అన్ని విషయాలూ తెలుస్తాయి;

**వాగ్వై సమ్రాట్ పరమం బ్రహ్మ** – ఓ సామ్రాట్ వాక్కే పరబ్రహ్మ.

దీని ఫలం ముందే చూశాము. ఈ ఉపాసన చేసిన వ్యక్తికి వాక్కు అతనిని విడిచి వెళ్ళదు అంటే వాక్కుయొక్క శక్తి బాగా ఉంటుంది. అతని వాగ్ధాటిని అందరూ మెచ్చుకుంటారు.

ఒక్కొక్క అంగం గురించిన తక్కిన మూడు పాదాలూ యాజ్ఞవల్క్యుడు చెప్పగానే, మురిసిపోయిన జనకుడు అతనికి గురుదక్షిణను ఇస్తానంటాడు. ఏమిటది? ఏనుగంత ఒక పెద్ద ఆంబోతును, ప్రసవించగల శక్తిగల వెయ్యి ఆవులను. యాజ్ఞవల్క్యుడు ఇంకా చెప్పే ఉద్దేశంలో ఉన్నాడు. అందువల్ల అప్పుడే కాదు, శిష్యునికి పూర్తిగా బోధించకుండా దక్షిణ తీసుకోకూడదని మా నాన్నగారు చెప్పేవారు అన్నాడు. ఇదే సంభాషణ బ్రాహ్మణంలో ప్రతిమంత్రం చివర జరుగుతుంది.

## మంత్రం 4.1.3

**యదేవ తే కశ్చిదబ్రవీత్తచ్ఛృణవామేత్యబ్రవీన్మ ఉదఙ్కశ్శౌల్బాయనః ప్రాణో వై బ్రహ్మేతి యథా మాతృమాన్ పితృమానాచార్యవాన్ బ్రూయాత్తథా తచ్ఛౌల్బాయనోఽబ్రవీత్ప్రాణో వై బ్రహ్మేత్యప్రాణతో హి కిగ్ం స్యాదిత్యబ్రవీత్తు తే తస్యాయతనం ప్రతిష్ఠాం న మేఽబ్రవీదిత్యేకపాద్వా ఏతత్సమ్రాడితి స వై నో బ్రూహి యాజ్ఞవల్క్య ప్రాణ ఏవాయతనమాకాశః ప్రతిష్ఠా ప్రియమిత్యేనదుపాసీత కా ప్రియతా యాజ్ఞవల్క్య ప్రాణ ఏవ సమ్రాడితి హోవాచ ప్రాణస్య వై సమ్రాట్ కామాయాయాజ్యం యాజయత్యప్రతిగృహ్యస్య ప్రతిగృహ్ణాత్యపి తత్ర వధాశఙ్కం భవతి యాం దిశమేతి ప్రాణస్యైవ సమ్రాట్ కామాయ ప్రాణో వై సమ్రాట్ పరమం బ్రహ్మ నైనం ప్రాణో జహాతి సర్వాణ్యేనం భూతాన్యభిక్షరన్తి దేవో భూత్వా దేవానప్యేతి య ఏవం విద్వానేతదుపాస్తే। హస్త్యృషభగ్ం సహస్రం దదామీతి హోవాచ జనకో వైదేహస్స హోవాచ యాజ్ఞవల్క్యః పితా మేఽమన్యత నాననుశిష్య హరేతేతి ॥**

పట్టిక ప్రకారం ఈ మంత్రంలో ఉదంకుడు అనే ఋషి ప్రాణదేవత గురించి చెప్పాడు. ప్రాణానికి అధిష్ఠానదేవత వాయువు. కాని అది ఏకపాద బ్రహ్మ కాబట్టి తక్కిన మూడు పాదాలూ యాజ్ఞవల్క్యుడు కలిపాడు. ఆయతనం– ప్రాణం; ప్రతిష్ఠ – ఆకాశం; రహస్యనామం – ప్రియం. ఉపాసన ప్రియ ఉపాసన. ఫలం ఇంతకు ముందు చూసినట్టే జీవించి ఉండగా ప్రాణశక్తి బాగుంటుంది. అంటే అపమృత్యుదోషం ఉండదు. దేవతలందరూ ఈ ఉపాసకుడిని వరాలతో ముంచెత్తుతారు. మరణించాక వాయుదేవతతో ఐక్యమవుతాడు. జనకుడు దక్షిణ ఇస్తానంటాడు కాని యాజ్ఞవల్క్యుడు అప్పుడే తీసుకోడు. యాజ్ఞవల్క్యుడు ప్రాణాన్ని ప్రియం అని ఎందుకన్నాడో మంత్రం మధ్యభాగంలో వివరించాడు. అది చూద్దాము.

**ప్రాణస్య వై సమ్రాట్ కామాయాయాజ్యం యాజయతి** – ఓ సామ్రాట్, ప్రాణంయొక్క ప్రయోజనంకోసమే యజ్ఞం చేసే అర్హత లేనివానిచేత యజ్ఞం చేయిస్తాడు. వర్ణాశ్రమ ధర్మాల ప్రకారం కొంతమంది కొన్ని యజ్ఞాలు చెయ్యకూడదు.

ఉదాహరణకు అశ్వమేధయాగాన్ని క్షత్రియులు తప్ప తక్కిన వర్ణాలవారు చెయ్యకూడదు. అలా కొన్ని యజ్ఞాలు నిషేధం ఉన్నప్పటికీ డబ్బు వస్తుందనే ఆశ కొద్దీ, కొందరు బ్రాహ్మణులు అర్హతలేని వారిచేత యజ్ఞాలను చేయిస్తారు. ఎందుకు డబ్బుమీద ఆశ? ప్రాణంమీద తీపి ఉంది కాబట్టి. ప్రాణం నిలబెట్టుకోవటానికి ఇలాంటి అక్రమాలను చేస్తారు. అంతేకాదు –

**అప్రతిగృహ్యస్య ప్రతిగృహ్ణాత్యపి** – స్వీకరించదగనివాని దగ్గరనుంచి డబ్బు తీసుకుంటారు.

బ్రాహ్మణునికి ఆరు ధర్మాలుంటాయి – పఠనం, పాఠనం – వేదాన్ని నేర్చుకోవాలి, నేర్పించాలి; యజనం, యాజనం – యజ్ఞం చెయ్యాలి, చేయించాలి; దానం, ప్రతిగ్రహణం – దానం ఇవ్వాలి, తీసుకోవాలి. కాని చేయించకూడని వారిచేత యజ్ఞాలు చేయించి, తీసుకోకూడని వారి దగ్గరనుంచి దానం తీసుకుంటారు కొందరు. అది పాపం. క్షత్రియులు విద్య బోధించకూడదు, యజ్ఞం చేయించకూడదు, దానం స్వీకరించకూడదు. సంధ్యావందనంలో ఒక ప్రాయశ్చిత్తమంత్రం ఉంటుంది. స్వీకరించకూడని వారినుంచి దానం స్వీకరిస్తే కలిగే పాపానికి ప్రాయశ్చిత్తంగా చెప్పే మంత్రం. కాని ఇదంతా ఎందుకు చేస్తారు? ప్రాణంకోసం.

**తత్ర వధాశంకం భవతి యాం దిశమేతి** – ఒకవైపు వెళితే వారికి ప్రాణాపాయం కలుగుతుందేమోననే శంక ఉన్నా కూడా, అటు వెళతారు.

**ప్రాణస్యైవ సమ్రాట్ కామాయ ప్రాణో వై సమ్రాట్ పరమం బ్రహ్మ** – ఇదంతా ప్రాణంకోసమే చేస్తాడు సామ్రాట్, ఎందుకంటే ప్రాణం అంటే ప్రియం కాబట్టి. ఓ సామ్రాట్, ప్రాణదేవతే పరబ్రహ్మ.

ఫలం తెలిసిందే. ప్రాణంమీద ఉపాసన చేసిన వ్యక్తి ఇక్కడుండగా పూర్ణాయుష్షుతో అందరి వరాలు పొంది, మరణించాక వాయుదేవతతో లయమవుతాడు.

## మంత్రం 4.1.4

**యదేవ తే కశ్చిదబ్రవీత్తచ్ఛృణవామేత్యబ్రవీన్మే బర్కుర్వార్ష్ణశ్చక్షుర్వై బ్రహ్మేతి యథా మాతృమాన్ పితృమానాచార్యవాన్ బ్రూయాత్తథా తద్వార్ష్ణో ఽబ్రవీచ్చక్షుర్వై బ్రహ్మేత్యపశ్యతో హి కిగ్ం స్యాదిత్యబ్రవీత్తు తే తస్యాయతనం ప్రతిష్ఠాం న మేఽబ్రవీదిత్యేకపాద్వా ఏతత్సమ్రాడితి స వై నో బ్రూహి యాజ్ఞవల్క్య చక్షురేవాయతనమాకాశః ప్రతిష్ఠా సత్యమిత్యేనదుపాసీత కా సత్యతా యాజ్ఞవల్క్య చక్షురేవ సమ్రాడితి హోవాచ చక్షుషా వై సమ్రాట్ పశ్యన్తమాహురద్రాక్షీరితి స ఆహాద్రాక్షమితి తత్సత్యం భవతి చక్షుర్వై సమ్రాట్ పరమం బ్రహ్మ నైనం చక్షుర్జహాతి సర్వాణ్యేనం భూతాన్యభిక్షరన్తి దేవో భూత్వా దేవానప్యేతి య ఏవం విద్వానేతదుపాస్తే । హస్త్యృషభగ్ం సహస్రం దదామీతి హోవాచ జనకో వైదేహస్స హోవాచ యాజ్ఞవల్క్యః పితా మేఽమన్యత నాననుశిష్య హరేతేతి ॥**

పట్టిక ప్రకారం ఈ మంత్రంలో బర్కుడు అనే ఆచార్యుడు, చక్షుర్దేవత గురించి చెప్పాడు. చక్షుర్దేవత ఆదిత్యుడు. కాని అది ఏకపాద బ్రహ్మ కాబట్టి, తక్కిన మూడు పాదాలూ యాజ్ఞవల్క్యుడు కలిపాడు. ఆయతనం–చక్షువు;

ప్రతిష్ఠ–ఆకాశం; రహస్యనామం లేదా ఉపనిషత్తు సత్యం. ఉపాసన చక్షురుపాసన. ఫలం ఇంతకు ముందు చూసినట్టే. జీవించి ఉండగా కంటి చూపు బాగుంటుంది. దేవతలందరూ ఈ ఉపాసకుడిని వరాలతో ముంచెత్తుతారు. మరణించాక ఆదిత్య దేవతతో ఐక్యమవుతాడు. జనకుడు దక్షిణ ఇస్తానంటాడు కాని యాజ్ఞవల్క్యుడు అప్పుడే తీసుకోడు. యాజ్ఞవల్క్యుడు చక్షువుని సత్యం అని ఎందుకన్నాడో మంత్రం మధ్య భాగంలో వివరించాడు. అది చూద్దాము.

**చక్షుషా వై సమ్రాట్ పశ్యంతమాహురద్రాక్షీరితి** – ఓ సామ్రాట్! కంటితో చూసేవానిని ఉద్దేశించి, నువ్వు చూశావా అని అడుగుతారు;

**స ఆహాద్రాక్షమితి** – నేను చూశాను అని అతను చెబుతాడు;

**తత్సత్యం భవతి** – అదే సత్యం అవుతుంది.

**చక్షుర్వై సమ్రాట్ పరమం బ్రహ్మ** – ఓ సామ్రాట్! చక్షుర్దేవతే పరబ్రహ్మ.

కంటితో చూసినదానికి అంత ప్రాముఖ్యత ఉంటుంది. ఎవరైనా విన్నా, అది పుకారు అవుతుందే కాని సత్యం అవదు. అందువల్లనే కోర్టులో సాక్ష్యానికి అంత విలువనిస్తారు. ఎవరైనా కళ్ళారా చూసానంటే, ఇక అది సత్యమే! దానికి తిరుగులేదు! 'సీయింగ్ ఈజ్ బిలీవింగ్'. చూస్తే నమ్మటమే! అందువల్ల కన్ను రహస్యనామం సత్యం.

## మంత్రం 4.1.5

**యదేవ తే కశ్చిదబ్రవీత్తచ్ఛృణవామేత్యబ్రవీన్మే గర్దభీవిపీతో భారద్వాజశ్శ్రోత్రం వై బ్రహ్మేతి యథా మాతృమాన్ పితృమానాచార్యవాన్ బ్రూయాత్తథా తద్భారద్వాజోఽబ్రవీచ్ఛ్రోత్రం వై బ్రహ్మేత్యశృణ్వతో హి కిగ్ంస్యాదిత్యబ్రవీత్తు తే తస్యాయతనం ప్రతిష్ఠాం న మే ఽబ్రవీదిత్యేకపాద్వా ఏతత్సమ్రాడితి స వై నో బ్రూహి యాజ్ఞవల్క్య శ్రోత్రమేవాఽఽయతనమాకాశః ప్రతిష్ఠాఽనన్త ఇత్యేనదుపాసీత కాఽనన్తతా యాజ్ఞవల్క్య దిశ ఏవ సమ్రాడితి హోవాచ తస్మాద్వై సమ్రాడపి యాం కాం చ దిశం గచ్ఛతి నైవాస్యా అన్తం గచ్ఛత్యనన్తా హి దిశో దిశో వై సమ్రాట్ శ్రోత్రగ్ం శ్రోత్రం వై సమ్రాట్ పరమం బ్రహ్మ నైనగ్ం శ్రోత్రం జహాతి సర్వాణ్యేనం భూతాన్యభిక్షరన్తి దేవో భూత్వా దేవానప్యేతి య ఏవం విద్వానేతదుపాస్తే । హస్త్యృషభగ్ం సహస్రం దదామీతి హోవాచ జనకో వైదేహస్స హోవాచ యాజ్ఞవల్క్యః పితా మేఽమన్యత నాననుశిష్య హరేతేతి ॥**

పట్టిక ప్రకారం ఈ మంత్రంలో భారద్వాజ ఋషి శ్రోత్రంయొక్క దేవత గురించి చెప్పాడు. ఆ దేవతల పేర్లు ఉపనిషత్తులో రావు, మనం కలుపుకోవాలి. చెవికి అధిష్ఠానదేవత దిగ్దేవత. కాని అది ఏకపాద బ్రహ్మ కాబట్టి, తక్కిన మూడూ యాజ్ఞవల్క్యుడు కలిపాడు. ఆయతనం–శ్రోత్రం; ప్రతిష్ఠ–ఆకాశం; ఉపనిషత్తు–అనంతం. ఉపాసన

అనంత ఉపాసన. శ్రోత్రం ఆధ్యాత్మికం, అధిష్ఠానదేవత అధిదైవం. అధిష్ఠానదేవత ఆయతనం ఆధ్యాత్మమైన శ్రోత్రేంద్రియంలో ఉంటుంది. అధిష్ఠానదేవతకు ఆధారం ఈశ్వరుడు.

ఫలం ఇంతకు ముందు చూసినట్టే చెవులు బాగా పనిచేస్తాయి. దేవతలందరూ ఈ ఉపాసకుడిని వరాలతో ముంచెత్తుతారు. మరణించాక దిగ్దేవతతో ఐక్యమవుతాడు. జనకుడు దక్షిణ ఇస్తానంటాడు కాని యాజ్యవల్క్యుడు అప్పుడే తీసుకోడు. యాజ్ఞవల్క్యుడు చెవులను ఆనందం అని ఎందుకన్నాడో, మంత్రం మధ్యభాగంలో వివరించాడు. అది చూద్దాము.

**సమ్రాడపి యాం కాం చ దిశం గచ్ఛతి నైవాస్యా అంతం గచ్ఛతి** – ఓ సామ్రాట్, ఎవరైనా ఏ దిక్కువైపు వెళ్ళినా, దాని అంతం చూడదు.

**అనంతా హి దిశో దిశో వై సమ్రాట్** – ఎందుకంటే, దిక్కులు అనంతం.

**శ్రోత్రగ్ం శ్రోత్రం వై సమ్రాట్ పరమం బ్రహ్మ** – ఓ సామ్రాట్, చెవియొక్క దేవత పరబ్రహ్మ.

## మంత్రం 4.1.6

**యదేవ తే కశ్చిదబ్రవీత్తచ్ఛృణవామేత్యబ్రవీన్మే సత్యకామో జాబాలో మనో వై బ్రహ్మేతి యథా మాతృమాన్ పితృమానాచార్యవాన్ బ్రూయాత్తథా తజ్జాబాలోఽబ్రవీన్మనో వై బ్రహ్మేత్యమనసో హి కిగ్ం స్యాదిత్యబ్రవీత్తు తే తస్యాయతనం ప్రతిష్ఠాం న మేఽబ్రవీదిత్యేకపాద్వా ఏతత్సమ్రాడితి స వై నో బ్రూహి యాజ్ఞవల్క్య మన ఏవాఽఽయతనమాకాశః ప్రతిష్ఠాఽఽనన్ద ఇత్యేనదుపాసీత కాఽఽనన్దతా యాజ్ఞవల్క్య మన ఏవ సమ్రాడితి హోవాచ మనసా వై సమ్రాట్ స్త్రియమభిహార్యతే తస్యాం ప్రతిరూపః పుత్రో జాయతే స ఆనన్దో మనో వై సమ్రాట్ పరమం బ్రహ్మ నైనం మనో జహాతి సర్వాణ్యేనం భూతాన్యభిక్షరన్తి దేవో భూత్వా దేవానప్యేతి య ఏవం విద్వానేతదుపాస్తే। హస్త్యృషభగ్ం సహస్రం దదామీతి హోవాచ జనకో వైదేహస్స హోవాచ యాజ్ఞవల్క్యః పితా మే ఽమన్యత నాననుశిష్య హరేతేతి ॥**

పట్టిక ప్రకారం ఈ మంత్రంలో సత్యకాముడు మనస్సుయొక్క దేవత గురించి చెప్పాడు. ఆ దేవతల పేర్లు ఉపనిషత్తులో రావు, మనం కలుపుకోవాలి. మనస్సుకు అధిష్ఠానదేవత చంద్రుడు. కాని అది ఏకపాద బ్రహ్మ కాబట్టి, తక్కిన మూడూ యాజ్ఞవల్క్యుడు కలిపాడు. ఆయతనం-మనస్సు; ప్రతిష్ఠ-ఆకాశం;, ఉపనిషత్తు-ఆనందం. ఉపాసన ఆనంద ఉపాసన. ఫలం ఇంతకు ముందు చూసినట్టే మనస్సు ఆనందంగా ఉంటుంది. మరణించాక చంద్రదేవతతో ఐక్యమవుతాడు. జనకుడు దక్షిణ ఇస్తానంటాడు కాని యాజ్ఞవల్క్యుడు అప్పుడే తీసుకోడు. యాజ్ఞవల్క్యుడు మనస్సును ఆనందం అని ఎందుకన్నాడో మంత్రం మధ్యభాగంలో వివరించాడు. అది చూద్దాము.

**మనసా వై సమ్రాట్ స్త్రియమభిహార్యతే** – ఓ సామ్రాట్, మనస్సుతోనే స్త్రీని కోరుకుంటాడు. మనస్సువల్లనే భార్య వైపు ఆకర్షితుడవుతాడు.

**తస్యాం ప్రతిరూపః పుత్రో జాయతే స ఆనందః** – ఆమెవల్ల తన పోలిక ఉన్న పుత్రుడు పుడతాడు. ఆ పుత్రుడే ఆనందం.

**మనో వై సమ్రాట్ పరమం బ్రహ్మ** – ఓ సామ్రాట్, మనోదేవతే పరబ్రహ్మ.

ఎవరికైనా ఆనందం మనస్సువల్లనే కలుగుతుంది. భార్య వైపు ఆకర్షణ మనస్సువల్లనే కలుగుతుంది. ఆమెవల్ల తన పోలిక వున్న పుత్రుడిని చూసుకుని ఇంకా మురిసిపోతాడు.

## మంత్రం 4.1.7

**యదేవ తే కశ్చిదబ్రవీత్తచ్ఛృణవామేత్యబ్రవీన్మే విదగ్ధశ్శాకల్యో హృదయం వై బ్రహ్మేతి యథా మాతృమాన్ పితృమానాచార్యవాన్ బ్రూయాత్తథా తచ్ఛాకల్యోఽబ్రవీద్ధృదయం వై బ్రహ్మేత్యహృదయస్య హి కిగ్ం స్యాదిత్యబ్రవీత్తు తే తస్యాయతనం ప్రతిష్ఠాం న మేఽబ్రవీదిత్యేకపాద్వా ఏతత్సమ్రాడితి స వై నో బ్రూహి యాజ్ఞవల్క్య హృదయమేవాఽఽయతనమాకాశః ప్రతిష్ఠా స్థితిరిత్యేనదుపాసీత కా స్థితతా యాజ్ఞవల్క్య హృదయమేవ సమ్రాడితి హోవాచ హృదయం వై సమ్రాట్ సర్వేషాం భూతానామాయతనగ్ం హృదయం వై సమ్రాట్ సర్వేషాం భూతానాం ప్రతిష్ఠా హృదయే హ్యేవ సమ్రాట్ సర్వాణి భూతాని ప్రతిష్ఠితాని భవన్తి హృదయం వై సమ్రాట్ పరమం బ్రహ్మ నైనగ్ం హృదయం జహాతి సర్వాణ్యేనం భూతాన్యభిక్షరన్తి దేవో భూత్వా దేవానప్యేతి య ఏవం విద్వానేతదుపాస్తే। హస్త్యృషభగ్ం సహస్రం దదామీతి హోవాచ జనకో వైదేహస్స హోవాచ యాజ్ఞవల్క్యః పితామేఽమన్యత నాననుశిష్య హరేతేతి ॥**

పట్టిక ప్రకారం ఈ మంత్రంలో శాకల్యుడు హృదయంయొక్క దేవత గురించి చెప్పాడు. మూడవ అధ్యాయంలో తల పోగొట్టుకున్న శాకల్యుడే ఇతను. అధిష్ఠానదేవత పేరు ఉపనిషత్తులో రాదు, మనం కలుపుకోవాలి. హృదయానికి అధిష్ఠానదేవత ప్రజాపతి. కాని అది ఏకపాద బ్రహ్మ కాబట్టి, తక్కిన మూడూ యాజ్ఞవల్క్యుడు కలిపాడు. ఆయతనం–హృదయం; ప్రతిష్ఠ–ఆకాశం; ఉపనిషత్తు–స్థితి.

ఇంతవరకూ ఒక్కొక్క అధిష్ఠానదేవతనే చూశాము. కాని ఇక్కడ అధిష్ఠానదేవత బ్రహ్మ లేదా హిరణ్యగర్భుడు. హిరణ్యగర్భుడు సకల అధిష్ఠానదేవతలకూ అధిష్ఠానదేవత. ఉపాసన ప్రజాపతి ఉపాసన. ఫలం ఇంతకు ముందు చూసినట్టే హృదయం ఆరోగ్యకరంగా ఉంటుంది. మరణించాక ప్రజాపతితో ఐక్యం పొందుతాడు. జనకుడు దక్షిణ ఇస్తానంటాడు కాని ఇప్పుడు కూడా యాజ్ఞవల్క్యుడు తీసుకోడు. ఏమిటా దక్షిణ? ఏనుగంత పెద్ద ఆంబోతును ప్రసవించగల శక్తి ఉన్న వెయ్యి ఆవులు. కాని యాజ్ఞవల్క్యుని దృష్టిలో బోధ ముగియలేదు. ఈ బ్రాహ్మణము ముగిసింది కాని, బోధ ముగియలేదు. తరువాత అధ్యాయాలలో ఇదే కొనసాగుతుంది. యాజ్ఞవల్క్యుడు హృదయాన్ని స్థితి అని ఎందుకన్నాడో మంత్రం మధ్యభాగంలో వివరించాడు. అది చూద్దాము. **హృదయం వై సమ్రాట్ సర్వేషాం భూతానామాయతనగ్ం** – ఓ సామ్రాట్, హృదయమే సకల ప్రాణులకు

ఆయతనం; **హృదయం వై సమ్రాట్ సర్వేషాం భూతానాం ప్రతిష్ఠా** – ఓ సామ్రాట్, హృదయమే సకల ప్రాణులకూ ప్రతిష్ఠ;

**హృదయే హ్యేవ సమ్రాట్ సర్వాణి భూతాని ప్రతిష్ఠితాని భవంతి** – ఓ సామ్రాట్, హృదయంలో మాత్రమే సకల ప్రాణులు ఆశ్రయం కలిగి ఉన్నాయి.

**హృదయం వై సమ్రాట్ పరమం బ్రహ్మ** – ఓ సామ్రాట్! హృదయమే అంటే ప్రజాపతి దేవతే పరబ్రహ్మ.

ఇప్పుడు రెండవ బ్రాహ్మణములోకి అడుగు పెడతాము. అందులో టూకీగా బ్రహ్మవిద్య గురించి వస్తుంది. ఇంతవరకూ అపరావిద్య గురించి వచ్చింది కాని పరావిద్య గురించి రాలేదు; సోపాధిక బ్రహ్మ గురించి వచ్చింది కాని నిరుపాధిక బ్రహ్మ గురించి రాలేదు.

# 4.2 - కూర్చ బ్రాహ్మణము

మళ్ళీ గురుశిష్యులను పరిచయం చేస్తున్నది ఉపనిషత్తు. దీనివల్ల రెండు విషయాలను గమనించాలని నేర్చుకున్నాము. అవి – బ్రహ్మవిద్యను గురువుద్వారానే నేర్చుకోవాలి, గురువుమీద శ్రద్ధ ఉండాలి. చతుష్పాద సగుణబ్రహ్మ గురించి బోధించాక యాజ్ఞవల్క్యుడు అప్పుడు వెళ్ళిపోయి, మళ్ళీ ఇంకో రోజు వచ్చినట్టుగా ఊహించుకోవాలి. జనకుడు ఎత్తైన సింహాసనంమీద కూర్చుని ఉన్నాడు. దాన్ని **కూర్చం** అంటారు. యాజ్ఞవల్క్యుడు రాగానే జనకుడు కూర్చంనుంచి దిగివచ్చాడు. జనకుడు **కూర్చం**నుంచి దిగివచ్చాడు కాబట్టి ఈ అధ్యాయము ఈ పదంతో మొదలవుతుంది కాబట్టి దీన్ని కూర్చ బ్రాహ్మణము అంటారు. ఒక బ్రాహ్మణానికి ఆ పేరు అందులో ఉండే ప్రత్యేకతవల్ల కాని, అందులో చెప్పే అంశంవల్ల కాని వస్తుంది. ఇక్కడ జనకుడు కూర్చంనుంచి దిగిరావటంవల్ల శిష్యుడు ఎంత చక్రవర్తి అయినా గురువుకు గౌరవం చూపాలని తెలుస్తున్నది.

మంత్రం 4.2.1

**జనకో హ వైదేహః కూర్చాదుపావసర్పన్నువాచ నమస్తేఽస్తు యాజ్ఞవల్క్యాను మా శాధీతి స హోవాచ యథా వై సమ్రాణ్మహాన్తమధ్వానమేష్యన్ రథం వా నావం వా సమాదదీతైవమేవైతాభి రుపనిషద్భిస్సమాహితాత్మాస్యేవం వృన్దారక ఆఢ్యస్సన్నధీతవేద ఉక్తోపనిషత్క ఇతో విముచ్యమానః క్వ గమిష్యసీతి నాహం తద్భగవన్ వేద యత్ర గమిష్యామీత్యథ వై తేఽహం తద్వక్ష్యామి యత్ర గమిష్యసీతి బ్రవీతు భగవానితి ॥**

**జనకో హ వైదేహః కూర్చాదుపావసర్పన్నువాచ** – విదేహరాజగు జనకుడు సింహాసనంనుంచి పైకి లేచినవాడై ఇలా అన్నాడు.

**నమస్తేఽస్తు యాజ్ఞవల్క్యాను మా శాధీతి** – ఓ యాజ్ఞవల్క్యా, మీకు నమస్కారం. నన్ను ఉద్దేశించి ఉపదేశించిండి.

**స హోవాచ యథా వై సమ్రాణ్మహాంతమధ్వానమేష్యన్ రథం వా నావం వా సమాదదీత** – ఓ సామ్రాట్, చాలా దూరం వెళ్ళబోయే వ్యక్తి రథాన్ని కాని, నావను కాని స్వీకరిస్తాడు.

**ఏవమేవైతాభిరుపనిషద్భిస్సమాహితాత్మాసి** – అదే విధంగా నువ్వు ఈ ప్రజ్ఞ, ఆనందంలాంటి ఉపనిషత్తుల ఉపాసనలతో ఏకాగ్ర చిత్తం కలవాడివి అయ్యావు.

**ఏవం వృందారకః ఆఢ్యః** – ఈ విధంగా పూజనీయుడవు, సమర్థుడవు అవుతున్నావు.

**అధీతవేద ఉక్తోపనిషత్క ఇతో విముచ్యమానః క్వ గమిష్యసీతి** – వేదాలను అధ్యయనం చేసిన నువ్వు ఆచార్యులనుంచి ఉపనిషత్తుల ఉపదేశాన్ని పొందివున్నావు. ఈ దేహంనుంచి విముక్తి పొంది నువ్వు ఎక్కడికి వెళతావు?

**నాహం తద్భగవన్ వేద యత్ర గమిష్యామీతి** – ఓ భగవాన్, నేనెక్కడికి వెళతానో నాకు తెలియదు.

**అథవై తేఽహం తద్వక్ష్యామి యత్ర గమిష్యసీతి** – అలాగైతే, నువ్వెక్కడికి వెళతావో నేను చెబుతాను.

**బ్రవీతు భగవానితి** – ఓ భగవాన్, మీరు చెప్పండి.

జనకుడు తనకు ఏదైనా బోధించమని అడిగితే, యాజ్ఞవల్క్యుడు ముందు అతన్ని ఒక ప్రశ్న అడిగాడు. ముందు బ్రాహ్మణములో అతను ఆరుగురు ఆచార్యుల దగ్గర ఆరు సగుణబ్రహ్మ ఉపాసనలు నేర్చుకున్నాడు కదా, ఆ ఉపాసన చేసినవారు ఎక్కడికెళతారో తెలుసా అని అడిగాడు. ఆ ప్రయాణాన్ని ఇక్కడి ప్రయాణంతో పోల్చాడు. ఇక్కడ ఎక్కడికన్నా వెళ్ళాలంటే రథంమీదో, నావమీదో వెళ్ళినట్టుగా, ఉపాసన అనే సాధనంతో నువ్వు ఎక్కడికి వెళతావు?

యాజ్ఞవల్క్యుడు ఆశించిన సమాధానం నిర్గుణబ్రహ్మ. ఎందుకంటే ఉపాసనలు చేస్తే అతను చిత్త ఏకాగ్రత పొంది, సాధనచతుష్టయసంపన్నుడు అయి, వైరాగ్యం పొంది, జ్ఞానయోగ్యత పొంది, గురువును పొంది, గురువుద్వారా నిర్గుణ బ్రహ్మజ్ఞానం పొందుతాడు. అదీ ఒక సాధకుని మార్గం.

కాని జనకుడు సమాధానం చెప్పలేకపోయాడు. జనకుడు ఆచార్యులు చెప్పిన ఉపనిషత్తుల ఉపాసనలు చేసే ఉంటాడు. ఉపనిషత్తు అంటే ఇక్కడ రహస్యనామం అనీ, ఒక్కొక్క అంగానికీ ఒక్కొక్క రహస్యనామం ఉందనీ చూశాము. జనకుడు మామూలు మనిషి కాదు పూజనీయుడు, సమర్థుడు. అతనికి లౌకిక సంపద, ఆధ్యాత్మిక సంపద కూడా సమృద్ధిగా ఉంది. చక్రవర్తికి కొరత ఏం ఉంటుంది? కాని కేవలం సంపద ఉంటే పూజనీయుడు అవాలని లేదు. క్షత్రియుడు అయినా కూడా అతను వేదాధ్యయనం చేశాడు. కేవలం వేదాధ్యయనం చేస్తే చాలదు, అనుష్ఠానం కూడా చెయ్యాలి. అంటే నేర్చుకున్నది ఆచరించాలి. అందువల్ల జనకుడు తను నేర్చుకున్న ఉపాసనలు చేసి ఉంటాడని యాజ్ఞవల్క్యుడు భావిస్తాడు. అలా ఉపాసన చేసిన వ్యక్తి పరిస్థితి ఏమిటి?

అలా ఉపాసన చేసిన వ్యక్తి ఈ జన్మలోనే వేదాంతానికి వచ్చి, గురువుద్వారా జ్ఞానబోధను పొంది, ఇక్కడే ఇప్పుడే జీవన్ముక్తి పొందవచ్చు. ఒకవేళ వేదాంతానికి రాకపోతే, అంటే ఉపాసకునిగానే మరణిస్తే అతను జీవన్ముక్తి పొందడు కాని, తను చేసిన ఉపాసనవల్ల వచ్చిన పుణ్యమనే రథం ఎక్కి బ్రహ్మలోకానికి వెళతాడు. అక్కడ బ్రహ్మ దగ్గర బ్రహ్మజ్ఞానం పొంది, అక్కడ ముక్తి పొందుతాడు. దీన్ని క్రమముక్తి అంటారు. ఈ జవాబు జనకుడికి తెలిసినా చెప్పలేదు. 'నాకు తెలియదు భగవాన్, మీరు చెప్పండి' అన్నాడు. ఈ మంత్రం గురువుయొక్క ప్రాముఖ్యతను, గురుభక్తిని సూచిస్తున్నది.

### మంత్రం 4.2.2

**ఇన్ధో హ వై నామైష యోఽయం దక్షిణేఽక్షన్ పురుషస్తం వా ఏతమిన్ధగ్ం సన్తమిన్ద్ర ఇత్యాచక్షతే పరోక్షేణైవ పరోక్షప్రియా ఇవ హి దేవాః ప్రత్యక్షద్విషః ॥**

ఈ మంత్రంనుంచి బోధ మొదలవుతుంది. సాధనచతుష్టయసంపత్తి పొందిన సగుణబ్రహ్మ సాధకుడు చేరాల్సిన అంతిమగమ్యం నిర్గుణబ్రహ్మ. నిర్గుణబ్రహ్మను సగుణబ్రహ్మద్వారా పొందుతాడు. అంటే సగుణబ్రహ్మ దశలద్వారా నిర్గుణబ్రహ్మను చేరుతాడు. సాధకుని వీలుకోసం, సగుణబ్రహ్మ మూడు దశలుగా విభజించబడింది.

అవి స్థూల సగుణబ్రహ్మ, సూక్ష్మ సగుణబ్రహ్మ, కారణ సగుణబ్రహ్మ. ఇంకో విధంగా చెప్పాలంటే స్థూల సోపాధిక బ్రహ్మ, సూక్ష్మ సోపాధిక బ్రహ్మ, కారణ సోపాధిక బ్రహ్మ. అంటే సవిశేష బ్రహ్మద్వారా నిర్విశేషబ్రహ్మకు రావాలి.

మూడు సగుణబ్రహ్మలు మూడు అవస్థలతో పెనవేసుకుని ఉన్నాయి. స్థూల సగుణబ్రహ్మ జాగ్రదావస్థతోనూ, సూక్ష్మ సగుణబ్రహ్మ స్వప్నావస్థతోనూ, కారణ సగుణబ్రహ్మ సుషుప్తి అవస్థతోనూ ఉంటే, నిర్గుణబ్రహ్మ మూడు అవస్థల్లోనూ ఉంది. బ్రహ్మను నాలుగు పాదాలుగా నేర్చుకుంటాము కాబట్టి చతుష్పాదబ్రహ్మ అంటారు. ఈ చతుష్పాదబ్రహ్మను అవస్థాత్రయ విచారణద్వారా నేర్చుకుంటాము. ఇక్కడ ఈ విచారణ వివరంగా జరగదు, కేవలం ఒక విహంగవీక్షణ చూస్తాము అంతే. దీనినే మళ్ళీ వివరంగా తర్వాత వచ్చే బ్రాహ్మణములో చూస్తాము.

స్థూల, సూక్ష్మ, కారణశరీరాల్లో చైతన్యం ప్రతిబింబ చైతన్యాలద్వారా వ్యవహారం నడుపుతుందనీ ఆ ప్రతిబింబచైతన్యాలను వరుసగా విశ్వ, తైజస, ప్రాజ్ఞ అని అంటారనీ, నిర్గుణచైతన్యాన్ని తురీయం అంటారనీ చూశాము. విశ్వ, తైజస, ప్రాజ్ఞలకు ఇంకో పేర్లు జాగ్రద్ పురుషుడు, స్వప్నపురుషుడు, సుప్తపురుషుడు. ముందు చైతన్యాన్ని ఈ విశేషణాలతో అంటే జాగ్రద్ పురుషుడు, స్వప్నపురుషుడు, సుప్తపురుషులుగా తెలుసుకుని, తర్వాత ఈ విశేషణాలను వదిలివేసి నిర్గుణపరబ్రహ్మను తెలుసుకోవాలి. దేశ, కాల, వస్తుపరిచ్ఛేదాలు లేని నిర్గుణబ్రహ్మను అర్థం చేసుకోవాలి. ఇదీ టూకీగా మనం చూడబోయే వేదాంతబోధ పద్ధతి.

1. **ప్రథమ పాదం** – ముందు మనం జాగ్రద్ పురుషుడిని చూడబోతున్నాము. ఈ జాగ్రద్ పురుషుడిని ఈ మంత్రంలోనూ, మూడవ మంత్రంలో మొదటి వాక్యంలోనూ చూస్తాము. ఎప్పుడైతే చైతన్యం ఒక అవస్థతో కలిసివుందో, అప్పుడే నిర్గుణచైతన్యం సాపేక్షిక చైతన్యం అవుతుంది. చైతన్యం విడిగా చూస్తే అనంతం కాని ఎప్పుడైతే ఒక అవస్థతో అనుబంధం ఏర్పడుతుందో అప్పుడే శాశ్వతమైన చైతన్యం సాపేక్షిక చైతన్యం అవుతుంది.

సాపేక్షిక చైతన్యం అంటే ఏమిటి? చైతన్యం జాగ్రద్ పురుషునిగా ఎప్పుడూ ఉండదు. జాగ్రద్ పురుషుడు తనకు ఇష్టం ఉన్నా లేకపోయినా కూడా జాగ్రద్ ప్రపంచంతో ముడిపడివుంటాడు. అతను జాగ్రద్ ప్రపంచాన్ని అనుభవించే భోక్త అవుతాడు, ప్రపంచం అనుభవించబడే భోగ్యం అవుతుంది. ఇవి రెండూ ఒకదానితో ఒకటి ఎంతగా ముడిపడి ఉంటాయంటే, ఒకటి లేకపోతే ఇంకొక దానికి ఉనికి లేదు. స్థూలప్రపంచాన్ని తీసేస్తే అతను స్వప్నపురుషుడో, సుప్తపురుషుడో అవుతాడు కాని జాగ్రద్ పురుషుడుగా ఉండలేడు. అలాగే జాగ్రద్ పురుషుడు లేనిదే జాగ్రద్ ప్రపంచానికి ఉనికి లేదు.

జాగ్రద్ పురుషుడు లేనిదే జాగ్రద్ ప్రపంచం లేదు, జాగ్రద్ ప్రపంచం లేనిదే జాగ్రద్ పురుషుడు లేడు. అందువల్ల ఈ రెండూ ఒక జంట. దీన్ని **మిథునం** అంటారు. తక్కిన రెండు పాదాలు కూడా అలాగే జంటలు. స్వప్నపురుషుడు, స్వప్నప్రపంచం ఒక జంట. సుప్తపురుషుడు, కారణప్రపంచం ఇంకో జంట. కాకపోతే అది అవ్యక్తంగా ఉంటుంది. ఎలాగైతే వ్యష్టిపరంగా విశ్వ, తైజస, ప్రాజ్ఞలను ప్రతిబింబ చైతన్యాలుగా చూశామో, అలాగే సమష్టిపరంగా విరాట్, హిరణ్యగర్భ, ఈశ్వరుడు ప్రతిబింబ చైతన్యాలు. అంటే విశ్వ–విరాట్ ఒక జంట; తైజస–హిరణ్యగర్భ ఒక జంట; ప్రాజ్ఞ–ఈశ్వర ఒక జంట. తురీయానికి జంట లేదు. తురీయప్రపంచం ఉంది అనకూడదు.

ప్రథమ పాదంలో జంటకు నాలుగు పేర్లు ఇవ్వబడ్డాయి. ఇవి భోక్త-భోగ్యం; విశ్వ-విరాట్; ఇంద్ర-ఇంద్రాణి; దక్షిణాక్షి పురుషుడు-వామాక్షి పురుషుడు. ఇందులో కొన్ని పేర్లు మంత్రంలో వచ్చాయి. ఈ జంటకు ఈ పేర్లు ఎందుకు వచ్చాయో చూద్దాము.

ఎ) **భోక్త-భోగ్యం:** భోక్త అంటే జాగ్రద్ పురుషుడు. ప్రపంచాన్ని అనుభవించేవాడు. భోగ్యం అంటే జాగ్రద్ ప్రపంచం. జాగ్రద్ పురుషునిచేత అనుభవించబడేది.

బి) **విశ్వ-విరాట్:** జాగ్రద్ అవస్థలోనే చైతన్యం మూడు అంశాలను ఉపయోగిస్తుంది. ఉదాహరణకు ఒక పురుషుడు మూడు వస్త్రాలను తొడుక్కుంటాడు. బనియను, షర్టు, కోటు. అలా జాగ్రద్ పురుషుడు పూర్తిగా అంగాలన్నిటినీ వాడతాడు. విశ్వ అంటే పూర్తిగా వికసించిన అని అర్థం. వ్యష్టిపరంగా అతను శరీరం, మనస్సు, ఇంద్రియాలు అనే మూడింటినీ ఉపయోగిస్తాడు.

విరాట్ అంటే సమష్టి స్థూల ప్రపంచ ప్రతిబింబచైతన్యం. వివిధం రాజతే ఇతి విరాట్. అనేక నామరూపాలతో ప్రకటితమవుతుంది.

సి) **ఇంద్ర-ఇంద్రాణి:** అసలు పేరు ఇంధుడే అయినా అది ఇంద్రుడుగా మారింది. ఇంధుడు అంటే ప్రకాశించువాడు అని అర్థం. జాగ్రద్ పురుషుడిని ప్రకాశించువాడు అని అంటున్నారు. ఎందుకు? ఎందుకంటే అతను జాగ్రద్ ప్రపంచాన్ని ప్రకాశింపజేస్తాడు, తెలుసుకుంటాడు. ఇంధుడిని ఇంద్రుడు అని ఎందుకంటారు? ఉపనిషత్తే జవాబు చెబుతున్నది. దేవతలకు వారిని వారి పేరుతో పిలవటం ఇష్టం ఉండదుట. ఇంద్రస్య పత్నీ ఇంద్రాణి. అంటే ఇంద్రుని భార్య ఇంద్రాణి.

డి) **దక్షిణాక్షి పురుషుడు-వామాక్షి పురుషుడు:** జాగ్రద్ పురుషుడిని ఎందుకు దక్షిణాక్షి పురుషుడు అని పిలుస్తారు? మనం వాడే అనేక అంగాలన్నింటిలోనూ అత్యంత ముఖ్యమైనది, శక్తివంతమైనది కన్ను మాత్రమే! ఇంకొక కారణం, మనం పొందే జ్ఞానంలో 90 శాతం జ్ఞానాన్ని కంటితోనే పొందుతాము. అందువల్ల జాగ్రద్ పురుషుడిని కంటి ద్వారా సూచిస్తారు. బాగానే వుంది కాని కుడికన్ను ఎందుకు? ఎందుకంటే కుడి భాగం ఎడమభాగం కన్నా శక్తివంతమైనది. కుడికన్నును దక్షిణ అక్షి అంటారు. అందువల్ల జాగ్రద్ పురుషుడు దక్షిణాక్షి పురుషుడు అయ్యాడు. ఇంద్రుడు దక్షిణాక్షి పురుషుడయితే, ఇంద్రాణి వామాక్షి పురుషుడు అవుతుంది.

ఇప్పుడు మంత్రాన్ని చూద్దాము.

**ఇంధోహ వై నామ** – జాగ్రదావస్థలో ఉన్న చైతన్యాన్ని ఇంధుడు అంటారు. ఎక్కడ ఉన్నాడు?

**యోఽయం దక్షిణేఽక్షన్ పురుషః** – కుడికన్నులో ఉన్న జాగ్రద్ పురుషుడు.

**తం వా ఏతమింధగ్ం సంతమింద్ర ఇత్యాచక్షతే** – ఈ పురుషుడు ఇంధుడే అయినా, పరోక్షంగా ఇంద్రుడు అంటారు. ఎందుకు?

**పరోక్షేణైవ పరోక్షప్రియా ఇవ హి దేవాః** – ఎందుకంటే, దేవతలు పరోక్షంగా చెప్పబడటం ఇష్టపడతారు.

**ప్రత్యక్షద్విషః** – ప్రత్యక్ష నామాన్ని వారు ద్వేషిస్తారు.

మంత్రం 4.2.3

**అథైతద్వామేఽ క్షణి పురుషరూపమేషాఽ స్య పత్నీ విరాట్ తయోరేష సగ్ంస్తావో య ఏషోఽ న్తర్హృదయ ఆకాశోఽ థైనయోరేతదన్నం య ఏషోఽ న్తర్హృదయే లోహితపిణ్డోఽ థైతయోరే తత్ప్రావరణం యదేతదన్తర్హృదయే జాలకమివాథైనయోరేషా సృతిస్సఞ్చరణీ యైషా హృదయాదూర్ధ్వా నాడ్యుచ్చరతి యథా కేశస్సహస్రధా భిన్న ఏవమస్యైతా హితా నామనాడ్యోఽ న్తర్హృదయే ప్రతిష్ఠితా భవన్త్యేతాభిర్వా ఏతదాస్రవదాస్రవతి తస్మాదేష ప్రవివిక్తాహారతర ఇవైవ భవత్యస్మాచ్ఛరీరాదాత్మనః॥**

ఈ మంత్రంలో మొదటి వాక్యంలో ఈ వర్ణన కొనసాగుతుందని చూశాము. ఇంద్ర–ఇంద్రాణులను చూస్తాము ఇందులో.

**అథైతద్వామేఽ క్షణి పురుషరూపమేషాఽ స్య పత్నీ విరాట్** – వామ అక్షిణి అంటే ఎడమకన్ను. ఎడమకంటిలో ఉన్నది ఇంద్రుని పత్ని అయిన ఇంద్రాణి. ఇంద్రాణి ఎవరు? ఇంద్రాణిని ఉపనిషత్తు విరాట్ లేదా భోగ్యప్రపంచం అంటున్నది. విరాట్ అంటే భోగ్యప్రపంచం, ఇంద్రాణి, ఎడమకన్ను. అలాగే విశ్వ అంటే భోక్త, ఇంద్రుడు, కుడికన్ను. ఈ జంటను నాలుగు పేర్లతో చూశాము. భోక్త–భోగ్యం; విశ్వ–విరాట్; ఇంద్ర–ఇంద్రాణి; దక్షిణాక్షి పురుషుడు–వామాక్షి పురుషుడు. దీనితో ప్రథమపాదం అయింది.

2. **ద్వితీయ పాదం** – ఇక్కడ కూడా జంట ఉంది. కొన్ని పేర్లు అవే వస్తాయి. అవి భోక్త–భోగ్యం; ఇంద్ర–ఇంద్రాణి. కాని విశ్వ–విరాట్ బదులు తైజస–హిరణ్యగర్భ పేర్లు వస్తాయి. విశ్వ–విరాట్ పేర్లు స్థూలశరీరానికీ, స్థూలప్రపంచానికీ చెందితే, తైజస–హిరణ్యగర్భ పేర్లు సూక్ష్మశరీరానికీ, సూక్ష్మప్రపంచానికీ చెందుతాయి. అక్కడ విశ్వ, విరాట్‌లకు కుడికన్ను, ఎడమకన్ను పదాలు వాడాము. ఇక్కడ తైజస–హిరణ్యగర్భుల స్థానం మారుతుంది. అవి ఎక్కడ ఉన్నాయి? ఇక్కడ ద్వితీయపాదం గురించి ఉపనిషత్తు నాలుగు అంశాలను వివరిస్తుంది. అవి – సంస్తవం, అన్నం, వస్త్రం, మార్గం.

ఎ) **సంస్తావం:** సంస్తావం అంటే సంగమ స్థానం. ఇంద్ర–ఇంద్రాణిల జంట ఉండే స్థానం ఏమిటి? హృదయాకాశం.

**తయోరేష సగ్ంస్తావో య ఏషోఽ ంతర్హృదయ ఆకాశః** – హృదయం లోపల ఉన్న ఆకాశం వీరిద్దరూ కలిసే చోటు.

బి) **అన్నం:** వీరికి అన్నం లోహిత పిండం అంటున్నది ఉపనిషత్తు. మనం తిన్న అన్నం మూడు భాగాలుగా విభజించబడుతుందని ఛాందోగ్యోపనిషత్తులో చూశాము. అవి స్థూల అంశం, సూక్ష్మ అంశం, సూక్ష్మతర అంశం. స్థూల అంశం మలం రూపంలో వృథాగా పోతుంది. సూక్ష్మ అంశం శరీరానికి తోడ్పడుతుంది. దాన్నే ఇప్పటి పరిభాషలో కొవ్వు పదార్థాలు అంటారు. సూక్ష్మతర అంశం సూక్ష్మశరీర పోషణకు ముఖ్యంగా మనస్సు పోషణకు వెళుతుంది.

ఇక్కడ ఈ రెండో పాదంలో మనం సూక్ష్మశరీరం గురించి మాట్లాడుతున్నాము. దానికి అన్నం ఏమై ఉండాలి? సూక్ష్మతర అంశమై ఉండాలి. దాన్ని లోహిత పిండం అంటున్నది ఉపనిషత్తు.

**అథైనయోరేతదన్నం య ఏషోஉన్తర్హృదయే లోహితపిండః** – హృదయం లోపల ఉండే ఎర్రని పిండం. వీరిద్దరికీ అన్నం.

సి) **వస్త్రం:** వారు కప్పుకునే వస్త్రం ఏమిటి? హృదయం. హృదయంలో ఉండే ఇంద్ర, ఇంద్రాణులకు వస్త్రం హృదయమే. గాలి ఆడాలి కాబట్టి జాలకంలాగా ఉంటుందిట హృదయం. జాలకం అంటే వల.

**అథైతయోరే తత్ప్రావరణం యదేతదంతర్హృదయే జాలకమివ** – హృదయంలో ఉన్న వీరిరువురికి వలలాగా ఉన్న హృదయం వస్త్రం అవుతుంది. వస్త్రాన్ని ఉపనిషత్తు **ప్రావరణం** అంటున్నది. హృదయంలోంచి అనేక నాడులు వస్తాయి. అందువల్ల అది ఒక వలలాగా ఉంటుంది.

డి) **మార్గం:** ఇంద్ర–ఇంద్రాణీలు ఒకేచోట ఉండలేరు కదా. వారు తిరగటానికి మార్గం కావాలి. హితానాడులద్వారా తిరుగుతారు. ఆ మార్గం ఎంత పెద్దది? ఒక వెంట్రుకను తీసుకుని నిలువుగా వెయ్యిముక్కలుగా కత్తిరిస్తే ఎంత మార్గం ఉంటుందో, అంత మార్గంలో వీరిరువురూ జంటగా షికార్లు కొడతారు.

**అథైనయోరేషా సృతిస్సంచరణీ యోషా హృదయాదూర్ధ్వా నాడ్యుచ్చరతి** – హృదయంనుంచి పైకి ప్రసరించే నాడి, వీరిరువుకీ సంచారం చేసే ద్వారం.

**యథా కేశస్సహస్రధా భిన్న ఏవమస్యైతా హితా నామనాడ్యోஉన్తర్హృదయే ప్రతిష్ఠితా భవంతి** – వేయి చీలికలు చెయ్యబడిన వెంట్రుకలాంటి హితా నాడులు హృదయం లోపల ఉన్నాయి.

**ఏతాభిర్వా ఏతదాస్రవదాస్రవతి** – వీటిద్వారా అన్నరసం శరీరానికి సరఫరా అవుతున్నది.

**తస్మాదేష ప్రవివిక్తాహారతర ఇవైవ భవత్యస్మాచ్ఛరీరాదాత్మనః** – ప్రవివిక్తాహారతర అంటే సూక్ష్మతరమైన ఆహారం; శరీరాత్మనః అంటే స్థూలశరీరం. అంటే స్థూలశరీరం తీసుకునే ఆహారంకన్నా సూక్ష్మశరీరం తీసుకునే ఆహారం సూక్ష్మతరంగా ఉంటుంది. ఛాందోగ్యోపనిషత్తులోంచి ఈ విషయం ముందే చూశాము. మనం తిన్నదానిలో సూక్ష్మమైన ఆహారం స్థూలశరీరానికి వెళితే, సూక్ష్మతరమైన ఆహారం సూక్ష్మశరీరానికి వెళుతుంది. దీనితో రెండవ పాదం ముగిసింది.

## మంత్రం 4.2.4

**తస్య ప్రాచీ దిక్ప్రాఞ్చః ప్రాణా దక్షిణా దిగ్దక్షిణే ప్రాణాః ప్రతీచీ దిక్ప్రత్యఞ్చః ప్రాణా ఉదీచీ దిగుదఞ్చః ప్రాణా ఊర్ధ్వా దిగూర్ధ్వాః ప్రాణా అవాచీ దిగవాఞ్చః ప్రాణాస్సర్వా దిశస్సర్వే ప్రాణాస్స ఏష నేతి నేత్యాత్మాஉగృహ్యో న హి గృహ్యతేஉశీర్యో న హి శీర్యతేஉసఙ్గో న హి సజ్యతేஉసితో న వ్యథతే న రిష్యత్యభయం వై జనక ప్రాప్తోஉసీతి హోవాచ యాజ్ఞవల్క్యః । స హోవాచ జనకో వైదేహోஉభయం త్వా గచ్ఛతాద్యాజ్ఞవల్క్య యో నో భగవన్నభయం వేదయసే నమస్తేஉస్త్విమే విదేహా అయమహమస్మి ॥**

3. **తృతీయ పాదం** – ఇప్పుడు మూడవ జంట. ఇంద్ర–ఇంద్రాణీలు కారణ అవస్థకు వస్తారు. ఇక్కడ భేదాలు లేవు. సబ్జెక్టు–ఆబ్జెక్టు విభజన లేదు అనకూడదు, అవ్యక్తంగా ఉంది. ఈ విభజన జాగ్రదావస్థలో స్పష్టంగా ఉంటుంది, స్వప్నావస్థలో కొంచెంగా తెలుస్తుంది; సుషుప్తి అవస్థలో తెలియదు అంటే అవ్యక్తంగా ఉంటుంది. అంటే భోక్త–భోగ్యం భేదం తెలియదు. వ్యష్టిపరంగా ప్రాజ్ఞ, సమష్టిపరంగా ఈశ్వరుడు ఇక్కడి జంట. వారి మధ్య భేదం ప్రకటితమవదు. అదీ ఇక్కడ ప్రత్యేకత.

**తస్య ప్రాచీ దిక్ప్రాంచః ప్రాణాః** – తూర్పు దిక్కున ఉన్న ప్రాణాలు తూర్పు దిక్కులో ఐక్యం అవుతాయి;

**దక్షిణా దిగ్దక్షిణే ప్రాణాః** – దక్షిణ దిక్కు వైపు ఉన్న ప్రాణాలు దక్షిణ దిక్కుతో;

**ప్రతీచీ దిక్ప్రత్యంచః ప్రాణాః** – పడమర వైపు ఉన్న ప్రాణాలు పడమర దిక్కుతో;

**ఉదీచీ దిగుదంచః ప్రాణాః** – ఉత్తరం వైపు ఉన్న ప్రాణాలు ఉత్తర దిక్కుతో;

**ఊర్ధ్వా దిగూర్ధ్వాః ప్రాణాః** – పై దిక్కు వైపున్న ప్రాణాలు పైన;

**అవాచీ దిగవాంచః ప్రాణాః**– కిందవైపున్న ప్రాణాలు కింద వైపు;

**సర్వా దిశస్సర్వే ప్రాణాః**– ఆ విధంగా అన్ని దిక్కుల్లో ఉన్న ప్రాణాలు అన్ని దిక్కుల్లో కలిసిపోతాయి. అంటే వ్యష్టి, సమష్టి ఐక్యమైపోతాయి. ప్రాజ్ఞకూ, ఈశ్వరునికీ మధ్య భేదం లేదు. ఈ జాగ్రదావస్థలో కనపడే భేదాలు ఇక్కడ కనపడవు. దీన్ని నిర్వికల్పస్థితి అంటారు. ఈ శూన్యస్థితిని అవిద్య లేదా అజ్ఞానం అంటారు.

ఇంద్ర–ఇంద్రాణీ; భోక్త–భోగ్యం; ప్రాజ్ఞ–ఈశ్వరుడు అవ్యక్తంలో ఉన్నారు. దీనితో మూడవ పాదం అయిపోయింది.

4. **చతుష్పాదం** – స ఏష నేతి నేతినుంచి నాలుగవపాదం మొదలవుతుంది. దీన్ని మూడవ అధ్యాయము, తొమ్మిదవ బ్రాహ్మణము, ఇరవయ్యారవ మంత్రం (3.9.26)లో చూశాము. ఇది తురీయం గురించిన వర్ణన.

తురీయంలో ఇంద్ర–ఇంద్రాణీలు లేరు; భోక్త–భోగ్యం లేరు; వ్యష్టి–సమష్టి లేరు; కేవలం శుద్ధచైతన్యం మాత్రమే ఉంటుంది. శుద్ధచైతన్యం, ఆత్మ, బ్రహ్మ – ఏదైనా ఒకటే. ఆత్మను సానుకూల పదాలతో చెప్పలేము కాబట్టి ఉపనిషత్తు నేతి–నేతి పద్ధతిని ఎన్నుకుంది. ఈ నేతి–నేతి పద్ధతిని ప్రత్యేకించి బృహదారణ్యకోపనిషత్తులో రెండు, మూడుసార్లు చూస్తాము. నేతి నేతి అంటే న ఇతి న ఇతి – అంటే ఇది కాదు, ఇది కాదు.

**ఎవర్ ది ఎక్స్‌పీరియెన్సర్ నెవ్వర్ ది ఎక్స్‌పీరియెన్సడ్**
**అనుభవించే నేనే అది ఎప్పటికీ, అనుభవించబడే వస్తువు కాదు ఎన్నటికీ**

తృతీయ పాదానికీ, చతుష్పాదానికీ మధ్య ఉన్న భేదం ఏమిటి? తృతీయ పాదం అయిన సుషుప్తిలో కూడా ద్వైతం ఉండదు. తురీయంలోనూ ద్వైతం ఉండదు. తృతీయ పాదంలో ద్వైతం కనపడదు; అది లేదు అనటానికి లేదు; అది అవ్యక్తంగా ఉంటుంది. అది మోక్షాన్ని ఇవ్వదు, ఎందుకంటే ద్వైతం అవ్యక్తంగా ఉంటుంది కాబట్టి. అందువల్లనే సమాధి అవస్థకు మనం ప్రాముఖ్యతనివ్వము. యోగశాస్త్రం సమాధి అవస్థ గురించి చాలా చెపుతుంది కాని, అద్వైతంలో సమాధి స్థితిని అంతగా పట్టించుకోము. ఎందుకంటే సాధకుడు సమాధిలో

ఉన్నంతసేపే అద్వైతంలో ఉంటాడు; దాన్నించి బయటకు రాగానే ద్వైతం వస్తుంది; వ్యవహారం వస్తుంది; దానితోపాటు సంసారం కూడా వస్తుంది. తురీయంలో ద్వైతం అవ్యక్తంలో కూడా లేదు. తురీయంలో అసలు ద్వైతం ఉండదు.

అందువల్ల తురీయాన్ని జ్ఞానిగా అర్థం చేసుకోవచ్చు. ఎందుకంటే అతను ద్వైతంతో ఎన్నటికీ మమేకం చెందదు. ద్వైతం అవ్యక్తంలో ఉన్నా, వ్యక్తంలో ఉన్నా అతనికి ఏమీ మార్పు కనిపించదు. ద్వైతంలో ఉంటే వ్యక్తంగా ఉన్నప్పుడు నేను విశ్వ లేదా తైజస అవుతాను; అవ్యక్తంలో ప్రాజ్ఞ అవుతాను; కాని అద్వైతంలో ఉంటే మూడు అవస్థల్లోనూ నేను అద్వైత ఆత్మనే. అందువల్ల తురీయం అంటే నాలుగవ అవస్థ కాదు, తురీయం అంటే నా స్వరూపాన్ని నేను సరిగ్గా అర్థం చేసుకోవటం. అందువల్ల తురీయం పదానికి **అసంగః** వేశాడు యాజ్ఞవల్క్యుడు. నేను అసంగం అయితే, నేను దేన్నీ వదులుకోనవసరం లేదు, అసంగత్వం నా స్వరూపం కాబట్టి, నేను ద్వైతంనుంచి విముక్తి పొందాను, అందువల్ల ద్వైతం కలుగజేసే దుఃఖాన్నించి విముక్తి పొందాను అని అర్థం చేసుకోవాలి.

దీనితో చతుష్పాద ఆత్మ వర్ణన అయిపోయింది.

**అభయం వై జనక ప్రాప్తోఽసీతి హోవాచ యాజ్ఞవల్క్య** – యాజ్ఞవల్క్యుడు ఓ జనకా, నువ్వు నిశ్చయంగా అభయం పొందావు అన్నాడు. అభయం పదానికి రెండు అర్థాలు చెప్పవచ్చు. ఒకటి మోక్షం పొందావు. మోక్షాన్ని భయం లేకపోవటం అంటే అభయం అంటారు. ఇంకొక అర్థం బ్రహ్మను పొందావు. నువ్వు బ్రహ్మను పొందావు కాబట్టి సంసారంనుంచి విముక్తి పొందావు.

ఆదిశంకరులవారు ఈ వాక్యాన్ని తరచు ఉటంకిస్తుంటారు. దీనిద్వారా జ్ఞానం పొందాక, ఏమీ కర్మ చెయ్యనవసరం లేదని అర్థమవుతున్నది. ఒకవేళ ఏదైనా కర్మ చెయ్యాల్సివుంటే యాజ్ఞవల్క్యుడు ఆ విషయం చెప్పి ఉండేవాడు. అభయం ప్రాప్తి అనేశాడు. అంటే అతను అద్వైత ఆత్మను అనే జ్ఞానం పొందితే చాలు, మోక్షం పొందుతాడు. అంటే అర్థం చేసుకోవటంలో చిన్న మార్పు చేసుకోవాలి. ఇన్నాళ్ళూ తను అర్థం చేసుకున్నాననుకున్నది తప్పుడు అర్థం అని అర్థం చేసుకోవాలి. నేను అసంగం అని చెప్పి, నా భార్యతోనే నాకు తంటా అనకూడదు. అసంగం అయితే భార్య ఉండదు. మిథునం మొదటి మూడు అవస్థలకే చూశాము; విశ్వ, తైజస, ప్రాజ్ఞలకు మాత్రమే సంసారం ఉంటుంది, తురీయానికి ఉండదు. నేను తురీయం అని అర్థం చేసుకుంటే **అహం ముక్తః అస్మి** అని చెప్పగలుగుతాను.

**జ్ఞానాత్ ఏవ కైవల్యమ్.**

బ్రహ్మ ఎప్పుడు అవుతావు? ప్రాప్తః అసి – ఇప్పుడే అయ్యావు. వర్తమానం కాలంలో ఉంది **అసి** పదం. జనకుని జవాబు ఏమిటి?

**స హోవాచ జనకో వైదేహోఽభయం త్వా గచ్ఛతాద్యాజ్ఞవల్క్య యో నో భగవన్నభయం వేదయసే** – ఓ యాజ్ఞవల్క్యా, నేను ఏ మోక్షాన్ని అనుభవిస్తానో, నువ్వు కూడా అదే మోక్షాన్ని అనుభవించుగాక అన్నాడు జనకుడు.

జనకుడు చాలా మురిసిపోయాడు. నాకు మోక్షాన్ని ప్రసాదించావు కాబట్టి, నువ్వు కూడా మోక్షాన్ని అనుభవించు. ఎందుకు? నువ్వు నాకు అభయం బ్రహ్మ గురించి బోధించావు. జ్ఞానంద్వారా అనంతం పొందాను.

తర్వాత జనకునికి తన పొరపాటు తెలిసింది. తను అభయం బ్రహ్మ గురించి నేర్చుకుంటే, తను అభయం పొందితే, అభయం బ్రహ్మ గురించి నేర్పించిన గురువు, ఇంకా మోక్షం పొందకుండా ఉంటాడా? ఆయన జ్ఞాని, ముక్తపురుషుడు. తను కొత్తగా ఇచ్చేదేం ఉంది? కాని జనకుని ఆనందానికి పట్టపగ్గాలు లేవు. అంత గొప్ప విద్య పొందినందుకు ఏదో ఒక గురుదక్షిణ ఇచ్చి తీరాలి.

**నమస్తేఽస్త్విమే విదేహా అయమహమస్మి** – ముందుగా నీకు నమస్కారము. నా విదేహ రాజ్యం మొత్తం నీకు సమర్పిస్తున్నాను. ఇమే విదేహాః – ఈ రాజ్యం మొత్తం ఇస్తున్నాను. ఎంత గొప్ప ఉదార స్వభావమో చూడండి! కాని జ్ఞాని అయిన యాజ్ఞవల్క్యునికి పద్నాలుగు లోకాలే తృణప్రాయం, అలాంటిది ఇంత చిన్న రాజ్యానికి చలిస్తాడా? చలించడు. అది యాజ్ఞవల్క్యుని పరిస్థితి. ఇటు జనకునికి రాజ్యం అంతా ఆయన పాదాల చెంత పెట్టినా తృప్తి కలుగలేదు.

**అయమ్ అహమస్మి** – ఈ నేను కూడా నీకు చెందుతాను అన్నాడు. అంటే రాజ్యాన్ని, రాజ్యంతో పాటు తనను కూడా గురువుకు సమర్పించుకున్నాడు. అనంతమైన మోక్షం పొందినందుకు, తనకున్నదంతా త్యజించాడు.

దీనితో చతుష్పాద ఆత్మ ప్రకరణం ముగిసింది.

# 4.3 – స్వయంజ్యోతిర్బ్రాహ్మణము

ఈ బ్రాహ్మణము కూడా యాజ్ఞవల్క్య, జనకుల సంవాదరూపంలో సాగుతుంది. దీన్ని జ్యోతిర్బ్రాహ్మణం లేదా స్వయంజ్యోతి బ్రాహ్మణము అంటారు. ఇది మొత్తం బృహదారణ్యకంలోనే అత్యంత పెద్ద బ్రాహ్మణము. 38 మంత్రాలు ఉన్నాయి ఇందులో. ఇది అత్యంత పెద్దదే కాదు, అత్యంత ముఖ్యమైనది కూడా. అన్నింటిలోకి గొప్ప బ్రాహ్మణము ఇది.

ఇందులో అనేక మంత్రాలు అక్షరలక్షల విలువచేసే మంత్రాలు. అనేక సందర్భాలలో వీటిని ఉటంకిస్తుంటారు. దీన్ని స్వయంజ్యోతిర్బ్రాహ్మణము అని ఎందుకంటారంటే ఇందులో ఆత్మ స్వయంప్రకాశకంగా లేదా స్వయంజ్యోతిగా నిరూపించబడుతుంది. ఇక్కడ కూడా గురుశిష్యులు యాజ్ఞ్యవల్క్యుడు, జనక మహారాజులే. మొదటి మంత్రం వీరిని పరిచయం చేస్తున్నది.

మంత్రం 4.3.1

**జనకగ్ం హ వైదేహం యాజ్ఞవల్క్యో జగామ స మేనే న వదిష్య ఇత్యథ హ యజ్జనకశ్చ వైదేహో యాజ్ఞవల్క్యశ్చాగ్నిహోత్రే సమూదాతే తస్మై హ యాజ్ఞవల్క్యో వరం దదౌ స హ కామప్రశ్నమేవ వవ్రే తగ్ం హాస్మై దదౌ తగ్ం హ సమ్రాడేవ పూర్వం పప్రచ్ఛ ॥**

**జనకగ్ం హ వైదేహం యాజ్ఞవల్క్యో జగామ** – విదేహ రాజైన జనకుని దగ్గరకు యాజ్ఞవల్క్యుడు వెళ్ళాడు. ఇంతకు ముందు బ్రాహ్మణములో సంవాదం అయ్యాక, యాజ్ఞవల్క్యుడు వెళ్ళిపోయి, మళ్ళీ ఇంకొకసారి జనకుని దగ్గరకు వెళ్ళినట్టు ఊహించుకోవాలి. కాని ఈసారి అతను ఒక సంకల్పం చేసుకున్నాడు.

**స మేనే న వదిష్య ఇతి** – నేను ఏమీ ఉపదేశించబోనని తనలో తాను అనుకున్నాడు. కాని జరిగినది దానికి పూర్తి భిన్నంగా ఉంది. అన్నింటికన్నా పెద్ద బ్రాహ్మణం ఇది అని చూశాము. తన సంకల్పాన్ని నిలబెట్టుకోలేక పోయాడు. తన సంకల్పాన్ని ఎందుకు నిలబెట్టుకోలేక పోయాడో, ఉపనిషత్తే కారణం చెబుతున్నది. దానికి ఒక కథ చెబుతున్నది. ముందు ఆ కథను చూద్దాము.

అంతకు ముందెప్పుడో ఒకసారి జనకుడు, యాజ్ఞవల్క్యుడు కలిసినప్పుడు వారు అగ్నిహోత్రం గురించి మాట్లాడుకున్నారు. జనకునికి జ్ఞానకాండ మాత్రమే కాదు, కర్మకాండ, ఉపాసన కాండలమీద కూడా శ్రద్ధ ఉంది. అగ్నిహోత్రం గురించి యాజ్ఞవల్క్యుడు వివరంగా చెప్పాక, మళ్ళీ జనకుడు అక్షరం పొల్లుపోకుండా అప్పజెప్పాడు.

కఠోపనిషత్తులో కూడా ఇటువంటి సన్నివేశాన్నే చూస్తాము. యమధర్మరాజు ఒక యజ్ఞం గురించి చాలా వివరంగా చెప్పాక, నచికేతుడు కూడా దాన్ని అక్షరాలా తిరిగి చెప్పాడు. యమధర్మరాజు మురిసిపోయి, దానికి నాచికేతాగ్ని అని పేరు పెట్టాడు. అలాగే ఇక్కడ యాజ్ఞవల్క్యుడు కూడా మురిసిపోయి, ఏదైనా వరం కోరుకోమన్నాడు. నచికేతుడు ఎలాగైతే ప్రాపంచిక వరాలు కోరుకోలేదో అలాగే జనకుడు కూడా కోరుకోలేదు. కాకపోతే వీరిద్దరికీ

చిన్న వ్యత్యాసం ఉంది. నచికేతుడు వైరాగ్యంవల్ల కోరుకోలేదు. జనకునికి కూడా వైరాగ్యం ఉంది. అది కాక అతను చక్రవర్తి. అతనికి ప్రాపంచిక సుఖాలకి ఏ లోటూ లేదు.

అందువల్ల అతను ఎప్పుడు కోరితే అప్పుడు, ఎక్కడ కోరితే అక్కడ యాజ్ఞవల్క్యుడు జ్ఞానబోధను చెయ్యాలనే వరాన్ని కోరాడు. దీన్ని **కామప్రశ్నః** అంది ఉపనిషత్తు. యాజ్ఞవల్క్యుడు తథాస్తు అన్నాడు. ఈ నేపథ్యంతో మంత్రాన్ని చూద్దాము.

**అథ హ** – అంతకుముందు ఒక సందర్భంలో;

**యజ్జనకశ్చ వైదేహో యాజ్ఞవల్క్యశ్చాగ్నిహోత్రే సమూదాతే** – ఆ జనకుడు, యాజ్ఞవల్క్యుడు అగ్నిహోత్రం విషయంలో చర్చ చేశారు.

**తస్మై హ యాజ్ఞవల్క్యో వరం దదౌ** – అప్పుడా జనకునికి యాజ్ఞవల్క్యుడు ఒక వరాన్ని ప్రసాదించాడు.

**స హ కామప్రశ్నమేవ వవ్రే** – తనకు ఇష్టం వచ్చిన ప్రశ్నలు వేసే అవకాశాన్ని ఆయన వరంగా కోరాడు.

**తగ్ం హాస్మై దదౌ** – యాజ్ఞవల్క్యుడు ఆ వరాన్ని ఇచ్చాడు. ఇంతవరకూ గతంలో జరిగిన విషయం. ఇప్పుడు రాబోయేది, ఇప్పుడు జనకుడు అడుగుతాడు.

**తగ్ం హ సమ్రాడేవ పూర్వం పప్రచ్ఛ** – జనక చక్రవర్తే, యాజ్ఞవల్క్యుణ్ణి ముందుగా ప్రశ్నించాడు.

ఇప్పుడు యాజ్ఞవల్క్యుడు పెద్ద సంకటస్థితిలో పడ్డాడు. ఇక్కడికి రాకముందు ఏమీ మాట్లాడకూడదని మనస్సులో సంకల్పించుకున్నాడు. తీరా వచ్చాక, జనకుడు ఒక ప్రశ్న అడిగాడు. అంతకు ముందెప్పుడో జనకునికి ఎప్పుడైనా, ఏదైనా తనను ప్రశ్నించవచ్చనే వరం ఇచ్చివున్నాడు. ఇప్పుడు తను చేసుకున్న నిర్ణయానికి కట్టుబడాలా, రాజుకు ఇచ్చిన మాటకు కట్టుబడాలా? యాజ్ఞవల్క్యుడు తను చేసుకున్న నిర్ణయాన్ని పక్కన పెట్టి, జనకునికి బోధ చేస్తాడు. అందువల్లనే ఇది అంత పెద్ద బ్రాహ్మణము అయింది. శంకరులవారు దీన్నించి మనం ఒక ముఖ్యమైన విలువను నేర్చుకోవాలని అంటున్నారు – ఏమిటది? సత్యం వద. ఎవరికైనా మాట ఇస్తే ఆ మాటను ఎట్టి పరిస్థితిలోనైనా నిలబెట్టుకోవాలి. అది మన సంకల్పానికి భిన్నంగా ఉన్నా కూడా మాటకు కట్టుబడాలి. యాజ్ఞవల్క్యుడు చేసిందదే.

ముందుకు సాగేముందు శంకరులవారి శిష్యులైన సురేశ్వరాచార్యులు ఈ సందర్భంలో ఏమన్నారో చూద్దాము. ఈ సురేశ్వరాచార్యులు బృహదారణ్యకోపనిషత్తుమీద శంకరులవారు రాసిన భాష్యంమీద విశ్లేషణ చేస్తూ వార్తికం రాశారు. దీన్ని **బృహదారణ్యక భాష్యవార్తికం** అంటారు. దీనిలో పన్నెండువేల పైనే శ్లోకాలు ఉంటాయి.

వార్తికం రాయటం తేలికే కాని గురువు రాసిన భాష్యంమీద విశ్లేషణ చెయ్యటం అంత తేలిక కాదు. వార్తికకారుడు మూడు అంశాలను చర్చించాలి. అవి – **ఉక్తమ్, అనుక్తమ్, దురుక్తమ్**. ఉక్తం అంటే భాష్యంలో ఉన్నదాని గురించి విశ్లేషించాలి; అనుక్తం అంటే భాష్యంలో ఏదైనా అంశాన్ని చర్చించకుండా వదిలేస్తే, దాన్ని వివరించాలి. దురుక్తం అంటే గురువు చెప్పినదాన్ని తప్పు పట్టటం అనము కాని, గురువు చెప్పినదానికి మరికొంత వివరణ ఇవ్వచ్చు అనిపిస్తే, దాన్ని వివరించాలి. శంకరులవారు తప్పు చెప్పరు.

ఇక్కడ ఈ సందర్భంలో సురేశ్వరాచార్యులు, యాజ్ఞవల్క్యుని సంకల్పాన్ని ఇలా కూడా తీసుకోవచ్చు అని ఇంకో విధంగా సూచించాడు. శంకరులవారు చెప్పినదీ సబబే! మాట ఇస్తే నిలబెట్టుకోవాలి. ఒక ముఖ్యమైన విలువని అది సూచిస్తున్నది. కాని యాజ్ఞవల్క్యునికి, జనకుని దగ్గరకి వెళితే ఆయన ప్రశ్న అడుగుతాడని తెలుసు. ఆయనకు తానే స్వయంగా అటువంటి వరం ఇచ్చాననీ తెలుసు. అటువంటప్పుడు ఎందుకు ప్రత్యేకించి, 'ఇవాళ అతనితో మాట్లాడను,' అని అనుకుంటాడు? అందువల్ల ఈ వాక్యాన్ని వేరే విధంగా కూడా చూడవచ్చని సూచిస్తున్నారు సురేశ్వరాచార్యులు. ఆ వాక్యం ఏమిటి?

**స మేనే న వదిష్యే** – దాన్ని ముందు ఎలా చూశాము? సః – యాజ్ఞవల్క్యుడు; మేనే – తనలో అనుకున్నాడు; న వదిష్యే – మాట్లాడను అని. సురేశ్వరాచార్యుల విశ్లేషణ –

సమ్ + ఏనేన + వదిష్యే = ఏనేన సంవదిష్యే

మే = మ్+ఏ గా తీసుకుంటే, సమేనేన = సమ్ + ఏనేన అవుతుంది. సమ్ అనే ప్రిఫిక్స్‌ను తీసుకువెళ్ళి వదిష్యేతో కలిపితే అది సంవదిష్యే అవుతుంది. అంటే చివరకి ఏనేన సంవదిష్యే అవుతుంది. అంటే జనకునితో నేను మాట్లాడుతాను అని అర్థం వస్తుంది.

అలా ప్రిఫిక్స్‌ను ఇష్టం వచ్చినట్టు ఎలా మారుస్తాము అని సందేహం రావచ్చు. ఇంగ్లీషులో కూడా ప్రిఫిక్స్‌లు ఉంటాయి. వాటిని ఇంకొక పదానికి కలపలేము.

re-organize the function ను re-function organize అనగలమా? వేదంలో అలా మార్చే అవకాశం ఉంది.

ఆ విధంగా **స మేనే న వదిష్యే** కాస్తా **ఏనేన సంవదిష్యే** అయింది. జనకునితో మాట్లాడతాను అని సంకల్పించుకుని వచ్చాడు. అందువల్ల ఈ బ్రాహ్మణము పెద్దది అయింది అని సురేశ్వరాచార్యులు విశ్లేషించారు. భాష్యంమీద రాసిన వార్తికం ఎలా ఉంటుందో చూపించటానికి ఇది ఒక ఉదాహరణ.

## మంత్రం 4.3.2

**యాజ్ఞవల్క్య కిం జ్యోతిరయం పురుష ఇతి ॥ ఆదిత్య జ్యోతిస్సమ్రాడితి హోవాచాదిత్యేౕ౨ ౕ౨ నైవాయం జ్యోతిషాౕ౨ ౕ౨ స్తే పల్యయతే కర్మ కురుతే విపల్యేతీత్యేవమేవైతద్యాజ్ఞవల్క్య ॥**

**యాజ్ఞవల్క్య కిం జ్యోతిరయం పురుష ఇతి** – ఓ యాజ్ఞవల్క్యా! మనిషి ఏ జ్యోతి సహాయంతో వ్యవహారం నడుపుతాడు?

**కేన జ్యోతిషా పురుషః వ్యవహారం కరోతి?**

**ఆదిత్యజ్యోతిస్సమ్రాడితి హోవాచ** – ఓ సామ్రాట్! మనిషికి జ్యోతి ఆదిత్యుడే! కాని మనం మామూలుగా ఈ జ్యోతిని గమనించము. పొద్దున్న లేచినప్పటినుంచి సాయంకాలంవరకూ అన్ని పనులనూ ఈ జ్యోతివల్లనే చేస్తాము. యాజ్ఞవల్క్యుడు నాలుగు కర్మలను ఎన్నుకున్నాడు.

**ఆదిత్యేఽ ఽ నైవాయం జ్యోతిషాఽ ఽ స్తే పల్యయతే కర్మ కురుతే విపల్యేతి** – మనిషి ఆదిత్యుడనే జ్యోతివల్లనే కూర్చుంటాడు, అటు ఇటు తిరుగుతాడు, పనిని చేస్తాడు, తిరిగి వస్తాడు అని యాజ్ఞవల్క్యుడు చెప్పాడు. ఆస్తే అంటే కూర్చుంటాడు; పల్యయతే ని పర్యయతే (పరి+అయతే)గా తీసుకోవాలి. సంస్కృతంలో రలయో అభేదః అని ఒక సూత్రం ఉంది. 'ర' అక్షరంకీ 'ల' అక్షరంకి మధ్యలో భేదం లేదు. పర్యయతే అంటే తిరుగుతాడు; కర్మ కురుతే అంటే పని చేస్తాడు; విపల్యేతిని కూడా విపర్యేతి (వి+పరి+ఏతి)గా తీసుకోవాలి. తిరిగివస్తాడు.

**ఏవమేవైతద్యాజ్ఞవల్క్య** – ఓ యాజ్ఞవల్క్యా, నువ్వు చెప్పింది సబబే!

## మంత్రం 4.3.3

**అస్తమిత ఆదిత్యే యాజ్ఞవల్క్య కిం జ్యోతిరేవాయం పురుష ఇతి చన్ద్రమా ఏవాస్య జ్యోతిర్భవతీతి చన్ద్రమసైవాయం జ్యోతిషాఽ ఽ స్తే పల్యయతే కర్మ కురుతే విపల్యేతీత్యేవమేవైతద్యాజ్ఞవల్క్య ॥**

ఇప్పుడు జనకుడు రెండవ ప్రశ్న వేస్తాడు.

**అస్తమిత ఆదిత్యే యాజ్ఞవల్క్య కింజ్యోతిరేవాయం పురుష ఇతి** – ఓ యాజ్ఞవల్క్యా, సూర్యుడు అస్తమిస్తే, ఏ జ్యోతివల్ల మనిషి వ్యవహారం నడుపుతాడు.

**చంద్రమా ఏవాస్య జ్యోతిర్భవతీతి** – చంద్రుడే జ్యోతి అవుతాడు అతనికి.

ఇంక మిగతాదంతా అవే మాటలు. సూర్యుడు అస్తమిస్తే చంద్రకాంతితో మనిషి తన వ్యవహారాలు నడుపుతాడు. చంద్రకాంతివల్లనే మనిషి కూర్చుంటాడు, ఇటుఅటు తిరుగుతాడు, కర్మ చేస్తాడు, తిరిగి వస్తాడు. జనకుడు నిజమే అంటాడు.

## మంత్రం 4.3.4

**అస్తమిత ఆదిత్యే యాజ్ఞవల్క్య చన్ద్రమస్యస్తమితే కిం జ్యోతిరేవాయం పురుష ఇత్యగ్నిరేవాస్య జ్యోతిర్భవతీత్యగ్నినైవాయం జ్యోతిషాఽ ఽ స్తే పల్యయతే కర్మ కురుతే విపల్యేతీత్యేవమేవైతద్యాజ్ఞవల్క్య॥**

సూర్యుడు అస్తమించి, చంద్రుడు కూడా అస్తమిస్తే మనిషి ఏ జ్యోతివల్ల పని చేస్తాడు? అంటే అమావాస్య రాత్రి చంద్రకాంతి కూడా ఉండదు. అప్పుడెలా? అగ్నివల్ల వ్యవహారాలు నడుపుతాడు అంటాడు యాజ్ఞవల్క్యుడు. (అన్నీ ఇంచుమించు ఒకేలా ఉన్నాయి కాబట్టి, వివరాలలోకి వెళ్ళటం లేదు).

## మంత్రం 4.3.5

**అస్తమిత ఆదిత్యే యాజ్ఞవల్క్య చన్ద్రమస్యస్తమితే శాన్తేఽగ్నౌ కింజ్యోతిరేవాయం పురుష ఇతి వాగేవాస్య జ్యోతిర్భవతీతి వాచైవాయం జ్యోతిషాఽ ఽ స్తే పల్యయతే కర్మ కురుతే విపల్యేతీతి॥ తస్మాద్వై సమ్రాడపి యత్ర స్వః పాణిర్న వినిర్జ్ఞాయతేఽ థ యత్ర వాగుచ్చరత్యుపైవ తత్ర న్యేతీత్యేవమేవైతద్యాజ్ఞవల్క్య॥**

సూర్యుడు అస్తమించి, చంద్రుడు అస్తమించి, అగ్ని కూడా ఆరిపోతే ఈ మనిషి ఏ జ్యోతివల్ల వ్యవహారం నడుపుతాడు? వాక్కువల్ల వ్యవహారాలు నడుపుతాడు అంటాడు యాజ్ఞవల్క్యుడు. ఇక్కడ వాక్కు అంటే శబ్దము. వాక్కు అంటే వాగింద్రియం కాదు. బాహ్యంగా వినిపించే శబ్దాలు. వాక్కు పదాన్ని ఉపలక్షణంగా తీసుకోవచ్చు అంటారు శంకరులవారు. ఉపలక్షణం అంటే ఒకదాని గురించి చెప్పి, తక్కిన వాటి గురించి చెప్పకపోయినా వాటిని కూడా కలుపుకోవటం.

వాక్కు అంటే స్పర్శ, శబ్ద,రూప, రస, గంధాలను, ముఖ్యంగా గంధాన్ని, తీసుకోవచ్చు. చీకట్లో అగరువత్తుల సువాసన వస్తే పక్కనే పూజగది ఉన్నట్టు అర్థం. చీకట్లో ఇల్లు తెలియకపోయినా ఆ ఇంటినుంచి కుక్క అరుపో, ఆవు అరుపో వినిపిస్తే అటువైపుగా వెళ్ళవచ్చు. దీన్ని బాహ్యశబ్దం అంటారు.

ధనుర్విద్యలో శబ్దాన్ని ఆధారంగా తీసుకుని చీకట్లో బాణం వేస్తారు. దీన్ని శబ్దభేది అంటారు. ఇది వినగానే మనకు దశరథ మహారాజు కథ గుర్తుకురాక తప్పదు. ఆయన వ్యవహారం ఏ జ్యోతి వెలుగులో నడిపాడు? ఆదిత్యుడు, చంద్రుడు, అగ్నిలను వాడలేదు. వాక్కును అంటే శబ్దాన్ని వాడాడు. నీటిలో చప్పుడయితే జింక అనుకుని బాణం వేశాడు. ఫలితంగా శాపం పొందాడు. అది పక్కనపెడితే శబ్దం ఒక జ్యోతి. దీని గురించి కొంచెం వివరణ ఇస్తున్నది ఉపనిషత్తు.

**తస్మాద్వై సమ్రాడపి యత్ర స్వః పాణిర్న వినిర్జ్ఞాయతే** – ఒకవేళ అక్కడ చిమ్మచీకటి అలుముకుని ఉంటే, ఆ చీకటిలో తన చెయ్యి కూడా తనకు కనిపించకుండా ఉంటే;

**అథ యత్ర వాగుచ్చరతి** – అప్పుడు ఎక్కడైతే వాక్కు వినిపిస్తుందో (శబ్దం వినిపిస్తుందో);

**ఉపైవ తత్ర న్యేతి ఇతి** – దానిచేత దగ్గరకు వెళతాడు. ఆ శబ్దం ఏదైనా కావచ్చు అని చూశాము. ఇక్కడ కూడా ప్రిఫిక్స్, క్రియాపదంనుంచి విడదీయబడింది. ఉప+ఏతి ఉండాలి. వాటి మధ్యలో తత్ర వచ్చింది.

జనకుడు శబ్దం ఒక జ్యోతి అని ఒప్పుకుంటాడు. ఇప్పుడు అతను అడగబోయే ప్రశ్న కీలకమైన ప్రశ్న. ఇది ఆత్మజ్యోతిని పరిచయం చేస్తుంది.

## మంత్రం 4.3.6

**అస్తమిత ఆదిత్యే యాజ్ఞవల్క్య చన్ద్రమస్యస్తమితే శాన్తేఽగ్నౌ శాన్తాయాం వాచి కింజ్యోతిరే వాయం పురుష ఇతి ॥ ఆత్మైవాస్య జ్యోతిర్భవతీత్యాత్మనైవాయం జ్యోతిషాఽఽస్తే పల్యయతే కర్మ కురుతే విపల్యేతీతి॥**

ఇప్పటివరకూ వ్యావహారిక జ్యోతులను చూశాము. జ్యోతి అంటే దేని సమక్షంలో వ్యవహారాలను నడపగలమో అది జ్యోతి. అందువల్ల వ్యవహారాలను జ్యోతికార్యం లేదా జ్యోతి సాధ్యం అంటారు. ఆత్మజ్యోతిని పరిచయం చేసేముందు కొన్ని సాపేక్షిక జ్యోతులను పరిచయం చేసింది ఉపనిషత్తు. నాలుగు సాపేక్షిక జ్యోతులను చూశాము. అవి – సూర్యుడు, చంద్రుడు, అగ్ని, వాక్కు (శబ్దం). పగలు సూర్యుని సమక్షంలో, రాత్రి చంద్రుని సమక్షంలో,

అమావాస్య రాత్రి అగ్ని సమక్షంలో, అగ్ని కూడా లేనప్పుడు వాక్కు సమక్షంలో వ్యవహారాలు నడుపుతాము. ఇవన్నీ బాహ్యజ్యోతులు. ఇప్పుడు చూడబోయేది ఆంతరజ్యోతి.

**చతుర్ణామ్ జ్యోతిషామ్ అపి జ్యోతిః**

ఈ నాలుగు జ్యోతులకు జ్యోతి అది.

సూర్యుడు అస్తమించి, చంద్రుడు అస్తమించి, అగ్ని (దీపం) ఆరిపోయి, శబ్దం శాంతిస్తే ఈ మనిషికి ఏ జ్యోతి ఉంది అని జనకుడు ప్రశ్నిస్తాడు. అటువంటి పరిస్థితి స్వప్నావస్థలో సాధ్యం అంటున్నారు శంకరులవారు.

స్వప్నదేహవ్యవహారాన్ని సూచిస్తున్నది ఈ మంత్రం. ఎందుకంటే స్వప్నంలో ఈ శరీరంద్వారా మనం వ్యవహారం నడుపము. అంటే అప్పుడు బాహ్యప్రపంచం అందుబాటులో ఉండదు. జాగ్రద్ పురుషుడు ఉంటేనే జాగ్రద్ ప్రపంచం ఉంటుందని చూశాము. పైన చెప్పిన నాలుగు జ్యోతులు బాహ్యజ్యోతులు. కాబట్టి వీటితో స్వప్నపురుషుడు వ్యవహారం నడపలేడు. అందువల్ల ప్రశ్న ఇది –

**కిం జ్యోతిరేవాయం పురుష ఇతి** – ఏ జ్యోతివల్ల పని చేస్తాడు?

**ఆత్మైవాస్య జ్యోతిర్భవతీతి** – ఆత్మ ఏవ అస్య జ్యోతిర్భవతి ఇతి. సాక్షిచైతన్యాన్ని పరిచయం చేస్తున్నాడు యాజ్ఞవల్క్యుడు. ఆత్మ, సాక్షిచైతన్యరూపంలో, ఆంతరజ్యోతిగా ఉంది. అది స్వప్నప్రపంచాన్ని ప్రకాశింప జేస్తున్నది. ఆత్మ **ఏవ** జ్యోతి – ఆత్మ మాత్రమే ప్రకాశింపజేస్తుంది.

జాగ్రదావస్థలో వ్యవహారం నడిపేటప్పుడు కూడా ఆత్మజ్యోతి ఉంటుంది, కాని అప్పుడు దాని గురించి తెలియదు. పగలు మనం ఇంట్లో ట్యూబ్‌లైట్ వేసుకుంటే సూర్యకాంతిని పట్టించుకోము. నిజానికి అక్కడ రెండు జ్యోతులు ఉన్నాయి – సూర్యకాంతి, ట్యూబ్‌లైట్. కాని సూర్యకాంతి విలువ తెలియదు. అలాగే పగలు ఆత్మజ్యోతి, సూర్యకాంతి ఉంటాయి. కాని మనకు సూర్యకాంతి సమక్షంలో ఆత్మజ్యోతి తెలియదు.

కాని స్వప్నప్రపంచానికి వచ్చేసరికి బాహ్యజ్యోతి తెలియదు. అందువల్ల స్వయంజ్యోతి ఆత్మను తెలుసుకోవటానికి స్వప్నాన్ని తీసుకుంటారు. అందువల్లనే ఆత్మనా **ఏవ** జ్యోతిషా పదాన్ని వాడాడు యాజ్ఞవల్క్యుడు.

**ఆత్మనా ఏవ అయం జ్యోతిషాఽఽస్తే** – ఈ వాక్యంయొక్క అన్వయం చూస్తే దాన్ని ఇలా తీసుకోవాలి – ఆత్మనా జ్యోతిషా ఏవ అయమ్ ఆస్తే. ఆత్మజ్యోతివల్లనే, మనిషి వ్యవహారం నడుపుతాడు. ముందు చూసిన నాలుగు వ్యవహారాలూ మళ్ళీ చూస్తాము.

**(ఆస్తే) పల్యయతే కర్మ కురుతే విపల్యేతీతి** – మనిషి కూర్చుంటాడు, ఇటు అటు తిరుగుతాడు, పని చేసుకుంటాడు, తిరిగి వస్తాడు.

## మంత్రం 4.3.7

**కతమ ఆత్మేతి యోఽయం విజ్ఞానమయః ప్రాణేషు హృద్యన్తర్జ్యోతిః పురుషః ॥ స సమానస్సన్నుభౌ లోకావనుసఞ్చరతి ॥ ధ్యాయతీవ ॥ లేలాయతీవ ॥ స హి స్వప్నో భూత్వేమం లోకమతిక్రామతి మృత్యో రూపాణి ॥**

ముందు మంత్రం, ఈ మంత్రం చాలా ముఖ్యమైన మంత్రాలు. శంకరులవారు వీటిని తరచు ఉటంకిస్తుంటారు. ముందు మంత్రంలో యాజ్ఞవల్క్యుడు ఆత్మజ్యోతిని పరిచయం చేశాడు. ఇప్పుడు ఆత్మజ్యోతి అంటే ఏమిటి అని జనకుడు అడుగుతాడు.

**కతమ ఆత్మేతి** – వీటిలో ఆత్మ ఏది? కతమ అంటే వీటిలో, కతర అంటే ఈ రెండింటిలో. కతమ అని ఎందుకు అడిగాడు జనకుడు? ఎందుకంటే ఒక వ్యక్తిని తీసుకుంటే అతనిలో అనేక భాగాలు ఉన్నాయి. అవి **స్థూలశరీరం, ఇంద్రియాలు, మనస్సు, ప్రాణం**. వీటన్నిటిలో ఆత్మ ఏది?

ఈ ప్రశ్న చాలా సహజమైన ప్రశ్న. ఎందుకంటే వీటిలో ఒక్కొక్క దాన్ని ఆత్మ అనుకుంటున్నారు ఒక్కొక్క వేదాంతులు. కొంతమంది ప్రాణం ఆత్మ అంటారు; కొంతమంది ఇంద్రియాలు ఆత్మ అంటారు; మరికొంతమంది మనస్సు ఆత్మ అంటారు; మరికొంతమంది శరీరం ఆత్మ అంటారు. అందువల్ల వీటిలో ఏది ఆత్మ?

**యోఽయం విజ్ఞానమయః ప్రాణేషు హృద్యన్తర్జ్యోతిః (సః ఆత్మా)** – ఆత్మ అంటే ప్రాణం పక్కన, హృదయం లోపల జ్యోతిగా ఉన్న విజ్ఞానమయ పురుషుడు.

ఇక్కడ జ్యోతి పదాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. జ్యోతి అంటే ఇంతకుముందు చూసినట్టుగా కాంతి. అంటే వ్యవహారం నడపటానికి తోడ్పడే కాంతి. అంతేకాని, మన హృదయం లోపల వెలిగే జ్యోతి కాదు. కొంతమంది ధ్యానంలో కూర్చుని లోపల వెలిగే ఈ జ్యోతిని చూడాలని ప్రయత్నం చేస్తారు; కొంతమంది చూశామంటారు కూడా. ఆత్మ అంటే ఇలా వెలిగే జ్యోతి కాదు అని కఠోపనిషత్తులో కూడా వస్తుంది. కొంతమంది ధ్యానంలో కూర్చుంటే రంగులు కనబడ్డాయని, రూపాలు కనబడ్డాయని, జ్యోతి కనబడిందనీ అంటారు. ఆత్మ అంటే వచ్చిపోయే జ్యోతి కాదు. అందువల్ల ఏ కాంతి సమక్షంలో మనకు వస్తువులు కనబడుతున్నాయో, ఏ కాంతి లేకపోతే వస్తువులు తెలియటం లేదో అది జ్యోతి. ఈ నిర్వచనం ప్రకారం ముందు చెప్పిన సూర్యుడు, చంద్రుడు, అగ్ని, వాక్కులు జ్యోతులే. అవి ఉంటే వ్యవహారం నడుపుతున్నాము, లేకపోతే నడపలేకపోతున్నాము.

ఈ నిర్వచనం ప్రకారం ఇంద్రియాలు కూడా జ్యోతులే. సూర్యుడు లేనిదే వ్యవహారం నడపలేము, ఆయన ఒక జ్యోతి అన్నాము. కాని అంత సూర్యకాంతిని కూడా కన్ను లేకపోతే చూడలేము. గుడ్డివాడు మిట్టమధ్యాహ్నం సూర్యుడు గ్రీష్మతాపాన్ని చూపిస్తున్నా కూడా, సూర్యకాంతిని చూడలేడు. అప్పుడేమయింది? సూర్యుడనే జ్యోతిని చూడటానికి కన్ను అనే జ్యోతి కావాలి. కన్ను అంటే అన్ని ఇంద్రియాలనూ తీసుకోవచ్చు. చెవులు పనిచెయ్యకపోతే ఎంత పెద్ద శబ్దమయినా వినిపించదు. ఆ విధంగా ఇంద్రియాలు జ్యోతి.

ఈ నిర్వచనం ప్రకారం మనస్సు ఒక జ్యోతి. జ్యోతి అంటే దాని సమక్షంలో ఒక వస్తువును చూడటం, అది లేకపోతే చూడలేక పోవటం అని చూశాము కదా! ఇప్పుడు కన్ను వెనుక మనస్సు లేకపోతే పరిస్థితి ఏమిటి? సూర్యోదయం అద్భుతంగా ఉంది; సూర్యుడు ఎర్రటి బంతిలా గుండ్రంగా మిలమిల మెరిసిపోతున్నాడు. మీ కళ్ళు అద్భుతంగా పనిచేస్తున్నాయి. కాని మీ మనస్సు మీ కళ్ళ వెనుక లేదు. అది అందాన్ని ఆస్వాదించే పరిస్థితిలో లేదు. అప్పుడు అంత మిలమిల మెరిసే సూర్యుని అందాలు, వెలాతెలా పోతాయి. అలాగే శబ్దం. మంచి లలితసంగీతం పాడుతున్నారు మీ పక్కన ఎవరో! మామూలుగా మీ చెవులు సూక్ష్మమైన శబ్దాన్ని కూడా వినగలవు

కాని మీ మనస్సు చెవుల వెనుకలేదు. అప్పుడు ఆ అద్భుత సంగీతాన్ని ఆస్వాదించలేరు మీరు. అందువల్ల మనస్సు కూడా ఒక జ్యోతి. ఆ విధంగా ప్రతి ఒక్క ప్రమాణం కూడా **జ్యోతి.**

చివరికి ఆత్మను మాత్రమే **జ్యోతిషాం జ్యోతిః** అనగలము. ఎందుకంటే తక్కిన జ్యోతులన్నీ ఆత్మవల్లనే జ్యోతులుగా పని చెయ్యగలుగుతున్నాయి. సుషుప్తిలో మనస్సు కూడా పడుకుంటుంది. అయినా నిద్ర లేచాక, 'నేను హాయిగా నిద్రపోయాను,' అంటాము. సుషుప్తిలో శరీరం, ఇంద్రియాలు, ఇంద్రియాలను చూసే మనస్సు కూడా నిద్ర పోతే ఎలా తెలిసింది? అంటే ఆ మనస్సును చూసే జ్యోతి ఇంకొకటి ఉందన్నమాట. దాన్ని సాక్షిచైతన్యం అనీ, ఆత్మ అనీ అంటారు. సాక్షికి మనస్సు పనిచేస్తున్నా తెలుస్తోంది, పని చెయ్యకుండా పడుకున్నా తెలుస్తోంది.

**ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనస్సును సాక్షిగా చూసేదే సాక్షిచైతన్యం**

అందువల్ల ఆత్మ జ్యోతిషాం జ్యోతి అయింది. ఇప్పుడు ఆత్మవైపునుంచి వెనక్కు వెళితే ఆత్మ అనే జ్యోతివల్ల మనస్సు జ్యోతి అయింది; మనస్సనే జ్యోతివల్ల ఇంద్రియాలు జ్యోతి అయ్యాయి; కన్ను అనే జ్యోతివల్ల సూర్యుడు ఒక జ్యోతి అయ్యాడు. ఆ విధంగా ఆత్మజ్యోతి.

**పురుషః** – ఆత్మను పురుషః అంటారు. పురుష అంటే పూర్ణం లేదా సర్వగతం. ఆత్మచైతన్యం సర్వవ్యాపకం. అంటే ఈ ఆత్మచైతన్యం నాలోనే లేదు, అందరు మనుష్యుల్లోనూ ఉంది, వారి మధ్యలో కూడా ఉంది. పూర్ణత్వాత్ పురుషః.

ఈ చైతన్యం సర్వవ్యాపకమైనా దాన్ని ఒక్కచోటనే గ్రహించగలము. అది మనస్సు. మీ మనస్సులో ఉన్న చైతన్యాన్ని నేను గ్రహించలేను. మీ మనస్సే నాకు కనిపించనప్పుడు, మీ మనస్సులో ఉన్న చైతన్యాన్ని మాత్రం ఎలా తెలుసుకోగలుగుతాను? అందువల్ల చైతన్యం సర్వవ్యాపకమైనా కూడా దాన్ని నా మనస్సులోనే చూడగలను. నా మనస్సు ఎక్కడ ఉంది? హృదయంలో!

శంకరాచార్యులు హృదయం పదం వచ్చినప్పుడు ప్రత్యేకించి హృదయం అంటే హృదయ మాంసపిండం అని చెబుతారు. ఎందుకంటే కొంతమంది కుడివైపు ఇంకో ఆధ్యాత్మిక హృదయం ఉంది అనే అపోహలో ఉంటారు. హృదయం అంటే శరీరాన్ని కోస్తే కనబడేది. శాస్త్రం ప్రకారం మనస్సు హృదయంలో ఉంది, మెదడులో లేదు. అందువల్లనే చూడండి – హృదయపూర్వక ధన్యవాదాలు అంటాము. అంటే భావాలు హృదయంలోంచి వస్తాయి. అంటే హృదయంలో ఉన్న మనస్సులోంచి వస్తాయి. కనబడే గుండె, కనబడని మనస్సుకు ఆశ్రయం. అందువల్ల హృదయం పదానికి రెండు అర్థాలు ఉన్నాయి. హృదయంయొక్క వాచ్యార్థం గుండె, లక్ష్యార్థం మనస్సు.

**(హృది అంతర్జ్యోతిః)** – హృది అంటే హృదయంలో ఉన్న మనస్సు. అంతః అంటే మనస్సులో ఉన్నది. ఆత్మ అంటే సర్వవ్యాపకమైన చైతన్యం, హృదయంలో ఉండి ఆలోచనలు ఉన్న ఆలోచనలు లేని మనస్సును సాక్షిగా చూసే సాక్షి చైతన్యం.

ఆత్మ హృదయంలో ఉన్నది అంటే అక్షరాలా ఆత్మ హృదయంలో ఉంది అని తీసుకోకూడదు. ఆత్మ హృదయంలో తెలుస్తుంది. ఏమిటి ఈ రెండు వాక్యాలకూ మధ్య భేదం? ఆత్మ హృదయంలో ఉంది అంటే ఆత్మ హృదయం

కన్నా చిన్నదవుతుంది. నేను ఈ గదిలో ఉన్నాను అంటే ఈ గదికన్నా చిన్నగా ఉన్నాను. అంతేకాదు, ఆత్మ హృదయంలో ఉంది అంటే బయట లేనట్టు అవుతుంది. నేను గదిలో ఉన్నాను అంటే బయట లేనట్టే కదా! దానివల్ల ఆత్మకు వస్తుపరిమితి, దేశపరిమితి ఏర్పడుతుంది. అందువల్ల సర్వవ్యాపకమైన ఆత్మను హృదయంలో గుర్తించవచ్చు అనాలి.

**సదా సర్వగతోఽప్యాత్మా న సర్వత్రావభాసతే।**
**బుద్ధావేవావభాసేత స్వచ్ఛేషు ప్రతిబింబవత్ – ఆత్మబోధ – 16**

**ప్రాణేషు** – ప్రాణం అంటే ఒక్క ప్రాణమే కాదు, సూక్ష్మశరీరంలో ఉండే 19 అంగాలు. అంటే పంచప్రాణాలు+ పంచజ్ఞానేంద్రియాలు + పంచకర్మేంద్రియాలు + నాలుగు అంతఃకరణాలు. వీటన్నిటికీ ప్రాణం ఆధారం కాబట్టి ఒక ప్రాణం పదం వచ్చింది. అందువల్ల ప్రాణం అంటే కరణాలు అని తీసుకోవచ్చు.

ప్రాణేషు పదం సప్తమీ విభక్తి. ప్రాణేషు అంటే ప్రాణంలో ఉన్నట్టు అర్థం వస్తుంది. కాని ఇక్కడ సామీప్య సప్తమీగా తీసుకోవాలి అంటారు శంకరులవారు. ఉదాహరణకు పాషాణే వృక్షః అంటే మామూలుగా రాయిమీద ఉన్న వృక్షం అని అర్థం కాని ఆ సందర్భంలో రాయికి దగ్గరగా ఉన్న చెట్టు అని అర్థం. అలాగే ఇక్కడ ప్రాణంలో ఉన్న ఆత్మ కాదు, ప్రాణానికి దగ్గరగా ఉన్న ఆత్మ.

దీన్నిబట్టి ఒక ఉపసిద్ధాంతాన్ని అర్థం చేసుకోవచ్చు అంటున్నారు శంకరులవారు. ఏమిటది? **ఆత్మ ఈ పంతొమ్మిది అంగాలకు భిన్నంగా ఉంది.** ఆత్మ వీటికి దగ్గరగా ఉంది అంటే ఆత్మ ఇవేవీ కాదు. అంతేకాదు పక్క పదంలో హృద్యంతర్జ్యోతిః పురుష – అంది. హృదయంలో ఉన్న మనస్సులో ఉంది అంది. కుండలో నీరు ఉంది అంటే కుండ వేరు, నీరు వేరు.

ఈ రెండు వాక్యాలవల్ల – ఆత్మ ప్రాణానికి దగ్గరగా ఉంది, ఆత్మ మనస్సులో ఉంది – ఆత్మ ఈ 19 అంగాల్లో ఏదీ కాదు. ఆత్మ **దేహవ్యతిరిక్తం**. ఇది ఆత్మ నిర్వచనం ఇప్పుడు అత్యంత ముఖ్యమైన పదానికి వస్తున్నాము.

**విజ్ఞానమయః** – ఆత్మ శుద్ధచైతన్యం. ఆ శుద్ధచైతన్యం వ్యావహారిక ప్రపంచంలో వ్యావహారిక రూపంలో అందుబాటులో ఉంది. ఆ వ్యావహారిక రూపం పేరు చిదాభాస. శుద్ధచైతన్యం బుద్ధి కూడా కాదు. ఆత్మజ్యోతి అంటే పారమార్థిక తత్త్వం.

కాని ఈ పారమార్థిక తత్త్వం లేదా చైతన్యం, వ్యవహారం నడపలేదు. శుద్ధచైతన్యం అవ్యవహార్యమ్, అగ్రాహ్యమ్, అలక్షణమ్, అచింత్యమ్. అందువల్ల అది వేరే రూపంలో వ్యవహారం నడుపుతున్నది.

పరమాత్మ జీవాత్మగా అనుప్రవేశం చేశాడు. చిత్ చిదాభాసగా వ్యవహారం నడుపుతున్నది. చిదాభాస బుద్ధితో పూర్తిగా మమేకం చెందిపోయింది. జీవాత్మకు ఇంకొక పేరు విజ్ఞానమయం. జీవాత్మ ఎవరు? పరమాత్మ.

పరమాత్మ అంటే చిత్. చిత్ చిదాభాసగా వ్యవహారం నడుపుతున్నది. చిదాభాస అంటే ప్రతిబింబ చైతన్యం. ఈ చిదాభాసనే జీవాత్మ అనీ, విజ్ఞానమయం అనీ అంటారు. ప్రతిబింబ చైతన్యం మనస్సులో ప్రతిబింబిస్తుంది కాబట్టి, మనస్సు ప్రతిబింబ మాధ్యమం అవుతుంది. ఇక్కడ మనస్సును బుద్ధి అంటున్నాము. ప్రతిబింబమాధ్యమం

లేనిదే ప్రతిబింబానికి ఉనికి లేదు. అంటే బుద్ధి లేనిదే చిదాభాస మనకు లేదు. అందువల్ల వీటి మధ్య విడదీయరాని అనుబంధం ఏర్పడింది.

అందువల్ల మనం బుద్ధిని జీవాత్మ అనవచ్చు. చిదాభాస జీవాత్మ అన్నా అందులో మనస్సు వస్తుంది; మనస్సు జీవాత్మ అన్నా అందులో చిదాభాస వస్తుంది. అందువల్ల జీవాత్మ = బుద్ధి + చిదాభాస. మనస్సు అన్నా బుద్ధి అన్నా ఒక్కటే.

పరమాత్మ జీవాత్మగా దిగివచ్చాడు. జీవాత్మ బుద్ధితో అనుబంధం పెంచుకుంది. అందువల్ల పరమాత్మ బుద్ధితో ఉన్నట్టుగా ఉన్నాడు. అందువల్ల పరమాత్మ ఎవరు అంటే వ్యావహారిక స్థాయిలో బుద్ధి, అందువల్ల విజ్ఞానమయ ఆత్మ అన్నారు. ఎలా పడిపోయామో చూడండి! నువ్వు ఎవరు అని ఎవరైనా అడిగితే నేను చిత్ అనాలి. కాని మన పరిస్థితి ఏమిటి?

**సః** – ఈ జీవాత్మ;

**(బుద్ధి) సమానః సన్** – బుద్ధి తదాత్మ్యా ఆపన్నః సన్ – అంటే జీవాత్మ బుద్ధితో చేతులు కలిపింది. అంటే వేరే పార్టీతో చేతులు కలిపింది. నేను ఎవరు అంటే బుద్ధి లేదా జీవాత్మ అంటున్నాము. అందువల్ల మనకు కాలపరిమితి, వస్తు పరిమితి వచ్చింది. చిత్‌కు దేశకాలవస్తుపరిమితులు లేవు. కాని మన అయోమయంవల్ల చిదాభాస పరిమితులను చిత్‌కు ఆపాదిస్తున్నాము.

**ఉభౌ లోకావనుసంచరతి** – బుద్ధితో కూడిన చిదాభాస రెండు లోకాలకూ తిరుగుతూ ఉంటుంది. రెండు లోకాలు అంటే జాగ్రద్, స్వప్నలోకాలు అని తీసుకోవచ్చు లేదా ఇహలోక, పరలోకాలు అని తీసుకోవచ్చు. అంటే జనన–మరణ వృత్తిలో తిరుగుతుంది.

చైతన్యం విషయంలో చాలామందికి సరియైన అవగాహన ఉండదు. ఈ బల్లలో చైతన్యం ఉందా అంటే బల్ల జడం, మనిషిలోనే చైతన్యం ఉంది అంటారు. కాని నిజం ఏమిటి? చైతన్యం సర్వవ్యాపకం! సర్వవ్యాపకమైన చైతన్యం బల్లలో కూడా ఉండాలా లేదా? మరి బల్లలో లేదు అని ఎందుకంటాము? బల్లలో ప్రతిబింబ మాధ్యమం అయిన మనస్సు లేదు. ప్రతిబింబమాధ్యమం లేకపోతే ప్రతిబింబం ఏర్పడదు. అంటే బల్లలో చిదాభాస లేదు కాని చిత్ ఉంది. చిత్‌ను బింబచైతన్యం అంటారు. చిదాభాస లేదు కాబట్టి చిత్ కూడా లేదు అనుకుని పొరపాటు పడుతున్నాము.

ఈ పొరపాటు వేదాంతానికి వచ్చాక కూడా చేస్తాము. బల్లలో చిత్ లేదు కాని సత్ మాత్రమే ఉంది అంటాము. చిత్ లేదని ఎందుకంటామంటే చిదాభాస లేదని చూశాము. నిజానికి సత్ లేనిదే చిత్ లేదు, చిత్ లేనిదే సత్ లేదు. కాని మనం పొరపాటుగా అర్థం చేసుకోవటంవల్ల కాల, దేశపరిమితులు లేని శుద్ధచైతన్యానికి కూడా కాల, దేశపరిమితులు విధిస్తున్నాము.

చిదాభాస బుద్ధితో కలిసి లోకాలకు తిరుగుతుంది. నా సంగతి ఏమిటి? నేను చిత్‌ను. నేను సర్వవ్యాపక చైతన్యాన్ని. నాకు ప్రయాణం లేదు. నేను అది తెలియక నన్ను మనిషిగా భావించుకుని కర్మలు చేసి, ఉత్తరాయణ పుణ్యకాలంలో మరణించాలి అనుకుంటాను. నేను జీవాత్మను, అహంకారాన్ని, ప్రమాతను, కర్తా భోక్తను అంటూ పొరపాటు పడతాను.

కాని ఆత్మ అకర్తా, అభోక్తా. మనకు గీతలో ఆత్మ అకర్తా అని అనేకసార్లు వస్తుంది కాని ఉపనిషత్తుల్లో ప్రత్యక్షంగా ఆత్మ అకర్తా అని రాదు. అందువల్ల శంకరులవారు ఇప్పుడు వచ్చే ఈ పదాలు తీసుకుంటారు.

**ధ్యాయతీవ లేలాయతీవ** – ధ్యాయతి అంటే ధ్యానం చేస్తున్నవాడు అని కాదు. జానాతి అని అర్థం తీసుకోవాలి. జానాతి అంటే తెలుసుకుంటున్నవాడు. లేలాయతి అంటే అక్షరాలా తీసుకుంటే కదులుతున్నవాడు. ఇక్కడ కర్మ చేస్తున్నవాడు అని తీసుకోవాలి.

మనం చేసే పనులన్నింటినీ రెండు తెగల కింద విభజించవచ్చు. అవి జ్ఞానం పొందటం లేదా కర్మ చెయ్యటం. అందువల్ల మన ఇంద్రియాలను రెండు తెగలుగా విభజించారు. అవి – జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు. జ్ఞానేంద్రియాలు తెలుసుకుంటాయి; కర్మేంద్రియాలు పనిని చేస్తాయి. అంతఃకరణం జ్ఞానేంద్రియాలకు తోడ్పడితే పంచప్రాణాలు కర్మ చెయ్యటానికి తోడ్పడతాయి. ఆ విధంగా సూక్ష్మశరీరంలోని 19 అంగాలలో 9 అంగాలు జ్ఞానం పొందటానికి తోడ్పడితే, 10 అంగాలు కర్మ చెయ్యటానికి తోడ్పడతాయి. కాని ఉపనిషత్తు ఈ రెండు కార్యాలూ మిథ్య అంటున్నది. మిథ్య అంటున్నది అని ఎలా చెప్పగలము?

**ఇవ** పదం అక్షరలక్షలు చేసే పదం. ధ్యాయతీవ అంటే నేర్చుకుంటున్నట్లుగా చేస్తోంది; లేలాయతీవ అంటే పని చేస్తున్నట్లుగా చేస్తోంది. అంటే నిజంగా నేర్చుకోవటం లేదు, పని చెయ్యటం లేదు. మరి ఏమి అవుతున్నది? పరమాత్మనైన నేను ఏమీ నేర్చుకోను, ఏమీ పని చెయ్యను. నాకు నేర్చుకునే పని లేదు, కర్మ చేసే పని లేదు.

నా చిదాభాస బుద్ధిలో ఏర్పడి, బుద్ధి పని చేస్తున్నది. ఆ బుద్ధి చేసే పనులను నేను చేస్తున్నాను అనుకుంటున్నాను. చిదాభాసగా నేను బుద్ధితో మమేకం చెందుతున్నాను. నేను చిత్‌ను అని మర్చిపోయి చిదాభాసగా నేను కర్తా అనుకుంటున్నాను. నిజానికి నేను అకర్తను, నేను చిత్ రూపాన్ని, నేను అంతరజ్యోతిని.

**స హి స్వప్నో భూత్వా** – జీవాత్మ (బుద్ధి+చిదాభాస) రూపంలో ఉన్న ఈ పరమాత్మే స్వప్నంగా మారుతాడు. బుద్ధి స్వప్నాన్ని చూడదు, ఎందుకంటే బుద్ధే స్వప్నంగా మారుతుంది. స్వప్నంలో బాహ్యంగా ఉన్న విషయ వస్తువులను చూడలేము. ఎందుకంటే వాటిని చూసే ఇంద్రియాలు పడుకుంటాయి. మనిషి, కారు, కుర్చీ, కొండలు, నదులు, ఏవీ ఉండవు. అందువల్ల కలలో ఏనుగు కనబడితే అది ఏనుగుగా ఆలోచనా రూపం దాల్చిన బుద్ధి, స్వప్నంలో కొండలు బుద్ధి, స్వప్నంలో నదులు బుద్ధి. అందువల్ల బుద్ధి స్వప్నాన్ని చూడదు, బుద్ధి స్వప్నంగా మారుతుంది.

జాగ్రదావస్థకూ, స్వప్నావస్థకూ మధ్య ఉన్న భేదం ఇది. జాగ్రదావస్థలో ప్రపంచం ఆబ్జెక్టు, బుద్ధి సబ్జెక్టు. స్వప్నావస్థలో బుద్ధి ఆబ్జెక్టు. ఎటువంటి బుద్ధి? బుద్ధి రూపంలో బుద్ధి కాదు, స్వప్నప్రపంచం, స్వప్నకాలం, స్వప్నవిషయం రూపంలో బుద్ధి ఉంది. బుద్ధి స్వప్నంలా చూడబడుతుంది కాబట్టి, బుద్ధి స్వప్నాన్ని చూడలేదు. ఇంకో విధంగా చెప్పాలంటే బుద్ధి ఆబ్జెక్టు కాబట్టి బుద్ధి సబ్జెక్టు కాలేదు. అయితే సబ్జెక్టు ఏది? ఎందుకంటే ఆబ్జెక్టు వేరు, సబ్జెక్టు వేరు ఉండాలి. చూసే వ్యక్తి, చూడబడే వస్తువు కాలేదు ఎన్నటికీ. అందువల్ల బుద్ధి ఆబ్జెక్టు కాబట్టి, బుద్ధి సబ్జెక్టు కాదు. బుద్ధిని ఆబ్జెక్టుగా చూసేది సాక్షి చైతన్యం.

స్వప్నంలో బుద్ధి ఆబ్జెక్టు, సాక్షి చైతన్యం సబ్జెక్టు. జాగ్రదావస్థలో బుద్ధి సబ్జెక్టు, ప్రపంచం ఆబ్జెక్టు. సాక్షికీ, బుద్ధికీ చిన్న తేడా ఉంది. రెండూ ద్రష్టలే అయినా బుద్ధి ద్రష్ట (సబ్జెక్టు) అయినప్పుడు అది సవికారద్రష్ట అవుతుంది. అంటే అది మార్పు చెందుతుంది. కాని సాక్షి సబ్జెక్టు అయినా అది మార్పు చెందదు. దాన్ని నిర్వికార ద్రష్ట అంటారు. సాక్షి కర్తగా మారకుండా చూస్తుంది. సాక్షి సన్నిధిలో పని జరుగుతుంది, సాక్షి చెయ్యదు.

జాగ్రదావస్థలో నేను మనస్సు శరీరాలతో మమేకం చెందుతాను. కాని స్వప్నావస్థలో వీటిని వదిలేస్తాను. స్వప్నమనశ్శరీరాలను కార్యకరణసంఘాతం అంటారు. స్వప్నశరీరంలో జాగ్రదావస్థలోని కార్యకరణసంఘాతాన్ని వదిలేస్తాను అనే అంశాన్ని తీసుకుని యాజ్ఞవల్క్యుడు ఒక విషయాన్ని బోధిస్తున్నాడు. ఏమిటది?

ఏదైతే నేను వదులుకోగలనో అది నా అసలు స్వరూపం కాదు. అగ్నికి వేడిగా ఉండటం దాని అసలు స్వభావం. దాన్ని వదులుకోలేదు అగ్ని. కాని నీటిని కాస్తే అది వేడిగా అవుతుంది. కాని ఆ వేడి ఎంతోసేపు ఉండదు. ఎందుకు? వేడిగా ఉండటం నీటి అసలు స్వభావం కాదు కాబట్టి.

అదే విధంగా నా స్థూలశరీరం నా అసలు స్వరూపం అయితే నేను దాన్ని స్వప్నంలో వదులుకోలేను. దీన్నిబట్టి స్థూలశరీరం నేను తాత్కాలికంగా వేసుకునే వేషం అని స్పష్టంగా తెలుస్తున్నది. అదే విధంగా నేను స్వప్నావస్థలో స్వప్నశరీరాన్ని ధరిస్తాను. కాని స్వప్నంనుంచి బయటకు రాగానే ఆ స్వప్న శరీరాన్ని వదులుకుంటాను. అంటే జాగ్రదావస్థలో స్వప్నశరీరం లేదు; స్వప్నావస్థలో జాగ్రద్ శరీరం లేదు. ఈ రెండూ నేను వ్యవహారం నడపటానికి వేసుకునే వేషాలే తప్ప, నా స్వస్వరూపం కాదు.

**మృత్యోః రూపాణి** – యాజ్ఞవల్క్యుడు ఈ శరీరాన్ని అద్భుతంగా నిర్వచించాడు. మృత్యోః రూపాణి అన్నాడు. శంకరులవారు మృత్యోః పదాన్ని అవిద్య లేదా అజ్ఞానంగా తీసుకున్నారు. ఎందుకు? అవిద్యవల్ల మృత్యువు కలుగుతుంది; విద్యవల్ల శాశ్వతత్త్వం వస్తుంది. మృత్యోర్మా అమృతంగమయ. తమస్సు మృత్యువు, జ్యోతి అమృతం. రూపం అంటే ఒక సంకేతం, ఒక గుర్తు.

అజ్ఞానం కంటికి కనబడదు. అజ్ఞానమే కాదు, జ్ఞానం కూడా ప్రత్యక్షం కాదు. కంటికి కనబడని ఈ అజ్ఞానాన్ని, జ్ఞానాన్ని వేరే ప్రమాణంద్వారా గ్రహించాలి. ఏమిటది? అది అనుమాన ప్రమాణం. అనుమానానికి ఒక గుర్తు కావాలి. ఆత్మ అజ్ఞానానికి గుర్తు ఏమిటి? శంకరులవారు ఆత్మ అజ్ఞానానికి గుర్తు శరీరం అంటున్నారు. ఎందుకు? నా పుణ్యపాపకర్మల ఫలితంగా ఈ శరీరం ఏర్పడింది; పుణ్యపాప కర్మలు ఎందుకు చేస్తాను? కర్తృత్వభావన ఉండటంవల్ల. అంటే నేను కర్త అనుకోవటంవల్ల. నేను కర్తా అని ఎందుకు అనుకుంటున్నాను? అజ్ఞానంవల్ల. నిజానికి నేను ఎవరు? అకర్త అయిన ఆత్మను. అంటే మళ్ళీ వెనక్కి వెళితే, నా అజ్ఞానంవల్ల నేను కర్త అనుకుని పనులు చేస్తాను. దానివల్ల నాకు పుణ్యపాపాలు వస్తాయి. పుణ్యపాపాలను అనుభవించటానికి ఈ మానవజన్మ నాకు వచ్చింది.

అందువల్ల మృత్యోః రూపాణిని అజ్ఞానస్య జ్ఞాపకాని అనవచ్చు. అంటే స్థూలసూక్ష్మశరీరం లేదా కార్యకరణ సంఘాతం.

**ఇమం లోకమ్ అతిక్రామతి** – ఇమం లోకం అంటే స్థూలసూక్ష్మశరీరం. స్వప్నంలో స్వప్నలోకంలో ఈ శరీరాన్ని అతిక్రమిస్తాడు.

ఈ మంత్రం సారాంశం ఏమిటి? నేను కార్యకరణసంఘాతానికి భిన్నంగా ఉన్నాను. నేను అకర్తా, అప్రమాతా. నేను ఏమీ చెయ్యను, ఏమీ తెలుసుకోను. స్థూల,సూక్ష్మశరీరాలను నా వ్యవహారాలు నడపటానికి ధరిస్తాను. జాగ్రద్ వ్యవహారం అయ్యాక వాటిని వదిలేస్తాను. అలాగే స్వప్నావస్థలో వేరే స్థూల,సూక్ష్మశరీరాలను నా వ్యవహారాలు నడపటానికి ధరిస్తాను, స్వప్నవ్యవహారం అయ్యాక వాటిని వదిలివేస్తాను. రెండు అవస్థల్లో ఉన్న శరీరాలు వేరు. సుషుప్తిలో ఈ శరీరాలను వదిలేస్తాను.

ఆరు, ఏడు మంత్రాలమీద శంకరులవారు చాలా వివరంగా భాష్యం రాశారు. ఆరవ మంత్రంలో చార్వాక సిద్ధాంతాన్ని, ఏడవ మంత్రంలో బౌద్ధమతాన్ని ఖండించారు శంకరులవారు. ముందుకు సాగేముందు ఆ ఖండనలను చూద్దాము.

## చార్వాక సిద్ధాంత ఖండన

చార్వాకులు, బౌద్ధమతస్థులు నాస్తికవాదులు. అంటే వారు వేదాలను నమ్మరు. అలాంటివారు శ్రుతి ప్రమాణం ఒప్పుకోరు. మామూలుగా వాదనలను శంకరులవారు మూడు ప్రమాణాలుగా చేస్తారు. అవి శ్రుతిప్రమాణం, యుక్తి ప్రమాణం, అనుభవప్రమాణం. కాని ఇక్కడ శ్రుతిప్రమాణం ఉపయోగించలేరు. యుక్తిప్రమాణాన్ని ఉపయోగించగలరు. ముందు యుక్తిప్రమాణం అంటే ఏమిటో చూద్దాము.

యుక్తిప్రమాణాన్ని అనుమానప్రమాణం అని కూడా అంటారు. అనుమానప్రమాణానికి నాలుగు అంశాలు ఉండాలి. అవి పక్షం, సాధ్యం, హేతువు, దృష్టాంతం.

పక్షం అంటే ఏ వస్తువు గురించి మాట్లాడుతున్నామో అది; సాధ్యం అంటే మనం ఊహించిన అంశం; హేతువు అంటే అలా ఊహించటానికి కారణం; దృష్టాంతం అంటే ఉదాహరణ.

**పర్వతః అగ్నిమాన్ ధూమవత్వాత్ పాకశాలవత్**

కొండ వెనుక అగ్ని ఉంది అని పొగవల్ల తెలుస్తున్నది, వంటశాల అనుభవంవల్ల.

ఇది తర్కశాస్త్రంలో ఇచ్చే ప్రధాన ఉదాహరణ.

| | | | |
|---|---|---|---|
| పర్వతం | – పక్షం | – విషయం | – కొండ గురించి |
| అగ్నిమాన్ | – సాధ్యం | – నిర్ణయం | – అగ్ని ఉంది |
| ధూమత్వాత్ | – హేతువు | – కారణం | – పొగ రావటంవల్ల |
| పాకశాలవత్ | – దృష్టాంతం | – ఉదాహరణ | – పూర్వకాలపు వంటశాల |

ఈ అనుమానవాక్యం చెప్పాలంటే, మనకు ఒక ప్రత్యేకమైన జ్ఞానం ఉండితీరాలి. దాన్ని **వ్యాప్తిజ్ఞానం** అంటారు. వ్యాప్తి అంటే రెండు కలిసి ఉండటం. అందువల్ల వ్యాప్తిజ్ఞానం అంటే రెండు కలిసి ఉన్నాయని తెలిపే జ్ఞానం. ఇక్కడ వ్యాప్తిజ్ఞానం ఏమిటి?

**యత్ర యత్ర ధూమః తత్ర తత్ర అగ్నిః**

ఎక్కడెక్కడ పొగ ఉందో, అక్కడక్కడ అగ్ని ఉంటుంది. అంటే అగ్ని–పొగ రెండూ కలిసివుంటాయి. కాని ఈ విషయాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. ఎక్కడెక్కడ అగ్ని ఉందో, అక్కడక్కడ పొగ ఉంటుంది అనకూడదు. ఇప్పటి గ్యాస్‌స్టవ్‌లలో అగ్ని ఉంది కాని, పొగ లేదు. కాని ఎక్కడ పొగ ఉందో, అక్కడ అగ్ని ఉండి తీరుతుంది. నిప్పు లేనిదే పొగరాదు అంటారు.

ఈ వ్యాప్తిజ్ఞానంవల్ల పొగ ఉంటే అగ్ని ఉండి తీరుతుంది. పూర్వకాలపు పాకశాలలో (వంటశాలలో) గమనించటంవల్ల ఈ అనుమాన వాక్యాన్ని చెప్పగలము. కొండ వెనుక అగ్ని ఉంది. ఎందుకు? పొగ కనిపిస్తోంది కాబట్టి. పొగ ఉంటే అగ్ని ఉందని ఎలా తెలుసు? పూర్వకాలపు వంటశాలలో పొగ ఉంటే అగ్ని ఉండి తీరుతుందని గమనించాము కాబట్టి.

ఇలా వ్యాప్తిజ్ఞానంవల్ల అనుమానవాక్యాన్ని చెప్పే సూత్రాన్ని తయారుచేశారు శంకరులవారు.

స్వయంజ్యోతి బ్రాహ్మణాన్ని ఇప్పటివరకూ గమనిస్తే, అందులో నాలుగు విషయాలు తెలుస్తాయి.

1. వ్యవహారాలు నడపటానికి ఒక జ్యోతి కావాలి. నాలుగు జ్యోతుల్లో ఏదైనా ఒకటి. అవి సూర్యుడు, చంద్రుడు, అగ్ని, శబ్దం. దీనివల్ల వ్యాప్తి ఏమిటి?

**యత్ర యత్ర దేహవ్యవహారః దేహ వ్యవహారార్థం జ్యోతి సాధ్యత్వమ్**

ఎక్కడ వ్యవహారం ఉంటే, అక్కడ వ్యవహారం నడపటానికి జ్యోతి కావాలి.

2. వ్యవహారాలు నడపటానికి ఉపయోగపడే జ్యోతి శరీరానికి బాహ్యంగా ఉంది. సూర్యుడు, చంద్రుడు, అగ్ని, శబ్దం శరీరానికి బాహ్యంగా ఉన్నాయి.

**యత్ర యత్ర దేహవ్యవహారత్వం తత్ర తత్ర దేహవ్యతిరిక్తజ్యోతి సాధ్యత్వమ్**

దీనికి ఉదాహరణ జాగ్రదావస్థలో వ్యవహారం నడిచే తీరు. మళ్ళీ అనుమానవాక్యం వివరంగా చూస్తే –

**దేహవ్యవహారః దేహవ్యతిరిక్త జ్యోతి సాధ్యః వ్యవహారత్వాత్ జాగ్రద్ వ్యవహారవత్**

3. ఇదే సూత్రాన్ని స్వప్నప్రపంచానికి కూడా ఉపయోగించవచ్చు. ఇక్కడ కూడా వ్యవహారం నడపటానికి జ్యోతి కావాలి, అది దేహానికి భిన్నంగా ఉంది, కాకపోతే దేహానికి బాహ్యంగా కాకుండా, దేహానికి ఆంతరంగా ఉంది.

**స్వప్న దేహ వ్యవహారః దేహ వ్యతిరిక్త జ్యోతి సాధ్యః వ్యవహారవత్వాత్ జాగ్రద్ వ్యవహారవత్**

4. బాహ్యజ్యోతులు ఇంద్రియ గోచరం. అందువల్ల అవి పాంచభౌతికం, కాని స్వప్నావస్థలోని జ్యోతి ఇంద్రియ అగోచరం. అందువల్ల అది అభౌతికం.

**అనింద్రియగోచరత్వాత్ ఇతి అభౌతికం జ్యోతిః**

ఇది పాంచభౌతిక జ్యోతి కాదు, ఇది చైతన్యజ్యోతి.

అంటే దేహానికి వ్యతిరిక్తంగా ఉన్న ఆంతరజ్యోతి, అభౌతికం జ్యోతి స్వప్నంలో జ్యోతి. ఇది అద్వైత సిద్ధాంతం. దీనికి చార్వాకుల వాదనను చూద్దాము.

**చార్వాక వాదన** – చార్వాకులు ముందు కొన్ని నియమాలు చెబుతున్నారు.

1. అనుమానం ప్రత్యక్షంమీద ఆధారపడి ఉండాలి. ప్రత్యక్షంగా సేకరించిన సమాచారం లేకపోతే, తర్కం ఉపయోగించలేము. కొండ వెనుక పొగ ఉంటే, అక్కడ అగ్ని ఉందని చెప్పవచ్చు. పొగే లేకపోతే అగ్ని ఉందని చెప్పలేము. ఈ రెండూ కలిసి ఉంటాయని ప్రత్యక్షంద్వారా తెలియాలి. దాన్ని వ్యాప్తిజ్ఞానం అంటారు. ఆ జ్ఞానం లేకుండా అక్కడ అగ్ని ఉంది అని చెపితే, అది ఊహాగానం అవుతుంది తప్ప సత్యం కాదు.

ప్రత్యక్షంమీద అనుమానం ఆధారపడుతుంది కాని ప్రత్యక్షం అనుమానంమీద ఆధారపడదు. ప్రత్యక్షం స్వతంత్ర ప్రమాణం అయితే అనుమానం అస్వతంత్రప్రమాణం. సహజంగా అనుమానంకన్నా ప్రత్యక్షం ఎక్కువ శక్తివంతమైనది.

2. ప్రత్యక్షప్రమాణం ప్రబలం, అనుమానప్రమాణం దుర్బలం. అందువల్ల ఈ రెండు ప్రమాణాలూ చెప్పిన విషయాల్లో అంశాలు భిన్నంగా ఉంటే, ప్రత్యక్షప్రమాణానికే విలువ ఎక్కువ ఉంటుంది.

ఈ నియమాలు శంకరులవారికి కూడా తెలుసు. ఇప్పుడు ఈ నియమాలను అనుసరించి చార్వాకులు ఒక వాదన చేస్తున్నారు.

ఎ) **దేహ లక్షణం చైతన్యం** – శంకరులవారు అనుమాన ప్రమాణంద్వారా, దేహ వ్యతిరిక్త చైతన్యం ఉంది అని నిరూపించారు. కాని చార్వాకులు ప్రత్యక్షప్రమాణంద్వారా శరీరం దానంతట అదే చైతన్యమైనది, అందువల్ల చైతన్యం దేహవ్యతిరిక్త చైతన్యం కాదు అని తెలుస్తున్నది అంటున్నారు. శరీరం ఉంటే చైతన్యం ఉంటోంది; శరీరం లేకపోతే చైతన్యం ఉండటం లేదు. శరీరాన్ని ముట్టుకుంటే చైతన్యం తెలుస్తోంది. ఒక వస్త్రానికి దాని రంగు ఎలా దానిలో భాగమో, అలా శరీరానికి చైతన్యం దానిలో భాగం. శరీరానికి పొడుగు, బరువు, రంగులు ఎలా ఉన్నాయో అలా చైతన్యం కూడా ఉంది. ఇది ప్రత్యక్షంద్వారా తెలుసుకున్నాము మేము.

**చార్వాక వాదన** – చైతన్యం శరీరానికి భిన్నంగా లేదు. సిద్ధాంతి సిద్ధాంతం – చైతన్యం శరీరానికి భిన్నంగా ఉంది.

ఇలా రెండు వాదనలు ఒకదానికి ఒకటి భిన్నంగా ఉంటే, దేన్ని తీసుకోవాలి? వాటి ప్రమాణాలను గమనించాలి. చార్వాకుల ప్రమాణం ప్రత్యక్ష ప్రమాణం; సిద్ధాంతి ప్రమాణం అనుమాన ప్రమాణం. ఈ రెండింటిలో అనుమానం ప్రత్యక్షంమీద ఆధారపడి ఉంటుందనీ, ప్రత్యక్షం ప్రబలప్రమాణమనీ, అనుమానం దుర్బలప్రమాణమనీ, దుర్బలప్రమాణం ప్రత్యక్షప్రమాణం ముందు వీగిపోతుందనీ చూశాము. అందువల్ల మేము చెప్పిందే సబబు అంటారు చార్వాకులు.

**శంకరులవారి జవాబు – స్వప్నః స్మృతిః న సంభవతః** – ఒకవేళ చార్వాకులు చెప్పింది నిజమే అనుకుంటే, అప్పుడు స్వప్నం, జ్ఞాపకాలు సంభవం కాదు. ఎందుకంటే స్వప్నంలోనూ, జ్ఞాపకాలను వెలికి తెచ్చుకోవటంలోనూ మనం ఈ శరీరాన్ని, ఇంద్రియాలను వాడటం లేదు.

కలలో ఈ స్థూలశరీరం వాడటం లేదు కాని కలలో కూడా శబ్ద, స్పర్శలాంటి అనుభవాలను అనుభవిస్తాము. నిజానికి జాగ్రద్ ప్రపంచంలో నడిపినట్టే ప్రతి వ్యవహారమూ నడుపుతాము. కల నిజం కాదు కదా అనకండి. కల నిజం కాదని ఎప్పుడు తెలుస్తుంది? నిద్రనుంచి లేచాక! కాని స్వప్నంలో ఉన్నంతసేపూ స్వాప్నికునికి స్వప్నం ఒక స్వప్నమని తెలియదు. కలలో వ్యవహారాలన్నీ నడుపుతాడు, అనేక అనుభవాలు పొందుతాడు. గుడ్డివాడు కలలో అనేక వస్తువులను చూస్తాడు. శరీరం మాత్రమే చైతన్యతత్త్వం అయితే, స్వప్నం సంభవం కాదు.

ఇదే సూత్రం జ్ఞాపకాలకు కూడా వర్తిస్తుంది. జ్ఞాపకాలలో జీవించటం ఒక పగటికల లాంటిదే. అందులో కూడా అనేక అనుభవాలను పొందుతాము. ఏడాది కిందట మనను తిట్టిన మనిషి మాటలు గుర్తు తెచ్చుకుంటే, నిజంగా ఆ మనిషి మన కళ్ళముందు నిలుచుని మళ్ళీ తిడుతున్నంత ఆవేశం కలుగుతుంది. మళ్ళీ కోపంతో మండిపడతాము. శరీరం లేకపోయినా ఇవి జరుగుతున్నాయి అంటే శరీరానికి భిన్నంగా ఇంకేదో ఉంది.

అన్నిటికన్నా ముఖ్యమైనది, ఒకవేళ శరీరలక్షణమే చైతన్యం అయితే, మరణం సంభవించకూడదు. చైతన్యం శాశ్వతమైనది కాబట్టి శరీరం దాని చైతన్యాన్ని ఎన్నటికి కోల్పోలేదు. కాని ఒక వ్యక్తి మరణించగానే అతని కళ్ళు, హృదయం, కాలేయంలాంటి అవయవాల్లో చైతన్యం ఉంటుంది కాని శరీరం నిర్వీర్యం అయిపోతుంది. దీన్నిబట్టి చైతన్యం శరీరంయొక్క లక్షణం కాదు.

**చార్వాకుల వాదన**

బి) **ఇంద్రియాలు చైతన్యం** – శరీరం చైతన్యం కాకపోతే ఇంద్రియాలను చైతన్యంగా తీసుకోవచ్చు కదా! శరీరానికి భిన్నంగా ఉన్న ఆత్మను ఎందుకు తీసుకురావాలి మధ్యలో?

**శంకరులవారి జవాబు** – ఇంద్రియాలు చైతన్యమవటానికి వీలులేదు. కన్ను చూసేదాన్ని చెవులు తెలుసుకోలేవు; చెవులు తెలుసుకునేవాటిని ముక్కు తెలుసుకోలేదు. అందువల్ల ఈ పంచజ్ఞానేంద్రియాలను కలిపే సామాన్య అంశం లేదు. వినే ఇంద్రియం రాయలేదు; రాసే ఇంద్రియం వినలేదు, కాబట్టి ఈ రెండింటి మధ్యా సమానంగా ఉన్న వేరే అంశం ఏదో ఉండాలి. నేను వింటున్నాను, నేను వాసన చూస్తున్నాను, నేను తింటున్నాను – ఇలా చెప్పే నేను, ఆ ఇంద్రియాలకు భిన్నంగా ఉంది. అందువల్ల ఇంద్రియాలు చైతన్యం కాదు.

**చార్వాకుల వాదన**

సి) **చైతన్యం భౌతికం** – సరే, శరీరానికి భిన్నంగా ఉన్న జ్యోతి ఉంది, ఒప్పుకుంటాము. కాని అది బాహ్యజ్యోతులలాగా భౌతికజ్యోతిగా ఎందుకు తీసుకోకూడదు. దానికి ఒక సూత్రం కూడా ఉంది – **సమాన జాతీయ ఏవ ఉపకార్య ఉపకారక భావః**. రెండు అంశాలు కాని, ఇద్దరు వ్యక్తులు కాని ఒకరికొకరు సహాయం చేసుకోవాలంటే వారిద్దరు ఒకేజాతికి లేదా ఒకేలాంటి జాతికి చెందినవారై ఉండాలి. ఉదాహరణకు కళ్ళు విషయాలను చూస్తున్నాయి. కళ్ళు చూడాలంటే వాటికి సూర్యకాంతి తోడుకావాలి. అంటే కళ్ళు ఉపకార్యం (ఉపకారం పొందుతున్నవి), సూర్యకాంతి ఉపకారకం (ఉపకారం చేసేది). రెండూ భౌతికాలే, రెండూ వస్తువులే. సూర్యుడు లేనప్పుడు చంద్రకాంతిలో చూస్తాయి కళ్ళు. అది కూడా భౌతికమే. సమానజాతికి చెందుతాయి.

స్వప్నంలో ఆంతరజ్యోతి దేవవ్యవహారానికి తోడ్పడుతుంది. అంటే దేహం ఉపకార్యం, ఆంతరజ్యోతి ఉపకారకం. దేహం పాంచభౌతికం కాబట్టి, ఆంతరజ్యోతి కూడా పాంచభౌతికం అవాలి.

**శంకరులవారి జవాబు** – ఒకరికొకరు తోడ్పడటానికి ఒకేజాతికి చెంది ఉండాలనే నియమమేమీ లేదు. దానికి అనేక ఉదాహరణలు ఉన్నాయి. అగ్నిని రాజేయటానికి నూనె వాడతాము. నూనె పృథివీతత్త్వానికి చెందినది, మంట అగ్నితత్త్వానికి చెందినది. అంటే ఒకటి పార్థివం, ఇంకొకటి ఆగ్నేయం, అంటే రెండు భిన్నభూతాలకు చెందినవి. అయినా ఒకదానికొకటి తోడ్పడతాయి. అలాగే వాన కురిసినప్పుడు, మెరుపు మెరుస్తుంది. వాన జలతత్త్వం, మెరుపు అగ్నితత్త్వం, రెండూ భిన్నభూతాలకు చెందినవి, అయినా ఒకదానికొకటి తోడ్పడతాయి.

ఇంకో ముఖ్యమైన ఉదాహరణ మనమే! మనుష్యులమైన మనం తోటి మానవులనుంచి సహాయం పొందుతాము. అంతేనా? ఆవునుంచి పాలు పొందుతాము. ఆవు పశుజాతికి చెందింది, మనం మానవజాతికి చెందినవారము; చెట్లు ఆహారాన్ని ఇస్తాయి. చెట్లు వృక్షజాతికి చెందుతాయి, మనం మానవజాతికి చెందుతాము. అయినా అవి మనకు తోడ్పడతాయి.

ఈ సూత్రం ప్రకారం అభౌతిక చైతన్యం భౌతిక వ్యవహారం నడపటానికి తోడ్పడగలదు.

దేహ వ్యతిరిక్త ఆంతర చైతన్యమ్ అస్తి

ఆరవ మంత్రంలోని అంశంమీద ఇప్పటిదాకా చార్వాక మతఖండన చూశాము.

## బౌద్ధమత ఖండన

బౌద్ధమతస్థులు కూడా శ్రుతిని నమ్మరు. వారిని నాస్తికులు అంటారు. అందువల్ల వారి వాదనను యుక్తితో, అనుభవంతో ఖండించాలి. కాని వారి మత ఖండన చూసేముందు బౌద్ధమతం గురించిన కొన్ని ప్రాథమిక అంశాలు తెలుసుకోవాలి మనం.

దర్శనాలలో ఆరు నాస్తిక దర్శనాలు ఉన్నాయి. అవి చార్వాకదర్శనం, జైనదర్శనం, నాలుగు బౌద్ధమత దర్శనాలు. ఈ నాలుగు బౌద్ధమత దర్శనాలు – వైభాషిక మతం, సౌత్రాంతిక మతం, యోగాచారమతం, మాధ్యమిక మతం. వీటి మధ్య చిన్న భేదాలున్నాయి. మనం ప్రస్తుతం రెండు అంశాలే చూస్తాము. అవి సబ్జెక్టుమీద, ఆబ్జెక్టుమీద వారి వాదనలు.

ముందుగా ఆబ్జెక్టు గురించిన వారి వాదనను చూద్దాము.

ఆబ్జెక్టు అంటే బాహ్యప్రపంచం లేదా జగత్తు.

| సంఖ్య | మతం | వాదన |
|---|---|---|
| 1. | వైభాషిక మతం | జగత్తు సత్యం, కంటికి కనబడుతుంది |
| 2. | సౌత్రాంతిక మతం | జగత్తు సత్యం, కాని అనుమానంద్వారానే తెలుసుకోగలము |
| 3. | యోగాచార మతం | జగత్తు సత్యం కాదు |
| 4. | మాధ్యమిక మతం | జగత్తు సత్యం కాదు |

ఆబ్జెక్టు విషయంలో మూడు, నాలుగు మతాల వాదన ఒక్కటే. జగత్తు సత్యం కాదు అంటారు. మనం కూడా జగత్తు సత్యం కాదనే చెబుతాము.

ఇప్పుడు సబ్జెక్టు గురించిన వారి వాదనలను చూద్దాము. సబ్జెక్టు అంటే చూసే నేను. వైభాషిక మతం వారూ, సౌత్రాంతిక మతం వారూ, యోగాచారమతం వారూ కూడా సబ్జెక్టు చైతన్యం అంటారు. కాని మాధ్యమిక మతం వారు మాత్రం సబ్జెక్టు శూన్యం లేదా అసత్యం అంటారు. అంటే సబ్జెక్టు గురించి మొదటి ముగ్గురూ చైతన్యం సబ్జెక్టు అంటారు. దాన్ని విజ్ఞాన ఆత్మ అంటారు వారు.

**వైభాషిక, సౌత్రాంతిక మతాల వాదన**

ఎ) **క్షణిక విజ్ఞానం** – వీరి వాదనను క్షణిక విజ్ఞానవాదన అంటారు.

విజ్ఞానం ఏకం క్షణం ఏవ తిష్టతి

విజ్ఞానం ఒక్క క్షణం మాత్రమే ఉంటుంది. ఈ వాదనను వైభాషిక, సౌత్రాంతిక, యోగాచారమతస్థులు చేస్తారు.

బి) **ప్రవాహ రూపం** – ఈ క్షణిక విజ్ఞానం ప్రవాహం రూపంలో ఉంటుంది. ఒక చైతన్యం ఇప్పుడు ఉంటుంది, మరుక్షణంలో ప్రవాహంలో వెళ్ళిపోయి, ఇంకొక చైతన్యం వస్తుంది. ఉదాహరణకు నదిని చూస్తే, నది ప్రవహిస్తూనే ఉంటుంది. అంటే ఈ క్షణంలో మనం చూసిన నీరు మరుక్షణంలో ఉండదు. అది ప్రవాహంలో వెళ్ళిపోతుంది. వేరే నీరు వస్తుంది. కాని ప్రతిప్రవాహం కూడా ఒకే నదికి చెందినది. ఆ విధంగా నేను అప్పుడూ, ఇప్పుడూ కూడా చైతన్యమే; కాని ఈ చైతన్యం క్షణికం.

మనమూ విజ్ఞానం ఆత్మ అంటాము. కాని వారు క్షణిక విజ్ఞానం ఆత్మ అంటారు. అంటే వారి ఉద్దేశంలో బుద్ధి ఆత్మ.

క్షణిక విజ్ఞానప్రవాహం అంటే అది బుద్ధే. బుద్ధిలోనే నిరంతరంగా ఆలోచనల ప్రవాహం ఉంటుంది, ఆలోచనల ప్రవాహంతో బాటు నిరంతరంగా జ్ఞానప్రవాహం కూడా ఉంటుంది. ప్రతి ఒక్క ఆలోచనా జ్ఞానంతో కూడి ఉంటుంది. అందువల్ల జ్ఞాన ప్రవాహం = ఆలోచనల ప్రవాహం; ఆలోచనల ప్రవాహం = బుద్ధి; అందువల్ల క్షణిక విజ్ఞాన ప్రవాహం = బుద్ధి. ఇదీ బౌద్ధమతస్థుల వాదన.

## వైభాషిక, సౌత్రాంతిక మతాల ఖండన – భాగం 1

**శంకరులవారి వాదన** – బుద్ధి ఆత్మ కాదు, ఎందుకంటే బుద్ధిని ఆబ్జెక్టుగా చూసే సబ్జెక్టు ఇంకొకటి ఉంది. ఇంకో విధంగా చెప్పాలంటే బుద్ధి బాహ్యప్రపంచ పరంగా చూస్తే సబ్జెక్టు కానీ, అది ఆత్యంతికం కాదు. బుద్ధిని చూసేది ఇంకొకటి ఉంది. అది బుద్ధికి భిన్నంగా ఉంది. అది ఆత్మ. దీనికొక అనుమానవాక్యాన్ని ఇస్తున్నారు శంకరులవారు.

**బుద్ధిః స్వ ఇతర భాసకవతీ భాసత్వాత్ ఘటవత్**

బుద్ధిని ప్రకాశింపచేసే ప్రకాశం ఇంకోటి ఉంది. అది బుద్ధికి భిన్నంగా ఉంది. కుండ ఉదాహరణ ప్రకారం అది తెలుస్తుంది.

ఉదాహరణకు కుండను తీసుకుంటే కుండను ప్రకాశింపజేసేది కాంతి. కాంతి కుండకు భిన్నంగా ఉంది. ఇదే సూత్రాన్ని బుద్ధికి ప్రయోగించి చూడండి. బుద్ధి కుండలాగా ప్రకాశింపబడుతున్నది, అంటే బుద్ధికి భిన్నంగా దాన్ని ప్రకాశింపజేసే సబ్జెక్టు ఉండాలి.

**వైభాషిక సౌత్రాంతికుల జవాబు** – కుండ ఉదాహరణను తీసుకోకూడదు మీరు. ఎంతసేపూ మీకు వీలుగా ఉన్న ఉదాహరణనే తీసుకుంటారు. మేము వేరే ఉదాహరణ తీసుకుంటాము. అది కాంతి ఉదాహరణ. కాంతి తక్కిన వస్తువులను ప్రకాశింపజేయటమే కాక, తనను తాను ప్రకాశింపజేసుకుంటుంది. అందువల్ల కాంతి తనను తాను ప్రకాశింప జేసుకుంటూ, తక్కిన వస్తువులను కూడా ప్రకాశింపజేస్తుంది. అదే సూత్రం బుద్ధికి కూడా వర్తిస్తుంది. అంటే బుద్ధి బాహ్యాపపంచాన్నీ ప్రకాశింపజేస్తుంది, తనను తానూ ప్రకాశింపజేసుకుంటుంది. అందువల్ల ఇంకో ఆత్మతో పనిలేదు. వారి అనుమానవాక్యం –

**బుద్ధి స్వపర భాసికా భాసకత్వాత్ దీపవత్**

బుద్ధి తనను తాను ప్రకాశింపజేసుకుంటుంది, తక్కినవాటిని కూడా ప్రకాశింపజేస్తుంది కాంతి లేదా దీపంలాగా.

**శంకరులవారి జవాబు** – దీపం తనను తాను ప్రకాశింపజేసుకుంటుంది అనే వాదన తప్పు. దానిలో మూడు దోషాలున్నాయి. అవి **కర్తృకర్మ విరోధః, ఆవృత అనావృత విశేష అభావాత్, బుద్ధి ప్రకాశింపజేస్తుంది, ప్రకాశింపబడుతుంది.**

ఎ) **కర్తృకర్మ విరోధః** – దీపం తనను తాను ప్రకాశింప జేసుకుంటూ ఇతర వస్తువులను ప్రకాశింపజేస్తుందంటే, దీపమే సబ్జెక్టు, ఆబ్జెక్టు అవాలి. సబ్జెక్టును కర్త అనీ, ఆబ్జెక్టును కర్మ అనీ అంటారు. ప్రకాశింపజేసేది కర్త, ప్రకాశింపబడేది కర్మ. రెండూ దీపమే అనే వాక్యం తర్కానికి భిన్నంగా ఉంది. ఎందుకంటే ఒకే వస్తువు కర్తా, కర్మా అవలేదు. అన్నిటినీ చూసే కన్నులు తమను తాము చూసుకోలేవు. అంటే కన్నులు కర్త, వస్తువులు కర్మ. కన్నులు ఎన్నటికీ కర్మ కాలేవు. దీన్ని కర్తృకర్మ విరోధం అంటారు.

బి) **ఆవృత అనావృత విశేష అభావాత్** – దీపం ఒక వస్తువును ప్రకాశింపజేస్తుంది అంటే దాని అర్థం ఏమిటి? అంతకు ముందు ఆ వస్తువు ప్రకాశింపబడటం లేదు కదా! అంటే ఉదాహరణకు ఒక కుండను తీసుకుందాం. అక్కడ కుండ ఉన్నా, అక్కడ చీకటిగా ఉంది. కుండ ఉందని తెలియటం లేదు. అంటే అది చీకటిలో ఆవృతమై ఉంది. ఇప్పుడు అక్కడ ఒక దీపాన్ని పెట్టాము. ఆ దీపం అక్కడి చీకటిని పారద్రోలి, ఆవృతంగా ఉన్న కుండను అనావృత ఘటంగా చేసింది. అంటే కనబడకుండా ఉన్న కుండను ప్రకాశింపజేయటంవల్ల, ఆవృత అవస్థనుంచి అనావృత అవస్థకు మారుతుంది. దీపం కుండను ప్రకాశింపజేస్తుంది అంటే కుండను ఆవృతంనుంచి అనావృతం చేస్తుంది.

ఇప్పుడు ఈ సూత్రాన్ని దీపానికి అన్వయిద్దాము. దీపం తనను తాను ప్రకాశింపజేసుకుంటుంది అన్నారు బౌద్ధమతస్థులు. **ప్రకాశింపజేసుకుంటుంది** పదం క్రియాపదం, అంటే ఒక పని, ఒక సమయంలో జరిగినట్టు. దీపం ప్రకాశించక ముందు దీపం ఆవృతంగా ఉండాలి, ప్రకాశించాక దీపం అనావృతమవాలి. ప్రకాశింపబడే ఏ వస్తువుకన్నా రెండు అవస్థలు ఉండాలి – ఆవృత అవస్థ, అనావృత అవస్థ. కాని దీపానికి ఆవృత అనావృత

అవస్థా భేదాలు లేవు. అందువల్ల **ఆవృత అనావృత విశేష అభావాత్**, దీపం తనను తాను ప్రకాశింపజేసుకుంటుంది అనకూడదు.

ఆత్మ విషయంలో కూడా ఆత్మ తనను తాను తెలుసుకుంటుంది అనకూడదు. ఆత్మ గురించి శ్రవణంలో తెలుసుకుని, మననంలో అర్థం చేసుకుని, నిదిధ్యాసనంలో నిర్వికల్ప సమాధికి చేరి ఆత్మ గురించి తెలుసుకోవాలి అనుకుంటారు కొంతమంది. ఆత్మ గురించి మనం తెలుసుకోలేము. ఇవే కారణాలు – కర్తృకర్మ విరోధః, ఆవృత అనావృత విశేష అభావాత్.

సి) **బుద్ధి ప్రకాశింపజేస్తుంది, ప్రకాశింపబడుతుంది** – దీపం ఉదాహరణే తీసుకుందాం. దీపం ఏం చేస్తుంది? తక్కిన వస్తువులను ప్రకాశింపజేస్తుంది. కాని ఆ దీపాన్ని తెలుసుకోవాలంటే, చైతన్యంవల్లనే తెలుసుకోవాలి. అంటే దీపానికి భిన్నంగా కర్త, ప్రమాత వేరే ఉంది. ఇదే సూత్రాన్ని బుద్ధికి ఉపయోగిద్దాము – బుద్ధి బాహ్యప్రపంచాన్ని తెలుసుకుంటుంది, ప్రకాశింపజేస్తుంది. కాని ఆ బుద్ధిని తెలుసుకోవాలంటే చైతన్యంవల్లనే తెలుసుకోవాలి.

తను ప్రకాశింపజేసినా, చైతన్యంవల్ల తాను ప్రకాశింపబడుతుంది.

**బుద్ధిః స్వ ఇతర భాసకవతీ భాసకత్వేతి భాస్యత్వాత్ దీపవత్**

**వైభాషిక సౌత్రాంతిక ప్రశ్న – అనవస్థా దోషః** – శంకరులవారి జవాబు ప్రకారం దీపం వస్తువులను ప్రకాశింపజేస్తుంది, దీపాన్ని బుద్ధి ప్రకాశింపజేస్తుంది. బుద్ధికి భిన్నంగా ఉన్న ఆత్మ బుద్ధిని ప్రకాశింపజేస్తుంది. అంటే అప్పుడు ఆత్మను ఇంకొక వస్తువు ప్రకాశింపజేయాలి. అలా ఒక వస్తువును ఇంకొక వస్తువు ప్రకాశింపజేయాలి అని చెబుతూపోతే దాన్ని అనవస్థా దోషం అంటారు. ఇంగ్లీషులో ఇన్‌ఫినిట్ రిగ్రెస్ అంటారు.

**ఆత్మ ఇతర భాసకవాన్ భాసకవత్వాత్ దీపవత్**

దీపం లాగా ఆత్మను ప్రకాశింపజేసేది ఇంకొకటి ఉండాలి కదా! ఇదీ వారి ప్రశ్న.

**శంకరులవారి జవాబు – ఆత్మ స్వయంప్రకాశక జ్యోతి** – ఆత్మకు అనవస్థా దోషం ఉండదు. ఎందుకు? తక్కిన వస్తువులన్నీ ఏదో ఒకదానివల్ల ప్రకాశింపజేయబడాలి, అందువల్ల వాటిని ప్రకాశింపజేసేది ఒకటి కావాలి. కాని ఆత్మను ఎన్నడూ ప్రకాశింపజేయనవసరం లేదు, అందువల్ల దానికి విడిగా ప్రకాశింపజేసే కర్త అవసరం లేదు. ఆత్మను ప్రకాశింపజేయనవసరం లేదు అంటే ఆత్మ ఏమిటి? ఆత్మ స్వయంప్రకాశక జ్యోతి.

ఆత్మ తనను తాను ప్రకాశింపజేసుకుంటుంది అనటం లేదు, జాగ్రత్తగా గమనించండి; ఆత్మను వేరే వస్తువు ప్రకాశింపజేయ నవసరం లేదు అంటున్నాము. ఎందుకంటే ఆత్మే **ప్రకాశకం**. అంటే స్వయంప్రకాశక జ్యోతి. అందువల్ల ఆత్మకు అనవస్థాదోషం అంటదు.

**వైభాషిక, సౌత్రాంతిక ప్రశ్న – కరణ అనవస్థాదోషః** – కర్త, కర్మను చూడాలంటే ఒక కరణాన్ని వాడాలి. కరణం అంటే పరికరం. ఇంకో మాటలో చెప్పాలంటే ఒక ప్రమాత, ఒక ప్రమేయాన్ని చూడాలంటే ఒక ప్రమాణాన్ని వాడాలి.

కన్ను వస్తువును చూడాలంటే కాంతిని వాడాలి
బుద్ధి వస్తువును చూడాలంటే కన్నునో, వృత్తినో వాడాలి

ఆత్మ బుద్ధిని చూడాలంటే ఆత్మకు కరణం లేదు. ఒకవేళ ఉంటే, ఆ కరణాన్ని చూడటానికి ఇంకో కరణాన్ని వాడాలి. అదలా సాగిపోతుంది. దీన్ని కరణ అనవస్థా దోషం అంటారు.

**శంకరులవారి జవాబు – కరణ నిరపేక్షః** – ఒక వస్తువును చూడటానికి కరణం ఉండి తీరాలని నియమమేమీ లేదు. అందువల్ల కరణ అనవస్థా దోషం ఉండదు.

కన్ను వస్తువును చూడాలంటే కాంతిని వాడాలి – నిజమే
కన్ను కర్త, వస్తువు కర్మ, కాంతి కరణం అయ్యాయి.

కన్ను కాంతిని చూడాలంటే కరణం అవసరం లేదు. కన్ను కర్త, వస్తువు కాంతి అయ్యాయి. కాంతిని చూడటానికి వేరే కరణాన్ని దేన్ని వాడుతోంది కన్ను? కాంతిని కన్ను ప్రత్యక్షంగా చూస్తోంది. అంటే కరణం ఉండి తీరాలని లేదు. గుడ్లగూబలు కాంతి అనే కరణం లేకుండానే చూస్తున్నాయా, లేదా?

ఆ విధంగా ఆత్మ బుద్ధిని కరణం లేకుండా చూస్తుంది. ఇక్కడితో వైశేషిక, సౌత్రాంతిక మతఖండనం అయింది.

### యోగాచార మత ఖండన

**యోగాచార మతం – క్షణిక విజ్ఞాన వాదన** – యోగాచారుడు, వైశేషిక, సౌత్రాంతిక మతవాదనలను సమర్థించడు. దీపం ఉదాహరణను అతను ఒప్పుకోడు. దీపం ఉదాహరణలో ఆవృతఘటం, అనావృత ఘటంవంటి విషయాలు ఉన్నాయి కదా. యోగాచారమతస్థులు అసలు బాహ్యప్రపంచాన్నే ఒప్పుకోరు. బాహ్యప్రపంచమే లేనప్పుడు, బాహ్యప్రపంచంలో ఉండే కుండ ఉదాహరణ ఎలా పనికివస్తుంది? వైశేషిక, సౌత్రాంతిక మతస్థులు బాహ్యప్రపంచం ఉందని ఒప్పుకుంటారు కాని యోగాచారులు ఒప్పుకోరు. వారిది క్షణిక విజ్ఞాన ప్రవాహం.

బాహ్యప్రపంచం లేదని ఎలా అనగలము? దానికి వారు జవాబు చెప్పరు కాని, మనం మన స్వప్నవృత్తాంతం తీసుకుంటే ఆ విషయాన్ని అర్థం చేసుకోగలం. మన స్వప్నప్రపంచం నిజంగా ఉందా? మనం కలలో చూసి, మనను భయపెట్టే పులి నిజంగా ఉందా? లేదు, అది మన మనస్సు చూపిన ఆలోచన! అలాగే కలలో బాహ్యంగా ఒక పెద్ద కొండను చూస్తే కొండ నిజంగా ఉందా? లేదు, అది మన మనస్సు చూపిన కొండ; వారు జగత్తు లేనేలేదు అంటారు. మనం ప్రపంచాన్ని చూస్తున్నామంటే అది మన ఆలోచనల ప్రవాహం అంటారు.

**శంకరులవారి జవాబు** – క్షణిక విజ్ఞాన వాదనను శంకరులవారు అనేక విధాలుగా ఖండిస్తారు. అందులో కొన్ని చూద్దాము.

ఎ) **సర్వ వ్యవహారలోపః** – ఏ వ్యవహారమూ నడవదు. వారి బోధ కూడా నడవదు. ఎందుకు? సాధ్యంకోసం కొన్ని సాధనలు ఇస్తున్నాడు వారి గురువు. కాని వారి మతంలో సాధనం క్షణిక విజ్ఞానమే; సాధ్యం క్షణిక

విజ్ఞానమే. ఏదైనా క్షణమే ఉంటే సాధనభేదం, సాధ్యభేదం ఎలా తెలుస్తుంది? అటువంటి వారితో అద్వైత మతస్థులు వాదించనవసరం లేదు. ఎందుకంటే ఒకరు వాది, ఇంకొకరు ప్రతివాది అవుతారు. ఇద్దరూ క్షణంలో మాయమవుతూ ఉంటే వాదప్రతివాదభేదం ఉండదు.

సాధన సాధ్య భేద అభావః వాది ప్రతివాది భేద అభావః

క్షణంలో వెళ్ళిపోతుంటే, ఎవరు ఎవరితో వాదిస్తారు? అందువల్ల ఈ క్షణిక విజ్ఞానప్రవాహంలో వ్యవహారం నడపలేము.

బి) **ప్రత్యభిజ్ఞ దోషః** – ప్రత్యభిజ్ఞ అంటే గుర్తించటం. ఇంగ్లీషులో దీన్ని రికగ్నిషన్ (recognition) అంటారు. ఆ పదంలోనే అర్థం ఉంది (re-cognition) దేన్ని గుర్తిస్తాము? ఒకసారి చూసిన వస్తువును గుర్తిస్తాము. నేను ఒక వ్యక్తిని గుర్తించాను అని చెపితే, ఆ వ్యక్తిని అంతకు ముందు చూశాను అని అర్థం. దీనికి, జ్ఞాపకానికి మధ్య తేడా ఉంది. జ్ఞాపకంలో వస్తువు మనముందు ఉండదు, దాన్ని గుర్తు తెచ్చుకుంటాము, అంతే. చనిపోయిన వ్యక్తిని గుర్తు తెచ్చుకుంటాము. గుర్తు పట్టటంలో వస్తువు మనముందు రెండోసారి ఉంటుంది. మొదటిసారి చూసిన వస్తువును రెండోసారి చూస్తే గుర్తు పడతాము. అంటే ఆ వ్యక్తి జీవించే ఉన్నాడు. అంతేకాదు చూసే నేను కూడా జీవించే ఉన్నాను.

ఒక వస్తువును లేదా మనిషిని గుర్తుపట్టాను అంటే, ఆ వస్తువు లేదా మనిషి ఇంకా ఉన్నారు, గుర్తుపట్టిన నేను కూడా ఉన్నాను అంటే కర్త, కర్మ రెండూ కొనసాగుతున్నాయి. కాని క్షణిక విజ్ఞానంలో రెండూ కొనసాగే అవకాశం లేదు. ఒక వస్తువును మొదటిసారి చూడటాన్ని ప్రత్యక్షం అంటారు. రెండోసారి చూడటాన్ని గుర్తించటం అంటారు. ప్రత్యక్షం అప్పటి కాలాన్నే సూచిస్తుంది, గుర్తించటం అప్పటి కాలాన్నే కాదు, దాన్ని గతంతో కూడా పెనవేస్తుంది. ఆ వస్తువు గతంలోనూ ఉంది, ఇప్పుడూ ఉంది అంటే ఇంకా కొనసాగుతూనే ఉంది.

కాని యోగాచారమతం ప్రకారం గుర్తింపు ప్రశ్నే లేదు. అసలు ముందు వారు బాహ్యప్రపంచాన్నే అంగీకరించనప్పుడు బాహ్యప్రపంచంలో ఉండే వస్తువు శాశ్వతమా, అశాశ్వతమా అనే ప్రశ్నకు ఆస్కారమే లేదు. వారి ఉద్దేశంలో బాహ్యవస్తువు క్షణిక విజ్ఞానం. బాహ్యంగా వస్తువు లేదు. వారి ఆలోచన చెబుతున్నది కాబట్టి వస్తువు ఉంది. ఆ ఆలోచన కూడా క్షణం మాత్రమే ఉంటుంది. అలాంటప్పుడు గుర్తింపుకు చోటేది?

సోఽయం దేవదత్తః – సః అయం దేవదత్తః. సంస్కృతంలో గుర్తించటానికి ఈ ఉదాహరణ చెబుతారు. సః, అయం రెండూ దేవదత్త అనే నామవాచకానికి విశేషణాలు. సః అంటే గతంలోని దేవదత్త, అయం అంటే ఇప్పటి దేవదత్త ఇద్దరూ ఒకరే. అతనే ఇతను అనాలంటే అప్పుడున్న దేవదత్తే ఇప్పుడూ ఉండాలి కదా!

**యోగాచారుల జవాబు** – శంకరులవారు ఏమంటున్నారు? ఆ దేవదత్తే ఇతను అనాలంటే అప్పుడున్న దేవదత్తే ఇప్పుడూ ఉండాలి, కాని యోగాచార్యులు ఏమంటారు? ఆ దేవదత్తను మేమూ గుర్తిస్తాము కాని, ఆ దేవదత్తే ఇప్పుడూ ఉన్నాడు అనము అంటారు. అంటే అతనే కొనసాగడు అని అర్థం. అంటే వారి ఉద్దేశంలో ఇద్దరు దేవదత్తలు ఉన్నారు. గతంలో ఒక దేవదత్త ఉన్నాడు. ఆ క్షణంలో అతని గురించి తెలిసింది; ఇప్పుడు ఇంకొక దేవదత్త ఉన్నాడు. ఇప్పుడు ఈ క్షణంలో ఇతని గురించి తెలిసింది.

వారు ఇద్దరు దేవదత్తులు అయితే, ఆ దేవదత్తే ఈ దేవదత్త అని ఎలా చెప్పగలవని మనం ప్రశ్నిస్తే, దానికి వారి జవాబు – ఇద్దరూ ఒకరిని పోలి ఒకరు ఉన్నారు. గతంలో దేవదత్త గతంలోనే వెళ్ళిపోయాడు, ఇప్పటి దేవదత్త ఇప్పుడు వచ్చాడు. కాని ఇద్దరినీ పోల్చుకుంటున్నాము అంటే, వారిద్దరికీ పోలికలు ఉన్నాయి అంటారు వారు. ఏడు గంటలకు ఒక గడియారాన్ని చూస్తే, అది వెళ్ళిపోతుంది. ఎనిమిది గంటలకు ఇంకొకటి వస్తుంది. అవి రెండూ వేరువేరు గడియారాలు, కాని వాటికి పోలికలు ఉన్నాయి అంటారు యోగాచారులు.

పైగా వారి వాదన ఏమిటంటే, అలా పోలికలు ఉండటంవల్ల అదే వస్తువు కొనసాగుతున్నదన్న భ్రమలో మీరు ఉన్నారు అంటారు. ఒక వస్తువును గుర్తిస్తున్నాము అనుకోవటం మీ భ్రమ. ఆ వస్తువు శాశ్వతంగా ఉంటే కదా గుర్తించటానికి. పోలికని చూసి మీరు ఈ వస్తువు, అప్పటి వస్తువు అనుకుంటున్నారు అంతే అంటారు వారు.

**శంకరులవారి ఖండన**

సి) **సాదృశ్య అసంభవః** – ఒక వస్తువు క్షణంలో మాయమవుతుంటే, పోలికకు మాత్రం అవకాశం ఎక్కడుంది అంటారు శంకరులవారు. పోలిక ప్రశ్న ఎప్పుడు ఉదయిస్తుంది? ఆ దేవదత్తే ఈ దేవదత్త అని చెప్పాలి అంటే, నేను అప్పటి దేవదత్తనీ చూసి ఉండాలి, ఇప్పటి దేవదత్తనీ చూడాలి. అంటే నేను కూడా గతంలోనూ ఉండాలి, వర్తమానంలోనూ ఉండాలి. గతంలో, వర్తమానంలో ఉన్న దేవదత్త గురించి చెప్పటానికి నేను కూడా గతంలోనూ, వర్తమానంలోనూ ఉండాలి. అలాగే అతనే ఇతను అనాలంటే అతను అప్పుడూ ఉండాలి, అప్పటినుంచి ఇప్పటిదాకా **కొనసాగుతూ** ఉండాలి.

కర్త కూడా క్షణికం అయితే, పోలిక గురించి ఎవరు మాట్లాడతారు? ఇప్పటి కర్త, గతం గురించి మాట్లాడలేదు; గతంలో ఉన్న కర్త ఇప్పటి గురించి మాట్లాడలేదు. అప్పుడు గతాన్ని, వర్తమానాన్ని పోల్చి చెప్పేది ఎవరు? అప్పుడు చూసిన వస్తువునే ఇప్పుడు కూడా, అప్పుడు చూసిన నేనే చూస్తేనే వాటి మధ్య పోలికలను చెప్పగలను. కాబట్టి సాదృశ్యం అంటే పోలికలు అసంభవం.

డి) **మమతాది అసంభవః** – మమకారాలు, నాది, నావారులాంటి పదాలకు చోటులేదు. ఏదైనా ఒక వస్తువు నాది అనాలంటే ఆ వస్తువూ, నేనూ ఒకేసారి ఉండాలి. అది దేవదత్తుని ఇల్లు అనలేము. ఎందుకు? దేవదత్త ఉన్నప్పుడు ఇల్లు ఉండదు; ఇల్లు ఉన్నప్పుడు దేవదత్త ఉండదు. ఏదైనా క్షణికమే కదా. అందువల్ల నాది, నీది, నావారులాంటి మమకారాలు అసంభవం.

ఇ) **వ్యపదేశ అసంభవః** – ఇంతకు ముందు దోషంలాంటిదే ఇది కూడా. ఒక వస్తువుకు పేరు పెట్టలేము. ఎందుకు? వస్తువు ఉన్నప్పుడు దానికి పేరు ఉండదు. దానికి పేరు పెట్టిన సమయానికి వస్తువు ఉండదు. వస్తువు ఒక క్షణం ఉంటే, పేరు వచ్చేసరికి మరోక్షణం అయిపోతుంది.

ఎఫ్) **విరుద్ధ అనేకాంశ అసంభవః** – యోగాచారమతం ప్రకారం బాహ్యప్రపంచం లేదని చూశాము కదా! అంటే ఘటజ్ఞానంలో బాహ్యంగా ఘటం లేదు. ఆ విధంగా బాహ్యప్రపంచాన్ని చూస్తే, నిజంగా బాహ్యప్రపంచం లేదు కాబట్టి, అది చైతన్యంయొక్క గుణంగా తీసుకోవాలి వారి మతం ప్రకారం. కాని విరుద్ధ అంశాలు ఒక చైతన్యంలో ఎలా ఉంటాయి? అది సాధ్యం కాదు.

**యోగాచారుల జవాబు – విరుద్ధ అంశాలు మలం** – విరుద్ధ అంశాలు అనేవి నిజంగా లేవు. ఆ విధంగా కర్మ–కర్మ భేదం కూడా నిజంగా లేదు. ఉన్నది ఒక్కటే క్షణిక విజ్ఞానం. ఆ విరుద్ధగుణాలు క్షణిక విజ్ఞానానికి చెందవు. అది క్షణిక విజ్ఞానానికి పట్టిన మలం. ఆ మలాన్ని తొలగించటమే మోక్షం.

**శంకరులవారి ఖండన**

జి) **స్వమతహాని** – యోగాచారులు మలం గురించి మాట్లాడటానికి వారికి హక్కు లేదు. ఎందుకంటే మలం అనేది వస్తువుకు భిన్నంగా ఉంటుంది. నీరు అశుద్ధంగా ఉంది అంటే నీటిని, నీటికి భిన్నంగా ఉన్న బాహ్యవస్తువు అశుద్ధం చేసింది. కాని వారి మతంలో బాహ్యంగా ఏదీ లేదు కదా! కుండ జ్ఞానంలో కుండ నిజంగా లేదు, చెట్టు జ్ఞానంలో చెట్టు నిజంగా లేదు, వస్తువే లేనప్పుడు వస్తువుకు భిన్నంగా ఉండే మలం ఎలా ఉంటుంది? దీన్ని స్వమతహాని అంటారు.

హెచ్) **అనిర్మోక్ష ప్రసంగః** – మలం భిన్నంగా ఉండాలనేది తప్పించుకోవటానికి, మలం కూడా క్షణికవిజ్ఞానమే అని గనుక వారు అంటే, అటువంటి మలాన్ని నిర్మూలించే అవకాశమే లేదు. ఆ వస్తువుకు భిన్నంగా ఉన్నదాన్ని తొలగించగలము కాని, మలం కూడా విజ్ఞానమే అంటే దాన్ని తొలగించే ప్రసక్తి లేదు. అలా మలాన్ని తొలగించ లేకపోతే, మోక్షానికి అవకాశమే లేదు. దీన్ని అనిర్మోక్షప్రసంగం అంటారు.

ఈ వాదనలన్నిటివల్ల యోగాచారమతం వీగిపోతుంది. అందువల్ల క్షణిక విజ్ఞానం ఆత్మ కాదు, బుద్ధి ఆత్మ కాదు, ఆత్మబుద్ధికి భిన్నంగా ఉంది; అది నిత్యవిజ్ఞానం.

## మాధ్యమిక లేదా శూన్యవాద మతఖండన

బౌద్ధమతంలో ముందు చూసిన తక్కిన మూడు మతాల్లోనూ సమానంగా ఒక అంశం ఉంది. మూడూ క్షణిక విజ్ఞానాన్ని కర్తగా స్వీకరిస్తాయి. మాధ్యమికమతం క్షణిక విజ్ఞానాన్ని కూడా స్వీకరించదు. తక్కినవి కర్మ అంటే ఆబ్జెక్టు లేదు అంటాయి, కాని ఈ మతం కర్త అంటే సబ్జెక్టు కూడా లేదు అంటుంది. అందువల్ల వీరి వాదనను శూన్యవాదం అంటారు.

భగవద్గీత, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలను కలిపి ప్రస్థానత్రయం అంటారు. వీటన్నిటికీ శంకరులవారు భాష్యం రాశారు. కాని వీటి భాష్యాల్లో దేనిలోనూ ఈ శూన్యవాదం గురించి ఎక్కువగా వాదించలేదు. యోగాచార మతఖండనే ఎక్కువగా చేశారు. యోగాచారమతంలోనూ విజ్ఞానం ఆత్మ అంటారు, మనం కూడా విజ్ఞానం ఆత్మ అంటాము. వారూ, మనమూ కూడా ఆబ్జెక్టును ఒప్పుకోము. అందువల్ల వారికీ, మనకీ కొంచెం పోలికలున్నట్టు ఉంటాయి, కాని వ్యత్యాసం కూడా ఉంది. ఏమిటది? వారు క్షణికవిజ్ఞానం ఆత్మ అంటారు, మనం నిత్యవిజ్ఞానం ఆత్మ అంటాము. అందుకని దీన్ని ఎక్కువగా ఖండిస్తారు.

**సర్వప్రమాణ విరోధం** – ఈ శూన్యవాదం సర్వప్రమాణ విరోధం అంటారు. ప్రమాణాలన్నీ ఉనికి గురించే మాట్లాడతాయి. అస్తి, అస్తి అంటాయి కాని నాస్తి, నాస్తి అనవు. ప్రమాణాలు ఉన్న వస్తువు గురించి మాట్లాడతాయి కాని లేని వస్తువు గురించి మాట్లాడవు. కళ్ళు రూపం ఉందని చెబుతాయి, పర్వతం దగ్గర అగ్ని ఉందని చెబుతాయి, శాస్త్రం స్వర్గం ఉందని చెబుతుంది. ఒకవేళ ప్రమాణాలు తప్పు చెప్పాయి అనుకున్నా, అన్ని

అబద్ధాలకు ఒక సత్యం ఉండాలి. ఉనికి లేని వస్తువు గురించి మాట్లాడాలంటే, ఉనికి ఉన్న వ్యక్తి మాట్లాడాలి. ఈ గదిలో ఎవరూ లేరని చెప్పాలంటే, ఈ గదిలో ఎవరూ లేరని చెప్పేవ్యక్తి ఉండాలి. అతనికి ఉనికి ఉంది. అందువల్ల శూన్యవాదం కుదరదు.

ఈ విధంగా **బుద్ధి ఆత్మ కాదు**. ఆరవ మంత్రంలో చార్వాక మతఖండన జరిగింది; ఆరు, ఏడు మంత్రాల్లో బౌద్ధమత ఖండన జరిగింది. ఎందుకు ఈ రెండు మతాల ఖండనలు చేశారు శంకరులవారు? దీనివల్ల ఆయన నిరూపించినది ఏమిటి?

నేను శరీరం కాదు, నేను బుద్ధిని కూడా కాదు, నేను జ్యోతిని; నేను స్వయంజ్యోతిని; శరీరానికి, బుద్ధికి భిన్నంగా ఉన్నాను. ఏడవ మంత్రంలో ఆత్మ బుద్ధిలో ఉందని వచ్చింది. ఆత్మ బుద్ధిలో ఉంది అంటే ఏమిటి అర్థం? ఆత్మ బుద్ధి కాదు. నేను ఈ గదిలో ఉన్నానంటే నేను ఈ గదిని కాను. కుండలో నీళ్ళున్నాయి అంటే కుండ నీళ్ళు కాదు. ఆ విధంగా ఆత్మ బుద్ధిలో ఉంది అంటే ఆత్మ బుద్ధి కాదు. ఇదే విషయాన్ని బౌద్ధమత ఖండనలద్వారా నిరూపించారు శంకరులవారు. ఇక్కడితో ఖండనలు ముగిశాయి.

మళ్ళీ 7వ మంత్రం చూద్దాము.

మంత్రం 4.3.7

**కతమ ఆత్మేతి యోఽయం విజ్ఞానమయః ప్రాణేషు హృద్యన్తర్జ్యోతిః పురుషః ॥ స సమానస్సన్నుభౌ లోకావనుసఞ్చరతి ॥ ధ్యాయతీవ ॥ లేలాయతీవ ॥**
**స హి స్వప్నో భూత్వేమం లోకమతిక్రామతి మృత్యో రూపాణి ॥**

ఏడవ మంత్రంయొక్క రెండవ భాగంలో ఉపనిషత్తు స్వయంజ్యోతియొక్క రెండు అంశాలను చర్చిస్తున్నది. అవి – చిత్ స్వరూపం, చిదాభాస స్వరూపం. పారమార్థిక స్థాయికి చెందిన చిత్ స్వరూపం పరమాత్మ; వ్యావహారిక స్థాయికి చెందిన చిదాభాస స్వరూపం జీవాత్మ. అంటే ఒకే ఆత్మకు రెండు స్వరూపాలు ఉన్నాయి – పారమార్థిక స్వరూపం, వ్యావహారిక స్వరూపం. పారమార్థిక స్థాయికి చెందింది అంటే అక్కడ లక్ష్యార్థం వాడుతున్నాము. అహం బ్రహ్మ అస్మి అంటున్నాము. వ్యావహారిక స్థాయికి చెందింది అంటే అక్కడ వాచ్యార్థం వాడుతున్నాము. అహం జీవః అస్మి అంటున్నాము.

పారమార్థిక స్వరూపం అంటే విజ్ఞానం. వ్యావహారిక స్వరూపం అంటే విజ్ఞానమయ ఆత్మ. విజ్ఞానమయ ఆత్మ అంటే బుద్ధితో మమేకం చెందింది. బుద్ధిలాగే ఈ విజ్ఞానమయ ఆత్మకు అవస్థాత్రయం ఉంటుంది. జాగ్రదావస్థలో పూర్తిగా విచ్చుకున్న పువ్వులా ఉంటే, స్వప్నావస్థలో అరవిరిసిన పువ్వులా ఉంటే, సుషుప్తిలో మొగ్గలా ముడుచుకుపోతుంది. అంతేకాదు బుద్ధితో పాటు ఇహలోకం, పరలోకాల మధ్య ప్రయాణం చేస్తూ ఉంటుంది.

ఇక్కడ్నుంచీ ఉపనిషత్తు పురుషః పదాన్ని వాడుతూ ఉంటుంది. దానికి రెండు అర్థాలున్నాయి. పురుషః అంటే వ్యావహారిక చిదాభాస స్వరూపం అవచ్చు; లేదా పారమార్థిక చిత్ స్వరూపం అవచ్చు. అంటే జీవాత్మ అవచ్చు,

పరమాత్మ అవచ్చు. ఎక్కడ ఏ అర్థం తీసుకోవాలో జాగ్రత్తగా చూడాలి. లేకపోతే ఈ మంత్రాలు సరిగ్గా అర్థం కావు. ఏడవ మంత్రంలోనే రెండింటి గురించీ వస్తుంది. జ్యోతి అంటే పారమార్థిక స్వరూపం, విజ్ఞానమయః అంటే వ్యావహారిక జీవాత్మ స్వరూపం. ఈ పురుషుడు ఇహలోక, పరలోకాలకు తిరుగుతాడు అన్నప్పుడు, జీవాత్మ స్వరూపం. ఇప్పుడు రాబోయే మంత్రాల్లో జీవాత్మ స్వరూపం వస్తుంది. పరమాత్మే వ్యావహారిక స్థాయికి దిగివచ్చి, జీవాత్మ పాత్ర తీసుకున్నాడు.

## మంత్రం 4.3.8

**స వా అయం పురుషో జాయమానశ్శరీరమభిసమ్పద్యమానః పాప్మభిస్సగ్ం సృజ్యతే స ఉత్క్రామన్ మ్రియమాణః పాప్మనో విజహాతి ॥**

**స వా అయం పురుషో జాయమానః** – స వా అయం పురుషః అంటే సర్వగత, నిత్య పురుషుడు, పారమార్థిక చిత్, పరమాత్మ, వ్యావహారిక స్థాయికి దిగివచ్చాడు. ఎలా? జీవాత్మగా, చిదాభాసగా, ప్రతిబింబచైతన్యంగా. జాయమానః– జీవాత్మగా ఏం చేస్తున్నాడు? పుడుతున్నాడు. పునరపి జననం, పునరపి మరణం పొందుతూనే ఉన్నాడు. అందువల్ల మనిషిని జంతువు అంటారు.

జన్మ అంటే ఏమిటి? ఉపనిషత్తే నిర్వచిస్తున్నది –

**శరీరమ్ అభిసంపద్యమానః** – అంటే జాయమానః – అంటే పుట్టటం. ఈ పురుషుడు పదేపదే కొత్త శరీరాన్ని పొందుతున్నాడు. పదేపదే కొత్త శరీరాన్ని పొందుతున్నాడంటే, పదేపదే మరణిస్తున్నాడు. పుట్టాడు అంటే మరణిస్తాడు కూడా.

**స ఉత్క్రామన్ మ్రియమాణః** – అంటే మరణించటం. మరణం నిర్వచనం ఉత్క్రామన్. శరీరంనుంచి పైకి పోవటం. ఈ పురుషుడు ఒక శరీరం తీసుకోవటంద్వారా పుడుతున్నాడు, దాన్నించి పైకి పోవటంద్వారా మరణిస్తున్నాడు. అలా అతను మరణించినప్పుడల్లా ఏమవుతుంది?

**పాప్మ** – అంటే ఇక్కడ పాపానికి ప్రత్యేక అర్థం ఉంది. పాపం అంటే దేహేంద్రియాలు. దేహేంద్రియాలను పాపం అని ఎందుకు అంటారు? ఎందుకంటే పుణ్యపాపాల ఫలితంగానే ఈ దేహేంద్రియాలు ఏర్పడతాయి. పుణ్యపాపాల ఫలితం అయినా పాపం పదమే ఎందుకు ఎన్నుకుంది ఉపనిషత్తు అంటే శరీరం సంసారానికి, పరిమితికి, జన్మ, మృత్యు, జరా, వ్యాధికి కారణం. పాపం సంసార కారణం కాబట్టి పాపం వాడబడింది.

**పాప్మభిస్సగ్ం సృజ్యతే** – పుట్టినప్పుడు పాపంతో సంయోగం పొందుతాడు; అంటే దేహేంద్రియాలతో సంయోగం పొందుతాడు;

**పాప్మనో విజహాతి** – మరణించినప్పుడు పాపాలను విడిచిపెడతాడు. అంటే దేహేంద్రియాలను విడిచిపెడతాడు.

అంతకుముందు మంత్రంలో చెప్పిన ఇహలోక పరలోక గమనాన్ని ఇక్కడ వివరించాడు యాజ్ఞవల్క్యుడు. ఇహలోకం అంటే ఈ శరీరం, పరలోకం అంటే ఇంకో శరీరం.

మంత్రం 4.3.9

**తస్య వా ఏతస్య పురుషస్య ద్వే ఏవ స్థానే భవత ఇదం చ పరలోకస్థానం చ సన్ధ్యం తృతీయగ్ం స్వప్నస్థానమ్ ॥ తస్మిన్సన్ధ్యే స్థానే తిష్ఠన్నేతే ఉభే స్థానే పశ్యతీదం చ పరలోకస్థానం చ ॥ అథ యథాఽ ఽ క్రమోఽ యం పరలోకస్థానే భవతి తమాక్రమమాక్రమ్యోభయాన్పాప్మన ఆనన్దాగ్ంశ్చ పశ్యతి । స యత్ర ప్రస్వపిత్యస్య లోకస్య సర్వావతో మాత్రామపాదాయ స్వయం విహత్య స్వయం నిర్మాయ స్వేన భాసా స్వేన జ్యోతిషా ప్రస్వపిత్యత్రాయం పురుషస్స్వయం జ్యోతిర్భవతి ॥**

ఈ మంత్రంలో ఇహలోక పరలోకాలను స్వప్నంద్వారా తెలుసుకోవచ్చు అంటున్నాడు యాజ్ఞవల్క్యుడు. అందువల్ల స్వప్నాన్ని **సంధ్యం స్థానమ్** అన్నారు. సంధ్య స్థానమ్ అంటే రెండు స్థానాల మధ్య స్థానం. పగలుకు, రాత్రికి మధ్య స్థానాన్ని సంధ్యాసమయం అంటారు కదా! ఈ స్వప్నమనే సంధ్య ఏ రెండింటిని కలుపుతుంది? ఇహలోకాన్ని, పరలోకాన్ని. స్వప్నంలో ఉండి, ఒక వ్యక్తి రెండు లోకాల్లోకి తొంగిచూడవచ్చు.

ఇక్కడ ఉపనిషత్తు ఒక ప్రత్యేకమైన అంశాన్ని చెబుతున్నది. దాన్ని వేరే ఏ ఉపనిషత్తులోనూ చూడము. ఏమిటది? మామూలుగా స్వప్నం నిర్వచనం ఏమిటి? జాగ్రదావస్థలో ఏదైతే చూస్తామో, అది వాసనల రూపంలో చిత్తంలో నిక్షిప్తమై ఉంటుంది, అది మళ్ళీ స్వప్నంలో రీ ప్లే అవుతుంది. అంటే జాగ్రద్ ప్రపంచం వి.సి.ఆర్. అయితే, స్వప్నప్రపంచం వి.సి.పి.లాంటిది. అందులో రికార్డు అవనిది వి.సి.పి. ప్లే చెయ్యలేదు. మనలో రికార్డు అవనిది స్వప్నంలో చూడలేము.

కాని ఇక్కడ ఉపనిషత్తు కొత్త అంశాన్ని చెబుతున్నది. ఒక వ్యక్తి బాల్యంలో ఉండగా, అతనికి జాగ్రదావస్థలో అనుభవాలు ఎక్కువగా ఉండవు. ఇంద్రియాలు కూడా పూర్తిగా విచ్చుకుని ఉండవు. అందువల్ల అప్పుడు ఆ బాలుడు చూసే స్వప్నం పూర్వజన్మ అనుభవాలలోంచి అంటుంది ఉపనిషత్తు. దాన్ని పరలోకం అంటున్నది. నడివయస్సులో చూసే స్వప్నాలు ఈ లోకంలో జరిగిన అనుభవాలలోంచి వచ్చినవి. దానికి ఇదం లోకం అంటున్నది.

అంతేకాదు, ఇంకొక ఆశ్చర్యకరమైన విషయం చెబుతున్నది. అదే వ్యక్తికి వయస్సు ముదిరి, వృద్ధాప్యం పొంది, మరణానికి అతి చేరువగా ఉన్నప్పుడు అతను పొందే కలలు, పరలోకం గురించిన కలలు. అంటే వచ్చేజన్మలో అతను పొందబోయే అనుభవాలు. ఈ జన్మ ముగియబోతోంది అంటే ఈ జన్మలోని ప్రారబ్ధం ముగియబోతున్నది, కొత్త ప్రారబ్ధం కూడి, కొత్త జన్మ వస్తుంది. ఆ రాబోయేది ముందే సిద్ధంగా ఉంటుంది. అందులోకి తొంగి చూస్తాడన్నమాట ఈ జీవుడు.

పసివయస్సులో పూర్వజన్మ వాసనలను స్వప్నంలో చూస్తే, వృద్ధాప్యంలో మరుజన్మ వాసనలను స్వప్నంలో చూస్తాడు కాబట్టి స్వప్నాన్ని సంధ్యాస్థానం అన్నారు. అంటే ఈ పురుషుడు అతను జీవించి ఉండగానే గతజన్మ గురించి, మరుజన్మ గురించి స్వప్నంలో చూస్తాడు.

**తస్య వా ఏతస్య పురుషస్య** – ఈ జీవాత్మకు;

**ద్వే ఏవ స్థానే భవత** – రెండు స్థానాలు మాత్రమే ఉన్నవి. అవి

**ఇదం చ పరలోకస్థానం చ** – ఈ లోకం, పరలోకం. పరలోకం అంటే ముందు జన్మ, రాబోయే జన్మ కూడా అని చూశాము.

**సంధ్యం తృతీయగ్ం స్వప్నస్థానమ్** – మధ్య స్థానాన్ని స్వప్నం అనీ, సంధ్యాస్థానం అనీ అంటారు.

ఇక్కడ రెండు రకాలుగా వివరించారు శంకరులవారు, సురేశ్వరాచార్యులు. చిన్న వ్యాకరణవిశ్లేషణ.

**శంకరులవారి విశ్లేషణ – ద్వే ఏవ స్థానే భవతః** అంది ఉపనిషత్తు. అంటే ఈ పురుషునికి నిశ్చయంగా రెండే స్థానాలు ఉన్నాయి. మూడు గాని, నాలుగు గాని లేవు. కాని తర్వాత పాదంలో ఏమంది? **తృతీయగ్ం స్వప్నస్థానమ్** అంది. స్వప్నస్థానం మూడవ స్థానం అంది. ఏవ అంటే మాత్రమే. రెండు మాత్రమే అంటే మూడోదానికి చోటు లేదు. అందువల్ల తృతీయాన్ని నిజంగా తృతీయంగా తీసుకోకూడదు, దాన్ని సంధ్యాస్థానంగా తీసుకోవాలి కాని మూడవ స్థానంగా తీసుకోకూడదు. మూడవ స్థానంలాగా ఉంది అనాలి.

శంకరులవారు దానికి తర్కం కూడా చెప్పిస్తారు. రెండు గ్రామాల మధ్య ఉండే రోడ్డును మూడవ గ్రామంగా తీసుకోకూడదు. అది రెండు గ్రామాలను కలిపే సంధిస్థానం. మన లౌకిక ఉదాహరణ తీసుకున్నా రెండు గదుల మధ్యనున్న తలుపును మూడోగదిగా తీసుకోకూడదు. అది గదులకు భిన్నంగా ఉండి, రెండు గదులను కలుపుతుంది. అందువల్ల తృతీయం అంటే సంధ్యాస్థానం, నిజంగా తృతీయం కాదు.

**సురేశ్వరాచార్యుల విశ్లేషణ** – ఉపనిషత్తు తృతీయం అని ప్రత్యేకించి చెప్పినప్పుడు మూడవ స్థానం ఉన్నట్టే తీసుకోవాలి. ఏవ పదాన్ని 'ద్వే ఏవ' అనకూడదు, రెండు మాత్రమే అనకూడదు. 'స్థాన ఏవ' అనాలి, అంటే స్థానాలు మాత్రమే. మూడవ స్థానం స్వప్నం.

ఏ విధంగా తీసుకున్నా స్వప్నంద్వారా జీవాత్మ రెండు లోకాలను చూస్తోంది.

**తస్మిన్ సంధ్యే స్థానే తిష్ఠన్నేతే** – ఈ సంధ్యా స్థానంలో నిలబడి, పురుషుడు అని కలుపుకోవాలి. **ఉభే స్థానే పశ్యతి** – రెండు స్థానాలను చూస్తాడు. ఏమిటవి?

**ఇదం చ పరలోకస్థానం చ** – అంటే ఇహలోకం పరలోకాలను చూస్తాడు. అంటే మనకు తెలియని ఏదో కొత్త వింత కల వస్తే, అది రాబోయే జన్మలోది అవవచ్చు. రాబోయే విషయాలు ముందే తెలుస్తాయి అంటారు. అందువల్ల అవి రాబోయే జన్మ విషయాలు కూడా కావచ్చు. జ్ఞానికి ఇది వర్తించదు, అతనికి మరుజన్మ ఉండదు. అతను ఇహలోకం, పూర్వలోకం గురించి కలలు కంటాడు కాని, రాబోయే జన్మ గురించి కలలు కనడు.

రాబోయే జన్మ గురించి ఎలా చూడగలము? ఉపనిషత్తు దానికి ఒక పదాన్ని వేసింది.

**ఆక్రమః** – ఆక్రమః అంటే పుణ్యపాపఫలం లేదా కర్మ లేదా ధర్మాధర్మ ఫలం. దీన్ని శంకరులవారు విద్యాకర్మ పూర్వప్రజ్ఞా అని నిర్వచించారు. దాన్ని తర్వాత చూద్దాము. ఆక్రమం అక్షరాలా తీసుకుంటే రాజ్యాన్ని ఆక్రమించటం. ఇక్కడ అలా దురాక్రమించటం అనే ప్రతికూల అర్థం రాదు. ఆక్రమం అంటే లోకాలకు వెళ్ళటానికి ఉపయోగపడే

వాహనం. పుణ్యపాపఫలాలనిబట్టి కదా పరలోకాలకు వెళతారు. అందువల్ల పుణ్యపాపాలను వాహనం అనీ, ఆక్రమం అనీ అన్నది ఉపనిషత్తు.

**అయం పరలోకస్థానే భవతి** – కొంత పుణ్యపాపాలవల్ల, స్వప్నంలో రాబోయే జన్మను కూడా చూడగలుగుతాడు.

**తమాక్రమమాక్రమ్యోభయాన్పాప్మన ఆనందాగ్ంశ్చ పశ్యతి** – వచ్చే జన్మలో ఎటువంటి శరీరం పొందుతాడో చూడటమే కాక, వాటిలో తను అనుభవించబోయే సుఖదుఃఖాలను కూడా చూస్తాడు. నిజానికి వచ్చే జన్మలో తన జీవితం ఎలా ఉంటుందో ఒక ట్రైలర్ చూస్తాడు.

ఉపనిషత్తు స్వప్నం ఎలా సృష్టించబడుతుందో వివరిస్తున్నది. జాగ్రదావస్థలో జీవాత్మ ప్రపంచాన్ని అనుభవిస్తుంది. జాగ్రదావస్థలో జీవాత్మ ప్రపంచాన్ని ఐదు విషయాలద్వారా అనుభవిస్తుంది. అవి – శరీరం, కరణం, కరణ అనుగ్రహదేవత, విషయం, వాసన. కరణం అంటే ఇంద్రియాలు, కరణ అనుగ్రహదేవత అంటే ఇంద్రియాలకు అధిష్ఠానదేవతలు.

**స యత్ర ప్రస్వపిత్యస్య లోకస్య సర్వావతో మాత్రామపాదాయ** – ఆ జీవాత్మ నిద్రించినప్పుడు వాటిలో ఒక భాగాన్నే తనతో తీసుకువెళుతుంది. స యత్ర ప్రస్వపిత్యస్య – అంటే జీవాత్మ స్వప్నంలోకి వెళ్ళినప్పుడు, మాత్రాం అపాదాయ– ఒక అంశాన్ని మాత్రం విడదీసి పట్టుకుంటాడు. ఇక్కడ సుషుప్తిని పరిగణనలోకి తీసుకోకూడదు. ఇదంతా స్వప్నావస్థ గురించిన వర్ణన. జాగ్రదావస్థలో ఐదు అంశాలతో చూస్తాడని చూశాము. స్వప్నంలో ఒక అంశాన్ని తీసుకువెళతాడు అంటే వాసనలను మాత్రమే తీసుకువెళతాడు. స్వప్నంలో శరీరం, ఇంద్రియాలు పడుకుంటాయి కాబట్టి శరీరం, ఇంద్రియాలు, ఇంద్రియాల అధిష్ఠానదేవత, ఇంద్రియాలు చూసే వస్తువులు ఏవీ ఉండవు.

**సర్వావతః** – జాగ్రద్ పురుషునికి సర్వావతః అనే బిరుదునిచ్చింది ఉపనిషత్తు. దానికి రెండు వివరణలు ఇచ్చారు శంకరులవారు.

ఎ) **సర్వవాన్ ఏవ సర్వావాన్:** సర్వమూ గలవాడు. స్వప్నపురుషునికి ఒక అంశమే ఉంటే, జాగ్రద్ పురుషునికి ఐదు అంశాలు ఉన్నాయని చూశాము. జాగ్రదావస్థలో పురుషుడు తనకు ఉన్న శరీరాన్ని, అన్ని ఇంద్రియాలను ఉపయోగిస్తాడు. విషయవస్తువులను చూస్తాడు. అందువల్ల సర్వావాన్.

బి) **సర్వాన్ అవతి ఇతి:** సర్వాన్ని రక్షించేవాడు. ఇది అర్థం చేసుకోవటానికి మనం మొదటి అధ్యాయములోకి వెళ్ళాలి. అక్కడ సప్తాన్న బ్రాహ్మణములో దేవతలకు యజ్ఞయాగాదులు చెయ్యటంద్వారా, దేవతలను రక్షిస్తాడు అని చూశాము. పితృదేవతలను కూడా మనుష్యులే రక్షిస్తారు. భగవద్గీతలో మొదటి అధ్యాయములో మనుష్యులు పితృకర్మలను చెయ్యకపోతే పితృదేవతలు అవస్థ పడతారని అర్జునుడు అంటాడు. జంతువులను కూడా మనుష్యులే రక్షిస్తారని మనకు తెలుసు. ఆ విధంగా జాగ్రద్ పురుషుడు సర్వాన్ని రక్షించేవాడు అయ్యాడు.

**స్వయం విహత్య** – జాగ్రద్ పురుషుడు ఒక భాగాన్ని తీసుకుని స్వప్నంలోకి వెళతాడని చూశాము. తనంతట తానే జాగ్రదావస్థలోని దేహాన్ని పడగొడతాడు. ఎందుకు పడగొడతాడు? దేహ అభిమానాన్ని వదులుకుంటాడు. శరీరం శవంలా పడివుంటుంది. ఏమీ పని చెయ్యదు. జీవాత్మ స్వయంగా దేహ అభిమానాన్ని వదులుకుంటుంది.

**స్వయం నిర్మాయ** – జీవాత్మ వాసనలద్వారా స్వప్నప్రపంచాన్ని నిర్మిస్తుంది. దానికి ముడిసరుకు ఏమిటి? పంచభూతాలు కావు. వృత్తిరూపంలో సృష్టిస్తుంది. స్వప్నప్రపంచం మనోవృత్తి రూపంలో ఉంటుంది. అంటే నిజంగా స్వప్నప్రపంచం ఉండదు. కలలోని పులి ఒక మనోవృత్తి, కలలోని కొండ ఇంకొక మనోవృత్తి.

**స్వేన భాసా స్వేన జ్యోతిషా ప్రస్వపితి** – స్వప్నప్రపంచం ఏ జ్యోతివల్ల ప్రకాశిస్తుంది? స్వప్నంలో బాహ్యజ్యోతి ఉండదు. స్వయం ప్రకాశకమైన సాక్షి చైతన్యంవల్ల స్వప్నప్రపంచం ప్రకాశిస్తుంది. సాక్షికి మనస్సులాగా బాహ్యజ్యోతి అవసరం లేదు.

**అత్రాయం పురుషస్స్వయం జ్యోతిర్భవతి** – జీవాత్మ ఈ విధంగా స్వప్నాన్ని చూస్తుంది. అత్ర అంటే స్వప్నంలో. స్వప్నంలో ఆత్మయొక్క స్వయంజ్యోతి బాగా తెలుస్తుంది. ఈ వాక్యం చాలా ముఖ్యమైనది. తరచు ఆచార్యులు దీన్ని ఉటంకిస్తుంటారు.

ఆత్మయొక్క స్వయంజ్యోతి స్వప్నంలో తెలుస్తుంది అంటే జాగ్రద్, సుషుప్తి అవస్థల్లో తెలియదా? ఆత్మ ఎప్పుడూ స్వయంప్రకాశకం. కాబట్టి మూడు అవస్థల్లోనూ ఉంటుంది కాకపోతే స్వప్నావస్థలో తెలుస్తుంది.

జాగ్రదావస్థలో ఎందుకు తెలియదు? జాగ్రదావస్థలో ఆత్మ మనస్సును ప్రకాశింపజేస్తుంది. అప్పుడు ఆత్మ కర్త, మనస్సు కర్మ అయ్యాయి. కాని మనస్సు ప్రపంచాన్ని ప్రకాశింపజేస్తుంది. అప్పుడు మనస్సు కర్త, ప్రపంచం కర్మ అయ్యాయి. మనస్సును ఆత్మ ప్రకాశింపజేయాలి కాని, ఆత్మను ఏదీ ప్రకాశింపజేయనవసరం లేదు. అది స్వయం ప్రకాశకం.

ఇప్పుడు జాగ్రదావస్థలో రెండు జ్యోతులు ప్రకాశిస్తున్నాయి. ఒకటి ఆత్మజ్యోతి, ఇంకొకటి మనస్సు అనే జ్యోతి. రెండు జ్యోతులు పనిచెయ్యటంవల్ల ఆ రెండింటి మధ్య వ్యత్యాసాన్ని చూడలేకపోతున్నాము. అది పట్టపగలు కొవ్వొత్తిని పెట్టినట్టు ఉంటుంది. అక్కడ కొవ్వొత్తి వెలుగుతో సూర్యకాంతిని పట్టించుకోలేక పోతున్నాము. అలాగే మనస్సు పని చేస్తున్నప్పుడు ఆత్మ గురించి తెలియటం లేదు.

అయితే సుషుప్తిలో ఎందుకు ఆత్మ గురించి తెలియటం లేదు? సుషుప్తిలో ప్రకాశింపబడే వస్తువులు లేవు. అది శూన్యంగా ఉంటుంది. శరీరం, మనస్సు, ఇంద్రియాలు అన్నీ పడుకుంటాయి కాబట్టి ప్రకాశింపజేయటానికి ఏదీ లేదు.

స్వప్నంలో మాత్రమే ఆత్మ గురించి తెలుస్తుంది, ఎందుకంటే అక్కడ మనస్సు జ్యోతిగా పనిచెయ్యదు కాబట్టి. మనస్సు జ్యోతిగా పనిచేస్తే, బాహ్య ప్రపంచం కనిపిస్తుంది. బాహ్యప్రపంచం కనిపించటం లేదు కాబట్టి మనస్సు జ్యోతిగా పనిచెయ్యటం లేదు. మనస్సుకు రెండు ధర్మాలు ఉన్నాయని చూశాము. మనస్సు కర్తగా బాహ్యప్రపంచాన్ని చూస్తుంది. మనస్సు కర్మగా ఆత్మవల్ల చూడబడుతుంది. ఇక్కడ మనస్సుయొక్క ఒక్క అంశమే పనిచేస్తుంది. అంటే మనస్సు కర్మగా ఆత్మవల్ల చూడబడుతుంది. ఆత్మకు జ్యోతి ఏది? ఆత్మ స్వయంజ్యోతి. స్వయంజ్యోతి ఆత్మ మనస్సును చూస్తుంది స్వప్నంలో. అత్రయొక్క ప్రాముఖ్యత ఇది.

**స్వప్నాన్ని చూసేది ఎవరు? ఆత్మా, మనసా?**

ఈ సందర్భంలో కొన్ని సందేహాలు రావచ్చు. ఇంతకుముందు ఏమన్నాం? స్వప్నంలో మనస్సు కర్మ అయింది, మనస్సే స్వప్నప్రపంచంగా మారింది, ఆత్మ లేదా సాక్షి మనస్సును ప్రకాశింపజేస్తుంది అన్నాము. అంటే ఒక ప్రాథమిక ప్రశ్న ఉదయిస్తుంది. **స్వప్నాన్ని చూసేది ఎవరు? ఆత్మా, మనసా?** ఆత్మ మనస్సును చూస్తోంది అన్నాము. అంటే ఆత్మ కర్త, మనస్సు కర్మ అయ్యింది. అంటే ఆత్మ స్వప్నపురుషుడు అవాలి. ఆత్మ స్వప్నపురుషుడు అయితే, జాగ్రద్ పురుషుడు ఎవరు? ఆత్మా, మనసా?

ఆత్మ స్వప్నపురుషుడు అయితే స్వప్న అనుభవాన్ని గుర్తు తెచ్చుకునేది ఎవరు? ఆత్మ గుర్తు తెచ్చుకుంటుందా, మనస్సు గుర్తు తెచ్చుకుంటుందా? ఆత్మ స్వప్నపురుషుడు అయితే మనస్సు గుర్తు తెచ్చుకోలేదు. మనస్సు స్వప్నపురుషుడు అయితే ఆత్మ గుర్తు తెచ్చుకోలేదు. మరయితే స్వప్నపురుషుడు ఎవరు?

స్వప్నపురుషుడు ఎవరో విశ్లేషిద్దాము.

1. ఆత్మ మనస్సును ప్రకాశింపజేస్తుంది.
2. మనస్సు, దాని వాసనలవల్ల స్వప్నప్రపంచంగా మారుతుంది.

అంటే స్వప్నం నిర్వచనం ఏమిటి? వాసనామయప్రపంచం. అది నిజంగా లేదు. వాసనావృత్తి పరిణామం స్వప్నం. స్వప్నం వాసనామయప్రపంచం అయితే, వృత్తి పరిణామంవల్ల స్వప్నం ఏర్పడితే వృత్తి పరిణామం ఎక్కడ జరుగుతుంది? ఆత్మలోనా, మనస్సులోనా? వృత్తి అంటే ఆలోచనలు అని తెలుసు మనకు. ఆత్మకు ఆలోచనలు లేవు, అందువల్ల ఆలోచనల పరిణామానికి ఆస్కారమే లేదు. వృత్తి పరిణామం మనస్సులోనే జరుగుతుంది. అందువల్ల స్వప్నం మనస్సులో ఏర్పడుతుంది, ఇంకో విధంగా చెప్పాలంటే స్వప్నవృత్తాంతానికి ఆధారం మనస్సు. అందువల్ల **మనస్సే స్వప్నపురుషుడు**. వృత్తి పరిణామమయిన స్వప్నానికి మనస్సే ఆధారం, స్థానం.

జాగ్రదావస్థ మాటేమిటి? అది కూడా వృత్తి పరిణామమే. అక్కడ వృత్తి పరిణామం ఇంకో విధంగా జరుగుతుంది. వృత్తి పరిణామం మనస్సులోనే జరుగుతుంది కాని ఆత్మలో జరగదని చూశాము. అందువల్ల జాగ్రద్ వృత్తి పరిణామం మనస్సులో జరుగుతుంది, ఇంకో విధంగా చెప్పాలంటే జాగ్రద్ వృత్తిపరిణామానికి కూడా ఆధారం లేదా స్థానం మనస్సే. **మనస్సే జాగ్రద్ పురుషుడు.**

ఇదే సూత్రాన్ని సుషుప్తికి కూడా వర్తింపజేయవచ్చు. సుషుప్తి వృత్తిపరిణామానికి ఆధారం లేదా స్థానం మనస్సే. ఎందుకంటే సుషుప్తి కూడా ఇంకో వృత్తిపరిణామమే, మనస్సుయొక్క ఇంకొక మార్పు. మనస్సే సుప్తపురుషుడు.

మనస్సే స్వప్నపురుషుడు, మనస్సే జాగ్రద్ పురుషుడు, మనస్సే సుప్తపురుషుడు. అందువల్ల నేను కలగన్నాను, నేను లేచివున్నాను, నేను గాఢనిద్ర పోయాను అని చెప్పే 'నేను' మనస్సు. ఎందుకంటే మనస్సే ఈ మూడు అవస్థలకు ఆధారం. అంతేకాదు జాగ్రదావస్థలో నేను కుండను చూశాను, శబ్దం విన్నాను, ఒక వాసన వస్తోంది. ఇలా చెప్పే అనేక వాక్యాలు చెప్పేది మనస్సే. చూడటం మనస్సులో వృత్తిరూపంలో జరుగుతున్నది; వినటం మనస్సులో వృత్తిరూపంలో జరుగుతున్నది. అందువల్ల 'నేను' అంటే మనస్సు, సాక్షి కాదు.

ఇంకో ప్రశ్న ఉదయిస్తోంది ఇప్పుడు. మనస్సే జాగ్రద్ పురుషుడు, స్వప్నపురుషుడు, సుప్తపురుషుడు అయితే అంటే మనస్సే మూడు అవస్థల్లోనూ ఉంటే, మనస్సే ఆత్మ అనవచ్చు కదా! మూడు అవస్థల్లోనూ ఆధారంగా మనస్సు ఉన్నప్పుడు మనస్సెందుకు ఆత్మ కాదు? ఎందుకు అనవసరంగా ఆత్మ లేదా సాక్షిచైతన్యం అని ఇంకోదాన్ని తీసుకువచ్చి, మనను అయోమయంలో పడవేయటం?

దీనికి జవాబుగా సాక్షి, మనస్సుల పాత్రలను సరిగ్గా అర్థం చేసుకోవాలి. ఇందులో సూక్ష్మమైన బేధం ఉంది.

**మనస్సు వ్యవహారం తీరు** – ఏదైనా ఒక వస్తువును చూడటం తీసుకుందాము.

నేను పుస్తకాన్ని చూస్తున్నాను.

ఈ వాక్యంలో నేను ఎవరు? మనస్సు. నేను పుస్తకాన్ని చూస్తున్నాను అని చెప్పినప్పుడు ఒక్కసారే రెండు విషయాలు తెలుస్తున్నాయి మనకు. ఒకటి పుస్తకం కర్మ అని, రెండు మనస్సు కర్త అనీను. అంటే రెండూ ఒకేసారి తెలుస్తున్నాయి. మనస్సనే కర్త, పుస్తకం అనే కర్మను చూస్తోందని తెలుస్తోంది.

ఇప్పుడు మనస్సు కర్త అని ఎవరికి తెలుస్తున్నది? సాక్షికా, మనస్సుకా? మనస్సుకే తెలుస్తోందనుకుందాం. అప్పుడేమవుతుంది? మనస్సుకు ఏకకాలంలో తను కర్మను చూస్తున్నట్టు తెలియాలి, తను కర్తగా చూస్తున్నట్టు తెలియాలి. అంటే మనస్సుకు రెండు విషయాలు ఏకకాలంలో తెలియాలి. ఇది సాధ్యమో కాదో చూసేముందు మనస్సు పనిచేసే తీరుతెన్నులు తెలియాలి మనకు. మనస్సు రెండు సూత్రాల ఆధారంగా పని చేస్తుంది.

1. మనస్సు దేన్నైనా ఆలోచనద్వారానే తెలుసుకుంటుంది.
2. మనస్సు ఒక సమయంలో ఒక ఆలోచననే ఆలోచించగలదు.

ఇప్పుడు ఈ సూత్రాలను ఈ వాక్యానికి అన్వయించి చూద్దాము. నేను పుస్తకాన్ని చూస్తున్నాను. నేను అంటే మనస్సు అని చూశాము. అందువల్ల మనస్సు, పుస్తకమనే కర్మను పుస్తక ఆకారవృత్తిద్వారా తెలుసుకుంది. అంతవరకూ బాగానే ఉంది. ఇప్పుడు మనస్సు తనను తాను కర్తగా తెలుసుకోవాలి. మనస్సు తనను కర్తగా తెలుసుకోవాలంటే **మనస్సు దేన్నైనా వృత్తిద్వారానే తెలుసుకోవాలి – ఇది సూత్రం 1**.

కాని మనస్సుయొక్క వృత్తి అప్పటికే పుస్తకంమీద పడింది, కాబట్టి తన గురించి ఆలోచించలేదు. ఎందుకు? **మనస్సు ఒక సమయంలో ఒక ఆలోచననే ఆలోచించగలదు – ఇది సూత్రం 2** అందువల్ల మనస్సు తన గురించి తెలుసుకుంటే, పుస్తకం గురించి తెలుసుకోలేదు, పుస్తకం గురించి తెలుసుకోవాలంటే తన గురించి తెలుసుకోలేదు.

అంతేకాదు మనస్సు నిరంతరం అనేక వస్తువుల గురించి తెలుసుకుంటూనే ఉంటుంది. అందువల్ల దానికి తన గురించి తెలుసుకునే తీరిక లేదు. గీతాబోధ గంట సేపు వింటే, ఆ గంటా మీ మనస్సు ఆ బోధమీదనే ఉంటుంది. కాని వినే మీరు అక్కడ క్లాసులో ఉన్నారని మీకు తెలుసు. ఎలా తెలుసు? ఆలోచన లేకుండా తెలుసుకుందా? మనస్సు ఆలోచన లేకుండా దేన్నీ తెలుసుకోలేదు – ఇది సూత్రం 1. పోనీ ఆలోచనవల్ల తెలుసుకుందా? మనస్సు ఒక సమయంలో ఒక ఆలోచననే ఆలోచించగలదు. ఇది సూత్రం 2.

మనస్సు తెలుసుకుంది అని చెప్పటానికి రెండు అవకాశాలున్నాయి. ఇది బౌద్ధమతస్థుల వాదన. కాని అది నిజం కాదని నిరూపిస్తాము.

1. **బుద్ధి స్వయంప్రకాశకమ్** – వారు బుద్ధి స్వయంప్రకాశకం అంటారు. అలాగైతే మనస్సు ఆత్మలాగా ఎల్లవేళలా ఉండాలి. బుద్ధి స్వయంప్రకాశకం అనే వాదన శ్రుతి, యుక్తి, అనుభవ విరోధం.

ఎ) **యుక్తి విరోధమ్:** మార్పు ఉన్న ఏ వస్తువైనా జడం అవుతుంది. జడవస్తువు స్వయంప్రకాశకం కాలేదు.

బి) **అనుభవ విరోధమ్:** మనస్సు కూడా మారుతూ ఉంటుందని అనుభవం చెబుతుంది. మారే వస్తువులు ఏవీ స్వయంప్రకాశకం కానప్పుడు మనస్సు మాత్రం ఎలా స్వయంప్రకాశకం అవుతుంది.

సి) **శ్రుతి విరోధమ్:** శ్రుతి మనస్సును అనాత్మ అంటుంది. మనస్సు ప్రకృతి వికారం. అనాత్మ ఎన్నటికీ స్వయంప్రకాశకం కాలేదు. ఆత్మ ఒకటే స్వయంప్రకాశకం.

2. **వృత్తిద్వారా తెలుసుకుంటుంది** – మనస్సు స్వయంప్రకాశకం కాకపోతే, వృత్తిద్వారా తెలుసుకుంటుంది అనలేము. దానికి కారణాలు ఇంతకుముందే చూశాము. వృత్తి లేకుండా తెలుసుకోలేదు, కాని వృత్తి బాహ్యప్రపంచాన్ని తెలుసుకోవటంలో తీరిక లేకుండా ఉంది.

అయితే మనస్సు సబ్జెక్టు అని తెలుసుకునేదెవరు?

**సాక్షి చైతన్యం లేదా ఆత్మ** – మనస్సును ఆబ్జెక్టుగా తెలుసుకునే సబ్జెక్టు ఇంకొకటి ఉంది. అదే సాక్షిచైతన్యం. అది వృత్తితో పని లేకుండా తెలుసుకుంటుంది. అది స్వయంప్రకాశకం.

నేను పుస్తకాన్ని చూస్తున్నాను. ఈ వాక్యాన్ని మళ్ళీ చూస్తే పుస్తకాన్ని చూస్తున్న నేను మనస్సు, మనస్సును చూస్తున్న నేను సాక్షిచైతన్యం. నేను అంటే మనస్సు + చైతన్యం. నేనులోని చైతన్యభాగం సాక్షికి చెందితే, జడభాగం మనస్సుకు చెందుతుంది. ఇంకోవిధంగా చెప్పాలంటే నేను అంటే మనస్సు అని వాచ్యార్థం; నేను అంటే సాక్షిచైతన్యం అని లక్ష్యార్థం. మనస్సును ఆశ్రయం అనీ, చైతన్యాన్ని సాక్షి అనీ అంటారు.

ఇప్పుడు స్వప్నపురుషుడు ఎవరు? జాగ్రద్ పురుషుడు ఎవరు? సుప్తపురుషుడు ఎవరు? సాక్షి ఎవరు? స్వప్నపురుషుడు, జాగ్రద్ పురుషుడు, సుప్తపురుషుడు – మనస్సు. సాక్షి అనే చైతన్యంవల్లనే నేను చూస్తున్నాను, నేను కలగంటున్నాను, నేను పడుకున్నాను అని చెప్పగలుగుతున్నాను. ఇంకో విధంగా చెప్పాలంటే అవస్థాత్రయ ఆశ్రయం అంతఃకరణం (మనస్సు), అవస్థాత్రయసాక్షి ఆత్మ. మూడు అవస్థల్లోనూ నేను, నేను అని చెప్పేది మనస్సు. కాని మనస్సు మూడింటిలోనూ ఉందని సాక్షిచైతన్యంవల్లనే చెప్పగలుగుతున్నాము.

అందువల్ల నేను అంటే ఆత్మ అనాత్మల మేలుకలయిక. నేను అంటే మనస్సు+సాక్షి; నేను అంటే జడమైన మనస్సు+చైతన్యమైన సాక్షి. సాక్షి స్వయంజ్యోతి; మనస్సు సాక్షివల్ల ప్రకాశింపబడుతున్నది.

అవస్థాత్రయ ఆశ్రయవత్వం అంతఃకరణం సదాప్రకాశతే పరంతు న స్వయం జ్యోతిః ఆత్మ అవస్థాత్రయ సాక్షిత్వేన సర్వత్రా ప్రకాశతే పరంతు స్వయం జ్యోతిః. ఈ అర్థం వచ్చేలాగా వాడింది ఉపనిషత్తు ఈ వాక్యాన్ని– **అత్రాయం పురుషః స్వయం జ్యోతిః భవతి.**

## మంత్రం 4.3.10

**న తత్ర రథా న రథయోగా న పన్థానో భవన్త్యథ రథాన్ రథయోగాన్ పథస్సృజతే ॥ న తత్రానన్దా ముదః ప్రముదో భవన్త్యథానన్దాన్ముదః ప్రముదస్సృజతే ॥ న తత్ర వేశాన్తాః పుష్కరిణ్యస్స్రవన్త్యో భవన్త్యథ వేశాన్తాన్ పుష్కరిణీస్స్రవన్తీస్సృజతే స హి కర్తా ॥**

ఈ మంత్రం పూర్వపక్షి అడగబోయే ప్రశ్నకు జవాబు. అతని ప్రశ్న 14వ మంత్రంలో వస్తుంది, జవాబు ఇక్కడ వస్తోంది. మామూలుగా ప్రశ్న వచ్చాక జవాబు వస్తుంది, కాని ఇక్కడ జవాబు వచ్చాక ప్రశ్న రాబోతోంది. అందువల్ల మనం ముందు ప్రశ్నను చూద్దాము, అప్పుడు జవాబు అర్థమవుతుంది.

**స్వప్నావస్థను కూడా జాగ్రదావస్థగా తీసుకోవచ్చు కదా?**

స్వప్నావస్థను, జాగ్రదావస్థను కలిపేయవచ్చు కదా, ఎందుకు విడివిడిగా చూస్తారు అని అడుగుతున్నాడు పూర్వమీమాంసకుడు. అతనికా ఆలోచన ఎందుకు వచ్చింది? ఎందుకంటే స్వప్నంలో కూడా జాగ్రదావస్థలో అయినట్టుగా సుఖదుఃఖాలు అనుభవంలోకి వస్తాయి. రెండింటిలోనూ శరీరాలు ఉన్నాయి. రెండింటిలోనూ ప్రపంచాలు ఉన్నాయి. అలాంటప్పుడు ఒకటే అనవచ్చు కదా అంటాడు. అతను అలా చెప్పటంవల్ల అతనికి కలిగే లాభం ఏమిటి? జాగ్రద్ ప్రపంచంలో వ్యవహారం బాహ్యజ్యోతివల్ల జరుగుతుందని చూశాము. స్వప్నప్రపంచం అంతరప్రపంచం కాబట్టి, బాహ్యజ్యోతి లేదు కాబట్టి అంతరజ్యోతివల్ల జరుగుతుందని చెప్పాము. ఆ అంతరజ్యోతి ఆత్మ అన్నాము. ఇప్పుడు స్వప్నప్రపంచం కూడా జాగ్రద్ ప్రపంచంలా బాహ్యప్రపంచం అయితే, దాన్ని కూడా బాహ్యజ్యోతి ప్రకాశింపజేస్తుంది అని వాదించవచ్చు. అప్పుడు అంతరజ్యోతియైన ఆత్మతో పనిలేదు. ఇదీ అతని వాదన. నిజానికి అలాంటి వాదన లేదు. ఒకవేళ ఉంటే, దానికి జవాబు ఈ మంత్రం.

**ఖండన** – స్వప్నప్రపంచం, జాగ్రద్ ప్రపంచం కాలేదు. ఎందుకు? జాగ్రద్ ప్రపంచం అయిన బాహ్యప్రపంచం పాంచభౌతికం, అంటే పంచభూతాలతో చెయ్యబడింది. దానికి మనస్సుతో సంబంధం లేదు; మనస్సు దాన్ని చూసినా చూడకపోయినా అది ఉంటుంది. అంటే రెండు అంశాలు – అది పాంచభౌతికం, స్వతంత్రం. స్వప్నప్రపంచానికి వస్తే అది వాసనామయ ప్రపంచం. అది మనస్సుమీద ఆధారపడివుంటుంది. అది కూడా స్వతంత్రం అయితే మన తలలో నిజం ఏనుగు, నిజం కొండలు ఉండాలి. అంటే రెండు భిన్న అంశాలు – అది వాసనామయం, అస్వతంత్రం. మనస్సు సృష్టించిన ఆలోచనలవల్ల ఏర్పడింది. అక్కడ నిజంగా వస్తువులు ఉండవు. ఈ నేపథ్యంతో ఈ మంత్రాన్ని చూద్దాము.

**న తత్ర రథా న రథయోగా న పంథానో భవంతి** – అక్కడ, అంటే స్వప్నంలో రథాలు లేవు, రథానికి కట్టే గుర్రాలు లేవు; రథాలు, గుర్రాలు వెళ్ళటానికి అవసరమైన మార్గాలు కూడా లేవు. మనం రథాల గురించి కల కనేటప్పుడు మన గదిలో రథాలు ఉంటాయా? ఉండవు కదా! అయితే ఇవి ఎలా వచ్చాయి?

**అథ రథాన్ రథయోగాన్ పథస్సృజతే** – ఆత్మే రథాలను, రథాలకు గుర్రాలను, అవి వెళ్ళే మార్గాలను సృష్టిస్తోంది.

**న తత్రానందా ముదః ప్రముదో భవంతి** – అక్కడ ప్రియ, మోద, ప్రమోదాలు లేవు.

**అథానందాన్ముదః ప్రముదస్సృజతే** – కాని ఆత్మే ప్రియ, మోద, ప్రమోదాలను సృష్టిస్తోంది.

ప్రియ మోద ప్రమోదాలు ఆనందంలో కలిగే తారతమ్యాలు. ఉదాహరణకు నాకు మామిడిపండును చూస్తే ఆనందం కలుగుతుంది. అది ప్రియం. దాన్ని కొని తెచ్చుకుని, నా ఎదురుగా పెట్టుకుంటే ఇంకా ఆనందం వేస్తుంది. అది మోదం. దాన్ని తింటే చాలా ఎక్కువ ఆనందం వేస్తుంది. అది ప్రమోదం. కాని ఇవి స్వప్నప్రపంచంలో కుదరవు. ఎందుకంటే అక్కడ వస్తువులు నిజంగా లేవు. ఆత్మే ఈ భావాలను కలిగిస్తుంది.

**న తత్ర వేశాంతాః పుష్కరిణ్యస్స్రవంత్యో భవంతి** – అక్కడ నీటి మడుగులు, సరస్సులు, నదులు లేవు. ఇవన్నీ మనం పడుకునే చిన్న పడకగదిలో ఇమడలేవు. అయినా వాటిని చూస్తాము.

**అథ వేశాన్తాన్ పుష్కరిణీస్స్రవన్తీస్సృజతే స హి కర్తా** – ఆత్మే నీటి మడుగులను, సరస్సులను, నదులను సృష్టిస్తున్నది. అందువల్ల ఆత్మ స్వప్నప్రపంచంయొక్క సృష్టికర్త అని ముగించింది ఉపనిషత్తు.

ఇక్కడ ఒక సందేహం రావచ్చు. శాస్త్రం పదేపదే ఆత్మ అకర్తా అని చెబుతున్నది మనస్సే స్వప్నప్రపంచాన్ని సృష్టిస్తుందని మన అనుభవం చెబుతుంది. మనస్సు ఎలా సృష్టిస్తుంది? జాగ్రదావస్థలో జరిగిన అనుభవాలను, వాసనల రూపంలో చిత్తంలో నిక్షిప్తం చేసుకుని, స్వప్నావస్థలో వాటిని బయటకు తీసి, స్వప్నప్రపంచాన్ని సృష్టిస్తుందని తెలుసు. అప్పుడు మనస్సు కర్తా, ఆత్మ అకర్తా అని చెప్పాలి. కాని ఉపనిషత్తు ఆత్మ కర్తా అని చెప్పింది.

నిజానికి దీనికి జవాబు ముందే చూశాము. మనస్సే జాగ్రద్ ప్రపంచాన్ని చూసి, స్వప్నప్రపంచాన్ని సృష్టించినా అది ఆత్మవల్లనే చూస్తుంది అని. మనస్సులో చైతన్యంయొక్క ప్రతిబింబం ఏర్పడుతుంది. దాన్ని చిదాభాస అంటాము. ఆ విధంగా మనస్సు కర్త, కాని మనస్సును చేయిస్తుంది కాబట్టి ఆత్మ కర్త.

ఆత్మ ఉపాధిద్వారా కర్తా భవతి.

## మంత్రం 4.3.11

**తదేతే శ్లోకా భవన్తి । స్వప్నేన శారీరమభిప్రహత్యా సుప్తస్సుప్తానభిచాకశీతి । శుక్రమాదాయ పునరైతి స్థానగ్ం హిరణ్మయః పురుష ఏకహగ్ంసః ॥**

**తదేతే శ్లోకా భవంతి** – ఉపనిషత్తే స్వయంజ్యోతి ఆత్మను వివరించే మరికొన్ని మంత్రాలను ఉటంకిస్తున్నది ఈ మంత్రంలోనూ, రాబోయే మంత్రాలలోనూ.

**స్వప్నేన శారీరమ్ అభిప్రహత్య** – స్వప్నావస్థద్వారా, ఆత్మ శరీరాన్ని చేష్టలుడిగిన దానినిగా చేస్తుంది. దాదాపు శవంలాగా చేస్తుంది. ఎందుకంటే అప్పుడు శరీరం బాహ్యప్రపంచాన్ని చూడదు, ఏం జరుగుతుందో తెలియదు. ఇక్కడ శరీరం అంటే శరీరమే.

**అసుప్తః సుప్తాన్ అభిచాకశీతి** – ఆత్మ శరీరాన్ని జడంగా చేసినా, తను నిత్య చైతన్యం. అసుప్తః అంటే నిత్యచైతన్యం. అది సుప్తాన్ అభిచాకశీతి అంటే స్వప్నపదార్థాలను చూస్తుంది.

**పునః స్థానమ్ ఏతి** – అంతేకాదు, కొంతసేపు కలను చూపించాక ఆత్మ మళ్ళీ జాగ్రదావస్థకు వెళుతుంది. ఆత్మకు నిజంగా ప్రయాణం లేదు. 'వెళ్ళినట్టుగా' అని అర్థం తీసుకోవాలి. ఎలా వెళుతుంది?

**శుక్రమ్ ఆదాయ** – ఇంద్రియాలను తీసుకుని. స్వప్నప్రపంచంలో ఇంద్రియాలను ఉపయోగించదు ఆత్మ. కాని జాగ్రదావస్థలో వ్యవహారం నడపాలంటే ఇంద్రియాలు కావాలి.

ఈ విధంగా ఆత్మ ఒక అవస్థనుంచి ఇంకొక అవస్థకు మారుతూ ఉంటుంది. మారటం అంటే నిజంగా వెళ్ళటం కాదని చూశాము. అవస్థలు మారుతున్నాయి కాని ఆత్మ కదలటం లేదు. సూర్యుడు ఉదయించాడు, సూర్యుడు అస్తమించాడు అని చెబుతాము. నిజానికి సూర్యుడు కదలడు, భూమే తిరుగుతుంది. ఇదే విధంగా ఆత్మ జాగ్రద్ ప్రపంచంలో ఉంటుంది. తర్వాత స్వప్నావస్థలోకి వెళుతుంది అంటే ఆయా అవస్థలు మారుతూ ఉంటాయి. అటువంటి ఆత్మ స్వరూపం ఏమిటి?

**హిరణ్మయః** – స్వయంజ్యోతి. బంగారంలా మెరిసిపోతుంది.

**పురుషః** – ఆత్మ, శరీరంలో ఉండే శరీరీని పురుషః అంటారు.

**ఏకహగ్ంసః** – ఒంటరిగా ప్రయాణం చేసేది. ఒంటరిగా అంటే ఉన్నది ఒకటే ఆత్మ. అది ప్రయాణం చేస్తున్నట్టుగా ఉంది. హంస పదం కఠోపనిషత్తులో వస్తుంది.

## మంత్రం 4.3.12

**ప్రాణేన రక్షన్నవరం కులాయం బహిష్కులాయాదమృతశ్చరిత్వా । స ఈయతేऽమృతో యత్ర కామగ్ం హిరణ్మయః పురుష ఏకహగ్ంసః ॥**

దాదాపుగా అదే భావన.

**ప్రాణేన రక్షన్నవరం కులాయం బహిష్కులాయాదమృతశ్చరిత్వా** – అమృతం అంటే ఆత్మ. ఈ ఆత్మ నికృష్టమైన శరీరాన్ని ప్రాణంతో రక్షిస్తూ, శరీరంనుంచి బయటకు వస్తుంది.

స్వప్నావస్థలో శరీరం మరణించినట్టుగా ఉంటుందని చూశాము. 'మరణించినట్టుగా' ఉంటుంది కాని నిజంగా మరణించదు. ఒకవేళ నిజంగా మరణిస్తే ఆ జీవి లేచేలోపు అతనిని శవంగా భావించి బయట పడుకోపెడతారు. అందువల్ల ఆత్మ శరీరాన్ని పంచప్రాణాలద్వారా సజీవంగా ఉంచుతుంది. అందువల్లనే జీవి నిద్ర పోతున్నా కూడా అతని ఉచ్ఛ్వాస, నిశ్వాసలు ఆగిపోవు. శరీరాన్ని అవరం అంటే నికృష్టం అని అంది ఉపనిషత్తు, ఎందుకు? ఎందుకంటే జన్మమృత్యుజరావ్యాధులకు లోనవుతుంది, అశుద్ధంగా ఉంటుంది కాబట్టి.

స్వప్నావస్థలో ఆత్మ శరీరంనుంచి బయటకు వస్తుంది అంటే నిజంగా కాదు, 'వచ్చినట్టుగా' ఉంటుంది అని తీసుకోవాలని చూశాము. ఆత్మ సర్వవ్యాపకం, దానికి ప్రయాణం లేదు. ఇక్కడ అర్థం ఆత్మ శరీరంద్వారా పని చెయ్యదు. ఎక్కడికి వెళుతుంది?

**స ఈయతేఽ మృతో యత్ర కామగ్ం** – ఈ అమృతమైన ఆత్మ ఇంకో లోకానికి వెళుతుంది. ఇంకో లోకం అంటే స్వప్నలోకం. కామ అంటే స్వప్నపదార్థాలు లేదా వాసనామయ పదార్థాలు ఉన్న చోటికి వెళుతుంది. 'వెళ్ళినట్టుగా' చేస్తుంది. ఆ ఆత్మ ఎలా ఉంటుంది? హిరణ్మయ పురుష ఏకహగ్ంస.

మంత్రం 4.3.13

**స్వప్నాన్త ఉచ్చావచమీయమానో రూపాణి దేవః కురుతే బహూని ॥ ఉతేవ స్త్రీభిస్సహ మోదమానో జక్షదుతేవాపి భయాని పశ్యన్ ॥**

ఇందులో కూడా స్వప్నంలో ఏం జరుగుతుందో వర్ణన వస్తుంది.

**స్వప్నాంత** – స్వప్నం చివర్లో అని కాదు, స్వప్నావస్థలో.

**ఉచ్చావచమీయమానః** – ఉత్కృష్టమైన దేవ శరీరాన్నో లేదా నికృష్టమైన పశు శరీరాన్నో పొందుతుంది ఆత్మ. ఇప్పుడున్న మానవ శరీరం చలనం లేకుండా ఉంటుందని చూశాము కదా! స్వప్నంలో ఎక్కువ స్థాయిలోనో, తక్కువ స్థాయిలోనో వేరే శరీరం తీసుకుంటుంది ఆత్మ. ఇలా ఇంకో శరీరం తీసుకుని, కలలో అనేక వస్తువులను సృష్టిస్తుంది స్వయంజ్యోతి ఆత్మ. మళ్ళీ ఆత్మ సృష్టిస్తుంది అంటే 'సృష్టిస్తున్నట్టుగా' ఉంది అనుకోవాలి. ఎందుకంటే ఆత్మ మనస్సుద్వారా కలను చూస్తుంది అని అంతకుముందు చూశాము. కలలో అనుభవించేవి ఏవి?

**రూపాణి దేవః కురుతే బహూని** – అనేక రూపాలను సృష్టిస్తాడు.

**ఉతేవ స్త్రీభిస్సహ మోదమానో జక్షదుతేవాపి భయాని పశ్యన్** – స్త్రీలతో కలిసి ఆనందిస్తాడు, నవ్వుతాడు, భయపడతాడు. స్త్రీలతో అంటే తక్కిన మనుష్యులందరితో అని అర్థం. కాసేపు ఆనందిస్తాడు, కాసేపు భయపడతాడు. ఆత్మ ఏమీ అనుభవించదు, మనస్సుద్వారా అనుభవిస్తోంది.

మంత్రం 4.3.14

**ఆరామమస్య పశ్యన్తి న తం పశ్యతి కశ్చనేతి । తం నాయతం బోధయేదిత్యాహుః । దుర్భిషజ్యగ్ం హాస్మై భవతి యమేష న ప్రతిపద్యతే । అథో ఖల్వాహుర్జాగరితదేశ ఏవాస్యైష ఇతి యాని హ్యేవ జాగ్రత్పశ్యతి తాని సుప్త ఇత్యత్రాయం పురుషస్స్వయంజ్యోతిర్భవతి ॥ సోఽ హం భగవతే సహస్రం దదామ్యత ఊర్ధ్వం విమోక్షాయ బ్రూహీతి ॥**

**అస్య ఆరామం పశ్యంతి** – ఆరామం అంటే క్రీడాస్థానం. స్వప్నంలో ఆత్మ తను సృష్టించిన క్రీడాస్థానాన్ని చూస్తుంది. అంటే అనేక అనుభవాలను అనుభవిస్తుంది. ఆత్మ సృష్టిస్తుంది, అనుభవిస్తుంది అన్నప్పుడల్లా జాగ్రత్తగా ఉండాలి. ఆత్మ సృష్టించదు, అనుభవించదు. ఆత్మ మనస్సుద్వారా స్వప్నాన్ని సృష్టిస్తుంది, మనస్సుద్వారా అనుభవిస్తుంది.

**తం కశ్చన న పశ్యతి** – ఆత్మను ఏదీ ప్రకాశింపజేయలేదు. ఆత్మ మనస్సును ప్రకాశింపజేస్తుంది కాని, మనస్సు ఆత్మను ప్రకాశింపజేయలేదు. తనను తానే ప్రకాశింపజేసుకోలేని మనస్సు, ఆత్మనెలా ప్రకాశింపజేస్తుంది? ఎవరూ ప్రకాశింపజేయ లేకపోతే, ఆత్మను ఎవరు ప్రకాశింపజేస్తారు? ఆత్మ స్వయం ప్రకాశకజ్యోతి.

**ఇతి** – ఇక్కడితో ఋగ్ మంత్రాలు అయిపోయాయి.

ఇక్కడ ఉపనిషత్తు ఒక గొప్ప సత్యాన్ని చెప్పబోతున్నది.

**తమ్ ఆయతం న బోధయేదిత్యాహుః** – నిద్రపోతున్న వానిని హఠాత్తుగా లేపకూడదు అని చెబుతారు.

ఇంద్రియాల విషయానికి వచ్చేసరికి రెండు అంశాలు ఉంటాయి. అవి – ఇంద్రియం, గోళకం. ఇంద్రియం సూక్ష్మశరీరానికి చెందినది; గోళకం స్థూలశరీరానికి చెందినది. బాహ్యంగా కనబడే కన్ను గోళకం. దానికి చూసే శక్తి ఇంద్రియంవల్ల వస్తుంది. జాగ్రదావస్థలో ఇంద్రియాలు గోళకంతో కలిసివుంటాయి. అందువల్ల జాగ్రద్ ప్రపంచాన్ని చూడగలుగుతాము. స్వప్నంలో ఇంద్రియాలు గోళకంనుంచి విడిపోతాయి. ఇంద్రియాలు పడుకుంటాయి అంటే అర్థం అది. గోళకంలో ఇంద్రియశక్తి ఉండదు. అందువల్ల ఎంత పెద్ద శబ్దం అవుతున్నా చెవులు వినలేవు.

నిద్రపోతున్న వ్యక్తిని హఠాత్తుగా లేపకూడదని డాక్టర్లు చెబుతారు. హఠాత్తుగా లేపితే ఏమవుతుంది? నిద్ర లేచాక, పంచజ్ఞానేంద్రియాలు వాటివాటి గోళకాలకు వెళతాయి.

**యం ఏషః న ప్రతిపద్యతే – దుర్భిషజ్యగ్ం హాస్మై భవతి.**

కాని అలా ఉన్నట్టుండి లేచేసరికి ఇంద్రియాలు ఖంగారు పడిపోయి, ఒకచోటికి వెళ్ళాల్సినవి ఇంకోచోటికి వెళతాయి. కన్ను ఇంద్రియం కంటి గోళకానికి వెళ్ళకుండా వేరే ఎక్కడికో వెళ్ళే ప్రమాదముంది.

అప్పుడు కంటిచూపు దెబ్బతింటుంది. ఒక్కోసారి ఆ ప్రమాదం ఎంత ఎక్కువగా ఉంటుందంటే, మళ్ళీ కంటిచూపు తిరిగిరాదు. దీన్ని మెడికల్ సైన్స్‌లో సినస్తీషియా అంటారు.

ఈ విషయం ఎందుకు చెప్పింది ఉపనిషత్తు? అంటే దీన్నిబట్టి ఒక విషయం స్పష్టంగా అర్థమవుతున్నది. స్వప్నంలో జీవుడు స్థూలశరీరాన్ని వదిలిపెట్టి, సూక్ష్మశరీరంద్వారా కలకంటాడు. అంటే జీవుడు శరీరం కాదు. దీనికి చిన్న తర్కం చాలు. దేన్నైతే మనం వదులుకోగలమో, అది మన స్వరూపం కాదు. స్వప్నంలో స్థూలశరీరాన్ని వదులుకుంటున్నాము కాబట్టి అది మన స్వరూపం కాదు.

పదవ మంత్రం చూసినప్పుడు, పద్నాల్గవ మంత్రంలో పూర్వపక్షి ఒక వాదనను లేవదీశాడని చూశాము.

**అథో ఖలు ఆహుః** – కొందరు ఇలా అంటారు, ఏమని?

**జాగరితదేశ ఏవాస్యైష ఇతి** – స్వప్నప్రపంచం కూడా జాగ్రద్ ప్రపంచం లాంటిదే అంటారు. ఎందుకు?

**యాని హ్యేవ జాగ్రత్పశ్యతి తాని సుప్త ఇతి** – జాగ్రదావస్థలో అయితే ఏ వస్తువులను చూస్తున్నాడో, స్వప్నావస్థలో కూడా అవే వస్తువులను చూస్తున్నాడు. స్వప్నంలో కూడా దేశకాలాలు ఉన్నాయి; సుఖదుఃఖాలు ఉన్నాయి, ఇంద్రియాలు ఉన్నాయి, పదార్థాలు ఉన్నాయి. అందువల్ల అది ఒకచోటునుంచి ఇంకోచోటుకి, జాగ్రదావస్థలోనే వెళ్ళినట్టు తీసుకోవచ్చు కదా!

ఈ ప్రశ్నకు ఇక్కడ యాజ్ఞవల్క్యుడు సమాధానం చెప్పడు; ఉపనిషత్తు కూడా చెప్పదు. మనమే పదవ మంత్రంలో చూసిన జవాబును ఇక్కడికి తెచ్చుకోవాలి. ఏమిటది?

జాగ్రద్ప్రపంచం పాంచభౌతికం, స్వతంత్రం; స్వప్నప్రపంచం వాసనామయప్రపంచం, అస్వతంత్రం. స్వప్నావస్థలో ఇంద్రియాలు పనిచెయ్యవు. మనస్సు సృష్టిస్తుంది ప్రపంచాన్ని. అది నిజంగా ఉండాలంటే అంత పెద్ద ప్రపంచం మన మనస్సులో ఎలా ఇముడుతుంది? స్వప్నంలో చూసే రథాలు, గుర్రాలు, మార్గాలు నిజంగా లేవు, మనస్సు చూస్తుంది.

పూర్వపక్షి స్వప్నప్రపంచాన్ని బాహ్యప్రపంచంగా ఎందుకు తీసుకోవాలంటున్నాడు? అప్పుడు స్వప్నాన్ని చూసేది అంతరజ్యోతి కాదు, బాహ్యజ్యోతి అని చెప్పవచ్చని అతని ఉద్దేశం. కాని మనం స్వప్నం బాహ్యం కాదని నిరూపించాము కాబట్టి స్వప్నాన్ని ప్రకాశింపజేసేది బాహ్యజ్యోతి కాదు అని చెప్పకనే చెప్పినట్టవుతుంది. ఈ జవాబు చెప్పుకున్నాక, మంత్రంలో మిగిలిన భాగం చూద్దాము.

**అత్రాయం పురుషస్స్వయంజ్యోతిర్భవతి** – స్వప్నం బాహ్యప్రపంచం కాదు, అందువల్ల బాహ్యప్రకాశకం లేదు; స్వప్నంలో ఆత్మప్రకాశకమే ఉంది. ఆత్మ స్వయం ప్రకాశం. ఇది ఆత్మయొక్క రెండవ నిర్వచనం.

ఈ విధంగా యాజ్ఞవల్క్యుడు ఋగ్ మంత్రాలద్వారా (11, 12, 13, మొదటిపాదం 14) **ఆత్మ స్వయం ప్రకాశకజ్యోతి** అని, అది **శరీరానికి భిన్నంగా ఉంద**నీ నిరూపించాడు.

జనకుడు ఆత్మ గురించిన ఈ రెండు విషయాలనూ బాగా అర్థం చేసుకున్నాడు. ఇక్కడితో బోధ ముగిసిందా?

**అత ఊర్ధ్వం విమోక్షాయ బ్రూహీతి** – ఇంకా ఆత్మ గురించి, మోక్షం గురించి చెప్పమంటున్నాడు జనకుడు. ఇంతవరకూ చెప్పినదానికి దక్షిణ ఇస్తానంటున్నాడు. ఏమిటది?

**సోऽహం భగవతే సహస్రం దదామి** – ఓ భగవాన్ నీకు వెయ్యి ఇస్తాను అన్నాడు. ఆవులని శంకరులవారు కలిపారు.

## మంత్రం 4.3.15

**స వా ఏష ఏతస్మిన్ సమ్ప్రసాదే రత్వా చరిత్వా దృష్ట్వైవ పుణ్యం చ పాపం చ । పునః ప్రతిన్యాయం ప్రతియోన్యాద్రవతి స్వప్నాయైవ ॥ స యత్తత్ర కిఞ్చిత్పశ్యత్యనన్వాగతస్తేన భవత్యసఙ్గో హ్యయం పురుష ఇత్యేవమేవైతద్యాజ్ఞవల్క్య సోऽహం భగవతే సహస్రం దదామ్యత ఊర్ధ్వం విమోక్షాయైవ బ్రూహీతి॥**

ఇప్పటిదాకా ఆత్మ గురించి రెండు విషయాలను చూశాము. అవి – 1) **ఆత్మ దేహవ్యతిరిక్తం** 2) **ఆత్మ స్వయంప్రకాశకం**. ఇప్పుడు మూడవ అంశం చూడబోతున్నాము. 3) **ఆత్మ కర్మ విలక్షణం** లేదా కర్మ సంబంధ రహితం. కర్మలు మూడు రకాలు – సంచితకర్మ, ప్రారబ్ధకర్మ, ఆగామికర్మ. కాని ఆత్మ ఈ కర్మలకు విలక్షణంగా ఉంది. ఈ కర్మఫలాలు ఆత్మకు అంటవు. ఈ విషయం ఎలా చూపించబోతున్నాడు యాజ్ఞవల్క్యుడు?

స్వప్నవృత్తాంతాన్ని తీసుకుంటున్నాడు మళ్ళీ. స్వప్నంలో జీవుడు కొన్ని కర్మలు చేస్తాడు. ఆ కర్మలయొక్క ఫలాలను కూడా అనుభవిస్తాడు. కాని స్వప్నంనుంచి లేచి జాగ్రదావస్థకు వస్తే ఆ కర్మలు కాని, ఆ కర్మఫలాలు కాని ఉండవు. తర్వాత జాగ్రదావస్థలో కొన్ని కర్మలు చేస్తాడు, కొన్ని కర్మఫలాలు అనుభవిస్తాడు. కాని అతను మళ్ళీ స్వప్నంలోకి వెళ్ళేసరికి ఈ కర్మలు కాని, ఈ కర్మఫలాలు కాని ఉండవు. అంటే ఒక అవస్థలోని కర్మలు, కర్మఫలాలు ఇంకో అవస్థకు వెళ్ళటం లేదు. అవి తాత్కాలికంగా వస్తున్నాయి, పోతున్నాయి. అలా వచ్చి పోయేది శాశ్వతం కాదు, ఆత్మ నిత్యం; శాశ్వతం. అందువల్ల ఆత్మకు కర్మ అంటదు.

**స వా ఏషః (స్వప్నే)** – ఈ జీవుడు స్వప్నంలో అని కలుపుకోవాలి. ఈ జీవుడు ఏం చేస్తాడు?

**రత్వా** – ఆనందించి;

**చరిత్వా** – సంచరించి;

**దృష్ట్వైవ పుణ్యం చ పాపం చ** – పుణ్యపాపాలు అనుభవిస్తాడు.

ఆనందించి, సంచరించి అంటే అనేక కర్మలను చేస్తాడు. ఉదాహరణకు అతను జాగ్రదావస్థలో కాసేపు టీవీ చూస్తాడు, వంటింట్లోకి వెళతాడు ఏదో తింటాడు. అలా స్వప్నంలో కూడా అనేకం చూసాడు. వాటికి తగ్గ పుణ్యపాపాలు కూడా అనుభవిస్తాడు. పుణ్యపాపాలు అదృష్టం కదా, కంటికి కనిపించని వాటిని ఎలా అనుభవిస్తాడు? పుణ్యపాపాలు అంటే పుణ్యపాప కర్మఫలాలు అనుభవిస్తాడు. అంటే ఆనందకరమైన అనుభవాలు పొందుతాడు, బాధించే అనుభవాలు కూడా పొందుతాడు. ఎక్కడ? స్వప్నంలో. తర్వాత ఏం చేస్తాడు?

**ఏతస్మిన్ సంప్రసాదే (రత్వా)** – సుషుప్తిలోకి వెళతాడు. సుషుప్తికి ఒక సాంకేతిక పదాన్ని చూస్తున్నాము ఇక్కడ. అది సంప్రసాదం.

**సమ్యక్ ప్రసీదత్యస్మిన్నితి సంప్రసాదః**

అంటే సుషుప్తిలో అన్ని అంగాలూ పూర్తిగా పడుకుంటాయి. స్వప్నంలో మనస్సు పని చేస్తుంది. సుషుప్తిలో మనస్సు కూడా పడుకుంటుంది. అందువల్ల స్వప్నాన్ని ప్రసాదః అనీ సుషుప్తిని సంప్రసాదః అనీ అంటారు.

**పునః స్వప్నాయ ఏవ ఆద్రవతి** – సుషుప్తిలో కాసేపు గాఢనిద్ర పోయాక, మళ్ళీ స్వప్నప్రపంచానికి తిరిగి వస్తాడు. అంటే స్వప్నాన్ని చూస్తాడు, గాఢనిద్రపోతాడు. మళ్ళీ స్వప్నానికి తిరిగివస్తాడు. ఎలా వస్తాడు?

**ప్రతిన్యాయమ్ (ఆద్రవతి)** – వెళ్ళిన మార్గంలోనే తిరిగివస్తాడు. ఎక్కడికి?

**ప్రతియోని** – యోని అంటే స్థానం లేదా అవస్థ. ఇక్కడ అదే అవస్థకు వస్తాడు అంటే మళ్ళీ స్వప్నావస్థకు వస్తాడు.

**స యత్తత్ర కించిత్పశ్యతి** – ఆ జీవుడు స్వప్నంలో ఏం అనుభవించినా,

**తేన అనన్వాగతః భవతి** – దానితో బంధింపబడతాడు. జీవునికి కర్మఫలాలతో సంగత్వం లేదు. అతనికి కర్మ ఫలాలతో సంగత్వం లేదని ఎలా నిరూపించగలము? అతను సుషుప్తికి వెళ్ళినప్పుడు వాటిని వదిలేస్తున్నాడు, మళ్ళీ స్వప్నంలోకి వచ్చినప్పుడు మళ్ళీ అనుభవిస్తున్నాడు. అందువల్ల పుణ్యపాపాలు వచ్చిపోయేవి. అవి స్వాభావికం అయితే, అవి మూడు అవస్థల్లోనూ ఉండాలి.

జీవునికి చైతన్యం స్వాభావికం. ఎందుకంటే చైతన్యం మూడు అవస్థల్లోనూ ఉంటుంది కాబట్టి. స్వాభావికం అయినది ఎప్పుడూ ఉంటుంది. పుణ్యపాపాలు ఒక అవస్థలో ఉండి, ఇంకో అవస్థలో పోతాయి.

**అసంగో హి అయం పురుషః ఇతి** – ఆత్మ అసంగం. ఈ వాక్యంతో యాజ్ఞవల్క్యుడు ఈ విషయాన్ని ముగిస్తున్నాడు. ఇది కూడా అక్షరలక్షలు విలువ చేసే వాక్యం.

స్వప్న అనుభవాలు మనస్సులో ఏర్పడే తాత్కాలిక వృత్తి మార్పు. మనస్సు ఆత్మవల్ల ప్రకాశింపబడుతున్నది. నేను మనస్సు కాదు, ఆత్మను. అందువల్ల అనుభవాలు మనస్సుకు చెందుతాయి కాని చైతన్యమైన నాకు చెందవు. ఆత్మగా నేను పుణ్యపాపవిలక్షణం. నేను మనస్సు అనుకుంటే మూడు అవస్థల్లోనూ తిరగాలి. ఆత్మ కర్మలక్షణం.

**ఏవ మే వైతద్యాజ్ఞవల్క్య** – ఓ యాజ్ఞవల్క్యా, నీ బోధ నాకు అర్థమయింది. మళ్ళీ ముందు మంత్రంలో లాగానే అంటున్నాడు.

**సోఽహం భగవతే సహస్రం దదామ్యత ఊర్ధ్వం విమోక్షాయైవ బ్రూహీతి** – ఓ భగవాన్, నీకు వెయ్యి ఆవులను ఇస్తాను. మోక్షం గురించి ఇంకా చెప్పు.

## మంత్రం 4.3.16

**స వా ఏష ఏతస్మిన్ స్వప్నే రత్వా చరిత్వా దృష్ట్వైవ పుణ్యం చ పాపం చ పునః ప్రతిన్యాయం ప్రతియోన్యాద్రవతి బుద్ధాన్తాయైవ స యత్తత్ర కిఞ్చిత్పశ్యత్యనన్వాగతస్తేన భవత్యసఙ్గో హ్యయం పురుష ఇత్యేవమేవైతద్యాజ్ఞవల్క్య సోఽహం భగవతే సహస్రం దదామ్యత ఊర్ధ్వం విమోక్షాయైవ బ్రూహీతి ॥**

ఈ మంత్రం ఇంచుమించుగా పూర్వ మంత్రంలాంటిదే. ఒక్కటే చిన్న వ్యత్యాసం ఉంది. ముందు మంత్రంలో జీవుడు స్వప్నంనుంచి సుషుప్తికి, సుషుప్తినుంచి స్వప్నానికి వెళుతుంటాడు అన్నాడు. కాకపోతే అక్కడ సుషుప్తి బదులు సంప్రసాదే పదం వేశాడు యాజ్ఞవల్క్యుడు. ఇక్కడ సంప్రసాదే బదులు బుద్ధాంతాయైవ పదం వేశాడు. అది తప్పితే మిగిలినవన్నీ అవే అంశాలు.

అంటే జీవుడు స్వప్నంనుంచి సుషుప్తికీ, సుషుప్తినుంచి స్వప్నానికీ మాత్రమే తిరగడు. వాటినుంచి జాగ్రదావస్థకు కూడా వస్తాడు. జాగ్రదావస్థను బుద్ధాంతం అన్నాడు. స్వప్నావస్థను ముందు మంత్రాల్లో స్వప్నాంతం అన్నాడు. అందువల్ల జాగ్రత్, స్వప్న, సుషుప్తి అవస్థలకు వరుసగా బుద్ధాంతం, స్వప్నాంతం, సంప్రసాదం అనే కొత్త పదాలను చూస్తాము.

ఈ మంత్రం సారాంశం చూద్దాము – అనేక పుణ్యపాపాలను అనుభవించాక, జీవుడు మళ్ళీ బుద్ధాంతానికి అంటే జాగ్రదావస్థకు వస్తాడు. ఇక్కడ కూడా అదే సూత్రం వర్తిస్తుంది. జాగ్రదావస్థలో అనుభవించేవి తక్కిన అవస్థల్లో అనుభవించడు. ఇది అనుభవించేది మనస్సు, ఆత్మనైన నేను అసంగం. **అసంగోహి అయం పురుషః.**

జనకుడు 'నాకు బాగా అర్థమయింది, నీకు వెయ్యి ఆవులను ఇస్తాను, నాకు మోక్షం గురించి ఇంకా చెప్పు' అన్నాడు.

16వ మంత్రం, 17వ మంత్రం ఆత్మయొక్క ఇంకొక లక్షణాన్ని సూచిస్తున్నాయి. 4) కామవిలక్షణం లేదా కామసంబంధరహితం.

### మంత్రం 4.3.17

**స వా ఏష ఏతస్మిన్ బుద్ధాన్తే రత్వా చరిత్వా దృష్ట్వైవ పుణ్యం చ పాపం చ పునః ప్రతిన్యాయం ప్రతియోన్యాద్రవతి స్వప్నాన్తాయైవ ॥**

ఇంచుమించు అదే భావన, మళ్ళీ అవే మాటలు. అందువల్ల దాని సారాంశాన్ని చూద్దాము. జాగ్రదావస్థలో కూడా జీవుడు పుణ్యపాపాలను అనుభవించి, మళ్ళీ స్వప్నావస్థలోకి వెళతాడు. **పురత్రయే క్రీడతి** అని కైవల్యోపనిషత్తులో వస్తుంది. అంటే మూడు అవస్థల్లోనూ తిరుగుతూ ఉంటాడు. దీన్నిబట్టి జీవుడు మూడు అవస్థల్లో ఏ అవస్థకూ చెందదని తెలుస్తున్నది. ఒకవేళ ఏదో ఒక అవస్థకు చెందితే అతను శాశ్వతంగా ఆ అవస్థకు చెందినవాడు అవుతాడు.

ఈ అవస్థలు మారుతున్నాయన్న నిజాన్ని ఆధారం చేసుకుని జీవుడు జాగ్రద్‌పురుషుడు కాదు, స్వప్నపురుషుడు కాదు, సుప్తపురుషుడు కాదు, ఈ మూడు అవస్థల్లోనూ తిరిగేది మనస్సు అని చెప్పవచ్చు. జీవస్వరూపం ఏమిటి? సాక్షిచైతన్యం. ఇది అంతకుముందు మంత్రం కలిపి కామసంబంధరహితం.

ఇప్పటిదాకా చూసిన ఆత్మ లక్షణాలు నాలుగు. అవి 1) ఆత్మ దేహవ్యతిరిక్తం, 2) ఆత్మ స్వయంప్రకాశకం, 3) ఆత్మ కర్మవిలక్షణం, 4) ఆత్మ కామవిలక్షణం.

### మంత్రం 4.3.18

**తద్యథా మహామత్స్య ఉభే కూలే అనుసఞ్చరతి పూర్వం చాపరం చైవమేవాయం పురుష ఏతావుభావన్తావనుసఞ్చరతి స్వప్నాన్తం చ బుద్ధాన్తం చ ॥**

ఇందులో ఒక ఉదాహరణనిస్తున్నాడు యాజ్ఞవల్క్యుడు. మహామత్స్యదృష్టాంతం.

**మహామత్స్య** – అంటే పెద్దచేప. ఆత్మ అసంగం అని నిరూపించటానికి, నీటిలో ఉన్న పెద్దచేప నీటి ప్రవాహానికి ఎలా కొట్టుకునిపోకుండా ఉంటుందో చూపిస్తున్నాడు. 'నేను అసంగం,' అని ఎవరన్నారు? నాకు మోకాలు నొప్పిగా ఉంది,' అని ఎవరైనా అంటే, వారు చెబుతున్నది ఆత్మ గురించి కాదు, శరీరం గురించి. శరీరానికి నొప్పి ఉండదని శాస్త్రం చెప్పదు.

**ఉభే కూలే అనుసంచరతి పూర్వం చాపరం చ** – ఎలాగైతే పెద్ద చేప ఇటు ఒడ్డుకి కాసేపు, అటు ఒడ్డుకి కాసేపు తిరుగుతుందో,

**ఏవమేవాయం పురుష ఏతావుభావంతావనుసంచరతి** – అదే విధంగా ఈ జీవుడు రెండు అవస్థల మధ్య తిరుగుతాడు. పెద్దచేప ఒక్కోసారి మధ్యలో ఉంటుంది. ఒక్కోసారి ఇటు చివరికో, అటు చివరికో వెళుతుంది. దేనితోనూ దానికి సంగం లేదు. నీటిప్రవాహం కూడా చేపను ఏమీ చెయ్యలేదు.

**స్వప్నాన్తం చ బుద్ధాన్తం చ** – అలాగే జీవుడు స్వప్నావస్థకీ, జాగ్రదావస్థకీ తిరిగి అలసిపోయినప్పుడు చేప మధ్యలో ఉండిపోయినట్టుగా సుషుప్తిలో ఉంటాడు. ఆ విధంగా జీవుడు అసంగుడు. ఈ కదిలేది మనస్సు, ఆత్మ కదులుతున్నట్టు ఉన్నా కదిలేది మనస్సు. సాక్షిచైతన్యమైన నేను అవస్థాత్రయ విలక్షణం.

నేను మూడు అవస్థల్లోనూ విశ్వ, తైజస, ప్రాజ్ఞగా వ్యవహారం నడుపుతాను కాని నిజానికి నేను తురీయాన్ని. ఈ విషయం మాండూక్యంలో వస్తుంది కాని ఈ విషయం అర్థమవటానికి ఇక్కడ పెద్దచేప ఉదాహరణ వస్తుంది. నిజానికి ఇటువంటి ఉదాహరణ వేరే ఏ ఉపనిషత్తులోనూ చూడము. ఎలాగైతే పెద్దచేప నీటి ప్రవాహానికి కొట్టుకుపోదో, అలా ఆత్మకు శరీరంయొక్క పుణ్యపాపాలవల్ల ఏమీ అవదు.

## మంత్రం 4.3.19

**తద్యథాఽస్మిన్నాకాశే శ్యేనో వా సుపర్ణో వా విపరిపత్య శ్రాన్తస్సగ్ంహత్య పక్షౌ సంలయాయైవ ధ్రియత ఏవమేవాయం పురుష ఏతస్మా అన్తాయ ధావతి యత్ర సుప్తో న కఞ్చన కామం కామయతే న కఞ్చన స్వప్నం పశ్యతి ॥**

ఇది కూడా ఉపసంహార మంత్రం. ఇక్కడ ఉదాహరణ పక్షి. ముందు దాంట్లో పెద్దచేప. రెండింటిలోనూ భావం ఒకటే. ఉదాహరణల్లో పెద్దచేప తిరుగుతుంది, పక్షి ఎగురుతుంది, కాని ఆత్మ తిరగదు. సూర్యుడు ఉదయిస్తున్నాడు, అస్తమిస్తున్నాడు అంటాము కాని నిజానికి సూర్యుడు కదలటం లేదు. భూమే తిరుగుతోందని మనకు తెలుసు. అలాగే ఇక్కడ మనస్సు తిరుగుతుంది కాని ఆత్మ అవస్థాత్రయ సాక్షి.

ఒక పక్షి ఆహారం వెతుక్కుంటూ ఆకాశమంతా తిరుగుతుంది. పగలంతా తిరిగి తిరిగి అలసిపోయి, తన గూడు చేరుకుంటుంది. పగలు తిరిగినప్పుడు అనేక అనుభవాలను పొందుతుంది. అదే విధంగా జీవుడు స్థూల, సూక్ష్మశరీరాలతో మమేకం చెంది, జాగ్రదావస్థలో, స్వప్నావస్థలో తిరుగుతూ ఉంటాడు. జాగ్రదావస్థలో అనేక అనుభవాలను పొందుతాడు. స్వప్నావస్థలో కూడా అనేక అనుభవాలను స్వప్నంద్వారా పొందుతాడు. ఈ సంసారం బాధనుంచి తప్పించుకోవటానికి చూస్తాడు.

అవస్థలు పడీపడీ అలసిపోయి, విశ్రాంతికోసం సుషుప్తి అవస్థలోకి వెళతాడు. అంటే కారణశరీరంలోకి వెళతాడు. సుషుప్తిలో ద్వైతం లేదు; అవస్థలు లేవు; మనస్సు, ఇంద్రియాలు, శరీరం కూడా పడుకుంటాయి కాబట్టి రాగద్వేషాలు లేవు, వ్యవహారాలు లేవు. కేవలం విశ్రాంతి మాత్రమే ఉంది. అందువల్ల సుషుప్తిని మోక్షం అంటారు. కాకపోతే ఇది తాత్కాలిక మోక్షం, పొద్దున్న లేస్తూనే సంసారం తిరిగి వస్తుంది. అదీ ఈ మంత్రం సారాంశం. ఇప్పుడు మంత్రం చూద్దాము.

**తద్యథాఽస్మిన్నాకాశే శ్యేనో వా సుపర్ణో వా విపరివత్య శ్రాంతో** – ఏ విధంగా ఆకాశంలో డేగ గాని, గరుడపక్షి గాని అన్నివైపులా ఎగిరి; విపరివత్య అంటే ఎగిరి.

**సగ్ంహత్య పక్షౌ సంలయాయైవ ధ్రియతే** – అలసిపోయిన పక్షి, ఏవిధంగా అయితే రెక్కలు ముడుచుకుని తన గూడు వైపు వెళుతుందో. ఇంతవరకూ దృష్టాంతం. శ్రాన్త అంటే అలసిపోవటం; సంహత్య పక్షౌ అంటే రెక్కలు ముడుచుకుని; సంలయాయైవ ధ్రియతే – తనను తన గూడువైపుకు తిప్పుకుంటుంది. ఇప్పుడు దార్ష్టాంతం.

**ఏవమేవ అయం పురుష** – ఇదే విధంగా ఈ పురుషుడు;

**ఏతస్మా అంతాయ ధావతి** – సుషుప్తికోసం పరుగెడతాడు. పక్షిలాగా అతను కూడా అనేక అనుభవాలను పొంది, అలసిపోయి, విశ్రాంతికోసం తన గూడు అయిన సుషుప్తికి చేరుకుంటాడు. ఇక్కడ సుషుప్తి నిర్వచనం చూస్తాం.

**యత్ర సుప్తో న కంచన కామం కామయతే న కంచన స్వప్నం పశ్యతి** – సుషుప్తిలో ఏ విషయవస్తువులనీ కోరదు; ఏ స్వప్నాన్నీ చూడదు. సుషుప్తిలో కోరికలు ఉండవు కాబట్టి, అతను జీవన్ముక్తుడులాగా ఉంటాడు, కాని ఇది శాశ్వతమైన జీవన్ముక్తిని ఇవ్వదు.

ఇక్కడ కామః అంటే విషయవస్తువులు. ఎందుకు ఏ వస్తువునూ కోరదు? సుషుప్తిలో ద్వైతం ఉండదు. సుషుప్తిలో ఉన్నదొకటే అద్వైతం. కోరిక ఉండాలంటే ద్వైతం ఉండాలి. కోరిక అంటే కోరే వ్యక్తి తాను కోరే వస్తువుకు భిన్నంగా ఉండాలి.

**ద్వైత అభావాత్ విషయ అభావాత్ భేద అభావాత్ కామ అభావః**

స్వప్నంలో కూడా ద్వైతం ఉంటుంది. అదీ జీవుడు సృష్టించిన ద్వైతమే. సుషుప్తిలో అలా జీవుడు సృష్టించిన ద్వైతం కూడా ఉండదు. తస్మై అంతాయ – అటువంటి సుషుప్తి అవస్థకు జీవుడు వెళతాడు.

చేప, పక్షుల ఉదాహరణలనుంచి, యాజ్ఞవల్క్యుడు అందించిన సందేశం ఇది. జాగ్రద్, స్వప్నావస్థల్లో జీవుడు పడిన బాధలను సుషుప్తిలో విదిలించుకో గలుగుతున్నాడు అంటేనే బంధం తన స్వరూపం కాదు. ఎందుకు? స్వరూపాన్ని వదులుకోలేము. నిద్రలో అన్నీ పోతున్నాయి కదా! నిద్రలో అన్నీ పోయినా మిగిలింది ఏమిటి? చైతన్యం! ఆ చైతన్యమే నా స్వరూపం. నేను అసంగుడిని.

## మంత్రం 4.3.20

**తా వా అస్యైతా హితా నామ నాడ్యో యథా కేశస్సహస్రధా భిన్నస్తావతాఽణిమ్నా తిష్ఠన్తి శుక్లస్య నీలస్య పిఙ్గలస్య హరితస్య లోహితస్య పూర్ణాః ॥ అథ యత్రైనం ఘ్నన్తీవ జినన్తీవ హస్తీవ విచ్ఛాయయతి గర్తమివ పతతి యదేవ జాగ్రద్భయం పశ్యతి తదత్రావిద్యయా మన్యతే ॥ అథ యత్ర దేవ ఇవ రాజేవాహమేవేదగ్ం సర్వోఽస్మీతి మన్యతే సోఽస్య పరమో లోకః ॥**

ఈ మూడు అవస్థలనూ పరిశీలిస్తే, నేను జాగ్రద్, స్వప్నావస్థల్లో ద్వైతాన్ని అనుభవిస్తాను, సంసారాన్ని అనుభవిస్తాను, సుషుప్తిలో అద్వైతాన్ని అనుభవిస్తాను, మోక్షాన్ని అనుభవిస్తాను. రెండు అవస్థల్లో సంసారసహితం అయి, ఇంకొక అవస్థలో సంసారరహితం అయితే నా అసలు స్వరూపం ఏమిటి?

నేను సంసారిని, మోక్షాన్ని సుషుప్తిలో తాత్కాలికంగా అనుభవిస్తున్నాను అనుకోవాలా? లేక నేను ముక్తపురుషుడిని, తాత్కాలికంగా సంసారాన్ని అనుభవిస్తున్నాను అనుకోవాలా? ఏది నా స్వరూపం, ఏది నా వేషం? ఏది స్వాభావికం, ఏది ఆగంతుకం? ఒక విధంగా చూస్తే నేను సంసారిని అనుకోవాలేమో అనిపిస్తుంది, సంసారం రెండు అవస్థల్లో అనుభవిస్తాను కాబట్టి.

అందువల్ల అలాంటి పొరపాటు కలగకుండా ఉండటానికి యాజ్ఞవల్క్యుడు మోక్షం స్వాభావికం అనీ, సంసారం పరిచ్ఛేదం అనీ నిరూపించబోతున్నాడు. సంసారమే ఆగంతుకం, మోక్షం స్వాభావికం. సాంకేతిక పరిభాషలో చెప్పాలంటే సంసారం – అవిద్యాకార్యం; మోక్షం – విద్యాకార్యం. నా స్వరూప అజ్ఞానంవల్ల, మోహంవల్ల సంసారం ఏర్పడితే, నా స్వరూపజ్ఞానంవల్ల మోహం పోయి, బంధవిముక్తిడిని అవుతాను. స్వప్న అనుభవంద్వారా ఈ భావన తెలియజేయబడింది. అవిద్యవల్ల ద్వైత దుఃఖం, విద్యవల్ల అద్వైత ఆనందం పొందుతాను.

అది వర్ణించటానికి స్వప్నం గురించి వివరిస్తున్నాడు యాజ్ఞవల్క్యుడు. నిజానికి ఇదే మంత్రం అంతకుముందు కూడా రెండుసార్లు 2.1.19 లోనూ, 4.2.3 లోనూ వచ్చింది.

**తా వా అస్యైతా హితానామ నాడ్యః** – ఈ నాడులు వేలసంఖ్యలో ఉన్నాయి. వాటిని హితానాడులు అని ఎందుకంటారంటే అవి సుషుప్తిలోకి అంటే ఆనందంలోకి తీసుకువెళతాయి. అంటే మన హితం కోరుతాయి అవి. అవి ఎలా ఉన్నాయి?

**యథా కేశస్సహస్రధా భిన్నస్తావతాఽణిమ్నా తిష్ఠంతి** – వేయి పీలికలుగా, నిలువునా చీల్చబడిన వెంట్రుక ఎంత సూక్ష్మంగా ఉంటుందో, అంత సూక్ష్మంగా ఉంటాయి ఈ నాడులు.

**శుక్లస్య నీలస్య పింగలస్య హరితస్య లోహితస్య పూర్ణాః** – ఆ నాడులు తెలుపు, నీలం, పసుపు, ఆకుపచ్చ, ఎరుపు రంగుల అన్నరసంతో నిండివుంటాయి. శంకరులవారు ఆయుర్వేద గ్రంథంనుంచి ఈ రంగులకు వివరణని ఇస్తున్నారు. ఆయుర్వేదంలో వాతం, పిత్తం, కఫం అని మూడు రకాలుగా రోగనిర్ధారణ చేస్తారు. వాతం అంటే వాయుతత్త్వం, వాయుతత్త్వాన్ని నీలంరంగుతో సూచిస్తారు; పిత్తం అంటే అగ్నితత్త్వం, అగ్నిని పసుపురంగుతో సూచిస్తారు; కఫం అంటే జలతత్త్వం, దాన్ని తెలుపురంగుతో సూచిస్తారు. రక్తం ఎరుపురంగులో ఉంటుంది. అంటే మంత్రంలో చెప్పిన ఐదు రంగుల్లో నాలుగు రంగులు వచ్చాయి. అవి – నీలం, పసుపు, తెలుపు, ఎరుపు. తక్కిన రంగులన్నీ ఈ రంగుల మిశ్రమాలవల్ల వస్తాయి. ఆనందగిరి, శంకరాచార్యులు ఆయుర్వేదం కూడా నేర్చుకున్నారని శ్లాఘిస్తూ, ఏయే రంగుల మిశ్రమానికి ఏ రంగులు వస్తాయో కూడా సూచిస్తారు.

ఇక్కడొక వాక్యం కలుపుకోవాలి మనం. జీవుడు ఈ నాడులద్వారా సంచరిస్తాడు. తైజస అంటే స్వప్నపురుషుడు ఈ నాడులను ఆశ్రయంగా చేసుకుని కలలు కంటాడు. ఎటువంటి కలలు కంటాడు? అవిద్య, పాపకర్మలు ఎక్కువ ఉంటే భయంకరమైన పీడకలలను కంటాడు. అదే అవిద్య, పుణ్యకర్మలు ఎక్కువ ఉంటే మంచి ఆహ్లాదకరమైన కలలు కంటాడు. అది చెడుకల అవనీ, మంచికల అవనీ అందులో ద్వైతం ఉంటుంది. ఎప్పుడైతే విద్య ఉంటుందో అప్పుడు సర్వాత్మభావన వస్తుంది.

**అథ యత్రైనం ఘ్నంతీవ, జినంతీవ హస్తీవ విచ్ఛాయయతి గర్తమివ పతతి** – ఘ్నంతీవ అంటే స్వప్నంలో తనను కొడుతున్నారు అన్నట్టుగా; జినంతీవ అంటే తనను వశపరచుకుంటున్నారు అన్నట్టుగా; హస్తీవ విచ్ఛాయయతి– ఏనుగు తనను వెంటాడుతోంది అన్నట్టుగా; గర్తమివ పతతి– గోతిలో పడుతున్నాడు అన్నట్టుగా అనిపిస్తుంది జీవుడికి. ఎందుకు?

**జాగ్రద్భయం పశ్యతి తదత్రావిద్యయా మన్యతే** – మెలకువ స్థితిలో ఏ భయాలైతే ఉంటాయో, అవి కలలో వెన్నాడుతాయి. వాటిని అవిద్యయా మన్యతే అంటారు. ఎందుకంటే అక్కడ నిజంగా ఏనుగు లేదు, నిజంగా అతను గోతిలో పడలేదు. అన్నిటికీ 'ఇవ' పదం వచ్చింది. ఇవ అంటే జరిగినట్టుగా అనిపిస్తుంది. ఇదంతా పాపసహిత అవిద్యవల్ల జరుగుతోంది. పుణ్యసహిత అవిద్యవల్ల ఏం జరుగుతుంది?

**అథ యత్ర దేవ ఇవ రాజేవ** – పుణ్యకర్మ అవిద్యకు తోడయితే తాను దేవత అయినట్టో, రాజు అయినట్టో, మంచి కలలను కంటాడు. ఇది కూడా అవిద్యవల్లనే. అందువల్ల ఇక్కడ కూడా 'ఇవ' పదం వచ్చింది.

అదే విద్య పొందిన జ్ఞాని పరిస్థితి ఎలా ఉంటుంది? జాగ్రదావస్థలో భయాలు చూస్తే భయంకరమైన స్వప్నాలు వస్తాయనీ, జాగ్రదావస్థలో ఆనందం అనుభవిస్తే మంచి కలలు వస్తాయనీ చూశాము కదా. అదే విధంగా జాగ్రదావస్థలో జ్ఞానం పొంది, సర్వాత్మ భావన కలిగితే, స్వప్నంలో కూడా ఆ సర్వాత్మ భావన కొనసాగుతుంది.

**అహమ్ ఏవ ఇదగ్ం సర్వోఽస్మీతి మన్యతే** – అతను ఈ సర్వం నేనే అయివున్నాను అనుకుంటాడు. ఇక్కడ విద్యవల్ల అని మనం కలుపుకోవాలి.

ఒక విషయం మనం గ్రహిస్తే అవిద్యా పుణ్యపాపాల స్వప్నాలను వర్ణించేటప్పుడు 'ఇవ' పదాన్ని ప్రతి స్వప్న అనుభవానికీ వేశాడు యాజ్ఞవల్క్యుడు. కాని విద్యవల్ల కలిగిన స్వప్నాన్ని వర్ణించేటప్పుడు సర్వాత్మభావన కలుగుతుంది అన్నాడు కాని ఇక్కడ 'ఇవ' పదం వెయ్యలేదు. దీనివల్ల విద్యాకార్యం మోక్షం అని తెలుస్తున్నది.

**సః అస్య పరమో లోకః** – అద్వైత భావ సర్వాత్మ భావన – మనం పొందగలిగిన అత్యున్నత లక్ష్యం. ప్రతి జ్ఞానీ తన జీవితకాలంలో ఈ దశకు చేరుకోవాలి.

సః అంటే సర్వాత్మ భావన. సర్వాత్మ భావన అంటే సర్వం ఆత్మ ఇతి. అంతటా ఆత్మే ఉంది. అంతటా ఆత్మే ఉందని తెలుసుకుంటే చాలదు, ఆ ఆత్మను నేనే అని తెలుసుకోవాలి. 'అంతటా ఆత్మ ఉంది; ఆ ఆత్మను నేనే, కాబట్టి నేను అంతటా ఉన్నాను' ఇలా రావాలి జ్ఞానం. ఈ సర్వాత్మ భావన అత్యున్నత లోకం.

లోకం అంటే అక్షరాలా లోకంగా తీసుకోకూడదు. మనం ఎప్పుడూ స్వర్గలోకం, బ్రహ్మలోకం పదాలు వాడతాము కాబట్టి ఉపనిషత్తు కూడా ఆ పదం వేసింది. లోకం అంటే పరమమైన ఆనందం; జ్ఞానంవల్ల పొందే ఆనందం.

**సోఽస్య పరమో లోకః సర్వాత్మభావః ఏవ ఉత్తమం లక్ష్యమ్.**

దీనితో స్వప్నవృత్తాంతాన్ని ముగిస్తున్నాడు యాజ్ఞవల్క్యుడు. దీనివల్ల నేర్చుకున్న అంశం ఏమిటి?

**నేను సుషుప్తిలో అద్వైతాన్ని. అది నా స్వరూపం జాగ్రద్, స్వప్న అవస్థలు నాకు ఆగంతుకం.**

**మంత్రాలు 21–33: సుషుప్తిద్వారా మోక్ష వర్ణన** –

21 నుంచి 33 మంత్రాలలో సుషుప్తిని మోక్షంతో పోలుస్తున్నాడు యాజ్ఞవల్క్యుడు. అందువల్ల ఈ మంత్రాల్లో సుషుప్తిని మోక్షవర్ణనగా తీసుకోవాలి. కాని ఒక విషయం గుర్తు పెట్టుకోవాలి మనం. ఇది ఉదాహరణే కాని, నిజంగా సుషుప్తి మోక్షాన్ని ఇవ్వదు. ఒకవేళ సుషుప్తి మోక్షాన్ని ఇచ్చేటట్టయితే శాస్త్రం ఎందుకు, గురువు

ఎందుకు, బోధ ఎందుకు? హాయిగా నిద్రపోయి మోక్షం పొందేయవచ్చు, నిద్రపోవటంలో మనం సిద్ధహస్తులం కూడా.

అలాంటప్పుడు సుషుప్తిని మోక్షంతో ఎందుకు పోలుస్తున్నాడు యాజ్ఞవల్క్యుడు? మోక్షానికీ, సుషుప్తికీ చాలా పోలికలున్నాయి.

**అవిద్యా కార్యం నాస్తి** – సుషుప్తిలో అజ్ఞానం పనిచెయ్యదు అంటే అజ్ఞానం ఏ కార్యాన్నీ చెయ్యనివ్వదు. అలాగని అజ్ఞానం లేదని కాదు. అజ్ఞానం అవ్యక్తంగా ఉంటుంది. అందువల్ల సుషుప్తిలో అవిద్యాకార్యం నాస్తి. మోక్షంలో అవిద్య (అజ్ఞానం) ఉండనే ఉండదు. జ్ఞానం పొందితే అజ్ఞానం పోతుంది. అందువల్ల మోక్షంలో కూడా అవిద్యాకార్యం నాస్తి. ఏమిటి ఈ రెండింటికీ మధ్య భేదం. సుషుప్తిలో అజ్ఞానం అవ్యక్తంలో ఉంది కాబట్టి కార్యం చెయ్యలేదు. మోక్షంలో అజ్ఞానం ఉండదు కాబట్టి కార్యం చెయ్యదు. సుషుప్తిలో అజ్ఞానం అవ్యక్తంగా ఉంది అని చెప్పటానికి భాష్యకారులు ఇంకో పదం వేస్తారు – **వ్యక్త అవిద్య హీనత్వాత్**.

**అవిద్యా కర్మ** – అవిద్య సుషుప్తిలో ఏ కార్యం చెయ్యనివ్వదు అంటే జాగ్రద్, స్వప్నావస్థల్లో ఏ కార్యం చేయిస్తుంది? అవిద్యాకార్యాన్ని ద్వైతం అంటారు. అవిద్య ప్రభావం భేదభావన. ఏమిటా భేదం? జీవజగత్ ఈశ్వరుల భేదం. ఇది అవిద్యా కార్యంయొక్క మొదటిదశ. ఎప్పుడైతే భేదభావన మొదలయిందో, అప్పుడే నేను పరిచ్ఛిన్న జీవిని అవుతాను, నాలో అహంకారం ఏర్పడుతుంది.

అజ్ఞానంవల్ల భేదం ఏర్పడుతుంది; నేను అనే అహంకారం పుడుతుంది. నా అహంకారాన్ని తృప్తిపరుచు కోవటానికి కోరికలు పుడతాయి. కోరికలు తీర్చుకోవటానికి కర్మలు చేస్తాను. ఆ కర్మలు కర్మఫలాలను ఇస్తాయి. ఆ విధంగా నేను కర్తా, భోక్తా అవుతాను. కర్మఫలాలు పుణ్యపాపాల రూపంలో వస్తాయి. వాటిని క్షయం చేయటానికి సుఖదుఃఖాలు అనుభవిస్తాను. దీనివల్ల పునరపి జననం, పునరపి మరణం పొందుతూనే ఉంటాను.

అజ్ఞానం → భేదభావన → నేను → కోరికలు → కర్మలు → కర్మఫలాలు → సుఖదుఃఖాలు → పునరపి జననం, పునరపి మరణం. ఇదంతా ఎందుకు వచ్చింది? అజ్ఞానంవల్ల, అజ్ఞానం పుట్టించిన భేదభావనవల్ల.

సుషుప్తిలో కూడా అజ్ఞానం ఉంటుంది కాని, భేదభావన ఉండదు. భేదభావనవల్ల 'నేను' అనే అహంకారం పుడుతుందని చూశాము కదా! భేదభావన ఉండదు కాబట్టి 'నేను' కూడా ఉండను. జగత్తు లేదు, నేను కూడా లేను. ద్వైతం లేదు కాబట్టి, సంసారం కూడా లేదు. అందువల్ల అద్వైతభావన పొందాలంటే సుషుప్తి గొప్ప ఉదాహరణ. రాగద్వేషాలనుంచి స్వేచ్ఛ పొందాలంటే సుషుప్తి గొప్ప ఉదాహరణ; అభయం పొందాలంటే సుషుప్తి గొప్ప ఉదాహరణ; ఆనందం తెలియాలంటే సుషుప్తి గొప్ప ఉదాహరణ. కాలాతీతం తెలియాలంటే సుషుప్తి గొప్ప ఉదాహరణ.

## మంత్రం 4.3.21

**తద్వా అస్యైతదతిచ్ఛన్దా అపహతపాప్మాభయగ్ం రూపమ్ ॥ తద్యథా ప్రియయా స్త్రియా సమ్పరిష్వక్తో న బాహ్యం కిఞ్చన వేద నాన్తరమేవమేవాయం పురుషః ప్రాజ్ఞేనాత్మనా సమ్పరిష్వక్తో న బాహ్యం కిఞ్చన వేద నాన్తరమ్ ॥ తద్వా అస్యైతదాప్తకామమ్ ॥ ఆత్మకామమకామగ్ం రూపగ్ం శోకాన్తరమ్॥**

అందువల్ల యాజ్ఞవల్క్యుడు సుప్తపురుషుడిని బ్రహ్మగా అభివర్ణిస్తున్నాడు.

**ప్రాజ్ఞః బ్రహ్మైవ** – సుప్తపురుషః బ్రహ్మైవ అంటున్నాడు. ఇక్కడ్నుంచీ సుషుప్తిలో ఉన్న పురుషుడు బ్రహ్మతో సమానం.

**తద్వా అస్యైతదతిచ్ఛందా రూపమ్**– సుప్తపురుషుడు సర్వకామ అతీతుడు అవుతాడు. ఛందః అంటే కామం; అతి ఛ్ఛందః అంటే కామానికి అతీతం. రూపం అంటే స్వరూపం. జాగ్రద్‌ప్రపంచంలో మనకి వచ్చే కోరికలు స్వాభావికం కాదు, ఆగంతుకం.

**అపహతపాప్మాభయగ్ం రూపమ్** – అపహత పాప్మ+అభయం అంటే అన్ని పాపాలనుంచి విముక్తి దొరుకుతుంది. పాపం అంటే పుణ్యం కూడా కలుపుకోవాలి. ఎందుకంటే శాస్త్రం ప్రకారం పుణ్యం కూడా బంధకత్వాన్ని ఇస్తుంది. పుణ్యం హరించుకోవటానికి కూడా మళ్ళీ పుట్టాలి. అందువల్ల అపహతపాప్మ అంటే పుణ్యపాప అతీతః. దాన్ని అభయంగా అభివర్ణించవచ్చు.

**ద్వితీయాద్వై భయం భవతి** – బృహదారణ్యకంలోనే చూశాము, రెండోది ఉంటే భయం వేస్తుందని. ఈ గదిలో నేనొక్కడినే ఉంటే నాకు ఎవరు హాని కలుగజేస్తారు? అందువల్ల భయం అవసరం లేదు. కాని కొంతమంది రెండో మనిషిని ఊహించుకుని భయపడతారు. అందువల్ల ద్వైతం భయహేతువు, అద్వైతం అభయహేతువు. అది సుషుప్తిలో దొరుకుతుంది.

ఇక్కడ శంకరులవారు అభయం అంటే అవిద్యనుంచి ముక్తి అంటున్నారు. అతిచ్ఛందః అంటే కామంనుంచి విముక్తి; అపహతపాప్మ అంటే కర్మనుంచి విముక్తి. అంటే **అవిద్యా కామ కర్మ అభావః**. అంతకుముందు ఈ పదాన్ని చూశాము. దాని విశ్లేషణను తర్వాత చూద్దామని అప్పుడు చూడలేదు.

అవిద్యా కామ కర్మ మూడూ ఒకదాన్ని వెన్నంటి ఒకటి ఉంటాయి. అవిద్య అంటే అజ్ఞానం అని మర్చిపోకూడదు. అవిద్యవల్ల కామం అంటే కోరిక ఏర్పడుతుంది. కామం కర్మకు దారితీస్తుంది. కర్మ సంసారంలో పడవేస్తుంది. అందువల్ల అవిద్య, కామ, కర్మ అనే ఈ మూడుపదాలూ మనకు సంసారకారణాలు. సుషుప్తిలో ఆత్మస్వరూపం **అవిద్యా కామ కర్మ అభావః**.

ఇక్కడ మనకొక సందేహం రావచ్చు. సుషుప్తిలో జీవుడు ఎవరినీ గుర్తించడు తనతో సహా అన్నాము. సుషుప్తిలో ఎందుకు జీవుడు తనను తాను కూడా గుర్తించలేడు? సుషుప్తిలో ద్వైతం ఉండదు అంటే ఒప్పుకోవచ్చు; బాహ్యప్రపంచం ఉండదు కాబట్టి. కాని నేను ఉంటాను కదా? నేను చైతన్యస్వరూపాన్ని కదా! అలాంటప్పుడు నేను సుషుప్తిలో చైతన్యస్వరూపంగా ఉన్నాను అని తెలియాలి కదా!

ఈ ప్రశ్నను ఊహించుకుని, ఉపనిషత్తే దీనికి జవాబు ఇస్తోంది. సుషుప్తిలో జీవాత్మ పరమాత్మలో ఐక్యం అవుతుంది; వ్యష్టి సమష్టిలో ఐక్యం అవుతుంది; ప్రాజ్ఞ ఈశ్వరునితో ఐక్యం అవుతాడు. ఎప్పుడైతే వ్యష్టి సమష్టిలో కలిసిపోతాడో, అప్పుడే అతనికి ప్రత్యేకంగా ఉనికి ఉండదు. 'నేను' అని భిన్నంగా లేనప్పుడు, నేను నిద్రపోతున్నాను అని ఎలా చెప్పగలడు?

కాని ఈ విషయాన్ని ఉపనిషత్తు తనదైన బాణీలో చెబుతున్నది. జీవాత్మ పరమాత్మ ఐక్యాన్ని ఒక ఉదాహరణతో చూపిస్తున్నది. ప్రియమైన భార్య కొన్ని నెలలు తనను వదిలి, ఏ పిల్లల దగ్గరికో వెళ్ళివచ్చాక, ఆ విరహం తర్వాత భర్త భార్యను గాఢపరిష్వంగంలోకి తీసుకుంటే, పరిసరాలను మర్చిపోతాడు. వారిద్దరూ ఒకటే అన్నట్టుగా ఐక్యమైపోతారు. ఏ ఆనందం విషయంలోనైనా సబ్జెక్టు ఆబ్జెక్టు భేదం మిగలదు. అప్పుడు ద్వైతభావన లేదు అభేదభావన ఏర్పడుతుంది. అదే మైమరుపు ఆత్మ విషయంలో జరుగుతుంది. జీవాత్మ పగలంతా జాగ్రద్, స్వప్నప్రపంచాల్లో తిరిగి తిరిగి అలసిపోయి, రాత్రి సుషుప్తిలో పరమాత్మలో ఐక్యం అయ్యేసరికి మైమరచిపోతుంది. జీవాత్మ అసలు స్వరూపం పరమాత్మ. అది తన స్వరూపం.

**తద్యథా ప్రియయా స్త్రియా సంపరిష్వక్తః** – ఎలాగైతే ప్రియమైన భార్య పరిష్వంగంలో ఉన్నప్పుడు

**న బాహ్యం కించన వేద నాంతరమ్** – అతనికి బయట ఏం జరుగుతోందో తెలియదు, లోపల ఏం జరుగుతోందో తెలియదు; అంతమాత్రాన అతను జడం అవుతాడు అనుకోకూడదు; అతను చేతనంగానే ఉంటాడు, కాని ఐక్యం అయినప్పుడు అభేదభావన కలుగుతుంది.

**ఏవమేవాయం పురుషః ప్రాజ్ఞేనాత్మనా సంపరిష్వక్తః** – అదే విధంగా ఈ పురుషుడు స్వస్వరూపంలో లయమవుతాడు. ఇక్కడ పురుషుడు అంటే విశ్వతైజస పురుషులు, ప్రాజ్ఞ పురుషునితో లయమవుతాడు. కారణం కార్యాన్ని తనలో ఇముడ్చుకుంటుంది.

**న బాహ్యం కించన వేద నాంతరమ్** – అందువల్ల అతనికి బయట ఉన్నదీ తెలియదు, లోపల ఉన్నదీ తెలియదు.

**తద్వా అస్యైతదాప్తకామమ్** – ఈ స్థితిలో అతను పొందాల్సిన కోరికలన్నీ పొందాడు. కోరికలు పొందాడని మనకెలా తెలుసు? అతను ఆనందంగా ఉన్నాడు కాబట్టి. నాకు కారు లేదు, ఇల్లు లేదు ఇటువంటి సమస్యలు మేలుకుని ఉన్నంతసేపే. సుషుప్తిలో అతను కోరుకున్న కోరికలు అతనికి భిన్నంగా లేవు. అహం సర్వః అస్మి అనుకుంటాడు.

**ఆత్మ కామమకామగ్ం రూపగ్ం శోకాంతరమ్** – కోరికలు తనకు భిన్నంగా లేవు కాబట్టి, జ్ఞానికి శోకం ఉండదు. సుషుప్తిలో కూడా శోకం ఉండదు.

తర్కం చూశారా? సుషుప్తిలో కోరికలు తీరినట్టుగా ఆనందంగా ఉంటాడు. ఎందుకు? కోరికలు తనకు భిన్నంగా లేవు కాబట్టి, సర్వాత్మ భావనతో ఉంటాడు కాబట్టి. ఆత్మ కామత్వాత్ ఏవ ఆప్తకామః. అతను కోరే కోరికలు అతనికి భిన్నంగా లేవు. అందువల్ల అకామః అవుతాడు. ఆప్తకామః అంటే కోరికలు తీరుతాయి అని సానుకూలంగా చెప్పటం. ఆప్తకామః ఆత్మకామః అకామః ఇదీ వరుస. శోకాంతరమ్ అంటే వ్యతిరేకంగా చెప్పటం అంటే అతను శోకరహితంగా ఉంటాడు.

అందువల్లనే ప్రతివారు నిద్రను గాఢంగా కోరుకుంటారు. విద్యారణ్యులవారు ఎవరూ నిద్రను ద్వేషించరు అంటారు. ఆ విషయం చక్కగా నిద్రపోవటానికి అతను తీసుకునే జాగ్రత్తలు చెప్పకనే చెబుతాయి. అది దుఃఖభూయిష్టమైతే పడకగదికి అన్ని హంగులు ఎందుకు అమరుస్తారు? అబ్బా ఇవాళ కూడా పడుకోవాలా అని

ఆలోచించరు. కాని ఇవాళ కూడా పనికి వెళ్ళాలా అని సణుగుతారు మనుష్యులు. దీన్నిబట్టి అందరూ నిద్రను ఆస్వాదిస్తారు కాని పనిని ఆస్వాదించరు.

సుషుప్తి శోకవర్జితమ్. అంటే సుషుప్తిలో శోకం ఉండదు. ఇది సుప్తపురుషుని స్వరూపం.

## మంత్రం 4.3.22

**అత్ర పితాఽ పితా భవతి మాతాఽ మాతా లోకా అలోకా దేవా అదేవా వేదా అవేదాః ॥ అత్ర స్తేనోఽ స్తేనో భవతి భ్రూణహాఽ భ్రూణహా చాణ్డాలోఽ చాణ్డాలః పౌల్కసోఽ పౌల్కసః ॥ శ్రమణోఽ శ్రమణస్తాపసోఽ తాపసః ॥ అనన్వాగతం పుణ్యేనానన్వాగతం పాపేన ॥ తీర్ణో హి తదా సర్వాన్ శోకాన్ హృదయస్య భవతి ॥**

శంకరులవారు తరచు ఉటంకిస్తుండే ముఖ్యమైన మంత్రాల్లో ఇది ఒకటి. సుషుప్తిలో అహంకారం ఉండదు; అహంకారం ఉండదంటే అది వ్యవహారం నడపదు, ఎందుకంటే అజ్ఞానం ప్రకటితమవదు. సుషుప్తిలో కారణవిద్య మాత్రమే ఉంటుంది, కార్యవిద్య ఉండదు; అవ్యక్తవిద్య ఉంటుంది, వ్యక్త విద్య ఉండదు. అందువల్ల 'నేను' అనే అహంకారం కూడా ఉండదు. మనం చేసే వ్యవహారాలన్నీ దానివల్లనే చేస్తాము.

**అత్ర** – అంటే ఈ సుషుప్తిలో. మోక్ష అవస్థకు సుషుప్తిని ఉదాహరణగా చూపిస్తారని చూశాము. అందులో ఎలా ఉంటుందో వర్ణిస్తున్నాడు యాజ్ఞవల్క్యుడు.

**పితాఽ పితా భవతి** – తండ్రి తండ్రి కాదు అంటే నేను తండ్రిని అని చెప్పలేదు. తండ్రిగా తనకుండే బెంగలు ఉండవు. వీటిని రోల్‌ప్లే అంటారు పూజ్య స్వామీజీ – బంధాలన్నీ పాత్రలు. అవి జాగ్రద్, స్వప్నావస్థల్లోనే ఉంటాయి. సుషుప్తిలో తండ్రికి బెంగలేం ఉండవు.

**మాతాఽ మాతా** – తల్లి తల్లి కాదు. తల్లి మెలకువగా ఉన్నంతసేపూ కుటుంబంకోసం పాకులాడుతుంది కాని సుషుప్తిలో ఆవిడకు తను తల్లినని తెలియదు.

**లోకా అలోకాః** – లోకాలు లోకాలు కావు. భూలోక, భువర్లోక, సువర్లోక భేదాలు ఉండవు. ఉన్నదంతా ఒకటే. ఆత్మ.

**దేవా అదేవాః** – దేవతలు, మానవులు, రాక్షసులు అనే భేదం ఉండదు.

**వేదా అవేదాః (భవంతి)** – వేదాలు వేదాలు కావు. అంటే వేదాలు కూడా ఉండవు. వేదాలు ద్వైతం ఉన్నచోటనే ఉంటాయి. వేదాలు శ్రుతి ప్రమాణం కాబట్టి ప్రమాతా, ప్రమేయం భేదం ఉంటేనే వాటిని ఉపయోగించగలం. వేదాలు సాధ్యసాధనల గురించి చెబుతాయి. అద్వైతంలో ఉన్నదంతా ఒకటే అయినప్పుడు సాధ్యసాధన భేదం ఉండదు.

**అత్ర స్తేనోఽ స్తేనో భవతి** – ఈ సుషుప్తిలో దొంగ దొంగ కాదు.

**భ్రూణహాఽ భ్రూణహా** – బ్రహ్మహత్య చేసినవాడికి ఆ పాపం అంటదు. బ్రాహ్మణుడిని కాని, పండితుడిని కాని హత్య చేయటం పంచమహాపాపాల్లో ఒకటి. కాని సుషుప్తిలో ఆ పాపం ఉండదు.

**చాండాలోఽ చాండాలః** – చండాలుడు చండాలుడు కాదు. జాగ్రదావస్థలో అతనిని చిన్నచూపు చూసి, దూరం జరుగుతారు. కాని సుషుప్తిలో జాతి భేదాలు ఉండవు.

**పౌల్కసోఽ పౌల్కసః** – పుల్కస జాతికి చెందినవాడు పుల్కసుడు కాదు. పుల్కసుడు అన్నా, పౌల్కసుడు అన్నా ఒకటే. అతన్ని కూడా చిన్నచూపు చూడలేరు సుషుప్తిలో.

**శ్రమణోఽ శ్రమణః** – సన్న్యాసి సన్న్యాసి కాదు. అతను పడుకున్నప్పుడు తక్కినవాళ్ళు అదుగో సన్న్యాసి పడుకున్నాడు అనవచ్చు కాని, అతనికి తను సన్న్యాసి అని తెలియదు.

**తాపసోఽ తాపసః** – తాపసుడు తాపసుడు కాదు. అంటే వానప్రస్థుడు. వానప్రస్థుని జీవితం తపః ప్రధానంగా ఉంటుంది. ఒక సాధకుని జీవితం నాలుగు దశల్లో సాగుతుంది – అధ్యయనం, కర్మ, తపస్సు, జ్ఞానం.

**అనన్వాగతం పుణ్యేనానన్వాగతం పాపేన** – ఎందుకు మనుష్యులు ఇన్ని రకాలుగా ఉంటారు? మనుష్యుల్లోనే ఐశ్వర్యవంతులు, బీదవారు; ఆరోగ్యవంతులు, అనారోగ్యపరులు ఉంటారు. అదికాక జంతువులు, చెట్లు చేమలు ఉన్నాయి. ఎందుకింత నానాత్వం? అది వారు చేసుకున్న పుణ్యపాపాలమీద ఆధారపడి ఉంటుంది.

దేవుడు తనకు తోచినట్టుగా సృష్టి చెయ్యలేదు. మన జన్మ మనం చేసుకున్న పుణ్యపాపాల మీద ఆధారపడి వస్తుంది. అందువల్ల జాగ్రదావస్థలో సమానత్వం కుదరదు. జాగ్రదావస్థలో శరీరపరంగా భేదాలు ఉంటాయి; భావపరంగా భేదాలు ఉంటాయి; బుద్ధిపరంగా భేదాలు ఉంటాయి. కాని సుషుప్తిలో ఈ భేదాలు ఉండవు. ఎందుకు? సుషుప్తిలో పుణ్యంతో సంబంధం ఉండదు; పాపంతో సంబంధం ఉండదు.

**తీర్ణో హి తదా సర్వాన్ శోకాన్ హృదయస్య భవతి** – ఎందుకంటే అప్పుడు హృదయంలో ఉన్న శోకాలన్నిటినీ అతిక్రమిస్తాడు. హృదయం అంటే మనస్సు అని తీసుకోవాలి. శోకాలన్నీ మనస్సుకు చెందినవి, ఆత్మకు చెందినవి కాదు. అందువల్ల మనస్సు హుషారుగా ఉన్నప్పుడు జీవునికి ఆనందమో, బాధో కలుగుతుంది. మనస్సు సుషుప్తిలో పడుకున్నప్పుడు, ఆ జీవునికి సుఖదుఃఖాలు అంటవు.

21నుంచి 33 మంత్రాల వరకూ సుషుప్తిని మోక్షంగా వర్ణిస్తున్నాడు యాజ్ఞవల్క్యుడు. సుషుప్తి అక్షరాలా మోక్షం కాదు, మోక్షానికి అతి దగ్గర ఉదాహరణ అనే విషయం మర్చిపోకూడదు. తమాషాగా శంకరులవారు కూడా ఈ మంత్రాలని మోక్షం గురించి వర్ణిస్తున్నాయా అన్నట్టుగా చూస్తారు. అసలు ఈ మంత్రాలు దేని గురించి చెబుతున్నాయో మొదట్లో తెలియదు. 34వ మంత్రం వివరణలో శంకరులవారు స్పష్టతనిస్తారు– సుషుప్తి మోక్షం కాదు, మోక్షానికి ఉదాహరణ మాత్రమే అని. సుషుప్తిని మోక్షంతో సమానం చేశారు; సుప్తపురుషుడిని ముక్తపురుషునితో సమానం చేశారు. ఈ మంత్రాలు చూస్తున్నంతసేపూ ఈ విషయాన్ని మర్చిపోకూడదు. నిజం చెప్పాలంటే మోక్షానికి అద్భుతమైన నిర్వచనాలు ఈ భాగంలోనే వస్తాయి; ఆత్మకు అద్భుతమైన నిర్వచనాలు ఈ భాగంలోనే వస్తాయి; జీవన్ముక్తునికి అద్భుతమైన నిర్వచనం ఈ భాగంలోనే వస్తుంది. ఇది సుషుప్తి గురించిన వర్ణనే అయినా, శంకరులవారు జ్ఞాని గురించి వర్ణించినా, మోక్షం గురించి వర్ణించాలన్నా ఇవే ఉటంకిస్తుంటారు. ఆ విధంగా ఈ 13 మంత్రాలూ ఆణిముత్యాలు.

21వ మంత్రంలో జీవన్ముక్తునియొక్క నిర్వచనం వస్తుంది. అది ఆప్తకామః ఆత్మకామః అకామః. 22వ మంత్రంలో అద్వైతంలో ప్రమాత, ప్రమేయం భేదం లేదని వస్తుంది – **వేదా అవేదాః (భవతి)**

మంత్రం 4.3.23

**యద్వై తన్న పశ్యతి పశ్యన్ వై తన్న పశ్యతి న హి ద్రష్టుర్దృష్టేర్విపరిలోపో విద్యతేఽవినాశిత్వాత్ ॥ న తు తద్ద్వితీయమస్తి తతోఽన్యద్విభక్తం యత్పశ్యేత్ ॥**

ఇంకొక ముఖ్యమైన మంత్రం. ఇది చూసేముందు 21వ మంత్రంలో చెప్పిన భావాన్ని ఒకసారి గుర్తు తెచ్చుకోవాలి. అందులో ప్రియమైన భార్య పరిష్వంగంలో ఉన్న భర్తకు ఇంకేమీ ఎలా తెలియదో, అదే విధంగా పరమాత్మలో ఐక్యం అయిన జీవాత్మకు ఏమీ తెలియదు. తన గురించీ ఏమీ తెలియదు; ఇతరుల గురించీ తెలియదు. అంటే ఆత్మజ్ఞానమూ ఉండదు, అనాత్మజ్ఞానమూ ఉండదు. నిద్రలో జ్ఞానం ఉండదు అంటే నిద్రలో చైతన్యం కూడా ఉండనట్టు అర్థం వస్తుంది.

కాని ఆత్మ స్వయంజ్యోతి అనీ, అది నిత్యచైతన్యం అనీ అంతకుముందు చూశాము. ఒకపక్క నిద్రలో జ్ఞానం ఉండదు అంటున్నాము, ఇంకొకపక్క ఆత్మ నిత్యం అంటున్నాము. అలాంటప్పుడు నిద్రలో ఆత్మ స్వయం ప్రకాశకం అయితే తనను తాను తెలుసుకోవాలి కదా!

ఈ సందేహానికి సమాధానం ఇస్తుంది ఇక్కడ ఉపనిషత్తు. కాని తనదైన బాణిలో ఇస్తుంది. అది అర్థం చేసుకునేముందు మనం మనస్సు, ఆత్మల గురించి నేర్చుకున్న వివరాలు ఇక్కడ గుర్తు తెచ్చుకోవాలి.

ద్రష్ట గురించి బృహదారణ్యకోపనిషత్తులోనే అనేకసార్లు చూశాము (1.4.10, 3.4.2, 3.7.23, 3.8.11). అవి ఇక్కడ మళ్ళీ గుర్తు తెచ్చుకోవాలి.

**న దృష్టేర్ద్రష్టారం పశ్యేః – 3.7.23**

చూపును చూసే ఆత్మను నువ్వు చూడలేవు. అంటే రెండు ద్రష్టలు ఉన్నాయి. ఒకటి సాక్షి, ఇంకొకటి మనస్సు. మనస్సును చూసే సాక్షిని మనస్సుతో తెలుసుకోలేవు.

1. **ఆత్మ నిర్వికార ద్రష్ట** – ఆత్మ స్వయం ప్రకాశక జ్యోతి. దాని సమక్షంలోనే మనస్సు చైతన్యవంతమవుతుంది. మనస్సులో ఆత్మయొక్క ప్రతిబింబం ఏర్పడటంవల్ల మనస్సు చైతన్యవంతమవుతుంది. ఆ ప్రతిబింబాన్ని చిదాభాస అంటారు. అంటే ఆత్మ ద్రష్టా (చూసేది), మనస్సు దృశ్యం (చూడబడేది).

ఆత్మ చూస్తుంది అంటే ప్రయత్నపూర్వకంగా చూడదు, ఏమీ కర్మ చెయ్యదు, ఏమీ కోరికతో చూడదు, ఏమీ మార్పు చెందదు. అందువల్ల ఆత్మను నిర్వికారద్రష్ట అన్నారు. ద్రష్ట అంటే అర్థం ఏమిటి? దాని సమక్షంలో మనస్సు చిదాభాసవల్ల చైతన్యం అవుతుంది.

**ఆత్మది నిత్యదృష్టి – యా క్రియా భవతి, సా అనిత్యా భవతి**

ఆత్మ పనిచేస్తే అది అనిత్యం అవుతుంది. ఆత్మ పని చెయ్యదు కాబట్టి ఆత్మ దృష్టి నిత్యదృష్టి. ఒక క్రియకు ఒక మొదలు, ఒక తుది ఉంటుంది. అందువల్ల పని శాశ్వతం కాదు. కాని ఆత్మ మనస్సును ఎప్పుడూ చూస్తుంది.

**నిత్యదృష్టిః అజన్యత్వాత్**

అందువల్ల **ఆత్మ నిర్వికార ద్రష్ట, దాని దృష్టి నిత్యదృష్టి.** ఇది మొదటి అంశం.

2. **మనస్సు సవికార ద్రష్ట** – చిదాభాస అంటే ఆత్మయొక్క వ్యావహారిక స్వరూపం. చిదాభాస వ్యవహారద్రష్ట అవుతుంది. జాగ్రత్తగా చూడండి, చిదాభాస మనస్సును చూడదు, మనస్సులో ఏర్పడ్డ చిదాభాస బాహ్యప్రపంచాన్ని చూస్తుంది. ఆత్మ లేదా సాక్షి లేదా చిత్ మనస్సును చూస్తుంది.

చిదాభాస ఆత్మయొక్క వ్యవహారద్రష్ట అంటే, ఆత్మకు రెండు స్థాయిలు ఉన్నాయి. ఆత్మ చిత్‌గా మనస్సును చూస్తుంది, చిదాభాసగా ప్రపంచాన్ని చూస్తుంది. చిత్‌గా ఆత్మ నిర్వికారద్రష్ట అన్నాము కాని చిదాభాసగా అది **సవికారద్రష్ట** అవుతుంది. చిదాభాస+మనస్సు బాహ్యప్రపంచాన్ని చూస్తాయి. మనస్సులో వృత్తివికారాలు ఉన్నాయి. అందువల్ల మనస్సుతో పాటు అది కూడా వికారాలు చెందుతుంది.

**మనస్సుది అనిత్యదృష్టి** – ఏది క్రియ అయితే అది అనిత్యం అవుతుంది అని చూశాము. అందువల్లనే చిదాభాస జాగ్రదావస్థలోనూ, స్వప్నావస్థలోనూ ఆయా ప్రపంచాలను చూస్తుంది కాని సుషుప్తిలో ఏ ప్రపంచాన్నీ చూడదు. అంటే మనస్సులో ఆలోచనలు ఉంటాయి, మనస్సులో ఆలోచనలు ఉండవు. అందువల్ల మనస్సు దృష్టి అనిత్యదృష్టి.

అందువల్ల **మనస్సు సవికార ద్రష్ట, దాని దృష్టి అనిత్యదృష్టి.** ఆత్మ ఆలోచనలు ఉన్న ఆలోచనలు లేని మనస్సును నిత్యం చూస్తుంది. అందువల్ల అది నిర్వికారద్రష్ట, దాని దృష్టి నిత్యదృష్టి అయింది. కాని మనస్సు ఆలోచనలద్వారా చూస్తుంది కాబట్టి, ప్రయత్నపూర్వకంగా చూస్తుంది కాబట్టి అది సవికారద్రష్ట , దాని దృష్టి అనిత్యదృష్టి అయింది.

ఇవన్నీ ముందే చూసినా మళ్ళీ చూస్తున్నాము. ఎందుకంటే ఇక్కడ చిదాభాస బదులు ఆత్మ పదాన్ని వాడుతున్నాము. ఎందుకు? ఎందుకంటే చిదాభాస ఆత్మయొక్క వ్యవహారస్థాయి అని చూశాము. అంటే ఇంకో భాషలో చెప్పాలంటే ఆత్మ పరాప్రకృతి, చిదాభాస అపరాప్రకృతి. అంటే ఆత్మకు దృష్టిద్వయం ఉంది. నిత్యదృష్టి, అనిత్యదృష్టి.

**చిత్ – పరాప్రకృతి – నిర్వికార ద్రష్ట, నిత్యదృష్టి**
**చిదాభాస – అపరాప్రకృతి – సవికారద్రష్ట, అనిత్యదృష్టి**

ఇప్పుడు, జాగ్రదావస్థలో ఈ రెండింటిలో ఆత్మ ఏ దృష్టితో చూస్తోంది? రెండింటితోనూ చూస్తోంది. నిర్వికార ద్రష్ట అయిన ఆత్మ తన నిత్యదృష్టితో మనస్సును చేతనపరిస్తే మనస్సుతో కూడిన తన వ్యవహారద్రష్ట అయిన చిదాభాసద్వారా ప్రపంచాన్ని చూస్తుంది.

ఇప్పుడు సుషుప్తిలో ఏ ద్రష్ట చూస్తోంది? ఏదీ చూడటం లేదు అనకూడదు; రెండూ చూడటం లేదు అనకూడదు; అలాగని రెండూ చూస్తున్నాయనీ అనకూడదు. రెండూ చూస్తే పైన చూసిన సూత్రం ప్రకారం

రెండూ కలిసి జాగ్రద్ ప్రపంచాన్ని చూడాలి. కాబట్టి సుషుప్తిలో ఒకటే చూస్తుంది, రెండోది పడుకుంటుంది. నిత్యదృష్టి చూస్తుందా, అనిత్యదృష్టి చూస్తుందా? అనిత్యం అంటే ఎప్పుడూ చూడలేదు. అందువల్ల నిత్యదృష్టి ద్వారా చూస్తుంది. అనిత్యదృష్టి ఎందుకు చూడలేదు? సుషుప్తిలో మనస్సు పడుకుంటుంది. మనస్సు పడుకుంటే, ఆలోచనలు ఉండవు. ఆలోచనలు లేకపోతే చూడలేదు. ఆలోచనలను రేకెత్తే ఇంద్రియాలు పడుకుంటాయి. వాసనలు పడుకుంటాయి. మనస్సు లేకుండా చిదాభాస పని చెయ్యలేదు.

ఇప్పుడు మన ప్రశ్నను మళ్ళీ చూద్దాము. విషయం ఏమిటంటే సుషుప్తిలో ఆ వ్యక్తికి ఏమీ తెలియదు, భార్య గాఢపరిష్వంగంలో ఉన్న భర్తకు ఏమీ తెలియనట్టుగా అంది ఉపనిషత్తు. ఆత్మ స్వయంప్రకాశక జ్యోతి అయితే తనను తాను చూసుకోవాలి కదా! ఇది ప్రశ్న.

**దీనికి జవాబు** – నిద్రపోయే వ్యక్తికి ఏమీ తెలియదు అంటే అప్పుడు ఆత్మయొక్క అనిత్యదృష్టి పని చెయ్యదు అని అర్థం. నిజానికి అప్పుడు కూడా ఆత్మయొక్క నిత్యదృష్టి పనిచేస్తుంది. గాఢనిద్ర పోతున్న లేదా ఆలోచనలు లేని మనస్సును చూస్తుంది అది. ఎలా తెలుసు? అందువల్లనే నిద్ర లేచాక, నేను గాఢనిద్ర పోయాను అని చెప్పగలుగుతున్నాము.

**తత్ న వై పశ్యతి** – తత్ అంటే సుషుప్తి అవస్థ. న వై పశ్యతి అంటే ఏమీ చూడదు. ఆత్మ సుషుప్తిలో ఏమీ చూడదు. ఇది పూర్వపక్షి వాదన. తనను తను సమర్థించుకోవటానికి 21వ మంత్రంలోని వాక్యం తెచ్చుకుంటున్నాడు.

**న బాహ్యం వేద న అంతరమ్ – 21**

**తత్ న** – దీనికి తత్ న కలుపుకోవాలి. అంటే అది పూర్తిగా నిజం కాదు. ఏది పూర్తిగా నిజం కాదు? ఆత్మ సుషుప్తిలో ఏమీ చూడదు అనే వాక్యం పూర్తిగా నిజం కాదు అంటున్నాడు సిద్ధాంతి. పశ్యన్ వై తన్న పశ్యతి – నిజానికి సుషుప్తిలో **చూసే ఆత్మ చూడదు**. దీన్ని ఎలా అర్థం చేసుకోవాలి?

సుషుప్తిలో నిర్వికార ద్రష్టా అయిన ఆత్మ నిత్యదృష్టితో మనస్సును చూస్తుంది. కాని సవికార ద్రష్టా అయిన చిదాభాస ఆత్మ అనిత్యదృష్టివల్ల ప్రపంచాన్ని చూడదు. చిత్‌యొక్క దృష్టి నిత్యం, కాని చిదాభాస దృష్టి అనిత్యం. మనస్సులో అనేక ఆలోచనలు వస్తాయి, ఒక్కోసారి మనస్సు శూన్యంగా అయినట్టు అనిపిస్తుంది. కాని మనస్సులో ఆలోచనలు ఉన్నాయనీ తెలుస్తున్నది; మనస్సు శూన్యంగా అయిందనీ తెలుస్తున్నది. ఎలా? నిత్యదృష్టి ఉన్న ఆత్మవల్ల.

**దృష్టుః** – నిర్వికార ద్రష్టకు;

**దృష్టేః విపరిలోపో న విద్యతే** – నాశనం లేదు. దృష్టి నాశనం లేదు. ఆత్మ చూస్తూనే ఉంటుంది. ఎందుకు?

**అవినాశిత్వాత్** – చైతన్యం శాశ్వతం కాబట్టి. ఆత్మ ఉన్నంతవరకు, దాని సాక్షిత్వం ఉండే తీరుతుంది.

**ద్రష్టుః దృష్టే విపరిలోపో న విద్యతే అవినాశిత్వాత్**

నిర్వికార ద్రష్ట అయిన ఆత్మకు దృష్టినాశనం లేదు అనే ఈ వాక్యం చాలా ముఖ్యమైన వాక్యం. బౌద్ధమతస్థుల క్షణికవిజ్ఞానవాదనను ఖండించటానికి ఇది తోడ్పడుతుంది. క్షణిక విజ్ఞానం అద్వైతానికి కొంచెం దగ్గరగా ఉంటుంది. ఎందుకు? అది కూడా ఆత్మ సత్యం, జగత్ మిథ్య అంటుంది కాని ఆత్మ క్షణిక విజ్ఞానం అంటుంది. మనం నిత్యవిజ్ఞానం అంటాము. దీనికి శంకరులవారు ఇచ్చిన అనేక జవాబులు ఇంతకు ముందు చూశాము.

ఇప్పుడు సుషుప్తిలో అనిత్యదృష్టి ఎందుకు పనిచెయ్యదు అన్న విషయానికి వస్తే, దానికి ఉపనిషత్తు జవాబు ఇస్తున్నది.

**తతః న తు అస్తి** – సుషుప్తిలో ఈ క్రిందవి లేవు. ఏమిటవి?

**తద్వితీయమ్** – ప్రమాతా లేదా అంతఃకరణం;

**అన్యత్** – ప్రమాణం;

**విభక్తమ్** – ప్రమేయం లేదా ప్రపంచం.

**యత్పశ్యేత్** – అవి గనుక ఉంటే, ఈ అనిత్యదృష్టి చూసివుండేది.

ఆత్మయొక్క నిత్యదృష్టికి ఏ ప్రమాణమూ అవసరం లేదు కాని అనిత్యదృష్టికి త్రిపుటి కావాలి. అవి ప్రమాతా, ప్రమాణం, ప్రమేయం. ప్రమాతా అనే మనస్సు, ప్రమాణం అనే ఇంద్రియాలద్వారా ప్రమేయం అనే ప్రపంచాన్ని చూస్తుంది. ఇవి సుషుప్తిలో లేవు. ఎందుకు? మనస్సు పడుకుంటుంది, అంటే ప్రమాతా లేదు; ఇంద్రియాలు పడుకుంటాయి అంటే ప్రమాణం లేదు; ఇవి రెండూ పడుకుంటే ప్రపంచాన్ని చూసేదెవరు? అంటే ప్రమేయం కూడా లేదు. సుషుప్తినుంచి లేవగానే, మళ్ళీ ఈ మూడూ పనిచేస్తాయి; చూడటం, వినటం, తినటంలాంటి పనులు మొదలవుతాయి. కాఫీగతప్రాణి కాఫీ త్రాగటంతో వ్యవహారాలు వస్తాయి. కాని సుషుప్తిలో ఈ త్రిపుటి లేదు కాబట్టి, అవి లేకుండా అనిత్యదృష్టి పనిచెయ్యలేదు కాబట్టి, అనిత్యదృష్టి లేదు. నిత్యదృష్టి మాత్రమే ఉంది.

**చిత్ రూపేణ పశ్యన్ అపి చిదాభాసరూపేణ న పశ్యతి**

సుషుప్తిలో చిత్‌గా మనస్సును చూస్తుంది కాని చిదాభాసగా బాహ్యప్రపంచాన్ని చూడదు.

24–30 వరకు మంత్రాలు అవే భావాన్ని వ్యక్తం చేస్తాయి.

**పశ్యన్ అపి న పశ్యతి** – ఇదే విధంగా తక్కిన పదాలు వస్తాయి. 23వ మంత్రం అర్థం చేసుకుంటే 24–30 వరకూ తేలిగ్గా అర్థం చేసుకోవచ్చు. అవి వేటిని గురించి చెబుతున్నాయో చూస్తే చాలు.

## మంత్రం 4.3.24

**యద్వై తన్న జిఘ్రతి జిఘ్రన్ వై తన్న జిఘ్రతి న హి ఘ్రాతుర్ఘ్రాతేర్విపరిలోపో విద్యతేఽవినాశిత్వాన్న తు తద్వితీయమస్తి తతోఽన్యద్విభక్తం యజ్జిఘ్రేత్ ॥**

**జిఘ్రన్ వై తన్న జిఘ్రతి** – వాసన చూసే ఆత్మ వాసన చూడదు.

మంత్రం 4.3.25

**యద్వై తన్న రసయతే రసయన్ వై తన్న రసయతే న హి రసయితూ రసయతేర్విపరిలోపో విద్యతేఽవినాశిత్వాన్న తు తద్ద్వితీయమస్తి తతోఽన్యద్విభక్తం యద్రసయేత్ ॥**

**రసయన్ వై తన్న రసయతే** – రుచి చూసే ఆత్మ రుచి చూడదు.

మంత్రం 4.3.26

**యద్వై తన్న వదతి వదన్ వై తన్న వదతి న హి వక్తుర్వక్తేర్విపరిలోపో విద్యతేఽవినాశిత్వాన్న తు తద్ద్వితీయమస్తి తతోఽన్యద్విభక్తం యద్వదేత్ ॥**

**వదన్ వై తన్న వదతి** – మాట్లాడే ఆత్మ మాట్లాడదు.

మంత్రం 4.3.27

**యద్వై తన్న శృణోతి శృణ్వన్ వై తన్న శృణోతి న హి శ్రోతుశ్శ్రుతేర్విపరిలోపో విద్యతేఽవినాశిత్వాన్న తు తద్ద్వితీయమస్తి తతోఽన్యద్విభక్తం యచ్ఛృణుయాత్ ॥**

**శృణ్వన్ వై తన్న శృణోతి** – వినే ఆత్మ వినదు.

మంత్రం 4.3.28

**యద్వై తన్న మనుతే మన్వానో వై తన్న మనుతే న హి మన్తుర్మతేర్విపరిలోపో విద్యతేఽవినాశిత్వాన్న తు తద్ద్వితీయమస్తి తతోఽన్యద్విభక్తం యన్మన్వీత ॥**

**మన్వానో వై తన్న మనతే** – ఆలోచించే ఆత్మ ఆలోచించదు.

మంత్రం 4.3.29

**యద్వై తన్న స్పృశతి స్పృశన్ వై తన్న స్పృశతి న హి స్ప్రష్టుస్స్పృష్టేర్విపరిలోపో విద్యతేఽవినాశిత్వాన్న తు తద్ద్వితీయమస్తి  తతోఽన్యద్విభక్తం యత్ స్పృశేత్ ॥**

**స్పృశన్ వై తన్న స్పృశతి** – స్పృశించే ఆత్మ స్పృశించదు.

మంత్రం 4.3.30

**యద్వై తన్న విజానాతి విజానన్ వై తన్న విజానాతి న హి విజ్ఞాతుర్విజ్ఞాతేర్విపరిలోపో విద్యతేఽవినాశిత్వాన్న తు తద్ద్వితీయమస్తి తతోఽన్యద్విభక్తం యద్విజానీయాత్ ॥**

**విజానన్ వై తన్న విజానాతి** – తెలుసుకునే ఆత్మ తెలుసుకోదు.

వీటన్నిటిలోనూ ఆత్మయొక్క రెండు ద్రష్టలను తీసుకోవాలి. అంటే నిత్యదృష్టి, అనిత్యదృష్టి. సవికారదృష్టి అనిత్యం, నిర్వికార దృష్టి నిత్యం అని తెలుసు మనకు. నిర్వికార ద్రష్టగా ఆత్మకు నాశనం లేదు. సవికార ద్రష్టగా సుషుప్తిలో ఆత్మ వాసన చూడలేదు, రుచి చూడలేదు, మాట్లాడలేదు, వినలేదు, ఆలోచించలేదు, స్పృశించలేదు, తెలుసుకోలేదు. ఎందుకంటే అప్పుడు శరీరం, మనస్సు, ఇంద్రియాలు పడుకుంటాయి కాబట్టి.

ఈ మంత్రాలన్నిటి ఉద్దేశ్యం **ఆత్మ చైతన్యం ఆత్మ నిత్యం**. ఈ సూత్రం ప్రత్యేకమైనది. ఎందుకంటే ఈ ఒక్క సూత్రం అద్వైతాన్ని తక్కిన అన్ని దర్శనాలకు భిన్నంగా, ప్రత్యేకంగా నిలబెడుతుంది.

**న్యాయ, వైశేషిక దర్శనమ్** – వీరి వాదన ప్రకారం ఆత్మ ద్రవ్యం. అందులో చైతన్యం ఒక గుణం. అందువల్ల అది వచ్చిపోతుంది.

**బౌద్ధమతమ్** – ఆత్మ సత్యం, కాని ఆత్మ క్షణిక విజ్ఞానం.

**విశిష్టాద్వైతమ్** – చైతన్యం రెండు రకాలుగా ఉంది. గుణ చైతన్యం, గుణి చైతన్యం. అంటే ద్రవ్యంగా, గుణంగా ఉంది. రెండూ సత్యమే.

**అద్వైతమ్** – ఒకటే ఆత్మ ఉంది. అది నిర్గుణ చైతన్యం. అది నిత్యం, తక్కినదంతా చిదాభాస. చిదాభాస మిథ్య.

**ఆత్మనః స్వరూపచైతన్యమ్ నిత్యమ్**

ఈ మంత్రాల సారాంశం ఇది. ఆత్మ నిత్యం.

## మంత్రం 4.3.31

**యత్ర వా అన్యదివ స్యాత్తత్రాన్యోఽన్యత్పశ్యేదన్యోఽన్యజ్జిఘ్రేదన్యోఽన్యద్రసయేదన్యోఽన్యద్వదేదన్యోఽన్యచ్ఛృణుయాదన్యోఽన్యన్మన్వీతాన్యోఽన్యత్స్పృశేదన్యోఽన్యద్విజానీయాత్ ॥**

ఇది కూడా చాలా ముఖ్యమైన మంత్రం. అన్ని వ్యవహారాలూ ద్వైతంలోనే సాధ్యం, అద్వైతంలో సాధ్యం కాదని నిరూపిస్తుంది ఈ మంత్రం.

మాండూక్యోపనిషత్తు అద్వైతాన్ని అవ్యవహారం అంటుంది. వ్యవహారం లేదు అంటే ఏ వ్యవహారమూ లేదు– కర్మవ్యవహారమూ లేదు, జ్ఞానవ్యవహారమూ లేదు. రెండింటికీ త్రిపుటి ఉండాలి. కర్మవ్యవహారానికి కర్త, కర్మ, కరణం కావాలి. చూసే నేను, చూడబడే వస్తువు, చూసే పరికరం కావాలి. అలాగే జ్ఞానవ్యవహారానికి త్రిపుటి కావాలి– అవి ప్రమాత, ప్రమాణం, ప్రమేయం. ఈ విషయం ఇంతకుముందు మంత్రాల్లో చూశాము. ప్రమాతకు ద్వితీయం; ప్రమాణానికి అన్యత, ప్రమేయానికి విభక్తం పదాలను వేసింది ఉపనిషత్తు. ఈ మూడూ సుషుప్తిలో ఉండవు, ఆత్మలో కూడా ఉండవు.

అందువల్ల ఆత్మను తెలుసుకోవటమెలా అని మనం ప్రశ్నిస్తే, అది పెద్ద తప్పు అవుతుంది. ఎందుకు? ఆత్మను **తెలుసుకోవటం** అంటే అది వ్యవహారం అవుతుంది. అంటే ఆత్మను వ్యవహారం స్థాయికి దింపేసిన వారము

అవుతాము. ఆత్మను అనుభవించటమెలా అంటే అనుభవం కూడా వ్యవహారమే. ఆత్మ గురించి ఏ ప్రశ్న అడిగినా కష్టమే. దానికి జవాబు లేదు. ఎందుకంటే ప్రశ్నే తప్పు. కేనోపనిషత్తులో గురువు నేను అసలు ఆత్మ గురించి నీకు చెప్పలేను అంటాడు. ఎందుకు?

**అన్యదేవ తద్విదితాదథో అవిదితాదధి।** – కేన 1–4

ఆత్మ తెలియని వస్తువు కాదు, అలాగని తెలిసిన వస్తువూ కాదు. అంటే అసలు ఆత్మ వస్తువే కాదు. అందువల్ల దాన్ని వ్యవహారం స్థాయికి దింపలేము. ఆత్మ వ్యవహారానికి అందదు అనగానే, అయితే అసలు ఆత్మ ఉందా? ఇదొక గొప్ప సందేహం! అది వ్యవహారానికి అందదు అంటే ఆత్మ లేనట్టు కాదు. నిజానికి ఆత్మవల్లనే తక్కిన వ్యవహారాలు జరుగుతాయి. ఒక ఫోటోలో కెమెరా ఉండదు కాని ఫోటో వచ్చిందంటే అది కెమెరావల్లనే వచ్చింది. అలాగే నేను అద్వైతచైతన్యంగా అన్ని వ్యవహారాల్లోనూ ఉంటాను. నన్ను అంటే ఆత్మను చూడలేను కాని నావల్లనే అన్నీ చూస్తున్నాను, చేస్తున్నాను.

త్రిపుటి జాగ్రదావస్థలోనే ఉంటుంది. అది సుషుప్తిలో ఉండదు. అందువల్ల జాగ్రదావస్థలోనే ద్వైత ప్రపంచం ఉంటుంది; వ్యవహారాలు నడుస్తాయి. అదే భావన ఈ మంత్రంలో వస్తుంది.

**యత్ర అన్యదివ స్యాత్ తత్ర అన్యః అన్యత్ పశ్యేత్** – ఎక్కడ రెండవ వస్తువు ఉందో, అక్కడ రెండవదాన్ని చూస్తాడు. అలాగే తనకు భిన్నంగా ఉన్నదాన్ని వాసన చూస్తాడు; తనకు భిన్నంగా ఉన్నదాన్ని ఆస్వాదిస్తాడు. తనకు భిన్నంగా ఉన్నదాని గురించి మాట్లాడతాడు; తనకు భిన్నంగా ఉన్నదాని గురించి ఆలోచిస్తాడు; తనకు భిన్నంగా ఉన్నదాని గురించి చూస్తాడు; తనకు భిన్నంగా ఉన్నదాని గురించి తెలుసుకుంటాడు. అంటే ప్రమాతృ, ప్రమాణ, ప్రమేయాలు ఉన్నాయి జాగ్రదావస్థలో.

ఇప్పుడు మళ్ళీ ఒక సందేహం. జాగ్రదావస్థలో ద్వైతం ఉంది, సుషుప్తిలో అద్వైతం ఉంది అంటున్నది ఉపనిషత్తు. మనం ప్రతిరోజూ ద్వైత అనుభవాన్నీ, అద్వైత అనుభవాన్నీ కూడా పొందుతాము. అవునా? మరి అయితే **ఏది ఆత్మయొక్క నిజస్వరూపం**? ఆత్మ ద్వైతరూపమా, అద్వైతరూపమా, ద్వైతాద్వైత రూపమా?

కొంతమంది ద్వైతరూపమే సత్యం, అద్వైతరూపం ఆగంతుకం అంటారు. కొంతమంది ద్వైత, అద్వైతరూపం అంటారు. అంటే వారిది భేద అభేద వాదన. విశిష్టాద్వైతులది కూడా అదే. అద్వైతం ఆత్మ అద్వైతరూపం అంటుంది. అంటే ఇది అభేదం మాత్రమే అంటుంది. అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలము? ఈ మంత్రమే దానికి సాక్ష్యం లేదా బలం. ఉపనిషత్తు ఒక పదం వేసింది **అన్యదివ స్యాత్** (అన్యత్+ఇవ+స్యాత్). ఇవ అంటే ఉన్నట్టుగా ఉంది. నిజంగా లేదు. ఇది అక్షరలక్షలు విలువ చేసే పదం. ఇవ అనటంవల్ల భేదం మిథ్యా వ్యవహారం, మాయాకార్యం, అద్వైతం పారమార్థిక స్వరూపం.

**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా**

ఇది వేదాంత సారం. జగన్మిథ్యా అంశం శంకరులవారు సృష్టించినది కాదు. అది ఆయన ఊహాజనితమూ కాదు. ఉపనిషత్తే 'ఇవ' శబ్దం వేసి ద్వైతం ఉన్నట్టుగా ఉంది అంది. అందువల్ల జగత్తుయొక్క మిథ్యాత్వాన్ని నిరూపించటానికి ఈ మంత్రాన్ని తరచూ ఉటంకిస్తారు ఆచార్యులు.

## మంత్రం 4.3.32

**సలిల ఏకో ద్రష్టాఽద్వైతో భవత్యేష బ్రహ్మలోకస్సమ్రాడితి హైనమనుశశాస యాజ్ఞవల్క్యః॥ ఏషాఽస్య పరమా గతిరేషాఽస్య పరమా సమ్పదేషోఽస్య పరమో లోక ఏషోఽస్య పరమ ఆనన్ద ఏతస్యైవానన్దస్యాన్యాని భూతాని మాత్రాముపజీవన్తి ॥**

ఇది ఇంకొక ముఖ్యమైన మంత్రం. ఆ మాటకొస్తే ఈ అధ్యాయము మొత్తం చాలా అద్భుతమైనది.

**ఆత్మ స్వరూపంలో నిలిచిన వ్యక్తి స్వరూపం ఎలా ఉంటుంది?** ఈ ప్రశ్నకు జవాబు దొరుకుతుంది ఇందులో.

**అద్వైతః భవతి** – అతను తన అద్వితీయ స్థితిలో నిలుస్తాడు. ఇక్కడ ఒక విషయం గమనిస్తే, అద్వైతః ఇవ భవతి అనలేదు. 'ఇవ' కారం ఇక్కడ రాలేదు. ఒక్క ద్వైతానికే 'ఇవ' కారం వస్తోంది కాని అద్వైతానికి రావటం లేదు.

**అథ యత్రైనం ఘ్నంతీవ జినంతీవ హస్తీవ విచ్ఛాయయతి గర్తమివ పతతి** – 4.3.20

స్వప్నప్రపంచం గురించి వర్ణించినప్పుడు కూడా ఇవ, ఇవ, ఇవ పదేపదే వచ్చింది. అంటే స్వాప్నికునికి తనను కొడుతున్నట్టుగా, తనను వశము చేసుకుంటున్నట్టుగా, ఏనుగు తరుముతున్నట్టుగా, గోతిలో పడుతున్నట్టుగా అనిపిస్తుంది. కాని అద్వైతం గురించి చెప్పేటప్పుడు ఈ 'ఇవ' రాలేదు. దీన్నిబట్టి స్పష్టంగా ఒక విషయం తెలుస్తున్నది.

### ద్వైతం మిథ్య, అద్వైతం సత్యం

**ఏకః** – అంతేకాదు, అది ఏకం. రెండవది లేనిది.

**సలిలః** – ఇక్కడ శుద్ధం అని తీసుకోవాలి. అక్షరాలా దీని అర్థం చూస్తే సలిలః అంటే నీరు. అందువల్ల సలిలవత్ స్వచ్ఛః అన్నారు శంకరులవారు. నిజానికి ఏకః సలిలః అద్వైతః మూడు పదాలూ ఇంచుమించు ఒకేభావాన్ని సూచిస్తాయి. అందువల్ల భాష్యకారులు ఈ పదాల్లో ఉన్న సూక్ష్మభేదాన్ని వివరిస్తున్నారు. సలిలః అంటే విజాతీయ భేద రహితం; ఏకః అంటే సజాతీయ భేద రహితం; అద్వైతః అంటే స్వగత భేద రహితం.

### సజాతీయ విజాతీయ స్వగత భేదరహితమ్ ఆత్మ

ఆత్మ అంటే ద్రష్ట, కాకపోతే ఏ ద్రష్టనో సరిగ్గా అర్థం చేసుకోవాలి. ఒకటి సవికారద్రష్ట అనీ, ఇంకొకటి నిర్వికారద్రష్ట అనీ చూశాము. చిదాభాస రూపేణ సవికార ద్రష్ట; చిత్‌రూపేణ నిర్వికారద్రష్ట. ఇక్కడ చెబుతున్నది నిర్వికారద్రష్ట అయిన ఆత్మ గురించి. అదే మన అసలు స్వరూపం. ఈ అసలు స్వరూపంలో రాగద్వేషాలు ఉండవు. ఎందుకు? మనసే పని చెయ్యనప్పుడు, మనస్సుకు చెందిన రాగద్వేషాలు ఎలా ఉంటాయి? రాగద్వేషాలు లేని అద్వైత ఆత్మ, సుషుప్తిలో పొందే ఆ ఆత్మ మన అసలు స్వరూపం. మనమేమో జాగ్రద్ పురుషుడు మన అసలు స్వరూపం అనుకుంటాము.

**ఏషః బ్రహ్మలోకః** – ఇది ఒక మహావాక్యం. ఏషః అంటే అద్వైత ఆత్మస్వరూపం, అనంతం అయిన బ్రహ్మ. ఆత్మ=బ్రహ్మ. బ్రహ్మలోకం అంటే అక్షరాలా బ్రహ్మలోకంగా తీసుకోకూడదు. 14 లోకాల్లో అత్యున్నతలోకం

బ్రహ్మలోకం. దాన్ని బ్రహ్మలోకం, సత్యలోకం, హిరణ్యగర్భలోకం అంటారు. ఒక ఉపాసకుడు, శుక్లగతిద్వారా బ్రహ్మలోకానికి చేరతాడు.

కాని ఇక్కడ బ్రహ్మలోకం అంటే సర్వవ్యాపియైన బ్రహ్మ అవుతాడు. లోకానాం దర్శనం జ్ఞానం లోకః. జ్ఞానరూపమ్ బ్రహ్మ; చైతన్యరూపమ్ బ్రహ్మ; స్వయంజ్యోతిః రూపమ్ బ్రహ్మ.

**సమ్రాడితి హైనమనుశశాస యాజ్ఞవల్క్యః** – ఓ సామ్రాట్, ఇది శ్రుతివచనం అని యాజ్ఞవల్క్యుడు చెప్పాడు. ఇంతసేపు అనేక చర్చలు చేశాం. కాని ఈ చర్చలకు మూలమైన గురుశిష్యులెవరో మర్చిపోకూడదు. జనకునితో యాజ్ఞవల్క్యుడు చెప్పాడు. అనుశాసనం అంటే శ్రుతియొక్క వచనం.

**ఏషా అస్య పరమాగతిః** – ఈ అద్వైత స్వరూపమే నీ అంతిమలక్ష్యం. అంటే నిజంగా లోకానికి వెళ్ళటం కాదు. వైకుంఠానికో, కైలాసానికో వెళ్ళటం కాదు. ఎక్కడికీ వెళ్ళనవసరం లేదు కూడా. నీ ఆత్మ స్వరూపం తెలుసు కోవటమే నీ పరమగతి.

**ఏషా అస్య పరమా సంపత్** – ఇది నీ అసలు సంపద. లౌకిక సంపద ఎంతున్నా, అది శాంతిభద్రతలను ఇవ్వలేదు. నీ అంతర్గత సంపదే నీకు శాంతి భద్రతలను ఇవ్వగలదు.

**ఏషః అస్య పరమః లోకః** – అద్వైత స్వరూపమే అత్యున్నత లోకం. అందుకే భగవంతుణ్ణి పరంధామ అంటారు. నీ స్వరూపం పరంధామ స్వరూపం.

**ఏషః అస్య పరమ ఆనందః** – అద్వైత స్వరూపమే అత్యున్నతమైన ఆనందం. దీన్ని ఆత్మానందం లేదా బ్రహ్మానందం అంటారు.

ఆత్మానందం లేదా బ్రహ్మానందం అంటే దాన్ని పూర్ణత్వంగా తీసుకోవాలి. అది కోశానందం కాదు. కోశానందం ఎన్నటికీ శాశ్వతమైన ఆనందాన్ని ఇవ్వలేదు. ఆత్మానందం అంటే ఒక ప్రత్యేకమైన ఆనందం కాదు – ఎందుకంటే ఒక ప్రత్యేకమైన ఆనందం మనస్సుకు చెందినది అంటే వ్యవహారానికి చెందినది – వ్యవహారం అంటే వచ్చిపోయేది, హెచ్చుతగ్గులు ఉండేది. ప్రియ, మోద, ప్రమోదాలు అనే తారతమ్యాలు ఉండేది. ఆత్మానందం అంటే పూర్ణానందంగా తీసుకోవాలి.

**ఆత్మన్యేవ ఆత్మనా తుష్టః స్థితప్రజ్ఞస్తదోచ్యతే – గీత** 2-55

**ఏతస్య ఏవ ఆనందస్య మాత్రాం అన్యాని భూతాని ఉపజీవంతి** – బ్రహ్మానందంలోని ఒక చిన్నభాగాన్ని అజ్ఞానులు విషయానందరూపంలో అనుభవిస్తున్నారు. మాత్రాం పదాన్ని ఆనందస్యతో కలుపుకోవాలి. మాత్ర అంటే లవలేశం, చాలా చిన్నభాగం.

శంకరులవారు తన మనీషా పంచకంలో ఈ బ్రహ్మానందం గురించి వివరించారు. బ్రహ్మానందాన్ని ఒక పెద్ద సముద్రంతో పోలిస్తే, అందులోని ఒక నీటిబొట్టు బ్రహ్మలోక ఆనందం లేదా ఇంద్రలోక ఆనందం. సముద్రంలో ఒక్కొక్క బొట్టు కాదు, సముద్రంలోని నీటిబొట్టులో భాగాలు మనం అనుభవించే అనేక ఆనందాలు.

అయితే ఆ బ్రహ్మానందాన్ని అనుభవించడమెలా? ఇంకొక సందేహం. అది అనుభవించేది కాదు, నువ్వే ఆనందంయొక్క స్వరూపానివి.

**అన్యాని భూతాని ఉపజీవంతి** – కాని తక్కిన జీవులందరూ ఆ బ్రహ్మానందంలోని చిన్న మాత్రను ఆశ్రయించుకుని ఉన్నారు. అంటే సముద్రమంత పెద్ద ఆనందస్వరూపులం మనమయితే, అందులోని నీటిబొట్టులోని భాగమంత ఆనందం మాత్రమే మనం పొందుతున్నాము. ఎలా? విషయానంద రూపంలో!

ఈ భావనను తర్వాత వచ్చే మంత్రంలో ఇంకా వివరంగా చూస్తాము.

## మంత్రం 4.3.33

**స యో మనుష్యాణాగ్ం రాద్ధస్సమృద్ధో భవత్యన్యేషామధిపతిస్సర్వైర్మానుష్యకైర్భోగైస్సమ్పన్నతమస్స మనుష్యాణాం పరమ ఆనన్దః॥ అథ యే శతం మనుష్యాణామానన్దాస్స ఏకః పితృణాం జితలోకానామానన్దోఽథ యే శతం పితౄణాం జితలోకానామానన్దాస్స ఏకో గన్ధర్వలోక ఆనన్దోఽథ యే శతం గన్ధర్వలోక ఆనన్దాస్స ఏకః కర్మదేవానామానన్దో యే కర్మణా దేవత్వమభిసమ్పద్యన్తేఽథ యే శతం కర్మదేవానామానన్దాస్స ఏక ఆజానదేవానామానన్దో యశ్చ శ్రోత్రియోఽవృజినోఽకామహతోఽథ యే శతమాజానదేవానామానన్దాస్స ఏకః ప్రజాపతిలోక ఆనన్దో యశ్చ శ్రోత్రియోఽవృజినోఽకామహతోఽథ యే శతం ప్రజాపతిలోక ఆనన్దాస్స ఏకో బ్రహ్మలోక ఆనన్దో యశ్చ శ్రోత్రియోఽవృజినోఽకామహతః ॥ అథైష ఏవ పరమ ఆనన్ద ఏష బ్రహ్మలోకస్సమ్రాడితి హోవాచ యాజ్ఞవల్క్యస్సోఽహం భగవతే సహస్రం దదామ్యత ఊర్ధ్వం విమోక్షాయైవ బ్రూహీత్యత్ర హ యాజ్ఞవల్క్యో బిభయాఞ్చకార ॥ మేధావీ రాజా సర్వేభ్యో మాన్తేభ్య ఉదరౌత్సీదితి ॥**

ఈ మంత్రంలో ఆనంద మీమాంస చూస్తాము. ఆనంద మీమాంస అంటే విషయానందం గురించిన విశ్లేషణ. ఈ ఆనంద మీమాంసను తైత్తిరీయోపనిషత్తులోని బ్రహ్మానందవల్లీలో కూడా చూస్తాము. నిజానికి ఈ ఆనందమీమాంస ఉండటంవల్లనే ఆ వల్లీకి బ్రహ్మానందవల్లీ అనే పేరు వచ్చింది.

బ్రహ్మానందం గురించి నేర్చుకునేటప్పుడు మూడు విషయాలు గుర్తుంచుకోవాలి.

1. **విషయానందం ప్రతిబింబానందం** – విషయానందం, కోశానందం, లౌకిక ఆనందం – ఏ పేరుతో పిలిచినా ఒకటే. దాన్ని ప్రతిబింబానందం అంటారు. బ్రహ్మానందాన్ని బింబానందంగా తీసుకుంటే, విషయానందం ప్రతిబింబ ఆనందం అవుతుంది. మనం అనుభవించే ఆనందాలన్నీ ప్రతిబింబ ఆనందాలలోకే వస్తాయి. బ్రహ్మానందం అనుభవంలోకి రాదు. అందువల్ల మనం అనుభవించే విషయానందం, బ్రహ్మానందంయొక్క ప్రతిబింబమే. అది మనస్సులో ప్రతిబింబిస్తుంది.

2. **విషయానందం ఒక భాగం లాంటిది** – ఇంతకుముందు విషయానందం గురించి చెప్పేటప్పుడు బ్రహ్మానందం ఒక సముద్రం అయితే విషయానందం ఒక మాత్రలాంటిది అన్నాము. అంటే ఒక చిన్న నీటిబొట్టు లాంటిది అన్నాము. అంటే విషయానందం బ్రహ్మానందంలో ఒక చిన్నభాగం అని అర్థం రావచ్చు. నిజానికి విషయానందం బ్రహ్మానందంలో ఒక భాగం కాదు, ఎందుకు? బ్రహ్మానందం అంటే బ్రహ్మస్వరూపం. బ్రహ్మ నిర్వచనం ఏమిటి? సత్ చిత్ ఆనంద స్వరూపం. బ్రహ్మే బ్రహ్మానందం. బ్రహ్మ నిరవయవం, బ్రహ్మకు భాగాలు లేవు. అందువల్ల బ్రహ్మానందానికి కూడా భాగాలు లేవు. అందువల్ల విషయానందాన్ని బ్రహ్మానందంలోని మాత్ర అంటే నిజంగా భాగం కాదు, భాగంగా ఉన్నట్టుగా ఉంది అనుకోవాలి. ఎందుకు?

ఒకవేళ నిజంగా విషయానందం బ్రహ్మానందంలో ఒక భాగంగా ఉంది అనుకుందాం – అప్పుడేమవుతుంది? ఉదాహరణకు ఒక పెద్ద బట్ట తీసుకుందాం. అందులో అనేక భాగాలు ఉన్నాయనుకుందాం. అందులోంచి ఒక్కొక్క భాగాన్ని తీస్తూ వస్తే ఆ బట్ట చిన్నదవుతూ వచ్చి, కొన్నాళ్ళకి పూర్తిగా మాయమవుతుంది. కొండలైన కరిగిపోవు కూర్చుని తింటే అన్నారు. అలా సముద్రమంత బ్రహ్మానందం ఉన్నా, ఒక్కొక్కళ్ళూ అందులోంచి కొంతకొంత నీరుని (ఆనందాన్ని) తీసుకుంటూ ఉంటే, అన్ని లోకాల్లోని కోట్లాది జీవులు తీసుకుంటూ ఉంటే, చివరికి బ్రహ్మానందం కూడా మాయమయిపోతుంది. అది మాయమయిపోతే విషయానందం అనుభవించటానికి ఉండదు.

అందువల్ల విషయానందం, బ్రహ్మానందంలో ఒక భాగం కాదు. భాగం కానప్పుడు ఎందుకా మాట వాడినట్టు? బట్ట లేకుండా బట్టలోని భాగం తీసుకోలేనట్టుగా బ్రహ్మానందం లేనిదే విషయానందం పొందలేము. భాగానికి విడిగా ఉనికి లేదు. విషయానందాన్ని ఏమన్నాము? ప్రతిబింబ ఆనందం. ప్రతిబింబం బింబం లేనిదే లేదు. బింబం ఏమిటి? బ్రహ్మానందం. అందువల్ల ప్రతిబింబ ఆనందం, బింబానందంమీద ఆధారపడిందని చెప్పటానికి ప్రతిబింబ ఆనందాన్ని బింబానందంలో ఒక భాగంలా ఉంది అన్నారు.

3. **విషయానందానికి తారతమ్యాలు ఉన్నాయి** – విషయానందానికి తారతమ్యాలు ఉన్నాయి. అంటే మనం అనుభవించే ఆనందాలలో హెచ్చుతగ్గులు ఉన్నాయి. ఒక అనుభవం వచ్చిపోతుంది, అంటే ఆ అనుభవం ఉండే సమయంలో ఎక్కువ తక్కువలు ఉంటాయి. సమాధిస్థితిలో అనుభవించే ఆనందం ఉన్నతమైన ఆనందం అయినా కూడా, దాన్ని అనుభవించే కాలాన్నిబట్టి ఆ ఆనందంలో తారతమ్యాలు ఉంటాయి.

బ్రహ్మానందంలో ఈ తారతమ్యాలు ఉండవు. ఎందుకు? అది అనుభవంలోకి వచ్చేది కాదు కాబట్టి. అనుభవంలోకి వచ్చే విషయానందంలోనే ఎందుకు తారతమ్యాలు ఉన్నాయి? దీని జవాబు చాలా తేలిక. విషయానందం ప్రతిబింబానందం. ప్రతిబింబం దాన్ని ప్రతిబింబింపజేసే మాధ్యమంమీద ఆధారపడివుంటుంది. ప్రతిబింబమాధ్యమాలు మెరుస్తూ ఉంటే, ప్రతిబింబం కూడా మెరుస్తుంది; ప్రతిబింబమాధ్యమాలు సరిగ్గా లేకపోతే, ప్రతిబింబం కూడా సరిగ్గా ఉండదు.

వ్యష్టిలో మనస్సు ప్రతిబింబ మాధ్యమం. సత్త్వగుణ ప్రధానంగా ఉన్న మనస్సులో ప్రతిబింబం స్పష్టంగానూ, రజోగుణం ఉన్న మనస్సులో చెదిరినట్టూ, తమోగుణం ఉన్న మనస్సులో అలికేసినట్టు కనిపిస్తుంది. అందువల్ల

ఆనందం ఉపాధిమీద ఆధారపడి ఉంటుంది. అందువల్ల శరీరం, వాతావరణం, ఇంద్రియాలు బాగుంటే మనస్సు ప్రశాంతంగా మెరుస్తూ ఉంటుంది. అంటే ఉపాధి (శరీరం), విషయ (విషయవస్తువులు), లోక (లోకాలు) తారతమ్యాలనుబట్టి మనస్సులో తారతమ్యాలు ఉంటాయి; మనస్సులో తారతమ్యాలనుబట్టి, ప్రతిబింబంలో అంటే ఇక్కడ ప్రతిబింబ ఆనందంలో తారతమ్యాలు ఉంటాయి.

భూలోకంలో కొన్ని ఆనందాలు ఉంటే, దానికన్నా ఉన్నతమైన సువర్లోకంలో ఇంకా ఎక్కువ ఆనందాలు ఉంటాయి. అన్నిటికన్నా గొప్పదైన బ్రహ్మలోకంలో ఇంకెంత గొప్ప ఆనందం ఉంటుందో! బ్రహ్మలోకంలో పొందే ప్రతిబింబానందం చాలా ఎక్కువ ఉంటుంది, ఎందుకంటే అక్కడ ప్రతిబింబం చాలా బ్రహ్మాండంగా ఉంటుంది. కాని బ్రహ్మానందంలో తారతమ్యాలు ఉండవు.

ఇంతవరకూ విషయానందానికి, బ్రహ్మానందానికి మధ్యనున్న మూడు వ్యత్యాసాలను చూశాము. ఇప్పుడు విషయానందం ఎలా ఏర్పడుతుందో చూద్దాము. మనస్సనే ప్రతిబింబ మాధ్యమం, బ్రహ్మానందాన్ని విషయానందంగా ప్రతిబింబింపచేస్తుందని చూశాము. అంటే మనస్సు నిశ్చలంగా ఉండాలి. ఆ మనస్సు నిశ్చలంగా రెండు కారణాలవల్ల ఉండవచ్చు. అవి -

1. మనస్సు ఏం కోరితే దాన్ని పొందటంద్వారా. మనస్సు స్వర్గలోకాన్ని కోరితే జ్యోతిష్టోమ యాగం చేసి స్వర్గలోకానికి వెళ్ళే పుణ్యాన్ని సంపాదించుకోవటం. మనస్సు విషయవస్తువులు కోరితే, వాటిని కొని ఆ విధంగా మనస్సును తృప్తిపరచటం. ఇది ఒక పద్ధతి.

2. వైరాగ్యం చూపటంద్వారా మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవచ్చని ఉపనిషత్తు చెబుతుంది. వైరాగ్యం పొందటానికి ఏ వస్తువులు పొందాలి? వైరాగ్యానికి లౌకిక వస్తువులు పనికిరావు, దానికి వివేకం అనే ఆస్తి ఉండాలి. లౌకిక వస్తువు అయిన ధనంద్వారా లౌకిక విషయవస్తువులను కొనవచ్చు కాని, నిత్యానిత్యవస్తువివేకం అనే ధనంద్వారా వైరాగ్యాన్ని పొందవచ్చు. ఏ వస్తువులు, డబ్బు వెంట అయితే మనం పరుగులు తీస్తున్నామో, అవి శాశ్వతం కాదు; అవి మనవెంట రావు అని ఎప్పుడైతే గ్రహిస్తామో, అప్పుడే వాటిమీద వ్యామోహం పోతుంది. ఆ వస్తువులను పొందిన వ్యక్తి ఎంత ఆనందిస్తాడో, వైరాగ్యం పెంచుకున్న వ్యక్తి కూడా ఆ వస్తువులను పొందకుండానే అంత ఆనందాన్నీ అనుభవిస్తాడు.

కఠోపనిషత్తులో చిన్నపిల్లవాడైనా కూడా నచికేతుడు ఈ వైరాగ్యాన్ని చూపించాడు. ఎన్ని ఇహలోక, పరలోక సుఖాలతో అతన్ని ప్రలోభ పెడదామని యమధర్మరాజు ప్రయత్నించినా అవి అశాశ్వతం, అవి నాకు వద్దు, అవి నువ్వే ఉంచుకో అనేశాడు.

అందువల్ల ప్రతిబింబానందం రెండు రకాలుగా పొందవచ్చు - మనస్సు కోరిందల్లా పొంది లేదా వైరాగ్యం పొంది. బింబానందం ఎలా పొందాలి? జ్ఞానమార్గంద్వారానే.

**జ్ఞానేన బింబానందప్రాప్తిః**

తైత్తిరీయోపనిషత్తులోనూ, ఈ మంత్రంలోనూ ఆనందమీమాంస ఉందని చూశాము. దానికీ, దీనికీ కొన్ని చిన్న భేదాలున్నాయి.

1. **దశల సంఖ్య** – తైత్తిరీయోపనిషత్తులో మనుష్య ఆనందంనుంచి హిరణ్యగర్భ ఆనందం వరకూ చూస్తే అందులో పది దశలు ఉన్నాయి. కాని ఇక్కడ ఏడుదశలే ఉన్నాయి. అంటే ఇక్కడ ఇంద్రలోకం లేదు, బృహస్పతి లోకం లేదు, ఒక గంధర్వలోకం లేదు.

2. **క్రమం మార్పు** – లోకాల దశలు చెప్పేటప్పుడు ఆ లోకాల క్రమంలో వ్యత్యాసం ఉంది రెండింటిలోనూ. ఇక్కడేమో ముందు పితృలోకం గురించి చెప్పాక, గంధర్వలోకం గురించి చెప్పింది ఉపనిషత్తు. అంటే పితృలోకంలోని ఆనందంకన్నా గంధర్వలోకంలోని ఆనందాన్ని ఎక్కువగా తీసుకోవాలి. తైత్తిరీయోపనిషత్తులోనేమో పితృలోకం, గంధర్వలోకం తర్వాత వస్తుంది. అంటే గంధర్వలోకంలోని ఆనందం కన్నా పితృలోక ఆనందం ఎక్కువ.

ఇలా రెండు రకాలుగా చెపితే ఏది నిజం? ఎప్పుడైతే శ్రుతిలో ఇలా భిన్న వివరణలు వచ్చాయో, అప్పుడే శ్రుతి ఈ వివరాలకు ఎక్కువ ప్రాముఖ్యతను ఇవ్వటం లేదు అని అర్థం చేసుకోవాలి.

**తత్ర అవాంతరభేదే తాత్పర్యం నాస్తి**

అంటే అలా వివరాలలో భేదాలు ఉన్నప్పుడు, ఆ విషయాన్ని పెద్దగా పట్టించుకోకూడదు. ఇక్కడ శ్రుతి చెప్పదలుచుకున్న విషయం బ్రహ్మలోకానికి వెళ్ళి ఆనందాన్ని పొందినా, అది విషయానందం మాత్రమే. అంటే ఒక మాత్ర అంత ఆనందం మాత్రమే అని. అలాంటప్పుడు ముందు పితృలోకమా, ముందు గంధర్వలోకమా; గంధర్వలోకంలో కూడా మనుష్య గంధర్వలోకమా, దేవగంధర్వ లోకమా వివరాలన్నీ అనవసరం. వీటన్నిటినీ చివరికి త్రోసివేయబోతున్నది శ్రుతి.

అలాగే సృష్టిప్రకరణం గురించి చెప్పేటప్పుడు కూడా శ్రుతి ఒక్కొక్క ఉపనిషత్తులో ఒక్కొక్క విధంగా చెబుతుంది. తైత్తిరీయోపనిషత్తులో పంచభూతాలనుంచి సృష్టి వచ్చిందని చెపితే, ఛాందోగ్యోపనిషత్తులో మూడుభూతాలనుంచి సృష్టి వచ్చిందని చెబుతుంది. ఏది ప్రామాణ్యంగా తీసుకోవాలి అంటే దానికి ఒకటే సూత్రం–

**యత్ర విగానం వర్తతే తత్ర తాత్పర్యం నాస్తి**

విగానం అంటే ఇలా వివరణలలో భేదాలు. ఇలా వివరాలలో భేదాలుంటే శ్రుతి దానికి ఎక్కువ ప్రాముఖ్యత నివ్వటం లేదని అర్థం. జగత్తును తర్వాత మిథ్యగా త్రోసివేసేటప్పుడు అది ఎలా వస్తేనేమి? దాని సృష్టి విధానం మనకు ముఖ్యం కాదు. నిజానికి మనం కూడా అంతే చేస్తాము. గతంలో జరిగిన ఒక యాత్రా విశేషాలు పదేపదే చెబుతాము. అందులో ఒక విషయానికి మాత్రమే ప్రాముఖ్యతనిస్తాము కాని ఎప్పుడెళ్ళాము, ఎక్కడున్నాములాంటి అనవసరమైన విషయాలు పట్టించుకోము. అలాగే ఈ ఆనందమీమాంసలో కూడా లోకాల సంఖ్య, లోకాల క్రమం పట్టించుకోకూడదు.

ఇప్పుడు ఆనందమీమాంసలోకి వెళదాము. ఆనందాన్ని కొలవాలంటే దానికి ఒక కొలమానం కావాలి. దూరాన్ని మైళ్ళతోనో, కిలోమీటరుతోనో కొలిచినట్టుగా, ఆనందానికి కూడా ఒక కొలత కావాలి. దానికి ఉపనిషత్తు ఒక ఆదర్శపురుషుడిని తీసుకుంది. అటువంటి ఆదర్శపురుషుడు నిజంగా ఉండదు కాని వివరణకోసం

తీసుకుంది. తైత్తిరీయోపనిషత్తులో అటువంటి పురుషుడిని యువా స్యాత్ అంటే ఇక్కడ రాద్ధః భవతి అంది. ఈ నేపథ్యంతో మంత్రంలోకి అడుగుపెడదాము.

**రాద్ధః** – అన్ని అవయవాలూ, బుద్ధితో సహా, బాగా ఉన్న వ్యక్తి. సకల అవయవ సంపన్నుడు.

**సమృద్ధః భవతి** – భోగ్యవస్తువులన్నీ సమృద్ధిగా ఉండి;

**అన్యేషామ్ అధిపతి** – సామంతరాజులకు చక్రవర్తి. అన్యేషాం అంటే సామంతరాజులు. అంటే రాజులకే రాజు, అంటే చక్రవర్తి.

**సర్వైః మానుష్యకైః భోగైః సంపన్నతమః** – చక్రవర్తి కాబట్టి మనుష్యులందరూ పొందే భోగాలన్నీ ఉన్నవారిలో శ్రేష్ఠుడు. మంత్రంలో తర్వాత వచ్చే పదాలలో రెండు ఇక్కడ కలుపుకోవాలి.

**శ్రోత్రియః అవృజినః** – శ్రోత్రియః అంటే శాస్త్రాన్ని బాగా అధ్యయనం చేసినవాడు. అవృజినః అంటే ధార్మిక జీవనం నడిపేవాడు. వృజినం అంటే పాపం; అవృజినం అంటే పాపరహిత జీవనం అంటే ధార్మిక జీవనం నడిపేవాడు. ధర్మం పాటించకపోతే ఆనందం సాధ్యం కాదు. అధర్మం మనస్సును కలత పరుస్తుంది. ప్రతిబింబ ఆనందం పొందటానికి ధార్మిక జీవనవిధానం ఉండాలి. ధార్మిక జీవనవిధానం గడపటానికి శాస్త్రాధ్యయనం చేసివుండాలి. శాస్త్రమే ధర్మాచరణ నేర్పిస్తుంది.

**సః మనుష్యాణాం పరమ ఆనందః** – అటువంటి మనిషి ఆనందం మనుష్యుల్లో అత్యున్నత ఆనందం.

అవయవాలు అన్నీ బాగుండి, భోగ్యవస్తువులన్నీ సమృద్ధిగా ఉండి, చక్రవర్తి అయి, ప్రపంచంలో ఉన్న భోగాలలో తులతూగేవారిలో అగ్రస్థానంలో ఉండి, శాస్త్ర అధ్యయనం చేసి, ధర్మాచరణ చేస్తూ జీవించేవాని ఆనందాన్ని ఒక కొలతగా తీసుకుంది ఉపనిషత్తు. ఇది అజ్ఞానియొక్క ఆనందం, జ్ఞాని విషయానికి ఇంకా రాలేదు మనం. ఇప్పుడు ఈ కొలతను వందరెట్లు చొప్పున ఒక్కొక్క లోకానికీ పెంచుకుంటూ పోతుంది.

**అథ యే శతం మనుష్యాణామానందాస్స ఏకః పితౄణాం జితలోకానామానందః** – జితలోకం అంటే పితృలోకం.
ఒక పితృలోకం ఆనందం = 100 రెట్లు మానవ ఆనందం.

**అథ యే శతం పితౄణాం జితలోకానామానందాస్స ఏకో గంధర్వలోక ఆనందః** –
ఒక గంధర్వలోక ఆనందం= 100 రెట్లు పితృలోక ఆనందం.

**అథ యే శతం గంధర్వలోక ఆనందాస్స ఏకః కర్మదేవానామానందః** –
ఒక కర్మదేవత ఆనందం = 100 రెట్లు గంధర్వలోక ఆనందం.

**యే కర్మణా దేవత్వమభిసంపద్యంతే** – ఈ కర్మదేవతలు పుణ్యకర్మలు చేసి దేవలోకానికి వెళ్ళినవారు.

**అథ యే శతం కర్మదేవానామానందాస్స ఏక ఆజానదేవానామానందః** –
ఒక ఆజానదేవ ఆనందం = 100 రెట్లు కర్మదేవత ఆనందం.

ఆజానదేవతలు అంటే దేవలోకంలో పుట్టినవారు. కర్మదేవతలు, ఆజానదేవతలు ఇద్దరూ దేవలోకంలోనే ఉన్నారు. కాని వారి మధ్య ఆనందానికే 100 రెట్లు భేదం ఉంది. ఎందుకు? తైత్తిరీయోపనిషత్తులో శంకరులవారు వివరిస్తారు. కర్మదేవతలు అంటే వారు ముందు భూలోకంలోనే పుట్టి, పుణ్యకర్మలు చేసి, ఆ పుణ్యఫలంవల్ల సృష్టి మధ్యలో స్వర్గలోకానికి వెళతారు. అంటే స్వర్గలోకానికి వలస వెళ్ళినవారు. ఆజానదేవతలు అంటే సృష్టి మొదట్లోనే వారి పుణ్యకర్మఫలంవల్ల దేవతలుగా పుట్టినవారు. అంటే స్వర్గంలోనే పుట్టినవారు.

**అథ యే శతమాజానదేవానామానందాస్స ఏకః ప్రజాపతిలోక ఆనందః** – ఇక్కడ ప్రజాపతి అంటే విరాట్. స్థూల సమష్టి శరీర అభిమాని విరాట్. మధ్యలో కొన్ని వదిలేసింది ఈ ఉపనిషత్తు.

ఒక ప్రజాపతి ఆనందం = 100 రెట్లు ఆజాన దేవామానందం.

**అథ యే శతం ప్రజాపతిలోక ఆనందాస్స ఏకో బ్రహ్మలోక ఆనందః –**

ఒక బ్రహ్మలోక ఆనందం = 100 రెట్లు ప్రజాపతి ఆనందం.

బ్రహ్మలోకం అంటే హిరణ్యగర్భ ఆనందం. సమష్టి సూక్ష్మశరీర అభిమాని విరాట్.

మధ్యలో ఒక వాక్యాన్ని వదిలేశాము.

**శ్రోత్రియః అవృజినః అకామహతః** – వేదాధ్యయనం చేసి, పాపాలను వదిలిపెట్టి, విహితకర్మలను చేసేవాడు. అకామహతః అంటే వైరాగి. ఇది చాలా ముఖ్యమైన పదం. విషయానందం రెండు రకాలుగా పొందవచ్చని మొదట్లో చూశాము కదా. ఇప్పటివరకూ చూసినది మనస్సు కోరినట్టుగా, ఆయా లోకాలకు వెళ్ళి, ఆయా లోకాల్లో ఆనందాన్ని అనుభవించటం.

ఇక్కడ ఉపనిషత్తు ఒక విషయాన్ని స్పష్టం చేస్తున్నది. మనం మామూలుగా పితృలోకంలో ఆనందం, మనుష్యలోకంలోని ఆనందంకన్నా ఎక్కువ అనుకుంటాము కదా! కాని అది నిజం కాదు; మనిషి పితృలోకంలో ఆనందాన్ని అనుభవిస్తున్నాడంటే అతనికి మనుష్యలోకంమీద వైరాగ్యం వచ్చిందన్నమాట. అలాగే బ్రహ్మలోకంలో ఆనందాన్ని అనుభవిస్తున్నాడంటే, బ్రహ్మలోకంకన్నా కింద ఉన్న లోకాలమీద వైరాగ్యం వచ్చిందన్నమాట. అక్కడే ఆనందం ఎక్కువ ఉంది అనుకుంటాడు. అంటే అతను పైలోకాలకి వెళ్ళాలంటే కింద లోకాలమీద వైరాగ్యం పెరుగుతూ రావాలి. ఇది ఒక పద్ధతి.

రెండవది ఆయాలోకాలు శాశ్వతం కాదని, ఆ ఆనందాన్ని భూలోకంలోనే ఉండి అనుభవించవచ్చని వివేకంద్వారా గ్రహించటం; అంటే వైరాగ్యం పొందటం. ఆ వైరాగ్యం స్థాయినిబట్టి అతనికి ఆ లోకంయొక్క ఆనందం కలుగుతుంది.

అంటే మనిషి భూలోకంలోనే ఉండి, పై లోకాలమీద వైరాగ్యం పెంచుకోవచ్చు. కేవలం వివేకంవల్లనే ఈ వైరాగ్యాన్ని పెంచుకోవచ్చు, కర్మలు చెయ్యనవసరం లేదు, ఉపాసనలు చెయ్యనవసరం లేదు. ఒకవేళ అతనికి భూలోక వైరాగ్యం ఉంటే ఏమవుతుంది? భువర్లోక విషయానందం పొందుతాడు. అలా అతని వైరాగ్యం ఎంత ఎక్కువ ఉంటే, అంత ఎక్కువ లోకానికి వెళితే ఎంత ఆనందం పొందుతాడో, అంత ఆనందం ఇక్కడే పొందుతాడు. ప్రజాపతి లోకందాకా వైరాగ్యం ఉంటే బ్రహ్మలోకానికి వెళితే ఎంత ఆనందం పొందుతాడో,

అంత ఆనందం పొందుతాడు. ఇది రెండవ పద్ధతి. అంటే వైరాగ్యంద్వారా ఆనందం పొందటం. ఈ రెండు పద్ధతులూ ఆనందంలోని తారతమ్యాలను వివరిస్తాయి. ఇంతవరకూ విషయానందం గురించి చూశాము.

**అథ ఏష ఏవ పరమ ఆనంద** – ఇప్పుడు బ్రహ్మానందం అంటే బింబానందం గురించి చెబుతున్నాడు. అథ పదం విషయానందంనుంచి ఆత్మానందాన్ని భిన్నంగా చూపటానికి వాడబడింది. పరమపదాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి ఇక్కడ. మామూలుగా పరమపదం అత్యుత్తమం అని సూచిస్తుంది. అంటే అన్నింటిలోకి గొప్ప అనుభవం అని. అనుభవాల గురించి వర్ణించేటప్పుడు ప్రియం, ప్రియతరం, ప్రియతమం అని మూడు స్థాయీ భేదాలు చూపిస్తాము. సమాధి ఆనందంలో కూడా దీర్ఘసమాధి, మామూలు సమాధి అంటూ హెచ్చుతగ్గులు ఉంటాయి.

కాని బింబానందం పరమానందం. అందులో హెచ్చుతగ్గులు ఉండవు. అందువల్ల పరమానందం స్థాయీ భేదాలు లేని, అనుభవంలోకి రాని ఆనందం. అది ఆత్మస్వరూపచైతన్యం. అది అనుభవం కాకపోతే ఆనందం పదం ఎలా వాడతాము? ఆనందం అంటే సంతోషం, ఆనందం అంటే అనుభవం. ఆత్మానందం పదం వాడినప్పుడు ఆనందం అంటే అనంతం. అనంతం అంటే పూర్ణత్వం. జ్ఞానంవల్ల పొందే పూర్ణత్వాన్నే ఆత్మానందం, బింబానందం, బ్రహ్మానందం అంటారు.

**ఏష బ్రహ్మలోకః** – పూర్ణత్వానికి తారతమ్యాలు లేవు. ఏష బ్రహ్మలోక – ఈ ఆత్మానందాన్నే బ్రహ్మలోకం అంటారు. మళ్ళీ ఈ పదాన్ని జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. బ్రహ్మలోకం అంటే చైతన్యం! అపరిచ్ఛిన్న చైతన్యం.

**సమ్రాడితి హోవాచ యాజ్ఞ్యవల్క్యః** – ఈ విధంగా జనకునికి యాజ్ఞవల్క్యుడు చెప్పాడు అని ఉపనిషత్తు చెబుతున్నది. జనకుడు ఏం చేశాడు?

**సోఽహం భగవతే సహస్రం దదామ్యత ఊర్ధ్వం విమోక్షాయైవ బ్రూహీతి** – మళ్ళీ జనకుడు మీకు వెయ్యి ఆవులను ఇస్తాను, ఇంకా మోక్షం గురించి చెప్పండి అన్నాడు.

**అత్ర హ యాజ్ఞవల్క్యో బిభయాంచకార** – జనకుని ఆ మాటను విని యాజ్ఞవల్క్యుడు భయపడ్డాడు. యాజ్ఞవల్క్యుని భయానికి కారణం శ్రుతి చెబుతున్నది. అతనికి మాట్లాడే సామర్థ్యం లేకనో, అజ్ఞానంవల్లనో భయపడటం లేదు.

**మేధావీ రాజా సర్వేభ్యో మాంతేభ్య ఉదరౌత్సీదితి** – మేధావి అయిన రాజు అన్ని ప్రశ్నలనూ ఒక్కసారే అడిగి వేస్తున్నాడు అనుకుంటున్నాడు. ప్రశ్నలతో నన్ను నిర్బంధిస్తున్నాడు, వెళదాం అనుకుంటే ఇంకా అడుగుతున్నాడు అనుకుంటున్నాడు. నిజంగా యాజ్ఞవల్క్యుడు చెప్పలేకపోవటం కాదు, ఈ వాక్యాన్ని జనకుని శ్రద్ధకు చిహ్నంగా తీసుకోవాలి.

### మంత్రం 4.3.34 ఉపోద్ఘాతం

ముందు మంత్రంతో సుషుప్తి అంశం ముగిసింది. 21–33 మంత్రాలవరకూ సుషుప్తి వర్ణనద్వారా ఆత్మస్వరూపం చూపబడింది. ఇప్పటిదాకా జరిగింది ఒకసారి టూకీగా చూస్తే – రెండు అంశాలు చర్చించబడ్డాయి. సంసారం, మోక్షం. రెండూ రెండు ఉదాహరణలద్వారా చెప్పబడ్డాయి.

1. **సంసారం** – సంసారానికి ఉదాహరణ – జాగ్రద్‌నుంచి స్వప్నావస్థకూ, స్వప్నావస్థనుంచి జాగ్రదావస్థకూ ప్రయాణించటం. సంసారం అంటే ఒక లోకంనుంచి ఇంకొక లోకానికి ప్రయాణించటం. దాన్నే పునరపి జననం, పునరపి మరణం అంటారు. ఇది సంసారంయొక్క వాచ్యార్థం.

**సమ్యక్ చరతి లోకాత్ లోకమ్ గచ్ఛతి ఇతి సంసారః**

ఉపనిషత్తు లోకాలకింద స్వప్నప్రపంచాన్ని, జాగ్రద్ ప్రపంచాన్ని తీసుకుంది. ఎందుకంటే ఈ రెండు లోకాల్లోనూ వస్తువులు వేరు, శరీరాలు వేరు, కాలం వేరు, దేశం వేరు. అందువల్ల స్వప్నలోకం వేరు, జాగ్రత్ ప్రపంచం వేరు. స్వప్నలోకానికి వెళ్ళటం పునర్జన్మ, మళ్ళీ జాగ్రత్ ప్రపంచానికి రావటం ఇంకో జన్మ.

జాగ్రత్ స్వప్నలోకాల మధ్య జీవుడు ఎలా తిరుగాడుతున్నాడో చూపించటానికి మహామత్స్య దృష్టాంతం ఇచ్చింది ఉపనిషత్తు. 15–17 వరకూ సంసార దృష్టాంతం.

2. **మోక్షం** – మోక్షానికి దృష్టాంతం సుషుప్తి. జాగ్రద్, స్వప్నాలు సంసారానికి దృష్టాంతాలయితే, సుషుప్తి మోక్షానికి దృష్టాంతం. సుషుప్తిని ఎందుకు మోక్షంతో పోల్చారు? సుషుప్తిలో త్రిపుటి లేదు; దేశపరిచ్ఛేదం లేదు, కాలపరిచ్ఛేదం లేదు, సంసారదుఃఖాలు లేవు; లోకాలకు ప్రయాణాలు లేవు. 21–33 వరకూ సుషుప్తివర్ణన.

దృష్టాంతం ఉంటే దానికి ద్రాష్టాంతం ఉండాలి. పులి పిల్లిలా ఉంది అంటే పిల్లి దృష్టాంతం అవుతుంది, పులి ద్రాష్టాంతం అవుతుంది. ఉదాహరణను దృష్టాంతం అంటారు, దేనికి ఉదాహరణను ఇస్తారో దాన్ని ద్రాష్టాంతం అంటారు.

మనిషి గుర్రంలా శక్తివంతమైనవాడు. గుర్రం దృష్టాంతం; మనిషి ద్రాష్టాంతం. అలాగే స్వప్న, జాగ్రద్ అవస్థలు కలిసి దృష్టాంతం అయితే, వాటికి ద్రాష్టాంతం సంసారం. సుషుప్తి దృష్టాంతం అయితే, దానికి ద్రాష్టాంతం మోక్షం. ఇంతవరకూ రెండు దృష్టాంతాలనూ చూశాము.

ఇప్పుడు 34నుంచి ద్రాష్టాంత విచారణలోకి అడుగు పెట్టబోతున్నాము. మొదటి ద్రాష్టాంతం సంసారవిచారం. ఇది ఇక్కడ మొదలై, తర్వాత వచ్చే బ్రాహ్మణములో కూడా 6వ మంత్రం వరకూ కొనసాగుతుంది. దాని తర్వాత మోక్షవర్ణన జరుగుతుంది. ఈ నేపథ్యంతో 34వ మంత్రం చూద్దాము.

### మంత్రం 4.3.34

**స వా ఏష ఏతస్మిన్ స్వప్నాన్తే రత్వా చరిత్వా దృష్ట్వైవ పుణ్యం చ పాపం చ పునః ప్రతిన్యాయం ప్రతియోన్యాద్రవతి బుద్ధాన్తాయైవ ॥**

జీవుడు సుషుప్తిలో ఉన్నాడు. ఇప్పుడు అతనిని జాగ్రదావస్థలోకి తీసుకురావాలి.

**స వా ఏషః ఏతస్మిన్ (స్థిత్వా)** – సుషుప్తిలో కొంతకాలం ఉన్న ఈ జీవి;

**స్వప్నాంతే రత్వా చరిత్వా** – స్వప్నంలోకి వచ్చి, అక్కడ రమించి, చరించి;

**దృష్ట్వైవ పుణ్యం చ పాపం చ** – పుణ్యపాపాలను అనుభవించి;

**పునః ప్రతిన్యాయం ప్రతియోన్యాద్రవతి**– మళ్ళీ అదే మార్గంద్వారా వస్తుంది; ఎక్కడికి?

**బుద్ధాంతాయైవ** – జాగ్రదావస్థకు వస్తుంది. ఇవే పదాలు అక్షరాలా 16వ మంత్రంలో చూశాము. స్వప్నాంతం అంటే స్వప్నావస్థ అనీ, బుద్ధాంతం అంటే జాగ్రదావస్థ అనీ చూశాము అక్కడ.

ఇక్కడ ఇంక జాగ్రదావస్థలోకి వచ్చిన ఈ జీవుడు అనేక కర్మలను చేసి, అనేక పుణ్యపాపాలను పోగేసుకుని, వృద్ధుడై, మరణానికి సిద్ధంగా ఉన్నట్టు ఊహించుకోవాలి. ఎందుకు? చర్చలో ఉన్న అంశం సంసార వర్ణనం. సంసారం అంటే ఒకలోకంనుంచి ఇంకొక లోకంలోకి పోవటం అని చూశాము. బ్రతికుండగా ఇంకొక లోకంలోకి పోలేడు కాబట్టి, అతను మరణించాలి. అందువల్ల ఇప్పుడు మరణ వర్ణనను చూడబోతున్నాము.

మరణం ఎంత భయంకరంగా ఉంటుందో మనందరికీ తెలిసిందే! దాని గురించి ప్రత్యేకంగా చెప్పాలా అని శంకరులవారే ప్రశ్న వేసి, వైరాగ్యం పెంపొందించటంకోసం మరణవర్ణన అని చెబుతారు.

## మంత్రం 4.3.35

**తద్యథాఽనస్సుసమాహితముత్సర్జద్యాయాదేవమేవాయం శారీర ఆత్మా ప్రాజ్ఞేనాఽఽత్మనాఽన్వారూఢ ఉత్సర్జన్ యాతి । యత్రైతదూర్ధ్వోచ్ఛ్వాసీ భవతి ॥**

మరణ సమయంలో ఏమవుతుంది? జీవుడు ఇంకొక శరీరంలోకి, దీన్ని వదిలేసి వెళ్ళాలి. తనతోపాటు తన ఇంద్రియాలను తీసుకువెళ్ళాలి. ఇంద్రియాలు వాటి గోళకాలతో ఉంటాయి. మరణ సమయంలో ఆ ఇంద్రియాలను ఆ గోళకాలనుంచి విడదీసి, వాటిని తీసుకువెళ్ళాలి. అవికాక పుణ్యపాపాల మూటను తీసుకువెళ్ళాలి. వీటన్నిటినీ మోసుకువెళ్ళాలి.

దీనికి ఉపనిషత్తు ఒక ఉదాహరణను ఇస్తున్నది – అది ఇల్లు మారే ఉదాహరణ. ఒక ఇంటినుంచి ఇంకో ఇంటికి మారేటప్పుడు ఏంచేస్తాము? సామాన్లన్నీ పెట్టెల్లో సర్ది, ఆ పెట్టెలను బండిలో వేసి, ఆ బరువైన బండిని గతుకుల రోడ్డుమీద తీసుకువెళ్ళాలి. అది అనేక చప్పుళ్ళు చేస్తూ వెళుతుంది. బండిని నడిపే వ్యక్తి ఒకరుండాలి. మనం కూడా ఆ బండిలో కూర్చుంటాము.

అదే విధంగా జీవాత్మ పుణ్యపాపాలు, ఇంద్రియాలు అనే పెట్టెలను నిండుగా ఒక బండిలో వేస్తే, ఆ బండిని ఈశ్వరుడు నడుపుతాడు. ప్రయాణం చేసేది సూక్ష్మశరీరం. గతుకుల రోడ్డుమీద చప్పుడు మరణ సమయంలో మన మూలుగు, ఆయాసం లాంటివి.

**తత్ యథా అనః** – అనః అంటే బండి;

**సుసమాహితమ్** – గృహ సంబంధిత పెట్టెలతో ఎలాగైతే నిండివుందో;

**ఉత్సర్జత్** – శబ్దం చేస్తూ;

**యాయాత్** – వెళుతుందో;

**ఏవమేవాయం శారీర ఆత్మా** – అదే విధంగా ఈ సూక్ష్మశరీరం

**ప్రాజ్ఞేన ఆత్మనా అన్వారూఢః** – ఈశ్వరుని చేత తీసుకువెళ్ళబడుతుంది. ప్రాజ్ఞేన ఆత్మ అంటే ఈశ్వరుడు. ఈశ్వరుడు మన కర్మఫలదాత. మన కర్మఫలాన్నిబట్టి మన సూక్ష్మ శరీరాన్ని ఎటు తీసుకువెళ్ళాలో ఆయన నిశ్చయిస్తాడు.

**ఉత్సర్జన్ యాతి** – మరణించే వ్యక్తి చప్పుళ్ళు చేస్తాడు.

**యత్రైతదూర్ధ్వోచ్ఛ్వాసీ భవతి**– అంటే శ్వాస పీల్చుకోవటానికి అవస్థ పడతాడు. అప్పుడు తక్కిన ప్రాణాలు శక్తివిహీనం అవుతాయి, ఉదానప్రాణం శక్తి పుంజుకుంటుంది.

## మంత్రం 4.3.36

**స యత్రాయమణిమానం న్యేతి జరయా వోపతపతా వాఽణిమానం నిగచ్ఛతి ॥ తద్యథాఽమ్రం వోదుమ్బరం వా పిప్పలం వా బన్ధనాత్ప్రముచ్యత ఏవమేవాయం పురుష ఏభ్యోఽఙ్గేభ్యస్సమ్ప్రముచ్య పునః ప్రతిన్యాయం ప్రతియోన్యాద్రవతి ప్రాణాయైవ ॥**

మరణ వర్ణనే ఇంకా కొనసాగుతున్నది.

**సః అయం యత్ర అణిమానం న్యేతి** – అణిమానం అంటే అణువు అంతగా ఆ జీవిశరీరం బాగా సన్నగా అయిపోతుంది. ఎందుకు?

**జరయా వోపతపతా వాఽణిమానం నిగచ్ఛతి**– ముసలితనంవల్ల కావచ్చు లేదా రోగంవల్ల కావచ్చు, బాగా చిక్కిపోతుంది.

చివరికి ఏమవుతుంది? ఇంతవరకూ కలిసివున్న సూక్ష్మ, స్థూలశరీరాలు విడిపోతాయి; స్థూలశరీరం రాలిపోతుంది, సూక్ష్మశరీరం ప్రయాణం చేస్తుంది. స్థూలశరీరంతో సూక్ష్మశరీరంయొక్క సంయోగాన్ని జననం అనీ; స్థూలశరీరంతో సూక్ష్మశరీరంయొక్క వియోగాన్ని మరణం అనీ అంటారు.

**బంధనాత్ ప్రముచ్యతే** – సూక్ష్మశరీరం, స్థూలశరీరంతో ఉన్న బంధంనుంచి విడిపోతుంది. ఒక ఫలం ఎలాగైతే పండిపోయాక, చెట్టునుంచి రాలిపోతుందో, అలాగే ఈ సూక్ష్మశరీరం ఈ స్థూలశరీరంనుంచి విడిపోతుంది. దీనికి ముందు ఉదాహరణలను ఇస్తుంది ఉపనిషత్తు.

**తద్యథాఽమ్రం వా ఉదుంబరం వా పిప్పలం వా** – ఎలాగైతే మామిడిపండు లేదా మేడిపండు లేదా రావిపండు;

**బంధనాత్ ప్రముచ్యతే** – చెట్టునుంచి రాలిపోతాయో;

**ఏవమేవాయం పురుషః** – అదే విధంగా ఈ జీవుడు

**ఏభ్యః అంగేభ్యః సంప్రముచ్య** – తన గోళకాలనుంచి (స్థూలశరీరంనుంచి) పూర్తిగా విడిపోయి;

**పునః ప్రతిన్యాయం ప్రతియోన్యాద్రవతి** – మళ్ళీ అదే విధంగా,

**ప్రాణాయ ఏవ** – కొత్త జీవితం పొందటంకోసం.

మంత్రం 4.3.37

**తద్యథా రాజానమాయాన్తముగ్రాః ప్రత్యేనససూ్తగ్రామణ్యోఽ న్నైః పానైరావసథైః ప్రతికల్పన్తేఽ యమాయాత్యయమాగచ్ఛతీత్యేవగ్ం హైవంవిదగ్ం సర్వాణి భూతాని ప్రతికల్పన్త ఇదం బ్రహ్మేఽ ఽ యాతీదమాగచ్ఛతీతి ॥**

ఇంకా మరణవర్ణన కొనసాగుతున్నది. జీవాత్మను మహారాజుతో పోలుస్తున్నది ఉపనిషత్తు. ఒకరాజు ఒక ఊరినుంచి ఇంకో ఊరికి వెళుతుంటే, ఈ ఊరివారు ఘనంగా వీడ్కోలు ఇస్తారు, ఆ ఊరివారు ఘనంగా స్వాగతిస్తారు. ముందు స్వాగతం చూస్తాము, తర్వాత వచ్చే మంత్రంలో వీడ్కోలు చూస్తాము.

**తద్యథా రాజానమాయాన్తం** – ఒక రాజు ఒక కొత్త ప్రదేశానికి వచ్చినప్పుడు;

**ప్రతికల్పంతే** – చాలా మంది ఎదురు చూస్తారు. ఎవరు వారు?

**ఉగ్రాః ప్రత్యేనససూత గ్రామణ్యః** – ఉగ్రాః అంటే నిమ్నజాతివారు. ప్రతిలోమ అనులోమవర్ణాలవారు. ఉగ్రాః ఒక జాతి.

**ప్రత్యేనసః** – నేరస్థులకు శిక్షలు అమలు చేస్తారు వీరు.

**సూత** – వీరు కూడా నిమ్నజాతివారు, వీరు రథసారథులు అవుతారు;

**గ్రామణ్యః** – గ్రామపెద్దలు. వీరంతా రాజుకోసం ఎదురు చూస్తున్నారు. ఎలా?

**అన్నైః పానైః ఆవసథైః** – అన్నపానాదులు, వసతి గృహాలు ఏర్పాటుచేసి; ప్రతికల్పన్తే – ఎదురు చూస్తున్నారు. ఏ విధంగా?

**అయమాయాతి అయమాగచ్ఛతీతి** – ఇదుగో వస్తున్నారు, ఇదుగో వస్తున్నారు అంటూ ఎదురు చూస్తున్నారు.

**ఏవం విదగ్ం** – ఇదే విధంగా ఒక జీవి తల్లిగర్భంలో ప్రాణం పోసుకున్నప్పుడు,

**సర్వాణి భూతాని ప్రతికల్పన్తే** – అందరూ ఆనందంగా ఎదురు చూస్తారు. అధిష్ఠానదేవతలు కూడా ఎదురు చూస్తారు.

**ఇదం బ్రహ్మ ఆయాతి ఇదమాగచ్ఛతీతి** – ఇదుగో బ్రహ్మ వస్తున్నాడు, బ్రహ్మ వస్తున్నాడు అని ఉత్సాహంగా ఎదురు చూస్తారు. కొత్త ప్రాణిని రాజుతో పోలుస్తున్నారు. ఆ బాబుకోసం ఆవులు కొని, ఉయ్యాలలు ఏర్పాటు చేసి, ఆర్భాటంగా ఎదురు చూస్తారు. బాబు పుట్టగానే ఆయా ఇంద్రియాల అధిష్ఠానదేవతలు ఆ ఇంద్రియాలలో చేరి వాటికి జీవం పోయాలి. అందువల్ల వారు కూడా ఎదురు చూస్తున్నారు. బ్రహ్మ వస్తున్నాడు అంటున్నారు అందరూ. నిజానికి సాక్షాత్తూ పరమాత్మే జీవాత్మగా అనుప్రవేశం చేస్తాడు.

మంత్రం 4.3.38

**తద్యథా రాజానం ప్రయియాసన్తముగ్రాః ప్రత్యేనససూ్తగ్రామణ్యోఽ భిసమాయన్త్యేవమేవేమమాత్మా నమన్తకాలే సర్వే ప్రాణా అభిసమాయన్తి యత్రైతదూర్ధ్వోచ్ఛ్వాసీ భవతి ॥**

ఇప్పుడు సాగనంపే కార్యక్రమం. మొదటి రెండు పాదాలు మళ్ళీ అవే పదాలు. మళ్ళీ ఉగ్రాః ప్రత్యేనస, సూత, గ్రామణ్యలు గుమిగూడతారు రాజు వెళుతున్నాడని సాగనంపటానికి.

**ఏవమేవ ఇమమ్ ఆత్మానమ్ అన్తకాలే** – ఇదే విధంగా జీవియొక్క మరణ సమయంలో;

**సర్వే ప్రాణాః అభిసమాయన్తి** – ప్రాణాలన్నీ గుమిగూడతాయి.

**యత్రైతదూర్ధ్వోచ్ఛ్వాసీ భవతి** – అప్పుడు నీతో వస్తామంటాయి. అతనికి శ్వాస పీల్చుకోవటం కష్టమవుతుంది. ఇంత వివరణ వైరాగ్యంకోసం అని ముందే చూశాము.

## బ్రాహ్మణము 3 సారాంశం

ఈ బ్రాహ్మణము మొత్తం బృహదారణ్యకోపనిషత్తుకే మకుటం. దీన్ని జ్యోతిర్బ్రాహ్మణము లేదా స్వయంజ్యోతి బ్రాహ్మణము అంటారు. ఇందులో బోధ జనక యాజ్ఞవల్క్య సంవాదం రూపంలో సాగింది; జనకుడు శిష్యుడు, యాజ్ఞవల్క్యుడు గురువు. జనకుడు యాజ్ఞవల్క్యుణ్ణి ఆత్మజ్యోతి గురించి అడుగుతాడు. దానికి జవాబుగా ఈ బ్రాహ్మణము అంతా వచ్చింది.

**మంత్రాలు 1-6**: ఎ) **దేహ వ్యతిరిక్త ఆత్మజ్యోతి** – స్వప్నవృత్తాంత విశ్లేషణద్వారా యాజ్ఞవల్క్యుడు ఆత్మజ్యోతిని తర్కపరంగా వివరించాడు. దానికి వాడిన అనుమానవాక్యం ఇది –

**స్వప్నదేహవ్యవహారః దేహవ్యతిరిక్తః జ్యోతి సాధ్యః.**

దేహానికి భిన్నంగా ఉన్న జ్యోతి దేహవ్యవహారాలు నడపటానికి తోడ్పడుతుంది. ఇది అనుమానం. కాకపోతే, జాగ్రదావస్థలో జాగ్రద్ శరీరానికి తోడ్పడేది బాహ్యజ్యోతి అయితే, స్వప్నావస్థలో స్వప్నశరీరానికి తోడ్పడేది ఆంతరజ్యోతి. రెండింటిలో సమానంగా ఉన్న అంశం – జ్యోతి శరీరానికి భిన్నంగా ఉంది. ఈ జ్యోతి జాగ్రదావస్థలో శరీరానికి భిన్నంగా బాహ్యంగా ఉంటే, స్వప్నావస్థలో శరీరానికి భిన్నంగా ఆంతరంగా ఉంది.

బి) **ఆంతరజ్యోతి అభౌతికం** – ఆంతరజ్యోతి ఇంద్రియాలకు అందదు కాబట్టి స్వప్నజ్యోతి అభౌతికం.

**స్వప్నజ్యోతి అభౌతికః అతీంద్రియత్వాత్**

ఆంతరజ్యోతి పంచభూతాలతో చెయ్యబడింది కాదు. ఎందుకంటే ఇది ప్రత్యక్ష ప్రమాణానికి అందదు.

**మంత్రాలు 7-19 : ఆత్మజ్యోతి స్వరూపం** – మళ్ళీ స్వప్నవృత్తాంత విశ్లేషణద్వారా ఆత్మజ్యోతిస్వరూపాన్ని వివరించాడు యాజ్ఞవల్క్యుడు. దీనిద్వారా మూడు విషయాలు తేటతెల్లమవుతాయి.

ఎ) **ఆత్మజ్యోతి దేహవిలక్షణం** – ఆత్మజ్యోతి మనస్సుకు, శరీరానికి భిన్నంగా ఉంది. ఇది విజ్ఞానశాస్త్రానికి జవాబు. విజ్ఞానశాస్త్రం ఇంకా సరియైన నిర్వచనం ఇవ్వలేకపోతున్నది చైతన్యం గురించి. విజ్ఞానశాస్త్రం చైతన్యం వస్తువు లక్షణం లేదా వస్తువులో ఒక భాగం అనుకుంటుంది కాని చైతన్యం స్వతంత్రమైనది. ఈ భాగంలో చైతన్యం శరీరంలో ఒక భాగం గాని, ఒక లక్షణం గాని, శరీరంనుంచి ఉత్పత్తి చెందినది కాని కాదనీ, చైతన్యం స్వతంత్రమైనదనీ తెలుసుకుంటాము. చైతన్యం శరీరానికి విశేషణం కాదు, నిజానికి శరీరమే చైతన్యంమీద ఆధారపడివుంది.

బి) **ఆత్మజ్యోతి కర్మరహితం** – చైతన్యం కర్మ చెయ్యదు ఆత్మజ్యోతి అన్నా, చైతన్యం అన్నా ఒకటే.

**న పుణ్యం న పాపం న సౌఖ్యం న దుఃఖం, న మంత్రో న తీర్థః న వేదా న యజ్ఞాః।**
**అహం భోజనం నైవ భోజ్యం న భోక్తా, చిదానందరూపః శివో౽హం శివో౽హమ్॥**

చైతన్యమైన నాకు పుణ్యకర్మలు అంటవు. పాపకర్మలు అంటవు. ఇవి ఉపలక్షణాలుగా మనం గ్రహించాలి. చైతన్యం కర్మ చెయ్యకపోతే కర్మఫలాలు అంటవు; కర్మఫలాలు లేకపోతే సుఖదుఃఖ భోగాలు ఉండవు. సుఖదుఃఖాలు లేకపోతే పునర్జన్మ ఉండదు

సి) **ఆత్మజ్యోతి కామరహితం** – కామరహితం అంటే కోరికలు ఉండవు. నిష్కామకత్వం లేదా అకామకత్వం అంటారు.

జీవాత్మ స్వప్నావస్థలోనూ, జాగ్రదావస్థలోనూ తిరుగుతూ ఉంటుందని నిరూపించటానికి రెండు ఉదాహరణలు చూపించాడు యాజ్ఞవల్క్యుడు.

1) **మహామత్స్య దృష్టాంతం** – నీటిలో ఉన్న ఒక పెద్దచేప కాసేపు ఈ ఒడ్డుకూ, కాసేపు ఆ ఒడ్డుకూ తిరుగుతుంది. కాసేపు మధ్యలో ఉంటుంది. కాని దేనికీ చెందదు. ఏ ఒడ్డున ఏం జరిగినా దానికేం అవదు. రెండు ఒడ్డులు జాగ్రద్, స్వప్నావస్థలు; మధ్యభాగం సుషుప్తి. అలాగే జీవాత్మ కూడా కాసేపు జాగ్రదావస్థలో, కాసేపు స్వప్నావస్థలో ఉంటుంది. రెండూ తిరిగి అలసిపోతే సుషుప్తిలోకి వెళుతుంది. జాగ్రద్, స్వప్నావస్థల్లో ఏం జరిగినా ఆత్మ చలించదు, ఆత్మకు అంటదు.

2) **పక్షి దృష్టాంతం** – ఒక పక్షి ఆకాశంలో పొద్దున్నుంచి సాయంకాలం దాకా ఎగురుతుంది. ఆహారం తీసుకుంటుంది. సాయంకాలం అయ్యేసరికి అలసిపోయి, తన గూటికి వచ్చి చేరుకుంటుంది. అదే విధంగా జీవుడు అనే ఈ పక్షి కూడా పగలంతా జాగ్రద్ ప్రపంచంలోనూ, స్వప్నప్రపంచంలోనూ అనేక పనులు చేసి, అనేక అనుభవాలను పొందుతాడు. సుఖదుఃఖ మిశ్రమ అనుభవాలను పొందుతాడు. రాత్రి ఎలాగైతే పక్షి తన రెక్కలు ముడుచుకుని పడుకుంటుందో, అలా జీవుడు రాత్రి తన ఇంద్రియాలను, మనస్సును ముడుచుకుని పడుకుంటాడు. జీవుని గూడును ప్రాజ్ఞ అంటారు. అంటే కారణశరీరం లేదా సుషుప్తి. జీవుడు సుఖదుఃఖాలను అనుభవించినా ఆత్మకు అవి అంటవు.

**మంత్రం 20: విద్య అవిద్యల ఫలం** – విద్యాఫలం అంటే జ్ఞానఫలం, అవిద్యాఫలం అంటే అజ్ఞానఫలం. ఈ రెండు ఫలాలను స్వప్న, సుషుప్తి ఉదాహరణలద్వారా చూస్తాము. స్వప్నదృష్టాంతం అవిద్యాఫలం సూచిస్తే, సుషుప్తి విద్యాఫలాన్ని సూచిస్తుంది.

ఎ) **అవిద్యాఫలం** – స్వప్నంలో అజ్ఞానంవల్ల మిథ్యాద్వైతం ఉంటుంది. మిథ్యాద్వైతంవల్ల స్వప్నంలో దుఃఖాలు, బాధలు అనుభవిస్తాము. ఏనుగు తరుముతున్నట్టుగా అనిపించటం, ఎవరో వెంటబడుతున్నట్టుగా అనుభవించటం దీనికి ఉదాహరణలు.

బి) **విద్యాఫలం** – సుషుప్తి విద్యాఫలాన్ని సూచిస్తుంది. ఎందుకంటే సుషుప్తిలో అద్వైతం ఉంటుంది. అద్వైతం అనే పదం వాడే బదులు యాజ్ఞవల్క్యుడు **సర్వాత్మభావన** ఉంటుంది అన్నాడు. నాకు భిన్నంగా ఏదీ లేదు.

**మంత్రాలు 21-33: సుషుప్తిద్వారా మోక్ష వర్ణన** - సుషుప్తిని మోక్షంతో సమానం చేశాడు యాజ్ఞవల్క్యుడు. నిజానికి సుషుప్తిలో మోక్షం దొరకదు. నిజంగా సుషుప్తిలోనే మోక్షం పొందేటట్టయితే, శాస్త్రం ఎందుకు, గురువెందుకు? సుషుప్తిని మోక్షంతో ఎందుకు పోల్చారంటే, సుషుప్తిలో సంసారం అవ్యక్తంగా ఉంటుంది; సుఖదుఃఖ మిశ్రమ అనుభవాలు ఉండవు. సంసారఫలం ఉండదు. సంసారఫలం అవ్యక్తంగా ఉంటుంది.

మోక్షంలో సుఖదుఃఖ మిశ్రమ అనుభవాలు అవ్యక్తంగానే కాదు, అసలు ఉండవు. సంసారఫలం అసలు ఉండదు. సుషుప్తి, మోక్షం - రెండూ చూడటానికి ఒక్కటిగా ఉన్నా సుషుప్తిలో సంసారం అవ్యక్తంగా ఉంటుంది; మోక్షంలో సంసారం ఉండదు.

సుషుప్తిలో సంసారం వ్యక్తంగా ఉండదు అనే విషయాన్ని అనేక విధాలుగా వర్ణించవచ్చు - సుషుప్తిలో కామక్రోధాలు ఉండవు; కర్మ ఉండదు, కర్మఫలం ఉండదు, కోరిక ఉండదు, రాగద్వేషాలు ఉండవు; ద్వైతం ఉండదు- మోక్షంలో కూడా ఇవేవీ ఉండవు. కామక్రోధాలు ఉండవు; కర్మ-కర్మఫలాలు ఉండవు; కోరిక-రాగద్వేషాలు ఉండవు; ద్వైతం ఉండదు. అందువల్ల సుషుప్తి దాదాపు మోక్షంతో సమానం.

**మంత్రాలు 34-38: జీవాత్మ స్వరూపం** - ఆత్మస్వరూపాన్ని జీవాత్మపరంగా వర్ణించాడు ఈ మంత్రాల్లో. ఇది అర్థం చేసుకోవాలంటే వెనక్కి ఏడవ మంత్రంలోకి వెళ్ళాలి. ఒకటే ఆత్మ ఉంది. అదే జీవాత్మ, అదే పరమాత్మ. చైతన్యంయొక్క అసలు స్వరూపం పరమాత్మ; అదే చైతన్యం మనస్సులో చిదాభాసరూపంలో అందుబాటులో ఉంటే అది జీవాత్మ. ఇంకో విధంగా చెప్పాలంటే వ్యావహారిక స్థాయిలో జీవాత్మ; పారమార్థిక స్థాయిలో పరమాత్మ.

**చిద్రూపేణ పరమాత్మా, చిదాభాసరూపేణ జీవాత్మా**
**బింబరూపేణ పరమాత్మా, ప్రతిబింబరూపేణ జీవాత్మా**
**పారమార్థిక రూపేణ పరమాత్మా, వ్యావహారిక రూపేణ జీవాత్మా**

7వ మంత్రంలో పరమాత్మకు వాడిన పదం - పురుషః, జీవాత్మకు వాడిన పదం - విజ్ఞానమయః. పరమాత్మకు ప్రయాణం లేదు, జీవాత్మకు ప్రయాణముంది. ఇంతకు ముందు మంత్రాల్లో పరమాత్మస్వరూపం చూస్తే, ఇప్పుడు 35-38 వరకూ జీవాత్మస్వరూపం చూస్తాము. అదే పరమాత్మ, జీవాత్మరూపంలో సంసారి అవుతాడు.

నేను పరమాత్మను అని అర్థం చేసుకుంటే, నేను అసంసారిని; ఎప్పుడైతే నేను చిదాభాస స్థాయికి దిగుతానో, అంటే జీవాత్మ స్థాయికి దిగుతానో, అప్పుడే నేను సంసారిని. మనస్సు ఒక శరీరంనుంచి ఇంకో శరీరానికి తిరుగుతుంది కాబట్టి, మనస్సుతో మమేకం చెందిన చిదాభాసరూప జీవాత్మ కూడా తిరగాలి. అందువల్ల ఇక్కడ జీవాత్మ సంసారవర్ణనను చూస్తాము. సంసారవర్ణనను కూడా మరణవర్ణనద్వారా చూపించాడు. ఎందుకు? అప్పుడైనా మనకు దేహ అభిమానం పోయి, వైరాగ్యం ఏర్పడుతుందేమోననే ఆశతో.

మనం ఒక శరీరంనుంచి ఇంకొక శరీరానికి తిరుగుతూనే ఉండాలి. ఒక శరీరంమీద మమకారం ఏర్పరచుకునేసరికి, ఆ శరీరాన్ని వదిలి, ఇంకో జన్మనెత్తి ఇంకో శరీరాన్ని తీసుకోవాల్సి ఉంటుంది. చీటికీ మాటికీ ఉద్యోగరూపేణ బదిలీలు అయ్యేవారి పరిస్థితిలా ఉంటుంది. ఒక ఊరిలో అలవాటుపడి, నిశ్చింతగా ఉండబోయేలోపు

ఇంకొక ఊరికి బదిలీ అయిపోతుంటారు. అలా మనం జన్మజన్మలు ఎత్తుతూ ఉండాలి. ఈ సంసారవర్ణన చెయ్యటానికి మూడు దృష్టాంతాలను ఇచ్చాడు గురువు.

ఎ) **శకట దృష్టాంతం** – ఒక వ్యక్తి ఇల్లు మారినప్పుడు ఏంచేస్తాడు? తన వస్తువులన్నింటినీ పెట్టెల్లో వేసుకుని బండిలో తీసుకువెళతాడు. ఆ బరువును మొయ్యలేక బండి చప్పుడు చేస్తుంది. అదేవిధంగా జీవాత్మ శరీరాన్ని వదిలేటప్పుడు కర్మల పుణ్యపాపఫలాలు, సంచితకర్మలు, ఇంద్రియాలను పోగేసుకుని బయలుదేరుతుంది. బండిచేసే చప్పుడు జీవిచేసే చప్పుడు, మూలుగు, ఏడుపు. మరణం గురించిన ఈ భయంకరవర్ణన మనను భయపెట్టి, వైరాగ్యంలో ముంచటానికి. ప్రతిరోజూ ఎవరో ఒకరు మరణించటం చూస్తూనే ఉంటాము. కాని మన ప్రవర్తనచూస్తే మనం శాశ్వతంగా ఉంటామని భావించుకున్నట్టుగా ఉంటుంది. అందువల్ల ఉపనిషత్తు మనకు గుర్తు చెయ్యాల్సి వస్తున్నది. మన బండి నడిపే వ్యక్తి సాక్షాత్తూ ఆ ఈశ్వరుడే. ఆయన కర్మఫలదాత. మనం ఎక్కడికి వెళ్ళాలని మన కర్మఫలం నిర్దేశిస్తే, అక్కడికి ఆయన తీసుకువెళతాడు.

బి) **ఫల దృష్టాంతం** – పండు పరిపక్వం అయ్యేదాకా చెట్టును అంటిపెట్టుకుని ఉంటుంది, కాని అది పరిపక్వమయ్యాక చెట్టుతో ఎంత అనుబంధం ఉన్నా కూడా దాన్నించి రాలిపోతుంది. అలాగే ఈ జీవాత్మ అనే పండుకు శరీరం అనే చెట్టుతో ఎంత అనుబంధమున్నా, సమయం రాగానే దాన్నించి విడిపోక తప్పదు.

సి) **రాజ దృష్టాంతం** – ఒక రాజు ఒక ప్రదేశాన్ని వదిలివెళ్ళేటప్పుడు ఆయన ఎన్నడూ ఒంటరిగా వెళ్ళడు. ఆయన వెంట మందీ మార్బలం ఉంటారు. అలాగే జీవాత్మ కూడా ఈ శరీరాన్ని వదిలి వెళ్ళేటప్పుడు ఒంటరిగా వెళ్ళదు. పంచప్రాణాలనే మంత్రులు, జ్ఞానేంద్రియాలనే సేవకులు, కర్మేంద్రియాలనే సైనికులు దానితో వెళ్ళటానికి సిద్ధంగా ఉంటారు. రాజు ఇంకొక ప్రదేశానికి చేరాక, అక్కడ ఆయనకు స్వాగతించటానికి చాలామంది ఎదురు చూస్తుంటారు. అలాగే జీవాత్మ ఈ శరీరం వదిలి, ఇంకో శరీరంలో రూపు దిద్దుకుంటున్నప్పుడు, ఆ కొత్త జన్మలో అందరూ రాజుకోసం ఎదురు చూసినట్టు చూస్తారు. అన్ని ఏర్పాట్లూ ఆర్భాటంగా చేసుకుని ఉంటారు. శంకరులవారు దేవతలు కూడా ఎదురు చూస్తుంటారు అని చెబుతారు. ఎందుకంటే ఇంద్రియాలు కొత్త శరీరంలోని గోళకాలతో జత కలవగానే, వాటిని చైతన్యవంతం చేసే అధిష్ఠానదేవతలు కూడా రావాలి.

ఈ విధంగా సంసారవర్ణన గురించి మూడు ఉదాహరణలు చూశాము. తర్వాత వచ్చే బ్రాహ్మణములో కూడా ఆరవ మంత్రం వరకూ అంటే 4.3.35 నుంచి 4.4.6 వరకూ సంసారవర్ణన కొనసాగుతుంది. ఇక్కడితో ఈ బ్రాహ్మణము ముగిసింది.

ఇది చాలా ముఖ్యమైన బ్రాహ్మణము అనీ, ఇందులో ఎన్నో ఆణిముత్యాలలాంటి మంత్రాలు, వాక్యాలు ఉన్నాయనీ చూశాము. ఇప్పుడవి మళ్ళీ ఒకసారి గుర్తు తెచ్చుకుందాం.

# జ్యోతిర్బ్రాహ్మణములో ముఖ్యమైన మంత్రాలు

**4.3.6: ఆత్మనైవాయం జ్యోతిషా౾ ౾ స్తే –** ఆత్మవల్లనే అన్ని వ్యవహారాలూ నడుస్తున్నాయి.

**4.3.7: విజ్ఞానమయః ప్రాణేషు హృద్యంతర్జ్యోతిః పురుషః –** ఆత్మ నిర్వచనం వస్తుంది ఇందులో, అంతేకాదు వ్యవహార జీవాత్మస్వరూపం వస్తుంది ఇందులో. ఇది చిదాభాసకు ప్రమాణం.

**ధ్యాయతీవ లేలాయతీవ –** ధ్యాయతి ఇవ, లేలాయతి ఇవ అంటే ఆత్మ తెలుసుకుంటున్నట్టుగా ఉంది; కర్మ చేస్తున్నట్టుగా ఉంది. 'ఇవ' పదం అక్షరలక్షలు విలువచేసే పదం. ఆత్మ నిజంగా నేర్చుకోదు, కర్మ చెయ్యదు. ఆత్మ అప్రమాత, అకర్తా. శంకరులవారు ఈ మంత్రాన్ని తరచు ఉటంకిస్తుంటారు.

**4.3.9: అత్రాయం పురుషస్స్వయం జ్యోతిర్భవతి –** అత్ర అయం పురుషః స్వయం జ్యోతిః భవతి. ఈ వాక్యంవల్లనే ఈ బ్రాహ్మణానికి స్వయంజ్యోతిర్బ్రాహ్మణము అనే పేరు వచ్చింది. దీనివల్లనే ఆత్మ స్వయంజ్యోతి, స్వయం ప్రకాశకం అని తెలుస్తుంది. అందువల్ల మనం 'ఆత్మ' గురించి తెలుసుకోవటానికి ఏమీ చెయ్యనవసరం లేదు. ఆత్మజ్ఞానం పొందటానికి ఏమీ ప్రయత్నం చెయ్యనవసరం లేదు అంటారు శంకరులవారు. ఆత్మ స్వయంప్రకాశకం.

అయితే దేనికోసం ప్రయత్నం చెయ్యాలి? ఆత్మ గురించిన అపోహలు తొలగించుకోవటానికి ప్రయత్నం చెయ్యాలి. నేను ఇక్కడ ఉన్నాను – ఒక అపోహ; నేను వృద్ధుడిని – ఇంకొక అపోహ; నేను ఒక భర్తను – మరొక అపోహ. అయితే ఏం చెప్పాలి? 'నేను' అంటే చాలు. 'నేను' మాత్రమే జ్ఞానం, దాని తర్వాత ఏ విశేషణం కలిపినా అది తప్పే అవుతుంది. ఈ అపోహలను తొలగించటమే వేదాంతం పని.

**4.3.10: స హి కర్తా –** ఆత్మ అన్నింటినీ సృష్టిస్తుంది. ఆత్మ అంటే ఈశ్వరుడు.

**4.3.15: అసంగోహ్యయం పురుషః –** అసంగో హి అయం పురుషః – ఆత్మ అసంగం. అందువల్ల ఆత్మకు ఏ విశేషణాలూ వాడలేము. మొత్తం వేదాంతమే ఈ వాక్యంమీద ఆధారపడివుంది. విశిష్టాద్వైతాన్ని ఖండించేటప్పుడు, శ్రుతి ప్రమాణంగా ఈ వాక్యాన్ని తీసుకుంటారు. విశిష్టాద్వైతం ఆత్మకు గుణాలు ఉన్నాయి అంటుంది. లేదు అని నిరూపిస్తుంది ఈ మంత్రం. 4.3.16లో కూడా ఇదే వాక్యం వస్తుంది.

**4.3.18:** మహామత్స్య దృష్టాంతం; **4.3.19:** పక్షి దృష్టాంతం.

**4.3.22: అనన్వాగతం పుణ్యేనాన్వాగతం పాపేన –** అనన్వాగతం పుణ్యేన అనన్వాగతం పాపేన. అసలు ఆత్మ తండ్రి కాదు, తల్లి కాదు, అన్న కాదు, అక్క కాదు, భర్త కాదు, భార్య కాదు. ఇవన్నీ మనం జాగ్రద్, స్వప్నావస్థల్లో వేసే వేషాలు, వాటితో ఆత్మకు సంబంధం లేదు. అంతేకాదు ఆత్మకు పుణ్యం అంటదు, పాపం అంటదు.

**4.3.23: పశ్యన్ వై తన్న పశ్యతి –** పశ్యన్ వై తత్ న పశ్యతి – ఆత్మ చూస్తున్నది కాని చూడటం లేదని చెప్పటంద్వారా ఆత్మయొక్క దృష్టిద్వయం గురించి చెబుతున్నది ఈ మంత్రం. సవికార దృష్టి, నిర్వికార దృష్టి గురించి వర్ణిస్తుంది.

తత్ త్వమ్ అసి ప్రకటనమ్ – ఉపదేశసాహస్రి. ఉపదేశసాహస్రి శంకరులవారి అద్భుత రూపకల్పన. ఈ మంత్రాన్ని ఆధారం చేసుకుని ఆత్మయొక్క సవికారదృష్టి, నిర్వికారదృష్టుల గురించిన వివరణ వస్తుంది అందులో. సవికారదృష్టి చిదాభాసగా జాగ్రద్, స్వప్నావస్థల్లో చూస్తే; నిర్వికారదృష్టి చిత్‌గా సుషుప్తి అవస్థలో చూస్తుంది. తక్కిన మంత్రాలన్నీ ఈ భావాన్ని వివరించేవి.

**4.3.31: యత్ర వా అన్యదివస్యాత్** – ఎక్కడ ఆత్మకు భిన్నంగా ఇంకొకటి ఉన్నట్టు అనిపిస్తుందో అది అన్ని ఇంద్రియాల గురించి వస్తుంది. అన్నింటిలో 'ఇవ' పదం వస్తుంది. 'ఇవ' అక్షరలక్షలు విలువ చేసే పదం. ఇవ అంటే నిజంగా లేదు, ఉన్నట్టుగా ఉంది. ద్వైతం మిథ్య అని నిరూపించటానికి ఈ మంత్రం తోడ్పడుతుంది. ద్వైతంలో రెండు ఉన్నట్టుగా ఉన్నాయి అంటే ఏమిటి నిజంగా రెండు లేవు.

కొంతమంది జగత్ మిథ్య అని శంకరులవారు పుట్టించారు అని అపోహ పడతారు. వారి అపోహను తొలగించే మంత్రం ఇది. శంకరులవారు స్వంతంగా ఏదీ చెప్పలేదు, ఉపనిషత్తులో ఉన్నదే ఆయన ఎత్తి చూపారు. బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా – వేదాంతసారం. జగన్మిథ్యా అని చూపటానికి ఇది ఒక ఉదాహరణ. ద్వైతంలో వ్యవహారం ఉంటుంది కాని అద్వైతంలో ఉండదు.

**4.3.32: సలిల ఏకో ద్రష్టాఽద్వైతో భవతి** – సలిలః ఏకః ద్రష్టా అద్వైతః భవతి – ఆత్మ ఏకం. ఇది కూడా చాలా ముఖ్యమైన వాక్యం. ఎందుకంటే విశిష్టాద్వైతంలో ఆత్మలు అనేకం, పరమాత్మ ఒకటే అంటారు. మనం ఆత్మ ఏకం అంటాము. ఆత్మ సజాతీయ, విజాతీయ, స్వగతభేద రహిత ఆత్మ.

**ఏషోఽస్య పరమ ఆనంద ఏతస్యైవానందస్యాన్యాని భూతాని మాత్రాముపజీవంతి** – ఆత్మ ఆనందస్వరూపం. విషయానందం కేవలం ప్రతిబింబానందం. అది ఆత్మానందంలో ఒక అంగం మాత్రమే అని చెబుతుంది ఈ మంత్రం.

**4.3.33:** ఆనంద మీమాంస జరుగుతుంది. ఇంచుమించుగా తైత్తిరీయోపనిషత్తులో ఉన్నట్టే ఉంటుంది.

ఈ విధంగా ఎన్నో ముఖ్యమైన మంత్రాలు ఈ బ్రాహ్మణములో ఉన్నాయి.

# 4.4 - శారీరక బ్రాహ్మణము

స్వయంజ్యోతిర్బ్రాహ్మణములో యాజ్ఞవల్క్యుడు ఆత్మయొక్క వ్యావహారిక స్వరూపం, పారమార్థిక స్వరూపం– రెండూ చర్చించాడు. వ్యావహారిక స్వరూపాన్ని చిదాభాస అంటారని, దాన్ని ప్రతిబింబచైతన్యం అంటారనీ చూశాము. ప్రతిబింబాలు అనేకం. ప్రతిబింబచైతన్యం ఒక శరీరంలో ఉండగా ఒక అవస్థనుంచి ఇంకొక అవస్థలోకి, తర్వాత ఒక శరీరంనుంచి ఇంకొక శరీరంలోకి ప్రయాణిస్తుంది.

ఈ రెండు బ్రాహ్మణాలలోనూ ఆత్మ పదాన్ని రెండు అర్థాలతోనూ వాడాడు యాజ్ఞవల్క్యుడు – అంటే ఒకసారి ఆత్మయొక్క పారమార్థిక స్వరూపం గురించి చెపితే, ఇంకొకసారి ఆత్మయొక్క వ్యావహారిక స్వరూపం గురించి చెప్పాడు. సందర్భాన్నిబట్టి మనమే సరిగ్గా అర్థం చేసుకోవాలి. లేకపోతే అయోమయంలో పడిపోతాము. ఒకసారేమో ఆత్మకు పుణ్యపాపాలు లేవు, సుఖదుఃఖాలు అంటవు అంటాడు. ఇంకొకసారేమో ఆత్మకు మరణం తర్వాత ప్రయాణం ఉంది అంటాడు. గురువు భిన్నాభిప్రాయాలు వెలిబుచ్చినట్టు అనిపిస్తుంది కాని, సరిగ్గా అర్థం చేసుకుంటే భిన్నాభిప్రాయాలు వెలిబుచ్చలేదు అని తెలుస్తుంది.

స్వయంజ్యోతిర్బ్రాహ్మణములో ఆత్మయొక్క పారమార్థిక స్థాయి గురించి ముందు చర్చించాక, వ్యావహారిక స్థాయికి వచ్చాడు చివర్లో. ఆత్మను సంసారజీవిగా వర్ణించాడు చివర్లో అంటే 34వ మంత్రంనుంచి. వ్యవహారిక ఆత్మను జీవాత్మ అంటారు కాని ఉపనిషత్తులో ఆత్మ పదమే వచ్చింది. సంసారవర్ణన ఇందులో కూడా కొనసాగుతున్నది. ముందు బ్రాహ్మణములో సంసారవర్ణన, మరణవర్ణనద్వారా వచ్చిందని చూశాము. దానికి మూడు దృష్టాంతాలు కూడా చూశాము. శకటదృష్టాంతం, ఫలదృష్టాంతం, రాజుదృష్టాంతం. ఇంత వివరంగా మరణవర్ణన ఎందుకు అంటే వైరాగ్యం పొందటానికని కూడా చూశాము. ఈ బ్రాహ్మణములో సంసారవర్ణన 6వ మంత్రం వరకూ కొనసాగుతుంది.

ఈ బ్రాహ్మణాన్ని శారీరక బ్రాహ్మణము అంటారు. శారీరక అంటే బాధాతప్త జీవాత్మ. శరీరం అంటే స్థూలశరీరం; శారీరకం అంటే శరీరంలో ఉండేది. గీతలో దేహం, దేహీ అని చూశాము. 'క' పదం దానికున్న పరిమితిని సూచిస్తుంది. అందువల్ల శారీరక అంటే బాధాతప్త జీవాత్మ. బాధాతప్త ఎందుకు అంటే అది ప్రయాణం చేస్తుంది కాబట్టి. ఇప్పుడు కూడా మరణకాలమే. ఈ నేపథ్యంతో ఈ బ్రాహ్మణములోకి అడుగు పెడదాము.

మంత్రం 4.4.1

**స యత్రాయమాత్మాఽబల్యం న్యేత్య సమ్మోహమివ న్యేత్యథైనమేతే ప్రాణా అభిసమాయన్తి॥ స ఏతాస్తేజోమాత్రాస్సమభ్యాదదానో హృదయమేవాన్వవక్రామతి ॥ స యత్రైష చాక్షుషః పురుషః పరాఙ్పర్యావర్తతేఽథారూపజ్ఞో భవతి ॥**

**యత్ర అయమ్ ఆత్మా అబల్యం న్యేత్య** – మరణకాలంలో ఆత్మ బలహీనంగా అవుతుంది. యత్ర అంటే మరణకాలంలో.

**సమ్మోహమివ న్యేతి** – దాదాపు స్పృహ లేనట్టుగా అవుతుంది. శక్తి తగ్గుతుంది, ఇంద్రియాలు బలాన్ని కోల్పోతాయి, ఊపిరి సరిగ్గా అందదు. మరణశయ్యమీద ఉన్న వ్యక్తి తన చుట్టూతా ఉన్నవారిని గుర్తు పట్టలేడు. ఇవ పదాన్ని అబల్యం తర్వాత కూడా కలుపుకోవాలి. ఇవ అంటే అన్నట్టుగా అని చూశాము. మరణించేవ్యక్తి చైతన్యం కోల్పోయినట్టుగా అవుతాడు అంటున్నది ఉపనిషత్తు. దీనికి అద్భుతమైన వ్యాఖ్యానం ఇస్తారు శంకరులవారు.

నిజానికి ఆత్మ అసలు స్వరూపం శుద్ధచైతన్యం. అది ఎన్నటికీ బలహీనమవదు. ఏ సమస్యనూ ఎదుర్కోదు. కాని దేహంతో సంబంధం పెట్టుకోవటంవల్ల, ఆత్మ కూడా **బలహీనమయినట్టుగా** అనిపిస్తుంది. నిజానికి బలహీనం శరీరానిది, బలహీనం మనస్సుది, బలహీనం ఇంద్రియాలది, ఆత్మకు ఎటువంటి బలహీనమూ లేదు.

ఇంద్రియాలు వాటి గోళకాలనుంచి విడివడి, హృదయం దగ్గరకు వస్తాయి. ఉదాహరణకు కన్ను పని చెయ్యాలంటే దానికి మూడు అంశాలుంటాయి – కన్ను గోళకం, కన్ను ఇంద్రియం, కన్ను అధిష్ఠానదేవత. కన్ను గోళకం స్థూలశరీరంలో బాహ్యంగా ఉంటుంది. కన్ను ఇంద్రియం కంటికి చూపును ఇస్తుంది. అది సూక్ష్మశరీరంలో ఉంటుంది. కన్ను ఇంద్రియానికి అధిష్ఠానదేవత సూర్యుడు. సూర్యుడు కంటికి చూసే శక్తిని ఇస్తాడు. మరణకాలంలో అధిష్ఠానదేవత తన లోకానికి వెళ్ళిపోతుంది, ఇంద్రియం, గోళకంనుంచి విడివడి దాని స్థానమైన హృదయానికి అంటే మనస్సుకు వస్తుంది. అందువల్ల మరణించే వ్యక్తి కళ్ళు తెరిచేవున్నా అందులో చూపు ఉండదు. గాజుకన్నులా ఉంటుంది.

**అథ** – అప్పుడు;

**ఏతే ప్రాణా అభిసమాయంతి** – ఇంద్రియాలు గోళకాలనుంచి విడివడి, జీవాత్మతో కలుస్తాయి. ప్రాణాః అంటే ఇంద్రియాలు. ఈ ఉపనిషత్తులోనే ఇంద్రియాలు ప్రాణంతో పోటీపడి, ప్రాణంవల్లనే వాటికి వాటిశక్తి వస్తున్నదని తెలుసుకుని, వాటి గుణాలనీ, వాటి పేరుని కూడా ప్రాణానికి ధారపోశాయని చూశాము. అందువల్ల ఇంద్రియాలను ప్రాణాలు అని కూడా అంటారు.

**సప్తప్రాణాః ప్రభవన్తి – ముండకం**

ఐదు ఇంద్రియాలను సప్తప్రాణాలు అంటారు. రెండు కళ్ళు, రెండు చెవులు, రెండు ముక్కు రంధ్రాలు, ఒక నోరు – వెరసి ఏడు.

**స ఏతాః తేజోమాత్రాః సమభ్యాదదానః** – జీవాత్మ ఇంద్రియాలను తనలోకి తీసుకుంటుంది. ఆదానం అంటే తనలోకి తీసుకోవటం. విమానం ఎగిరేటప్పుడు చక్రాలను తనలో ముడుచుకున్నట్టుగా అన్నమాట. మాత్రాః అన్నా కూడా ఇంద్రియాలే –

**మాత్రా స్పర్శేషు కౌంతేయ – గీత**

తెలుసుకునే పరికరాలు. తేజోమాత్రాః – ఇంద్రియాలు జ్యోతి స్వరూపాలు. జ్యోతి అంటే చీకటిగదిలో వెలిగే కాంతి కాదు; వేదాంతంలో జ్యోతి నిర్వచనం వేరు. జ్యోతి అంటే వస్తువులను తెలుసుకునేలా చేస్తుంది. ఆ విధంగా పంచజ్ఞానేంద్రియాలు, పంచజ్యోతులు. శబ్దస్పర్శరూపరసగంధాలను ఇంద్రియాలవల్ల తెలుసుకోగలుగుతున్నాము. జీవాత్మ ఎక్కడికి వెళుతుంది?

**హృదయమేవ అన్వవక్రామతి** – హృదయంలోకి వస్తుంది. జీవాత్మ హృదయంలోకి వెళ్ళాక, గోళకాలకు ఏమవుతుంది?

గోళకంలో రెండు అంశాలుంటాయి. చక్షురింద్రియం, దేవతా అంశం. కంటికి అధిష్ఠాన దేవత సూర్యుడని చూశాము. మరణకాలంలో చక్షురింద్రియం సూక్ష్మశరీరంలోనూ, దేవతా అంశం సమష్టి దేవతలోనూ కలుస్తాయి.

**స యత్రైష చాక్షుషః పురుషః పరాఙ్పర్యావర్తతే** – ఎప్పుడైతే అధిష్ఠాన దేవత సమష్టిదేవతతో కలుస్తాడో,

**అథారూపజ్ఞో భవతి** – అప్పుడు ఆ వ్యక్తి చూసే శక్తిని కోల్పోతాడు. రూపాలను చూడలేడు. రూపజ్ఞానాన్ని కోల్పోతాడు.

అందువల్లనే గీత 18వ అధ్యాయములో కృష్ణపరమాత్మ ప్రతి కర్మకు ఐదు అంశాలు తోడవుతాయని చెప్పాడు. అవి అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, అధిష్ఠానదైవ అంశం.

## మంత్రం 4.4.2

**ఏకీభవతి న పశ్యతీత్యాహురేకీభవతి న జిఘ్రతీత్యాహురేకీభవతి న రసయత ఇత్యాహురేకీభవతి న వదతీత్యాహురేకీభవతి న శృణోతీత్యాహురేకీభవతి న మనుత ఇత్యాహురేకీభవతి న స్పృశతీత్యాహురేకీభవతి న విజానాతీత్యాహుః ॥ తస్య హైతస్య హృదయస్యాగ్రం ప్రద్యోతతే తేన ప్రద్యోతేనైష ఆత్మా నిష్క్రామతి ॥ చక్షుష్టో వా మూర్ధ్నో వాఽన్యేభ్యో వా శరీరదేశేభ్యస్తముత్క్రామన్తం ప్రాణోఽనూత్క్రామతి ప్రాణమనూత్క్రామన్తం సర్వే ప్రాణా అనూత్క్రామన్తి ॥ సవిజ్ఞానో భవతి సవిజ్ఞానమేవాన్వవక్రామతి ॥ తం విద్యాకర్మణీ సమన్వారభేతే పూర్వప్రజ్ఞా చ ॥**

ఇంకా సంసారవర్ణన లేదా మరణవర్ణన కొనసాగుతున్నది.

**ఏకీభవతి** – అంటే ఒకటి అవుతాయి. దేనితో ఏది ఒకటి అవుతుంది? గోళకంలో రెండు అంశాలు ఉంటాయని చూశాము. వాటిని చక్షురింద్రియం అనీ, దేవతా అంశం అనీ అంటారని చూశాము. ఏకీభవతి అంటే చక్షురింద్రియం సూక్ష్మశరీరంతో కలుస్తుంది; దేవతా అంశం సమష్టి దేవతలో కలుస్తుంది. ఏయే ఇంద్రియాలు పనిచేయటం మానేస్తాయో ఇక్కడ వరుసగా చూస్తాము.

**న పశ్యతీత్యాహుః** – ఈ వ్యక్తి చూడటం లేదు అని పక్కవారు అంటారు;

**ఏకీభవతి న జిఘ్రతీత్యాహుః** – జ్ఞానేంద్రియం ఐక్యం అవటంతో అతను వాసన చూడటం లేదు అంటారు;

**ఏకీభవతి న రసయత ఇత్యాహుః** – రసనేంద్రియం ఐక్యం అవటంతో అతను ఆస్వాదించటం లేదు అంటారు;

**ఏకీ భవతి న వదతీత్యాహుః** – వాగింద్రియం ఐక్యం అవటంతో అతను మాట్లాడటం లేదు అంటారు;

**ఏకీ భవతి న శృణోతీత్యాహుః** – శ్రోత్రేంద్రియం ఐక్యం అవటంతో వినటం లేదు అంటారు;

**ఏకీభవతి న మనుత ఇత్యాహుః** – మనస్సు ఐక్యం అవటంతో ఆలోచించటం లేదు అంటారు;

**ఏకీభవతి న స్పృశతీత్యాహుః** – స్పర్శేంద్రియం ఐక్యం అవటంతో స్పర్శ తెలియటం లేదు అంటారు;

**ఏకీభవతి న విజానాతీత్యాహుః** – బుద్ధి ఐక్యమవటంతో గుర్తు పట్టటం లేదు అంటారు.

ఒక్క ముక్కలో చెప్పాలంటే అన్ని ఇంద్రియాలు క్రమంగా అతని గోళకాలనుంచి విడివడి, అవి పని చెయ్యకుండా చేస్తాయి. ఇక్కడ శంకరులవారు ఒక విషయాన్ని స్పష్టం చేస్తున్నారు. ఈ ఇంద్రియాలు ఇక్కడ చెప్పిన క్రమంలోనే పనిచెయ్యటం మానేస్తాయి అనలేము. ఆ క్రమం ఏ విధంగానైనా ఉండవచ్చు. ఏ దేవత ఏ ఇంద్రియాన్నైనా మొదట వదలవచ్చు. అయితే ఏ దేవత ముందు వదలాలో నిర్ణయించేదెవరు? భగవంతుడు కాదు. భగవంతుడు నిర్ణయిస్తే ఆయన పక్షపాతం చూపించినట్టూ, ఆయనకు కూడా రాగద్వేషాలు ఉన్నట్టూ అవుతుంది. అందువల్ల భగవంతుడు ముఖ్యకారణం కాదు; దేశం ముఖ్యకారణం కాదు, కాలం ముఖ్యకారణం కాదు. మనం చేసుకున్న **కర్మ** ముఖ్యకారణం.

మనం పూర్వజన్మలో చేసుకున్న కర్మఫలాలను ఈ జన్మలో అనుభవిస్తాము. మరయితే మొదటి జన్మకు పూర్వజన్మ ఫలాలు ఉండవు కదా, దాని మాటేమిటి? శాస్త్రంలో మొదటిజన్మ అంటూ లేదు. జీవుడు అనాది. అంటే సృష్టి ఒక అడ్డగీతలా ఏర్పడలేదు. అడ్డగీతకు ఆరంభం ఉంటుంది. సృష్టి వృత్తాకారంలో ఏర్పడింది. వృత్తం గీసేటప్పుడు మొదలు ఉంటుంది కదా అనకూడదు. వృత్తం ఏర్పడ్డాక, ఎక్కడ మొదలుపెట్టామో తెలియదు. అందువల్ల మొదటిజన్మ అంటూ లేదు. ప్రతిజన్మకూ దానిముందు జన్మ ఉంటుంది. అనాది కాలప్రవృత్తి అంటారు.

అందువల్ల మన కర్మఫలంగా ఆయా దేవతలు సమష్టికి వెళ్ళిపోతాయి, జీవాత్మ హృదయానికి వస్తుంది. జీవాత్మ బయటకు ప్రయాణం చెయ్యాలి. ఎటునుంచి బయటకు వస్తుంది? నాడులనుంచి వస్తుంది. జీవాత్మ అనేక నాడులలో తిరుగుతుంది. 72000 నాడులు ఉన్నాయని, అందులో 101 నాడులు ముఖ్యమైనవనీ కఠోపనిషత్తులో చూస్తాము. ఈ నాడులన్నీ హృదయంలోంచి వస్తాయి. ఈ నాడుల్లో ఏ నాడినుంచి జీవాత్మ బయటకు వస్తుంది?

అది ఆ జీవి చేసుకున్న పుణ్యపాపాలమీద ఆధారపడివుంటుందని చూశాము. అతను ఏ లోకానికి వెళ్ళాలో, దానికి వీలైన నాడినుంచి వెళుతుంది. జీవాత్మ చైతన్యం కాబట్టి, అది ఎటునుంచి వెళితే ఆ భాగం ప్రకాశవంతంగా ఉంటుంది.

**తస్య హైతస్య హృదయస్యాగ్రం ప్రద్యోతతే** – ఈ నాడులు హృదయంనుంచి వస్తాయి. హృదయం అనేక ద్వారాలున్న ఒక హాలులాంటిది. ప్రాణం ఏ ద్వారంనుంచి పోతే ఆ ద్వారాన్ని హృదయస్య అగ్రమ్ అన్నారు.

**తేన ప్రద్యోతేనైష ఆత్మా నిష్క్రామతి** – ఆ ద్వారం దగ్గర జీవాత్మ ఉన్నప్పుడు చిదాభాస లేదా ప్రతిబింబ చైతన్యంయొక్క కాంతివల్ల ఆ ద్వారం మెరుస్తుంది.

**చక్షుష్టో వా మూర్ధ్నో వాఽన్యేభ్యో వా శరీరదేశేభ్యః** – ప్రాణం కళ్ళనుంచి పోవచ్చు, లేదా తలపైన ఉన్న సుషుమ్న నాడిద్వారా పోవచ్చు, లేదా వేరే మార్గంద్వారా పోవచ్చు.

సూర్యలోకానికి వెళ్ళే జీవి ప్రాణం కళ్ళనుంచి పోతుంది; బ్రహ్మలోకానికి వెళ్ళే జీవి ప్రాణం సుషుమ్ననాడిద్వారా పోతుంది. ఏ లోకానికి వెళతాడనేది అతను చేసిన కర్మమీద ఆధారపడివుంటుంది.

**తమ్ ఉత్క్రామంతం ప్రాణోఽనూత్క్రామతి** – పైకి వెళుతున్న ఆ జీవాత్మతో పాటు ప్రాణం కూడా వెళుతుంది.

**ప్రాణమనూత్క్రామంతం సర్వే ప్రాణా అనూత్క్రామంతి** – ప్రాణం వెళ్ళేటప్పుడు తనతో అన్ని ఇంద్రియాలను తీసుకువెళుతుంది. ఇక్కడ కూడా ఈ మూడూ వెళతాయి అని తీసుకోవాలి తప్ప ఇదే క్రమంలో వెళతాయి అనటానికి లేదు. ఈ మూడు కలిసివెళతాయి. ఆత్మ వెళ్ళిన అరగంటకు ప్రాణం వెళ్ళదు. వాటికున్న ప్రాముఖ్యతనుబట్టి ఉపనిషత్తు ఒక వరుసక్రమం ఇచ్చింది. అది జీవాత్మ, ప్రాణం, ఇంద్రియాలు.

మరణకాలంలో పాత సంస్కారాలు బయటకు వస్తాయి. అవే ఆ జీవియొక్క మరుజన్మను నిర్ణయిస్తాయి. మరణకాలంలో మనం దేని గురించి ఆలోచిస్తామనేది మన కర్మనుబట్టి, మన పూర్వజన్మ వాసనలనుబట్టి ఉంటాయి. జడభరతుడు లేడిపిల్లను పెంచుకుని, దానిమీద మమకారం పెంచుకుని, దాని గురించే ఆలోచిస్తూ మరణించినందువల్ల మరుజన్మలో తను లేడిగా పుట్టాడు. అందువల్ల మనం దేని గురించి ఆలోచిస్తూ చనిపోతే, ఆ సంస్కారం బలంగా ఉండి అది వచ్చే జన్మను నిర్ణయిస్తుంది. వాసనలే కాదు, కర్మలు కూడా వచ్చే జన్మను నిర్ణయిస్తాయి. ఆ కర్మలు కూడా మనం చేసిన వరుస క్రమంలోనే రావాలని లేదు. ముందు మంచి కర్మ చేసి, తర్వాత చెడు కర్మ చేసినా, చెడు కర్మఫలం ముందు అనుభవించాల్సి రావచ్చు. వచ్చే జన్మయొక్క ప్రారబ్ధకర్మను నిర్ణయించటానికి కర్మఫలదాత అయిన ఈశ్వరుడు ఈ జన్మలో చేసిన కర్మలనే లెక్కలోకి తీసుకోడు. మన సంచిత కర్మలను కూడా బేరీజు వేస్తాడు. మరణించేటప్పుడు వచ్చే జన్మయొక్క ప్రారబ్ధకర్మ నిశ్చయింపబడే ఉంటుంది. అది ఫలించటానికి సిద్ధంగా ఉంటుంది. మరణించే వ్యక్తికి ఉపాసనలు, వాసనలు కూడా గుర్తుకు వస్తాయి.

**సవిజ్ఞానో భవతి** – అందువల్ల మరణించే వ్యక్తికి భావిదేహసంబంధమైన విజ్ఞానం ఉంటుంది. అతనికి తన కొత్త శరీరం గురించి పూర్తిగా తెలుస్తుంది. ఆ ఆలోచన అతను ప్రయత్నపూర్వకంగా తెచ్చుకుంటే రాదు. మరు జన్మ గురించిన ఆలోచన ఆతని కర్మ + ఉపాసన + సంస్కారంమీద ఆధారపడివుంటుంది. దాని గురించి కొంతమంది మాట్లాడటానికి ప్రయత్నిస్తారు కాని మాట సరిగా రాదు, మనకు అర్థం కాదు.

**సవిజ్ఞానమేవాన్వవక్రామతి** – ఈ జ్ఞానంతో జీవాత్మ వెళుతుంది. జీవాత్మతో పాటు మూడు విషయాలు వెళతాయి.

**తం విద్యాకర్మణీ సమన్వారభేతే పూర్వప్రజ్ఞా చ** – చాలా ముఖ్యమైన వాక్యం. శంకరులవారు దీన్ని తరచు ఉటంకిస్తూ ఉంటారు. జీవాత్మను అనుసరించేవి ఉపాసన, కర్మ, సంస్కారాలు. విద్య అంటే ఉపాసన. ఉపాసన అంటే దేని గురించి ఎక్కువగా ఆలోచిస్తాడో అది. కర్మ అంటే పుణ్యపాపకర్మలు. పూర్వప్రజ్ఞ అంటే సంస్కారాలు. సమన్వారభేతే అంటే జీవాత్మతో వెళతాయి.

మరణకాలంలో ఈ మూడింటిలో దేన్నీ మనం ప్రయత్నపూర్వకంగా నిర్దేశించలేము, ఎందుకంటే అప్పుడు మన పురుషబుద్ధిని ఉపయోగించలేము. అందువల్ల ముందునుంచీ ఉన్నతమైన ఆలోచనలు, ఉన్నతమైన కర్మలు చేస్తూ ఉండాలి.

**యం యం వాపి స్మరన్ భావం త్యజత్యంతే కలేవరమ్ ।**
**తం తమేవైతి కౌంతేయ సదా తద్భావభావితః ॥**
**తస్మాత్ సర్వేషు కాలేషు మామనుస్మర యుధ్య చ** – గీత 8.6, 7

మరణించే సమయంలో దేని గురించి ఆలోచిస్తూ మరణిస్తాడో, మరుజన్మలో ఆయా స్వరూపాన్నే పొందుతాడు. అందువల్ల ఎప్పుడూ నన్నే స్మరించు అన్నాడు కృష్ణపరమాత్మ. నిజానికి మొత్తం ఎనిమిదవ అధ్యాయానికి మూలం ఈ మంత్రమే. అందువల్ల శాస్త్రం విధించిన కర్మలను చేసి, నిషేధించిన కర్మలు నిషేధించాలి. శుభసంస్కారాలను పెంపొందించుకోవాలి. ఎందుకంటే మనం చూసేది, చేసేది పుణ్యపాపాలనే డబ్బులను ప్రోగేస్తాయి.

ఒక జీవి మరణించినప్పుడు అతనితో వెళ్ళేదెవరు? ఇంటి దగ్గరే ఆగిపోతారు కొందరు, వీధి వరకూ భార్య వెళుతుంది, కాటివరకూ పిల్లలు వెళతారు. కాని అతనితో ఎవరు వెళతారు? అతను చేసిన కర్మ, ఉపాసనలు, వాసనలే వెళతాయి.

**యోనిమన్యే ప్రపద్యన్తే శరీరత్వాయ దేహినః।**
**స్థాణుమన్యేఽనుసంయన్తి యథాకర్మ యథాశ్రుతమ్॥** – కఠ

కర్మ, ఉపాసనలు అతని వెంట వెళతాయి.

**ప్రాణ ప్రయాణ సమయే కఫవాత పిత్తైః కంఠవిరోధే, తే స్మరణం కుతః భవతి**

మరణించే సమయంలో కంఠానికి కఫం, వాతం, పిత్తం అడ్డం పడితే ఈశ్వరస్మరణ చేసే అవకాశం ఎక్కడుంటుంది? అందువల్ల ముందునుంచీ మంచికర్మలు చెయ్యాలి. అప్పయ్య దీక్షితులు తన సుప్తచేతన మనస్సులో ఏముందో తెలుసుకోవాలని, తన శిష్యుడిని తనకు తెలియకుండా గమనించమని చెప్పారుట. ఆ సమయంలో ఆయన **ఉన్మత్త శతకం** చెప్పారు. అది శివుడిని స్తుతిస్తూ చెప్పిన శతకం. అంటే ఆయన చిత్తమంతా శివమయమే.

మంత్రం 4.4.3

**తద్యథా తృణజలాయుకా తృణస్యాన్తం గత్వాఽన్యమాక్రమమాక్రమ్యాత్మానముపసగ్ంహరత్యేవమేవాయమాత్మేదగ్ం శరీరం నిహత్యావిద్యాం గమయిత్వాఽన్యమాక్రమమాక్రమ్యాత్మానముపసగ్ంహరతి ॥**

జీవుడు ఒక శరీరంలోంచి ఇంకొక శరీరంలోకి ఎలా మారుతాడో సోదాహరణంగా వివరిస్తున్నాడు గురువు. గడ్డిమీద కదిలే గడ్డిపురుగు లేదా జలగ ఉదాహరణ అది. ఋషులు ప్రకృతి ఒడిలో నివసించేవారు. అందువల్ల

వారి ఉదాహరణలు కూడా ప్రకృతినుంచే ఉంటాయి. గడ్డిపురుగు గడ్డిపోచనుంచి ఇంకో గడ్డిపోచమీదకు వెళ్ళేటప్పుడు ముందుభాగాన్ని ముందు కదిపి, రెండవ గడ్డిపోచమీద తలభాగం పెట్టి, అప్పుడు రెండవ భాగాన్ని కదుపుతుంది. అంటే ముందుభాగం ముందు గడ్డిపోచమీద ఉంటుంది, రెండవభాగం వెనక గడ్డిపోచమీద ఉంటుంది. ముందు భాగాన్ని దానిమీద ఆన్చాక, తర్వాత వెనకభాగం లేపుతుంది.

జీవుడు చివరిదశలో ఈ జన్మలో ఉండగానే ఇంకొక శరీరం తీసుకుంటాడు. శరీరంతోపాటు కొత్త తల్లిదండ్రులు, కొత్త పరిసరాలు కూడా ఏర్పడతాయి. అంటే కొత్త శరీరాన్ని తీసుకున్నాక, ఈ శరీరాన్ని వదులుతాడు అంటుంది ఉపనిషత్తు. కాని ఈ వాక్యం మనను అయోమయంలో పడవేయవచ్చు. అంటే జీవుడిలో ఒక భాగం ఇక్కడ, ఇంకొక భాగం వేరేచోట ఉంటుందా?

శంకరులవారు నిజంగా ఇంకొక శరీరంలోకి ఈ శరీరంలో ఉండగా వెళ్ళదు, వెళ్ళలేదు జీవాత్మ, 'ఇంకో శరీరాన్ని అక్షరాలా తీసుకోదు,' కాని మానసికంగా వాసనలద్వారా అందులోకి వెళ్ళిపోతుంది అంటారు. ఈ భాగాన్ని బ్రహ్మసూత్రాల్లో తదంతర ప్రతిపత్తి అధికరణంలో (3.1.1లో) చర్చించారు.

శంకరులవారికి తన బ్రహ్మసూత్రాలమీద భాష్యం రాసే అర్హత ఉందో లేదో పరీక్షించటానికి వ్యాసాచార్యులు శంకరులవారిని ఒక అంశంమీద భాష్యం రాయమన్నారుట. అది ఈ మంత్రంమీద ఆధారపడి రాసిన తదంతర ప్రతిపత్తి అధికరణం.

వాసనాదీర్ఘ భావః అని రాశారుట శంకరులవారు. అంటే ఊహల్లో, వచ్చే జన్మలోకి వెళ్ళిపోతాడు జీవుడు అన్నారుట. నిజానికి ఈ భావన అర్థం చేసుకోవటం కష్టం కాదు. ఎందుకంటే మనం అలా చేస్తూనే ఉంటాము. మనం ఏ ఊరో వెళదామని ప్రణాళిక వేసుకోగానే, ఆ ఊరికి శారీరకంగా చేరకుండానే భావనలో వెళ్ళిపోతాము. మరణించే వ్యక్తిని మనం అడగలేము కూడా. అప్పటికే అతని ఇంద్రియాలు బలహీనమైపోతాయి. అతని మాట సరిగ్గా రాదు, మనకు స్పష్టంగా అర్థం కాదు. అలా స్పష్టంగా చెప్పగలిగితే ఏమైనా తెలుస్తుంది. ఈ నేపథ్యంతో ఈ మంత్రాన్ని చూద్దాము.

**తృణజలాయుకా** – గడ్డిపురుగు లేదా జలగ. ఏం చేస్తుంది?

**తృణస్య అంతం గత్వా** – గడ్డిపోచ కొనను చేరుకుని,

**అన్యమ్ ఆక్రమమ్ ఆక్రమ్య** – ఇంకొక గడ్డిపోచను పట్టుకుని,

**ఆత్మానమ్ ఉపసంహరతి** – మొదటి గడ్డిపోచను వదులుతుంది.

**ఏవ మేవ అయమ్ ఆత్మా** – అదే విధంగా ఈ జీవాత్మ;

**ఇదగ్ం శరీరం నిహత్య** – ఈ శరీరాన్ని వదిలి;

**అవిద్యాం గమయిత్వా** – దీన్ని అచేతనంగా చేసి;

**అన్యమ్ ఆక్రమమ్ ఆక్రమ్య** – ఇంకొక శరీరాన్ని వాసనలద్వారా పట్టుకుని;

**ఆత్మానమ్ ఉపసంహరతి** – ఈ శరీరాన్ని పూర్తిగా వదిలివేస్తుంది. వాసనలద్వారా అంటే కర్మ, ఉపాసన, వాసనలద్వారా. దాన్ని వాసనాదీర్ఘ భావః అన్నారు శంకరులవారు.

## మంత్రం 4.4.4

**తద్యథా పేశస్కారీ పేశసో మాత్రామపాదాయాన్యన్నవతరం కల్యాణతరం రూపం తనుత ఏవమేవాయమాత్మేదగ్ం శరీరం నిహత్యావిద్యాం గమయిత్వాఽ న్యన్నవతరం కల్యాణతరగ్ం రూపం కురుతే పిత్ర్యం వా గాన్ధర్వం వా దైవం వా ప్రాజాపత్యం వా బ్రాహ్మం వాఽ న్యేషాం వా భూతానామ్॥**

ఈ మంత్రంలో పునర్జన్మలోని స్థూలశరీరం దేనితో చెయ్యబడిందో వస్తుంది. సాంకేతిక పరిభాషలో చెప్పాలంటే దాని ఉపాదానకారణం గురించి వస్తుంది. ముందు మంత్రాల్లో నిమిత్త కారణం చూశాము. నిమిత్తకారణానికి **తం విద్యా కర్మణి సమన్వారభేతే పూర్వప్రజ్ఞా చ** అని చూశాము. వీటిని ఆధారంగా చేసుకుని ఈశ్వరుడు ఇస్తాడు. అలా ఈశ్వరుడు నిమిత్తకారణం. పంచభూతాలు ఉపాదాన కారణం. దీనిని వివరంగా బ్రహ్మసూత్రాల్లో చూస్తాము. ఛాందోగ్యోపనిషత్తులో కూడా పంచాగ్నివిద్యలో చూస్తాము. ఈ ఉపనిషత్తులో కూడా పంచాగ్నివిద్య వస్తుంది. ఈ జీవుడు మరణించినప్పుడు, అతనికి అంత్యేష్టి కర్మ చేసినప్పుడు, అగ్నిదేవుడు ఇంకో స్థూలశరీరాన్ని ఇస్తాడు. కాని ఆ స్థూలశరీరం చాలా సూక్ష్మంగా ఉంటుంది. అది కంటికి కనబడదు. ఆ స్థూలశరీరం నాలుగు దశలు దాటి, చివరికి తల్లి గర్భంలో రూపుదిద్దుకుంటుంది. తండ్రి నాలుగవ దశ.

పంచభూతాలనుంచి ఈశ్వరుడు కొత్త స్థూలశరీరాన్ని ఎలా తయారుచేస్తాడు? దానికి కూడా ఒక ఉదాహరణ చూస్తాము. నిమిత్తకారణానికి గడ్డిపురుగు ఉదాహరణ అయితే, ఉపాదానకారణానికి కంసాలి ఉదాహరణ. బంగారం ముద్దలోంచి కంసాలి ఒక చిన్నముక్క తీసుకుని ఒక అందమైన ఉంగరం చేస్తాడు. అలా భగవంతుడు పంచభూతాల ముద్దలోంచి ఒక చిన్నముక్క తీసుకుని పసిపాపాయిని తయారుచేస్తాడు. అందువల్ల అప్పుడే పుట్టిన పాపాయిలు ముద్దుగా ఉంటారు. తర్వాతే వారి శరీరం ఆకారాలు మారుతుంది.

**పేశస్కారీ** – కంసాలి, పేశః అంటే బంగారం.

**పేశసః మాత్రామ్ అపాదాయ** – బంగారంయొక్క ముక్కను విడగొట్టి తీసుకుని;

**అన్యత్ (రూపం తనుతే)** – ఇంకొక రూపం ఇస్తాడు. ఎలాంటిది?

**నవతరం కళ్యాణతరం రూపం తనుతే** – అంతకుముందు దానికంటే కొత్తదీ, ఆనందప్రదమైనదీ అయిన రూపాన్ని ఇస్తాడు.

**ఏవమేవాయమాత్మా ఇదగ్ం శరీరం నిహత్యావిద్యాం గమయిత్వాఽ న్యన్నవతరం కల్యాణతరగ్ం రూపం కురుతే** – ఇదే విధంగా ఈ జీవాత్మ ఈ శరీరాన్ని సంహరించి, అచేతనంగా చేసి, మరో కొత్తదైన, ఆనంద ప్రదమైన శరీరాన్ని పొందుతుంది. ఏ శరీరం? ఒక పట్టిక వస్తున్నది ఇక్కడ.

**పిత్ర్యం వా గాంధర్వం వా దైవం వా ప్రాజాపత్యం వా బ్రహ్మం వాఽ న్యేషాం వా భూతానామ్** – పితృలోకానికి లేదా గంధర్వలోకానికి లేదా దేవలోకానికి వెళ్ళే అర్హత ఉన్న శరీరం కాని; లేదా ప్రజాపతి లోకానికి వెళ్ళే విరాట్

శరీరాన్ని కాని; బ్రహ్మలోకానికి వెళ్ళే హిరణ్యగర్భశరీరాన్ని కాని పొందవచ్చు లేదా అన్యేషాం వా భూతానామ్ అంటే మనుష్యశరీరం లేదా పక్షిశరీరం లేదా మృగశరీరం ఏదైనా పొందవచ్చు. ఈ శరీరాల్లో ఏదో ఒకటి అనుకోకుండా రావచ్చా? ఏదీ అనుకోకుండా జరగదు. అంతా కర్మమీద ఆధారపడివుంటుంది. కర్మఫలదాత అయిన ఈశ్వరుని కంప్యూటర్ ఎన్నడూ పొరపాటు చెయ్యదు, దానికి ఎన్నడూ వైరస్ సమస్య రాదు.

## మంత్రం 4.4.5

**స వా అయమాత్మా బ్రహ్మ విజ్ఞానమయో మనోమయః ప్రాణమయశ్చక్షుర్మయశ్శ్రోత్రమయః పృథివీమయ ఆపోమయో వాయుమయ ఆకాశమయస్తేజోమయోఽతేజోమయః కామమయోఽకామమయః క్రోధమయోఽక్రోధమయో ధర్మమయోఽధర్మమయస్సర్వమయస్తద్యదేతదిదంమయోఽదోమయ ఇతి యథాకారీ యథాచారీ తథా భవతి సాధుకారీ సాధుర్భవతి పాపకారీ పాపో భవతి ॥ పుణ్యః పుణ్యేన కర్మణా భవతి పాపః పాపేన। అథో ఖల్వాహుః కామమయ ఏవాయం పురుష ఇతి స యథాకామో భవతి తత్క్రతుర్భవతి యత్క్రతుర్భవతి తత్కర్మ కురుతే యత్కర్మ కురుతే తదభిసమ్పద్యతే॥**

జీవాత్మ ఇంకో జన్మ తీసుకున్నప్పుడు ఏమవుతుంది? ఏ జన్మ తీసుకుంటే దానితో పూర్తిగా మమేకం చెందుతుంది. కొత్త స్థూలశరీరంతో, కొత్త ఆలోచనలతో, కొత్త పరిసరాలతో, కొత్త ప్రాణంలో తన్మయత్వం చెంది పూర్తిగా ఆ కొత్త ప్రపంచంలో ఇమిడిపోతుంది.

ఇక్కడ ఉపనిషత్తు ఇందులోని తమాషాని ఎత్తి చూపుతున్నది. నిజానికి ఈ జీవాత్మ ఎవరు? ఇంత అవస్థలు పడి, మరణించి, మళ్ళీ ఎక్కడో పుట్టి, మళ్ళీ అవస్థలు పడాల్సిన అవస్థ లేదు. జీవాత్మ పరిస్థితి నిజానికి అది కాదు.

**స వా అయమాత్మా బ్రహ్మ** – ఈ జీవాత్మ నిశ్చయంగా బ్రహ్మ. జీవాత్మ=పరమాత్మ. ఇది ఒక మహావాక్యం.

**అయమాత్మా బ్రహ్మ – మాండూక్యోపనిషత్తు మహావాక్యం**

చాలా మామూలుగా మహావాక్యాన్ని వేసింది ఉపనిషత్తు ఇక్కడ. అసలు పరమాత్మ అయిన ఈ జీవాత్మ ఆ స్థితిని పోగొట్టుకుని, ఆ ఉన్నత స్థాయిని పోగొట్టుకుని, విజ్ఞానమయ ఆత్మ అయింది.

**విజ్ఞానమయః** – విజ్ఞానం అంటే బుద్ధి. మయ అంటే తాదాత్మ్యం. ఆపన్నః అంటే విజ్ఞానంతో తాదాత్మ్యం చెంది విజ్ఞానమయ అయింది. అలా ఒక్కొక్క దానితో తాదాత్మ్యం చెందింది.

**మనోమయః ప్రాణమయశ్చక్షుర్మయశ్శ్రోత్రమయః** – అలా మనస్సుతో, ప్రాణంతో, కళ్ళతో, చెవులతో తాదాత్మ్యం చెందింది. తర్వాత స్థూలశరీరం గురించి మాట్లాడుతున్నది.

**పృథివీమయ ఆపోమయో వాయుమయ ఆకాశమయస్తేజోమయః** – ఈ జీవాత్మ ఉన్న లోకాలనిబట్టి స్థూలశరీరం మారుతుంది. భూలోకంలో ఉంటే పృథివీమయంగా ఉంటుంది; వరుణలోకంలో ఆపోమయంగా ఉంటుంది;

వాయులోకంలో వాయుమయంగా ఉంటుంది. అలా ఆకాశమయంగా, అగ్నిమయంగా అది ఉన్న లోకాన్నిబట్టి ఉంటుంది.

**అతేజోమయః** – తేజోమయ అంటే అగ్నితో తాదాత్మ్యం చెందుతుంది. అతేజోమయ అంటే మామూలు శరీరంతో ఉంటుంది.

**కామమయ అకామమయ** – కోరికలతో తాదాత్మ్యం చెందుతుంది లేదా కోరికలు లేని జన్మ తీసుకుంటుంది.

**క్రోధమయః అక్రోధమయః** – క్రోధరూపంతో లేదా క్రోధము లేని శాంతచిత్తంతో తాదాత్మ్యం చెందుతుంది.

**ధర్మమయః అధర్మమయః** – ధర్మంతోనో, అధర్మంతోనో తాదాత్మ్యం చెందుతుంది.

**సర్వమయ** – ఒక్కముక్కలో చెప్పాలంటే అన్ని రూపాలతోనూ తాదాత్మ్యం చెందుతుంది.

**తద్యదేతత్ ఇదంమయః అదోమయ ఇతి** – దీనితో కాని దానితో కాని తాదాత్మ్యం చెందుతుంది. ఇదం అంటే ప్రత్యక్షంగా కనబడేది; అదోమయః అంటే పరోక్ష విషయాలు. అంటే భవిష్యత్తులో జరగబోయే విషయాలమీద ఆకాశంలో గాలిమేడలు కడుతుంది.

**యథాకారీ యథాచారీ తథా భవతి** – ఎలా చేస్తే అలా అవుతుంది. చేసుకున్నవారికి చేసుకున్నంత మహానుభావా అంటారు.

**సాధుకారీ సాధుర్భవతి** – పుణ్యకార్యాలు చేస్తే సాధువు అవుతుంది;

**పాపకారీ పాపో భవతి** – పాపాలు చేస్తే పాపి అవుతుంది.

**పుణ్యః పుణ్యేన కర్మణా భవతి పాపః పాపేన** – పుణ్యకర్మవల్ల మంచిజన్మ, పాపకర్మవల్ల నికృష్టజన్మ పొందుతుంది ఈ జీవాత్మ.

ఇప్పుడు సంసారంయొక్క మూలకారణంలోకి వెళ్ళదలుచుకుంది ఉపనిషత్తు.

**అథో ఖలు ఆహుః** – ఇంకా ఋషులు ఇలా చెబుతారు.

**అయం పురుషః కామమయః** – ఈ సంసారి కామాలతో అంటే కోరికలతో నిండినవాడు. కోరికలకు కాళ్ళు, చేతులు, తల ఇస్తే ఎలా ఉంటుందో అలా ఉంటాడు ఈ సంసారి. అంటే మూర్తీభవించిన కోరికలా ఉంటాడు.

**యథాకామో భవతి తత్క్రతుర్భవతి** – ఎటువంటి కోరికలు ఉంటే, అటువంటి సంకల్పం చేస్తాడు.

**యత్క్రతుర్భవతి తత్కర్మ కురుతే** – ఎటువంటి సంకల్పం చేస్తాడో, అటువంటి కర్మలు చేస్తాడు.

**యత్కర్మ కురుతే తదభిసంపద్యతే** – ఎటువంటి కర్మ చేస్తే, అటువంటి ఫలం పొందుతాడు. అంటే ఒక వ్యక్తియొక్క భవిష్యత్తు అతని కోరికమీద ఆధారపడివుంటుంది. అతనికి అనేక కోరికలు ఉండవచ్చు, కాని దేనిమీద తీవ్రమైన కోరిక ఉందో, దాన్ని ఆచరణలో పెడతాడు.

కామం, క్రతువుల మధ్య సూక్ష్మమైన భేదం ఉంది అంటున్నారు శంకరులవారు. కామం అంటే బలహీనమైన కోరిక, క్రతువు అంటే నిశ్చయం. బలహీనమైన కోరిక కార్యరూపం దాల్చదు. కొంతమంది వేదాంతబోధ వారి

పక్కనే జరుగుతున్నదని తెలుసుకుని, దానికి వెళదామనుకుంటూనే సంవత్సరాలు గడిపేస్తారు. అందువల్ల కోరిక దృఢనిశ్చయంగా మారితేనే కర్మ చేస్తారు. కర్మనుబట్టి కర్మఫలం ఉంటుంది. అది వచ్చేజన్మను నిర్దేశిస్తుంది.

ఈ పునరపి జననం, పునరపి మరణం అనే జన్మవృత్తానికి మూలకారణం **కామం**. ఉపనిషత్తు సంసారానికి మూలకారణం కామం అంది ఇక్కడ. ఇంతవరకూ మనం సంసారానికి మూలకారణం **అవిద్య** అని నేర్చుకున్నాము. అవిద్య అంటే అజ్ఞానం. ఇప్పుడు మనకు సందేహం వస్తుంది. **సంసారానికి మూలకారణం కామమా, అవిద్యా?**

రెండూ ఒకటే కుటుంబానికి చెందినవి. అందువల్ల రెండూ కరెక్టే. అవిద్య కారణం, కామం కార్యం. అవిద్య తల్లి, కామం పుత్రుడు. రెండూ సంసారానికి కారణాలే అయితే, ఇక్కడ ఉపనిషత్తు కామం గురించి ఎందుకు చెప్పింది, అవిద్య గురించి ఎందుకు చెప్పలేదు?

**అవిద్య సామాన్యకారణమ్; కామం విశేషకారణమ్.**

అవిద్య అందరిలోనూ సమానంగా ఉంటుంది. అవిద్య ఏకరూపం. కాని కామం మనిషి మనిషికీ మారుతుంది. ఆ మనిషి మరణం తర్వాత స్వర్గానికి వెళ్ళాలా లేదా అనేది అతని కామం నిర్ణయిస్తుంది. కామం ఎలా సంసారానికి మూలకారణమో ఈ మంత్రంలో చూశాము.

కామం ప్రత్యక్షంగా సంసారంలో పడవేయదు. కామం దృఢనిశ్చయానికి దారితీస్తుంది, దాన్ని ఇక్కడ క్రతువు పదంగా చూశాము. కామం పుత్రుడు క్రతువు.

క్రతువు కర్మను చేయిస్తే; కర్మ, కర్మఫలాన్ని ఇస్తుంది. దాన్నిబట్టి పునర్జన్మ వస్తుంది. అంటే మార్గం ఏమిటి? కామం, క్రతువు, కర్మ, సంసారం.

ఇక్కడ ఒక సందేహం రావచ్చు.

**సంకల్పప్రభవాన్ కామాన్ త్యక్త్వా సర్వానశేషతః ।**
**మనసైవేంద్రియగ్రామం వినియమ్య సమంతతః ॥** – గీత 6.24

గీతలో క్రతువు కారణం, కామం కార్యం అని వస్తుంది. ఇక్కడ కామం కారణం, సంకల్పం కార్యం అని వస్తున్నది. అంటే ఏది సత్యం? రెండూ కరెక్టే. ఒకటి బలహీనమైన కోరిక, ఇంకొకటి దృఢనిశ్చయం. ఎప్పుడూ బలహీనమైన కోరికనుంచి నిశ్చయమైన కోరికకు వెళతాము. వాటికి పదాలు తారుమారు అయ్యాయి అంతే. ఇక్కడ బలహీనమైన కోరికను కామం అంటే, గీత క్రతువు అంది; అలాగే ఇక్కడ దృఢమైన కోరికను క్రతువు అంటే గీత కామం అంది.

అసలు ఈ కోరికను రెండు రకాలుగా విభజించటం ఎందుకు? కోరిక అంటే చాలదా? చాలదు. ఎందుకంటే అన్ని కోరికలూ తీవ్రంగా ఉండవు. చాలా చేద్దామనుకుంటాము, ఏమీ చెయ్యము. ఎందుకంటే ఆ కోరికల్లో తీవ్రత లేదు కాబట్టి. అలా బలహీనమైన కోరికలు సమస్యలను సృష్టించలేవు. అందువల్ల ఈ వృత్తాన్ని చూశాము. కోరికలు క్రతువుగా మారి, క్రతువువల్ల కర్మలు చేస్తాడు. కర్మవల్ల పునర్జన్మ పొందుతాడు. ఇది ఒక ముగింపు లేని వృత్తం.

ఈ విధంగా జీవాత్మ చరిత్రను వర్ణించింది ఉపనిషత్తు. నిజానికి జీవాత్మ ఎవరు? పరమాత్మ, అసంసారీబ్రహ్మ. తాదాత్మ్య అధ్యాసవల్ల జీవాత్మ అయింది. జీవాత్మ శరీరమయం అయింది. శరీరమయం అంటే స్థూలశరీరం, సూక్ష్మశరీరాలు రెండూ. శరీరమయం అనే ఇంత చిన్నమాట వాడకుండా మనోమయ, విజ్ఞానమయ అంటూ చాలా పేర్లు చెప్పింది. అలాగే పంచభూతమయం అయింది జీవాత్మ అని చెప్పటానికి పృథివీమయ, ఆపోమయ అంటూ చెప్పుకొచ్చింది.

ఈ భాగం సారాంశం పరమాత్మ శరీరమయం, పంచభూతమయం అయ్యాడు. అందువల్ల 'అహం బ్రహ్మ అస్మి' అనాల్సిన నేను 'అహం స్థూలః అస్మి' అంటున్నాను. ఎప్పుడైతే పరమాత్మ జీవాత్మ స్థాయికి పడిపోతాడో, అప్పుడే జీవాత్మ కర్తా, భోక్తా అవుతాడు. కర్తృత్వంవల్ల కామం వస్తుంది; కామం క్రతువుకీ, క్రతువు కర్మకూ కర్మఫలానికీ, కర్మఫలం పునర్జన్మకూ దారితీస్తుందని చూశాము.

**యథా కర్మ యథా ఆచరః తథా ఫలం భవతి**

## మంత్రం 4.4.6

**తదేష శ్లోకో భవతి । తదేవ సక్తస్సహ కర్మణైతి లిఙ్గం మనో యత్ర నిషక్తమస్య। ప్రాప్యాన్తం కర్మణస్తస్య యత్కిఞ్చేహ కరోత్యయమ్। తస్మాల్లోకాత్పునరైత్యస్మై లోకాయ కర్మణ ఇతి ను కామయమానోఽథాకామయమానో యోఽకామో నిష్కామ ఆప్తకామ ఆత్మకామః॥ న తస్య ప్రాణా ఉత్క్రామన్తి బ్రహ్మైవ సన్ బ్రహ్మాప్యేతి ॥**

**తదేష శ్లోకో భవతి** – ఈ భావాన్ని వివరించటానికి యాజ్ఞవల్క్యుడు ఋగ్మంత్రాన్ని ఉటంకిస్తున్నాడు. ఈ ఉపనిషత్తు శుక్లయజుర్వేదానికి చెందినది; ఋగ్మంత్రం ఋగ్వేదానికి చెందినది. ఈ భావాన్ని అంటే ఏ భావాన్ని? కామ–కర్మ–సంసారం గురించిన భావాన్ని.

**తదేవ సక్తః సహ కర్మణైతి లింగం యత్ర నిషక్తమ్ అస్య** – ఈ సంసారియొక్క మనస్సు దేనిమీద ఆసక్తి కలిగి ఉందో, దానినే కర్మతో సహా పొందుతాడు. దీన్ని ముందే వివరంగా చూశాము. కృష్ణపరమాత్మ దీనిని ఆధారం చేసుకుని ఎనిమిదవ అధ్యాయములో వివరించాడని కూడా చూశాము. జడభరతుడు ఈ మంత్రానికి ఉదాహరణ. అతను తన లేడిపిల్లను తలుచుకుంటూ మరణించటంవల్ల తను లేడిగా పుట్టాడు.

లింగం అంటే సూక్ష్మశరీరం. లింగం మనః అంటే సూక్ష్మశరీరానికి చెందిన మనస్సు; యత్ర అంటే ఏ వస్తువుమీద లేదా వ్యక్తి మీద అనుబంధం ఉంటే! కొంతమంది భర్తలు వచ్చేజన్మలో కూడా నువ్వే నా భార్యవు అవాలి అంటారు; కొంతమంది శిష్యులు వచ్చేజన్మలో కూడా మీరే మా గురువు అవాలి అంటారు. నిషక్తం అంటే బంకలా అతుక్కుపోవటం. అంటే వారిమీద బాగా అభిమానం పెంచుకోవటం. అలా పెంచుకుంటే ఏమవుతుంది? సహసక్తః పురుషః – అలా అనుబంధం పెంచుకున్న పురుషుడు తదేవ యేతి – తనకు అనుబంధం ఉన్న ఆ వస్తువును లేదా మనిషిని పొందుతాడు. యేతి అంటే పొందుతాడు. ఎలా? తను చేసుకున్న పుణ్య, పాప కర్మలతో సహా!

**అయమ్ ఇహ యత్కించ కరోతి** – అతను ఈ జన్మలో ఏ కర్మ చేసినా;

**తస్య కర్మణః అంతం ప్రాప్య** – ఆ కర్మఫలం పొందుతాడు. అంతం అంటే కర్మఫలం.

**తస్మాత్ లోకాత్ అస్మై లోకాయ పునరైతి** – ఆ లోకంనుంచి ఈ లోకానికి వెనక్కి వస్తాడు. స్వర్గలోకానికి వెళ్ళినా, పుణ్యం క్షీణించగానే ఈ లోకానికి తిరిగివస్తాడు.

**ఇమం లోకం హీనతరం వా విశంతి – ముండకమ్**

ఈ లోకానికే తిరిగివస్తాడని చెప్పలేము. ఇంకా హీనలోకానికి వెళ్ళవచ్చు అంటుంది ముండకోపనిషత్తు. అంటే పురుగుగా కూడా పుట్టవచ్చు. ఎందుకు తిరిగివస్తాడు?

**కర్మణే** – మళ్ళీ కొత్తగా పుణ్యపాప కర్మలు చెయ్యటానికి. ఇతి అంటే ఇక్కడిదాకా ఋగ్మంత్రం చూశాము.

**ఇతి ను కామయమానః** – ఇంతవరకూ కామయమానః పురుషుని జీవితచరిత్ర చూశాము. కామసహిత ప్రవత్తిమాన. కోరికలతో జీవించే వ్యక్తి చరిత్ర. ఇక్కడితో సంసార వర్ణన అయిపోయింది. 4.3.34 నుంచి 4.4.6 వరకూ సాగింది ఇది.

**సంసారస్య హేతుః కామః, తస్మాత్ కామనివృత్తే సంసారనివృత్తిః**

సంసారానికి కారణం కామం. అందువల్ల కామాన్ని నివారిస్తే సంసార నివారణ జరుగుతుంది. ఇక్కడ్నుంచి మోక్షవర్ణన.

**అథ అకామయమానః** – అథ అంటే అంశం మారుతున్నది. ఇక్కడ్నుంచీ కోరికలులేని వ్యక్తి గురించి చూస్తాము. ఎలా?

**యః అకామః నిష్కామః ఆప్తకామః ఆత్మకామః** – ఇది చాలా ముఖ్యమైన నిర్వచనం. ముందు ఆత్మకామఃతో మొదలుపెడదాము.

ఆత్మకామః – ఎన్నడూ అనాత్మకామఃగా ఉండకూడదు. అంటే అనాత్మను మన జీవితలక్ష్యంగా పెట్టుకోకూడదు. లోకాలు, వస్తువులు, మనుష్యులు, హెూదా, పేరు, ఆస్తి – అన్నీ అనాత్మలోకి వస్తాయి. వీటిలో ఏ ఒక్కటి లక్ష్యంగా పెట్టుకున్నా అవస్థ పడతాము. అందువల్ల అనాత్మను ప్రాథమిక లక్ష్యంగా తీసుకోకూడదు. అనాత్మను ఆత్మప్రాప్తికోసం వాడవచ్చు. డబ్బును, భార్యను, కుటుంబాన్ని సాధనగా వాడవచ్చు కాని సాధ్యంగా చూడకూడదు. ఈ అనాత్మను ఆత్మజ్ఞానం పొందటానికి వాడాలి.

అనాత్మను పూర్తిగా వదులుకోమనటం లేదు. అలా పూర్తిగా వదలటంలో అర్థం లేదు కూడాను. దాన్ని సాధనగా వాడాలి. కాని సాధనగా వాడుతున్నానో లేదో ఎలా తెలుస్తుంది? సాధనగా వాడితే సరియైన సమయంలో దాన్ని వదులుకోవటానికి సిద్ధపడాలి. వాటిని నేను పట్టుకుని ప్రాకులాడితే యమధర్మరాజు నానుంచి వాటిని బలవంతంగా తీసేసుకుంటాడు. అప్పుడు నా జీవితం భరించలేనిదిగా అవుతుంది.

ఇటువంటి దుఃఖంనుంచి తప్పించుకోవాలంటే, నేను ఆధ్యాత్మికంగా ఎదగాలి. అనాత్మను సాధనగా చూడాలి. అంటే అవసరమైనప్పుడు దాన్ని వదులుకోవటానికి సిద్ధపడాలి. దీన్ని వైరాగ్యం అంటారు. మానసికంగా సంసిద్ధమవటమే ఆత్మకామః.

ఆత్మకామానికి, అనాత్మకామానికి మధ్య వ్యత్యాసం ఏమిటి? అనాత్మకామాన్ని ఆత్మకామంకన్నా ఎందుకు తక్కువచేసి మాట్లాడుతారు? ఎందుకంటే అనాత్మకామాన్ని ఎన్నటికీ తీర్చుకోలేము. అది నిరంతరంగా కొనసాగుతుంది. అనాత్మ కర్మఫలాలు మూడు దుఃఖాలను ఇస్తాయి – బంధకత్వం, అతృప్తికరత్వం, దుఃఖమిశ్రితత్వం. అంటే అనాత్మ కర్మఫలాలు పొందినా ఈ దోషాలు ఉంటాయి. బంధకత్వం అంటే బంధంలో పడవేస్తుంది; అతృప్తికరత్వం అంటే ఎంత పొందినా తృప్తి ఉండదు; దుఃఖమిశ్రితత్వం అంటే ఏది పొందినా ఆ ఆనందంతో పాటు దాన్ని పోగొట్టుకుంటామేమోననే దుఃఖం పొంచివుంటుంది. అందువల్ల ఆత్మకామః ఉండాలి.

ఆప్తకామః – ఆత్మను కోరితే, ఆ వ్యక్తి అన్ని కోరికలనూ తీర్చుకోగలుగుతాడు. తృప్తోభవతి, పూర్ణోభవతి. అదెలా? ఆత్మను కోరితే ఆత్మను పొందుతాను, అనాత్మను పొందను కదా! ఒక కోరిక తీరితే ఇంకొక కోరిక తీరినట్టు కాదు కదా! అప్పుడు ఆప్తకామః ఎలా అవుతాను?

ఆత్మవ్యతిరిక్తః అనాత్మా నాస్తి – ఆత్మ లేకుండా అనాత్మ లేదు.

**బ్రహ్మైవేదమమృతం పురస్తాద్, బ్రహ్మ పశ్చాద్ బ్రహ్మ దక్షిణతశ్చోత్తరేణ। –ముండకమ్**

ఆత్మ అంతటా ఉంది. తూర్పున, పడమరన, దక్షిణాన, ఉత్తరాన, పైన, కింద, మధ్యలో. నాలుగు పురుషార్థాల్లో ధర్మార్థ కామాలలో ఏది లక్ష్యంగా పెట్టుకుంటే అదే తీరుతుంది కాని మోక్షం లక్ష్యంగా పెట్టుకుంటే నాలుగూ తీరతాయి.

నిష్కామః – ఆప్తకామం నిష్కామానికి దారి తీస్తుంది. వేదాంతానికి రాకముందు, మీ కోరికలు ఏమిటంటే పుస్తకం నిండా రాయగలము మన కోరికలను. కాని వేదాంతాన్ని అర్థం చేసుకున్నాక, ఆ కోరికలన్నీ అర్థం లేనివిగా కనిపిస్తాయి. అవి తీరినా సంతోషమే, అవి తీరకపోయినా సంతోషమే.

అకామః – నిష్కామః కాబట్టి అకామః అవుతాడు. కోరికలు తీరతాయి కాబట్టి కోరికలు ఉండవు. కోరికలు ఉండవు కాబట్టి అకామయ మనః అవుతాం.

కోరికలు ఉండవు కాబట్టి, కోరికలు లేకుండా కర్మలు చేస్తాడు. అతను కర్మలు చెయ్యడు అనటం లేదు. ఎన్నైనా కర్మలు చెయ్యవచ్చు. నిజానికి వ్యవహారంలో ఉన్న వారందరికన్నా ఎక్కువ కర్మలు చెయ్యవచ్చు. అకామయ మనః అంటే కర్మ చెయ్యడని కాదు, కోరికలతో కర్మలు చెయ్యడు.

కోరికలతో కూడిన కర్మలకు, కోరికలులేని కర్మలకు మధ్య భేదం ఏమిటి? కోరికలతో కూడిన కర్మలు బంధిస్తే, కోరికలు లేని కర్మలు బంధించవు. అందువల్ల జ్ఞానికి జీవితం ఆట; అజ్ఞానికి జీవితం పోరాటం. ఇద్దరూ పరుగులు తీస్తారు; కాకపోతే జ్ఞాని ఆనందంగా పరుగులు తీస్తే, అజ్ఞాని పోరాటం చేస్తూ పరుగులు

తీస్తాడు. ఎలా చెప్పగలము? వారి మొహాలు చూడండి. జ్ఞాని మొహం దేదీప్యమానంగా వెలిగితే, అజ్ఞాని మొహం దిగులుగా ఉంటుంది.

ఇక్కడ్నుంచీ విదేహముక్తి గురించి చూస్తాము. ప్రాణం శరీరాన్ని వదిలివెళ్ళేది ఒక్క కారణంకోసమే. అది ఇంకో శరీరాన్ని పొందటానికి. న తస్య ప్రాణాః ఉత్క్రామంతి– ప్రాణ ఉత్క్రమనం అంటే పునర్జన్మ. జ్ఞాని విషయానికి వచ్చేసరికి, అతని ప్రాణం, సూక్ష్మశరీరం స్థూలశరీరాన్ని విడిచి ప్రయాణం చెయ్యదు. ఇక్కడ సమష్టిలో కలిసిపోతుంది. జీవాత్మకు ఏమవుతుంది?

**బ్రహ్మైవ సన్ బ్రహ్మ అప్యేతి** – ముందే బ్రహ్మ అయిన జీవాత్మ బ్రహ్మలో ఐక్యం అవుతుంది.

**జీవన్ముక్తః సన్ విదేహముక్తో భవతి**

అప్యేతి అంటే ఐక్యం చెందటం.

ఇంతవరకూ సంసారగతి గురించి చూశాము. సంసారానికి మూలకారణం అవిద్య అయినా ఇక్కడ కామం, కర్మలను కారణంగా చూశాము. అంతమాత్రాన అవిద్య కారణం కాదు అనటానికి లేదు; అవిద్య సంసారానికి సామాన్యకారణం అయితే కామం, కర్మలు విశేషకారణం అవుతాయి.

మరణించాక జీవుడు ఎటు ప్రయాణించాలో కేవలం అజ్ఞానం నిర్ణయించదు; ఆ జీవుడుయొక్క కామం, కర్మలనుబట్టి ఉంటుంది. అది మొదటి ఐదు మంత్రాల్లో చూశాము. ఆరవ మంత్రంలో దీనికి సంబంధించిన ఋగ్మంత్రాన్ని చూశాము. పునర్జన్మ గురించి వస్తుంది అందులో. సంసారిని కామయమానః అన్నాడు యాజ్ఞవల్క్యుడు.

జ్ఞానిని అకామయమానః అన్నాడు. అతని నిర్వచనం అద్భుతంగా ఇచ్చాడు. **అకామో నిష్కామ ఆప్తకామ ఆత్మకామః.** నిజానికి సుషుప్తివర్ణన చూసినప్పుడు ఇవే పదాలను 4.3.21లో చూశాము. జ్ఞాని అకామపురుషుడు ఎలా అవుతాడు? అతని కోరికలను అనాత్మ కోరికలనుంచి ఆత్మ కోరికగా మలుచుకుంటాడు. అనాత్మ కోరికలను కోరితే అవి ఎన్నటికీ నెరవేరవు. కోరికలు అనంతం. ఒకటి తీరితే, ఇంకోటి పుడుతూనే ఉంటుంది. ఒకటి తీరితే ఇంకోటి తీరలేదనే బెంగ ఉంటుంది.

అదే ఆత్మమీద కోరిక పెంచుకుంటే, అనాత్మ కోరికలు మాయమవటమే కాక, ఆత్మమీద కోరిక తీరగానే, ఆ కోరిక కూడా మటుమాయమవుతుంది. అందువల్ల ఆత్మను కోరితే, త్వరలోనే కోరికలు లేకుండా అవుతాడు. ఆత్మకామ అకామః భవతి. ఒకవేళ దేనితో అయినా బంధం ఉండితీరాలని అనుకుంటే ఎప్పటికీ బంధంలేని ఆత్మతో బంధం పెంచుకుంటే, త్వరలోనే బంధవిముక్తుడు అవుతాడు. దీన్నే జీవన్ముక్తి అంటారు. జీవన్ముక్తి పొందాక, ప్రారబ్ధకర్మ మిగిలివున్నన్నాళ్ళూ ఈ భూమ్మీద జీవిస్తాడు జ్ఞాని. మరణించాక సమష్టిలో కలిసిపోతాడు. స్థూలశరీరం రాలిపోతుంది; సూక్ష్మశరీరం సమష్టి సూక్ష్మప్రపంచంలోనూ, కారణశరీరం సమష్టి కారణప్రపంచంలోనూ ఐక్యం అయిపోతుంది. అందువల్ల జ్ఞానికి మరణానంతరం ప్రయాణం లేదు. ఇదే భావాన్ని 3.2.11లో కూడా చూశాము.

మూడు శరీరాలూ మాయమయ్యాయంటే అసలు జ్ఞాని గాలిలో కలిసిపోయాడా? అందుకే **బ్రహ్మైవ సన్ బ్రహ్మాప్యేతి** అంది ఉపనిషత్తు. అతను జీవించి ఉండగానూ బ్రహ్మే, మరణించాక కూడా బ్రహ్మే! వ్యత్యాసం ఎక్కడుంది అంటే జీవించివుండగా **శరీరంలో ఉన్నట్టుగా** ఉన్నాడు; మరణించాక శరీరంనుంచి **బయట పడ్డట్టుగా** ఉన్నాడు. అంతకుముందు అతను సదేహబ్రహ్మ అయితే, మరణించాక విదేహబ్రహ్మ అవుతాడు.

కుండలో ఆకాశం ఉంది. కుండ పగిలిపోతే కుండలోని ఆకాశం బయటవున్న ఆకాశంతో కలిసిపోతుంది. కుండలోని ఆకాశాన్ని ఘటాకాశం అంటే బయట ఉన్న ఆకాశాన్ని మహదాకాశం అంటాము. ఆకాశంలో ఏ మార్పూ లేదు. మన పదప్రయోగంలో మార్పు ఉంది అంతే. అదేవిధంగా జీవన్ముక్తికీ, విదేహముక్తికీ ఏమీ వ్యత్యాసం లేదు. జీవన్ముక్తుడుగా బ్రహ్మగా ఉన్న జ్ఞాని, విదేహముక్తుడుగా బ్రహ్మగా అవుతాడు.

బ్రహ్మ అప్యేతిలో కర్త పదం లేదు. జ్ఞాని బ్రహ్మ అప్యేతి అని కలుపుకోవాలి. అంటే జ్ఞాని బ్రహ్మలో ఐక్యం అవుతాడు. దీనిమీద భాష్యం ఉంది. అది చూద్దాము.

## బ్రహ్మైవ సన్ బ్రహ్మాప్యేతి భాష్యం

బ్రహ్మ అప్యేతి పదంమీద ఎందుకు విశ్లేషణ చెయ్యాలి? వేదాంతంలో ఏ క్రియాపదం వాడినా సమస్య వస్తుంది. క్రియాపదం అంటే ఏదో జరగబోతున్నది అని అర్థం. అంటే ఒక సంఘటన లేదా ఒక తతంగం.

చాలామంది మోక్షం అంటే, ఏదో జరగబోయే సంఘటన అనుకుంటారు. పురాణాల్లో కూడా భక్తుని ఆత్మ వెళ్ళి పరమాత్మలో కలవటం చూస్తాము. మనం భక్తిని చిన్నచూపు చూడటం లేదు. ఉపాసనను కించపరచటం లేదు. కాని వీటిని మోక్షంగా అనకూడదు అంటున్నాము. భక్తిలో నాలుగు దశలు చూస్తాము. అవి సాలోక్యం, సామీప్యం, సారూప్యం, సాయుజ్యం. సాలోక్యం అంటే భగవంతుడు ఉన్న లోకానికి ప్రయాణం చేసి వెళ్ళటం; సామీప్యం అంటే ఆయనకు దగ్గరగా ఉండటం; సారూప్యం అంటే ఆయనకు దగ్గరగా ఉండి, ఆయనను పదేపదే చూడటంవల్ల ఆయన రూపం పొందటం; సాయుజ్యం అంటే చివరకి ఆయనలో ఐక్యం అవటం. దీని ప్రకారం మోక్షం ఒక సంఘటన. ఎప్పుడైతే సంఘటన అంటామో అప్పుడే అవాలన్న ఆశ, అవుతుందో లేదోననే బెంగ రెండూ పెనవేసుకుని ఉంటాయి.

'అప్యేతి' అనే క్రియాపదం, అందువల్ల సమస్యను సృష్టిస్తుంది. అనేకమంది అనేక విధాలుగా దీనిని విశ్లేషించారు. శంకరులవారి నిర్వచనం **అప్యేతి=అవిద్యానివృత్తి.** ఐక్యం అవుతుంది అంటే అజ్ఞానం తొలుగుతుంది. ఐక్యం అంటే అక్షరాలా జీవాత్మ ప్రయాణం చేసి పరమాత్మలో కలవటం కాదు. అజ్ఞానంవల్ల జీవాత్మకు, పరమాత్మకు దూరం ఉందనుకుంటున్నాము, అజ్ఞానం తొలిగితే దూరం తొలుగుతుంది.

జ్ఞానం పొందితే, బ్రహ్మ నాకు దూరంగా అంతకుముందు లేదు, ఇప్పుడు లేదు, ఇకముందు ఉండబోదు అని తెలుసుకుంటే నేను కొత్తగా బ్రహ్మతో ఐక్యమవాల్సిన అవసరం లేదు. ఎందుకంటే 'నేను ముందే బ్రహ్మను'. ఇది బాగా అర్థం చేసుకోవాలి. ఈ సత్యాన్ని నేర్చుకోవటమే బ్రహ్మవిద్య.

**అప్యేతి = అవిద్యానివృత్తి**

కాని ఇంత తేలిగ్గా అందరూ ఒప్పుకోరు. దీనిమీద అనేక వాదనలు ఉన్నాయి. అందులో కొన్ని ఇప్పుడు చూద్దాము. అవి ఎలా ఆధారం లేని వాదనలో గమనిస్తాము.

## కొన్ని వాదోపవాదాలు

1. **ఆప్తి** – ఆప్తి అంటే పరమాత్మను చేరటం. అంటే జీవాత్మ వెళ్ళి పరమాత్మలో కలవటం. భక్తుడు భగవంతుని వైపు 10 అడుగులు వేస్తే, భగవంతుడు భక్తునివైపు త్వరత్వరగా 20 అడుగులు వేసి అతన్ని అందుకుంటాడు అని ఒక సిద్ధాంతం. వాటిని గూఢార్థంగా తీసుకోవాలి కాని, అక్షరాలా అడుగులు వేయటంగా తీసుకోకూడదు.

విశిష్టాద్వైతంలో జీవాత్మ శుక్లగతిద్వారా ప్రయాణం చేసి భగవంతునిలో ఐక్యం అవుతుంది, అదే మోక్షం అంటారు. వారు జీవన్ముక్తిని నమ్మరు. మరణం తర్వాత పుణ్యలోకాలకు వెళ్ళి, భగవంతునితో ఐక్యం అవాలి అంటారు.

**శంకరులవారి జవాబు** – ఈ వాదనను అంగీకరించలేము. ఎందుకు? పరమాత్మ ఒక స్థానానికే పరిమిత మవలేదు. నిజానికి నాకు భిన్నంగా ఉంటే కదా, నేను ప్రయాణం చేసి వెళ్ళి కలవాల్సింది?

**బ్రహ్మైవ సన్ బ్రహ్మాప్యేతి – 4.4.6**

ఈ వాక్యాన్ని సరిగ్గా చదవమంటున్నారు శంకరులవారు. ఇది అక్షరలక్షలు విలువ చేసే వాక్యం. ముందే బ్రహ్మగా ఉన్న నేను, బ్రహ్మలో ఐక్యం అవుతాను.

**ప్రశ్న – ముందే బ్రహ్మగా ఉంటే, మళ్ళీ బ్రహ్మలో ఐక్యం ఎందుకు**? నేను ముందే బ్రహ్మ అయివుంటే, నేను బ్రహ్మలో ఐక్యం అవుతాను అని మళ్ళీ ఉపనిషత్తు పనిగట్టుకుని చెప్పటం ఎందుకు? అవి వ్యతిరేకవాక్యాలు కావా?

**జవాబు** – ఐక్యం **అయినట్టుగా** అవుతాను. ముందే బ్రహ్మను, ఇప్పుడు బ్రహ్మతో ఐక్యం అవుతాను వాక్యం అర్థం, అజ్ఞానంవల్ల ముందే బ్రహ్మను అనే విషయం తెలియటం లేదు. బ్రహ్మను పోగొట్టుకున్నట్టుగా ఉన్నాను. జ్ఞానం పొందాక, బ్రహ్మను పొందినట్టుగా అవుతాను. అంటే నేనే బ్రహ్మను అనే జ్ఞానం పొందుతాను.

**అజ్ఞానేన నష్టవత్ ఆభాసతే, జ్ఞానేన ప్రాప్తవత్ భవతి**

బ్రహ్మను నిజంగా పోగొట్టుకోలేదు, నిజంగా పొందలేదు. అజ్ఞానంవల్ల బ్రహ్మకు భిన్నంగా ఉన్నాను అనుకుంటున్నాను; జ్ఞానం పొందాక నేనే బ్రహ్మను అని తెలుసుకున్నాను. అవిద్యానివృత్తివల్ల బ్రహ్మప్రాప్తి కలిగినట్టుగా అనిపిస్తుంది. నిజంగా ప్రయాణం లేదు.

2. **వికారః** – సరే మనం ముందే బ్రహ్మ. బ్రహ్మను పొందటానికి ప్రయాణం చెయ్యనవసరం లేదు. అంతవరకూ ఒప్పుకుంటాము. కాని మనం ఇప్పుడు సంసారిగా ఉన్నాము; మనం మార్పు చెంది పరబ్రహ్మ అవాలి. అంటే **సంసారినుంచి పరబ్రహ్మగా వికారం చెందాలి**. అంటే జీవాత్మ పరమాత్మగా మారాలి.

**శంకరులవారి జవాబు** – బ్రహ్మకు వికారం లేదు. అంటే మార్పు లేదు. మార్పు ఉంది అంటే, అది ఒక సమయంలో వచ్చి, ఇంకొక సమయంలో పోవాలి. ఒక సమయంలో పొందినదాన్ని, ఇంకొక సమయంలో కోల్పోతాము. ఒకవేళ భవిష్యత్తులో మారాలి అంటే ఉపనిషత్తు తత్ త్వం అసి అని ఉండేది కాదు 'తత్ త్వం భవిష్యసి' అని ఉండేది. దానికోసం సాధన చెయ్యి అనలేదు. బ్రహ్మ అవటానికి ఏమీ చెయ్యనవసరం లేదు. నేను ఈ క్షణంలో ఏడుస్తున్నా కూడా బ్రహ్మనే. అందువల్ల బ్రహ్మ అయ్యే ప్రసక్తి లేదు.

3. **ఉత్పత్తి** – సరే మోక్షంకోసం ప్రయాణం చెయ్యనవసరం లేదు, కాని మోక్షం అంటే కొత్త రకమైన ఆనందం పొందటం అంటారు కొంతమంది. ఇది లౌకిక ఆనందాలలాంటిది కాదు. మోక్షానందం విషయానందానికి భిన్నంగా ఉంది అంటారు. దీన్ని విలక్షణ ఆనందం అంటారు. విలక్షణ ఆనంద అనుభవః మోక్షః. ఈ విలక్షణ ఆనందంకోసం ఎదురుచూసి అది రాకపోతే మనం నేర్చుకున్నది చాలదు, దానికి సాధన కావాలి అనుకుంటారు. అంటే కొత్త ఆనందం ఉత్పత్తి చెందాలి అనుకుంటారు.

**శంకరులవారి జవాబు** – అది ఎంత విలక్షణమైన ఆనందం అయినా అది ఒక కాలంలో వస్తుంది అంటే ఏమిటి అర్థం? ఇంకొక కాలంలో పోతుంది. ఎంత విలక్షణమైనదైనా, దానికి ఆరంభం ఉంటే అంతం కూడా ఉంటుంది. ఒక సమయంలో వచ్చిన దానిని జన్య ఆనందం అంటారు. అది అనిత్య ఆనందం అవుతుంది. అందువల్ల నిత్య ఆనందం అవదు. ఈ ఆనందంలోకి వెళ్ళటం, రావటం అనేది అనాత్మ లక్షణం. అది మోక్షం కాదు. అది ఎంత గొప్ప ఆనందమైనా సరే దానికొక పుట్టినతేదీ, మరణించేతేదీ ఉంటుంది.

**ప్రశ్న – అభివ్యక్తః** – దీనికి పూర్వపక్షి ఇంకొక వాదన చేస్తాడు. ఈ ఆనందం కొత్తగా వస్తే కదా, రాకపోకలు వచ్చేది. ఈ విలక్షణమైన ఆనందం ముందే ఉంది కాని అంతకు ముందు అభివ్యక్తంగా ఉంది అంటే అవ్యక్తంగా ఉంది. ఇప్పుడు మోక్షం వచ్చాక వ్యక్తమైంది.

**శంకరులవారి జవాబు** – సరే, ముందే ఉన్న ఈ ఆనందం ఆత్మదా, అనాత్మదా?

అనాత్మదయితే దాన్ని విలక్షణమైన ఆనందం అనటానికి వీలులేదు. అది కూడా తక్కిన అనాత్మ ఆనందాలలాంటిది. అది ముందు అవ్యక్తంగా ఉండి, మోక్షంలో వ్యక్తమైనా కూడా అది కూడా విషయానందమే, అది కూడా సంసారంలోకే వస్తుంది. ఒకవేళ ఈ ఆనందం సమాధిస్థితిలో వచ్చినా కూడా, అది మనస్సుకు సంబంధించింది కాబట్టి, సంసారంలోకే వస్తుంది. అది ఇంకా గొప్ప సంసారం అవుతుంది – ఎందుకంటే ఆ ఆనందంలోనే నాకు ఎప్పుడూ ఉండాలి అనిపిస్తుంది. ఎవరితో మాట్లాడలనిపించదు. అసలు కళ్ళే తెరవాలని అనిపించదు. కాని మనస్సు ఎప్పటికీ ఆ స్థితిలో ఉండిపోలేదు. అందువల్ల అది అనాత్మకు చెందింది అంటే అది విషయానందమే అవుతుంది.

ఈ ఆనందం ఆత్మదే అయితే అది కూడా అంగీకరించలేము. ఆత్మ అంటే ఏమిటి? చైతన్యం. ఆత్మలో ఆనందం ఉంటే, అది నిత్యప్రకాశకం, దానికి ఏదీ ఎన్నడూ అడ్డుపడలేదు. ఆత్మలో ఎప్పుడూ ఉన్న ఆనందానికి ఏదీ ఎన్నడూ ఆటంకం కాలేదు. ఆత్మకూ ఆనందానికీ మధ్య దూరం లేదు. అందువల్ల ఆత్మానందం విలక్షణ ఆనందంగా ఎప్పుడో ప్రకటితమయ్యే అవకాశం లేదు. విలక్షణ ఆనందం కూడా విషయానందమే. అందువల్ల

కొత్త ఆనందం ఉత్పత్తి అయ్యే అవకాశం లేదు, అవ్యక్తంనుంచి వ్యక్తమయ్యే అవకాశమూ లేదు. అయితే మోక్షం అంటే ఏమిటి? అవిద్యా నివృత్తి.

4. **సంస్కారః** – అవిద్యానివృత్తి అంటే ఆత్మ సంస్కరించబడినట్టుగా తీసుకోవచ్చు కదా అంటాడు పూర్వపక్షి. అంతకుముందు అవిద్య ఉంది. ఇప్పుడు అవిద్య పోయింది. అవిద్యాసహిత ఆత్మ మోక్షం పొందాక అవిద్యారహిత ఆత్మ అయింది. అంటే మార్పు జరిగింది, సంస్కరించబడింది.

**శంకరులవారి జవాబు** – శంకరులవారు దీనికి రెండు జవాబులు ఇస్తారు.

ఎ) **ఆత్మకు అవిద్య లేదు** – అవిద్యాసహిత ఆత్మ సంస్కరించబడి అవిద్యరహిత ఆత్మ అయింది అనలేము. ఎందుకు? ఆత్మకు అవిద్య లేదు. ఆత్మ అవిద్యను ప్రకాశింపజేస్తుంది. ఆత్మ దేన్ని ప్రకాశింపజేస్తే దానికి ఆత్మ భిన్నంగా ఉంది అంటే అవిద్య ఆబ్జెక్టు అయితే ఆత్మ సబ్జెక్టు. కళ్ళతో ప్రపంచాన్ని చూడగలము కాని, మన కళ్ళలోని తెల్లరంగును కాని, నల్ల గుడ్డును కాని మన కళ్ళతో చూడలేము. అంటే కంటికి సంబంధించిన దానిని కన్ను చూడలేదు. అవునా? అలాగే అవిద్య ఆత్మకు చెందితే ఆత్మ దానిని చూడలేదు. ఆత్మ అవిద్యను చూస్తోంది కాబట్టి అవిద్య ఆత్మకు చెందదు. అందువల్ల ఆత్మ మార్పు చెందదు.

బి) **ఆత్మ సత్యం, అవిద్య మిథ్య** – ఒకవేళ ఆత్మలో అవిద్య ఉందనుకుందాము; అప్పుడు కూడా అవిద్యానివృత్తి ఆత్మలో ఏ విధమైన మార్పు తీసుకురాలేదు. ఎందుకు? అవిద్య మిథ్య, ఆత్మ సత్యం. మిథ్యా అవిద్య నిత్యవిద్యలో ఎటువంటి మార్పు తీసుకురాలేదు.

బ్రహ్మ పారమార్థికం, అవిద్య వ్యావహారికం. అందువల్ల అవిద్య మార్పు తీసుకురాలేదు. తాడుమీద పామును చూసినంత మాత్రాన తాడు ఏమీ మారదు. నేను బ్రహ్మను, ఎప్పటికీ బ్రహ్మను. నేను బ్రహ్మను కాదు అనే అవిద్య నా సత్య బ్రహ్మత్వాన్ని మార్చలేదు. అందువల్ల సంస్కారానికి చోటులేదు. ఐక్యం అంటే తెలుసుకోవటం మాత్రమే. తెలుసుకోవటం తప్ప బాహ్యంగా ఏ విధమైన మార్పూ ఉండదు.

5. **మోక్షం అప్రయోజనం** – ఏమీ జరగదు అంటే మోక్షంవల్ల వచ్చేలాభం ఏమిటి? దానికోసం ఎందుకు కష్టపడాలి?

**శంకరులవారి జవాబు** – మోక్షంవల్ల ఏమీ రాదు అంటే అక్షరాలా ఏమీ రాదు కాని, **వచ్చినట్టుగా** ఉంటుంది. అది చాలా ముఖ్యం. పోయినట్టుగా ఉన్నదాన్ని వచ్చినట్టుగా చేస్తుంది. ఒక వస్తువు నిజంగా పోకుండానే అది పోయిందనుకుని బెంగపడతాము. అదే మన దుఃఖాలన్నిటికీ కారణం. పోయిందనుకున్న వస్తువు పోలేదని తెలిస్తే ఆనందిస్తాము.

ఉదాహరణకు లక్షల విలువ చేసే డైమండు రింగు చేతిలోంచి జారిపడిపోయిందనుకుందాం. అది పోయిందనుకుని చాలా బాధపడి, అందరినీ తిట్టి, గొడవ చెయ్యవచ్చు. ఆ మాటకొస్తే గుండెజబ్బు వచ్చినా రావచ్చు. పోయిందనుకున్న వస్తువు అంత హడావుడి చేసింది. అంతా వెతికాక అది మన పంచెలోనే పడిపోయింది, ఎక్కడికీ పోలేదంటే మన ఆనందానికి అవధులు ఉండవు. అక్కడ వస్తువు నిజంగా పోలేదు కాబట్టి నిజంగా దొరకలేదు. కాని పోయిందనుకున్న ఆందోళన సంసారాన్ని కలుగజేస్తే, దొరికిందన్న ఆనందం మోక్షాన్ని కలుగజేస్తుంది. అది మన బెంగలన్నిటినీ పారద్రోలుతుంది.

సంసారాన్ని ఐదు పేర్లతో నిర్వచించవచ్చు. సంసారం అంటే **అవిద్య, కామం, కర్మ, దుఃఖం, పునర్జన్మ.** ఇవన్నీ అనేకదశల్లో సంసారం. సంసారానికి ఐదు నిర్వచనాలు ఉంటే మోక్షానికి కూడా ఐదు వస్తాయి. వీటినుంచి విముక్తి అని కలుపుకోవటమే – అంటే అవిద్యనుంచి విముక్తి, కామంనుంచి విముక్తి, కర్మనుంచి విముక్తి, దుఃఖంనుంచి విముక్తి, పునర్జన్మనుంచి విముక్తి.

ఒకటి లేకుండా ఇంకొకటి లేదు. అవిద్యానివృత్తి, కామనివృత్తి, కర్మనివృత్తి, దుఃఖనివృత్తి, పునర్జన్మ నివృత్తి – అన్నీ మోక్షంయొక్క నిర్వచనాలు. పునర్జన్మ నివృత్తి దుఃఖనివృత్తి అవందే అవదు; దుఃఖనివృత్తి కర్మనివృత్తి అవందే అవదు; కర్మనివృత్తి కామనివృత్తి అవందే అవదు; కామనివృత్తి అవిద్యానివృత్తి అవందే అవదు. ఇవన్నీ ఒకదానితో ఒకటి పెనవేసుకుని ఉన్నాయి. నేను ఏదో ఒకదానికి ప్రయత్నిస్తాను అంటే కుదరదు. ఇదంతా ఒక ప్యాకేజీలాంటిది. వీటన్నిటికీ మూలకారణం అవిద్య. అవిద్య పోతే, ఇవన్నీ పోతాయి. కాకపోతే ఆరవ మంత్రంలో అవిద్య గురించి చెప్పకుండా దాని కార్యం అయిన కామం గురించి చెప్పటం జరిగింది. మనం అవిద్యను కూడా కలుపుకోవాలి.

ముక్తపురుషుడిని అకామయమాన పురుషః అన్నాడు యాజ్ఞవల్క్యుడు. అతను బ్రతికుండగా జీవన్ముక్తుడు అయి, మరణించాక విదేహముక్తి పొందుతాడు. బ్రహ్మను పొందటం అంటే పోయినట్టుగా ఉన్నదాన్ని పొందినట్టుగా అవుతుందని చూశాము. దీన్నే బ్రహ్మైవ సన్ బ్రహ్మాప్యేతి అంటారు.

ఇక్కడితో బ్రహ్మైవ సన్ బ్రహ్మాప్యేతి భాష్యం అయిపోయింది.

## మంత్రం 4.4.7

**తదేష శ్లోకో భవతి। యదా సర్వే ప్రముచ్యన్తే కామాయేఽస్య హృది శ్రితాః। అథ మర్త్యోఽమృతో భవత్యత్ర బ్రహ్మ సమశ్నుత ఇతి ॥ తద్యథాఽహినిర్ల్వయనీ వల్మీకే మృతా ప్రత్యస్తా శయీతైవమేవేదగ్ం శరీరగ్ం శేతేఽథాయమశరీరోఽమృతః ప్రాణో బ్రహ్మైవ తేజ ఏవ ॥ సోఽహం భగవతే సహస్రం దదామీతి హోవాచ జనకో వైదేహః ॥**

ఇంతకుముందు మంత్రంలో చెప్పిన భావానికి తగ్గట్టుగా ఋగ్మంత్రం ఉటంకిస్తున్నాడు యాజ్ఞవల్క్యుడు.

**తదేష శ్లోకో భవతి** – దీనికి తగ్గ మంత్రం ఉంది. దీనికి తగ్గ మంత్రం అంటే ఏ భావనకు తగ్గ మంత్రం? కామనివృత్తి మోక్షప్రాప్తిః. దానికి అవిద్యానివృత్తి కూడా కలుపుకోవాలని చూశాము. అంటే అవిద్యానివృత్తితో కూడిన మోక్షప్రాప్తి. ఇప్పుడు రాబోయే మంత్రం కఠోపనిషత్తులోనిది.

**సర్వే కామాః ప్రముచ్యంతే** – జ్ఞానికి అన్ని కోరికలు నశించి పోతాయి. ఎక్కడ ఉన్నాయి ఆ కోరికలు?

**హృది శ్రితాః** – హృదయంలో ఉన్నాయి. హృదయం అంటే మనస్సు అని తీసుకోవాలి. కోరికలు మామూలుగా మనస్సును ఉక్కిరిబిక్కిరి చేస్తాయి.

కోరికలు రెండు రకాలు. అవి బంధించే కోరికలు, బంధించని కోరికలు. బంధించే కోరికలు అజ్ఞానం ఉన్న మనస్సులో ఏర్పడతాయి. అజ్ఞానంవల్ల లేదా అపూర్ణత్వంవల్ల ఏర్పడతాయి. నేను అల్పుడిని, నాకు పరిమితి ఉంది అనుకోవటంవల్ల కోరికలు వస్తాయి. అవి తీరకపోతే బాధ కలుగుతుంది, అవి తీరితే ఆనందం కలుగుతుంది.

బంధించని కోరికలు జ్ఞానికి కలిగే కోరికలు. అవి జ్ఞానంనుంచి లేదా పూర్ణత్వంనుంచి వచ్చిన కోరికలు. అజ్ఞాని అపూర్ణత్వంవల్ల కలిగిన కోరిక అతనికి శాపం అయితే, జ్ఞాని పూర్ణత్వంవల్ల కలిగిన కోరిక సమాజానికి వరం. అది ఈశ్వర అనుగ్రహం కింద వస్తుంది.

మోక్షం అంటే కోరికలనుంచి విముక్తి అన్నప్పుడల్లా బంధించని కోరికలనుంచి విముక్తి అని కలుపుకోవాలి. అధార్మిక కోరికలు కానంతవరకూ, బంధించని కోరికలు ఎన్నైనా ఉండవచ్చు. నిజానికి ఇలా బంధించని కోరికలు భగవంతునికి కూడా ఉంటాయి.

**సోఽకామయత బహుస్యాం ప్రజాయేయేతి। స తపోఽతప్యత। స తపస్తప్త్వా – తైత్తిరీయం**

భగవంతుడు కూడా ప్రపంచాన్ని సృష్టించాలని కోరుకున్నాడు. తను అనేకం అవుతాననుకున్నాడు.

**అథ మర్త్యోఽమృతో భవతి** – అప్పుడు మర్త్యుడు అమృతుడవుతాడు. మర్త్యుడు అంటే మరణయోగ్యత ఉన్నవాడు, కాలపరిచ్ఛిన్నం ఉన్నవాడు. అమృతుడు అంటే మరణం లేనివాడు, కాలపరిచ్ఛిన్నం లేనివాడు అవుతాడు.

పరిచ్ఛిన్నుడు అపరిచ్ఛిన్నుడు ఎలా అవుతాడు? అపరిచ్ఛిన్నత కాలంలో జరిగేది కాదు. రేపటినుంచీ నేను శాశ్వతుడిని అవుతాను అనలేము. శాశ్వతత్త్వం భవిష్యత్తులో జరిగే సంఘటన కాదు. అలాంటప్పుడు భవిష్యత్తులో అమృతత్త్వం పొందుతాడు అని ఎలా చెప్పాడు గురువు? అంటే తాను అశాశ్వతం అనుకున్న జీవుడు, తాను శాశ్వతం అని తెలుసుకుంటాడు. అంటే అజ్ఞానంనుంచి జ్ఞానానికి ప్రయాణిస్తాడు.

తమసోమా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ. అందువల్ల అమృతత్త్వం పొందుతాడు అంటే అది ఒక సంఘటన కాదు; ఒక తతంగం కాదు.

**అత్ర బ్రహ్మ సమశ్నుత ఇతి** – బ్రహ్మను పొందుతాడు అంటే జ్ఞానం పొందుతాడు. పొందుతాడు అంటే అహం బ్రహ్మ అస్మి జ్ఞానం పొందుతాడు. ఈ మంత్రం ఇంకో విధంగా చాలా ముఖ్యం. ఇందులో **అత్ర** పదం ముఖ్యమైన పదం. మోక్షం ఇక్కడే దొరుకుతుంది అంటున్నది. అంటే శాస్త్రం జీవన్ముక్తిని అంగీకరిస్తుంది. చాలామందికి మోక్షం పొందటానికి మొదటి అర్హత మరణం. రెండవ అర్హత ఉపాసనచేసి శుక్లగతిద్వారా బ్రహ్మలోకానికి వెళ్ళాలి. అంటే వేరే లోకానికి వెళితేనే మోక్షం కలుగుతుంది అంటారు. కాని అత్ర అంటే అస్మిన్ జీవతి శరీరే అంటే జీవించివున్న ఈ శరీరంలోనే మోక్షం పొందవచ్చు. ఇతి అంటే ఇక్కడితో ఋగ్మంత్రం అయిపోయింది.

మోక్షం అంటే దుఃఖనివృత్తి అన్నాము కదా, శరీరం ఉన్నంతవరకూ బాధలు తప్పవు, నొప్పులు తప్పవు. అలాంటప్పుడు బ్రతికివుండగానే జీవన్ముక్తి పొందుతాడు అని ఎలా చెప్పగలము? దీనికి జవాబు చెప్పబోతున్నాడు యాజ్ఞవల్క్యుడు.

శరీరంవల్ల దుఃఖం ఏర్పడదు; శరీర అభిమానంవల్ల దుఃఖం ఏర్పడుతుంది. శరీరతత్త్వం దుఃఖహేతువు కాదు, శరీర అభిమానం దుఃఖహేతువు. జ్ఞానికి ప్రారబ్ధకర్మ ఇంకా ఉండటంవల్ల ప్రారబ్ధకర్మ కొనసాగుతుంది కాని శరీర అభిమానం పోతుంది.

ప్రతిమనిషికీ రెండు రకాల బాధలుంటాయి. అవి శారీరక బాధలు, మానసిక బాధలు. శారీరక బాధలను తప్పించుకోలేడు. అంటే జ్వరం, తలనొప్పి, కీళ్ళనొప్పులు, ఆకలిదప్పులు అందరికీ ఉంటాయి. కాని వాటికి మనం మానసిక బాధలను కలుపుతాము. అంటే దాని గురించి బెంగ, ఆందోళన, భయంలాంటి అనేక భావాలు తోడవుతాయి. ఉదాహరణకు ఒక పిల్లవానికి జ్వరం వస్తే అతను ఓపిక ఉంటే ఆడుకుంటాడు లేదా పడుకుంటాడు; కాని దాని గురించి వంద ఆలోచనలు పెట్టుకోడు. నాకే ఎందుకు వచ్చింది అనుకోడు.

కాని మనమేం చేస్తాము? ఒక అనారోగ్యం వస్తే, అది ఒక చిన్నచుక్క అనుకుంటే, దాన్ని చుట్టూ మనమే అనేక వలయాలు గీసుకుంటాము. నాకే ఎందుకు వచ్చింది– ఒక వలయం; దానివల్ల ఎంత ఖర్చవుతుందో– ఇంకో వలయం; నాకేదైనా అయితే పిల్లలు చిన్నవారు, వారి పరిస్థితి ఏమిటి– మరో వలయం; దానికి ఇన్స్యూరెన్స్ వస్తుందో రాదో – మరో వలయం. ఇలా బెంగలు, ఆందోళనలతో గోరింతలు కొండంతలు చేసుకుంటాము. జ్ఞాని పరిస్థితి చిన్నపిల్లవాడి పరిస్థితి. ఈ వలయాలను ఏర్పరచుకోడు. నిజానికి ఈ మానసిక వలయాలనే సంసారం అంటారు. అవి ఉండవు జ్ఞానికి. అందువల్ల ఒక్క ముక్కలో చెప్పాలంటే జీవన్ముక్తునికి శరీరం ఉంటుంది కాని శరీర అభిమానం ఉండదు.

జ్ఞానికి శరీర అభిమానం ఉండదు కాబట్టి అతనిని వైదేహః అంటారు. జనకుడిని విదేహః అంటారు. అతనికి దేహ అభిమానం ఉండదు. ఈ విషయాన్ని చెప్పటానికి యాజ్ఞవల్క్యుడు ఒక ఉదాహరణను ఇస్తున్నాడు. పాము కుబుసం విడిచినట్టు జ్ఞాని తన శరీరాన్ని విడుస్తాడు అంటున్నాడు. కాని ఈ ఉదాహరణను మరీ సాగదీయకూడదు. ఎంతవరకూ తీసుకోవాలో అంతవరకే తీసుకోవాలి.

పాము విషయంలో అది కుబుసాన్ని అంటే తన శరీరాన్ని ఏ పుట్టమీదో విడిచి, అది ఇంకొక చోటికి వెళ్ళిపోతుంది. జ్ఞాని తన శరీరాన్ని విడుస్తాడు అంటే అతను కూడా తన శరీరాన్ని ఎక్కడో వదులుతాడని కాదు అర్థం. అతను బుద్ధిలో తన శరీరాన్ని వదులుతాడు. పాము విషయంలో అక్షరాలా జరిగితే, జ్ఞాని విషయంలో బుద్ధిలో జరుగుతుంది.

**అహినిర్ల్వయనీ వల్మీకే** – పాము కుబుసం, పాము నివాసం అయిన పుట్టమీద విడిచి పెట్టబడుతుంది. అహి అంటే పాము; నిర్ల్వయనీ అంటే కుబుసం; వల్మీకే అంటే పుట్ట. పాము తన శరీరాన్ని పుట్టమీద వదిలివేస్తుంది. ఎలా?

**మృతా ప్రత్యస్తా శయీత** – ప్రాణం లేని ఆ కుబుసంమీద పాముకు నేను అనే భావం ఉండదు.

**ఏవమేవ ఇదగ్ం శరీరగ్ం శేతే** – అదే విధంగా జ్ఞాని కూడా శరీర అభిమానం లేకుండా ఉంటాడు. కాకపోతే జ్ఞాని అక్షరాలా శరీరాన్ని వీడడు అని చూశాము. ప్రారబ్ధకర్మ తప్పదు, కాని అతనికి శరీర అభిమానం ఉండదు.

పాము కుబుసం విడిచాక అందులో జీవం ఉండదు. కాని జ్ఞాని అభిమానం విడిచాక కూడా అతని శరీరంలో జీవం ఉంటుంది. కాని అతను పట్టించుకోడు. అప్పుడు జ్ఞానికి ఏమవుతుంది?

**అథ అయమ్ అశరీరః (భవతి)** – జ్ఞాని శరీరం లేనివాడు అవుతాడు.

**అమృతః ప్రాణో బ్రహ్మైవ తేజ ఏవ** – శరీరం అభిమానం లేదు కాబట్టి అమృతుడు అవుతాడు. శాశ్వతం అవుతాడు. ప్రాణః అంటే ప్రాణస్య ప్రాణః అవుతాడు. అంటే ప్రాణానికి ప్రాణతత్త్వం అవుతాడు.

**శ్రోత్రస్య శ్రోత్రం మనసో మనో యద్వాచో హ వాచం స ఉ**
**ప్రాణస్య ప్రాణశ్చక్షుషశ్చక్షురతిముచ్య ధీరాః॥ – కేన**

చెవికి వినికిడి శక్తి, మనస్సుకు ఆలోచించేశక్తి, ప్రాణానికి ప్రాణశక్తి ఆత్మనుంచే వస్తాయి. అందువల్ల ఆత్మ ప్రాణస్య ప్రాణః అయింది. బ్రహ్మైవ అంటే అతనే బ్రహ్మ; తేజ ఏవ అంటే అతనే చిత్ లేదా చైతన్యజ్యోతి. ఇది ఒక మహావాక్యం. జ్ఞాని=బ్రహ్మ అని చూపిస్తున్నది. జీవాత్మ పరమాత్మ ఐక్యాన్ని సూచిస్తున్నది కాబట్టి ఇది మహావాక్యం.

దీనితో మోక్షవర్ణన అయిపోయింది. బోధ అయిపోయినందుకు జనకుడు కూడా చాలా సంతోషించాడు. యాజ్ఞవల్క్యుడు సంసారం గురించి చెప్పాడు, మోక్షం గురించి చెప్పాడు. అందువల్ల మళ్ళీ దక్షిణ ఇస్తానంటాడు.

**సోఽహం భగవతే సహస్రం దదామీతి హోవాచ జనకో వైదేహః** – విదేహరాజైన జనకుడు, ఓ భగవాన్ మీకు వెయ్యి పశువులను ఇస్తాను అన్నాడు.

అంతకుముందు మొత్తం రాజ్యాన్నే ఇస్తానన్నాడు; తనను కూడా అర్పించుకుంటానన్నాడు; ఇప్పుడు వెయ్యి ఆవులే ఎందుకు ఇస్తానంటున్నాడు అని శంకరులవారే ప్రశ్న వేసి, ఆయనే జవాబు కూడా ఇస్తారు. రాజ్యం ఇస్తానంటే, జనకుడు అంతటితో తృప్తి పడ్డాడనుకుని యాజ్ఞవల్క్యుడు వెళ్ళిపోతాడేమో అనుకుని ఉంటాడు. అంటే జనకుడికి ఇంకా వినాలని ఉంది అనుకోవాలి. యాజ్ఞవల్క్యుడు ఇంతవరకూ బ్రహ్మ గురించీ, సంసారం గురించీ, మోక్షం గురించీ చెప్పాడు కానీ సాధన గురించి ఏమీ చెప్పలేదు. అది రాబోయే మంత్రాల్లో వస్తుంది.

## మంత్రం 4.4.8

**తదేతే శ్లోకా భవన్తి । అణుః పన్థా వితతః పురాణో మాగ్ంస్పృష్టోఽనువిత్తో మయైవ ॥ తేన ధీరా అపియన్తి బ్రహ్మవిదస్స్వర్గం లోకమిత ఊర్ధ్వం విముక్తాః ॥**

**తదేతే శ్లోకా భవంతి** – ఈ విషయం గురించి ఈ మంత్రాలు ఉన్నాయి అంటున్నాడు యాజ్ఞవల్క్యుడు. 8–21 వరకు వేరే మంత్రాలను ఇక్కడ ఉటంకిస్తున్నాడు. ఈ విషయం గురించి అంటే ఏ విషయం గురించి?

**కామనివృత్తివల్ల మోక్షప్రాప్తి.** కామాన్ని ఎలా నివారించాలి? కామం దానంతట అది పోదు. కోరికను తీర్చినా పోదు. ఒక కోరిక తీరిస్తే ఇంకొక కోరిక పుట్టుకొస్తుంది. అందువల్ల కోరిక పోవాలంటే దాని మూలకారణాన్ని పోగొట్టాలి. కోరికయొక్క మూలకారణం ఏమిటి? అపూర్ణత్వం. జీవితంలో ఏదో ఒక కొరత ఉంటూనే ఉంటుంది.

ఏ కొరత ఉంది అనేది మారుతూ ఉంటుంది కాని కొరత ఉంటూనే ఉంటుంది. చిన్నపిల్లవాడికి బొమ్మలు కావాలనిపిస్తుంది. యువతకు భార్య, పిల్లలు కావాలనిపిస్తుంది. పెళ్ళయితే ఇంకేదో కావాలనిపిస్తుంది. నేను అపూర్ణంగా ఉన్నంతవరకూ కోరిక పోదు. అపూర్ణత్వం, అజ్ఞానంవల్ల ఏర్పడింది. అజ్ఞానం పోవాలంటే ఆత్మజ్ఞానం ఒక్కటే మార్గం.

కామనివృత్తి = అజ్ఞాన నివృత్తి = జ్ఞానప్రాప్తి.

జ్ఞానమార్గ ఏవ మోక్షమార్గః. జ్ఞానమార్గం మోక్షం పొందే అనేక మార్గాలలో ఒకటి కాదు. జ్ఞానమార్గం ఒక్కటే మోక్షమార్గం. రాబోయే మంత్రాలన్నింటిలోనూ జ్ఞానమార్గం స్తుతించబడింది. గీతలో కూడా రాజవిద్యగా స్తుతించబడింది. ముండకోపనిషత్తు జ్ఞానమార్గాన్ని పరావిద్య అంటుంది.

ఇక్కడ ఈ ఎనిమిదవ మంత్రంలో జ్ఞానం పొందాక ఒక ఋషి అన్న మాటలు వస్తున్నాయి.

**అణుః పంథా** – పంథా అంటే మార్గం. ఇక్కడ జ్ఞానమార్గం. అణుః అంటే చాలా సూక్ష్మమైనది. సూక్ష్మమైన బ్రహ్మ గురించి బోధిస్తుంది కాబట్టి ఈ మార్గం కూడా సూక్ష్మమైనది. అందువల్లనే చాలామంది జ్ఞానమార్గంయొక్క గొప్పతనాన్ని తెలుసుకోలేక అది నేర్చుకుని లాభం ఏమిటి, దాని బదులు నాకు ధ్యానం నేర్పించండి అంటారు. అది వారికి శాస్త్రం గురించి సరియైన అవగాహన లేక చేసిన వ్యాఖ్యానం.

నిజానికి శాస్త్రం అద్దం లాంటిది. అద్దంలోకి ఎంతగా తేరిపారచూస్తే, అంతగా నా మొహం నాకు స్పష్టంగా తెలుస్తుంది. అలాగే శాస్త్రంలోకి ఎంత లోతుగా వెళితే, నా గురించి నాకు అంత బాగా అర్థమవుతుంది. ఈ విషయం తెలిసే అణుః అన్నాడు ఋషి.

**వితతః** – ఈ జ్ఞానమార్గం విస్తీర్ణమైనది. గురుశిష్య పరంపర ఎప్పటినుంచో సాగుతున్నది. ఇది అనాది. సాక్షాత్తూ నారాయణునితో మొదలవుతుంది ఈ పరంపర. అందువల్ల విస్తీర్ణం. దీనికి ఇంకొక అర్థం కూడా ఉంది.

శుక్లయజుర్వేదంలో రెండు శాఖలున్నాయి. అవి కాణ్వశాఖ, మాధ్యందిన శాఖ. రెండింటిలోనూ బృహదారణ్యకోపనిషత్తు ఉంది. కాకపోతే చిన్నచిన్న భేదాలున్నాయి. మనం నేర్చుకుంటున్నది శంకరాచార్యులు భాష్యం రాసిన కాణ్వశాఖకు చెందిన బృహదారణ్యకోపనిషత్తు.

అందులో వితత బదులు వితరః తీసుకున్నారు. తరః అంటే పడవ. పడవ నదిని దాటటానికి తోడ్పడుతుంది. జ్ఞానమనే పడవ సంసారసాగరాన్ని దాటటానికి తోడ్పడుతుంది. శంకరులవారు ఈ శాఖలోంచి కూడా అప్పుడప్పుడు చెబుతారు.

**పురాణః** – సనాతనం. పురా అపి నవః. పాతదయినా ఇప్పటికీ కొత్తది. సాక్షాత్తూ ఆ భగవంతునినుంచే వచ్చింది కాబట్టి ఇది సనాతనం. సృష్టితో పాటు శాస్త్రం కూడా వచ్చింది. అందువల్ల దీన్ని సనాతన ధర్మం అంటారు. ఇక్కడ బ్రహ్మను సనాతనం అనటం లేదు, జ్ఞానమార్గాన్ని సనాతనం అంటున్నాడు ఋషి.

**మాగ్ం స్పృష్టోఽనువిత్తో మయైవ** – నన్ను స్పృశించింది. అంటే నాచే పొందబడింది అని అర్థం. ఇక్కడ ఋషి తన అనుభవాన్ని అద్భుతంగా వర్ణిస్తున్నాడు. నేను జ్ఞానమార్గానికి వెళ్ళాను అనటం లేదు; జ్ఞానమార్గం నాచే

పొందబడింది అంటున్నాడు. అంతేకాదు అనువిత్తో మయైవ అంటున్నాడు. అంటే ఆ జ్ఞానం నాలో పూర్తిగా జీర్ణించుకోబడింది అంటున్నాడు.

ఏ పని చెయ్యాలన్నా ఈశ్వరకృప + మానవయత్నం రెండూ ఉండాలి. ఈశ్వరకృపవల్ల మనకు శాస్త్రం నేర్చుకునే అవకాశం దొరికింది, గురువు దొరికాడు, కాని అంత ఉపయోగకరమైన శాస్త్రాన్ని నేర్చుకుని జ్ఞానం పొందాల్సింది మనమే. మనకు ఆరోగ్యం బాగుండకపోతే, మనవారు డాక్టరును తీసుకువచ్చి వైద్యం చేయించవచ్చు కాని ఆ వైద్యుడు ఇచ్చిన మందును నోటిలో వేసుకుని, మింగవలసింది మనమే. అలా శాస్త్రకృప, గురుకృప, ఈశ్వరకృప ఉన్నా కూడా శాస్త్రాన్ని అనువేదనం అంటే జీర్ణించుకోవాల్సింది మనమే. శాస్త్రాన్ని జీర్ణించుకోవాలంటే మననం, నిదిధ్యాసనం చెయ్యాలి.

మామ్స్పృష్టః శ్రవణాన్ని సూచిస్తే, అనువిత్తో మయైవ మననం, నిదిధ్యాసనాలను సూచిస్తుంది. అతను జీర్ణించుకున్నాను అంటే నేను మోక్షం పొందాను అని కూడా అన్నట్టుగా కలుపుకోవాలి. ఇక్కడ ఋషి పేరు చెప్పలేదు.

**ఇతి త్రిశంకోర్వేదానువచనమ్ – తైత్తిరీయమ్**

జ్ఞానం పొంది ఆనందం పొందిన త్రిశంకు అనే ఋషి తన ఆనందాన్ని ఇలాగే ప్రకటిస్తాడు.

ఈ ఋషే కాదు, జ్ఞానమార్గానికి వచ్చిన ఎందరో మోక్షాన్ని పొందారు. కాని అందరూ ఈ మార్గానికి రారు. చాలామందికి శాస్త్రంయొక్క గొప్పదనం తెలియదు. వారికి మోక్షంమీద ఆసక్తి ఉంటుంది కాని, శాస్త్రంద్వారా పొందాలని తెలియదు. వారు ధ్యానం ముఖ్యం అనుకుంటారు కాని జ్ఞానం మాత్రమే మార్గం అని ఉపనిషత్తే చెబుతుంది.

**ధీరాః బ్రహ్మవిదః స్వర్గం లోకమ్ అపియన్తి** – ధీరాః అంటే వివేకవంతులు. వేదాంత విచారణద్వారానే మోక్షం పొందగలమని తెలుసుకుని, బ్రహ్మ గురించి నేర్చుకున్నవారు బ్రహ్మవిదులు అవుతారు. బ్రహ్మవిదులు స్వర్గలోకానికి వెళతారు. ఈ వాక్యాన్ని అక్షరాలా తీసుకోకూడదు. శంకరులవారు చెబుతారు, స్వర్గలోకం అంటే మోక్షం లేదా బ్రహ్మను పొందుతారు.

**స్వర్గలోకే ప్రతితిష్ఠతి – కేన**

అక్కడ కూడా స్వర్గలోకం అంటే బ్రహ్మను పొందుతారు. స్వయంప్రకాశక బ్రహ్మను పొందుతారు అని అర్థం. ఎప్పుడు?

**ఇతః ఊర్ధ్వమ్** – మరణానంతరం పరంబ్రహ్మను పొందుతారు. అంటే విదేహముక్తిని పొందుతారు. అంటే బ్రతికి ఉండగా లాభం లేదా? మరణం తర్వాత ఏమవుతుందో నాకు అనవసరం. ఇప్పుడు పనికివచ్చేది చెప్పండి అనవచ్చు ఎవరైనా. అందువల్ల,

**విముక్తాః (సంతః)**– బ్రతికి ఉండగా జీవన్ముక్తి పొంది, మరణించాక విదేహముక్తి పొందుతారు. విముక్తాః సంతః అంటే జీవన్ముక్తి పొందుతారు. ఆ విధంగా జ్ఞానమార్గ ఫలం జీవించి ఉండగా జీవన్ముక్తి, మరణించాక విదేహముక్తి.

## మంత్రం 4.4.9

**తస్మిఇఞ్ఛుక్లముత నీలమాహుః పిఙ్గలగ్ం హరితం లోహితం చ। ఏష పన్థా బ్రహ్మణా హానువిత్తస్తేనైతి బ్రహ్మవిత్పుణ్యకృత్తైజసశ్చ ॥**

21వ మంత్రం వరకూ జ్ఞానమార్గ స్తుతి అని చూశాము. అందువల్ల ఈ మంత్రంలో కూడా అదే అంశం వస్తుంది. ముందు మంత్రంలో ఎక్కువమంది జ్ఞానమార్గానికి రారు, ఎందుకంటే అది చాలా సూక్ష్మమైనది అని చూశాము. మోక్షమార్గం గురించి కొన్ని అపోహలు ఉన్నాయి. వాటిని ఇక్కడ చూస్తాము. సగుణ ఉపాసకులు కొందరు ఉంటారు. వారు కూడా వేదాలను, ఉపనిషత్తులను అధ్యయనం చేసివుంటారు, భాష్యాలు రాసివుంటారు కాని, వారి సిద్ధాంతం ప్రకారం సగుణబ్రహ్మ సత్యం; నిర్గుణబ్రహ్మ లేదు.

సగుణబ్రహ్మను చేరుకోవటానికి మరణానంతరం జీవాత్మ అనేక నాడులద్వారా ప్రయాణిస్తుంది. బ్రహ్మ ఉపాసకుడు, సుషమ్నానాడినుంచి బయటకు వచ్చి, శుక్లగతిద్వారా బ్రహ్మలోకానికి వెళతాడని చూశాము చాలాసార్లు. సుషుమ్నానాడే కాక, అనేక నాడులు ఉన్నాయని, వాటికి అనేక రంగులున్నాయని కొందరు అంటారు.

**తస్మిన్ శుక్లముత నీలమాహుః పింగలగ్ం హరితం లోహితం చ** – ఆ మోక్షమార్గాన్ని కొందరు తెలుపు అని, కొందరు నీలం అని, కొందరు పసుపు అని, కొందరు ఆకుపచ్చ అని, కొందరు ఎరుపు అని అంటున్నారు. సుషుప్తి గురించి చూసినప్పుడు ఈ రంగుల గురించిన చర్చ 4.3.20లో వచ్చింది. అక్కడ ఆయుర్వేదం ప్రకారం ఎలా అనేక రంగులు వస్తాయో చూశాము.

ఒక్కొక్క నాడీ, ఒక్కొక్క దేవలోకానికి ఈ జీవాత్మను తీసుకెళుతుంది. చంద్రలోకానికి, సూర్యలోకానికి అలా ఏదో ఒక లోకానికి. ఏమిటి సమస్య? వీరంతా ఈ నాడీమార్గాలే మోక్షమార్గాలు అనుకుంటారు. నిజానికి విశిష్టాద్వైతం జీవన్ముక్తిని ఒప్పుకోదు. జీవుడు ప్రయాణం చేసి వెళ్ళాలి అంటుంది.

అలా చాలామంది చాలా రకాల మార్గాలను చెబుతారు. అన్ని రంగుల మార్గాల్లో ఏది సరియైన మార్గం? దీనికి ఉపనిషత్తు జవాబు చెప్పదు కాని శంకరులవారు జవాబు చెబుతారు. ఏ రంగు మార్గం సరియైన మార్గం అని ప్రశ్న. దానికి జవాబు అసలు మోక్షానికి మార్గమే లేదు. మార్గం ఉంటేనే కదా, ఏ రంగు అనే చర్చ వచ్చేది. మార్గమే లేనప్పుడు, మార్గంయొక్క వర్ణన గురించిన ప్రశ్న ఎక్కడ్నుంచి వస్తుంది? జ్ఞానికి ప్రయాణం లేదు, అందువల్ల మార్గమూ లేదు. ఇది శంకరులవారు ఇచ్చిన జవాబు. నిజానికి ఇది ఆయన స్వంత జవాబు కాదు.

ఈ ఉపనిషత్తులోనే 3.12.11 లో 4.4.6 లో ఈ విషయం వివరంగా వచ్చింది. **తస్య ప్రాణ న ఉక్రామంతి** జ్ఞాని సూక్ష్మశరీరం, స్థూలశరీరంనుంచి పైకి రాదు. అలాంటప్పుడు ఏ నాడిద్వారా ప్రయాణం చేస్తుందనే ప్రశ్నకి చోటేది? జ్ఞానమార్గం ఒకటే మోక్షానికి దారి తీస్తుంది.

**ఏష పంథా బ్రహ్మణా హానువిత్తః** – బ్రహ్మణా అంటే బ్రాహ్మణుడు కాదు. జ్ఞానమార్గంద్వారా బ్రహ్మను పొందిన జ్ఞాని. జ్ఞాని బ్రహ్మను జ్ఞానమార్గంద్వారా పొందుతాడు. అను అంటే గురు ఉపదేశంద్వారా పొందుతాడు. 'హ' ఆనందాన్ని సూచిస్తుంది. నా జన్మ ధన్యమైంది అనే భావాన్ని కలుగజేస్తుంది.

బ్రహ్మణా అంటే బ్రాహ్మణుడు మాత్రమే జ్ఞానం పొందగలడా అని సందేహం రావచ్చు. బ్రాహ్మణుడు అంటే జాతిబ్రాహ్మణుడు కాదు, గుణబ్రాహ్మణుడు. గుణబ్రాహ్మణుడు అంటే సాధనచతుష్టయసంపన్నుడు. సాధన చతుష్టయసంపత్తిని పొందకపోతే జాతి బ్రాహ్మణుడు కూడా బ్రాహ్మణుడు కాలేడు. సాధనచతుష్టయసంపత్తిని పొందితే, బ్రాహ్మణేతరుడు కూడా గుణబ్రాహ్మణుడు అవుతాడు. గుణబ్రాహ్మణుడు ఎలా అవ్వాలో ఈ మంత్రంలో వస్తుంది.

**పుణ్యకృత్ తైజసః చ** – పుణ్యకర్మ చేసి ఉండాలి. కర్మయోగంచేసి తేజోమయంగా ఉండాలి అంటే శుద్ధ అంతఃకరణ ఉండాలి.

గుణబ్రాహ్మణుడు అవటానికి మొదటి అడుగు కర్మ. అందువల్ల వేదం, ముందు కర్మకాండతో మొదలుపెట్టి తర్వాత జ్ఞానకాండకు వస్తుంది. పుణ్యకృత్ అయితే తైజస అవుతాడు. అంటే కర్మయోగం చేస్తే సాధనచతుష్టయ సంపన్నుడు అవుతాడు. తైజస అయ్యాక త్వరలోనే బ్రహ్మవిత్ అవుతాడు. బ్రహ్మజ్ఞాని అయితే ఏమవుతుంది?

బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి – బ్రహ్మ అవుతాడు.

## మంత్రం 4.4.10

**అన్ధం తమః ప్రవిశన్తి యేఽ విద్యాముపాసతే ।**
**తతో భూయ ఇవ తే తమో య ఉ విద్యాయాగ్ం రతాః ॥**

ముందు రెండు మంత్రాల్లో జ్ఞానమార్గం స్తుతించబడింది. ఇప్పుడు ఈ రెండు మంత్రాల్లో అంటే 10, 11లలో జ్ఞానమార్గంకాని మార్గాలు నిందించబడుతున్నాయి. జ్ఞానమార్గాన్ని విద్యామార్గం అంటారు. తక్కిన వాటిని అంటే కర్మ, ఉపాసన, అష్టాంగయోగంలాంటి వాటిని అవిద్యామార్గం అంటారు. ఎందుకు? అవిద్యవల్ల అతను సంసారంలోనే ఉంటాడు తప్ప జ్ఞానం పొందడు. అంతకుముందు దుఃఖంతో నిండిన సన్యాసి అయితే, ఇప్పుడు ప్రశాంతతతో కూడిన సంసారి అవుతాడు. అంతకుముందు అభక్త సంసారి అయితే, ఇప్పుడు భక్తసంసారి అవుతాడు. అంతే తేడా. కర్మ, ఉపాసనలు ఒక వ్యక్తి హోదాను పెంచుతాయేమో కాని అతని అజ్ఞానాన్ని పారద్రోలవు.

ఈ మంత్రం ఈశావాస్యోపనిషత్తులోనిది. కాకపోతే అక్కడ సందర్భం వేరు, ఇక్కడ సందర్భం వేరు. అందువల్ల అర్థంలో చిన్న తేడా ఉంది. ఆ తేడా తర్వాత చూద్దాము. ఉపనిషత్తుల్లో జ్ఞానాన్ని స్తుతించటంకోసం కర్మ, ఉపాసనలను విమర్శించటాన్ని తరచు చూస్తుంటాము. దీన్ని నహినిందా న్యాయం అంటారు.

**నహినిందా న్యాయం** – దేన్నైనా నిందించేది, దాన్ని నిందించటంకోసం కాదు, ఇంకొక దాన్ని స్తుతించటం కోసం.

**నిందా న నింద్యార్థ్యం పరంతు అన్యస్తుత్యర్థమ్**

ఆ విధంగా కర్మకాండను కాని, ఉపాసనా కాండను కాని విమర్శిస్తే అది వాటిని నిందించటానికి కాదు, జ్ఞానాన్ని స్తుతించటానికి అని అర్థం చేసుకోవాలి.

**కర్మ ఉపాసన ఖండనం న తు కర్మ ఉపాసన ఖండనార్థం, పరంతు జ్ఞానస్తుత్యర్థమ్**

ఎందుకు కర్మ, ఉపాసనలు జ్ఞానంకన్నా తక్కువ? అవి మోక్షాన్ని ఇవ్వలేవు. ఒక వ్యక్తిని సంసారంనుంచి విముక్తిడిని చెయ్యలేవు. అంటే కర్మ, ఉపాసనలు సాధకుడిని సంసారంలోనే ఉంచేస్తాయి, అది ఎంత గొప్ప కర్మ అయినా అవనీ, ఎంత గొప్ప ఉపాసన అయినా అవనీ. ఈ విషయం తెలియజేయటానికి ఉపనిషత్తు తనదైన శైలిలో చెబుతున్నది.

మామూలుగా నరకం అంటే పాతాళలోకాలు. వాటిలో దుఃఖం ఉంటుంది అని మన అవగాహన. అవునా? ఇక్కడ ఉపనిషత్తు స్వర్గలోకాలు కూడా దుఃఖభూయిష్టమైనవే అంటున్నది. ఇంద్రలోకంలో బృహస్పతిని చూసి ఇంద్రుడు ఈర్ష్యపడితే, ఇంద్రుడిని చూసి వరుణుడు, అగ్ని ఈర్ష్య పడవచ్చు. ఎక్కడ తారతమ్యం ఉంటుందో అక్కడ దుఃఖం ఉంటుంది. 14 లోకాల్లో తారతమ్యాలు ఉంటాయి కాబట్టి దుఃఖంలో కూడా తారతమ్యం ఉంటుంది.

ఈ మంత్రం అర్థాన్ని ముందు ఈశావాస్యోపనిషత్తు అర్థంతో చూద్దాము.

**అంధం తమః ప్రవిశంతి యేఽ విద్యాముపాసతే** – ఎవరైతే అవిద్యను ఉపాసిస్తారో వారు కన్ను కానరాని చీకటి లోకాలకు వెళతారు. ఇక్కడ అవిద్య అంటే కర్మ.

**తతో భూయ ఇవ తే తమో య ఉ విద్యాయాగ్ం రతాః** – ఎవరైతే విద్యలో రమిస్తారో, వారు అంతకంటే దట్టమైన చీకటి లోకాలకు వెళతారు. ఇక్కడ విద్య అంటే జ్ఞానం కాదు, ఉపాసన.

మామూలుగా మనకు తెలిసినదేమిటి? కర్మ చేసినవారు స్వర్గలోకానికి వెళతారు; ఉపాసన చేసినవారు శుక్లగతిద్వారా అన్నిటికన్నా శ్రేష్ఠమైన బ్రహ్మలోకానికి వెళతారని. కాని ఈశావాస్యోపనిషత్తు ఏమంటోంది? కర్మ చేసినవారు చీకటి లోకానికి, ఉపాసన చేసినవారు ఇంకా చీకటి లోకానికి వెళతారు అంటున్నది. తమః అంటే నరకలోకం లేదా దుఃఖలోకం. గీతలో 16వ అధ్యాయంలో కామక్రోధాలు నరకద్వారం అంటాడు కృష్ణపరమాత్మ. తమోద్వారం పదం తర్వాత వాడతాడు. నరకం, తమస్సు రెండూ పర్యాయ పదాలు.

ఎందుకు పుణ్యలోకాలను నరకం, చీకటి లోకాలు అంటున్నది? మోక్షం దృష్ట్యా అది నరకం. జ్ఞానం పొందకుండా కర్మ, ఉపాసనలు చేస్తే ఫలితం పొందరని చెప్పటానికి 14 లోకాలనూ నరకం అనేసింది ఉపనిషత్తు

అంధం తమః అని ఎందుకు అంది? అంధం అంటే కన్ను కనిపించని చీకటి లోకాలు. చీకటి అజ్ఞానానికి సూచన. ఆత్మ గురించిన అజ్ఞానం స్వర్గలోకంలో కూడా కొనసాగుతుంది. నాకు ఆత్మ గురించి అజ్ఞానం ఉంటే, నేను చేసుకున్న పుణ్యంవల్ల స్వర్గలోకానికి వెళ్ళినా కూడా అజ్ఞానం కొనసాగుతుంది. అందువల్ల అది కూడా చీకటి లోకమే అవుతుంది.

వేదాంతపరిభాషలో జ్ఞానదృష్ట్యా పుణ్యం కూడా పాపమే. పాపం చేస్తే పాపాన్ని అనుభవించటానికి మళ్ళీ జన్మని ఎత్తాలి; పుణ్యం చేసినా కూడా పుణ్యక్షయంకోసం మళ్ళీ జన్మని ఎత్తాలి. అందువల్ల పాపం అంటే పుణ్యం కూడా వస్తుంది. అలా అజ్ఞానంవల్ల పుణ్యలోకాలు కూడా చీకటి లోకాలలాగానూ, నరకంగానూ ఉంటాయి అంటున్నది ఉపనిషత్తు. ఇప్పుడు ఇదే మంత్రాన్ని బృహదారణ్యకోపనిషత్తు సందర్భంతో మళ్ళీ చూద్దాము.

**అంధం తమః ప్రవిశంతి యేఽవిద్యాముపాసతే** – ఎవరైతే అవిద్యను ఉపాసిస్తారో వారు కన్ను కానరాని చీకటి లోకాలకు వెళతారు. ఇక్కడ అవిద్య అంటే కర్మ + ఉపాసన.

**తతో భూయ ఇవ తే తమో య ఉ విద్యాయాగ్ం రతాః** – ఎవరైతే విద్యలో రమిస్తారో, వారు ఇంతకంటే దట్టమైన చీకటి లోకాలకు వెళతారు. ఇక్కడ విద్య అంటే కేవలం కర్మ, ఉపాసనల జ్ఞానం.

నిజానికి ఈశావాస్యోపనిషత్తులోని అర్థం కూడా ఇక్కడ సరిపోతుంది. కాని శంకరులవారు దీన్ని ఇంకా లోతుగా విశ్లేషించి, మరింత గంభీరమైన అర్థాన్ని వివరించారు. ఈశావాస్యంలో అవిద్య అంటే కర్మ అనీ, విద్య అంటే ఉపాసన అనీ చూశాము కదా. ఇక్కడ శంకరులవారు అవిద్యలోనే కర్మ + ఉపాసన తీసుకున్నారు. దీన్ని అపరావిద్య అంటారు. అపరావిద్య అంటే జ్ఞానమార్గానికి అన్యమైన మార్గం. అవిద్యను ఇక్కడ అజ్ఞానంగా తీసుకోకూడదు. విద్య అంటే జ్ఞానమార్గం, అవిద్య అంటే జ్ఞానమార్గంకి భిన్నంగా ఉన్నవన్నీ – జపం, పూజ, ప్రాణాయామం, దానంలాంటివి – ఇవన్నీ కర్మ లేదా ఉపాసనల కిందకి వస్తాయి.

అందువల్ల మొదటి పాదంలోని అవిద్య కింద కర్మ, ఉపాసన రెండూ తీసుకున్నారు శంకరులవారు. విద్య అంటే మామూలుగా జ్ఞానమార్గం; కొన్నిసార్లు ఉపాసన వస్తుంది. కాని ఇక్కడ శంకరులవారు కర్మ, ఉపాసనలకు చెందిన జ్ఞానం అని తీసుకున్నారు. ముందే ఇది నహినిందా న్యాయమనీ, కర్మ ఉపాసనలను నిందించటం వాటిని నిందించటంకోసం కాదనీ, జ్ఞానమార్గాన్ని స్తుతించటానికి అనీ చూశాము. ఇది కర్మ నింద కాదు జ్ఞానస్తుతి.

కర్మ, ఉపాసనలు చేసినవారు చీకటి లోకాలకు వెళితే, కర్మ ఉపాసనలను గురించి మాత్రమే నేర్చుకున్నవారు ఇంకా చీకటి లోకాలకు వెళతారు. ఇక్కడ కర్మ, ఉపాసనల ప్రాముఖ్యత గురించి సరిగ్గా అర్థం చేసుకోవాలి.

### కర్మ, ఉపాసన చెయ్యందే జ్ఞానమార్గం అసంభవము
### జ్ఞానమార్గానికి రానిదే కర్మ, ఉపాసనలు అసంపూర్ణము

కొంతమంది జ్ఞానం పొందితే చాలు కర్మ, ఉపాసనలు చెయ్యనవసరం లేదు అనుకుంటారు. వారు జీవితంలో చాలా పెద్ద పొరపాటు చేస్తున్నారు. వారి వ్యక్తిత్వంలో మార్పు రాదు. వారు కర్మ ఉపాసనలను నిందించి, కర్మ ఉపాసనలను త్యాగం చేస్తే, చిత్తశుద్ధి పొందలేరు. చిత్తశుద్ధి పొందకపోతే జ్ఞానయోగ్యతా ప్రాప్తి కలగదు. అప్పుడు జ్ఞానం ఎంత నేర్చుకున్నా అది వంటబట్టదు. అలాగని కర్మ, ఉపాసనల దగ్గరే ఆగిపోయినా జీవితం పరిపూర్ణం కాదు. అందువల్ల జీవితంలో సమతుల్యత పాటించాలి. ఎలా? కర్మ, ఉపాసనల అవసరమూ తెలుసుకోవాలి, వాటి పరిమితీ తెలుసుకోవాలి. కేవలం వాటిలోనే ఉండి పోవటం తప్పే. వాటిని నిందించటమూ తప్పే. జ్ఞానం, కర్మల రెండింటి మధ్య సమతుల్యత ఉండాలి.

పోల్ వాల్టింగ్ చేసే వ్యక్తి కర్ర పుచ్చుకుని పరుగెత్తుకు వచ్చి, కర్రను వదిలేసి, గోడమీదనుంచి దూకుతాడు. ఇంతవరకూ కర్ర ఉపయోగపడింది కదా అని కర్రను పట్టుకుని ఉంటే గోడమీదనుంచి దూకలేడు. అలాగని ఎలాగూ కర్రను వదిలేస్తున్నాను కదా అని అసలు పట్టుకోకపోయినా విజయం సాధించలేడు. కర్రను పట్టుకోవాలి, అనువైన సమయంలో వదలాలి. అలాగే కర్మ, ఉపాసనలను పట్టుకోవాలి, అనువైన సమయంలో వదలి జ్ఞానమార్గానికి రావాలి.

## మంత్రం 4.4.11

**అనన్దా నామ తే లోకా అన్ధేన తమసాఽఽవృతాః ।**
**తాగ్ంస్తే ప్రేత్యాభిగచ్ఛన్త్యవిద్వాగ్ంసోఽబుధో జనాః ॥**

ఈ మంత్రంలో మొదటి పాదం ఇంచుమించుగా కఠోపనిషత్తులోనిది.

**అనన్దా నామ తే లోకా అన్ధేన తమసాఽఽవృతాః** – చీకటితో నిండిన అనందములు అని పేరున్న లోకాలకు తన తండ్రి వెళతాడని నచికేతుడు అనుకుంటాడు అందులో. తన తండ్రి వాజశ్రవసుడు యజ్ఞంలో దానంగా వట్టిపోయిన ఆవులను ఇస్తే, నచికేతుడు తన తండ్రి చీకటి లోకాలకు వెళతాడు అనుకుంటాడు. అదే అర్థం ఇక్కడ కూడా.

ఇంతకుముందు మంత్రంలో కర్మ, ఉపాసన నింద వస్తే, ఇక్కడ అవిద్యానింద జరుగుతున్నది. అవిద్య అంటే ఇక్కడ అజ్ఞానం. అజ్ఞాననింద, అజ్ఞానులను నిందించటంద్వారా జరుగుతున్నది. అజ్ఞానులు 14 లోకాలకు వెళతారు, అవి దుఃఖభూయిష్టమైనవి, సంసార పరిధిలోకి వచ్చేవి.

అనన్దా నామ – దీన్ని సరిగ్గా చూడాలి. ఆనందం కాదు; అనందం. నందం అంటే ఆనందం; అనందం అంటే ఆనందం లేని లోకం. అంటే దుఃఖభూయిష్టమైన లోకం. ఇంతకు ముందు చూసినట్టు నరకం మాత్రమే దుఃఖభూయిష్టలోకం కాదు, వేదాంతం ప్రకారం 14 లోకాలూ అందులోకే వస్తాయి. అనందం ఆ లోకాలకు విశేషణం కాదు. దాని పేరు. వాటి ప్రత్యేకత ఏమిటి?

**అన్ధేన తమసా ఆవృతాః** – కన్ను చీల్చుకున్నా కనబడని చీకటి లోకాలు. నిజానికి స్వర్గలోకాలు చాలా ప్రకాశవంతంగా ఉంటాయి. అందువల్ల చీకటిలోకాలు అంటే అక్షరాలా చీకటి నిండి ఉంటుందని కాదు అర్థం. అవి అజ్ఞానంతో నిండిన లోకాలని అర్థం.

మనలో అజ్ఞానం ఉంటే, మనం ఎక్కడికి వెళ్ళినా అది మన వెన్నంటి వస్తుంది. లోకం మారినంత మాత్రాన అజ్ఞానం మారదు. అజ్ఞానం ఎలా పోతుంది? జ్ఞానం పొందితేనే పోతుంది.

**అవిద్వాగ్ంసః తాన్ తే ప్రేత్య అభిగచ్ఛంతి** – అజ్ఞానులు మరణం తర్వాత ఈ లోకాలకు వెళతారు. అవిద్వాంసః అంటే అజ్ఞానులు. కాని అంతటితో తృప్తి చెందలేదు ఉపనిషత్తు.

**అబుధః జనాః** – వారి అజ్ఞానాన్ని సూచించటానికి అబుధః అని ఇంకొక పదం వేసింది. అవిద్య అన్నా అబుధ అన్నా అజ్ఞానమే. వీటి మధ్యనున్న సూక్ష్మభేదాన్ని వివరిస్తున్నారు శంకరులవారు. మొదటిపదం అజ్ఞానాన్ని

సూచిస్తే, రెండవపదం ఆత్మ అజ్ఞానాన్ని సూచిస్తున్నది. అందువల్ల అజ్ఞానులు, ఆత్మ అజ్ఞానులు చీకటి లోకాలకు వెళతారు.

### మంత్రం 4.4.12

**ఆత్మానం చేద్విజానీయాదయమస్మీతి పూరుషః ।**
**కిమిచ్ఛన్ కస్య కామాయ శరీరమనుసంజ్వరేత్ ॥**

ముందు రెండు మంత్రాలు జ్ఞానమార్గాన్ని పరోక్షంగా స్తుతించాయి. అంటే కర్మ, ఉపాసనలను అవిద్యను నిందించటంద్వారా జ్ఞానాన్ని స్తుతించాయి. ఇక్కడినుంచి ప్రత్యక్షంగా జ్ఞానమార్గస్తుతి వస్తుంది.

**పూరుషః ఆత్మానం విజానీయాత్ చేత్** – చేత్ అంటే ఒకవేళ. ఒకవేళ ఎవరైనా ఆత్మ గురించి తెలుసుకుంటే. ఒకవేళ తెలుసుకుంటే, అంటే జ్ఞానం పొందటం అంత తేలిక కాదు. ఇది దుర్లభం.

**ఆశ్చర్యవత్పశ్యతి కశ్చిదేనమ్ ఆశ్చర్యవద్వదతి తథైవ చాన్యః ।**
**ఆశ్చర్య వచ్చైనమన్యః శృణోతి శ్రుత్వాప్యేనం వేద న చైవ కశ్చిత్ ॥** – **గీత 2.29**

పూరుష అంటే పురుషుడు. దీన్ని ఛాందసప్రయోగం అంటారు. అంటే వేదంలోనే చూస్తాము. ఆత్మను తెలుసుకుంటే ఆత్మ అంటే బ్రహ్మ. ఎలా తెలుసుకుంటే?

**అయమస్మి** – అయం అంటే అహం అని తీసుకోవాలి. అహం బ్రహ్మ అస్మి అని తెలుసుకోవాలి. బ్రహ్మ ఉన్నాడని తెలుసుకుంటే అది పరోక్షజ్ఞానం అవుతుంది. బ్రహ్మ నాలో ఉన్నాడని తెలుసుకున్నా కూడా అది పరోక్షజ్ఞానమే అవుతుంది. బ్రహ్మ బయటా లేడు, లోపలా లేడు; నేనే ఆ బ్రహ్మను అని తెలుసుకోవటం అపరోక్షజ్ఞానం అవుతుంది. ఇది శ్రవణ, మనన, నిదిధ్యాసనలద్వారా సాధ్యమవుతుంది. పరోక్షజ్ఞానం మోక్షాన్ని ఇవ్వదు. బ్రహ్మకు, నాకు కాస్త దూరం ఉందనుకున్నా కూడా, భయం తప్పదు. మోక్షం అంటే ఏమిటి? అన్ని రకాల మానసిక భయాలనుంచి విముక్తి పొందటం.

పంచదశిలో విద్యారణ్యులవారు ఈ మంత్రాన్ని తీసుకుని, ఒక్కొక్క పదాన్నీ వివరంగా విశ్లేషించారు. దాన్ని తృప్తిదీప ప్రకరణం అంటారు. 297 శ్లోకాలు ఉన్నాయి అందులో. చేత్, అయం పదాలను కూడా విపులంగా చర్చించారు.

**శరీరమనుసంజ్వరేత్** – సంజ్వరేత్ అంటే శారీరక నొప్పులు; అను అంటే మానసిక బాధ. శారీరక బాధలతో పాటు మానసిక బాధలు ఎలా అనుభవిస్తాము?

శారీరక బాధలు మనం చేసే అనేక కర్మల రూపంలో వస్తాయి. కర్మ చెయ్యటానికి ఒకరకమైన బాధ పడితే, కర్మఫలాన్ని అనుభవించటంలో ఇంకొక రకమైన బాధ అనుభవిస్తాము. ఆ విధంగా శారీరక బాధలు కర్తగా అనుభవిస్తే, మానసిక బాధను భోక్తగా అనుభవిస్తాము.

ఇంతకుముందు మంత్రాల్లో చూశాము. ప్రతి మనిషికీ రెండు రకాల బాధలుంటాయి. అవి శారీరక బాధలు, మానసిక బాధలు. శారీరక బాధలను తప్పించుకోలేము. జ్ఞాని కూడా తప్పించుకోలేడు. కాని నాకే ఎందుకు వచ్చిందని మనం గోరంతలు కొండంతలు చేసుకుని వాపోతాము. లేదా ఏదైనా పనిలో విజయం పొందితే పొంగిపోతాము; ఓటమి వస్తే కృంగిపోతాము. జ్ఞానం పొందిన వ్యక్తికి శారీరక బాధలు తొలగిపోవు, కాని మానసిక బాధ పోతుంది.

జ్ఞాని బాహ్యంగా కర్మలు చేస్తూనే ఉంటాడు కాని వాటి ఫలితాలకు చలించడు. దయానందస్వామీజీ అంటారు 'జ్ఞాని కర్మలు ఆంతర శాంతితో కూడివుంటాయి; అతను చేసే కర్మలు చేస్తూనే ఉన్నా, ఎన్నడూ ఆందోళనకు కాని బాధకు కాని గురికాడు.' దీన్ని జీవన్ముక్తి అంటారు. అతను పూర్ణత్వాన్ని అనుభవిస్తున్నాడు. శాంతి, భద్రతలను అనుభవిస్తున్నాడు. అలాంటప్పుడు లౌకిక జయాపజయాలు అతన్ని బాధించవు. ఎంతసేపూ ఎదుటివారు మెచ్చుకోవాలని తాపత్రయపడతాము, మన వేషధారణలు కూడా దానికి తగ్గట్టుగా ఉంటాయి. ఎందుకు? మన గురించి మనం తక్కువగా అంచనా వేసుకుంటాము కాబట్టి. జ్ఞానికి ఆ బాధలేదు. అతను ఎప్పుడూ పూర్ణత్వాన్ని అనుభవిస్తాడు. అందువల్ల అతనికి అహంభావం ఉండదు. తను **నిత్యశుద్ధ, ముక్త పురుషుడిని** అని తెలుసుకుంటాడు. అనుకుంటాడు కాదు తెలుసుకుంటాడు.

**కిమిచ్ఛన్ శరీరమ్ అనుసంజ్వరేత్** – ఏం కోరి, శరీరంతో అవస్థ పడతాడు? జ్ఞాని పూర్ణత్వం అనుభవిస్తాడు కాబట్టి అతనికి ఏ కోరికలూ ఉండవు.

**కస్య కామాయ (శరీరమ్ అనుసంజ్వరేత్)** – ఎవరి ప్రయోజనం కోరి పని చేస్తాడు?

మనం రెండు కారణాలకోసం జీవితంలో కష్టపడతాముట – మనకోసం, మనవారికోసం; జ్ఞాని తనకోసం కష్టపడనవసరం లేదు, ఎందుకంటే అతను పూర్ణుడు. వేరే వారికోసం కష్టపడవచ్చు కదా? జ్ఞాని అద్వైతంలో నిలుస్తాడు. అద్వైతదృష్టిలో రెండో సత్యవస్తువు లేదు, రెండో సత్యవస్తువు లేకపోయినా మిథ్యా జీవులు ఉన్నారు. వారు జీవితంలో కష్టపడుతున్నారు, వారికి తోడ్పడవచ్చు కదా! మిథ్యాజీవులకోసం జ్ఞాని కష్టపడినా కూడా అది మిథ్యాకష్టమే అవుతుంది. అది చేసినా చెయ్యనట్టే అవుతుంది. మిథ్యా ప్రపంచంలో దాన్ని మెరుగుపరచటంకోసం జ్ఞాని చేసే పని లోకసంగ్రహంకోసం చేసేది అవుతుంది. అటువంటి కర్మ అతనిని బంధించదు. ఆ విధంగా జ్ఞాని తనకోసం కాని, ఇతరులకోసం కాని ఏపనీ చెయ్యడు. పని చెయ్యడు అంటే అసలు చెయ్యడని కాదు; అవి అతనిని బంధించవు. బంధించని పనులు ఎన్ని చేసినా, వాటి ఫలం అతన్ని అంటదు.

విద్యారణ్యులవారు ఈ రెండవ పాదానికి, తన పంచదశిలో కొంచెం వేరే అర్థం ఇచ్చారు. ముఖ్యంగా కిమిచ్ఛన్ పదానికి. కిమిచ్ఛన్ అంటే ఏ ప్రయోజనం కోరి జ్ఞాని పనిచేస్తాడు అన్నారు. అంటే జ్ఞాని తనకోసం ఏమీ చెయ్యడు అని చూశాము. పంచదశిలో విద్యారణ్యులవారు **కిం** అంటే భోగ్యవస్తువు అన్నారు. అంటే ఏ భోగ్యవస్తువును కోరి జ్ఞాని కర్మ చేస్తాడు? దీన్ని రిటారికల్ కొశ్చన్ అంటారు ఇంగ్లీషులో. అంటే ప్రశ్నలోనే జవాబు ఇమిడివుంది? ఏ భోగ్యవస్తువును కోరి జ్ఞాని కర్మ చేస్తాడు అంటే జ్ఞాని ఏ భోగ్యవస్తువునూ కోరడు.

**కస్యకామాయ** – భోగ్యవస్తువును కోరేది ఎవరు? భోగ్యవస్తువును కోరేది భోక్త, అంటే అనుభవించేవాడు. తనకు భిన్నంగా ఏ భోక్త ఉన్నాడని జ్ఞాని కర్మ చేస్తాడు? ఇక్కడ కూడా జ్ఞానికి భిన్నంగా భోక్త లేదని అర్థం. ఆత్మజ్ఞానం పొందాక భోక్త, భోగ్యద్వైతం లేదు. భోగ్యవస్తువు విడిగా లేదు కాబట్టి జ్ఞాని కష్టపడనవసరం లేదు; భోక్త విడిగా లేదు కాబట్టి కూడా జ్ఞాని కష్టపడనవసరం లేదు – ఎలా చూసినా అతనికి కష్టాలు లేవు.

## మంత్రం 4.4.13

**యస్యానువిత్తః ప్రతిబుద్ధ ఆత్మాఽస్మిన్ సన్దేహ్యే గహనే ప్రవిష్టః । స విశ్వకృత్స హి సర్వస్య కర్తా తస్య లోకస్స ఉ లోక ఏవ ॥**

అదే అంశం కొనసాగుతున్నది. జ్ఞానఫలాన్ని చెప్పటంద్వారా జ్ఞానస్తుతి జరుగుతున్నది. జ్ఞానాన్ని ప్రత్యక్షంగా మెచ్చుకోకుండా, జ్ఞానఫలాన్ని మెచ్చుకోవటంద్వారా జ్ఞానస్తుతిని చేస్తున్నది ఉపనిషత్తు. మొదటి రెండు వాక్యాలు జ్ఞానం గురించి చెబుతాయి.

**ఆత్మా యస్య అనువిత్తః** – ఎవరైనా ఆత్మజ్ఞానం పొందితే, అతను ఆత్మ ఇంకో ఆబ్జెక్టు అనుకునే ప్రమాదముంది. అనువిత్తః అంటే పొందితే. పొందితే అనేసరికి ఈశ్వరుడిని ఒక వస్తువుగా పొందాలి అనుకుంటారు. వారు దేవుని వైపు నాలుగు అడుగులు వేస్తే, దేవుడు వారివైపు పది అడుగులు వేస్తాడు – అలా జీవ ఈశ్వర ఐక్యం పొందటానికి ఇద్దరూ ప్రయాణం చెయ్యాలి అనుకుంటారు. ఈ పొరపాటు మామూలు మనుష్యులే కాదు, గొప్ప వేదాంతులు కూడా చేస్తారు. అనువిత్తః పదం వారిని అయోమయంలో పడేస్తుందని భయపడిన ఉపనిషత్తు ఇంకొక వాక్యాన్ని వేసింది.

**(ఆత్మా యస్య) ప్రతిబుద్ధః** – అందువల్ల ఇప్పుడు ఎవరైనా ఆత్మను తెలుసుకుంటే అంది. పరమాత్మను పొందితే అంటే పరమాత్మ జ్ఞానం పొందటం తప్ప వేరే ఏమీ కాదు. అందువల్ల అనువిత్తః అన్నా ప్రతిబుద్ధః అన్నా అర్థం ఒక్కటే. బ్రహ్మ ఎన్నడూ భిన్నంగా అంతకుముందు లేదు, ఇప్పుడు లేదు, ఇకముందు ఉండబోదు అనే సత్యం తెలియకపోతే బ్రహ్మను పొందటం సాధ్యంకాదు. ఈ ఐక్యం బుద్ధిలో జరగాలి. దీనికోసం మనం ఏమీ కర్మ చెయ్యనవసరం లేదు. బుద్ధిలో మార్పు రావాలి.

ఎవరైనా నాకు పరమాత్మ గురించి తెలిసింది, కాని ఇంకా పరమాత్మను పొందలేదు అని ఒకవేళ చెపితే, అతనికి బ్రహ్మ అర్థం కాలేదు అని అర్థం. బ్రహ్మను పొందటానికి ఎక్కడికి వెళ్ళాలి? కైలాసానికి వెళ్ళాలా, వైకుంఠానికి వెళ్ళాలా, బ్రహ్మలోకానికి వెళ్ళాలా? ఎక్కడికీ వెళ్ళనవసరం లేదు అంటున్నది ఉపనిషత్తు.

**అస్మిన్ సందేహ్యే గహనే ప్రవిష్టః** – నీ శరీరంలోనే అందుబాటులో ఉన్నాడు పరమాత్మ. సందేహ్యే అంటే శరీరం. శరీరాన్ని దేహం అని రెండు కారణాలవల్ల అంటారు. 'ఇధ్' ధాతువునుంచి వచ్చింది. దాని అర్థం చందనం, కుంకుమలు పూయబడే శరీరం అని అర్థం. ఇప్పుడు అన్ని రకాల సుగంధద్రవ్యాలు వాడుతున్నారు. ఇంకొక అర్థం దిహ్. దిహ్ అంటే పొడుగ్గా గాని, అడ్డంగా గానీ పెరిగేది. శరీరం పొడుగ్గా పెరగటం ఆగిపోయాక అడ్డంగా పెరుగుతుంది.

ఇటువంటి శరీరంలో బ్రహ్మ ఉన్నాడు. ఎక్కడ? పైన కాదు. గహనే ప్రవిష్టః అంటే లోపలగా. పంచకోశాలకు అతీతంగా. పంచకోశాలు అంటే బాహ్యంనుంచి లోపలికి వెళ్ళే వరుస క్రమంలో అన్నమయకోశం, ప్రాణమయకోశం, మనోమయకోశం, విజ్ఞానమయకోశం, ఆనందమయకోశం. ఈ ఒక్కొక్క కోశంమీద అభిమానాన్ని తొలగించుకుంటూ వస్తే గాని, బ్రహ్మను తెలుసుకోలేము. ఒక్కొక్క కోశంమీది అభిమానం ఒక్కొక్క సమస్యను సృష్టిస్తుంది.

| | |
|---|---|
| అన్నమయ అభిమానం | – వృద్ధాప్యభయం, మృత్యుభయం |
| ప్రాణమయ అభిమానం | – ఆకలి దప్పికలు |
| మనోమయ అభిమానం | – రాగద్వేషాలు, కామక్రోధాలు, లోభమోహాలు |
| విజ్ఞానమయ అభిమానం | – జ్ఞానం పొందలేని ఆందోళన |
| ఆనందమయ అభిమానం | – ప్రియ, మోద, ప్రమోదాలు ఎప్పుడూ ఉండటం లేదు. |

అలా ఒక్కొక్క కోశ అభిమానమూ అనేక ప్రాపంచిక సమస్యలకు దారితీస్తుంది. వీటన్నిటి కిందా ఉంది ఆత్మ లేదా బ్రహ్మ. అటువంటి ఆత్మను తెలివైన వ్యక్తి మాత్రమే పొందగలడు. అంత కష్టపడి ఆత్మజ్ఞానం పొందితే, అతను పొందే ఫలమేమిటి? అది తర్వాత వచ్చే వాక్యాల్లో చూస్తాము.

**సః విశ్వకృత్** – అతను ప్రపంచ సృష్టికర్త అవుతాడు. అంటే ఇంకో విధంగా చెప్పాలంటే ఎలాగైతే ఈశ్వరుడిని జగత్ సృష్టి, స్థితి, లయ కారకుడు అంటామో అలా. ఈ జ్ఞాని కూడా జగత్తుయొక్క సృష్టి, స్థితి, లయ కారకుడు అవుతాడు. గీతలో సబుద్ధిమాన్ అనీ కృతకృత్యః అనీ వస్తుంది. కృతకృత్యః అంటే పూర్ణత్వం పొందినవాడు అని అర్థం. ఇక్కడ ఆ అర్థం తీసుకోవాలి. ఇంక అతను జీవితంలో పొందాల్సింది ఏమీలేదు. అతని జీవితం పరిపూర్ణమయింది.

మోక్షపురుషార్థం పొందితే, తక్కిన మూడు పురుషార్థాలు కూడా పొందుతాడు. ధర్మార్థ కామాలమీద మోజు ఉండదు. కోరిక ఎప్పుడు వస్తుంది? నేను అపూర్ణం అనుకున్నప్పుడు వస్తుంది. మరణకాలంలో ఏ కోరిక తీవ్రంగా ఉంటే, మరుజన్మలో ఆ కోరికకు తగ్గట్టుగా పుడతాడు. కాని జ్ఞానికి కోరికలే ఉండవు. అతని హృదయం పూర్ణత్వంతో నిండుగా ఉంది. అందువల్ల సః విశ్వకృత్. అతను చెయ్యాల్సినవన్నీ చేశాడు.

**సర్వస్య కర్తా** – శంకరులవారు ఈ రెండు పదాలనూ అద్భుతంగా కలుపుతున్నారు. రెండింటికీ ఒకటే అర్థం ఉందంటున్నారు. విశ్వకృత్ అంటే విశ్వస్య కర్తా; సర్వస్య కర్తా అన్నా విశ్వస్య కర్తా అన్నా రెండింటి అర్థం ఒకటే. అలాంటప్పుడు రెండుసార్లు ఎందుకు చెప్పింది ఉపనిషత్తు?

కాని ఇది పునరుక్తి దోషం కాదంటున్నారు శంకరులవారు. సాధారణంగా మనం మనుష్యులకు పేర్లు పెడతాము. వేది అంటే తెలిసినవాడు; చతుర్వేది అంటే నాలుగు వేదాలు తెలిసినవాడు; వాజపేయి అంటే పెద్ద యజ్ఞం చేసినవాడు. అలా విశ్వకృత్ అనేది జ్ఞానికి పెట్టిన పేరు మాత్రమే కాదు, దాని అర్థం అతను పూర్ణత్వం పొందినవాడు. అక్షరాలా అన్నీ సాధించినవాడు.

**సోఽశ్నుతే సర్వాన్ కామాన్ సః – తైత్తిరీయం**

**తస్య లోకః** – దీనికి కూడా శంకరులవారు ప్రత్యేకమైన అర్థాన్ని ఇస్తున్నారు. లోకః అంటే ఇక్కడ ఆత్మ. తస్య ఆత్మ (బ్రహ్మ కలుపుకోవాలి) అంటే బ్రహ్మ, జ్ఞానియొక్క ఆత్మ.

**సః ఉ లోక ఏవ**– ఇక్కడ కూడా లోకః అంటే ఆత్మ. బ్రహ్మ పదాన్ని కలుపుకోవాలి. ఇంతకుముందు వాక్యంలో జ్ఞానిలో బ్రహ్మ ఉన్నాడు అంటే ఇప్పుడు బ్రహ్మలో జ్ఞాని ఉన్నాడు అని వస్తుంది. జ్ఞానే బ్రహ్మ; బ్రహ్మే జ్ఞాని. అంటే ఇద్దరూ ఒకటే.

> **తత్త్వమేవ త్వమేవ తత్ – కైవల్యం**
> **ఆత్మైవ బ్రహ్మ, బ్రహ్మైవ ఆత్మా**

మంత్రం 4.4.14

**ఇహైవ సన్తో౾థ విద్మస్తద్వయం న చేదవేదిర్మహతీ వినష్టిః ।**
**యే తద్విదురమృతాస్తే భవన్త్యథేతరే దుఃఖమేవాపియన్తి ॥**

ఈ మంత్రం కేనోపనిషత్తు మంత్రాన్ని గుర్తుకు తెస్తుంది. రెండవ అధ్యాయములో ఆఖరిమంత్రం అది. దీన్నిబట్టి బృహదారణ్యకోపనిషత్తులో అన్ని ఉపనిషత్తుల సారం ఉందని తెలుస్తున్నది. ఇక్కడ కూడా జ్ఞానస్తుతి కొనసాగుతున్నది.

జ్ఞానం గొప్పతనం ఏమిటి? జ్ఞానం ఒక్కటే మనిషి జీవితాన్ని, అర్థవంతంగా, ప్రయోజనకరంగా చేస్తుంది. జ్ఞానం పొందకపోతే, మనిషి జీవితం వృథా. మనిషికీ, పశువుకీ పెద్దగా వ్యత్యాసం ఉండదు. పశువులూ పుడతాయి, సంసారం అనుభవిస్తాయి, మరణిస్తాయి. మనమూ పుడతాము, సంసారం అనుభవిస్తాము, మరణిస్తాము. ఏమిటి మన గొప్పదనం? ఊరికే సృష్టిలో అన్నిటిలోకి మనుష్యజన్మ గొప్పదని తెలుసుకుంటే చాలదు. దానికి తగ్గట్టుగా ప్రవర్తించాలి. ఆ మాటకొస్తే మనం జ్ఞానం పొందకపోతే, భగవంతుడే బాధపడతాడుట – వీడికా నేను మనుష్యజన్మను ఇచ్చాను అని.

సాధారణంగా మనమంతా మరణకాలంలో మన జీవితాన్ని ఒకసారి వెనక్కి తిరిగి చూసుకుంటాము. ఏమైనా సాధించామా లేదా అని బేరీజు వేసుకుంటాము. ఇక్కడ జ్ఞాని వెనక్కు చూసుకుని ఆనందిస్తున్నాడు.

**అథ** – ఏదో విధంగా జ్ఞానం పొందాడు.

**ఇహైవ సంతః వయం విద్మః** – ఇహైవ అంటే అస్మిన్ శరీరే ఏవ – ఈ శరీరంతోనే పొందాడు. ఏం పొందాడు? బ్రహ్మజ్ఞానం పొందాడు.

> **నాహం మన్యే సువేదేతి నో న వేదేతి వేద చ ।**
> **యో నస్తద్వేద తద్వేద నో న వేదేతి వేద చ ॥** – కేన 1-3

గురువుతో చెప్పాడు 'నాకు బ్రహ్మ అర్థం అయ్యాదని'. ఎలా అర్థం అయ్యాడు అంటే ఎలా అర్థం అవాలో అలా అర్థమయ్యాడు అన్నాడు. అంటే బ్రహ్మను ఆబ్జెక్టుగా కాదు, సబ్జెక్టుగా తెలుసుకున్నాడు. అందుకని జ్ఞాని చాలా ఆనందంగా ఉన్నాడు. ఆహో వయం కృతార్థా అని చెప్పినట్టుగా తీసుకోవచ్చు. జ్ఞానం పొందినందుకు భగవంతునికి, గురువుకు, శాస్త్రానికి కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాడు.

**అవేదిః చేత్** – నేను గనుక ఈ జ్ఞానం పొందకపోయి ఉంటే ఏమయ్యేది?

**మహతీ వినష్టిః** – చాలా నష్టపోయి ఉండేవాడిని అంటున్నాడు జ్ఞాని. అతను కూడా అర్థకామాల వెంట పరుగులు తీసి ఉండేవాడు. అప్పుడు అతని నష్టం అనంతం. ఎందుకంటే అనంతం బ్రహ్మ గురించి తెలుసుకుని ఉండేవాడు కాదు. అంతేకాదు, ఎవరైతే తనలాగా బ్రహ్మను తెలుసుకుంటారో అతను కూడా లాభం పొందుతాడు, తెలుసుకోకపోతే దుఃఖం అనుభవిస్తాడు అంటున్నాడు.

**యే తద్విదుః తే అమృతాః భవన్తి** – ఎవరైతే బ్రహ్మను తెలుసుకుంటారో వారు పూర్ణులు అవుతారు. అనంతం అవుతారు.

**అథ ఇతరే** – ఈ జ్ఞానం పొందనివారు,

**దుఃఖమేవ అపియన్తి** – దుఃఖము మాత్రమే పొందుతారు. అంటే పునరపి జననం, పునరపి మరణం పొందుతూనే ఉంటారు.

ఆ విధంగా అజ్ఞాన నిందద్వారా జ్ఞానస్తుతి చేస్తున్నాడు జ్ఞాని. తను అదృష్టవంతుడినని మురిసిపోతున్నాడు.

### మంత్రం 4.4.15

**యదైతమనుపశ్యత్యాత్మానం దేవమఞ్జసా ।**

**ఈశానం భూతభవ్యస్య న తతో విజుగుప్సతే ॥**

ఇందులో కూడా జ్ఞాన మహిమను పొగడటానికి జ్ఞానఫలం గురించి చెబుతున్నది ఉపనిషత్తు.

**ఆత్మానమ్ అనుపశ్యతి** – ఎవరైతే ఈ ఆత్మ గురించి తెలుసుకుంటారో. అనుపశ్యతి పదం ఉపనిషత్తులోనూ భగవద్గీతలోనూ పదేపదే వస్తుంది. నిజానికి పశ్యతి పదం ఒక్కటి చాలు. పశ్యతి అంటే తెలుసుకోవటం. పశ్యతికి 'అను' అనే పదం ముందు కలపటంవల్ల గురుశాస్త్ర ఉపదేశంద్వారానే జ్ఞానం పొందాలని స్పష్టం చేస్తుంది శాస్త్రం. దీన్నిబట్టి గురుశాస్త్ర ఉపదేశం లేకుండా ఆత్మజ్ఞానం స్వంతంగా పొందటానికి ప్రయత్నించకూడదని ఉపనిషత్తు ప్రత్యేకించి చెబుతున్నది.

చాలామంది ఆత్మజ్ఞానం స్వంతంగా పొందటానికి ప్రయత్నిస్తారు. నేను ఎవరు? నాకు ఆలోచన ఎక్కడినుంచి వస్తున్నది? ఇలా ప్రశ్నలద్వారా తెలుసుకోవచ్చు అనుకుంటారు. పైపెచ్చు దురదృష్టవశాత్తూ కొన్ని పుస్తకాలు కూడా గురువు లేకుండా ఆత్మజ్ఞానం పొందవచ్చని అనుమతిని ఇస్తాయి కూడా. బావిలో పడ్డ వస్తువును మనం ఎలా తీసుకోగలమో అలా, హృదయమనే బావిలో దాగివున్న ఆత్మను కొన్ని ప్రశ్నలద్వారా వెలికి తీసుకురాగలము అనుకుంటారు వారు. దీనికోసం శాస్త్రం జోలికి వెళ్ళనవసరం లేదని వారి ఊహ. కాని అది అపోహ మాత్రమే.

శంకరులవారు గట్టిగా చెబుతారు 'ఎవరైనా శాస్త్రం జోలికి వెళ్ళకుండా బోధ చేస్తే అతనిని గురువుగా గౌరవించకూడదు.' అతనిని మహాత్ముడు అనవచ్చు; అతనికి సాష్టాంగ నమస్కారాలు చెయ్యవచ్చు; కాని అతనికి మనను నడిపించే హక్కు లేదు. తన వ్యక్తిగత సాధనతో పైకి వచ్చిన వ్యక్తిని అనుసరించకూడదు.

అందువల్ల వ్యక్తిగతంగా ఎవరినీ గురువుగా స్వీకరించకూడదు. అతని బోధ శాస్త్రాన్ని ఆధారం చేసుకుని ఉండాలి. శాస్త్రం ఆచార్యునికన్నా శక్తివంతమైనది. ఎందుకంటే, శాస్త్రాన్ని ఆచార్యులు పుట్టించలేదు; దానికి వ్యతిరేకంగా అనాదిగా వస్తున్న శాస్త్రం ఆచార్యులను పుట్టించింది. అందువల్ల మన సాంప్రదాయంలో శాస్త్రాన్ని మించి ఏ గురువుకూ గౌరవం దక్కలేదు. అందువల్లనే గురువును శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అంటారు. శాస్త్రాన్ని ఆచార్యునిద్వారా పరీక్షించము; ఆచార్యుణ్ణి శాస్త్రంద్వారా పరీక్షిస్తాము.

శాస్త్రవిరోధి, ఎంత గొప్పవాడైనా సరే, అతన్ని స్వీకరించము. బుద్ధుడిని దశావతారాలలో ఒక అవతారంగా కొలుస్తారు. ఆయనను భగవంతునిగా కీర్తించినా, ఆయన బౌద్ధమతం నాస్తికదర్శనంలో వస్తుంది. నాస్తికులు అంటే భగవంతుణ్ణి నమ్మనివారు కాదు, నాస్తికులు అంటే శాస్త్రాన్ని నమ్మనివారు. మనకు ఆరు నాస్తిక దర్శనాలుంటే, అందులో నాలుగు నాస్తికదర్శనాలు బౌద్ధమతానికి చెందినవే. అందువల్ల బౌద్ధమతఖండన జరుగుతుంది బ్రహ్మసూత్రాల్లో.

చివరికి కృష్ణపరమాత్మ చేసిన బోధ కూడా శాస్త్రాన్ని ఆధారం చేసుకుని చేసినదే. ప్రతి అధ్యాయము చివర **ఉపనిషత్సు** అని వస్తుంది. భగవద్గీత ఉపనిషత్తుల సారం. భగవద్గీతను స్మృతి గ్రంథం అనీ, ఉపనిషత్తును శ్రుతి గ్రంథం అనీ అంటారు. ఈ రెండింటిలో బోధలో ఏదైనా భిన్నంగా ఉంటే, చెప్పింది సాక్షాత్తూ కృష్ణపరమాత్మ అయినా శ్రుతిగ్రంథంనుంచి స్మృతిగ్రంథం వచ్చింది కాబట్టి, శ్రుతిలో చెప్పినదానికే విలువనిస్తారు. తక్కిన మతాలు వారి గురువులను ఆధారం చేసుకుని ఏర్పడినవి. కాని మన మతం శాస్త్రాన్ని ఆధారం చేసుకుని ఏర్పడింది. అందువల్ల శాస్త్రానికి పెద్దపీట వేస్తాము మనం. దాని తర్వాతనే వ్యాసాచార్యులయినా, శంకరాచార్యులైనా. శాస్త్రానికున్న ఈ ప్రాముఖ్యతను గుర్తుపెట్టుకోవాలి. లేకపోతే వారూ వీరూ చెప్పిన విషయాల ప్రభావంలో పడిపోయే ప్రమాదముంది. అనుపశ్యతికి ఇంత చెప్పాల్సి వచ్చింది.అను అంటే గురుశాస్త్ర ఉపదేశం, పశ్యతి అంటే ఆత్మను చూడటం. ఎటువంటి ఆత్మ?

**దేవమ్** – దేవమ్ అంటే స్వర్గంలో ఉండే దేవతలు కాదు, ఆత్మ. స్వయంప్రకాశక ఆత్మ. అంటే ఇక్కడ రూఢి అర్థం తీసుకోకుండా లక్ష్యార్థం తీసుకోవాలి.

**దివ్యతే ప్రకాశతే ఇతి దేవతా**

**దృష్టేః ద్రష్టారమ్, శ్రుతేః శ్రోతారమ్**

ఈ ఆత్మ ఎలాంటిది? ఇది మామూలుది కాదు. శరీరంలో జీవాత్మగా పరిగణించబడుతున్న ఈ ఆత్మ ఎవరో కాదు పరమాత్మ. ఆ పరమాత్మ ఎవరు?

**భూతభవ్యస్య ఈశానమ్** – మూడు కాలాలకు అధిపతి. భూత అంటే భూతకాలం; భవ్య అంటే భవిష్యత్కాలం; వర్తమాన కాలాన్ని మనం కలుపుకోవాలి.

**భూతభవ్య భవన్నాథ – విష్ణుసహస్రనామం**

భగవంతుడు కాలానికి అధిపతి అంటే, కాలం కోరల్లో ఆయన చిక్కుకోలేదు. అంటే ఆయనకు వికారాలు లేవు. షడ్వికారాలు కాలం తెచ్చే మార్పులు. అందంగా మిలమిల మెరిసే వ్యక్తి, కొంతకాలం గడిచేసరికి అందాన్ని కోల్పోతాడు; అలాగే ఆరోగ్యంతో వెలిగిపోయే వ్యక్తి వృద్ధాప్యంలో అనారోగ్యం బారిన పడతాడు. అందువల్ల ఈ వాక్యం జీవాత్మ, పరమాత్మల ఐక్యాన్ని సూచిస్తున్నది. ఈ ఐక్యజ్ఞానాన్ని ఎలా పొందుతాడు?

**అంజసా** – సాక్షాత్తుగా పొందుతాడు. దానికి ఇంకోపేరు అపరోక్షం. పరోక్షం కానిది అపరోక్షం. బాహ్యవస్తువులు పరోక్షం. నేను అపరోక్షం. ఆత్మజ్ఞానం పరోక్షజ్ఞానం కాదు, అది అపరోక్ష జ్ఞానం. ఆత్మజ్ఞానం లేదా బ్రహ్మజ్ఞానం అంటే ఆ బ్రహ్మను ఆబ్జెక్టుగా చూడటం కాదు, ఆ బ్రహ్మ అనుభవం పొందటం అనలేదు; బ్రహ్మజ్ఞానం పొందటం అంటే, నేనే ఆ 'అనంతం బ్రహ్మను' అని తెలుసుకోవటం. ఈ ఐక్యాన్ని తెలుసుకున్న వ్యక్తి జ్ఞానమార్గంలోకి అడుగుపెట్టినట్టు. అతను పొందే ఫలం ఏమిటి?

**న తతో విజుగుప్సతే** – ఇదే పదం కఠోపనిషత్తులో కూడా వచ్చింది. విజుగుప్సతే పదానికి శంకరులవారు రెండు అర్థాలు చెబుతారు. ఒకటి రూఢి అర్థం, ఇంకొకటి లక్ష్యార్థం. లక్ష్యార్థం ఏమిటి? ఈ జ్ఞానం పొందాక జ్ఞాని తనను తాను రక్షించుకోవాలని ప్రయత్నించడు. ఎందుకు రక్షించుకోవాలని అనుకోడు? దానికి జవాబు మనం కలుపుకోవాలి. అతను జ్ఞానం పొందాక పూర్ణత్వాన్ని అనుభవిస్తాడు.

సంసారంలో ఉండే అభద్రతాభావన ఉండదు. ఈ అభద్రతా భావనే మనను భయపెడుతూ ఉంటుంది. డబ్బు ఉంటే భద్రత ఉంటుంది అనుకుంటాము; ఉద్యోగం ఉంటే భద్రత ఉంటుంది అనుకుంటాము; బంధుబలగం ఉంటే భద్రత ఉంటుంది అనుకుంటాము. అంటే మనం శాంతి, భద్రతలు బాహ్యప్రపంచంలో దొరుకుతాయనుకుని అక్కడ వెతుక్కుంటాము కాని జ్ఞాని ఈ బాహ్యవస్తువులనన్నింటినీ కొట్టివేస్తాడు. అంటే శారీరకంగా వాటికి దూరమవడు కాని, మానసికంగా బంధవిముక్తుడు అవుతాడు. మనుష్యులు ఉంటే పొంగిపోడు లేకపోతే కృంగిపోడు.

**ఆగతే స్వాగతం కుర్యాత్ గచ్ఛంతం న నివారయేత్**

బాహ్యప్రపంచంలో పడే అవస్థలన్నిటినుంచీ ఈశ్వరుడిని రక్షణ కోరతాడు. కాని శంకరులవారు జ్ఞాని ఈశ్వరునినుంచి ఏమీ కోరడు అంటున్నారు. ఎందుకు?

**ద్వితీయాద్వై భయం భవతి**

రెండోది ఉంటే భయం వస్తుంది. భగవంతుడు మనకు భిన్నంగా ఉంటే భయపడతాము. భగవంతుడు ఎత్తి పట్టుకున్న వజ్రాయుధంతో ఉంటాడు కాబట్టి, ఆయన భయానికి సూర్యుడు, చంద్రుడు, యమధర్మరాజు, వాయువు, అగ్ని కూడా వారి పనులను సక్రమంగా చేస్తున్నారని యమధర్మరాజే చెబుతాడు.

**భయాదస్యాగ్నిస్తపతి భయాత్తపతి సూర్యః।**
**భయాదిన్ద్రశ్చ వాయుశ్చ మృత్యుర్ధావతి పంచమః॥** – కఠ 02-03-03

భగవద్గీతలో కూడా పదకొండవ ఆధ్యాయంలో కాలతత్త్వం రూపంలో భగవంతుడు భయాన్ని కలుగజేస్తాడని చూస్తాము. భగవంతునికీ, కాలానికీ మధ్య భేదం లేదు.

కాని భగవంతుణ్ణి భిన్నంగా ఉన్నట్టు చూస్తే, కాలతత్త్వానికి నేను భయపడాల్సి వుంటుంది. భగవంతుడు నాలో ఉన్నాడంటే కాలతత్త్వం ఉండదు. భగవంతుడు కాలకాలః అవుతాడు. అంటే **యమఘాతకుడు** అవుతాడు. అందువల్ల నన్ను నేను మరణంనుంచి కూడా రక్షించుకోవాలని చూడను, ఇది లక్ష్యార్థం విజుగుప్సతే పదానికి.

వాచ్యార్థం లేదా రూఢి అర్థం ఏమిటంటే జ్ఞాని ఎవరినీ విమర్శించడు. పుకార్లు పుట్టించటం, ఎవరినైనా విమర్శించటం మనిషికున్న దుర్గుణాలలో అత్యంత చెడ్డగుణం. ఎదుటివారిని ఎందుకు విమర్శిస్తాము? అభద్రతా భావనవల్ల. మనమీద మనకు నమ్మకం లేక ఎదుటివారిని విమర్శిస్తాము.

అదే ఆధ్యాత్మికంగా ఎదుగుతూ వస్తే, ఈ విమర్శలు తగ్గిపోతాయి. నిజానికి ఇది ఒక పరీక్షగా తీసుకోవచ్చు మనం. మనం ఆధ్యాత్మికంగా ఎదిగినట్టు ఎలా తెలుస్తుంది అనుకుంటాము. ఇది ఒక మార్గం. ఎదుటి వారిని విమర్శించటం తగ్గినకొద్దీ, మనం ఎదుగుతున్నట్టు అర్థం. సద్విమర్శ చెయ్యకూడదా అంటారేమో? సద్విమర్శ ప్రసక్తే లేదు వేదాంతంలో. సద్విమర్శ చెయ్యవచ్చు అంటే ఏ విమర్శ చేసినా, అది సద్విమర్శ అనే రంగు పూస్తారు. వేదాంతంలో విమర్శ చెయ్యకూడదు. అది సాధకుడిని ఎదగనివ్వదు.

పైశునం అనే పదం వస్తుంది భగవద్గీతలో. పైశునం అంటే విమర్శ. అంటే ఎదుటివారిలో ఉన్న చెడ్డ గుణాలను చాటిచెప్పటం. దీన్ని పరరంధ్ర ప్రకటీకరణం అంటారు. అపైశునం అంటే విమర్శ చెయ్యకపోవటం. అది ఒక ముఖ్యమైన విలువ. అది జ్ఞానం పొందటానికి అవసరమైన విలువ; జ్ఞానం పొందాక పెరిగే విలువ కూడా. ఇది వాచ్యార్థం విజుగుప్సతే పదానికి.

## మంత్రం 4.4.16

**యస్మాదర్వాక్సంవత్సరోఽహోభిః పరివర్తతే ।**
**తద్దేవా జ్యోతిషాం జ్యోతిరాయుర్హోపాసతేఽమృతమ్ ॥**

ముందు మంత్రంలో ఈశానం భూతభవ్యస్య అంది ఉపనిషత్తు. అంటే భగవంతుడు కాలానికి అధిపతి అని చూశాము. అదే భావం ఇక్కడ కొనసాగుతున్నది. భగవంతుడు కాలాతీతం. కాని ఇక్కడ భగవంతుడు కాలాతీతం అనే బదులు, ఈ మంత్రం ఇంకోవిధంగా తిప్పి చెబుతున్నది. అంటే కాలం పరమాత్మకు క్రింద ఉంది అంటున్నది. కాలం భగవంతుడికి క్రింద ఉంది అంటే అక్షరాలా కింద ఉన్నట్టు తీసుకోకూడదు. దాని భావన అర్థం చేసుకోవాలి.

కాలం వ్యావహారిక స్థాయికి చెందితే, పరమాత్మ పారమార్థిక స్థాయికి చెందుతాడు. అంటే వీటి రెండింటి మధ్య స్థాయీభేదాలు ఉన్నాయి. ఆ భావన వస్తుంది ఇక్కడ.

**సంవత్సరః** – సంవత్సరం అంటే ఒక్క సంవత్సరాన్నే తీసుకోకూడదు. కాలతత్త్వాన్ని తీసుకోవాలి. ఈ కాలతత్త్వం ఏం చేస్తున్నది?

**యస్మాత్ అర్వాక్ పరివర్తతే** – పరమాత్మ కింద వృత్తంలో తిరుగుతున్నది. యస్మాత్ అంటే పరమాత్మ; అర్వాక్ అంటే క్రింద; పరివర్తతే అంటే కాలచక్రంలా తిరుగుతున్నది.

**అహోభిః** – రాత్రి పగలుగా తిరుగుతున్నది. దీనిలో ఋతువులను కూడా కలుపుకోవచ్చు. కాని పరమాత్మకు కాలం అంటదు. అందువల్ల కాలాతీతం సరియైన పదం పరమాత్మకు.

నిత్యం పదం కూడా సరిపోదు. ఎందుకంటే నిత్యం అని దేనినైనా అంటే అది గతంలో ఉంది; వర్తమానంలో ఉంది; భవిష్యత్తులో కూడా ఉంటుంది అని అర్థం వస్తుంది. అంటే త్రికాలేపి తిష్ఠతి అని చెప్పాల్సివుంటుంది. కాలంలో నిత్యంగా ఉంది అని చెప్పాల్సి వుంటుంది. అందువల్ల నిత్యం, అమృతం పదాలు సరిపోవు.

అందువల్ల ఇక్కడ సరిగ్గా సరిపోయే పదం కాలాతీతం. కాలం వ్యావహారిక సత్యం; పరమాత్మ పారమార్థిక సత్యం.

**తద్దేవా జ్యోతిషాం జ్యోతిః** – ఆ బ్రహ్మ జ్యోతులకే జ్యోతి.

> **జ్యోతిషామపి తజ్జ్యోతిః తమసః పరముచ్యతే ।**
>
> **జ్ఞానం జ్ఞేయం జ్ఞానగమ్యం హృది సర్వస్య విష్ఠితమ్ ॥ – గీత 13.18**
>
> **హిరణ్మయే పరే కోశే విరజం బ్రహ్మ నిష్కలమ్**
>
> **తచ్ఛుభ్రం జ్యోతిషాం జ్యోతిః తద్యదాత్మవిదో విదుః – ముండకమ్ 2.2.10**

జ్యోతిషాం జ్యోతిలో మొదటిజ్యోతి చైతన్యంయొక్క చిదాభాసవల్ల ప్రకాశించేవి. అంటే– శరీరం, మనస్సు, ఇంద్రియాలు – ఇవన్నీ చైతన్యంవల్ల ప్రకాశిస్తున్న జ్యోతులు. చైతన్యం ఈ జ్యోతులకే అఖండజ్యోతి. తక్కిన జ్యోతులన్నీ ఈ జ్యోతిమీద ఆధారపడ్డాయి. ఎందుకంటే అవి చిదాభాస అంటే ప్రతిబింబ చైతన్యాలు. అవి సూర్యకాంతిని ప్రతిబింబింపజేసే అద్దాలు. వంద అద్దాలు పెడితే, వంద అద్దాలు కూడా రెండవస్థాయికి చెందిన జ్యోతులే. మొదటి అద్దం రెండవ అద్దానికి ప్రతిబింబాన్ని ఇచ్చినా, మొదటి అద్దం కూడా రెండవ స్థాయికి చెందిన జ్యోతే. అందులో ఉన్న ప్రతిబింబ సూర్యకాంతే, రెండవ అద్దానికి, మూడవ అద్దానికి ప్రతిబింబాన్ని ఇస్తుంది.

అలాగే, వ్యష్టిలోకి వచ్చేసరికి అసలు చైతన్యంనుంచి మనస్సు, చైతన్యాన్ని అరువు తెచ్చుకుని, శరీరానికి చైతన్యాన్ని ఇస్తుంది. శరీరం సరాసరి చైతన్యంనుంచి చైతన్యాన్ని పొందదు – మనస్సుద్వారా పొందుతుంది. అందువల్ల రెండవస్థాయి జ్యోతులు చాలానే ఉన్నాయి. వాటిని జ్యోతులు అంటారు. ఆ జ్యోతులకే జ్యోతి చైతన్యం.

జ్యోతులకు జ్యోతి ఒకటే ఉంది. కాని రెండవస్థాయికి చెందిన జ్యోతులు అనేకం ఉన్నాయి. ఆ బ్రహ్మ కాలాతీతం.

**తద్దేవాః ఆయుః ఉపాసతే** – దేవతలు ఆ కాలాతీత (అమృతం) బ్రహ్మను ఆయువుగా ఉపాసన చేస్తారు. దేవతలు ఆ జ్యోతిని ఆయువు అనే గుణము కలదిగా ఉపాసిస్తారు కాబట్టి, వారు దీర్ఘాయుష్మంతులయ్యారు. అందువల్ల బ్రహ్మమీద ఎవరు ఉపాసన చేస్తారో, వారు దీర్ఘాయుష్మంతులు అవుతారు. అదే బ్రహ్మ నేను అని తెలుసుకుంటే, అనంతమే అవుతారు.

మంత్రం 4.4.17

**యస్మిన్ పఞ్చ పఞ్చజనా ఆకాశశ్చ ప్రతిష్ఠితః।**
**తమేవ మన్య ఆత్మానం విద్వాన్ బ్రహ్మామృతోఽమృతమ్ ॥**

మళ్ళీ ఐక్యజ్ఞానమూ, ఫలమూ చెప్పబడ్డాయి. ముందు పరమాత్మ నిర్వచనం చూస్తాము. అన్నీ పరమాత్మలోనే ప్రతిష్ఠితాలై ఉన్నాయి. ఏమిటవి?

**పంచజనాః** – ఈ పదానికి అర్థం సరిగ్గా ఇవ్వలేదు. అందువల్ల శంకరులవారు దీనిని వివరిస్తారు. బ్రహ్మసూత్రాల్లో 1.4.11లో ఇది వివరంగా చర్చించబడింది. సాంఖ్య దార్శనికులు ఇది మా సిద్ధాంతాన్ని సూచిస్తున్నది అంటారు కాని బ్రహ్మసూత్రాల్లో ఆ వాదన ఖండించబడుతుంది. పంచజనాః అనేది ఒక నామవాచకం.

**పంచ పంచజనాః** – పంచజనాః అంటే బ్రహ్మ ఐదు పంచజనాలకు ఆధారం. పంచజనాః అంటే ఏమిటి? శంకరులవారు మూడు రకాల నిర్వచనాలు ఇస్తున్నారు.

1. దేవతలు, పితృదేవతలు, గంధర్వులు, అసురులు, రాక్షసులు
2. బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు, నిషాదులు (నిషాదులు అంటే ఈ నాలుగింటిలోకి రానివారు)
3. ప్రాణం, కన్ను, చెవి, అన్నం లేదా జ్యోతి, మనస్సు.

వీటిలో ఏ ఒక్కటి తీసుకున్నా దాని అర్థం మొత్తం జగత్తుకు ఆధారం. పంచ పంచజనాఃకి ఏ అర్థం తీసుకున్నా అది సమష్టిని లేదా కార్యప్రపంచాన్ని సూచిస్తుంది.

**ఆకాశశ్చ ప్రతిష్ఠితః** – ఇవన్నీ ఆకాశంలో ప్రతిష్ఠితమై ఉన్నాయి. ఆకాశం అంటే పంచభూతాలలో ఒకటైన ఆకాశంగా తీసుకోకూడదు. 3.8.11లో ఆకాశాన్ని ఈశ్వరుడిగా చూశాము. అవ్యాకృత బ్రహ్మ అన్నాడు యాజ్ఞవల్క్యుడు అందులో. ఈశ్వరుడు జగత్కారణం. పంచ పంచజనాః అంటే కార్యం.

మాండూక్య పరిభాషలో చెప్పాలంటే పంచ పంచజనాః మొదటి రెండు పాదాలను సూచిస్తే, ఆకాశం తృతీయ పాదాన్ని సూచిస్తుంది. తురీయం బ్రహ్మయొక్క చతుర్థపాదం. ఇది తక్కిన మూడు పాదాలకు ఆధారం. అంటే కార్యకారణప్రపంచాలు రెండింటికీ బ్రహ్మే ఆధారం. విరాట్ మొదటి పాదం; హిరణ్యగర్భ రెండవపాదం; ఇవి రెండూ కార్యం; ఈశ్వరుడు లేదా అంతర్యామి మూడవపాదం ఇది కారణం. ఈ మూడూ కలిపి కార్య, కారణప్రపంచం అయ్యాయి. నాలుగవ పాదం తురీయం లేదా నిర్గుణబ్రహ్మ. దానిమీదే ఈ మూడూ ఆధారపడ్డాయి. ఆధారపడ్డాయి అంటే దాన్ని అధ్యాసగా తీసుకోవాలి. సూపర్ ఇంపోజిషన్ అంటారు ఇంగ్లీషులో.

తరచు బ్రహ్మను ఆధారం అనీ; ప్రపంచాన్ని ఆధేయం అనీ అంటారు. సాధారణంగా ఆధారం అంటే ఆధారాన్ని ఇచ్చేది; ఆధేయం అంటే ఆధారాన్ని పొందేది. కాని ఇక్కడ ఒక విషయాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి.

దాని ముందు మూడు రకాల సత్యం గురించి గుర్తు తెచ్చుకోవాలి.

1. ప్రాతిభాసిక సత్యం – స్వప్నప్రపంచం
2. వ్యావహారిక సత్యం – జాగ్రద్‌ప్రపంచం
3. పారమార్థిక సత్యం – నిర్గుణబ్రహ్మ (పారమార్థిక ప్రపంచం అనకూడదు)

ఇక్కడ మనకు ప్రాతిభాసిక సత్యంతో పనిలేదు. వ్యావహారిక సత్యం, పారమార్థిక సత్యాలతో చూద్దాము. ఉదాహరణకు బల్ల ఆధారం, పుస్తకం ఆధేయం అన్నామనుకోండి. అక్కడ బల్ల, పుస్తకం రెండూ వ్యావహారిక సత్యం స్థాయికి చెందినవే. అంటే అవి ఒకేస్థాయి సత్యంలో ఉన్న రెండు భిన్నవస్తువులు.

కాని ఇవే పదాలు బ్రహ్మకూ, జగత్తుకూ వాడితే వాటి అర్థాలు మారతాయి. అంటే బ్రహ్మ ఆధారం, జగత్తు ఆధేయం అంటే రెండూ రెండు భిన్నస్థాయి సత్యాలకు చెందినవి. ఆధారబ్రహ్మ పారమార్థిక స్థాయి సత్యానికి చెందితే, ఆధేయ జగత్తు వ్యావహారిక స్థాయి సత్యానికి చెందుతుంది. వ్యావహారిక స్థాయికి ఇంకోపేరు మిథ్య. ఆధేయ ప్రపంచం కిందస్థాయికి చెందినది కాబట్టి అది మిథ్యాజగత్తు అయింది. ఆ వ్యత్యాసాన్ని ఎలా చూపిస్తాము? వీటి స్థానంలో సాంకేతిక పదాలను వాడతాము. ఆధారాన్ని అధిష్ఠానం అంటాము, ఆధేయాన్ని అధ్యాస అంటాము.

ఇప్పుడు రెండు జతల పదాల మధ్య భేదం స్పష్టమయింది కదా.

| | |
|---|---|
| ఆధార –ఆధేయం | – వ్యావహారిక స్థాయికి చెందినవి |
| అధిష్ఠాన –అధ్యాస | – పారమార్థిక స్థాయికి చెందినవి |

విశిష్టాద్వైతం జగత్తు మిథ్య అని ఒప్పుకోదు. అందువల్ల విశిష్టాద్వైతంలో బ్రహ్మ–జగత్తులు ఒకేస్థాయికి చెందినవనీ, వాటి మధ్య ఆధార–ఆధేయ సంబంధమే ఉందనీ అంటుంది. కాని అద్వైతంలో రెండు స్థాయిల సత్యాలు ఉన్నాయి. కృష్ణపరమాత్మ రెండు స్థాయిలను బాగా చూపిస్తాడు.

1. **ఆధార–ఆధేయ సంబంధం** – నాలో అన్ని జీవులు ఉన్నాయి. దీన్ని ఆధార–ఆధేయ సంబంధంగా తీసుకోవచ్చు. బల్ల, పుస్తకం గురించి చెప్పినట్టుగా; భగవంతుడు ఆధారం, జగత్తు ఆధేయం. కాని అక్కడితో ఆగటం ఇష్టంలేదు కృష్ణపరమాత్మకు. బ్రహ్మనూ, జగత్తునూ కూడా ఒకే స్థాయికి చెందిన సత్యంగా తీసుకోవటం ఇష్టంలేదు కృష్ణపరమాత్మకు. మనలో ఆ అపోహను తొలగించటానికి రెండవ వాక్యం చెప్పాడు.

2. **అధిష్ఠాన–అధ్యాస సంబంధం** – కాని నాలో జీవులు లేవు అన్నాడు. జీవులు ఉన్నట్టుగా ఉంటాయి కాని నాలో నిజంగా జీవులు లేవు అన్నాడు. ఈ సంబంధాన్ని అధిష్ఠాన–అధ్యాస సంబంధం అంటారు. అదే భావన ఇక్కడ కూడా చూస్తాము.

మంత్రంలో ఈ భాగం వరకూ బ్రహ్మ నిర్వచనం వచ్చింది. బ్రహ్మకూ జగత్తుకూ అధిష్ఠాన–అధ్యాస సంబంధం ఉంది. బ్రహ్మజ్ఞానం గురించి తర్వాత వచ్చే వాక్యాల్లో ఉంది.

**తమ్ ఆత్మానమ్ ఏవ మన్యే** – నాకు బ్రహ్మ గురించి తెలుసు. ఈ వాక్యాన్ని జ్ఞానం పొందిన జ్ఞాని చెబుతున్నాడు. జగదాధారం, సర్వ అధిష్ఠానం అయిన బ్రహ్మ నాకు తెలుసు. ఎలా తెలుసు? బ్రహ్మను ఎప్పుడు చూశావు? ఎప్పుడు కలిశావు? బ్రహ్మ అనుభవం అయిందా అని జ్ఞానిని ప్రశ్నిస్తే జ్ఞాని నేను బ్రహ్మను చూడలేదు, కలవలేదు, బ్రహ్మ అనుభవం పొందలేదు అంటున్నాడు. మరయితే బ్రహ్మ ఎవరు? ఆ బ్రహ్మను నేనే అని నాకు తెలుసు. బ్రహ్మ బాహ్యంగా చూసే వస్తువు కాదు; అనుభవం పొందే వస్తువు అంతకన్నా కాదు; ఆ బ్రహ్మ నేనే అని గ్రహించ గలగాలి. తమ్ ఆత్మానమ్ ఏవ మన్యే – బ్రహ్మను నేను ఇంకో ఏ విధంగానూ అర్థం చేసుకోను. ఎందుకంటే బ్రహ్మను ఇంక ఎలా అర్థం చేసుకున్నా కూడా అది అజ్ఞానమే అవుతుంది. ఇంకే విధంగా బ్రహ్మను తెలుసుకున్నా కూడా అది జ్ఞానం అవదు. ఇదే భావనను కేనోపనిషత్తులో కూడా చూస్తాము.

**మన్యే విదితమ్ – కేన 2.1**

బ్రహ్మ వస్తువుగా తెలుసుకునేది కాదని మీ బోధవల్ల అర్థమయింది అన్నాడు శిష్యుడు గురువుతో.

జ్ఞానం పొందితే కలిగే ఫలమేమిటి?

**అమృతం బ్రహ్మ విద్వాన్ (అహమ్)** – నేను అమృతాన్ని అవుతాను. అమృతబ్రహ్మ గురించి తెలుసుకుంటే నేను అమృతబ్రహ్మను అవుతాను అన్నాడు జ్ఞాని. అంటే కేవలం బ్రహ్మజ్ఞానం పొందితేనే బ్రహ్మను అవుతాను అంటున్నాడు.

**బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి**

దీనినుంచి ఒక ఉపసిద్ధాంతాన్ని చెప్పవచ్చు. ఏమిటది? జ్ఞానం పొందటంవల్ల సత్యానికి ఏమీ మార్పు తీసుకురాలేము. ఉదాహరణకు ఇది నా చెయ్యి అని నేను తెలుసుకున్నాను. అలా తెలుసుకోవటంవల్ల నా చెయ్యి ఏమైనా మారిందా? లేదే! అందువల్ల జ్ఞానం **అకారకం**. అకారకం అంటే అది ఏదీ చెయ్యదు లేదా ఏమీ మార్పు తీసుకురాదు. ఇది నా చెయ్యి అని తెలియటంవల్ల ఏమైనా మార్పు జరిగిందా? లేదు.

కాని ఇక్కడ జ్ఞాని ఏమంటున్నాడు? నేను అమృతబ్రహ్మను గురించి తెలుసుకోవటంవల్ల నేను కూడా అమృతం అయ్యాను అంటున్నాడు. ముందు చెప్పిన తర్కం ప్రకారం జ్ఞానం ఏమీ మార్పు తీసుకురాదు. ఆ తర్కాన్ని ఉపయోగిస్తే, జ్ఞానం పొందాక నేనెలా అమృతాన్ని అవుతాను?

నేను అశాశ్వతం అయితే, జ్ఞానం నన్ను శాశ్వతం చెయ్యలేదు. ఎందుకంటే జ్ఞానం అకారకం కాబట్టి. నేను ముందే శాశ్వతం అయితే కొత్తగా శాశ్వతం కానవసరం లేదు. అయితే ఇప్పుడు జ్ఞానంవల్ల ఏమిటి లాభం? జ్ఞానం అశాశ్వతుడిని శాశ్వతుడిగా చేస్తుందా? శాశ్వతుడిని శాశ్వతుడిగా చేస్తుందా?

జ్ఞానం రెండూ చెయ్యదు. మరి ఏం చేస్తుంది?

**ప్రతిబంధ నివృత్తిః ఏవ జ్ఞానేన క్రియతే**

నేను శాశ్వతుడిని అని తెలుసుకోవటానికి వీలులేకుండా అడ్డుపడుతున్న ప్రతిబంధకాలను నివారిస్తుంది జ్ఞానం. అందువల్ల జ్ఞానం అంటే నివృత్తి చేసేది. దీన్నించి కొత్తగా ఏమీ ఆశించకూడదు.

ఈ విషయం పదేపదే చెప్పటంలోని అంతరార్థం ఏమిటంటే, జ్ఞానం పొందాక కొత్తగా ఏమీ అనుభవం జరగదు. సాధారణంగా వేదాంతానికి వచ్చిన శిష్యులు ఏదో అద్భుతం జరుగుతుందని ఎదురుచూస్తారు. ఇలా ఎందుకు ఎదురుచూస్తారంటే జ్ఞానాన్ని సరిగ్గా అర్థం చేసుకోక. జ్ఞానమహిమ గురించి మళ్ళీ ఒక్కముక్కలో చెప్పాలంటే జ్ఞాని అమృతత్వాన్ని పొందుతాడు.

ఈ మంత్రం మహావాక్య మంత్రం. మొదటి వాక్యం బ్రహ్మ నిర్వచనం చెప్తే, రెండవ వాక్యం బ్రహ్మ-ఆత్మల ఐక్యం గురించి చెప్పింది.

## మంత్రం 4.4.18

**ప్రాణస్య ప్రాణముత చక్షుషశ్చక్షురుత శ్రోత్రస్య శ్రోత్రం మనసో యే మనో విదుః । తే నిచిక్యుర్బ్రహ్మ పురాణమగ్ర్యమ్ ॥**

ఇది కూడా మహావాక్య మంత్రం. ఇందులో మొదటి రెండు వాక్యాలు జీవాత్మ స్వరూపాన్ని వర్ణిస్తాయి. అంటే త్వం పద లక్ష్యార్థాన్ని సూచిస్తాయి.

**ప్రాణస్య ప్రాణముత చక్షుషశ్చక్షురుత శ్రోత్రస్య శ్రోత్రం మనసో యే మనో విదుః** - ఈ మాటలు కేనోపనిషత్తును పోలివున్నాయి.

> **శ్రోత్రస్య శ్రోత్రం మనసో మనో యద్వాచో హ వాచం స ఉ**
> **ప్రాణస్య ప్రాణశ్చక్షుషశ్చక్షురతిముచ్య ధీరాః॥** - కేన 1-2

దీన్నిబట్టి ఒక్క బృహదారణ్యకం నేర్చుకుంటేనే తక్కిన ఉపనిషత్తుల సారం కూడా ఇందులో వస్తుందని తెలుస్తుంది.

ఆత్మ అంటే ఏమిటి? ముందు కాంతి-చెయ్యి ఉదాహరణ చూద్దాము.

1. కాంతి వేరు, చెయ్యి వేరు.
2. కాంతి చెయ్యి అంతటా వ్యాపించి ఉంది.
3. కాంతి ఉండటంవల్లనే చెయ్యిని చెయ్యి అనగలగుతున్నాము. అంటే చేతిని చూడగలుగుతున్నాము.

ఇప్పుడు ఈ సూత్రాన్ని శ్రోత్రస్య శ్రోత్రం పదాలకు అన్వయిద్దాము.

1. ఆత్మ వేరు, చెవి వేరు.
2. ఆత్మ చెవి అంతటా వ్యాపించి ఉంది.
3. ఆత్మ ఉండటంవల్లే చెవిని చెవి అనగలుగుతున్నాము. అంటే చెవితో వినగలుగుతున్నాము.

అలా ఆత్మ చెవియొక్క చెవి, మనస్సుయొక్క మనస్సు మొదలైనవి అయింది. ఇక్కడి మంత్రంలోని పదాల అర్థం చూస్తే ఆత్మ ప్రాణంయొక్క ప్రాణం; చూపుయొక్క చూపు; చెవియొక్క చెవి; మనస్సుయొక్క మనస్సు. ఇక్కడ కూడా చెవియొక్క చెవి ఉంది. అంటే రెండవ చెవి చైతన్యం. ఆ చైతన్యంవల్లనే చెవికి చెవి శక్తి వచ్చింది. అంటే

చెవి వినగలుగుతున్నది. అలా ఆ చైతన్యంవల్లనే కన్నుకు కన్నుయొక్క శక్తి వచ్చింది, అంటే చూడగలుగుతున్నది. ఆ చైతన్యంవల్లనే శరీరం చైతన్యవంతంగా ఉంటుంది. చైతన్యం లేకపోతే శరీరం కట్టెతో సమానం. చైతన్యం ఉంటే శరీరం శివం; చైతన్యం లేకపోతే శరీరం శవం.

యే విదుః – ధీరులు లేదా తెలివైనవారు చెవికి చెవి, కన్నుకు కన్ను, ప్రాణానికి ప్రాణం అయిన చైతన్యం గురించి తెలుసుకుంటారు. ఉదాహరణకు చెవికి చెవి ఆత్మ చైతన్యం అని తెలుసుకుంటారు. అలా తెలుసుకుంటే ఏమవుతుంది?

**తే బ్రహ్మ నిచిక్యు** – వారికి నిశ్చయజ్ఞానం కలుగుతుంది. తే అంటే ఆత్మ గురించి తెలుసుకున్నవారు; బ్రహ్మ నిచిక్యు అంటున్నది ఉపనిషత్తు. అంటే బ్రహ్మ గురించి తెలుసుకుంటారు.

ఆత్మ గురించి తెలుసుకున్నవారు బ్రహ్మ గురించి తెలుసుకుంటారు. ఇదెలా సాధ్యం? ఒక్క సందర్భంలోనే అది సాధ్యం. ఆత్మ=బ్రహ్మ అయితేనే అది సాధ్యం. అవి రెండూ రెండు భిన్నమయినవి అయితే, ఉపనిషత్తు అలా అనలేదు. ఫిజిక్స్ జ్ఞానం పొందినవాడు, ఎకనామిక్స్ జ్ఞానం పొందుతాడు అనగలమా? లేదు, ఎందుకంటే ఈ రెండూ, రెండు భిన్న సబ్జెక్టులు. ఒకటి తెలుసుకుంటే ఇంకొకటి తెలుసుకోలేము అంటే అవి రెండూ భిన్నం అని అర్థం.

కాని ఉపనిషత్తు స్పష్టంగా ఆత్మ గురించి తెలుసుకున్న వ్యక్తి బ్రహ్మ గురించి తెలుసుకుంటాడు అంటున్నది.

**యదీశితుర్వీక్షణమీక్షితారమవీక్ష్య తన్మానసికేక్షణం స్యాత్।**
**న ద్రష్టురన్యః పరమో హి తస్య వీక్షా స్వమూలే ప్రవిలీయ నిష్ఠా॥ – సద్దర్శనం 22**

ఎవరైనా నేను భగవంతుణ్ణి చూశాను, భగవంతుని గురించి నాకు తెలుసు, నేను భగవంతుని అనుభవం పొందాను అని చెపితే, అతన్ని ఒకటే ప్రశ్న అడగండి, 'నీ గురించి నీకు తెలుసా?' ఒకవేళ అతను నా గురించి నాకు తెలియదు అంటే, అతను భగవంతుని గురించి ఎన్ని అనుభూతులు పొందినా అవి సత్యదూరమే. అవి వ్యావహారిక సత్యానికి చెందుతాయే కాని పారమార్థిక సత్యానికి చెందవు. బ్రహ్మజ్ఞానం అంటే ఏదో కాదు – ఆత్మజ్ఞానం.

బ్రహ్మజ్ఞానం = ఆత్మజ్ఞానం.

ఆత్మజ్ఞానానికి భిన్నంగా బ్రహ్మజ్ఞానం లేదు. వివేక చూడామణిలో భక్తి అంటే బ్రహ్మజ్ఞానం పొందటం అని వస్తుంది. భక్తి అంటే బ్రహ్మజ్ఞానం ఎలా అవుతుంది? అది ఎలా సాధ్యమో వివేక చూడామణిలోనే వివరించారు శంకరులవారు. భక్తి అంటే ఆత్మజ్ఞానం పొందటానికి చేసే విచారణ అన్నారు. భక్తి ఆత్మజ్ఞానం పొందటానికి చేసే విచారణ అయితే, భక్తి మోక్షాన్ని ఇస్తుంది. ఇది కాక భక్తికి వేరే ఏ ఇతర నిర్వచనం ఇచ్చినా, భక్తి మోక్షాన్ని ఇవ్వదు. భక్తి అంటే **ఆత్మ విచారణ** అయితే అది **మోక్షసాధనం**. భక్తి అంటే పూజ, జపం అయితే ఎన్నటికీ మోక్షాన్ని ఇవ్వలేదు.

అందువల్ల ఆత్మజ్ఞానం లేనిదే బ్రహ్మజ్ఞానం లేదు. ఎందుకు? రెండూ ఒకటే కాబట్టి. బ్రహ్మవర్ణన ఏం వచ్చింది ఇక్కడ?

**పురాణమ్, అగ్ర్యమ్** – పురాణమ్ అంటే అనాది. జగత్తు రాకముందు కూడా నిర్గుణబ్రహ్మ ఉంది. అనాదిత్వాత్ పురాణమ్. అనాది కాబట్టి పురాణం. పురాణాలకు ఆ పేరు రావటానికి కారణం కూడా అదే. అవి ఎప్పుడో వచ్చాయి. శాస్త్రం పురాణం; ఆత్మ పురాణం. ఇక్కడ బ్రహ్మకు ఈ పదం వాడబడింది.

ఈ మంత్రం కూడా పరోక్షంగా మహావాక్యం. ఆత్మజ్ఞానం=బ్రహ్మజ్ఞానం అంది. రెండు వైపులా సమానంగా ఉన్న పదం జ్ఞానం. ఆ పదాన్ని తొలగిస్తే ఏమవుతుంది? ఆత్మ=బ్రహ్మ.

మంత్రం 4.4.19

**మనసైవానుద్రష్టవ్యం నేహ నానాఽస్తి కిఞ్చన।**
**మృత్యోస్స మృత్యుమాప్నోతి య ఇహ నానేవ పశ్యతి॥**

ముందు మంత్రం కేనోపనిషత్తు మంత్రానికి దగ్గరగా ఉంది. ఈ మంత్రం కఠోపనిషత్తు మంత్రానికి దగ్గరగా ఉంది. ఇంచుమించు ఇలాగే కఠలో వస్తుంది.

**మనసైవేదమాప్తవ్యం నేహ నానాఽస్తి కిన్చన।**
**మృత్యోః స మృత్యుం గచ్ఛతి య ఇహ నానేవ పశ్యతి॥ కఠ 2.1.11**

ఈ మంత్రానికి ఇదం బ్రహ్మ పదం కలుపుకోవాలి. ఈ బ్రహ్మను మనస్సువల్లనే తెలుసుకోవాలి. అది కూడా సంస్కరించబడిన మనస్సువల్లనే తెలుసుకోవాలి. కాలాతీత బ్రహ్మ; సర్వ ఆధారభూత బ్రహ్మ; ప్రత్యగాత్మ బ్రహ్మ; పురాణ అగ్రమ్ బ్రహ్మను మనస్సుద్వారానే తెలుసుకోగలము.

దీనినుంచి ఒక ఉపసిద్ధాంతం స్పష్టంగా తెలుస్తున్నది. ఏమిటది? మనస్సును శూన్యం చేస్తేనో, మనస్సుకు అతీతంగా ఎదుగుతేనో బ్రహ్మను తెలుసుకోలేము. మనస్సులోని భావాలను పారద్రోలటం, నిర్వికారసమాధిలోకి వెళ్ళటంవల్ల మనస్సు ప్రశాంతతను పొందుతుంది తప్ప ఆత్మజ్ఞానం పొందదు. నిర్వికల్ప సమాధివల్ల ఆధ్యాత్మిక ప్రయోజనం లేదు. ఇది సరిగ్గా అర్థం చేసుకోవాలి.

ఉపనిషత్తు, మనస్సువల్లనే జ్ఞానం పొందగలము అని చెబుతున్నది. అంటే స్థూలశరీరం జ్ఞానాన్ని పొందలేదు; పంచప్రాణాలు జ్ఞానాన్ని పొందలేవు; కారణశరీరం జ్ఞానాన్ని పొందలేదు; ఆత్మ కూడా జ్ఞానాన్ని పొందలేదు. వీటన్నిటినీ తీసేస్తే పారిశేష్య న్యాయంద్వారా మిగిలింది ఏమిటి? సూక్ష్మశరీరం లేదా మనస్సు. మనస్సు అంటే బుద్ధి. బుద్ధిద్వారానే జ్ఞానం పొందగలము. బుద్ధి చురుకుగా, అర్థం చేసుకునేలా, మేలుకుని ఉండాలి. మనస్సుకు అతీతంగా ఎదిగితేనో, మనస్సును శూన్యం చేస్తేనో జ్ఞానం పొందలేము. మనస్సు పూర్తిగా చురుకుగా, పదునుగా ఉండాలి. జ్ఞానం పొందటానికి ఉపయోగించే అనేక పరికరాలలో మనస్సు ఒకటి కాదు. మనసా **ఏవ** అంటున్నది ఉపనిషత్తు. ఏవ చాలా ముఖ్యమైన పదం. మనస్సుచేత **మాత్రమే** జ్ఞానం పొందగలము.

వేరే సందర్భాలలో మనస్సుతో తెలుసుకోలేము అని వస్తుంది.

**న తత్ర చక్షుర్గచ్ఛతి న వాగ్గచ్ఛతి। నో మనో న విద్మో న విజానీమో యథైతదనుశిష్యాత్॥ – కేన 1.3**

అంటే ఉపనిషత్తు పరస్పర విరుద్ధమైన భావాలను చెప్పినట్టు కాదా అంటే కాదు. దీన్ని రెండు రకాలుగా పరిష్కరించవచ్చు.

మొదటి పద్ధతి సాంకేతిక పద్ధతి. దీన్ని అంతకుముందు కూడా చూశాము. మనస్సు కావాలంటే వృత్తివ్యాప్తి కావాలి, మనస్సు తెలుసుకోలేదు అంటే ఫలవ్యాప్తి అవసరం లేదు. ఇప్పుడు రెండవ పద్ధతి చూద్దాము. అది తేలికైన పద్ధతి. శంకరులవారు కూడా దీన్నే తరచు వాడతారు. ఇక్కడ కూడా రెండవ పద్ధతే ఉపయోగిస్తున్నారు.

శాస్త్రం మనస్సు తెలుసుకోలేదు అని చెపితే, సంస్కరించబడని మనస్సు తెలుసుకోలేదు; మనస్సు మాత్రమే తెలుసుకోగలదు అంటే సంస్కరించబడిన మనస్సు మాత్రమే తెలుసుకోగలదు అని అర్థం. దీన్ని నిరూపిస్తూ కఠోపనిషత్తులో ఒక మంత్రం ఉంది. **దృశ్యతే త్వగ్ర్యయా బుద్ధ్యా సూక్ష్మయా సూక్ష్మదర్శిభిః॥** అలాగే గీతలో 15వ అధ్యాయములో కూడా సంస్కరించబడని మనస్సు ఉన్నవారు బ్రహ్మను తెలుసుకోలేరనీ, సంస్కరించబడిన మనస్సు ఉన్నవారు తెలుసుకోగలరనీ వస్తుంది.

సంస్కరించబడిన మనస్సు అంటే ఏమిటి? గురువు దగ్గర క్రమం తప్పకుండా కొన్ని సంవత్సరాలు శాస్త్రశ్రవణం చేస్తే మనస్సు సంస్కరించబడుతుందని శంకరులవారు చెబుతారు.

అసలు ఏ జ్ఞానం పొందాలన్నా కూడా మనస్సు అంటే బుద్ధిద్వారానే పొందగలము. లౌకికజ్ఞానం మాత్రమే బుద్ధివల్ల పొందగలమనీ, ఆత్మజ్ఞానం ఆత్మద్వారా పొందాలనీ కొంతమంది ఊహ. అది వారి అపోహ మాత్రమే. ఆత్మ, ఆత్మజ్ఞానాన్నీ పొందదు, అనాత్మజ్ఞానాన్నీ పొందదు.

ఎందుకంటే ఏ జ్ఞానం పొందాలన్నా కూడా దానికి ఒక మార్పు జరుగుతుంది. ఆత్మ నిర్వికారం – అందువల్ల ఆత్మ అనాత్మజ్ఞానాన్నీ పొందలేదు, ఆత్మజ్ఞానాన్నీ పొందలేదు. ఆత్మజ్ఞానమవనీ, అనాత్మజ్ఞానమవనీ అది బుద్ధిలో కలగాలి. దాన్నే చిదాభాస సహిత అంతఃకరణం అనీ, అహంకారం అనీ, ప్రమాతా అనీ అంటారు. అనాత్మజ్ఞానం అనాత్మాకార వృత్తిద్వారా కలిగితే, ఆత్మజ్ఞానం ఆత్మాకారవృత్తిద్వారా కలుగుతుంది.

ఆత్మజ్ఞానం, లౌకికజ్ఞానం కూడా మనస్సువల్లనే పొందాలంటే దాన్ని ఆత్మజ్ఞానం అని ఎందుకు అంటారు? ఆత్మజ్ఞానం అంటే ఆత్మ గురించిన జ్ఞానం. అంతేకాని, ఆత్మద్వారా పొందే జ్ఞానం కాదు. మనోవృత్తిద్వారా ఆత్మ గురించి జ్ఞానం పొందాలి.

**మనసైవానుద్రష్టవ్యం**లో మనస్సువల్ల మాత్రమే ఎందుకు పొందగలమో చూశాము. అనుద్రష్టవ్యంలో అను పదం ఎందుకు వచ్చిందో అంతకుముందు మంత్రంలో కూడా చూశాము. 'అను' అంటే శాస్త్ర ఆచార్య ఉపదేశం అని అర్థం. అంటే ఆత్మ గురించి శాస్త్ర ఆచార్య ఉపదేశంద్వారానే తెలుసుకోవాలి.

ఈ సందర్భంలో ఒక వింతవాదన ఉంది. కొంతమంది ఆత్మ గురించి తెలుసుకోవటానికి శాస్త్రం, గురువు అవసరం లేదు అంటారు. నిజానికి ఆత్మ గురించి తెలుసుకోవటానికి గురువు, శాస్త్రం దగ్గరకు వెళ్ళటం వెర్రితనం అంటారు వారు. ఎందుకు? ఆత్మ పంచకోశాల లోపల ఉంది. పంచకోశవిచారణ చేస్తూ లోపలికి

వెళితే ఆత్మ తెలుస్తుంది. ఆత్మ లోపల ఉంటే, లోపలున్న ఆత్మ గురించి తెలుసుకోవటానికి బయటవున్న గురువు, శాస్త్రం దగ్గరకు వెళ్ళటం ఎందుకు? ఇదీ వారి వాదన. దీనికి మూడు జవాబులు చెప్పవచ్చు.

1. **శాస్త్రవిరుద్ధమ్**– ఇది ముక్కుసూటి జవాబు. శాస్త్రం అవసరం లేకపోతే, శాస్త్రం పదేపదే శాస్త్రాన్ని నేర్చుకోవాలనీ, అది కూడా గురువుద్వారానే నేర్చుకోవాలనీ ఎందుకు చెబుతుంది? అలా శాస్త్రం దగ్గరకు వెళ్ళనవసరం లేదంటే శాస్త్రం అనవసరం అవుతుంది. అది శాస్త్రవిరుద్ధం అవుతుంది. గురువు వద్దన్నా కూడా, పరోక్షంగా శాస్త్రాన్ని కూడా ధిక్కరించినట్టే అవుతుంది. ఎందుకంటే గురువు శాస్త్రాన్ని ఆధారం చేసుకునే బోధ చేస్తాడు.

2. **ఆత్మ సర్వవ్యాపకమ్** – వారు ఏమంటారు? ఆత్మ లోపల ఉంది కాబట్టి, బయట వెతకకండి అంటారు. వారిని మనం ఎదురుప్రశ్న వేయాలి. ఆత్మ **లోపలే** ఉందని ఎవరన్నారు? ఆత్మ బయట కూడా లేదా? ఆత్మ **సర్వవ్యాపకం** అని శాస్త్రం స్పష్టంగా చెబుతుంది. ఆత్మను బయట వెతకటం వారి దృష్టిలో వెర్రితనం అయితే, ఆత్మను లోపల వెతకటం మన దృష్టిలో అజ్ఞానం. ఆత్మ సర్వవ్యాపకం అనే ఆత్మస్వరూపానికి ఇది విరుద్ధం అవుతుంది.

**అంతఃబహిశ్చ తత్ సర్వమ్.**

3. **ఆత్మను నేనే** – ఇప్పుడు ప్రాథమిక జవాబును చూద్దాము. ఆత్మ పంచకోశాలలో ఉంది కాబట్టి, ఆత్మను బయట చూడనవసరం లేదు, ఆత్మను లోపల వెతకాలి అన్నారు వారు. ఈ వాదన ఎందుకు వచ్చింది? సాధకుడు ఆత్మకోసం వెతుకుతున్నాడు అనే అపోహవల్ల వచ్చింది.

మనం ఒక విషయం స్పష్టంగా తెలుసుకోవాలి. మనం ఎన్నడూ ఆత్మకోసం వెతకము. ఆ విషయంలో మనకు స్పష్టమైన అవగాహన ఉంది. ఎవరైనా ఆత్మకోసం ఎక్కడైనా వెతికితే, అతను ఎన్నడూ ఆత్మను పట్టుకోలేడు. ఆత్మకోసం వెతకటం పెద్ద పొరపాటు. ఆ పొరపాటును ముందునుంచీ చేస్తూనే ఉన్నాము.

ఆత్మకోసం వెతికితే, ఆత్మ బయటా లేదు, లోపలా లేదు. **ఆత్మను నేనే.** ఆత్మ అంటే నేను. అందువల్ల వేదాంతం ఎన్నడూ ఆత్మను వెతకమని చెప్పదు. నాకు వేదాంతం నువ్వు ఆత్మవు అని చెపితే, దానికి రెండే అవకాశాలున్నాయి. నేను ఆత్మను అని నాకు అర్థం అవాలి, లేదా నేను ఆత్మను అని నాకు అర్థం కాకుండా పోవాలి.

నేను ఆత్మను అని అర్థం అయితే, మళ్ళీ ఆత్మకోసం ఎక్కడో ప్రత్యేకంగా వెతుకుతానా? వెతకను. నేను ఆత్మను అని నాకు అర్థం కాకపోతే, నేను ఆత్మ గురించి ఎక్కడో వెతకకుండా, నేను ఆత్మను అని అర్థం చేసుకోవటానికి ప్రయత్నించాలి. అందువల్ల నేను ఆత్మను అని అర్థమయితే గొడవే లేదు. నేను ఆత్మను అని అర్థం కాకపోతే మాత్రం ఆత్మ గురించి వెతకకుండా, ఆత్మజ్ఞానంకోసం వెతకాలి.

అందువల్ల పంచకోశాలను తిరస్కరించుకుంటూ పోతే జ్ఞానం పొందము. నాకు జ్ఞానం అవసరం లేదు, నేను ఆత్మకోసం వెతుకుతున్నాను అని ఎవరన్నా అంటే, పిచ్చివాడా! ఆ ఆత్మవు నువ్వే అంటాము. ఆత్మకోసం వెతకకు, ఆత్మజ్ఞానంకోసం వెతుకు అంటాము. ఆత్మజ్ఞానం పంచకోశంలో లేదు, ప్రమాణంలో ఉంది. ప్రమాణం ఏది? గురుశాస్త్ర ఉపదేశం. అందువల్ల ఆత్మను వెతకకూడదు. ఆత్మజ్ఞానాన్ని పొందాలి. దాన్ని శాస్త్రంలో పొందాలి. అది గురువుద్వారా పొందాలి.

మీరు రైల్వే టైమ్‌టేబుల్ చూస్తుంటే, ఎవరైనా వచ్చి రైలు గురించి తెలుసుకోవటానికి పుస్తకంలో చూస్తే ఏం లాభం, స్టేషనుకి వెళ్ళి కనుక్కోవాలి అంటే ఎట్లా ఉంటుంది? అప్పుడు మీరేమంటారు? నేను రైలుకోసం వెతకటం లేదు, రైలు జ్ఞానంకోసం వెతుకుతున్నాను అంటారు. రైలు స్టేషనులో ఉండవచ్చు కాని రైలుజ్ఞానం రైల్వేటైమ్‌టేబుల్‌లో ఉంటుంది.

అదే విధంగా మనం ఆత్మకోసం వెతకటం లేదు. అలాంటి తెలివితక్కువ పని చెయ్యము. శాస్త్రంలో ఆత్మయొక్క జ్ఞానంకోసం వెదుకుతున్నాము. అందువల్ల గురుశాస్త్ర ఉపదేశంద్వారా ఆత్మజ్ఞానాన్ని పొందగలము. అందువల్ల అనుద్రష్టవ్యం పదం వచ్చింది. రెండవ భాగంలో బ్రహ్మ గురించిన వర్ణన వస్తుంది.

**నేహ నానాఽస్తి కించన** – ఈ బ్రహ్మలో కొంచెం కూడా నానాత్వం లేదు. ఆత్మకు భిన్నంగా రెండవ వస్తువు లేదు; ఆత్మకు భాగంగా కూడా రెండవ వస్తువు లేదు.

తక్కిన సిద్ధాంతులు బ్రహ్మకు భిన్నంగా ప్రపంచం ఉంది అంటారు లేదా బ్రహ్మలో భాగంగా ప్రపంచం ఉంది అంటారు. విశిష్టాద్వైతులు బ్రహ్మలో భాగంగా ప్రపంచం ఉంది అంటారు. కాని ఈ మంత్రంద్వారా జగత్తు బ్రహ్మకు బిన్నంగానూ లేదు, బ్రహ్మలో భాగంగానూ లేదని స్పష్టంగా తెలుస్తుంది. బ్రహ్మ నిర్వచనం **సజాతీయ విజాతీయ స్వగతభేదరహితం.**

అయితే, మాయాశక్తి బ్రహ్మకు భిన్నంగా ఉందా, బ్రహ్మలో భాగంగా ఉందా? ఇది చాలా కీలకమైన ప్రశ్న. కొంతమంది మాయ బ్రహ్మలో ఒక భాగం అంటారు. ఈశ్వరుడిని సర్వశక్తిమంతుడు అంటాము. ఆ సర్వశక్తి మాయాశక్తే. అందువల్ల మాయ బ్రహ్మలో ఒక భాగం.

ఇక్కడ మాయ కూడా బ్రహ్మలో భాగం కాదు అని స్పష్టమవుతున్నది. ఇహ నానాత్వం నాస్తి. మాయ అనే భాగం కూడా లేదు. మాయ బ్రహ్మకు భిన్నంగానూ లేక, బ్రహ్మలో భాగమూ కాకపోతే, మాయ ఏమిటి? మాయ అంటే బ్రహ్మనా? కాదు; బ్రహ్మలో భాగమా? కాదు; బ్రహ్మకు భిన్నంగా ఉందా? లేదు; మాయ ఉందా? లేదు; మాయ లేదా? ఉంది. అయితే మరి మాయ ఏమిటి? అనిర్వచనీయము – మాయ ఉందనీ చెప్పలేము; లేదనీ చెప్పలేము. అందువల్ల మాయ తక్కువస్థాయికి చెందిన సత్యమనీ, బ్రహ్మే దానికి ఆధారమనీ అంటాము.

బ్రహ్మ మాయకు ఆధారం అయితే, మాయ బ్రహ్మలో ఒక భాగం కాదా? మాయ వ్యవహారిక స్థాయికి చెందినది; బ్రహ్మ పారమార్థిక స్థాయికి చెందినది. రెండు భిన్న స్థాయిలకు చెందినవి ఒకదానిలో ఒకటి భాగం అవలేవు. మీరు నా దగ్గర ఐదులక్షలు ఉన్నాయి – కాని అందులో నాలుగు లక్షలు జాగ్రదావస్థలో బ్యాంకులో ఉన్నాయి; ఒక లక్ష స్వప్నావస్థలోని బ్యాంకులో ఉంది అనగలరా? స్వప్నంలోని డబ్బు ఇక్కడి డబ్బుతో కలపలేరు. స్వప్నాన్ని ప్రాతిభాసిక సత్యం అనీ, జాగ్రదావస్థను వ్యావహారిక సత్యం అనీ అంటారు. రెండు భిన్న సత్యాలను కలపలేము. ఇదే సూత్రం ప్రకారం మాయను, బ్రహ్మతో కలపలేము.

కాని, ఒకవేళ ఎవరైనా ఈ బోధను నేను స్వీకరించలేను, నాకు తోచినవే స్వీకరిస్తాను అంటే వారి పరిస్థితి ఏమిటి? కొంతమంది కర్మ, ఉపాసన, భగవంతుడు సకల గుణాభిరాముడువంటి అంశాలే తీసుకుంటాము కాని అద్వైతం తీసుకోము అంటారు. సరే మీయిష్టం అంటుంది శాస్త్రం.

**య ఇహ నానేవ పశ్యతి** – ఎవరైతే ఇక్కడ నానాత్వాన్ని చూస్తారో, వారు.

**మృత్యోస్స మృత్యుమాప్నోతి** – మృత్యువునుంచి మృత్యువును పొందుతారు. అంటే పునరపి మరణం, పునరపి జననం అనే జన్మవృత్తంలో పడి తిరుగుతూనే ఉంటారు.

అంటే అద్వైతం నేను ఒప్పుకోను; నేను ఈశ్వరుడికి భిన్నంగా ఉన్నాను; ఈశ్వరుడు జగత్తుకు భిన్నంగా ఉన్నాడు అంటే ఎప్పటికీ సంసారం అనే జైలులో ఖైదీగా ఉండాల్సిందే. శిక్ష మామూలు శిక్ష కాదు, అది త్వరగా తీరేది కాదు. సంసారంలో పడి కొట్టుమిట్టాడాలి. కనీసం ఈ జన్మలో ముగుస్తుందా అంటే అలా ముగియదు. మృత్యువునుంచి మృత్యువును పొందుతారు. జన్మనుంచి జన్మ పొందుతాడు అనటం లేదు. మృత్యువునుంచి మృత్యువును పొందుతాడు అంటున్నది. ఎందుకు? భయపెట్టటానికి.

అయినా ఫర్వాలేదు, నేను నానాత్వం చూస్తాను; మరణిస్తాను, మళ్ళీ పుడతాను అని ఎవరైనా అంటే, సరే ఆల్ ది బెస్ట్, నీ ఓపిక ఉన్నన్నాళ్ళూ ఈ వృత్తంలో తిరుగు. అలసిపోయాక అద్వైతానికి రాక తప్పదు. అది ఈ జన్మలో వస్తావో, కొన్ని జన్మల తర్వాత వస్తావో తెలియదు అంటుంది శాస్త్రం. ఇంచుమించు ఇదే మంత్రాన్ని కఠోపనిషత్తులో కూడా చూస్తాము.

మంత్రం 4.4.20

**ఏకధైవానుద్రష్టవ్యమేతదప్రమయం ధ్రువమ్ ।**
**విరజః పర ఆకాశాదజ ఆత్మా మహాన్ ధ్రువః ॥**

జ్ఞానమహిమ ఇంకా కొనసాగుతున్నది. బ్రహ్మ సజాతీయ విజాతీయ స్వగతభేద రహితం. ఈ పదాలను పంచదశిలో ఒక శ్లోకంలో విద్యారణ్యులవారు నిర్వచించారు.

**వృక్షస్య స్వగతో భేదః పత్రపుష్ప ఫలాదిభిః**
**వృక్షాంతరాత్ సజాతీయ విజాతీయ శిలాదితః**

స్వగతభేదం – ఒక చెట్టులోని భిన్నభాగాలు. ఉదా – పువ్వులు,పండ్లు, ఆకులు
సజాతీయ భేదం – ఒక చెట్టుకు, ఇంకొక చెట్టుకు భేదం. ఉదా – మామిడిచెట్టు, కొబ్బరిచెట్టు
విజాతీయ భేదం – ఒక చెట్టుకు, చెట్టు కాని ఇంకొక దానికీ మధ్య భేదం. ఉదా – చెట్టు, శిల

విశిష్టాద్వైతం స్వగతభేదం ఉంది అంటుంది. బ్రహ్మలో అనేక భాగాలున్నాయనీ, ఈశ్వరునిలో చేతన, అచేతనభాగాలు ఉన్నాయనీ, మనుష్యులు చేతనభాగాలు అనీ అంటుంది విశిష్టాద్వైతం. కాని బ్రహ్మలో సజాతీయ భేదం లేదు. ఎందుకంటే ఇంకొక బ్రహ్మ లేదు; బ్రహ్మలో విజాతీయ భేదం లేదు. ఎందుకంటే బ్రహ్మ తప్ప వేరే రెండవ వస్తువు లేదు అంటుంది విశిష్టాద్వైతం.

అందువల్ల విశిష్టాద్వైతం కొంతమేరకు అద్వైతాన్ని ఒప్పుకుంటుంది కాని పూర్తిగా కాదు. మనం స్వగత భేదాన్ని ఒప్పుకుంటే, అది విశిష్టాద్వైతం అవుతుంది; దాన్ని కూడా ఒప్పుకోకపోతే అది **నిర్విశేష అద్వైతం** అవుతుంది. ఇక్కడ మనం నిర్విశేష అద్వైతం గురించి మాట్లాడుతున్నాము. ఏమిటి దానికి ప్రమాణం?

**ఏకధా ఏవ అప్రమయమ్** – ఏకధా అంటే ఏక ప్రకారేన. భేదరాహిత్యేన, భేదాలు లేకుండా. అప్రమయం పదాన్ని ఛాందస ప్రయోగం అంటారు. దాన్ని **అప్రమేయం**గా తీసుకోవాలి. నిజానికి ఈ మంత్రం చాలా ముఖ్యమైన మంత్రం. ఎందుకంటే **అప్రమేయం** పదం, పది ముఖ్యమైన ఉపనిషత్తుల్లో వేరే ఎందులోనూ రాదు– గీతలో రెండుసార్లు, రెండు అర్థాలతో వస్తుంది. చాలా పెద్దది లేదా కొలతకు అందనిది ఒక అర్థం; రెండవ అర్థం తెలుసుకోలేనిది. తెలుసుకోలేనిది అంటే ఏ ప్రమాణానికీ అందనిది.

**అనుద్రష్టవ్యమ్** – ఇక్కడ అర్థం ఏ ప్రమాణానికీ అందనిది. ఇక్కడ కూడా ఉపనిషత్తు రెండు భిన్న భావాలను చెప్పినట్టుగా అనిపిస్తుంది. ముందేమో అనుద్రష్టవ్యం అంది. అంటే సజాతీయ విజాతీయ స్వగతభేద రహితమైనదిగా తెలుస్తుంది అన్నది.

**అప్రమయమ్** – మళ్ళీ పక్కనే అప్రమేయం అంది. అంటే ఏ ప్రమాణానికీ అందనిది అంది. అంటే దీని పక్కన ఒక పదం కలుపుకోవాలి. ఏ ప్రమాణానికీ అందనిది, ఒక్క **శాస్త్రానికి తప్ప**. బ్రహ్మను వేరే ప్రమాణాలతో తెలుసుకోలేము; ఒక్క శాస్త్రప్రమాణంతోనే తెలుసుకోగలము. శాస్త్రం ఎలా చెబుతుంది? శాస్త్రం కూడా ప్రత్యక్షంగా చెప్పదు. నేతి నేతి పద్ధతిద్వారా అన్నీ తిరస్కరించుకుంటూ వస్తుంది. ఎందుకు ప్రత్యక్షంగా చెప్పదు? నేతినేతి ద్వారా తిరస్కరించుకుంటూ వస్తే, మిగిలేది ఏమిటి? 'నేను'. బ్రహ్మ అంటే నేను. నేను అంటే చైతన్య ఉనికిని.

చైతన్యం అంటే చిత్; ఉనికి అంటే సత్. నేను సత్‌చిత్ బ్రహ్మను. నాకు ఉన్న గుణాలన్నీ తిరస్కరించుకుంటూ వస్తే మిగిలేది ఏమిటి? 'నేను' మాత్రమే! నేను మనిషిని, నేను భర్తను, నేను వ్యాపారవేత్తను – ఇలా నేను తర్వాత ఎన్నో చెప్పుకుంటూ పోతాను. ఒక పెద్ద బయోడేటా ఇస్తాను. ఆ బయోడేటా అంతా కొట్టేస్తూ వస్తే, మిగిలేది ఏమిటి? నేను అనే శుద్ధ చైతన్యం. ఆ శుద్ధ చైతన్యాన్ని ప్రత్యేకించి వివరించము, వివరించనవసరం లేదు కూడా. ఎందుకంటే అది స్వయంప్రకాశకం. అందువల్ల **అప్రమేయం**.

**ధ్రువమ్** – కాల పరిచ్ఛేద రహితం. బ్రహ్మ నిత్యం, అవినాశి. ద్వైతంలో ఉన్నది ఏదైనా కాలం, దేశ పరిధిలో వస్తుంది. ద్వైతానికి అతీతమైనది కాలాతీతం కూడా అవుతుంది. 4.4.16లో **ఆత్మ కాలాతీతం** అని చూశాము.

**విరజః** – రజం అంటే దోషం; విరజం అంటే దోషరహితం, నిర్మలం, మలరహితం. ఈ దోషాలను ఎన్నైనా వర్ణించవచ్చు కాని శంకరులవారు రెండు దోషాలను తీసుకున్నారు. అవి – **పుణ్యపాప దోష రహితః**.

దీన్నిబట్టి మనం గ్రహించవలసిన ఉపసిద్ధాంతం ఏమిటి? పుణ్యం కూడా ఒక దోషమే. పుణ్యం అనుభవించటానికి కూడా మళ్ళీ జన్మనెత్తాలి. పుణ్యం మనిషికి మోక్షాన్ని ఇవ్వదు. జన్మమృత్యు వృత్తంలో వేసి తిప్పుతుంది పుణ్యం కూడా. అందువల్ల బ్రహ్మ పుణ్యపాప దోషరహితం, విరజం.

**పర ఆకాశాత్** – ఆకాశానికంటే సూక్ష్మము. ఆకాశం అంటే పంచభూతాలలో ఒకటిగా తీసుకోకూడదు. ఆకాశం అంటే ఈశ్వరుడు. అవ్యాకృత ఆకాశం. సమష్టి కారణ ప్రపంచసహిత బ్రహ్మను ఆకాశం అంటారు.

ఈ ఉపనిషత్తులోనే అక్షర బ్రాహ్మణములో ఆకాశం అంటే ఈశ్వరుడు అనే అర్థంతో చూశాము. అది ఇక్కడికి తెచ్చుకోవాలి. ఈశ్వరాత్ అపి పరబ్రహ్మ అంటే ఈశ్వరునికంటే శ్రేష్ఠం.

బ్రహ్మ + మాయ = ఈశ్వరుడు.

ఈశ్వరుడు అంటే బ్రహ్మ మాయతో కలిసి ఉన్నాడు. అందువల్ల ఈశ్వరుడు సగుణబ్రహ్మ. సగుణబ్రహ్మ అంటే సవికార బ్రహ్మ. సవికార బ్రహ్మ అంటే వ్యావహారిక స్థాయికి చెందిన బ్రహ్మ. కాని నిర్గుణబ్రహ్మ చైతన్యం పారమార్థిక స్థాయికి చెందుతుంది. ఆ పారమార్థిక స్థాయిలో జీవ, జగత్తు, ఈశ్వర అనే త్రిపుటి ఉండదు.

అందువల్ల ఈశ్వరుడు జగత్తుకు పతి అయినా ఆ ప్రభు పదవి వ్యావహారిక స్థాయికి చెందినది. పూజలు ఉంటే ప్రభువు ఉంటాడు. పారమార్థిక స్థాయిలో ప్రభువు, పూజలు విడివిడిగా లేవు. అందువల్ల ప్రభువు హోదా ఉండదు. అందువల్ల బ్రహ్మ ఈశ్వరుడుకన్నా గొప్పవాడు.

**అజః** – జన్మరహితం;

**ఆత్మా** – అన్ని జీవుల్లో ఉంది;

**మహాన్** – అపరిచ్ఛిన్నం. అప్రమేయానికి రెండు అర్థాలను చూశాము. ఒకటి కొలతకు అందనిది; ఇంకొకటి ప్రమాణానికి అందనిది. ఇక్కడ మొదటి అర్థం వస్తుంది. మహాన్ అంటే దేశపరిచ్ఛేదరహితం.

**ధ్రువః** – ధ్రువం అంటే కాలపరిచ్ఛేద రహితం. అంటే దేశ, కాలాలకు అతీతం.

## మంత్రం 4.4.21

**తమేవ ధీరో విజ్ఞాయ ప్రజ్ఞాం కుర్వీత బ్రాహ్మణః।**

**నానుధ్యాయాద్బహూఞ్ఛబ్దాన్ వాచో విగ్లాపనగ్ం హి తదితి ॥**

**ఇతి** – ఇక్కడితో ఋగ్మంత్రాలు అయిపోయాయి అని అర్థం. యాజ్ఞవల్క్యుడు 8–21 వరకూ ఋగ్మంత్రాలను ఉటంకించాడు. ఈ ఉపసంహార మంత్రంలో అందరికీ ఒక సలహా వస్తున్నది. జీవితంలో మన ముఖ్యలక్ష్యంగా ఏం ఉండాలో సూచిస్తున్నది.

**ధీరః** – ఒక తెలివైన వ్యక్తి; అనుభవం ఉన్న వ్యక్తి; నిత్యానిత్యవస్తువివేకం ఉన్న వ్యక్తి. ఆత్మజ్ఞానం పొందటానికి మాత్రమే కృషిచేయాలి. తక్కినవన్నీ జీవితంలో రెండవ అంశాలుగా ఉండాలి. ఆత్మజ్ఞానం మాత్రమే ప్రథమ స్థానం వహించాలి. శ్రేయోమార్గం, ప్రేయోమార్గాలలో ఏది ముఖ్యమో తెలుసుకోవాలి. లౌకిక సుఖాలు శాశ్వతమైన ఫలాన్ని ఇవ్వవని అర్థం చేసుకోవాలి. అందువల్ల ధర్మ, అర్థ, కామాలమీద ఆధారపడి లాభంలేదు. ప్రాథమిక లక్ష్యం శ్రేయోమార్గం అంటే మోక్షం అవాలి. కర్మయోగం పాటించి చిత్తశుద్ధి పొంది, ఉపాసన యోగం పాటించి చిత్తఏకాగ్రత పొంది, సాధనచతుష్టయసంపత్తిని పొందితే జ్ఞానం పొందటానికి అర్హత వస్తుంది. దాన్ని అధికారిత్వం అంటారు. అటువంటి వ్యక్తిని ధీరా అంటారు.

**తమేవ విజ్ఞాయ** – దాని తర్వాత ఆత్మజ్ఞానం పొందటానికి మాత్రమే కృషిచెయ్యాలి. ఆత్మజ్ఞానఫలం ఏమిటి?

**యః అకామః నిష్కామః ఆప్తకామః ఆత్మకామః**

అనాత్మ గురించిన కోరికలు కోరితే, ఆ కోరికలు అనంతంగా సాగుతాయి. అదే ఆత్మ గురించి కోరితే, అన్ని కోరికలూ తీరతాయి. కోరికలు అనంతం అంటారు. అనాత్మ కోరికలు అనంతం. కాని ఆత్మను కోరితే, అతనికి కోరికలన్నీ తీరుతాయి. కోరికలన్నీ తీరతాయి కాబట్టి అతను అకామః అవుతాడు. అంటే కోరికలు లేనివాడు అవుతాడు.

**ప్రజ్ఞాం కుర్వీత** – ఎవరైనా నేను ఆత్మజ్ఞానం పొందాను అంటే అక్కడితో ఆగవద్దు, తర్వాత స్థాయికి వెళ్ళమంటున్నాడు. నిదిధ్యాసనం చెయ్యాలి. అంటే జ్ఞానం పొందితే చాలదు, జ్ఞాననిష్ఠలో ఉండాలి. అప్పుడే జ్ఞానం పూర్తి అవుతుంది. ఊరగాయ అంటే ఏమిటి? మామిడికాయ ముక్కలు ఉప్పులో బాగా ఊరి, ఆ ఉప్పు ముక్కకంతా అంటుకుంటుంది. కాని ఆవకాయ పెట్టిన వెంటనే తింటే ఉప్పు కలవదు. రెండుమూడు రోజులు ఊరాలి. అలాగే వేదాంతం నేర్చుకోగానే సరిపోదు, మన జీవితమంతా వేదాంతమయంగా ఉండాలి.

**బ్రాహ్మణః** – బ్రాహ్మణః అంటే సత్త్వగుణం ఉన్న వ్యక్తి. అతను జాతి బ్రాహ్మణుడై ఉండనవసరం లేదు. గుణ బ్రాహ్మణుడు అయివుండాలి. ఇంకా మాట్లాడితే సాధనచతుష్టయసంపన్న బ్రాహ్మణుడు అయి ఉండాలి.

లౌకిక వ్యవహారాలు ఎలా ఉండాలి? వీలున్నంత వరకూ వాటిని తగ్గించుకోవాలి. అనాత్మ శాస్త్రం ఎక్కువగా చదవటం మంచిది కాదు. అందువల్ల తొందరపడి వేదాంతాన్ని యౌవనంలో ఉన్న వ్యక్తికి సూచించము. ఒక యువకుడు చాలా పుస్తకాలు చదవాలి, దేశాలు తిరగాలి, ఎన్నో పనులు చెయ్యాలి. అటువంటి వ్యక్తికి వేదాంతం బోధించకుండా ధర్మశాస్త్రం బోధించాలి. లేకపోతే అతనిలో ఘర్షణ మొదలవుతుంది. అందువల్ల ఐహిక సుఖాల మీద ఆసక్తి లేనివారికి చెప్పాలి.

ఈ మంత్రం ఇక్కడిదాకా వచ్చిన వ్యక్తికి జీవితంలో ప్రధానలక్ష్యం మోక్షమే అయివుంటుందని భావిస్తున్నది.

**బహూన్ శబ్దాన్ న అనుధ్యాయాత్** – అనాత్మకు సంబంధించిన తక్కిన పుస్తకాలు చదవవద్దు. తర్కం, మీమాంస, ద్వైతశాస్త్రంవంటివి చదవకూడదు. ఎందుకంటే అటువంటి పుస్తకాలు చదివితే అవి ఆ వ్యక్తిని అటువైపు ఆకర్షించి, అనాత్మ ప్రపంచంలోకి లాక్కుపోతాయి.

**వాచో విగ్లాపనగ్ం హి తత్** – అది వాగింద్రియాన్ని బలహీనం చేస్తుంది. అద్వైతం గురించి తప్ప, అనవసరమైన విషయాల గురించి మాట్లాడకూడదు. అంటే మన పరిధి దాటి ఆలోచించకుండా, జ్ఞాననిష్ఠలోనే నెలకొని ఉండాలి. ఇటువంటి సలహానే ముండకోపనిషత్తులో కూడా చూస్తాము.

**తమేవైకం జానథ ఆత్మానమ్**

**అన్యా వాచో విముఞ్చథ అమృతస్యైష సేతుః॥ – ముండకమ్ 2–2–5**

వేరేవాటిని చదవద్దు, వాటి గురించి మాట్లాడవద్దు, తీవ్రముముక్షుత్వం పాటించు అంటున్నది మంత్రం. అది అంత తేలికగా రాదు. దానికి చాలా శిక్షణ అవసరం. వ్యవహారాల్లో లోతుగా కూరుకుపోయిన మనస్సు అంత తేలికగా పైకి రాదు. కాని అలాంటి అనవసరమైన విషయాలతో కాలక్షేపం చేస్తే వాగింద్రియం బలహీనమవుతుంది అని తెలుసుకుని, ఆ విధంగా సాధన చెయ్యాలి.

ఇక్కడితో ఋగ్మంత్రాలు అయిపోయాయి. వాటిని 8–21 వరకూ చూశాము.

మంత్రం 4.4.22

**స వా ఏష మహానజ ఆత్మా యోఽయం విజ్ఞానమయః ప్రాణేషు య ఏషోఽన్తర్హృదయ ఆకాశస్తస్మిన్ శేతే సర్వస్య వశీ సర్వస్యేశానః ॥ సర్వస్యాధిపతిః ॥ స న సాధునా కర్మణా భూయాన్నో ఏవాసాధునా కనీయాన్ ॥ ఏష సర్వేశ్వరః ॥ ఏష భూతాధిపతిరేష భూతపాల ఏష సేతుర్విధరణ ఏషాం లోకానామసమ్భేదాయ ॥ తమేతం వేదానువచనేన బ్రాహ్మణా వివిదిషన్తి యజ్ఞేన దానేన తపసాఽనాశకేనైతమేవ విదిత్వా మునిర్భవతి ॥ ఏతమేవ ప్రవ్రాజినో లోకమిచ్ఛన్తః ప్రవ్రజన్తి ॥ ఏతద్ధ స్మ వై తత్పూర్వే విద్వాగ్ంసః ప్రజాం న కామయన్తే ॥ కిం ప్రజయా కరిష్యామః ॥ యేషాం నోఽయమాత్మాఽయం లోక ఇతి ॥ తే హ స్మ పుత్రైషణాయాశ్చ విత్తైషణాయాశ్చ లోకైషణాయాశ్చ వ్యుత్థాయాథ భిక్షాచర్యం చరన్తి యా హ్యేవ పుత్రైషణా సా విత్తైషణా యా విత్తైషణా సా లోకైషణోభే హ్యేతే ఏషణే ఏవ భవతః । స ఏష నేతి నేత్యాత్మాఽగృహ్యో న హి గృహ్యతేఽశీర్యో న హి శీర్యతేఽసఙ్గో న హి సజ్యతేఽసితో న వ్యథతే న రిష్యత్యేతము హైవైతే న తరత ఇత్యతః పాపమకరవమిత్యతః కల్యాణమకరవమిత్యుభే ఉ హైవైష ఏతే తరతి॥ నైనం కృతాకృతే తపతః ॥**

తన బోధను ముగించదలచుకున్నాడు యాజ్ఞవల్క్యుడు. ఈ మంత్రంలో మూడు అంశాల గురించి చెబుతున్నాడు. అవి పరమాత్మస్తుతి; జ్ఞానసాధనలు; జ్ఞానఫలం.

1. **పరమాత్మ స్తుతి** – ఇంతవరకూ ముందు మంత్రాల్లో మనం పరమాత్మ స్తుతి చూశాము. ఇక్కడ కూడా కొంత చూస్తాము.

**మహాన్ అజః ఆత్మా** – అంతకుముందు చూసిన విశేషణాలలో ఇక్కడ రెండు పేర్కొన్నాడు యాజ్ఞవల్క్యుడు. అవి మహాన్, అజః. మహాన్ అంటే అనంతం; అజః అంటే పుట్టుక లేనివాడు. 20వ మంత్రంలో అజ ఆత్మా మహాన్ అని వచ్చింది. ఈ రెండు పదాలూ వాడటంద్వారా యాజ్ఞవల్క్యుడు ఆ మంత్రాన్ని గుర్తు చేస్తున్నాడు. తక్కిన విశేషణాలు మనం కలుపుకోవాలి.

**యోఽయం విజ్ఞానమయః ప్రాణేషు** – ఆ పరమాత్మ ఎక్కడ ఉన్నాడు? ఆ పరమాత్మ ఎవరో కాదు, అంతకుముందు మంత్రాల్లో మనం చూసిన జీవాత్మే అంటున్నాడు యాజ్ఞవల్క్యుడు.

**కతమ ఆత్మేతి యోఽయం విజ్ఞానమయః ప్రాణేషు హృద్యన్తర్జ్యోతిః పురుషః** – 4.3.7

మూడవ బ్రాహ్మణములో జీవాత్మను వర్ణించటానికి యోఽయం విజ్ఞానమయః ప్రాణేషు అని వాడాడు. ఇక్కడ కూడా అవే పదాలు చూస్తున్నాము.

**(మహానజ ఆత్మా)** – పరమాత్మ; **(విజ్ఞానమయః ప్రాణేషు)** – ఆ పరమాత్మే జీవాత్మ. అలా ఈ వాక్యం ఐక్యాన్ని చూపిస్తుంది. అందువల్ల ఇది మహావాక్యం. ఈ ఆత్మ ఎక్కడ ఉంది? జీవాత్మ, పరమాత్మల ఐక్యం చూశాము కాబట్టి ఇక మీదట కేవలం ఆత్మ పదాన్ని వాడతాము.

పరమాత్మ, జీవాత్మ అని రెండు భిన్న పేర్లు ఉన్నాయి కాని అవి వస్తురూపేణా ఒకటే.

**య ఏషః అంతర్హృదయ ఆకాశస్తస్మిన్ శేతే** – ఈ ఆత్మ హృదయ ఆకాశంలో ఉంది. హృదయ ఆకాశం ఎక్కడ ఉంది? హృదయ ఆకాశం శరీరంలో ఉంది. శరీరం ఆలయం అయితే హృదయం గర్భగుడిలాంటిది. అందులో ఆత్మ ఉంది. ఈ వర్ణన చాలా సందర్భాలలో చూశాము. దీన్ని అక్షరాలా తీసుకోకూడదు. ఆత్మ హృదయంలో ఉంది అన్నదానికి హృదయంలో లభ్యమవుతుంది అన్నదానికీ మధ్య వ్యత్యాసం ఉంది.

హృదయంలో ఉంది అంటే హృదయంలోనే ఉంది, బయట లేదు అని అర్థం వస్తుంది. సర్వగత ఆత్మ హృదయాకాశంలో కూడా లభ్యమవుతుంది అనాలి. హృదయాకాశంలో ఎక్కడ ఉంది? మనస్సులో ఉంది. అంతఃకరణే ఉపలభ్యతి. అంతఃకరణంలో ఎలా ఉంది?

**అంతఃకరణే సర్వసాక్షిరూపేణ ఉపలభ్యతి.**

దేనికి సాక్షి? వృత్తిభావ అభావసాక్షి. ఆలోచనలు ఉన్న, ఆలోచనలులేని మనస్సును సాక్షిగా చూస్తుంది. శేతే అంటే పడుకుని ఉంది. అంటే అనంత శయన ఈశ్వరునిలాగా లేదా పద్మనాభస్వామిలాగా పడుకునివుంది.

ఆ పడుకోవటాన్ని అక్షరాలా తీసుకోకూడదు. ఆలోచనలు లేకుండా, సంసారం లేకుండా ఉంది ఆత్మ అని అర్థం. భగవంతుడు గుడిలోనో, వైకుంఠంలోనో అక్షరాలా పడుకునివుంటే భగవంతుడు కూడా పరిచ్ఛిన్నుడు అవుతాడు. అందువల్ల ఆత్మ విశ్రాంతిగా ఉంది, ఏమీ వ్యవహారం లేకుండా ఉంది అని వస్తుంది.

**సర్వస్య వశీ** – ఆత్మ అంటే జీవాత్మ, పరమాత్మ రెండూ అని గుర్తుంచుకోవాలి. ఆత్మ అధీనంలో అన్నీ ఉంటాయి. ఎందుకంటే ఆత్మ అధిష్ఠానం. ఆ అధిష్ఠానంమీద జగత్తు అధ్యాస చెయ్యబడింది. ఆత్మ అంటే నేను అని కూడా మర్చిపోకూడదు. అన్నీ నాలో ఉన్నాయి కాని నేను వాటిలో లేను. పాము తాడుమీద ఉంది కాని తాడు పాముమీద లేదు. అందరినీ చిత్, సత్ రూపంలో నా అధీనంలో ఉంచుకుంటాను.

**సర్వస్య ఈశానః** – ఆత్మ అన్నిటికీ రాజు. అంటే ఈశ్వరుడు లేదా సర్వేశ్వరుడు. ఈశానః అంటే అధిపతి.

**సర్వస్య అధిపతిః** – ఇక్కడ అధిపతి అంటే స్వతంత్రుడు అని తీసుకోవాలి. మామూలుగా అధిపతి అంటే రాజు. కాని ఆ అర్థంతో ఈశానః వచ్చేసింది కాబట్టి, మళ్ళీ అదే అర్థం తీసుకుంటే పునరుక్తి దోషం వస్తుంది కాబట్టి, ఇక్కడ అధిపతికి స్వతంత్రుడు అని అర్థం చెప్పుకోవాలి. కొన్నిచోట్ల అధిపతికి స్వతంత్రం ఉండదు. అతను మంత్రులు, సెక్రటరీలు, సలహాదారుల మాటలు వినాల్సి వుంటుంది ఒక్కోసారి. అలాంటప్పుడు వారు పేరుకే రాజులు అవుతారు కాని వారికి ఏమీ అధికారం ఉండదు. ఆత్మ విషయంలో అలా కాదు. ఆత్మ స్వతంత్రం.

**స న సాధునా కర్మణా భూయాన్నో ఏవాసాధునా కనీయాన్** – ఆత్మ అనంతం. ఆత్మ పుణ్యకర్మవల్ల వర్ధిల్లదు; చెడు కర్మవల్ల క్షీణించదు. ఇది చాలా ముఖ్యమైన వాక్యం. వ్యావహారిక ప్రపంచంలో మనం బాగా చేస్తే, మనహోదా పెరుగుతుంది. అంతేకాదు, పుణ్యకర్మలు ఎక్కువ చేస్తే, పుణ్యలోకాలకు వెళ్ళి, స్వర్గసుఖాలు అనుభవిస్తాము. అందువల్ల వ్యావహారిక ప్రపంచంలో తారతమ్యాలు ఉంటాయి.

తారతమ్యాలు ఉంటే మంచివా, కాదా? తారతమ్యాలు ఉంటే, ఎన్నటికీ తృప్తి చెందము. అసంతృప్తి పెరుగుతుంది. కాని ఆత్మ విషయంలో తారతమ్యాలు ఉండవు. అందువల్ల మోక్షం పుణ్యంవల్ల కలగదు అంటారు. పుణ్యంలో కూడా తారతమ్యాలు ఉంటాయి.

నిజానికి ఈ మంత్రం మొత్తం చాలా ముఖ్యమైన మంత్రం. శంకరులవారు దీన్ని తరచు ఉటంకిస్తుంటారు. దీన్నుంచే గీతలో ఆఖరి అధ్యాయంలో వస్తుంది- **సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ.** పుణ్యకర్మ ఫలాన్ని ఇస్తుంది కాని దానికి కూడా హెచ్చుతగ్గులు ఉంటాయి. అందువల్ల పుణ్యకర్మలు కూడా మానాలి. ఆత్మ పుణ్యకర్మలవల్ల గొప్పగా అవదు; పాపకర్మలవల్ల క్షీణించదు.

**ఏష సర్వేశ్వరః ఏష భూతాధిపతిః ఏష భూతపాలః** – మళ్ళీ ఆత్మస్తుతి వస్తున్నది. ఈ ఆత్మ సర్వేశ్వరుడు, సర్వభూతాలకు అధిపతి, సర్వభూతాలకు రక్షకుడు. ఆత్మ పాలకుడు, రక్షకుడు పదాలు వేసినప్పుడు మాయాసహిత ఈశ్వరుడు అని మర్చిపోకూడదు. బ్రహ్మ+మాయ=ఈశ్వరుడు అన్నాము. అంటే ఈశ్వరుడు–మాయ=బ్రహ్మ. మాయ లేకపోతే నిర్గుణబ్రహ్మ అకర్తా, అభోక్తా. ఇంతకుముందు కూడా ఇదే మంత్రంలో సర్వస్య ఈశానః సర్వస్య అధిపతి అని చూశాము. ఇప్పుడు మళ్ళీ సర్వేశ్వరుడు, భూతాధిపతి, భూతపాలకుడు అని మళ్ళీ ఎందుకు వచ్చింది?

ఆత్మ అధిపతి అంటే కర్మ చేస్తున్నట్టు అవుతుంది. కర్మ చేస్తే పుణ్యఫలం, పాపఫలాలు వస్తాయి. అయితే ఆత్మకు కూడా పాపపుణ్యాలు అంటుతాయా అనే సందేహం వస్తుంది. ఆత్మకు పాపపుణ్యాలు అంటవు. ఆత్మ జగత్తుకే అధిపతి కాదు, కర్మకు కూడా అధిపతి. ఆత్మ కర్మ చేసినా కర్మఫలం అంటదు.

**నమే కర్మఫలం స్పృజః**

**ఏష సేతుర్విధరణః** – ఆత్మ ధర్మరక్షకుడు కూడా. ఇది ప్రత్యక్షంగా చెప్పకుండా పరోక్షంగా చెప్పాడు యాజ్ఞవల్క్యుడు. పొలాలలో ఉండే సేతువుతో ఆత్మను పోల్చాడు. ఇక్కడ సేతువు అంటే అడ్డుకట్ట. అది పొలంనుంచి నీరు బయటకు వెళ్ళిపోకుండా అడ్డుకుంటుంది.

ఇక్కడ నాలుగు వర్ణాలను పొలాలతో పోల్చాడు. అవి బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రవర్ణాలు. వారి స్వధర్మాన్ని నీటితో పోల్చాడు. కట్ట లేకపోతే నీరు ఎలా వెళ్ళిపోతుందో అలా ధర్మపాలన లేకపోతే మనుష్యులు వారి వర్ణధర్మాలు పాటించరు. తక్కిన వర్ణాలవారు వారి వర్ణధర్మాలను పాటించినా, పాటించకపోయినా, బ్రాహ్మణుడు పాటించకపోతే తక్కినవారి అధర్మంకన్నా ఇది ఎక్కువ అవుతుంది. బ్రాహ్మణులు పాటించాల్సిన ధర్మం – వేదాధ్యయనం చెయ్యాలి; వారు వేదాలను నేర్చుకోవాలి, నలుగురికి నేర్పాలి. కాని వారు వర్ణసంకరం చేస్తున్నారు. అంటే వారి ధర్మాలను నిర్వర్తించటం లేదు.

ఇది జరగకుండా చూడాలంటే దానికి అడ్డుకట్ట ఉండాలి. అది భగవంతుడు. విధరణః అంటే వారిని ధర్మం పాటించేలాగా చేస్తాడు. దానివల్ల ప్రయోజనం?

**ఏషాం లోకానామ్ అసంభేదాయ** – ధర్మసంకరం జరగకుండా ఆపుతాడు. సంభేదః అంటే ధర్మసంకరం. అసంభేదః అంటే ధర్మసంకర పరిహారం. అంటే ధర్మసంకరం జరగకుండా చూడటం. అలా చూడటానికి సేతువులాగా

పనిచేస్తుంది ఆత్మ. ఎలా వర్ణాశ్రమ ధర్మాన్ని పరిరక్షిస్తుంది? ధర్మసంకరం చేసినవారిని శిక్షించటంద్వారా. వారిని ఎలా శిక్షిస్తుంది? వారిని సంసారకారాగృహంలో పడవేయటంద్వారా. వారిని శాశ్వతంగా సంసారమనే కారాగృహంలో పడవేస్తుంది.

ఈ 22వ మంత్రంలో ఇక్కడిదాకా పరమాత్మ స్తుతి సాగింది. ఇంతకుముందు మంత్రాల్లో ఋగ్మంత్రాల ద్వారా పరమాత్మను స్తుతిస్తే ఇక్కడ యాజ్ఞవల్క్యుడే స్వయంగా స్తుతించాడు. పరమాత్మను నిరుపాధిక బ్రహ్మగానూ, సోపాధిక బ్రహ్మగానూ వర్ణించాడు. మాయాసహిత బ్రహ్మ అంటే సోపాధిక బ్రహ్మ; మాయారహిత బ్రహ్మ అంటే నిరుపాధిక బ్రహ్మ. రెండింటి గురించీ చెప్పాడు. ఇది ఈశ్వరస్తుతి.

ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి మనం. పరమాత్మ పదాన్ని సగుణబ్రహ్మకూ, నిర్గుణబ్రహ్మకూ కూడా వాడుతోంది ఉపనిషత్తు. అలాగే ఈశ్వరపదం కూడా. ఎక్కువగా ఈశ్వరుడు అంటే సగుణ ఈశ్వరుడు అనే అర్థం వస్తుంది కాని, అప్పుడప్పుడూ నిర్గుణ ఈశ్వరుడు అని కూడా వస్తుంది. ఉపనిషత్తే కాదు, శంకరుల వారు కూడా పరమాత్మ, ఈశ్వర, బ్రహ్మ పదాలను సగుణ ఈశ్వరునికీ, నిర్గుణ ఈశ్వరునికీ కూడా వాడతారు. అలా ఉపనిషత్తూ, శంకరులవారూ ఒకే పదాన్ని రెండింటికీ వాడతారు అంటే ఈ రెండింటి మధ్య భేదం లేదని సూచిస్తున్నారని అర్థం. అలాగే పరమాత్మ, బ్రహ్మ, ఈశ్వరుడు పదాలు అన్నీ పర్యాయపదాలు.

మనకు స్పష్టమైన అవగాహన ఉండటంకోసం ఈ పదాలను రెండింటికీ వాడతారు. సగుణబ్రహ్మ, నిర్గుణబ్రహ్మ వేరువేరు కాదు. వాటి మధ్య ఉన్నది నామభేదమే కాని వస్తుభేదం కాదని చూశాము. అందువల్ల ఇక్కడ కూడా సగుణబ్రహ్మ, నిర్గుణబ్రహ్మల మహిమను చూశాము.

ఈ పెద్ద మంత్రంలో యాజ్ఞవల్క్యుడు మూడు అంశాలను చర్చిస్తాడు అని చూశాము. అవి పరమాత్మ స్తుతి, జ్ఞానసాధన, జ్ఞానఫలం. ఇక్కడితో పరమాత్మ స్తుతి పూర్తి అయింది. ఇప్పుడు జ్ఞానసాధన చూస్తాము.

2. **జ్ఞానసాధన** – జ్ఞానసాధనలో మళ్ళీ రెండు రకాల సాధనలున్నాయి. అవి సాక్షాత్ సాధన, పరంపర సాధన. అంటే సాక్షాత్ సాధన ప్రత్యక్ష సాధన అయితే పరంపర సాధన సహకారీ సాధన అవుతుంది. ఈ భాగం చాలా ముఖ్యమైనది. ఎందుకంటే ఇక్కడ యాజ్ఞవల్క్యుడు వేదం మొత్తం మోక్షశాస్త్రం అంటున్నాడు. వేద పూర్వభాగంలో కర్మకాండ, ఉపాసనకాండ ఉంటే, వేద అంతభాగంలో జ్ఞానకాండ ఉంటుంది. అంటే కర్మకాండ, ఉపాసనకాండ, జ్ఞానకాండలు అన్నీ మోక్ష సాధనలు.

కర్మకాండ + ఉపాసనకాండ = సహకారీ సాధన; జ్ఞానకాండ = సాక్షాత్ సాధన.

**సర్వే వేదా యత్పదమామనన్తి తపాగ్ంసి సర్వాణి చ యద్వదన్తి।**
**యదిచ్ఛన్తో బ్రహ్మచర్యం చరన్తి తత్తే పదగ్ం సఙ్గ్రహేణ బ్రవీమ్యోమిత్యేతత్॥** – కఠ 1.2.15

ఆ విధంగా వేదపూర్వభాగం, వేద అంతభాగం కూడా మోక్షసాధనలే. అలాగే నాలుగు ఆశ్రమధర్మాలు కూడా మోక్షసాధనలే. అంటే బ్రహ్మచర్యం, గృహస్థాశ్రమం, వానప్రస్థం, సన్న్యాసాశ్రమం అన్నీ మోక్షసాధనలే. కాకపోతే మొదటి మూడూ సహకారీసాధనలు, సన్న్యాసాశ్రమం సాక్షాత్ సాధన. ఎందుకు? బ్రహ్మచర్యం,

గృహస్థాశ్రమం, వానప్రస్థంలో కర్మ, ఉపాసనలు చేస్తే సన్న్యాసాశ్రమంలో జ్ఞానం పొందుతారు. ఆ విధంగా మొత్తం వేదం అమర్చబడింది.

కాని, అసలు విషయమేమిటంటే వేదం ఈ రహస్యాన్ని అందరికీ తెలిసేటట్టు చెప్పదు. ముందే వేదం మోక్షసాధన అని ప్రకటించేస్తే, నాకు మోక్షం వద్దు, నాకేమీ దానిమీద మోజు లేదు అనేస్తారు చాలామంది. అందువల్ల అది చిన్నగా మనను ఆటాడిస్తుంది.

వేదపూర్వభాగంలో మీరు ఏం కోరితే అది దొరుకుతుంది అని మనను ఊరిస్తుంది.

**ధనం ధాన్యం పశుం బహుపుత్రలాభం దీర్ఘమాయుః**

ఇంకోవిధంగా చెప్పాలంటే అర్థకామాలను, ధర్మాన్ని ఫలంగా ఇస్తుంది. ఇది పైకి కనపడే ఫలం. వేదం ప్రత్యక్షంగా చెప్పిన ఫలం.

కాని కనపడని, పైకి చెప్పని రహస్యఫలం ఇంకొకటి ఉంది. చేదుమందుని తినిపించటానికి తల్లి ఆ మందుని తేనెలో కలిపి ఇస్తుంది పిల్లలకు. తేనెకోసం ఆశపడి పిల్లలు దాన్ని సంతోషంగా తీసుకుంటారు. వారి సరదానూ తీరుతుంది, తల్లి ఉద్దేశమూ నెరవేరుతుంది. కర్మకాండ కూడా అంతే. మీకు కావాల్సిన కోరికలు తీరుస్తుంది. పిల్లలు చాక్‌లెట్లు అంటే ఇష్టపడినట్టుగా చాలామంది డబ్బు, వస్తువులు, కార్లు, విదేశీయానం ఆశపడతారు. అవి కాదు, మోక్షాన్నిస్తానంటే శాస్త్రం దరిదాపుల్లోకి రారు ఎవరూ.

అందువల్ల కర్మకాండ ఇచ్చే రహస్యఫలం వైరాగ్యం. ఏ కర్మ అయితే పిల్లలమీద బంధం పెంచుతుందో, అదే కర్మ కాలక్రమేణా అదే పిల్లలమీద వైరాగ్యాన్ని కూడా పెంచుతుంది. ఎవరికీ ముందే నీ భర్త, పిల్లలమీద బంధంనుంచి విడివడతావు అంటే ఇష్టం ఉండదు. అందువల్ల ముందు వారితో బంధాన్ని బాగా పెంచి, తర్వాత వైరాగ్యం కలిగేలా చేస్తుంది. ఆ విధంగా కర్మకాండ రెండు ఫలాలను ఇస్తుంది. ఒకటి లౌకికఫలం, ఇంకొకటి ఆధ్యాత్మిక ఫలం. చివరికి కామ్యకర్మలు కూడా కోరికలు తీర్చటమే కాక, కొంతమేరకు చిత్తశుద్ధిని కూడా కలుగజేస్తాయి అంటుంది శాస్త్రం. ఈ భావాన్ని చూపిస్తున్నాడు యాజ్ఞవల్క్యుడు.

**తమేతం వేదానువచనేన బ్రాహ్మణా వివిదిషంతి** – బ్రాహ్మణా అంటే మూడు వర్ణాలవారు వస్తారు. అంటే బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు. వేదానువచనం అంటే వేదప్రమాణాన్ని స్వీకరించినవారు. పై మూడు వర్ణాల వారికి ఉపనయనం చేసి, యజ్ఞోపవీతం వేస్తారు. అందువల్ల ఎవరైతే వైదిక సంప్రదాయాన్ని పాటిస్తారో, వారు బ్రాహ్మణులకిందే లెక్క. దానికి భిన్నంగా బ్రాహ్మణవర్ణంలో పుట్టి, వైదిక సంప్రదాయాన్ని పాటించకపోతే, అతను శూద్రునితో సమానం. అతన్ని బ్రాహ్మణబంధుః అంటారు. అంటే పేరుకి మాత్రమే బ్రాహ్మణుడు.

బ్రాహ్మణుడైవుండి, ఆచారాన్ని అనుష్ఠించకపోతే, ఆహార నియమాలు పాటించకపోతే, అతనికి వేదాన్ని అధ్యయనం చేసే హక్కు లేదు. అందువల్ల బ్రాహ్మణుడు పదం జాతి బ్రాహ్మణుడికి వర్తించదు, గుణ బ్రాహ్మణునికి వర్తిస్తుంది.

వివిదిషంతి అంటే బ్రహ్మజ్ఞానం పొందాలనే కోరిక ఉండి, దానికోసం ప్రయత్నం చేసేవారు. బ్రహ్మచర్యం నుంచే బ్రహ్మజ్ఞానం ఇమిడి ఉంటుంది, వారి అధ్యయనంలో. బ్రహ్మచారి చేసే సంధ్యావందనంలో అతనికి తెలియకుండా ప్రార్థన ఉంటుంది. సంధ్యావందనంలో అర్థం – ఆత్మజ్ఞానం నా లక్ష్యంగా ఉండుగాక. దానికి కావాల్సిన అర్హతలను నువ్వే నాకు ప్రసాదించు. దానికి తల్లి ప్రేమను ఉదాహరణగా చూపిస్తుంది ఆ మంత్రం. తల్లి ఎలాగైతే పిల్లలకు ఏ వయస్సులో ఎటువంటి ఆహారం ఇస్తే వారికి సరిపోతుందని తెలుసుకుని ఇస్తుందో, అలా నాకెప్పుడు ఏ అర్హత అవసరమైతే అది నాకు ఇవ్వు అంటాడు బ్రహ్మచారి. అవసరమైనప్పుడు వివేకవైరాగ్యాలు ఇచ్చి, చివర్లో ఆత్మజ్ఞానం ప్రసాదించు.

ఈ ప్రార్థనంతా ఎప్పుడు చేస్తాడు? ఏడేళ్ళనుంచి పదేళ్ళ లోపు చేస్తాడు. అలా తనకు తెలియకుండా మోక్షంవైపు అడుగులు వేస్తాడు. అందువల్ల వేద అధ్యయనం కూడా మోక్షానికే దారి తీస్తుందని ఉపనిషత్తు చెబుతుంది. వేదాధ్యయనాన్ని వేదానువచనేన అంది ఉపనిషత్తు. అంటే వేద+అనువచనం. ఇంతకుముందు కూడా చూశాము. 'అను' అని కలిస్తే గురువుద్వారా వేదాన్ని నేర్చుకోవాలి. గురువు చేసే ఉచ్చారణను అనుసరించి ఉచ్చారణ నేర్చుకోవాలి కాని, బ్రహ్మచారి స్వంతంగా ప్రయత్నించకూడదు.

అధ్యయనం చేసేటప్పుడు బ్రహ్మచారికి దాని అర్థం తెలియదు. అధ్యయనం వేరు, మీమాంస వేరు. అధ్యయనం శబ్దగ్రహణం, మీమాంస అర్థగ్రహణం. వేద అధ్యయనం చేస్తేనే చాలు, ఆ మంత్రాలే పునీతుణ్ణి చేస్తాయి. స్వయంగా వేదపారాయణ చేయకపోయినా కూడా వేదఘోష వింటేనే చాలు, చిత్తశుద్ధి కలుగుతుందని అంటారు కొందరు. వేదఘోషతోనే ఆ పరిసరాలు శుద్ధమవుతాయి. ఈ విధంగా వేదానువచనేన అనే పదం బ్రహ్మచర్య ఆశ్రమాన్ని సూచిస్తుంది. ఈ ఆశ్రమంలో ఆత్మజ్ఞాన ఇచ్ఛ ఏర్పడుతుంది.

**యజ్ఞేన దానేన** – ఈ పదాలు గృహస్థాశ్రమాన్ని సూచిస్తాయి. బ్రహ్మచారి వేదాధ్యయనం పూర్తిచేశాక, గృహస్థాశ్రమానికి వచ్చి, తను నేర్చుకున్న విద్య అనుష్ఠానం చెయ్యాలి. అంటే తను నేర్చుకున్న యజ్ఞాలు చెయ్యాలి. యజ్ఞాలతోపాటు దానాలు చెయ్యాలి. యజ్ఞాలు అంటే హోమకుండం ఉపయోగించి చేసే క్రతువులు వస్తాయి, పంచమహాయజ్ఞాలు వస్తాయి. పంచమహాయజ్ఞాలు అంటే దైవయజ్ఞం, ఋషియజ్ఞం, పితృయజ్ఞం, మనిషియజ్ఞం, భూతయజ్ఞం. ఈ యజ్ఞాలు కూడా సంఘసేవద్వారా ఈశ్వరపూజలోకి వస్తాయి. పూజ, సేవ ఒకదానితో ఒకటి పెనవేసుకుని ఉంటాయి.

దానేన అంటే గృహస్థు పెంపొందించుకోవాల్సిన ఇంకొక మంచివిలువ దానగుణం. యజ్ఞాల్లో దానం చెయ్యాలి అని చూశాము. అదికాక బ్రహ్మచారి, వానప్రస్థాశ్రమంలో ఉన్న వ్యక్తి, సన్న్యాసి – ముగ్గురూ గృహస్థు ఇచ్చిన భిక్షమీద ఆధారపడి జీవించాలి. అందువల్ల గృహస్థుకు దానగుణం ఉండాలి. ఇది ప్రత్యక్ష సాధన. పరోక్షంగా ఈ దానగుణం అతను సన్న్యాసాశ్రమానికి వచ్చేసరికి సర్వం త్యజించగలిగే శక్తిని ఇస్తుంది. ఇది కూడా సేవ, పూజల మేలుకలయిక. అసలంటూ ఇచ్చే గుణం ఉంటేనే, సర్వం పరిత్యజించగలిగే స్థాయికి చేరుకుంటాడు.

గృహస్థాశ్రమం పూర్తిగా లౌకిక ప్రపంచంలో మునిగిపోయేలా చేస్తుంది. ఆ కర్మలద్వారా లౌకికఫలాలు పొందుతాడు, కాని తర్వాతెప్పుడో వైరాగ్యం కూడా పొందుతాడు. అందువల్లనే గృహస్థ జీవనాన్ని కూడా ఆశ్రమజీవనం అంది మన శాస్త్రం. దేశం నడిబొడ్డులో ఉండి, సంసారంలో పూర్తిగా లీనమైపోయి ఉన్నా కూడా, గృహస్థు అంతిమలక్ష్యం కూడా మోక్షమే. ఇదీ మన సాంప్రదాయ ప్రత్యేకత. ఆ విధంగా యజ్ఞేన, దానేన పదాలు గృహస్థాశ్రమాన్ని సూచిస్తాయి. వివిదిషంతి – ఇక్కడ కూడా వివిదిషంతి కలుపుకోవాలి. అంటే ఆత్మజ్ఞానం కోరతాడు గృహస్థు. ప్రతి యజ్ఞం వెనుక అంతర్లీనంగా మోక్షం గురించిన కోరిక ఉంటుంది. కన్యాదానం చేసేటప్పుడు తత్ దానాత్ మోక్షమాప్నుయాత్ అని వస్తుంది. అలా సంసారంనుంచి మోక్షం కోరతాడు గృహస్థు.

**తపసా** – ఈ పదం వానప్రస్థాశ్రమాన్ని సూచిస్తుంది. తపస్సు అంటే తపస్సు చెయ్యటమే కాదు;

**కష్టసహిష్ణుత్వం తపః**

ప్రయత్నపూర్వకంగా దేన్నైనా వదులుకోవటం తపస్సు. అనేక నియమాలు, ఉపాసనలు కూడా తపస్సు కిందికే వస్తాయి. గృహస్థాశ్రమంలో అన్నీ ఉంటాయి కాని వానప్రస్థానికి వెళ్ళే గృహస్థు తన ఆస్తిపాస్తులను పిల్లలకు వదిలి, అరణ్యంలోకి వెళ్ళి సాధారణ జీవితం గడుపుతాడు. అక్కడ ఉపాసన చేసుకుంటాడు. భిక్షాచర్యం చరంతి – భిక్షాటన చేసుకుని జీవిస్తాడు.

వేదం, సాధకునికి అనువుగా ఇలాంటి జీవనం నిర్దేశించింది వానప్రస్థం వృద్ధులకు. వారికి ఇంక యజ్ఞయాగాదులు, పంచమహాయజ్ఞాలు చేసే ఓపిక ఉండదు. అందువల్ల అది మాని, ఇంక ఉపాసన చెయ్యమంటుంది శాస్త్రం. దీనివల్ల ఒక ప్రయోజనం కూడా ఉంది. కాయిక కర్మలు చేస్తే మనస్సు బాహ్యాముఖంగా ఉంటుంది. మానసపూజ చెయ్యాలంటే మనస్సు అంతర్ముఖం అవ్వాలి.

వానప్రస్థంలో అనేక నియమాలు పాటించాలి. ఇక్కడ ఒక నియమాన్ని పేర్కొన్నాడు.

**అనాశకేన** – దీన్ని తపస్సుతో కలుపుకోవాలి. మితాహారం తీసుకోవాలి. దానికి కూడా మనోనిగ్రహం కావాలి. అనాశకేన అంటే అసలు అర్థం భోజనం చెయ్యకుండా ఉండటం అని. కాని అసలు ఆహారం తీసుకోకపోతే, మోక్షం మాట దేవుడెరుగు, ప్రాణం పోతుంది. అందువల్ల శంకరులవారు దీనిని అధిక అశన వర్జనేన అన్నారు. మితాహారం తీసుకోవాలి.

**ఏకభుక్తం సదారోగ్యం ద్విభుక్తం బలవర్ధనం త్రిభుక్తం వ్యాధిపీడాస్యాత్ చతుర్భుక్తేః మృతిః ధ్రువమ్**

ఒకపూట మాత్రమే ముఖ్య ఆహారం తీసుకుంటే ఎప్పటికీ ఆరోగ్యకరంగా ఉంటారు; రెండు పూటలు తింటే శరీరం బలంగా, లావుగా అవుతుంది. మూడు పూటలు తింటే అనారోగ్యం పాలవుతారు; నాలుగు పూటలు తింటే మరణం తథ్యం. అందువల్ల వానప్రస్థాశ్రమంలో మితాహారం తీసుకోవాలి. మితభుక్ హితభుక్ అన్నారు. గృహస్థుకి అది కుదరదు. అతను చాలా పని చెయ్యాలి.

ఈ విధంగా తపసా, అనాశకేన పదాలు వానప్రస్థాశ్రమాన్ని సూచిస్తాయి. అందులో కూడా మోక్షం అంతర్లీనంగా ఉంటుంది. ఈ విధంగా కర్మ, ఉపాసనలద్వారా ప్రతి ఒక్కరూ అంతిమలక్ష్యం అయిన మోక్షంకోసమే, వారికి తెలియకుండానే ప్రయత్నం చేస్తారు.

**ఏతమేవ విదిత్వా మునిర్భవతి** – ఈ జ్ఞానం పొందాక అంటే ఈ పరంపర సాధనలు చేశాక, ఈ మూడు ఆశ్రమవిధులను పాటించాక, చివరికి అతను ఆత్మ గురించి తెలుసుకుంటాడు. ప్రతిసాధకుని అంతిమలక్ష్యం మోక్షం. దాన్ని జ్ఞాననిష్ఠ లేదా జీవన్ముక్తి అంటారు. పరంపర సాధన గురించి మాట్లాడాక యాజ్ఞవల్క్యుడు సాక్షాత్ సాధనకు వస్తున్నాడు. అది సన్న్యాసాశ్రమంలో సాధ్యమవుతుంది.

**ఏతమేవ ప్రవ్రాజినో లోకమిచ్ఛంతః ప్రవ్రజంతి** – ఈ ఆత్మజ్ఞానం కోరి సాధకుడు సర్వసంగపరిత్యాగి అవుతాడు. ప్రవ్రాజినః అంటే సన్న్యాసి. ఇప్పుడు నాలుగవ ఆశ్రమధర్మం గురించి చూస్తున్నాము. సన్న్యాసిని ప్రవ్రాజి అనీ, పరివ్రాజకుడు అనీ అంటారు. ప్రకర్షేన వ్రజతి ఇతి పరివ్రాజికః. సంసారాన్ని వదిలినవ్యక్తి పరివ్రాజకుడు.

కుటుంబ క్షేమంకోసం కుటుంబంలో ఒక వ్యక్తినీ, గ్రామక్షేమంకోసం కుటుంబాన్నీ, దేశక్షేమంకోసం గ్రామాన్నీ, మోక్షంకోసం సర్వాన్నీ పరిత్యజించవచ్చు అంటారు.

ఆత్మజ్ఞానంకోసం సర్వాన్నీ త్యజిస్తారు. ఇలా సర్వాన్నీ త్యజించి సన్న్యాసం స్వీకరించటం మన సాంప్రదాయంలో కొత్తేమీ కాదు. అది ఎప్పటినుంచో వస్తున్నది. ఉపనిషత్తులు ఎంతో పురాతనమైనవి. అందులోనే సన్న్యాసి ప్రసక్తి వచ్చిందంటే ఈ సన్న్యాసం స్వీకరించటం అప్పట్నుంచే ఉందన్నమాట. దీని గొప్పతనాన్ని గుర్తించి మన ఋషులు ఎందరో సన్న్యాసాన్ని స్వీకరించారు.

సన్న్యాసాన్ని స్వీకరించటానికి ముఖ్యకారణం ఆత్మజ్ఞానం పొందటం. ఆత్మజ్ఞానం పొంది, తద్వారా మోక్షం పొందటమే సన్న్యాసి అంతిమలక్ష్యం. అంటే జీవితంలో గొప్ప లక్ష్యాన్ని పొందటం. కాని దీన్ని పలాయన వాదంగా వక్రీకరించేవారు కొందరుంటారు. సన్న్యాసులు స్వార్థపూరితులు అని ఎదురు నిందిస్తారు కూడా. కాని వారి విమర్శ నిరాధారం. దానికి రెండు కారణాలు చెప్పవచ్చు.

1. ఒక సాధకుడు బ్రహ్మచర్యం, గృహస్థాశ్రమం, వానప్రస్థం దాటి, చివర్లో సన్న్యాసం స్వీకరిస్తాడు. ఈ మూడు ఆశ్రమాల్లో తను నిర్వర్తించాల్సిన విధులను సక్రమంగా నిర్వర్తించాకే సన్న్యాసం స్వీకరిస్తాడు. గృహస్థుగా పంచమహాయజ్ఞాలు చేశాడు, దానాలు చేశాడు అని చూశాము. ఆ విధంగా అతను సమాజానికి, కుటుంబానికి చెయ్యాల్సిన సేవనంతా చేశాడు. అలాంటి వ్యక్తిని స్వార్థపరుడు అని ఎలా నిందించగలము? సమాజానికి, కుటుంబానికి సేవ చేశాక, తన మోక్షంకోసం సన్న్యాసం స్వీకరిస్తాడు. అది తప్పెలా అవుతుంది?
2. ఒకవేళ ఈ మూడు ఆశ్రమజీవితాలూ పాటించకుండా, బ్రహ్మచర్యంనుంచి సన్న్యాసాశ్రమానికి వచ్చాడనుకుందాం. అప్పుడు కూడా అతను స్వార్థపరుడు కాదు. మొదట తను ఆత్మజ్ఞానం పొందటానికి ప్రయత్నిస్తాడు నిజమే. తర్వాత ఆ జ్ఞానాన్ని లోకసంగ్రహంకోసం వినియోగిస్తాడు.

దానికి మన ఆదిశంకరాచార్యులే ఘనమైన ఉదాహరణ. ఆయన చిన్నవయస్సులోనే సన్న్యాసం స్వీకరించారు. ఆయన పుణ్యంవల్లనే ఈ రోజు కూడా మనం అద్వైతవేదాంతం నేర్చుకోగలుగుతున్నాము. ఈరోజు ఈ బృహదారణ్యకోపనిషత్తు నేర్చుకోగలుగుతున్నాము. ఆయన మన అద్వైతవేదాంతంలో ఉన్న ప్రస్థాన త్రయానికి భాష్యాలు రాసి, షణ్మతస్థాపన చేసి, శిష్యులకు బోధ చేయబట్టి, అద్వైతవేదాంతం ఇంకా నిలిచివుంది. సన్న్యాసి ఒక కుటుంబాన్ని పరిత్యజించేది, తక్కిన అన్ని కుటుంబాలనూ ఉద్ధరించటానికి. అతనిది వసుధైక కుటుంబం.

అందువల్ల సన్న్యాసం చిన్నవయస్సులో స్వీకరించినా, వృద్ధాప్యంలో తీసుకున్నా కూడా అతను సమాజానికి చాలానే సేవ చేస్తాడు. చిన్నవయస్సులో తీసుకుంటే, తను మోక్షం పొందాక, సమాజశ్రేయస్సుకోసం పాటు పడతాడు. జ్ఞానం పొందాక, అతను చెడుపనులు చెయ్యడు, చెయ్యలేడు. జ్ఞాని అవుతాడు. వృద్ధాప్యంలో సన్న్యాసం స్వీకరిస్తే, గృహస్థుగా చెయ్యాల్సిన సేవలు చేసి, నిర్వహించాల్సిన బాధ్యతలను నిర్వహించాకే, సన్న్యాసం స్వీకరిస్తాడు.

అందువల్ల ఏ కారణంగా చూసినా కూడా సన్న్యాసి స్వార్థపరుడు అనటంలో అర్థం లేదు. పైపెచ్చు సన్న్యాసికి అసలు స్వార్థం ఉండదు. దేశశ్రేయస్సుకోసమే పాటుపడతాడు. ఈ మంత్రంలో రాబోయే భాగం సన్న్యాసులను కీర్తిస్తూ వస్తుంది. శాస్త్రంలో ఇంకెక్కడా సన్న్యాసుల స్తుతి ఇంత స్పష్టంగా చూడము. ఈ భాగాన్ని శంకరులవారు తరచు ఉటంకిస్తుంటారు. సన్న్యాస ఆశ్రమాన్ని స్తుతించటానికి ఈ భాగాన్ని తనకు ఊతగా తీసుకుంటారు.

సన్న్యాసంలో రెండు రకాల సన్న్యాసాలు ఉన్నాయి. అవి క్రమసన్న్యాసం, అక్రమసన్న్యాసం. క్రమసన్న్యాసం అంటే బ్రహ్మచర్యం, గృహస్థాశ్రమం, వానప్రస్థం స్వీకరించాక చివరికి సన్న్యాసం స్వీకరించటం. దీన్ని క్రమపద్ధతిలో సన్న్యాసం స్వీకరించటం అంటారు. రెండవది – అక్రమసన్న్యాసం అంటే అక్రమాలు చేస్తాడని కాదు అర్థం. అ–క్రమం అంటే ఈ క్రమం పాటించకుండా బ్రహ్మచర్యంనుంచి సరాసరి సన్న్యాసం స్వీకరించటం. ఎలా వచ్చినా అతనికి ఉండాల్సిన లక్షణం **వైరాగ్యం**. దీని గురించి వివరంగా జాబాలోపనిషత్తులో చూడవచ్చు.

ఇక్కడ మనం రెండవ రకం సన్న్యాసం గురించి చూడబోతున్నాము. అంటే బ్రహ్మచర్యంనుంచి సరాసరి సన్న్యాసానికి వచ్చిన వ్యక్తి గురించి. బ్రహ్మచారి తన వేదాధ్యయనం అయ్యాక గృహస్థాశ్రమాన్ని అయినా ఎన్నుకోవచ్చు, సన్న్యాసాశ్రమాన్ని అయినా ఎన్నుకోవచ్చు. ఏది ఎన్నుకుంటాడు అనేది అతని తదుపరి లక్ష్యం మీద ఆధారపడివుంటుంది.

**సోఽయం మనష్యలోకః పుత్రేణైవ జయ్యో నాన్యేన కర్మణా కర్మణా పితృలోకో విద్యయా దేవలోకః** – 1.5.16

ఈ ఉపనిషత్తులోనే అంతకుముందు వచ్చింది; పుత్రులు ఉన్నవారు మనుష్యలోకంలో మళ్ళీ పుడతారు. అందువల్ల మళ్ళీ మనుష్యజన్మ కావాలంటే పుత్రులను కోరుకోవాలి. పుత్రులు జీవించివుండగా మనను బాగా చూసుకుంటారు; మరణించాక శ్రాద్ధకర్మలు చేస్తారు. స్వర్గలోకానికి వెళ్ళాలని కోరిక ఉంటే, దానికి తగ్గ కర్మ చెయ్యాలి. పితృలోకం అంటే ఇక్కడ స్వర్గలోకం. బ్రహ్మలోకానికి వెళ్ళాలని కోరిక ఉంటే దానికి ఉపాసన చెయ్యాలి. దేవలోకః అంటే ఇక్కడ బ్రహ్మలోకం; విద్యయా అంటే ఉపాసన.

**అపి సర్వం జీవితమల్పమేవ తవైవ వాహాస్తవ నృత్యగీతే॥** – **కఠ**

ఎక్కడో నచికేతుడులాంటి వివేకులు ఈ జీవితం అతి స్వల్పం అనీ, ఈ కోరికలు శాశ్వతఫలాలను ఇవ్వవనీ తెలుసుకుంటారు. వారికి సాధ్యంమీద కోరిక లేనప్పుడు సాధనమీద మాత్రం ఏం కోరిక ఉంటుంది? సాధ్యం కోరితేనే సాధన అవసరం. ఏషణాత్ త్రయ అభావః. ఈ మూడు కోరికలూ లేవు సన్న్యాసం స్వీకరించే వ్యక్తికి. అందువల్ల అతను సన్న్యాసం స్వీకరిస్తాడు.

అతనికి పుత్రులు కావాలి, ఐహికసుఖాలు కావాలి అనే కోరిక లేకపోవచ్చు కాని, కర్మయోగం చిత్తశుద్ధిని ఇస్తుందని చూస్తాము కదా, అందువల్ల అతను చిత్తశుద్ధి పొందటానికి, కర్మయోగం చెయ్యటానికి, గృహస్థాశ్రమంలో అడుగు పెట్టవచ్చు కదా!

దానికి జవాబు ఒక బ్రహ్మచారి సన్న్యాసానికి వస్తానంటేనే అతనికి చిత్తశుద్ధి ఉన్నట్టే అర్థం. అతనికి సాధన చతుష్టయసంపత్తి ఉన్నట్టే అర్థం. గృహస్థాశ్రమానికి రాకుండా చిత్తశుద్ధి, చిత్తవైశాల్యం, వివేకం ఎలా పొందాడు? అతను పూర్వజన్మలోనే వాటిని పొందాడు. అతనికి గృహస్థాశ్రమం స్వీకరించకుండానే వైరాగ్యం వచ్చిందంటే అతను సాధనచతుష్టయసంపన్నుడని చెప్పకనే చెప్పినట్టు అవుతుంది.

ఒకవేళ అతనికి సాధనచతుష్టయసంపత్తి పూర్తిగా లేకపోయినా కూడా, అతను స్వీకరించిన సన్న్యాసాశ్రమంలో పాటించాల్సిన విధులు వాటిని పెంపొందిస్తాయి. అతను దండం పట్టుకోవాలి, ప్రణవజపం చేసితీరాలి, గురుశుశ్రూష చెయ్యాలి. ఇలాంటి నియమాలెన్నో ఉంటాయి. వాటిద్వారా అతను అధికారి అవుతాడు.

అందువల్ల బ్రహ్మచర్యంనుంచి సన్న్యాసం స్వీకరించవచ్చు అంటుంది శాస్త్రం. ఇది చాలా ముఖ్యమైన భాగమని కూడా చూశాము.

**ఏతద్ధ స్మ తత్** – ఈ సన్న్యాసం స్వీకరించటానికి కారణమేమిటంటే,

**పూర్వే విద్వాగ్ంసః** – పూర్వకాలంలోని ఋషులు కూడా ఇలాగే చేసేవారు. ఏం చేసేవారు?

**ప్రజాం న కామయంతే** – పిల్లలమీద కోరిక ఉండేది కాదు. మళ్ళీ మనుష్యలోకంలో పుట్టాలంటే పుత్రులు ఉండాలి. పుత్రులు ఉండగానే సరిపోదు. ఎవరైనా తన కర్మలను తను సక్రమంగా నిర్వర్తించి, తన మరణకాలంలో ఆ కర్మలను పిల్లలకు అప్పచెప్పితే, అది కూడా ఆ పుత్రుడు వదలకుండా ఆ కర్మలు కొనసాగిస్తేనే, ఆ తండ్రి మళ్ళీ మనుష్యలోకంలో పుట్టి, మోక్షంకోసం రెండవసారి ప్రయత్నించవచ్చు.

ఈ కోరికకు అంతకుముందు చూసిన రెండు కోరికలు కూడా కలుపుకోవాలి. వారికి పితృలోకంమీద కోరిక లేదు, అందువల్ల కర్మ చెయ్యాలనే ఆసక్తి లేదు; బ్రహ్మలోకంమీద కోరిక లేదు, అందువల్ల ఉపాసన చెయ్యాలనే ఆసక్తి లేదు. ఎందుకు వీటిమీద ఆసక్తి లేదు అంటే వారేం అంటారు?

**కిం ప్రజయా కరిష్యామః** – పిల్లలు ఉంటే ఏంచేస్తాము? అంటే మనుష్యలోకంలోకి రావాలనే కోరిక లేనప్పుడు పిల్లలు ఎందుకు? దీనికి తక్కిన రెండు వాక్యాలూ కలుపుకోవాలి. కర్మతో ఏం చేస్తాము? ఉపాసనతో ఏం చేస్తాము? అంటే మాకు మనుష్యలోకం వద్దు, పితృలోకం వద్దు, బ్రహ్మలోకం వద్దు. అయితే ఏం కావాలి?

**యేషాం నోఽయమాత్మాఽయం లోక ఇతి** – మాకు ఆత్మలోకమే కావాలి అంటారు. ఇక్కడ జాగ్రత్తగా చూడాలి. ముందంతా మనుష్యలోకం, పితృలోకం, బ్రహ్మలోకాల గురించి వచ్చింది కాబట్టి, ఆత్మజ్ఞానాన్ని కూడా ఆత్మలోకం అంటున్నది ఉపనిషత్తు. ఆత్మలోకం అంటే వీటికి భిన్నంగా ఉన్న ఇంకో లోకంగా తీసుకోకూడదు. ఆత్మలోకం అంటే స్వయంప్రకాశః లోకానాం లోకః. స్వయంప్రకాశక ఆత్మ,

**తే హ స్మ పుత్రైషణాయాశ్చ విత్తైషణాయాశ్చ లోకైషణాయాశ్చ వ్యుత్థాయ** – ఇటువంటి వారికి పిల్లలమీద కోరిక ఉండదు, డబ్బుమీద ఆశ ఉండదు. వేరే లోకాలకు వెళ్ళాలనే ఆశ ఉండదు. నిజానికి ఇదే భాగం 3.5.1లో కూడా చూశాము. అక్కడ వీటిని వివరంగా చూశాము.

ఇక్కడ మళ్ళీ టూకీగా చూద్దాము. వీటన్నిటినీ అనాత్మ ఏషణం కింద తీసుకోవచ్చు. ఏషణం అంటే కోరిక. ఈ అనాత్మ ఏషణాన్ని శాస్త్రంలో రకరకాలుగా చూస్తాము. ఒకసారి ఒకటిగా, ఒకసారి రెండుగా, ఒకసారి మూడుగా, ఒకసారి ఆరుగా చూస్తాము. మొత్తం కోరికలను అనాత్మ కోరికలుగా తీసుకుంటే అది ఒకటే కోరిక అవుతుంది. సాధన–సాధ్యాలుగా చూస్తే రెండు అవుతుంది. సాధన అంటే మార్గం, సాధ్యం అంటే లక్ష్యం. ఉదాహరణకు ఇల్లు కట్టుకోవాలి అనేది లక్ష్యం అయితే దానికి తగ్గ డబ్బు సంపాదించటం మార్గం అవుతుంది.

అంటే డబ్బు సంపాదించాలనే కోరిక సాధన ఏషణ అయితే, ఇల్లు కట్టుకోవాలనే కోరిక సాధ్య ఏషణ అవుతుంది. అలా చూస్తే ఇప్పుడు అనాత్మ ఏషణను రెండుగా చూస్తున్నాము – సాధన ఏషణ, సాధ్య ఏషణ. దీన్నే మూడుగా చూడాలంటే రెండు సాధనలు, ఒక సాధ్యం తీసుకోవాలి. రెండు సాధనలు – పుత్ర ఏషణ, విత్త ఏషణ; ఒక సాధ్యం లోక ఏషణ. వీటినే మళ్ళీ ఆరుగా చూడవచ్చు.

| **సాధన** | **సాధ్యం** |
|---|---|
| పుత్రులు | మనుష్యలోకం |
| కర్మ | పితృలోకం |
| ఉపాసన | బ్రహ్మలోకం |

అంటే పైన మూడుగా చెప్పినచోట విత్తాన్ని రెండుగా విడదీశాము. అవి కర్మ, ఉపాసన. ఇవి కూడా ఒక విధమైన విత్తమే. ఎలా? అవి మనకు పుణ్యలోకాలను కొనిపెడతాయి. మూడుగా చెప్పినప్పుడు లోకాలన్నిటినీ కలిపి ఒకటే లోకంగా చూశాము. ఇప్పుడు ఏ సాధనకు ఏ లోకం పొందుతారో చూస్తున్నాము. ఆ విధంగా సాధనత్రయ ఏషణ, సాధ్యత్రయ ఏషణలను విడిగా చూస్తే అవి ఆరు కోరికలు అవుతాయి.

సన్న్యాసం స్వీకరించేవ్యక్తి ఈ కోరికలకు అతీతంగా ఎదుగుతాడు. వ్యుత్థాయ అంటే అతీతంగా ఎదుగుతాడు. కోరికలను అణగద్రొక్కవచ్చు, వాటికి అతీతంగా ఎదగవచ్చు. ఏమిటి రెండింటి మధ్యా వ్యత్యాసం? కోరికలను అణగద్రొక్కితే అది ఆ వ్యక్తి ఆరోగ్యానికి హానికరం కావచ్చు. కోరికలకు అతీతంగా ఎదిగితే ఎటువంటి హాని ఉండదు.

కోరికలకు అతీతంగా ఎదిగాడని ఎలా తెలుస్తుంది? ఆ కోరిక తీరినా, తీరకపోయినా ఆ వ్యక్తి చలించకపోతే అతను ఎదిగినట్టు, పరిపక్వత వచ్చినట్టు అర్థం. దయానందస్వామీజీ దీన్ని చక్కగా వర్ణిస్తారు. మీరు గోళీలు చిన్నప్పుడూ ఆడివుంటారు; అవసరమైతే ఇప్పుడూ మనవడితో ఆడతారు. కాని ఇప్పుడు మీరు ఆసక్తితో ఆడరు. మధ్యలో ఆట ఆపాల్సివస్తే విలవిలలాడిపోరు. అలా కోరికలకు అతీతంగా అంటే –

**నిర్ద్వంద్వః నిత్యసత్వస్థః**

ఈ రాగద్వేషాలకు అతీతంగా ఎదగటమే సన్న్యాసస్థితి.

**యో న ద్వేష్టి న కాంక్షతి బ్రాహ్మణో నిర్వేద మాయాత్**

సన్న్యాసం అంటే శారీరకంగా పారిపోవటం కాదు, రాగద్వేషాలకు అతీతంగా ఎదగటం. మనస్సు పరిపక్వం చెందటం.

**అథ** – వైరాగ్యప్రాప్తి అనంతరం. ఇక్కడ ఉపనిషత్తు మానసిక సన్న్యాసంతో పాటు బాహ్యసన్న్యాసం గురించి కూడా చెబుతున్నది. ఎలా తెలుసు?

**భిక్షాచర్యం చరంతి** – భిక్షాటన చేసి జీవించేహక్కు బాహ్యసన్న్యాసికే ఉంది. గృహస్థు నాకు ఆంతర సన్న్యాసం ఉంది, నేను భిక్ష తీసుకుంటాను అనకూడదు. అతను సన్న్యాసికి భిక్ష ఇవ్వాలి కాని, అతను భిక్ష తీసుకోకూడదు. అందువల్ల ఆంతర సన్న్యాసం భిక్ష తీసుకోవటానికి అర్హతనివ్వదు. మోక్షం పొందటానికి మాత్రమే అర్హతనిస్తుంది.

భిక్షాచర్యం చరంతి పదాన్ని శంకరులవారు విశ్లేషించి దీన్ని విధివాక్యంగా తీసుకోవాలని చెబుతారు. విధివాక్యం అంటే చేసితీరాలి. ఆశ్రమసన్న్యాసం తీసుకుని తీరాలి అని ఈ వాక్యం అర్థం అంటారు శంకరులవారు. పూర్వమీమాంసకులు దీనికి ఒప్పుకోరు. అలా విధివాక్యంగా తీసుకోవాలి అంటే ఆ క్రియాపదం విధిలింగ్ అంటే లోట్ లకారం అయి ఉండాలి. కాని ఇది లట్ లకారంగా ఉంది. అంటే వర్తమానకాలంలో ఉంది అంటారు వారు. శంకరులవారు చాలా విశ్లేషణ చేసి, ఇది లట్ లకారం కాదు, దీన్ని లేట్ లకారం అంటారు. అంటే విధి వాక్యమే అంటారు. లౌకిక వ్యవహారాల్లో లేని కాలం ఒకటి వైదిక సంప్రదాయంలో ఉంది; దాన్ని లేట్ లకారం అంటారు అని నిరూపించారు. అందువల్ల ఇది విధివాక్యమే, వీలున్నవారు సన్న్యాసం తీసుకోవాలి అని శంకరులవారు చెబుతారు.

ఇప్పుడు కోరికల గురించి చూస్తాము.

**యా హ్యేవ పుత్రైషణా సా విత్తైషణా యా విత్తైషణా సా లోకైషణా** – ఇక్కడ మూడు కోరికలను పేర్కొన్నా మూడూ ఒకటే అంది. ఏమిటా మూడూ? పుత్రైషణ, విత్తైషణ, లోకైషణ. పుత్రైషణలాంటిదే విత్తైషణ; విత్తైషణలాంటిదే లోకైషణ అంటున్నది ఉపనిషత్తు. అంటే అన్నింటిలోనూ సమాన అంశం ఏమిటి? మూడూ అనాత్మ కోరికలే. అనాత్మ కోరికలు బంధకత్వాన్ని పెంచుతాయి; అందువల్ల వాటిని వదులుకోవాలి.

**ఉభే హ్యేతే ఏషణే ఏవ భవతః** – ఉపనిషత్తు ఇక్కడ చిలిపితనం చూపిస్తున్నది. మూడు కోరికలను పేర్కొని, ఆ రెండూ ఒకటే కోరిక అంది. ఇదెలాగో మనం ఇంతకు ముందే చూశాము. మూడు అంటే పుత్రైషణ, విత్తైషణ, లోకైషణ. రెండుగా వీటిని చూడాలంటే సాధన కోరిక, సాధ్య కోరిక. పుత్రులమీద కోరిక, విత్తంమీద కోరిక కలిసి సాధన కోరికలోకి వెళ్ళిపోతాయి; లోకైషణ సాధ్యకోరికలోకి వెళ్ళిపోతుంది. అలా సాధన, సాధ్య కోరికలుగా చూస్తే అవి రెండు కోరికలు అవుతాయి. ఈ రెండూ ఒకటే అంటే ఇంతకు ముందు చూసినట్టుగా ఈ రెండూ కూడా అనాత్మ కోరిక కిందికే వస్తాయి. అప్పుడు ఒకటే అవుతుంది. వైరాగి పరంగా ఇన్ని రకాల కోరికలు లేవు. అతను వాటన్నిటినీ ఒకటే అనాత్మ కోరికగా త్రోసివేసి సన్న్యాసం తీసుకుంటాడు.

మన సాంప్రదాయంలో సన్న్యాసం గురించి మాట్లాడినప్పుడల్లా, దానిలో వేదాంతవిచారణ, జ్ఞానం కలుపుకోవాలి. ఎందుకంటే సన్న్యాస ఆశ్రమం వేదాంత విచారణకే ఏర్పాటు చెయ్యబడింది. వేదాంతవిచారణ కాకుండా వేరే ఏది చెయ్యాలనుకున్నా కూడా వాటిని బ్రహ్మచర్యంలోనో, గృహస్థాశ్రమంలోనో, వానప్రస్థంలోనో చెయ్యాలి; సన్న్యాసాశ్రమంలో కాదు.

ఒక ఆశ్రమంలో చెయ్యవలసిన పని ఇంకొక ఆశ్రమంలో చేస్తే అది ఆశ్రమసంకరం అవుతుంది. గృహస్థు కర్మను మానకూడదు, కాని వేదాంతం నేర్చుకోకూడదని నియమం లేదు. సన్న్యాసి వేదాంతం నేర్చుకుని తీరాలి; గృహస్థు కావాలనుకుంటే నేర్చుకోవచ్చు, వద్దనుకుంటే మానవచ్చు. దీనితో నాలుగు ఆశ్రమాల గురించిన వర్ణన ముగిసింది.

యాజ్ఞవల్క్యుడు ఈ భాగంలో నాలుగు ఆశ్రమాలూ మోక్షం పొందటానికి ఏర్పాటు చేయబడ్డాయని చూపించాడు. బ్రహ్మచర్యం, గృహస్థాశ్రమం, వానప్రస్థంలో లౌకిక సుఖాలను కూడా పొందుతారు. ఈ లౌకిక సుఖాలను **అవాంతర ఫలం** అంటారు. అంటే వారి ముఖ్యలక్ష్యం మోక్షమే. ఇవి అనుకోకుండా వచ్చిన ఫలితాలు.

వారి అంతిమలక్ష్యం మోక్షమేనని వారికి తెలియవచ్చు, తెలియకపోవచ్చు. ఉదాహరణకు గృహస్థుకు తను మోక్షం కోరాలని తెలియకపోవచ్చు; అర్థకామాలనే కోరవచ్చు; కాని అతని జీవితాన్ని శాస్త్రం నిర్దేశించినట్టుగా అతను జీవిస్తే, అతన్ని ఖచ్చితంగా మోక్షం వైపుకి దారితీయిస్తుంది శాస్త్రం. మొదటి మూడు ఆశ్రమాలూ శ్రేయస్సు, ప్రేయస్సు రెండింటికోసం తోడ్పడితే, నాలుగవ ఆశ్రమం కేవలం శ్రేయస్సుకోసమే తోడ్పడుతుంది. అందువల్ల మొదటి మూడు ఆశ్రమాలలో రెండు రకాల ఫలాలు పొందితే, సన్న్యాసాశ్రమంలో ఒకటే ఫలం పొందుతాడు. ఎవరైతే ఈ నాలుగు ఆశ్రమధర్మాలనూ శాస్త్రం నిర్దేశించినట్టుగా జీవిస్తాడో, అతను ఆత్మజ్ఞానం పొందుతాడు. అంటే కర్మ + ఉపాసన + జ్ఞానం పాటిస్తే ఆత్మజ్ఞానం పొందుతాడు.

ఆశ్రమఫలం = ఆత్మప్రాప్తిః

ఆత్మజ్ఞానం అని అంతగా చెబుతున్నారు కదా, ఏమిటా ఆత్మ? ఈ భాగంలో ఆత్మ లక్షణం వస్తుంది. ఇది ఇప్పటికే రెండుసార్లు వచ్చింది బృహదారణ్యకంలోనే. ఆ భాగాలు 3.9.26 మరియు 4.2.4 మూడవ అధ్యాయములో దాన్ని వివరంగా చూశాము.

**స ఏష నేతి నేత్యాత్మా** – అన్నిటినీ ఇది కాదు, ఇది కాదు అని నిషేధించుకుంటూ వస్తే, చివరకి మిగిలేది ఏదో, అది ఆత్మ.

**సర్వ నిషేధ అవధిః**

నిషేధించగలిగిన వాటన్నిటినీ నిషేధించాక నిషేధింపబడలేని, నిషేధిస్తున్న వ్యక్తే ఆత్మ లేదా బ్రహ్మ.

**అగృహ్యో న హి గృహ్యతే** – ఆత్మ అగృహ్యం. ఎందుకంటే ఆత్మను వస్తువుగా తెలుసుకోలేము. అంటే ఆత్మ సర్వప్రమాణ అగోచరం.

**అశీర్యో న హి శీర్యతే** – ఆత్మ అశీర్యం. ఎందుకంటే ఆత్మ శిథిలం అయ్యేది కాదు. అంటే ఆత్మ అపక్షీయ రహితం లేదా జరారహితం.

**అసంగో న హి సజ్యతే** – ఆత్మ అసంగం. ఎందుకంటే ఆత్మకు దేనితోనూ బంధం లేదు.

అందువల్ల సన్న్యాసాశ్రమాన్ని కీర్తిస్తారు. సన్న్యాసాశ్రమం ఆత్మస్వరూపానికి చాలా దగ్గరగా ఉంటుంది. సన్న్యాసి అసంగం, ఆత్మ అసంగం. అందువల్ల సన్న్యాసాశ్రమాన్ని అలా తీర్చిదిద్దింది శాస్త్రం. సన్న్యాసికి ఆత్మజ్ఞానాన్ని పొందటం తేలిక.

**అసితో న వ్యథతే** – ఆత్మ బద్ధము కాదు. ఎందుకంటే ఆత్మ వ్యథను పొందటం లేదు.

**న రిష్యతి** – ఆత్మకు నాశనము లేదు. మరణము లేదు.

ఆ విధంగా ఆత్మ ఏమిటంటే సర్వనిషేధ అవధి. నేతినేతిద్వారా అన్నీ నిషేధించుకుంటూ వస్తే మిగిలేది. ఇక్కడితో రెండవ అంశం ముగిసింది. అది ఆత్మజ్ఞానం.

3. **జ్ఞానఫలం** – జ్ఞానఫలాన్ని ఎన్నో రకాలుగా సూచిస్తారు. ఇక్కడ ఒక్క ఫలాన్ని సూచిస్తున్నాడు యాజ్ఞవల్క్యుడు. అది **అపరాధభావననుంచి మోక్షం**. ఈ అపరాధభావన ఎంతకన్నా దారితీస్తుంది. అనారోగ్యం కలుగజేస్తుంది; చివరికి ఆత్మహత్యకు కూడా దారితీయవచ్చు. వృద్ధాప్యంలో మనకు తోడుగా మనుష్యులెవరూ మిగలరు. మన ఆలోచనలే మనకు తోడు. ఆ ఆలోచనలు కనుక మనం చెయ్యలేని పనుల మీదనో, మనం చేసిన తప్పుల మీదనో నిలబడితే, వాటినుంచి తప్పించుకునే మార్గమే లేదు మనకు. మనస్సు ఇంక ముల్లులా పొడుస్తూనే ఉంటుంది. ఇదే భావనను తైత్తిరీయోపనిషత్తులో కూడా చూస్తాము.

జ్ఞానిని రెండు బాధలు బాధించవుట. మనిషికి ఉండే బాధలు రెండు. అవి –

**అతః పాపమకరవమ్** – ఈ కారణాలవల్ల నేను పాపాలు చేశాను;

**అతః కల్యాణమకరవమ్** – ఈ కారణాలవల్ల పుణ్యకార్యాలు చెయ్యలేకపోయాను.

మనిషిని రెండు రకాల అపరాధభావన కృంగదీస్తుంది– **కల్యాణమకరవమ్, పాపమకరవమ్**. అంటే చెయ్యాల్సిన పుణ్యకర్మలు చెయ్యలేకపోవటం; చెయ్యకూడని పాపకర్మలు చెయ్యటం. వీటిని ఇంగ్లీషులో ఒమిషన్స్ అండ్ కమిషన్స్ అంటారు.

జ్ఞాని ఈ రెండింటికీ చలించడు. ఇందువల్ల పుణ్యం చెయ్యలేదు అనడు, ఇందువల్ల పాపం చేశాను అనడు. ఆమాటకొస్తే బండరాయివంటి మనస్సు ఉన్న వ్యక్తి కూడా చలించడు. నిజానికి సున్నితమనస్సు ఉన్న ఎవరికైనా తను చేసిన తప్పులకు అపరాధభావన కలగాలి. కాని ఇక్కడ జ్ఞాని, బండరాయివంటి మనస్సు ఉన్న వ్యక్తి ఇద్దరూ చూడటానికి ఒకటేలా స్పందిస్తారు. కాని వీరిరువురి మధ్యా ఉన్న వ్యత్యాసాన్ని మనం గుర్తించాలి.

గతంలో ఎవరైనా తాము చేసిన తప్పులకు మూడు రకాలుగా స్పందించవచ్చు.

1. **అసలు పట్టించుకోకపోవటం** – అతను సున్నితమనస్కుడు కాదు. అందువల్ల తను చేసిన తప్పులకు అసలు చలించడు. ఆమాటకొస్తే, అతను వాటిని తప్పులు అనుకోడు. అతనికి తను చేసినవి తప్పులని తెలిస్తేనే కదా, వాటి గురించి బాధపడేది. కాని ఇంకా, ఇంకా తప్పులు చేస్తూనే ఉంటాడు. ఈ విధంగా అపరాధభావన లేని బండరాయి మనస్థత్వం ఇతనిది.

2. **అతిగా బాధపడటం** – అతను చాలా సున్నితమనస్కుడు. అతనికి తను తప్పు చేశానని తెలుసు; ఆ తప్పులేవో కూడా తెలుసు. అందుకని వాటి గురించి తెగ బాధపడిపోతాడు. అతను ఎంత సున్నితంగా ఉంటాడంటే ఎదుటి మనిషి తనను క్షమించినా, ఈ వ్యక్తి మాత్రం తనను తాను క్షమించుకోలేడు. ఈ విధంగా అపరాధభావనతో కూడిన సున్నితత్వం ఇతనిది.

వేదాంతం లేదా ధర్మశాస్త్రం ఈ రెండు రకాల స్పందనలూ సమస్యలకు దారితీస్తాయంటుంది.

1. **అసలు పట్టించుకోని వ్యక్తి సమస్య** – ఇతను అపరాధభావన లేని బండరాయి అని చూశాము కదా. అతనిలో అపరాధభావనే లేనప్పుడు అతనికి తనను తాను మెరుగుపరుచుకునే ఆస్కారమే లేదు. అతనికి తను తప్పు చేశానని తెలిసినా, తెలియకపోయినా సమస్య ఉంది. కాని వచ్చిన సమస్య ఏమిటంటే అతను దాన్ని గుర్తించడు. ఇతను ధర్మాధర్మాల విచక్షణ లేని వెర్రివాడు. కాని ఒక విధంగా అదృష్టవంతుడు. ఎందుకంటే పశ్చాత్తాపం అతన్ని కృంగదీయదు. అందువల్ల ఇతను జీవితంలో ఎదగడు. ఎక్కడున్నవాడు అక్కడే ఉంటాడు.

2. **అతిగా బాధపడే వ్యక్తి సమస్య** – అతిగా బాధపడే వ్యక్తికి తను తప్పుచేశానని తెలుసు కాబట్టి, అతను తనను తాను మెరుగుపరచుకునే అవకాశం ఉంది. మెరుగుపరుచుకోవాలనే ఆశ కూడా ఉంది కాని అతను తన పశ్చాత్తాపంలో ఎంతగా కూరుకుపోతాడంటే, దానినుంచి తేలికగా బయటపడలేడు. అతనివల్ల బాధింపబడ్డ వ్యక్తి క్షమించినా, ఇతను ఆ బాధనుంచి బయటపడలేడు. నిరంతరం అందులోనే కుమిలిపోతుంటాడు. అందువల్ల అతను ప్రశాంతంగా జీవించలేడు, దాన్నించి బయట కూడా పడలేడు.

ఇప్పుడు మూడవ వ్యక్తి స్పందన చూద్దాము.

3. **సున్నితత్వంతో కూడిన తెలివి** – అతనికి రెండవ తెగకి చెందిన వ్యక్తిలాగా తన తప్పు తనకు తెలుసు. కాని అతని కన్నా తెలివైనవాడు. తన తప్పునుంచి పైకి ఎదగాలనుకుంటాడు. జరిగిపోయిందేదో జరిగిపోయింది; దాన్నేమీ మార్చలేడు; కాని దాన్నించి పాఠాలు నేర్చుకుని, మళ్ళీ అటువంటి పొరపాటు చెయ్యకుండా ఉండటానికి ప్రయత్నిస్తాడు. తను గతంలో చేసిన పొరపాట్ల గురించి పశ్చాత్తాపపడుతూ కూర్చుంటే ఆ బెంగ గతాన్ని మార్చలేదు, ఆ బెంగ భవిష్యత్తును కూడా మెరుగుపరచలేదు.

మనం చిన్నవయస్సులో ఉన్నప్పుడు గతం చిన్నగానూ, భవిష్యత్తు దీర్ఘకాలం ఉన్నట్టూ ఉంటుంది. ఆ వయస్సులో భవిష్యత్తు గురించి ఎన్నో ప్రణాళికలు వేస్తాము, ఎన్నో కలల కంటాము. వయసు మీద పడుతున్న కొద్దీ రాబోయే కాలం తరుగుతూ వస్తుంది. గడిచిపోయిన కాలం ఎక్కువవుతుంది; రానున్న కాలం తగ్గిపోతుంది. రానున్న కాలం గురించిన ఆందోళన చిన్నవయస్సులో పీడిస్తే, గడిచిపోయిన కాలంలో చెయ్యని పనుల గురించో, చేసిన తప్పుల గురించో వాపోతూ కూర్చోవటమే సరిపోతుంది. ఆ విధంగా ఎప్పుడూ

జీవితాన్ని ఆనందంగా గడపము. కాని జ్ఞానికి ఆ ఆందోళనా ఉండదు, ఈ పశ్చాత్తాపమూ ఉండదు.

**ఏతము హ ఏవ ఏతే న తరత ఇతి** – ఈ ఆత్మజ్ఞానిని ఈ రెండు పొందవు. ఏమిటవి?

**అతః పాపమకరవమితి** – ఈ కారణంవల్ల పాపం చేశాను అనే బాధ.

**అతః కల్యాణమకరవమితి** – ఈ కారణంవల్ల ఈ పుణ్యకర్మను చెయ్యలేకపోయాను అనే బాధ;

**ఉభే ఉ హ ఏవ ఏష ఏతే తరతి** – ఈ రెండింటినుంచీ కూడా ఆత్మజ్ఞాని తరిస్తాడు. అంటే ఈ రెండు బాధలనూ అతను దాటుతాడు.

**నైనం కృతాకృతే తపతః** – ఈ ఆత్మజ్ఞానిని అతనిచేత చెయ్యబడ్డ కర్మలు కాని, అతను చెయ్యని కర్మలు కాని బాధించవు. అంటే అతను అనవసరంగా బాధలలో కృంగిపోతూ కూర్చోడు. **కృత అకృత తరణం** మొదటి ఫలం.

## మంత్రం 4.4.23

**తదేతదృచాఽభ్యుక్తమ్ । ఏష నిత్యో మహిమా బ్రాహ్మణస్య । న వర్ధతే కర్మణా నో కనీయాన్। తస్యైవ స్యాత్పదవిత్ ॥ తం విదిత్వా న లిప్యతే కర్మణా పాపకేనేతి ॥ తస్మాదేవంవిచ్ఛాన్తో దాన్త ఉపరతస్తితిక్షుస్సమాహితో భూత్వాఽఽత్మన్యేవాత్మానం పశ్యతి॥ సర్వమాత్మానం పశ్యతి నైనం పాప్మా తరతి సర్వం పాప్మానం తరతి నైనం పాప్మా తపతి సర్వం పాప్మానం తపతి విపాపో విరజోఽ విచికిత్సో బ్రాహ్మణో భవత్యేష బ్రహ్మలోకస్సమ్రాడేనం ప్రాపితోఽసీతి హోవాచ యాజ్ఞవల్క్యః ॥ సోఽహం భగవతే విదేహాన్ దదామి మాం చాపి సహ దాస్యాయేతి ॥**

**తదేతదృచాఽభ్యుక్తమ్** – ఈ జ్ఞానఫలం గురించి చెప్పటానికి యాజ్ఞవల్క్యుడు ఋగ్మంత్రాన్ని ఉటంకిస్తున్నాడు. ఈ ఉపనిషత్తు యజుర్వేదానికి చెందినది, ఈ మంత్రం ఋగ్వేదానికి చెందినది.

**బ్రాహ్మణస్య ఏషః మహిమా** – బ్రాహ్మణునియొక్క మహిమ ఈ క్రింది విధంగా చూస్తాము. ఉపనిషత్తు బ్రాహ్మణా పదం బ్రహ్మవిత్‌ను వర్ణించటానికి వాడుతుంది. అంటే ముఖ్యబ్రాహ్మణుడు బ్రహ్మవిత్. బ్రహ్మవిత్ కానివారు జాతిబ్రాహ్మణ లేదా కర్మబ్రాహ్మణులు మాత్రమే అవుతారు. వీరిని అముఖ్యబ్రాహ్మణులు అంటారు. అముఖ్య బ్రాహ్మణుడు జ్ఞానం పొందితేనే ముఖ్యబ్రాహ్మణుడు అవుతాడు.

ఈ వివరణనుంచి ఒక ఉపసిద్ధాంతము స్పష్టం అవుతున్నది. ఒకవ్యక్తి పుట్టుకతో బ్రాహ్మణుడు కాకపోయినా, కర్మద్వారా బ్రాహ్మణుడు కాకపోయినా, అతను బ్రహ్మజ్ఞానం పొందితే గుణబ్రాహ్మణుడు అవుతాడు. అందువల్ల ముఖ్యబ్రాహ్మణుడు అవుతాడు. జాతిబ్రాహ్మణుడు బ్రహ్మజ్ఞానం పొందకపోతే, అముఖ్యబ్రాహ్మణుడుగానే మిగిలి పోతాడు. ఒకవేళ గుణబ్రాహ్మణుడూ, జాతిబ్రాహ్మణుడూ ఎదురైతే ఎవరు ఎవరిని గౌరవించాలి? జాతిబ్రాహ్మణుడు గుణబ్రాహ్మణుడిని గౌరవించాలి. ఎందుకంటే అతను జ్ఞాని.

బ్రాహ్మణుడు పదాన్ని బ్రహ్మజ్ఞాని అర్థంతో ఈ ఉపనిషత్తే అనేకచోట్ల ఉపయోగించింది.

**జన్మనా జాయతే శూద్రః కర్మణా ద్విజ ఉచ్యతే**
**వేదపాఠేన విప్రస్యాత్ బ్రహ్మణో బ్రహ్మ వేదనాత్**

పుట్టుకతో ఎవరైనా శూద్రుని కిందకే వస్తారు. ఉపనయనం జరిగి, వైదిక జీవనం గడపటం మొదలుపెడితే ద్విజుడు అంటారు. తర్వాత వేదాధ్యయనం చేస్తే అతన్ని విప్రుడు అంటారు. కాని బ్రహ్మజ్ఞానం పొందితేనే బ్రాహ్మణుడు అంటారు. బ్రహ్మజ్ఞానిని బ్రాహ్మణుడు అంటారని 3.5.1లోనూ, 3.5.18లోనూ చూశాము. బ్రహ్మజ్ఞానం పొందని అజ్ఞానిని కృపణః అంటారు. 3.5.10లో కూడా శ్రవణ, మనన, నిదిధ్యాసనలద్వారా జ్ఞానం పొందాకే ఎవరైనా బ్రాహ్మణుడు అవుతాడు అని చూసాము.

అదే మాటను ఇక్కడ కూడా ఉపనిషత్తు నొక్కి వక్కాణించదలుచుకుంది. ఈ విషయాన్ని చాలా వివరంగా వజ్రసూచికా ఉపనిషత్తులో చూస్తాము. అసలు బ్రాహ్మణుడు ఎవరు అని నిర్ణయించటానికి అది చిన్నసైజు ఆపరేషను చేస్తుంది. కః బ్రాహ్మణః అని అడిగి, ఒక్కొక్క దాన్ని నేతి నేతి అంటూ నిషేధించుకుంటూ వచ్చి, జ్ఞాని మాత్రమే బ్రాహ్మణుడు అని నిర్ణయిస్తుంది ఆ ఉపనిషత్తు. **బ్రహ్మజ్ఞాని మాత్రమే బ్రాహ్మణుడు** రెండవ ఫలం.

**నిత్యః** – బ్రహ్మజ్ఞాని మహిమ ఏమిటి? నిత్యం అంటున్నది ఉపనిషత్తు. ఏమిటది? బ్రహ్మజ్ఞాని మోక్షస్వరూపం; అతని మహిమ పూర్ణత్వం. శంకరులవారు అంటారు, ఇంకే మహిమ తీసుకున్నా అది మహిమ అవుతుంది నిజమే కాని, అది అనిత్య మహిమ అవుతుంది. స్థూలశరీర మహిమ ఎంతపైకి వెళితే, అంత కిందకి వస్తుంది. ఎందరో మహానుభావులు కాలగర్భంలో కలిసిపోయారు. ఇవాళ ఏదో ఒక రంగంలో ఒక వెలుగు వెలిగినవారు; ప్రపంచాన్ని కుదిపేసినవారు కూడా కొన్ని సంవత్సరాలు గడిచేసరికి, తెరమరుగైపోతారు. ప్రజలు వారిని మర్చిపోతారు. కాని జ్ఞాని మహిమ నిత్యం.

**కర్మణా న వర్ధతే** – పుణ్యకర్మవల్ల పూర్ణత్వం ఎక్కువ అవదు;

**నో కనీయాన్** – పాపకర్మవల్ల తక్కువ అయిపోదు.

అంతకుముందు జ్ఞానఫలం గురించి చెబుతూ, జ్ఞాని చెయ్యని పనులకు బాధపడడు; చేసిన పాపాలకు కృంగిపోడు అని చెప్పింది ఉపనిషత్తు. ఇప్పుడు ఇంకొక ఫలం ఇస్తున్నది. ఏమిటది? సర్వపాపతరణం. పాపాలంటే పుణ్యం కూడా వస్తుంది. అతను పుణ్యపాపాలకు అతీతంగా ఎదుగుతాడు. ఇది మోక్షస్వరూపం. అందువల్ల ఉపనిషత్తు అందరినీ జ్ఞాని అవమనీ, మోక్షస్వరూపం గురించి తెలుసుకోమనీ సలహా ఇస్తున్నది.

**తస్యైవ పదవిత్ స్యాత్** – ఆమహిమయొక్క స్వరూపాన్ని నిశ్చయంగా తెలుసుకోవాలి. తస్యైవ అంటే ఆ మహిమ. ఇక్కడ మహిమస్వరూపం అంటే మోక్షస్వరూపం.

**తం విదిత్వా న లిప్యతే పాపకేన కర్మణా** – మోక్షస్వరూపం గురించి తెలుసుకున్న వ్యక్తి పాపకర్మలవల్ల బాధింపబడడు. శంకరులవారు పాపకర్మలతో పాటు పుణ్యకర్మలను కూడా తీసుకోవాలి అంటారు. జ్ఞాని పుణ్యపాపాలకు, ధర్మాధర్మాలకు అతీతంగా ఎదుగుతాడు. ఇది ఒక జ్ఞానఫలం. **సర్వపాపతరణం.**

ఇక్కడ మనకు ఒక సందేహం కలగవచ్చు. జ్ఞానికి పాపఫలం అంటదు అంటే జ్ఞాని ఎంత పాపమైనా భయం లేకుండా చెయ్యవచ్చా? జ్ఞానికి పాపఫలం అంటదు అంటే దాని అర్థం జ్ఞాని పాపం చెయ్యవచ్చు అని కాదు; జ్ఞాని పాపం చెయ్యడు అని. జ్ఞాని తను పొందిన జ్ఞానమహిమవల్ల తను వద్దనుకున్నా కూడా పుణ్యవంతుడే.

స్వాతంత్ర సమరం సాగిస్తున్నప్పుడు మహాత్మగాంధీకి బిర్లా ఒక బ్లాంక్ చెక్కు ఇచ్చి, ఎంత కావాలంటే అంత రాసుకోమన్నారుట. గాంధీగారు రూపాయో, రెండు రూపాయలో రాశారుట. అలా ఉంటుంది జ్ఞాని పరిస్థితి. అందువల్ల జ్ఞానికి ఏమీ నిషేధాలు పెట్టదు కాని, శాస్త్రం అజ్ఞాని పాపం చెయ్యకూడదు అంటుంది. ఎందుకంటే అజ్ఞాని పాపం చేస్తాడు, చెయ్యగలడు. అందువల్ల అతనికి పాపం చెయ్యకూడదు అని నియమం పెట్టి తీరాలి. కాని శాస్త్రానికి జ్ఞాని తనకిచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చెయ్యడని ఖచ్చితంగా తెలుసు.

ఇంకో జ్ఞానఫలం గురించి చెప్పేముందు యాజ్ఞవల్క్యుడు మరికొన్ని సాధనల గురించి చెబుతున్నాడు. జ్ఞానం పొందేందుకు సాధకుడు సాధనచతుష్టయసంపన్నుడయి ఉండాలని, అతన్నే అధికారి అంటారనీ చూశాము. సాధనచతుష్టయసంపన్నుడి గురించి తత్త్వబోధలో వివరంగా వస్తుంది. దానికి ఆధారం కఠోపనిషత్తు, బృహదారణ్యకోపనిషత్తు.

సాధనచతుష్టయసంపత్తి అంటే నాలుగు సాధనలు కలిగివుండాలి. అవి వివేకం, వైరాగ్యం, ముముక్షుత్వం, శమాది షట్కసంపత్తి. అందులో మొదటి మూడూ కఠోపనిషత్తులో చూస్తాము.

**శ్రేయశ్చ ప్రేయశ్చ మనుష్యమేతః తౌ సమ్పరీత్య వివినక్తి ధీరః।**
**శ్రేయో హి ధీరోఽభి ప్రేయసో వృణీతే ప్రేయో మన్దో యోగక్షేమాద్వృణీతే॥ – కఠ 1.2.2**

తెలివైన వ్యక్తి శ్రేయస్సును ఎన్నుకుంటాడు. అది వివేకం. శ్రేయో ధీరః వృణీతే – అది ముముక్షుత్వం. అధ్యత్రాక్షీ – యమధర్మరాజు ఇచ్చిన మాలను తిరస్కరించాడు నచికేతుడు. అది వైరాగ్యం. ఇంక శమాది షట్కసంపత్తి మిగిలింది. దాన్ని ఇక్కడ చూస్తాము. శమాది షట్కసంపత్తి అంటే శమము, దమము, ఉపరతి, తితిక్ష, శ్రద్ధా, సమాధానం. ఈ ఆరింటిలో ఇక్కడ ఐదు వస్తాయి.

**శాంతః దాంతః ఉపరతః తితిక్షుః సమాహితః** – అంటే శమము, దమము, ఉపరతి, తితిక్ష, సమాధానం వచ్చాయి. శ్రద్ధ రాలేదు. అప్పుడు ఆరు ఉన్నాయని ఎలా చెప్పగలము?

బృహదారణ్యకోపనిషత్తులు రెండు ఉన్నాయి. ఒకటి శుక్లయజుర్వేదానికి చెందిన కాణ్వశాఖలో వస్తుంది; రెండవది శుక్లయజుర్వేదంలోనే మాధ్యందిన శాఖలో వస్తుంది. ఇది రెండూ చిన్నచిన్న భేదాలతో ఇంచుమించుగా ఒకటే. మనం చూస్తున్నది కాణ్వశాఖలో వచ్చే బృహదారణ్యకంమీద శంకరులవారి భాష్యంమీద ఆధారపడి ఉన్నది. శంకరులవారు మధ్యమధ్యలో మాధ్యందిన శాఖలోంచి కూడా ఉటంకిస్తుంటారు.

ఈ రెండు ఉపనిషత్తుల్లోనూ ఈ భాగం ఉంది. ఇక్కడ సమాహితః (సమాధానం) ఉంటే అక్కడ శ్రద్ధా పదం ఉంది. దాన్ని కూడా ఇక్కడికి తెచ్చుకుంటే శమాదిషట్కసంపత్తి అవుతుంది.

**శాంతః దాంతః** – శమము అంటే మనోనిగ్రహం; దమము అంటే ఇంద్రియనిగ్రహం. శమము పదానికీ, శాంతము పదానికీ మధ్య భేదం ఏమిటి? శమము అంటే మనోనిగ్రహం అనే ఒక విలువ; శాంతః అంటే ఆ విలువను పాటించేవ్యక్తి. అలాగే దమము అంటే ఇంద్రియనిగ్రహం అనే విలువ; దాంతః అంటే ఆ విలువను పాటించే వ్యక్తి.

**ఉపరతః** – తత్త్వబోధలో ఉపరతి అంతే స్వధర్మ అనుష్ఠానం అని వస్తుంది. శంకరులవారు సన్న్యాసం లేదా సర్వపరిత్యాగం అంటారు. ఉపరతి అంటే సర్వపరిత్యాగం, ఉపరతః అంటే సర్వాన్నీ పరిత్యజించిన సన్న్యాసి.

**తితిక్షుః** – ద్వంద్వ సహిష్ణుత్వం. సుఖదుఃఖాలు, మానావమానాలు, జయాపజయాలు, సంయోగవియోగాలను సహించటం. తితిక్ష అంటే ద్వంద్వాలను సహించటం; తితిక్షు అంటే అటువంటి వ్యక్తి.

**సమాహితః** – సమాహితం అంటే సమాధానం. సమాధానం అంటే ఏకాగ్రత. తన ప్రాథమిక లక్ష్యంమీద ఏకాగ్రత. అట్టి ఏకాగ్రత ఉన్న వ్యక్తి సమాహితః.

**శ్రద్ధా** – ఈ పదాన్ని మాధ్యందిన శాఖకు చెందిన బృహదారణ్యకోపనిషత్తునుంచి కలుపుకోవాలని చూశాము. గురు, శాస్త్ర ఉపదేశంమీద శ్రద్ధ.

**తస్మాత్ ఏవం విత్** – ఈ విధంగా తెలుసుకున్న వ్యక్తి, సాధనచతుష్టయసంపన్నుడై;

**ఆత్మన్యేవ ఆత్మానం పశ్యతి** – తానే ఆత్మ అని తెలుసుకుంటాడు. ఇక్కడ ఆత్మ పదం రెండుసార్లు వచ్చింది. వాటి అర్థాల్లో భేదం ఉంది. అది జాగ్రత్తగా గమనించాలి. మొదటిపదం 'ఆత్మని' అంటే మనస్సులో. రెండవ పదం 'ఆత్మానం' అంటే సాక్షిచైతన్యాన్ని. ఇది ఆత్మజ్ఞానంలో మొదటి దశ. **నేను అనాత్మకు భిన్నంగా ఉన్న ఆత్మను.** జగత్తు, శరీరం, మనస్సు – అన్నీ అనాత్మ కిందకు వస్తాయి. నేను ఆత్మను; నేను అనాత్మకు భిన్నంగా ఉన్నాను.

కాని ఈ జ్ఞానం సంపూర్ణజ్ఞానం కాదు. ఎందుకంటే నేను అనాత్మకు భిన్నంగా ఉన్న ఆత్మను అంటే ఇంకా ద్వైతభావనలోనే ఉన్నాము. అంటే ఆత్మ–అనాత్మలను భిన్నంగా చూస్తున్నాము. దీన్నించి ఇంకొక మెట్టు పైకి ఎదగాలి.

**సర్వమాత్మానం పశ్యతి** – సర్వాత్మభావన రావాలి. అసలు అనాత్మ విడిగా లేదు. అది కూడా ఆత్మలో ఉంది. జగత్తు, శరీరం, మనస్సు అన్నీ ఆత్మలోనే ఉన్నాయి. ఇది సర్వాత్మభావన. ఈ సర్వాత్మభావన రాకపోతే, భయం కొనసాగుతుంది. ద్వైతం ఉంటే భయం వస్తుంది.

**ద్వితీయాద్వై భయం భవతి**

దీని తర్వాత మళ్ళీ జ్ఞానఫలంలోకి వెళుతున్నాము.

**నైనం పాప్మా తరతి** – పాపం అతని దగ్గరకు వెళ్ళలేదు;

**సర్వం పాప్మానం తరతి** – అతను అన్ని రకాల పాపాలకు అతీతుడవుతాడు;

**నైనం పాప్మా తపతి** – అతనిని పాపం దహించలేదు;

**సర్వం పాప్మానం తపతి** – అతను అన్ని పాపాలను దహించివేస్తాడు. జ్ఞానం పొందేవరకూ అతన్ని అన్ని రకాల పాపాలు దహించివేస్తాయి. జ్ఞానం పొందాక అతని జ్ఞానం అన్ని పాపాలను దహించి వేస్తుంది. వేదాంతంలో జ్ఞాని పాపాలు దహించుకుపోతాయి అన్నప్పుడల్లా పుణ్యాలు కూడా తీసుకోవాలి. పుణ్యపాపాలు రెండూ దహించుకుపోతాయి. **సర్వపుణ్యపాప తరణం** మూడవ జ్ఞానఫలం.

ఇంకొక జ్ఞానఫలం చూపిస్తున్నాడు ఇక్కడ –

**విపాపః విరజః అవిచికిత్సః బ్రాహ్మణో భవతి** – ఎవరిని బ్రాహ్మణుడు అంటారో, ఇక్కడ ఇంకొక నిర్వచనం ఇస్తున్నారు. విపాప అంటే పుణ్యపాప రహితుడు అంటే కర్మరహితుడు; విరజః అంటే కామరహితుడు; అవిచికిత్సః అంటే సంశయరహితుడు. సంశయరహితుడు అంటే అవిద్యారహితుడు లేదా అజ్ఞానరహితుడు. అవిద్యారహిత, కామరహిత, కర్మరహితుడు. అజ్ఞానం కోరికకు దారితీస్తుంది; కోరిక కర్మను చేసేలాగా చేస్తుంది; కర్మ పుణ్యపాపాలను ఇస్తుంది; పుణ్యపాపాలు సుఖదుఃఖాలను కలుగజేస్తాయి; దానికోసం పునరపి జననం, పునరపి మరణం అనే సంసారవృత్తంలో పడి తిరుగుతూనే ఉండాలి.

ఈ పదాలను కలిపితే అవిద్యాకామకర్మరహితుడు అని చెప్పవచ్చు. సంసారచక్రంలో పడి కొట్టుమిట్టాడటానికి ఈ మూడే ముఖ్యకారణం. మళ్ళీ జన్మ ఎత్తాక కూడా అవిద్యాకామకర్మలు కొనసాగుతాయి. **అవిద్యాకామకర్మరహితుడు** నాల్గవ ఫలం.

ఎవరైతే అవిద్యాకామకర్మరహితుడో అతడినే బ్రాహ్మణుడు అంటారు. అంటే ఆత్మజ్ఞానినే బ్రాహ్మణుడు అంటారు. ఇక్కడితో యాజ్ఞవల్క్యుని బోధ అయిపోయింది. యాజ్ఞవల్క్యుడు ముగిస్తున్నాడు.

**ఏష బ్రహ్మలోకః సమ్రాట్** – ఓ సామ్రాట్, ఈ ఆత్మనిష్ఠే బ్రహ్మలోకం అన్నాడు యాజ్ఞవల్క్యుడు. ఇక్కడ కూడా బ్రహ్మలోకం అంటే ఉపాసకులు వెళ్ళే బ్రహ్మలోకంగా తీసుకోకూడదు. ఆ బ్రహ్మలోకం కూడా సంసారం కిందికే వస్తుంది.

**ఆబ్రహ్మభువనాల్లోకాః పునరావర్తినోఽర్జున ।**
**మాముపేత్య తు కౌంతేయ పునర్జన్మ న విద్యతే ॥** **– గీత 8.16**

ఇక్కడ ఈ మంత్రంలో బ్రహ్మలోకం అంటే బ్రహ్మ. అయితే లోకం అంటే ఏమిటి? లోకం అంటే స్వయం ప్రకాశకం. అందువల్ల బ్రహ్మలోకం అంటే జ్యోతిరూపబ్రహ్మ లేదా చైతన్యస్వరూపబ్రహ్మ. ఇంకో విధంగా చెప్పాలంటే ఇదే మోక్షం. అంటే ఆత్మజ్ఞానం పొందటం మోక్షం. ఇక్కడ మోక్షాన్ని నాలుగు ఫలాలుగా చూశాము. అవి– కృత అకృత తరణం; బ్రహ్మజ్ఞాని మాత్రమే బ్రాహ్మణుడు; పుణ్యపాప తరణం; అవిద్యాకామకర్మరహితం.

**ఏనం ప్రాపితోఽసీతి హోవాచ యాజ్ఞవల్క్యః** – నువ్వు బ్రహ్మలోకానికి తీసుకురాబడ్డావు అని యాజ్ఞవల్క్యుడు అంటున్నాడు. జనకుడిని మెచ్చుకుంటున్నాడు. నువ్వు గమ్యానికి చేర్చబడ్డావు అన్నాడు. ఇది కూడా అక్షరాలా తీసుకోకూడదు. గురువు ఏ గుర్రంలాగానో శిష్యుడిని మోక్షం అనే గమ్యానికి తీసుకువెళ్ళడు. తీసుకువెళ్ళటం అంటే అజ్ఞానంనుంచి జ్ఞానానికి తీసుకు వెళ్ళటం.

**తమసో మా జ్యోతిర్గమయ**

యాజ్ఞవల్క్యుడు నేను నిన్ను మోక్షానికి తీసుకువెళ్ళాను అని చెప్పటంలో ఉద్దేశం నిన్ను నేను జ్ఞానిని చేశాను, నీకు మోక్షం కలుగుతుంది అని. జనకుడు ఈ ఆత్మజ్ఞానం పొంది ఎంతగా మురిసిపోయాడంటే, తను పొందిన పూర్ణత్వానికి ఎంత పెద్ద గురుదక్షిణ ఇచ్చినా చాలదనిపించింది అతనికి.

**సోఽహం భగవతే విదేహాన్ దదామి** – ఓ భగవాన్, నీకు గురుదక్షిణగా నా విదేహరాజ్యం మొత్తం మీకు అర్పించుకుంటాను అన్నాడు. అయినా జనకుడు తృప్తి తీరలేదు. అతని ఆనందం ముందు ఈ కానుక చిన్నది అనిపించింది. అందువల్ల –

**మాం చాపి సహ దాస్యాయేతి** – నన్ను కూడా నీకు సేవ చెయ్యటానికి సమర్పించుకుంటున్నాను అన్నాడు. అంటే నేను నీ దాసుడిని, నన్ను నువ్వు ఎలా కావాలన్నా వాడుకోవచ్చు అన్నాడు. దీన్ని ఆత్మనివేదనం అంటారు.

విదేహ పదానికి రెండు అర్థాలున్నాయి. అవి రాజ్యం, రాజు. ఇక్కడ రాజ్యం అని అర్థం వస్తుంది. జనకుడు ఆత్మజ్ఞానం పొంది ఎంతగా మురిసిపోయాడో దీన్నిబట్టే తెలుస్తున్నది. తన రాజ్యాన్ని, తనను కూడా అర్పించేసుకున్నాడు. యాజ్ఞవల్క్యుడు తీసుకుంటాడా లేదా అనేది వేరే విషయం; జనకుడు ఆత్మనివేదనం చేశాడు.

ఇక్కడితో జనక–యాజ్ఞవల్క్యుల సంవాదం ముగిసింది.

## మంత్రం 4.4.24

**స వా ఏష మహానజ ఆత్మాఽన్నాదో వసుదానో విన్దతే వసు య ఏవం వేద ॥**

ఈ బ్రాహ్మణాన్ని ఇప్పుడు రాబోయే ఈ రెండు మంత్రాలతో ఉపనిషత్తు ఉపసంహరించబోతున్నది. రెండు సాధనలు చెప్పబోతున్నది. అవి –

మధ్యమ అధికారికి – సగుణబ్రహ్మ ఉపాసన
ఉత్తమ అధికారికి – నిర్గుణబ్రహ్మ జ్ఞానము

ఈ 24వ మంత్రంలో సగుణబ్రహ్మ ఉపాసన చూస్తాము. సగుణబ్రహ్మ అంటే ఈశ్వరుడు.

బ్రహ్మ + మాయ = ఈశ్వరుడు.

సగుణబ్రహ్మ అంటే ఎన్నో గుణాలు ఉన్నాయి; నిర్గుణబ్రహ్మ అంటే గుణాతీతుడు. బ్రహ్మ మాయతో కూడితే కళ్యాణగుణాలు ఉంటాయి. అదే జీవుడు మాయతో కలిస్తే చెడుగుణాలు ఉంటాయి. అదే ఈశ్వరునికి, మాయకు మధ్య ఉన్న భేదం. సగుణబ్రహ్మకు అనేక గుణాలున్నాయి. వాటిలో ఏ గుణాన్నైనా తీసుకుని ఉపాసన చెయ్యవచ్చు.

ఇక్కడ రెండు గుణాలు తీసుకుంది ఉపనిషత్తు. జీవితంలో ఎవరైనా కోరుకునేది రెండే – అన్నం, ధనం. కడుపు నిండా ఆహారం; చేతినిండా డబ్బు కావాలి అనుకుంటారు.

**అన్నాదః** – అన్నం తినేది ఆత్మ. అంటే భగవంతుడు ఎక్కడో కూర్చుని అన్నం తింటున్నాడు అని కాదు అర్థం. భగవంతుడు అందరిద్వారా తింటున్నాడు. భగవంతుడు అందరిలోనూ వైశ్వానర అగ్నిరూపంలో ఉండి, అంతా ఆరగించుకుంటున్నాడు.

**వసుదానః** – ఆత్మ ఐశ్వర్యం. వసుః అసలు అర్థం ఐశ్వర్యం; లక్ష్యార్థం కర్మఫలదాత. రెండు అర్థాలూ తీసుకోవచ్చు. మనుష్యులకు ఐశ్వర్యాన్ని ఇచ్చేది, కర్మఫలాన్ని ఇచ్చేది కూడా బ్రహ్మే. ఈ బ్రహ్మ సగుణబ్రహ్మే, నిర్గుణబ్రహ్మే?

**మహాన్ అజ ఆత్మా** – ఈ పదాలను ఇందులోనే చాలాసార్లు చూశాము. మహాన్ అంటే అనంతం; అజ అంటే పుట్టుక లేనిది. గొప్పది, పుట్టుక లేనిది నిర్గుణబ్రహ్మ. అన్నాద, వసుదానః గుణాలు ఉన్న ఆత్మ నిర్గుణబ్రహ్మయొక్క సగుణ అంశం. అటువంటి సగుణబ్రహ్మమీద ఉపాసన చెయ్యాలి. అతనికి కలిగే ఫలం ఏమిటి?

**విందతే వసు య ఏవం వేద** – ఇక్కడ వేద అంటే తెలుసుకోవటం కాదు, ఉపాసన చెయ్యటం. ఎవరైతే ఈ సగుణబ్రహ్మమీద ఉపాసన చేస్తాడో, అతనికి డబ్బుకు లోటు ఉండదు. అతనికి రావాల్సిన కర్మఫలాన్ని కూడా పొందుతాడు. ఈ రెండు ఫలాలతో పాటు మూడవ ఫలాన్ని కూడా కలుపుకోవాలి. అది అన్నానికి లోటు ఉండదు. అన్నాదం బ్రహ్మమీద ఉపాసన చేస్తాడు కాబట్టి అతను బాగా తినగలుగుతాడు. అంటే అతనికి ఆరోగ్యం బాగా ఉంటుంది. దీనితో సగుణ ఉపాసన, సగుణ ఉపాసన ఫలం ముగిసింది.

## మంత్రం 4.4.25

**స వా ఏష మహానజ ఆత్మాఽజరోఽమృతోఽభయో బ్రహ్మాఽభయం వై బ్రహ్మాఽభయగ్ం హి వై బ్రహ్మ భవతి య ఏవం వేద ॥**

ఇప్పుడు నిర్గుణజ్ఞాన ఫలము. ఇది ఉత్తమ అధికారికి. ముందు నిర్గుణ బ్రహ్మస్వరూపం వస్తుంది.

**స వా ఏష మహానజ ఆత్మా** – ఈ మహానజ ఆత్మ చాలాసార్లు చూశాము బృహదారణ్యకంలో. మహాన్ అంటే అనంతం. అంటే దేశకాలవస్తుపరిచ్ఛేదం లేదు. అజః అంటే పుట్టుక లేదు.

**అజరః** – పుట్టుక లేదు కాబట్టి అజరః కూడా; అంటే వృద్ధాప్యం, దానికి సంబంధించిన బాధలు లేవు. అంటే జరారహితం లేదా అపక్షీయరహితం.

**అమరః అమృతః** – అమరః అమృతః – రెండింటి అర్థమూ ఒకటే. నాశరహితం అంటే నాశనం లేనిది. రెండింటి అర్థం ఒకటే, దానికి రెండు భిన్నపదాలు ఎందుకు? ఈ రెండింటి మధ్య సూక్ష్మమైన భేదం ఉంది. నాశనం రెండు రకాలు. అవి ఆపేక్షిక నాశనం, ఆద్యంతిక నాశనం. ఆపేక్షిక నాశనం అంటే అవ్యక్త అవస్థలోకి వెళ్ళటం.

నిజానికి ఒక వ్యక్తి గాఢనిద్ర పోయినప్పుడు అతని దుఃఖాలన్నీ తాత్కాలికంగా నాశనమవుతాయి. రాగద్వేషాలు ఉండవు. కాని రాగద్వేషాలు ఉండవంటే పూర్తిగా నాశనం అవవు. అవి అవ్యక్త అవస్థలోకి వెళతాయి. దాన్ని ఆపేక్షిక నాశనం అంటారు.

ఆపేక్షిక నాశనం అని ఎలా చెప్పగలము? పొద్దున లేవగానే అతనికున్న దుఃఖం మళ్ళీ వస్తుంది; రాగద్వేషాలు మళ్ళీ వస్తాయి. జీవుడు మరణించినప్పుడు అతని సుఖదుఃఖాలు, రాగద్వేషాలు కూడా మరణిస్తాయి కాని అది కూడా ఆపేక్షిక నాశనమే. ఎందుకంటే వచ్చే జన్మలో అతను ఈ పుణ్యపాపాలతో, ఈ రాగద్వేషాలతో పుడతాడు. ప్రళయంలో అయినా అవి నాశనమవుతాయా అంటే అప్పుడు కూడా నాశనమవవు. అప్పుడు కూడా సుఖదుఃఖాలు, రాగద్వేషాలు అవ్యక్తంలోకి వెళ్ళిపోయి, మళ్ళీ సృష్టి జరిగి, ఈ జీవి మళ్ళీ పుట్టినప్పుడు అతనితో పాటు మళ్ళీ తిరిగివస్తాయి. అందువల్ల ప్రళయం కూడా ఆపేక్షిక నాశనమే.

అందువల్ల అవ్యక్తంలోకి వెళ్ళిపోవటాన్ని ఆపేక్షిక నాశనం అంటారు. ఆత్యంతిక నాశనము అంటే ఆ నాశనము అయ్యాక అది తిరిగిరాదు. ఇది ఒక్క విదేహముక్తి పొందితేనే అవుతుంది. విదేహముక్తిలో అహంకారం లయమయిపోతుంది; పుణ్యపాపాలు నాశనమయిపోతాయి. అందువల్ల జ్ఞానికి పునర్జన్మ లేదు. అతను తిరిగిరాడు. దీన్ని నిరన్వయ నాశనం లేదా ఆత్యంతిక నాశనం అంటారు.

ఇక్కడ ఉపనిషత్తు, ఆత్మకు రెండు రకాల నాశనమూ లేదంటున్నది. అమరః అంటే ఆపేక్షిక నాశరహితం; అమృతః అంటే ఆత్యంతిక నాశరహితం. అందువల్ల ఆత్మ ఆపేక్షిక నాశరహితం, ఆత్యంతిక నాశరహితం.

**అభయః బ్రహ్మ** – భయం లేదు. ఎందుకంటే ద్వైతం లేకపోతే భయం ఉండదు. ఇది అభయంయొక్క వాచ్యార్థం. శంకరులవారు దీనికి ప్రత్యేక అర్థం కూడా చెబుతున్నారు. ఆయన భయం అంటే అవిద్య లేదా అజ్ఞానం అంటున్నారు. అజ్ఞానంనుంచి భయం పుడుతుంది. ఎక్కడెక్కడ అజ్ఞానం ఉంటే అక్కడక్కడ భయం ఉంటుంది. ఇది వ్యాప్తివాక్యం. అభయం అంటే అవిద్యారహితం.

అభయం బ్రహ్మ అనటంలో ఉద్దేశం ఆత్మ = బ్రహ్మ. ఇది ఒక మహావాక్యం. అయం ఆత్మా బ్రహ్మ. ఆత్మ వేరే ఏదోకాదు, బ్రహ్మ.

**అభయం వై బ్రహ్మ** – మళ్ళీ ఈ మాటను తిరిగి చెబుతున్నది ఉపనిషత్తు. అంటే బ్రహ్మకు భయం లేదు, అజ్ఞానం లేదు, నాశనం లేదు.

**అభయగ్ం హి వై బ్రహ్మ భవతి** – అభయం బ్రహ్మను ఎవరైతే తెలుసుకుంటారో వారు అభయం బ్రహ్మ అవుతారు.

**య ఏవం వేద** – ఎవరైతే ఈ జ్ఞానం పొందుతారో, వారు బ్రహ్మ అవుతారు.

దీనితో శారీరక బ్రాహ్మణం అయిపోయింది. శారీరక బ్రాహ్మణం అంటే శరీరంలో వ్యక్తమయ్యే ఆత్మ. శరీరే భవం శారీరకం.

## బ్రాహ్మణము 4 సారాంశము

**మంత్రాలు 1-6: సంసారవర్ణన**

ఈ మంత్రాల్లో ముందు బ్రాహ్మణములో మొదలైన సంసారవర్ణన కొనసాగింది. అది స్వయంజ్యోతి బ్రాహ్మణంలో 4.3.24లో మొదలై 4.4.6 వరకూ సాగింది.

**మంత్రం 6(చివర్లో),7 : మోక్షవర్ణన**

మోక్షవర్ణన వచ్చింది. ఇందులో చాలా టూకీగా మోక్షం గురించి చెప్పాడు యాజ్ఞవల్క్యుడు. సంసారం అంటే కోరికలు ఉండటం, మోక్షం అంటే కోరికలు లేకపోవటం.

**మోక్షం = యః అకామో నిష్కామః ఆప్తకామ ఆత్మకామః**

జ్ఞానం పొంది, కోరికలు లేకపోవటం మోక్షం. కోరికలు లేకపోవటం అంటే అధార్మిక కోరికలు, బంధించే కోరికలు లేకపోవటం. ధార్మిక కోరికలు, బంధించని కోరికలు జ్ఞానికి కూడా ఎన్నైనా ఉండవచ్చు. అందులో దోషం లేదు. భగవంతునికి కూడా ధార్మిక కోరికలు ఉంటాయి

**పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ ।**

**ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥** – గీత 4.8

**మంత్రాలు 8-21: జ్ఞానమార్గ స్తుతి**

యాజ్ఞవల్క్యుడు తన బోధలో భాగంగా కొన్ని ఋగ్మంత్రాలను ఏరి జ్ఞానాన్ని స్తుతించాడు.

**మంత్రాలు 22, 23: జ్ఞానసాధనం, జ్ఞానఫలం**

22వ మంత్రం చాలా పెద్దది, చాలా ముఖ్యమైనది. ఈ మంత్రంలో మూడూ వస్తాయి – జ్ఞానమార్గస్తుతి, జ్ఞానసాధనలు, జ్ఞానఫలం.

**జ్ఞానసాధనం** – ఇందులో నాలుగు ఆశ్రమధర్మాల్లో మొదటి మూడూ పరోక్షంగా మోక్షానికి దారి తీస్తాయనీ, నాలుగవ ధర్మం సాక్షాత్తూ మోక్షానికి దారితీస్తుందనీ యాజ్ఞవల్క్యుడు వివరించాడు. మొదటి మూడింటినీ పరంపర సాధన అనీ, నాలుగవదాన్ని సాక్షాత్తు సాధన అనీ అన్నాడు. మొదటి మూడింటిలో రెండు ఫలాలు వస్తాయి. ప్రత్యక్షంగా లౌకిక ప్రయోజనాలను ఇస్తే, పరోక్షంగా మోక్షానికి దారితీస్తాయి.

**జ్ఞానఫలం** – జ్ఞానికి మోక్షం కలుగుతుంది. జ్ఞానఫలం నాలుగు ఫలాలుగా చెప్పబడ్డాయి. కృత అకృత తరణం;

బ్రహ్మజ్ఞాని మాత్రమే బ్రాహ్మణుడు; పుణ్యపాప తరణం; అవిద్యాకామకర్మరహితం.

దీనితో జనక-యాజ్ఞవల్క్యుల సంవాదం ముగిసింది.

**మంత్రాలు 24, 25: సగుణ ఉపాసన, నిర్గుణ జ్ఞానము**

ఉపనిషత్తే ఈ రెండు మంత్రాల్లో సగుణ ఈశ్వర ఉపాసన, నిర్గుణ బ్రహ్మజ్ఞానం గురించి చెప్పింది. సగుణ ఈశ్వర ఉపాసన మధ్యమ అధికారికి అయితే, నిర్గుణ బ్రహ్మజ్ఞానం ఉత్తమ అధికారికి చెప్పబడింది.

ఇది శారీరక బ్రాహ్మణము సారాంశం.

ఇందులో ముఖ్యమైన మంత్రాలు

**మంత్రం 2:** తం విద్యాకర్మణీ సమన్వారభేతే పూర్వప్రజ్ఞా చ

ఒక వ్యక్తి మరణించినప్పుడు అతనితో పాటు అతను చేసిన కర్మలు, ఉపాసన, అతని వాసనలు వెళతాయి. ఈ వివరణ వేరే ఏ ఉపనిషత్తులోనూ చూడము. అందువల్ల ఇది చాలా ముఖ్యం.

**మంత్రం 5:** ఈ మంత్రం మొత్తం ముఖ్యమైనదే. సర్వాత్మభావన వస్తుంది ఇందులో. మొదట్లో ఆత్మ అంటే విజ్ఞానమయం, మనోమయం అంటాము కాని తర్వాత అన్ని కోశాలూ ఆత్మే అంటారు.

**సాధుకారీ సాధుర్భవతి పాపకారీ పాపోభవతి**

చేసుకున్నవారికి చేసుకున్నంత మహదేవా అనే భావాన్ని సూచిస్తుంది.

**స యథాకామో భవతి తత్క్రతుర్భవతి యత్క్రతుర్భవతి తత్కర్మ కురుతే యత్కర్మ కురుతే తదభిసమ్పద్యతే॥**

మన ఆలోచనలు మన వ్యక్తిత్వాన్ని నిర్దేశిస్తాయి అని ఇంగ్లీషు సామెత కూడా ఉంది. అదే భావన ఇక్కడ కూడా.

**మంత్రం 6:** ఇందులో కూడా అన్నీ ముఖ్యమే. ముఖ్యంగా -

**యోఽకామో నిష్కామ ఆప్తకామ ఆత్మకామః**

ఇంకా ముఖ్యమైన వాక్యం -

**బ్రహ్మైవ సన్ బ్రహ్మాప్యేతి**

దీనిమీద వివరంగా భాష్యం కూడా చూశాము. ముందే బ్రహ్మ అయిన అతను బ్రహ్మ అవుతాడు. ఇది అర్థం చేసుకోకపోతే సంసారం; అర్థం చేసుకుంటే మోక్షం.

**మంత్రం 7:** పాము కుబుసం విడిచినట్టు, జ్ఞాని తన శరీరంనుంచి విడివడతాడు అని వస్తుంది.

**మంత్రం 12:** చిన్న మంత్రం కాని దీనిలో ప్రతి అక్షరంమీద విద్యారణ్యులవారు చాలా వివరంగా, 300

శ్లోకాలలో పంచదశిలో చర్చిస్తారు. ఇది ఆత్మజ్ఞానం, ఆత్మ జ్ఞానఫలం గురించి మాట్లాడుతుంది కాబట్టి చిన్న మంత్రం అయినా పూర్తి మంత్రం.

**మంత్రం 20:** ఈ మంత్రం కూడా చాలా ముఖ్యమైనదే, కాని మరీ ముఖ్యం ఈ పదాలు –

**ఏతదప్రమయం**

ఆత్మ అప్రమేయం అని వేరే ఏ ఉపనిషత్తులోనూ చూడము.

**మంత్రం 21:** ఈ మంత్రం నిదిధ్యాసన మంత్రం. బ్రహ్మ జిజ్ఞాసులకు మంచి సలహా ఇచ్చింది ఈ మంత్రం. ఎక్కువ మాట్లాడితే వాగింద్రియం బలహీనమవుతుంది అని హెచ్చరించింది.

**మంత్రం 22:** ఇది చాలా పెద్ద మంత్రం, చాలా ముఖ్యమైన మంత్రం కూడా. ఇందులో నాలుగు ఆశ్రమ ధర్మాల గురించి వచ్చింది. ఇది భగవద్గీతలోని కర్మయోగానికి బీజమంత్రం. జ్ఞానఫలం కూడా బాగా ఇవ్వబడింది.

**మంత్రం 23:** బ్రహ్మజ్ఞానినే బ్రాహ్మణుడు అన్నది. సాధనచతుష్టయంలో శమాది షట్కసంపత్తి గురించి ఈ మంత్రంలోనే వస్తుంది.

**మంత్రం 25:** బ్రహ్మస్వరూపం, ఐక్యం చాలా చక్కగా ఇవ్వబడింది.

**ఆత్మా వై బ్రహ్మ**

ఇది మహావాక్యం.

# 4.5 - మైత్రేయీ బ్రాహ్మణము

మైత్రేయీ బ్రాహ్మణాన్ని రెండవ అధ్యాయములో నాలుగవ బ్రాహ్మణముగా చూశాము. ఇప్పుడు ఇంచుమించు అదే మంత్రాలతో, అదే పేరుతో మళ్ళీ నాలుగవ అధ్యాయములో, ఐదవ బ్రాహ్మణముగా చూస్తున్నాము. ఉపనిషత్తు ఎందుకలా మళ్ళీ అదే బ్రాహ్మణాన్ని చెబుతున్నది? దీనికి కారణముంది అంటున్నారు శంకరులవారు.

తర్కంలో సాధారణంగా ఒక నియమం ఉంటుంది. వారు ఏదైనా తర్కపరంగా నిరూపించాలంటే దాంట్లో మూడు దశలు ఉంటాయి. అవి – ప్రతిజ్ఞ, హేతువు, నిగమనం.

1. **ప్రతిజ్ఞ** – దీన్ని ఉపోద్ఘాతం అంటారు. చెప్పాలనుకున్న విషయాన్ని ముందు చెబుతారు. అక్కడ ఏమీ తర్కం ఉండదు. ఆత్మ ఏకత్వం – ఇక్కడ చెప్పదలుచుకున్న విషయం. అది రెండవ అధ్యాయములో మైత్రేయీ బ్రాహ్మణములో చెప్పబడింది.

2. **హేతువు** – ముందు చెప్పిన ప్రతిజ్ఞా అంశాన్ని వివరంగా తర్కప్రమాణంతో నిరూపిస్తారు. ఈ హేతువును మూడు, నాలుగు అధ్యాయాలలో చూశాము. మూడవ అధ్యాయములో జనకుని యాగశాలలో, జనకుడు ఇస్తానన్న వెయ్యి ఆవులను గెలుచుకోవటానికి, ఎనిమిదిమంది బ్రాహ్మణులతో వాదోపవాదనలు చేసి, తను వేదవిత్ అని నిరూపించుకున్నాడు యాజ్ఞవల్క్యుడు.

నాలుగవ అధ్యాయములో, ఇప్పటిదాకా అంటే నాలుగవ బ్రాహ్మణంద్వారా జనక మహారాజుకు వేదాంతబోధ చేశాడు అదే యాజ్ఞవల్క్యుడు. ఈ రెండు అధ్యాయాలూ తర్క ప్రధానం.

3. **నిగమనం** – ఇంతవరకూ తర్కంద్వారా నిరూపించిన అంశాన్ని మళ్ళీ ముగించబోతున్నాడు. దీన్ని ఉపసంహారం అని కూడా అంటారు. నిగమనం కూడా ప్రతిజ్ఞ లాగానే ఉంటుంది కాని, దానికీ దీనికీ చిన్న తేడా ఉంది. ప్రతిజ్ఞలో తర్కం ఉండదు. విషయం చెబుతుంది అంతే. అదే నిగమనంలో తర్కసంబంధం ఉంటుంది. అందువల్ల ఇప్పుడు చూడబోయే మైత్రేయీ బ్రాహ్మణాన్ని నిగమస్థానీయం అనీ, ముందు చెప్పిన మైత్రేయీ బ్రాహ్మణాన్ని ప్రతిజ్ఞాస్థానీయం అనీ అనవచ్చు.

ఇది ఇంచుమించుగా ముందు బ్రాహ్మణములాగానే ఉంది కాబట్టి, మరీ వివరాలలోకి వెళ్ళము. ఎక్కడక్కడ దానికీ దీనికీ వ్యత్యాసాలు ఉన్నాయో వాటిని వివరంగా చూద్దాము. మొదటి మంత్రం అక్కడ లేదు. అందువల్ల మొదటి మంత్రాన్ని వివరంగా చూద్దాము. నిజానికి ఇక్కడ చెప్పిన వివరణను అక్కడ మనం ముందే కలుపుకున్నాము. ఈ నేపథ్యంతో బ్రాహ్మణములోకి అడుగుపెడదాము.

మంత్రం 4.5.1

**అథ హ యాజ్ఞవల్క్యస్య ద్వే భార్యే బభూవతుర్మైత్రేయీ చ కాత్యాయనీ చ తయోర్హమైత్రేయీ బ్రహ్మవాదినీ బభూవ స్త్రీప్రజ్ఞైవ తర్హి కాత్యాయన్యథ హ యాజ్ఞవల్క్యోఽన్యద్వృత్తముపాకరిష్యన్ ॥**

ఈ బ్రాహ్మణం యాజ్ఞవల్క్య–మైత్రేయిల సంవాదంగా కొనసాగుతుంది. యాజ్ఞవల్క్యుడు, మైత్రేయి భార్యాభర్తలు. కాని ఈ సంవాదం గురు–శిష్యుల సంవాదంగా కొనసాగుతుంది. ఆ సందర్భం ఎలా వచ్చిందో ఒక కథలాగా చెబుతున్నది ఉపనిషత్తు.

గొప్ప ఋషి అయిన యాజ్ఞవల్క్యునికి ఇద్దరు భార్యలు. ఋషి అంటే సన్న్యాసి కాదు. ఋషులు గృహస్థుగా కాని వానప్రస్థంలో కాని ఉండవచ్చు. వారు అడవుల్లో ఉన్నంతమాత్రాన వారిని సన్న్యాసులుగా భ్రమ పడకూడదు.

అలా యాజ్ఞవల్క్య ఋషికి ఇద్దరు భార్యలు ఉన్నారు. వారు కాత్యాయని, మైత్రేయి. ఇక్కడ కూడా కొంతమందికి ఒక అపోహ ఉంది. మూడవ అధ్యాయములో గార్గి అనే స్త్రీ యాజ్ఞవల్క్యునితో రెండుసార్లు సంవాదంలోకి దిగుతుంది. ఆమెను బ్రహ్మవాదిని అంటారు. ఆమె యాజ్ఞవల్క్యుని భార్య కాదు.

**అథ హ యాజ్ఞవల్క్యస్య ద్వే భార్యే బభూవతుః** – యాజ్ఞవల్క్యునికి ఇద్దరు భార్యలు ఉన్నారు.

**మైత్రేయీ చ కాత్యాయనీ చ** – వారి పేర్లు మైత్రేయి, కాత్యాయని.

**తయోర్హ మైత్రేయీ బ్రహ్మవాదినీ బభూవ** – వారిద్దరిలో మైత్రేయి బ్రహ్మవాదిని. గార్గిని కూడా బ్రహ్మవాదిని అంటారని చూశాము. బ్రహ్మవాదిని అంటే ఎప్పుడూ బ్రహ్మ గురించి మాట్లాడేది.

**స్త్రీప్రజ్ఞైవ తర్హి కాత్యాయనీ** – మరొకవైపు కాత్యాయనికి బ్రహ్మజ్ఞానంమీద కుతూహలం లేదు. ఆమెకు తక్కిన స్త్రీలలాగా లౌకిక విషయాలపైనే శ్రద్ధ ఉండేది.

ఇది చూడటానికి స్త్రీలమీద విమర్శలాగా కనబడుతున్నా, నిజానికి కాదు. పూర్వకాలపు జీవనవిధానంలో స్త్రీలు ఇంటిపనులకీ, కుటుంబానికీ మాత్రమే అంకితమయ్యేవారు. అందువల్ల స్త్రీప్రజ్ఞ అంటే లౌకిక జీవనవిధానంలో శ్రద్ధ అని అర్థం వస్తుంది.

ఈ కథంతా చెప్పటం ఎందుకు? కొన్నాళ్ళు గృహస్థాశ్రమంలో గడిపాక, యాజ్ఞవల్క్యుడు దానికన్నా ఉన్నతమైన సన్న్యాసాశ్రమాన్ని స్వీకరించాలనుకున్నాడు. అంటే ఈ కథ ద్వారా, పూర్వం గృహస్థులు సన్న్యాసం స్వీకరించేవారని తెలుస్తున్నది. దానిమీద సన్న్యాసభాష్యం కూడా చూశాము అంతుకుముందు.

ఈ కథను సన్న్యాసాశ్రమానికి కేస్‌స్టడీగా చూపిస్తున్నది ఉపనిషత్తు. ఈ కేస్‌స్టడీ గురించి కొంచెం చూద్దాము. ఎవరు ప్రసంగాలు చేసినా, కొంతమంది వ్యక్తిగత అంశాల గురించి చెబుతారు. వినేవారికి ఇంత ఉన్నతమైన వేదాంతం గురించి చెబుతున్నప్పుడు, ఇలాంటి వ్యక్తిగత విషయాలు అవసరమా అనిపిస్తుంది. కాని అది చెపితే, చెప్పిన విషయం బాగా హత్తుకుపోతుంది. ప్రసంగాలలోనే కాదు, డాక్టర్లు కూడా కొన్ని విషయాలు చెప్పేటప్పుడు, వ్యక్తిత్వవికాసం గురించి పుస్తకాలు రాసేవారు. అవి రాసేటప్పుడు ఇలాంటి ఉదాహరణలెన్నో చెబుతారు.

ఒక సాధారణ అంశం గురించి చెప్పేటప్పుడు, ఆ అంశాన్ని సమర్థిస్తూ కొన్ని ఉదాహరణలు చెప్పాలి. దాన్నే కేస్‌స్టడీ అంటారు. ఉదాహరణకు టీనేజీ పిల్లలను ఎలా మ్యానేజ్ చెయ్యాలనే అంశంమీద మీరు ఒక వ్యాసం చదివారనుకోండి. అందులో ఏడు అంశాలు చెబుతూ, ప్రతి ఒక్క అంశానికీ, ఫలాన అమ్మాయి/అబ్బాయి ఇలా ప్రవర్తించాడు అంటారు. అలా చెప్పటం ఒక పద్ధతి.

నిజానికి ఈ కేస్‌స్టడీలు పరిశోధనలో ఒక భాగం. ఉదాహరణ విషయ వస్తువులో ఒక భాగం కాదు. కాని ఆ ఉదాహరణ లేకపోతే ఆ విషయానికి బలం ఉండదు. ఆధునికశాస్త్రం దీన్ని పరిశోధన అంటే, తర్కశాస్త్రం దీన్ని దృష్టాంతం అంటుంది. సంస్కృతంలో దీన్ని అర్థాంతరన్యాస అలంకారం అంటారు. అలంకారం అంటే సాధారణ అంశాన్ని, విశేష అంశంతో వివరించటం.

ఇలాంటి ఉదాహరణలు ఎన్నో చూస్తాము మనం వేదాంతబోధలో. కఠోపనిషత్తులో నచికేతుని కథ చూస్తాము. అది అతని తండ్రి వాజశ్రవసునితో మొదలవుతుంది. అలాగే భగవద్గీతలో మొదటి అధ్యాయం అర్జున విషాదంతో మొదలవుతుంది. అందులో బోధ లేదు. కాని అది బోధకు బలాన్ని ఇస్తుంది.

ఇంకొక విషయం. ఆధునిక కథలకు, వేదాంతకథలకు మధ్య చిన్న వ్యత్యాసం ఉంది. ఆధునిక కథల్లో అసలువారి పేర్లు దాచి, వేరే పేర్లు చెబుతారు. కాని వేదాంతకథల్లో అసలువారి పేర్లే వస్తాయి. కఠోపనిషత్తులో వాజశ్రవసుడు వట్టిపోయిన ఆవులను దానం చేశాడని, అతనిమీద వ్యతిరేకంగా వచ్చింది. అలాగే గీతలో సవ్యసాచి అయిన అర్జునుడిని, గాండీవం వదిలి పారిపోయే పిరికివానిలా చూపించింది. ఆ విధంగా యాజ్ఞవల్క్యునికి ఇద్దరు భార్యలు ఉన్నారు అని చెప్పటం కథ కింద వస్తుంది.

**అథ హ యాజ్ఞవల్క్యోఽన్యద్వృత్తముపాకరిష్యన్** – అప్పుడు యాజ్ఞవల్క్యుడు మరియొక జీవనశైలిని ఆరంభించ బోతున్నాడు.

మంత్రం 4.5.2

**మైత్రేయీతి హోవాచ యాజ్ఞవల్క్యః ప్రవ్రజిష్యన్ వా అరేఽహమస్మాత్ స్థానాదస్మి హన్త తేఽనయా కాత్యాయన్యాఽన్తం కరవాణీతి ॥**

మంత్రం 4.5.3

**సా హోవాచ మైత్రేయీ యన్ను మ ఇయం భగోస్సర్వా పృథివీ విత్తేన పూర్ణా స్యాత్ స్యాం న్వహం తేనామృతాఽహో ३ నేతి నేతి హోవాచ యాజ్ఞవల్క్యో యథైవోపకరణవతాం జీవితం తథైవ తే జీవితగ్ం స్యాదమృతత్వస్య తు నాశాస్తి విత్తేనేతి ॥**

మంత్రం 4.5.4

**సా హోవాచ మైత్రేయీ యేనాహం నామృతా స్యాం కిమహం తేన కుర్యాం యదేవ భగవాన్ వేద తదేవ మే బ్రూహీతి ॥**

మంత్రం 4.5.5

**స హోవాచ యాజ్ఞవల్క్యః ప్రియా వై ఖలు నో భవతీ సతీ ప్రియమవృధద్ధన్త తర్హి భవత్యేతద్వ్యాఖ్యాస్యామి తే వ్యాచక్షాణస్య తు మే నిదిధ్యాసస్వేతి ॥**

మంత్రం 4.5.6

స హోవాచ న వా అరే పత్యుః కామాయ పతిః ప్రియో భవత్యాత్మనస్తు కామాయ పతిః ప్రియో భవతి। న వా అరే జాయాయై కామాయ జాయా ప్రియా భవత్యాత్మనస్తు కామాయ జాయా ప్రియా భవతి। న వా అరే పుత్రాణాం కామాయ పుత్రాః ప్రియా భవన్త్యాత్మనస్తు కామాయ పుత్రాః ప్రియా భవన్తి । న వా అరే విత్తస్య కామాయ విత్తం ప్రియం భవత్యాత్మనస్తు కామాయ విత్తం ప్రియం భవతి। న వా అరే పశూనాం కామాయ పశవః ప్రియా భవన్త్యాత్మనస్తు కామాయ పశవః ప్రియా భవన్తి । న వా అరే బ్రహ్మణః కామాయ బ్రహ్మ ప్రియం భవత్యాత్మనస్తు కామాయ బ్రహ్మ ప్రియం భవతి । న వా అరే క్షత్రస్య కామాయ క్షత్రం ప్రియం భవత్యాత్మనస్తు కామాయ క్షత్రం ప్రియం భవతి। న వా అరే లోకానాం కామాయ లోకాః ప్రియా భవన్త్యాత్మనస్తు కామాయ లోకాః ప్రియా భవన్తి। న వా అరే దేవానాం కామాయ దేవాః ప్రియా భవన్త్యాత్మనస్తు కామాయ దేవాః ప్రియా భవన్తి । న వా అరే వేదానాం కామాయ వేదాః ప్రియా భవన్త్యాత్మనస్తు కామాయ వేదాః ప్రియా భవన్తి । న వా అరే భూతానాం కామాయ భూతాని ప్రియాణి భవన్త్యాత్మనస్తు కామాయ భూతాని ప్రియాణి భవన్తి । న వా అరే సర్వస్య కామాయ సర్వం ప్రియం భవత్యాత్మనస్తు కామాయ సర్వం ప్రియం భవతి। ఆత్మా వా అరే ద్రష్టవ్యశ్శ్రోతవ్యో మన్తవ్యో నిదిధ్యాసితవ్యో మైత్రేయ్యాత్మని ఖల్వరే దృష్టే శ్రుతే మతే విజ్ఞాత ఇదగ్ం సర్వం విదితమ్ ॥

మంత్రం 4.5.7

బ్రహ్మ తం పరాదాద్యోఽన్యత్రాత్మనో బ్రహ్మ వేద క్షత్రం తం పరాదాద్యోఽన్యత్రాత్మనః క్షత్రం వేద లోకాస్తం పరాదుర్యోఽన్యత్రాత్మనో లోకాన్ వేద దేవాస్తం పరాదుర్యోఽన్యత్రాత్మనో దేవాన్ వేద వేదాస్తం పరాదుర్యోఽన్యత్రాత్మనో వేదాన్ వేద భూతాని తం పరాదుర్యోఽన్యత్రాత్మనో భూతాని వేద సర్వం తం పరాదాద్యోఽన్యత్రాత్మనస్సర్వం వేదేదం బ్రహ్మేదం క్షత్రమిమే లోకా ఇమే దేవా ఇమే వేదా ఇమాని భూతానీదగ్ం సర్వం యదయమాత్మా ॥

మంత్రం 4.5.8

స యథా దున్దుభేర్హన్యమానస్య న బాహ్యాన్ శబ్దాన్ శక్నుయాద్గ్రహణాయ దున్దుభేస్తు గ్రహణేన దున్దుభ్యాఘాతస్య వా శబ్దో గృహీతః ॥

మంత్రం 4.5.9

స యథా శఙ్ఖస్య ధ్మాయమానస్య న బాహ్యాన్ శబ్దాన్ శక్నుయాద్గ్రహణాయ శఙ్ఖస్య తు గ్రహణేన శఙ్ఖధ్మస్య వా శబ్దో గృహీతః ॥

మంత్రం 4.5.10

**స యథా వీణాయై వాద్యమానాయై న బాహ్యాన్ శబ్దాన్ శక్నుయాద్గ్రహణాయ వీణాయై తు గ్రహణేన వీణావాదస్య వా శబ్దో గృహీతః ॥**

ఇంతవరకూ ముందు అధ్యాయములో వచ్చిన మైత్రేయీ బ్రాహ్మణములోని మంత్రాలే ఇవి కూడా. కాకపోతే ఇక్కడ మొదటి మంత్రం కలిసింది కాబట్టి సంఖ్య మారుతుంది. ఇక్కడ 4.5.2 - 4.5.10 మంత్రాలు, అక్కడ 2.4.1 - 2.4.9 మంత్రాలు అవుతాయి.

ఈ భాగంలో యాజ్ఞవల్క్యుడు మైత్రేయిని పిలిచి, 'నేను సన్న్యాసం స్వీకరించబోతున్నాను. నావల్ల మీ ఇద్దరికీ సంబంధం ఉంది. నేను వెళ్ళిపోతున్నాను కాబట్టి నాకు ఉన్న ఆస్తిని మీ ఇద్దరికీ చెరిసగం పంచుతాను' అన్నాడు.

ఆశించినట్టుగానే మైత్రేయి ఎదురు ప్రశ్నించింది. 'ఓ భగవాన్, ధనంతో నిండివున్న ఈ పృథివి అంతా నాది అయితే, దానితో నేను మోక్షం పొందుతానా?' 'మోక్షం పొందలేవు కాని సుఖంగా ఉంటావు' అన్నాడు. అంతకుముందు ఆస్తి లేదు, పూర్ణత్వమూ లేదు. ఇప్పుడు ఆస్తి ఉంటుంది కాని పూర్ణత్వం ఉండదు.

యాజ్ఞవల్క్యుడు ఇంత ఆస్తిని తృణపాయంగా వదిలివేసి వెళ్ళిపోతున్నాడంటే, అతనికి ఇంతకన్నా బ్రహ్మాండమైనదేదో దొరికిందని అర్థమయింది ఆమెకు. భార్య, ఆస్తి లేకపోయినా పూర్ణత్వభావన కలిగిందంటే అదేదో ఇంతకన్నా గొప్పదయి ఉంటుంది అని గ్రహించింది. ఆ సంపద గురించి చెప్పమంది.

యాజ్ఞవల్క్యుడు మురిసిపోయాడు. 'నాకు ముందే నువ్వంటే ఇష్టం. ఇప్పుడు నాకు ఇంకా ప్రీతి కలిగిస్తున్నావు' అని మెచ్చుకుని 'సరే అయితే చెబుతాను విను. నేను చెప్పబోయేదాన్ని ఏకాగ్రచిత్తంతో విను' అన్నాడు. ఆమెను శిష్యురాలిగా స్వీకరించి, ముందు పిడుగులాంటి మంత్రంతో మొదలుపెట్టాడు.

**న వా అరే పత్యుః కామాయ పతిః ప్రియో భవత్యాత్మనస్తు కామాయ పతిః ప్రియో భవతి** అని మొదలు పెట్టాడు.

పతిని పతిగా ప్రేమించటం లేదు; తనకోసం పతిని ప్రేమిస్తున్నది స్త్రీ. అలా మొత్తం ఒక పెద్దపట్టికను ఇచ్చాడు. అందులో భార్య, పిల్లలు, ధనం, పశువులు, బ్రాహ్మణుడు, లోకాలు, దేవతలు, వేదాలు, అన్నిటినీ మనకోసం మాత్రమే ప్రేమిస్తాము అన్నాడు.

**న వా అరే సర్వస్య కామాయ సర్వం ప్రియం భవత్యాత్మనస్తు కామాయ సర్వం ప్రియం భవతి**

ఆత్మనస్తు కామాయ సర్వం ప్రియం భవతి చాలా ముఖ్యమైన వాక్యం. మనం ఎదుటివారిని నిస్వార్థంగా ప్రేమిస్తున్నామనీ, పిల్లలకోసం ఎన్నో త్యాగాలు చేస్తున్నామనీ అనుకుంటాము కాని అందులో మనకు ఆనందం కలగటంవల్లనే మనం ఆ పనులు చేస్తున్నాము అని చెప్పాడు యాజ్ఞవల్క్యుడు.

దీనికి యాజ్ఞవల్క్యుడు చూపించిన తర్కం ఏమిటి? మనం దేన్నైతే ప్రేమిస్తామో అది మనకు ఆనందహేతువు.

**యత్ర యత్ర ప్రీతి విషయత్వం తత్ర తత్ర ఆనందస్వరూపత్వమ్** - వ్యాప్తివాక్యం

ఈ వ్యాప్తి వాక్యాన్ని బట్టి మనం విశ్లేషిస్తే, మనం అన్నిటికన్నా ఎక్కువగా ప్రేమించేది ఆత్మను; అంటే మనను. ప్రతి ఒక్కరూ తనను తానే ప్రేమించుకుంటారు. ఇది విశ్వజనీన సూత్రం. నన్ను నేనే ఎక్కువ ప్రేమించుకుంటాను కాబట్టి నేనే ఆనందస్వరూపం. ఆత్మ అంటే నేను. ఒక్క నన్ను మాత్రమే బేషరతుగా ప్రేమిస్తాను; తక్కినవారి మీద ప్రేమ అనేక షరతులతో కూడుకుని ఉంటుంది.

నన్ను కాక ఎవరినైనా ప్రేమించానంటే వారు నాకు ఆనందాన్నిస్తున్నారన్నమాట. ఎప్పుడైతే ఆ వ్యక్తి నాకు ఆనందం ఇవ్వటం మానేస్తాడో, అతనిని నేను ప్రేమించటం మానేస్తాను. ఆ సూత్రంమీదనే భార్యను, పిల్లలను, ఉద్యోగాన్ని, బంధువులను వదులుకుంటాను. ఆ పట్టికలో భగవంతుడు కూడా లేకపోలేదు. నా కోరికలను తీరిస్తేనే భగవంతుడిని ప్రేమిస్తాను, పూజిస్తాను. లేకపోతే? ఆయనమీద అలిగి, ఆయన పూజలు చెయ్యటం కూడా మానేస్తాను.

ఇటువంటి షరతులు ఏవీ నాకు లేవు. అందువల్ల నేను అంటే ఆత్మనైన నేను **ఆనందస్వరూపుడిని. నేను పూర్ణుడిని.** ఆ విధంగా ఈ బోధలో మొట్టమొదటి అంశం – **ఆత్మ ఆనంద స్వరూపం; ఆత్మ పూర్ణం**.

అటువంటి ఆత్మను ఎలా తెలుసుకోవాలి?

**ఆత్మా వా అరే ద్రష్టవ్యశ్శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యో మైత్రేయీ**

ఇది చాలా ముఖ్యమైన మంత్రం. ఆత్మను శ్రవణ, మనన, నిదిధ్యాసనలద్వారానే తెలుసుకోగలము. ఈ ఆత్మ గురించి తెలుసుకుంటే సర్వం తెలుస్తుంది.

## మంత్రం 4.5.11

**స యథాఽఽర్ద్రైధాగ్నేరభ్యాహితస్య పృథగ్ధూమా వినిశ్చరన్త్యేవం వా అరేఽస్య మహతో భూతస్య నిశ్వసితమేతద్యదృగ్వేదో యజుర్వేదస్సామవేదోఽథర్వాఙ్గిరస ఇతిహాసః పురాణం విద్యా ఉపనిషదః శ్లోకాస్సూత్రాణ్యనువ్యాఖ్యానాని వ్యాఖ్యానానీష్టగ్ం హుతమాశితం పాయితమయం చ లోకః పరశ్చ లోకస్సర్వాణి చ భూతాన్యస్యైవైతాని నిశ్వసితాని ॥**

యాజ్ఞవల్క్యుని బోధలో రెండవ అంశం – సర్వాత్మభావన. ఆత్మ అంతటా ఉంది. దీన్ని తార్కికంగా నిరూపించాడు యాజ్ఞవల్క్యుడు. ఆ తర్కం ఏమిటి? ఆత్మ జగత్తుయొక్క సృష్టి, స్థితి, లయ కారణం కాబట్టి ఆత్మ జగత్తు అంతా ఉంది.

ఉదాహరణకు నీరు–అల. సముద్రంలోని నీటినుంచే అల పుడుతుంది; స్థితి పొందుతుంది; మళ్ళీ నీటిలోనే లయమవుతుంది. అందువల్ల నీరు అలకు సృష్టి స్థితి లయ కారణం. అందువల్ల నీరు=అల; అల=నీరు. ఒక్కముక్కలో చెప్పాలంటే కారణానికి భిన్నంగా కార్యానికి ఉనికి లేదు.

ఈ మంత్రం ఇంచుమించు 2.4.10 లాగే ఉంది. కాకపోతే ఇందులో కొంచెం అదనంగా ఉంది. ఆత్మస్థితి కారణం అని చూపించటానికి రెండు మంత్రాల్లోనూ మూడు వాయిద్యాలను తీసుకున్నాడు. అవి దుందుభి,

శంఖం, వీణ. ఈ వాయిద్యాలనుంచి వచ్చే శబ్దాలను సామాన్యశబ్దం అంటారు. వాటిలో వచ్చే రకరకాల శబ్దాలు విశేషశబ్దాలు అవుతాయి.

అదే విధంగా ఆత్మ సామాన్యసత్తా లేదా ఉనికి; జగత్తు విశేషసత్తా. విశేషసత్తాకు, సామాన్యసత్తాకు భిన్నంగా ఉనికి లేదు. అంటే ఆత్మకు భిన్నంగా జగత్తుకు ఉనికి లేదు. ఇది ఆత్మ స్థితి కారణం అని చెప్పటానికి ఉదాహరణ.

ఆత్మ సృష్టికారణం అని చెప్పటానికి అగ్నినుంచి వచ్చే పొగను తీసుకున్నాడు యాజ్ఞవల్క్యుడు. తడి కట్టెలు ఉపయోగించి అగ్నిని రగిలిస్తేనే పొగ వస్తుంది. లేకపోతే పొగ లేదు. అగ్నినుంచి పొగ వచ్చినట్టుగా, స్వయం ప్రకాశక జ్యోతినుంచి పొగలాంటి ఈ జగత్తు వచ్చింది. ఈ జగత్తులోని కొన్ని అంశాలను పేర్కొన్నాడు. అవి – ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణవేదం, ఇతిహాసం, పురాణం, నాట్యశాస్త్రం, మొదలైనవి. వీటన్నిటినీ కలిపి ఒక్కమాటలో శబ్దప్రపంచం అని చెప్పవచ్చు. అంటే శబ్దప్రపంచ ఉత్పత్తి జరిగింది. దీన్నే పదప్రపంచం అని కూడా అంటారు.

ఋగ్వేదో... సూత్రాణ్యను వ్యాఖ్యానాని వ్యాఖ్యానాని – ఇంతవరకూ 2.4.10లో కూడా ఉంది.

ఇష్టగ్ం... విశ్వసితాని – ఈ భాగం ఇందులో కొత్తగా వచ్చింది.

సృష్టి సునాయాసంగా జరిగిందని చెప్పటానికి రెండవ ఉదాహరణ శ్వాస పీల్చుకోవటం. మనం ఎంత సునాయాసంగా శ్వాస పీలుస్తామో అంత సునాయాసంగా భగవంతుడు ఈ సృష్టి చేశాడు.

మొత్తం ప్రపంచాన్ని అనేక కోణాల్లో అనేక విధాలుగా విభజించి వర్ణిస్తారు. ఇక్కడ రెండుగా విభజించబడింది ప్రపంచం. అది – శబ్దప్రపంచం, అర్థప్రపంచం. ప్రపంచం అంటే నామరూపాలు అంటాము కదా, నామం అంటే శబ్దప్రపంచం; రూపం అంటే అర్థప్రపంచం. ఇంకో విధంగా చెప్పాలంటే పదప్రపంచం, పదార్థ ప్రపంచం. మొత్తం జగత్తును ఈ పదాలతో వర్ణించవచ్చు.

ఇక్కడ శబ్దప్రపంచం, అర్థప్రపంచం రెండూ భగవంతునినుంచే వచ్చాయని చెప్పదలుచుకుంది ఉపనిషత్తు. సాధారణంగా సృష్టి గురించి చెప్పేటప్పుడు ఏదో ఒకటే చెబుతారు. అంటే అయితే శబ్దప్రపంచం గురించి చెబుతారు లేదా అర్థప్రపంచం గురించి చెబుతారు. రెండూ ఎందుకు చెప్పరంటే ఒకదాని గురించి చెపితే, ఇంకోదాని గురించి చెప్పినట్టే. అర్థం, శబ్దం ఒకదానితో ఒకటి పెనవేసుకుని ఉంటాయి.

ఒక కుండను తయారుచెయ్యగానే దానికి కుండ అనే పేరు కూడా వస్తుంది. ఒక ప్రాణి భూమ్మీద పడగానే అతనికి నామకరణం జరుగుతుంది. అలా రూపం, నామం వెంటవెంటనే జరుగుతాయి. అందువల్ల ఏదో ఒకటే చెబుతారు. యాజ్ఞవల్క్యుడు కూడా ముందు అధ్యాయంలో సృష్టి గురించి చెప్పినప్పుడు శబ్దప్రపంచం సృష్టి గురించి మాత్రమే చెప్పాడు.

ఇక్కడ అర్థప్రపంచం సృష్టి గురించి కూడా చెబుతున్నాడు. ఆ భాగం చూద్దాము.

**ఇష్టగ్మ్** – హెూమంలో వేద్దామనుకుని చేతిలో పట్టుకున్న ద్రవ్యాన్ని ఇష్టం అంటారు. అంటే సంకల్పిత ద్రవ్యం. ఆ ద్రవ్యాన్ని చేతిలో పట్టుకుని ఇంద్రాయ స్వాహా అంటే ఆ వస్తువును ఇంద్రునికి ఇద్దామని నిశ్చయించు కున్నాడన్నమాట. ఇంకా ఇవ్వలేదు. సంకల్పించాడు. ఆ సంకల్పాన్ని ఇష్టం అంటారు.

**హుతమ్** – హుతం అంటే అగ్నిలో వేసిన ద్రవ్యం. అగ్నిలో వేయకముందు ఇష్టం, వేశాక హుతం. ఒకటే వస్తువు, కాని సందర్భంబట్టి పేరు మారుతుంది. చేతిలో పట్టుకుని ఇంద్రాయ స్వాహా అంటే ఇష్టం; అగ్నయే ఇదం మమ అంటే హుతం; సంకల్పిత ద్రవ్యం ఇష్టం; ప్రక్షిప్త ద్రవ్యం (వేసినది) హుతం.

**ఆశితమ్** – తర్పణం వదిలే సమయంలో వేసే ఘనపదార్థం, తినే వస్తువు.

**పాయితమ్** – హెూమంలో వేసే ద్రవపదార్థం.

**అయం చ లోకః పరశ్చ లోకః** – లోకం అంటే శరీరం. అయం చ లోకః అంటే ఈ శరీరం; పరశ్చ లోకః అంటే వచ్చే జన్మలో వచ్చే శరీరం. ఇదంతా అజ్ఞాని విషయంలో వస్తుంది.

**సర్వాణి చ భూతాని** – ఒక్కముక్కలో చెప్పాలంటే అన్ని జీవులూ. ఇదంతా అర్థప్రపంచం గురించిన వర్ణన.

**అస్యైవైతాని నిశ్వసితాని** – ఈ శబ్దప్రపంచం, అర్థప్రపంచం మొత్తం భగవంతునియొక్క ఉచ్ఛ్వాస నిశ్వాసలే. ఆయన గాలి బయటకు వదిలితే అది సృష్టి; గాలి లోపలికి పీల్చుకుంటే అది లయ. మనం గాలి పీల్చి, వదిలినంత తేలికగా భగవంతుడు పద్నాలుగు లోకాలను సృష్టి చేస్తున్నాడు; లయం చేస్తున్నాడు.

నిశ్వసితం పదం చాలా ముఖ్యమైన పదం శాస్త్రంలో. ఈ మంత్రాన్ని తరచు ఉటంకిస్తుంటారు.

## మంత్రం 4.5.12

**స యథా సర్వాసామపాగ్ం సముద్ర ఏకాయనమేవగ్ం సర్వేషాగ్ం స్పర్శానాం త్వగేకాయనమేవగ్ం సర్వేషాం గన్ధానాం నాసికే ఏకాయనమేవగ్ం సర్వేషాగ్ం రసానాం జిహ్వైకాయనమేవగ్ం సర్వేషాగ్ం రూపాణాం చక్షురేకాయనమేవగ్ం సర్వేషాగ్ం శబ్దానాగ్ం శ్రోత్రమేకాయనమేవగ్ం సర్వేషాగ్ం సఙ్కల్పానాం మన ఏకాయనమేవగ్ం సర్వాసాం విద్యానాగ్ం హృదయమేకాయనమేవగ్ం సర్వేషాం కర్మణాగ్ం హస్తావేకాయనమేవగ్ం సర్వేషామానన్దానాముపస్థ ఏకాయనమేవగ్ం సర్వేషాం విసర్గాణాం పాయురేకాయనమేవగ్ం సర్వేషామధ్వనాం పాదావేకాయనమేవగ్ం సర్వేషాం వేదానాం వాగేకాయనమ్ ॥**

ఈ మంత్రంలో ఆత్మ లయ కారణం కూడా అని చూస్తాము. అన్నీ చివరకు ఆత్మలో లయమవుతాయి. ఈ విషయంగా ఇందులో అనేక ఉదాహరణలు చూస్తాము. ముఖ్యమైన ఉదాహరణ నదులన్నీ సముద్రంలో లయమవటం. ఇది 2.4.11 లాగానే ఉంది.

మంత్రం 4.5.13

**స యథా సైన్ధవఘనోఽనన్తరోఽబాహ్యః కృత్స్నో రసఘన ఏవైవం వా అరేఽయమాత్మాఽనన్తరోఽబాహ్యః కృత్స్నః ప్రజ్ఞానఘన ఏవైతేభ్యో భూతేభ్యస్సముత్థాయ తాన్యేవానువినశ్యతి న ప్రేత్య సంజ్ఞాఽస్తీత్యరే బ్రవీమీతి హోవాచ యాజ్ఞవల్క్యః ॥**

ఇందులో చాలా వివరంగా ఆత్మస్వరూపం గురించి చెప్పబడింది. ఈ మంత్రం చాలా ముఖ్యమైన మంత్రం. దీనిని శంకరులవారు తరచు ఉటంకిస్తూ ఉంటారు. ఇది 2.4.12ను పోలి ఉంది. కాకపోతే మొదటిభాగం అంతకు ముందు మంత్రానికి భిన్నంగా ఉంది. అంతేకాదు అక్కడక్కడా కొన్ని చిన్న మార్పులు ఉన్నాయి. నిజానికి ఈ మంత్రం దానికన్నా మెరుగ్గా ఉంది.

ఈ మంత్రంలో అర్థం ఆత్మ శుద్ధచైతన్యం. **ఆత్మ సజాతీయ విజాతీయ స్వగతభేద రహితం.** ఇంతకుముందు కూడా ఈ విషయాన్ని చూశాము.

ఆత్మ సజాతీయభేదరహితం అంటే ఆత్మలు అనేకం లేవు. శరీరాలు అనేకం ఉన్నాయి కాని, ఆత్మ ఒకటే. ఈ విషయం బాగా గుర్తు పెట్టుకోవాలి. ఎందుకంటే, చాలా దర్శనాల్లో ఆత్మలు అనేకం అంటారు. సాంఖ్య, యోగ, న్యాయ, వైశేషిక దార్శనికులు అంతా ఆత్మ బహుత్వం గురించి మాట్లాడతారు.

ఆత్మ స్వగతభేద రహితం అంటే ఆత్మలో భాగాలు లేవు. అంటే ఆత్మకు తల, కాళ్ళు, చేతులులాంటి భాగాలు లేవు. మొదట్లో పరమాత్మయొక్క సగుణరూపాన్ని ధ్యానిస్తాము.

**అధరం మధురం నయనం మధురం**

అంటూ కృష్ణపరమాత్మను కీర్తిస్తాము. కాని ఇది మొదటి మెట్టు. దీన్నించి పైకి ఎదగాలి. పరమాత్మ అంటే కృష్ణుడు, రాముడు, శివుడు కాదు – నిర్గుణబ్రహ్మ. పరమాత్మకు భాగాలు లేవు. విశిష్టాద్వైతం జీవుడు, జగత్తు పరమాత్మలో భాగాలు అంటుంది. దానికి జవాబు ఇదే. పరమాత్మకు భాగాలు ఉంటే కదా, జీవుడు, జగత్తు భాగాలు అని చెప్పగలిగేది.

ఆత్మ విజాతీయభేదరహితం. ఆత్మకు భిన్నంగా వేరే ఏదీ లేదు. ఇది చాలా ముఖ్యమైన అంశం. దీన్ని జీర్ణించుకోవటం చాలా కష్టం. ఆత్మకు భిన్నంగా ఏదీ లేదు అంటే మొత్తం అనాత్మ ప్రపంచాన్ని నిషేధించటం అవుతుంది. మరి నేను చూసే ఈ బాహ్యప్రపంచం ఏమిటి?

**బ్రహ్మైవేదమమృతం పురస్తాద్ బ్రహ్మ పశ్చాద్ బ్రహ్మ దక్షిణతశ్చోత్తరేణ।**
**అధశ్చోర్ధ్వం చ ప్రసృతం బ్రహ్మైవేదం విశ్వమిదం వరిష్ఠమ్ ॥ – ముండకం 2.2.12**

తూర్పులో, పడమరలో, దక్షిణంలో, ఉత్తరంలో, పైన, కింద, అంతటా ఆత్మే ఉంది. అందువల్ల జగత్తు మిథ్య అని ఈ వాక్యంద్వారా చెప్పగలము. ఏ వాక్యం? ఆత్మ సజాతీయ విజాతీయ స్వగతభేదరహితం.

నిజానికి మొత్తం శాస్త్రంయొక్క సారాంశాన్ని ఈ ఒక్క వాక్యంనుంచే చెప్పవచ్చు – ఆత్మ సజాతీయ విజాతీయ స్వగతభేదరహితము. ఈ భావనను అద్భుతంగా వర్ణిస్తున్నది ఈ మంత్రం. అందువల్ల ఇది చాలా ముఖ్యమైన మంత్రం.

అది వివరించటానికి ఒక ఉదాహరణ తీసుకుంది ఉపనిషత్తు. ఉదాహరణ చాలా చిన్న ఉదాహరణ; కాని అందులో చాలా లోతైన అర్థముంది. ఆత్మ ఉప్పు స్ఫటికంలాగా ఉంది. ఆ ఉప్పుస్ఫటికాన్ని ఎటునుంచి రుచి చూసినా కూడా అది ఉప్పగానే ఉంటుంది. పైన రుచి చూసినా, కింద రుచి చూసినా, మధ్యలోనుంచి రుచి చూసినా ఒకటే రుచి.

అలాగే ఆ ఉప్పుస్ఫటికాన్ని నీళ్ళలో వేసి, పైనుంచి, మధ్యనుంచి, అడుగునుంచి రుచి చూసినా కూడా ఆ నీళ్ళు కూడా ఉప్పగానే ఉంటాయి. నీటిలో ఉప్పు విడిగా కనిపిస్తుందా? కనిపించదు. నీటినుంచి ఉప్పును విడదీయగలమా? లేదు. అంటే నీళ్ళలో వేసిన ఉప్పును కంటితో చూడలేము; చేతితో ముట్టుకోలేము; కాని ఉప్పు రుచిని తెలుసుకోగలము. అలాగే మొత్తం జగత్తు ఆత్మ అనే ఉప్పుతో నిండివుంది. ఇక్కడ ఉప్పు అంటే ఉనికి, సత్తా. ఉనికిని ఇంద్రియాలతో చూడలేము; ఉనికిని జగత్తునుంచి విడదీయలేము; కాని ఉనికి ఉన్నట్టు మనకు తెలుస్తున్నది.

ఒక పురుషుడు ఉన్నాడు; ఒక స్త్రీ ఉంది; ఒక కాలం ఉంది; సూర్యుడు ఉన్నాడు; చంద్రుడు ఉన్నాడు – ఈ వాక్యాలన్నిటిలో ఉన్నాడు/ఉంది పదం ఆత్మను సూచిస్తుంది. **శుద్ధ ఉనికి ఆత్మ.**

**సైంధవఘనః రసఘన ఏవ** – ఉన్నదంతా ఉప్పు రుచే. జగత్తులో ఉన్నదంతా ఆత్మే.

**అనంతరః అబాహ్యః** – ఉప్పు స్ఫటికం బయట ఏమీలేదు. లోపల ఏమీలేదు. అంతా ఉప్పు మయం. అలాగే ఆత్మ లోపల–బయటా అనే తేడా లేని పూర్ణమైన ఎరుక. ఆత్మ సజాతీయ, విజాతీయ, స్వగతభేదరహితం.

**అరేఽ యమాత్మా ప్రజ్ఞానఘన ఏవ** – ఇది శుద్ధచైతన్యం. మనిషి చైతన్యమో, స్త్రీ చైతన్యమో, వేరే దేని చైతన్యమో కాదు. ఈ చైతన్యానికి విశిష్టమైన నామరూపాలు ఉండవు.

విద్యారణ్యులవారు తన పంచదశిలో ఈ భావనతో మొదలుపెడతారు. ప్రపంచాన్ని శబ్దస్పర్శరూపరస గంధాలద్వారా చూస్తాము. వాటిద్వారా జ్ఞానం పొందుతాము. ఇప్పుడు శబ్దజ్ఞానం, స్పర్శజ్ఞానం, రూపజ్ఞానం, రసజ్ఞానం, గంధజ్ఞానాలలోంచి శబ్దస్పర్శరూపరసగంధాల పదాలు తీసేయండి. ఏం మిగిలింది? ఏమీ మిగలలేదు అనకూడదు.

శబ్దజ్ఞానం – శబ్దం=జ్ఞానం; స్పర్శజ్ఞానం – స్పర్శ=జ్ఞానం. అలా అన్ని పదాల్లోనూ సమానంగా మిగిలేది జ్ఞానం. దీన్ని ఎరుక అంటారు. శుద్ధ ఎరుక లేదా శుద్ధ చిత్. శబ్దజ్ఞానం, స్పర్శజ్ఞానాలు విశేషజ్ఞానాలు. ఈ జ్ఞానం బయటా లేదు, లోపలా లేదు అంటే అది శుద్ధ ఎరుకగా తీసుకోవాలి. ఆ విధంగా ఆత్మ సజాతీయ, విజాతీయ భేదరహిత ఆత్మ అయింది. ఈ భాగం అంతకుముందు మైత్రేయీ బ్రాహ్మణములో లేదు. తక్కినదంతా ఉంది. ఈ ఆత్మనుంచే అన్నీ పుడతాయి; ఈ ఆత్మలోనే అన్నీ లయమవుతాయి. ఆత్మ సృష్టి స్థితి లయ కారణం.

### మంత్రం 4.5.14

**సా హోవాచ మైత్రేయ్యత్రైవ మా భగవాన్మోహాన్తమాపీపిపన్న వా అహమిమం విజానామీతి స హోవాచ న వా అరేఽహం మోహం బ్రవీమ్యవినాశీ వా అరేఽయమాత్మాఽనుచ్ఛిత్తిధర్మా ॥**

ఇది కూడా ఇంచుమించు 2.4.13 లాగే ఉంది, కాకపోతే ఆఖరి వాక్యంలో చిన్న తేడా ఉంది. ఇది కూడా చాలా ముఖ్యమైన మంత్రం. ఆ భాగం చూద్దాము.

**అవినాశీ వా అరేఽయమాత్మాఽనుచ్ఛిత్తిధర్మా** – వికారాలు లేని ఆత్మకు నశించటం అనే ధర్మం లేదు.

**ఆత్మకు నాశనం లేదు.** ఇది చాలా ముఖ్యమైన వాక్యం. ఎందుకంటే ఆత్మ గురించి లేదా చైతన్యం గురించి మనకున్న ప్రమాణాలతో తెలుసుకోలేము. ఈ చైతన్యం విజ్ఞానశాస్త్రానికి అందదు. ఆత్మ వస్తువా, వస్తువుయొక్క గుణమా? ఈ రెండింటిలో ఏది అయినా దానికి నాశనం ఉంటుంది. మెదడు చైతన్యాన్ని ఉత్పత్తి చేస్తున్నదనీ, అందువల్ల ఒక వ్యక్తి మరణిస్తే అతనితో పాటు చైతన్యం కూడా మరణిస్తుందనీ భావిస్తారు.

కాని చైతన్యం మనకున్న ప్రమాణాలకు అందదు అంటుంది శాస్త్రం. ఆత్మ అప్రమేయం, సర్వప్రమాణ అగోచరం. ఎందుకు ఆత్మను లేదా చైతన్యాన్ని అప్రమేయం అంటున్నాము? ఏమిటి దానివెనకున్న తర్కం?

ప్రమేయం అంటే ఆబ్జెక్టు. మన ప్రమాణాలు ఆబ్జెక్టును తెలుసుకోవటానికి పనికివస్తాయి. ఆత్మ అప్రమేయం అంటే ఆబ్జెక్టు కాదు, సబ్జెక్టు.

**ఎవర్ ది ఎక్స్‌పీరియెన్సర్ నెవ్వర్ ది ఎక్స్‌పీరియెన్సడ్**
**అనుభవించే నేనే అది ఎప్పటికీ, అనుభవించబడే వస్తువు కాదు ఎన్నటికీ**

నా గురించి నేను లౌకిక ప్రమాణంద్వారా తెలుసుకోలేదు. అందువల్ల శాస్త్రప్రమాణం తీసుకోమంటుంది శాస్త్రం. శాస్త్రాన్ని అర్థం చేసుకుంటే ఆత్మ అవినాశి అని తెలుస్తుంది. మెదడు నాశనమయినా, చైతన్యం నశించదు. ఒక పక్క మెదడు నాశనమైనా అంటున్నారు, ఇంకొక పక్క చైతన్యం నశించదు అంటున్నారు. ఇవి పరస్పర భిన్న భావాలుగా లేవా?

ఈ వివరణను చైతన్యంయొక్క ఐదు సూత్రాలు చూసేటప్పుడు చూశాము. అందులో నాలుగు, ఐదు అంశాలు –

4. శరీరం నశించాక కూడా చైతన్యం ఉంటుంది.
5. చైతన్యాన్ని ప్రకటించే శరీరం అనే మాధ్యమం లేదు కాబట్టి, చైతన్యం ఉన్నట్టు తెలియదు. అంతమాత్రాన చైతన్యం లేదు అనకూడదు.

శరీరంలో బింబచైతన్యం, ప్రతిబింబచైతన్యం ఉంటాయి. ప్రతిబింబచైతన్యాన్ని చిదాభాస అనీ, బింబచైతన్యాన్ని చిత్ అనీ అంటారు. ప్రతిబింబచైతన్యం ఉండదు. అది సూక్ష్మశరీరంతో ప్రయాణం చేస్తుంది. కాని చిత్ సర్వవ్యాపకం, నిత్యం కాబట్టి దానికి ప్రయాణం లేదు, మరణం లేదు.

ఈ సత్ చిత్ ఆత్మను నేను అని అర్థం చేసుకోవాలి. అవినాశి అంటే నాశనం లేనిది; అనుచ్ఛిత్తి ధర్మా అంటే నాశరహిత స్వరూపం. ఒక్కముక్కలో చెప్పాలంటే ఆత్మ నిత్యం.

### మంత్రం 4.5.15

**యత్ర హి ద్వైతమివ భవతి తదితర ఇతరం పశ్యతి తదితర ఇతరం జిఘ్రతి తదితర ఇతరగ్ం రసయతే తదితర ఇతరమభివదతి తదితర ఇతరగ్ం శృణోతి తదితర ఇతరం మనుతే తదితర ఇతరగ్ం స్పృశతి తదితర ఇతరం విజానాతి యత్ర త్వస్య సర్వమాత్మైవాభూత్తత్కేన కం పశ్యేత్తత్కేన కం జిఘ్రేత్తత్కేన కగ్ం రసయేత్తత్కేన కమభివదేత్తత్కేన కగ్ం శృణుయాత్తత్కేన కం మన్వీత తత్కేన కగ్ం స్పృశేత్తత్కేన కం విజానీయాద్యేనేదగ్ం సర్వం విజానాతి తం కేన విజానీయాత్స ఏష నేతి నేత్యాత్మాఽగృహ్యో న హి గృహ్యతేఽశీర్యో న హి శీర్యతేఽసఙ్గో న హి సజ్యతేఽసితో న వ్యథతే న రిష్యతి విజ్ఞాతారమరే కేన విజానీయాదిత్యుక్తానుశాసనాఽసి మైత్రేయ్యేతావదరే ఖల్వమృతత్వమితి హోక్త్వా యాజ్ఞవల్క్యో విజహార ॥**

ఇది 2.4.14 మంత్రాన్ని పోలివుంది. ఈ మంత్ర సారాంశాన్ని చూద్దాము. వ్యవహారాలన్నీ ద్వైతంలోనే జరుగుతాయి. అద్వైతంలో ఏ వ్యవహారమూ జరగదు. జ్ఞానం పొందటం కూడా వ్యవహారంలోకే వస్తుంది. అది కూడా అద్వైతంలో జరగదు.

వ్యవహారాలన్నిటినీ రెండుగా విభజించవచ్చు. అవి – కర్మ వ్యవహారం, జ్ఞాన వ్యవహారం. యాజ్ఞవల్క్యుడు ఆత్మజ్ఞానం వ్యవహారానికి కూడా అందదని చెబుతున్నాడు. ఎందుకు? జ్ఞానం పొందటానికి ప్రమాతృ ప్రమాణ ప్రమేయరూపద్వైతం ఉండాలి. జ్ఞానం పొందే వ్యక్తిని ప్రమాతా అంటారు; అతను ఏ వస్తువు గురించి జ్ఞానం పొందుతాడో దాన్ని ప్రమేయం అంటారు. అది తెలుసుకునేందుకు వాడే పరికరాన్ని ప్రమాణం అంటారు. ఆత్మ ప్రమేయమూ కాదు, ప్రమాతా కాదు. అందువల్ల –

**ప్రమాతృ ప్రమాణ ప్రమేయ త్రిపుటి నిషేధః ఏవ ఆత్మజ్ఞానమ్**

అందువల్ల ఆత్మజ్ఞానాన్ని నేతి నేతి పద్ధతిద్వారా పొందాలి.

ఈ మంత్రంలో కూడా 2.4.14లో మంత్రంకన్నా అదనంగా చివరలో కొంతభాగం చేర్చబడింది.

**స ఏష నేతి నేత్యాత్మాఽగృహ్యో న హి గృహ్యతేఽశీర్యో న హి శీర్యతేఽసఙ్గో న హి సజ్యతేఽసితో న వ్యథతే న రిష్యతి విజ్ఞాతారమరే కేన విజానీయాదిత్యుక్తానుశాసనాఽసి మైత్రేయ్యేతావదరే ఖల్వమృతత్వమితి హోక్త్వా యాజ్ఞవల్క్యో విజహార**

ఇదంతా ఈ మంత్రంలో కొత్తగా ఉంది. ఈ మంత్రంలో అదనంగా ఉంది కాని ఈ భాగాన్ని ఈ ఉపనిషత్తులోనే ఇప్పటికే మూడుసార్లు చూశాము. అవి 3.9.26; 4.2.4; 4.4.22.

దాని సారాంశము - ఆ ఈ ఆత్మ గృహ్యం కాదు, ఎందుకంటే ఆత్మను పట్టుకోలేము; ఆత్మ అశీర్యము. ఎందుకంటే ఆత్మ శిథిలం అయ్యేది కాదు; ఆత్మ అసంగం, ఎందుకంటే ఆత్మకు దేనితోనూ బంధం లేదు. ఆత్మ బద్ధము కాదు, ఆత్మ వ్యథను పొందటం లేదు, ఆత్మ క్షీణించటం లేదు.

అలా నేతినేతి పద్ధతిద్వారా ఒక్కొక్క దాన్నీ నిషేధించుకుంటూ రావాలి. అన్నీ నిషేధించుకుంటూ వస్తే చివరికి మిగిలేది ఆత్మ. అన్నీ నిషేధించినప్పుడు ప్రమాతను కూడా నిషేధించాలి. ఆత్మను తెలుసుకోవాలనుకుంటే, ప్రమాతను ఉంచాలి. అందువల్ల చివరగా చేసే నిషేధం ఆత్మను తెలుసుకోవటానికి చేసే ప్రయత్నం. ఈ ప్రమాతను కూడా గుడ్డిగా కొట్టివేయకూడదు. ఆత్మను ప్రమాతగా తెలుసుకోలేము అని తెలుసుకోవాలి. ఆత్మ స్వయంప్రకాశక ఆత్మ. దీన్ని సాంకేతికంగా నిషేధ అవధిః లేదా నిషేధసాక్షి అంటారు.

చివరిభాగం ముందు మైత్రేయీ బ్రాహ్మణములో లేదు; ముందు చెప్పిన మూడు మంత్రాల్లోనూ లేదు.

**ఇత్యుక్తానుశాసనాఽసి మైత్రేయీ** - ఓ మైత్రేయీ! ఈ విధంగా నాచేత బోధింపబడ్డావు. ఈ విధంగా ఉపదేశించబడ్డ జ్ఞానం కలదానవు.

**ఏతావత్ అరే ఖలు అమృతత్వమ్** - దీనితో బోధ పూర్తి అయింది. ఇది సంపూర్ణజ్ఞానం అంటున్నాడు యాజ్ఞవల్క్యుడు. ఈ జ్ఞానమే అమృతత్వసాధనం. అమృతత్వం అంటే అమృతత్వసాధనం అని మనం కలుపు కోవాలి. ఈ వాక్యాన్ని గుర్తుంచుకోవాలి. ఎందుకంటే దీనిద్వారా మోక్షం పొందాలంటే ఆత్మజ్ఞానం పొందితే చాలు, కర్మ చెయ్యనవసరం లేదు అని స్పష్టంగా తెలుస్తున్నది.

**జ్ఞానాదేవ కైవల్యమ్**

జ్ఞానం పొందితే చాలు, మోక్షం కలుగుతుంది. దానికోసం ప్రత్యేకంగా వేరే కర్మ కాని, ఉపాసన కాని, ధ్యానం కాని చెయ్యనవసరం లేదు. ఈ విషయాన్ని **అమృతత్వం** అనే పదం సూచిస్తున్నది.

**ఏతావత్** - ఈ పదం చాలా ముఖ్యమైన పదం అంటున్నారు శంకరులవారు. దీని అర్థం ఇది చాలు. అంటే మోక్షసాధనకు జ్ఞానమే చాలు అని వస్తుంది.

**ఇతి హ ఉక్త్వా యాజ్ఞవల్క్యో విజహార** - యాజ్ఞవల్క్యుడు సన్న్యాసం స్వీకరించాడు. యాజ్ఞవల్క్యుడు ఈ బ్రాహ్మణము మొదట్లో సన్న్యాసం స్వీకరించదలుచుకుని, ఆస్తిని తన ఇద్దరు భార్యలు అయిన కాత్యాయని, మైత్రేయిలకు సమానంగా పంచదలుచుకున్నాడు. కాని మైత్రేయి ఆత్మజ్ఞానం గురించి అడగటంవల్ల ఆమెకు బోధ చేసి, ఆత్మజ్ఞానంవల్ల మోక్షం వస్తుందని చెప్పాడు.

ఈ అధ్యాయము మొదట్లో ఆమె నాకు భూప్రపంచంలో ఉన్న ధనమంతా ఉంటే మోక్షం వస్తుందా అని అడిగింది. అక్కడ దానివల్ల మోక్షం రాదు, సుఖం వస్తుందని చెప్పి, ఆత్మ జ్ఞానం బోధించాక ఈ ఆత్మజ్ఞానమే అమృతత్వ సాధనం అన్నాడు. అంటే ఈ జ్ఞానంవల్లనే మోక్షం వస్తుంది కాని వేరే దేనివల్లా రాదు అన్నాడు.

అదంతా చెప్పాక తను సన్న్యాసం స్వీకరించాడు. యాజ్ఞవల్క్యుణ్ణి విద్వత్‌సన్న్యాసి అంటారు. సన్న్యాసుల్లో రెండు రకాలు ఉంటారు - విద్వత్‌సన్న్యాసి, వివిదిషాసన్న్యాసి. విద్వత్‌సన్న్యాసి అంటే జ్ఞానం పొందాక సన్న్యాసం

స్వీకరించిన వ్యక్తి. యాజ్ఞవల్క్యుడు ఆ తెగలోకి వస్తాడు. వివిదిషాసన్న్యాసి అంటే జ్ఞానం పొందటానికి సన్న్యాసం స్వీకరించిన వ్యక్తి. వివిదిషాసన్న్యాసం శ్రవణ, మననాలకు తోడ్పడితే; విద్వత్‌సన్న్యాసం నిదిధ్యాసనానికి తోడ్పడుతుంది.

ఇక్కడితో మైత్రేయీ బ్రాహ్మణము అయిపోయింది. నిజానికి ఇక్కడితో మొత్తం వేదాంతబోధే ముగిసింది. ఇకనుంచి కర్మ, ఉపాసనలు వస్తాయి. కాని మనం ముందుకు వెళ్ళేముందు సన్న్యాసభాష్యం చూద్దాము. అంతకుముందు మైత్రేయీ బ్రాహ్మణం వచ్చినప్పుడే శంకరులవారు అక్కడ సన్న్యాసభాష్యం చెప్పారు, మనమూ చూశాము. మళ్ళీ ఇక్కడ ఇదే మైత్రేయీ బ్రాహ్మణాన్ని చెప్పేటప్పుడు కూడా మళ్ళీ సన్న్యాసభాష్యం చెబుతున్నారు. అందువల్ల దీన్ని సన్న్యాసభాష్యం–2 అందాము. ఈ బ్రాహ్మణానికి ఆయన సన్న్యాసభాష్యం రాయటానికి కారణాలు రెండు – యాజ్ఞవల్క్యుడు సన్న్యాసం స్వీకరించటం, సన్న్యాసాశ్రమాన్ని ఈ బ్రాహ్మణము స్తుతించటం.

దీనితో ఐదవ బ్రాహ్మణము అయిపోయింది.

# సన్న్యాస భాష్యం - 3

**పూర్వపక్షి వాదన** – వేదం ఎక్కడా సన్న్యాసం స్వీకరించమని చెప్పలేదు అంటాడు పూర్వపక్షి. జీవితాంతం కర్మ చెయ్యమనే చెబుతుంది. తన వాదనను సమర్థించుకోవటానికి అతను వేదంలోంచి అనేక మంత్రాలను ఉటంకిస్తాడు. అందులో కొన్ని ప్రత్యక్షంగా చెబుతాయి, కొన్ని పరోక్షంగా చెబుతాయి.

అందులో ప్రత్యక్షంగా చెప్పే మంత్రం – మరణించేవరకూ అగ్నిహోత్రం చెయ్యాలి. సన్న్యాసం స్వీకరిస్తే, కర్మ చెయ్యలేదు. ఇంకొక పరోక్ష మంత్రం గురించి చెబుతాడు. ఒక కర్మఠుడు మరణించినప్పుడు అతనికి దహన సంస్కారాలు చేసేటప్పుడు, అతని శరీరంతో పాటు యజ్ఞపాత్రలకు కూడా దహన సంస్కారాలు చెయ్యాలి అంటే అతను మరణించే వరకూ యజ్ఞాలు చెయ్యాలి. సన్న్యాసం స్వీకరించకూడదు. ఈ మంత్రంలో కర్మఠుని శవం భస్మమవుతుంది అని వస్తుంది.

శరీరం భస్మం ఎప్పుడు అవుతుంది? శరీరాన్ని దహనం చేస్తేనే, దహనక్రియ గృహస్థుకే చేస్తారు కాని, సన్న్యాసికి చెయ్యరు. సన్న్యాసి శరీరం బూడిద అవదు. అందువల్ల అతను సన్న్యాసం స్వీకరిస్తే, అతని శరీరం బూడిద అవదు. అలా ఒక కర్మఠుడు, తన కర్మలను వదిలేసుకుని సన్న్యాసం స్వీకరిస్తే, అది దేవేంద్రుణ్ణి హత్య చెయ్యటంతో సమానం. సన్న్యాసం స్వీకరిస్తే అతను యజ్ఞయాగాదులు చెయ్యలేడు, అవి చెయ్యకపోతే దేవేంద్రునికి ఆహుతులు వెయ్యలేడు. అందువల్ల అది హత్యతో సమానం; అందువల్ల సన్న్యాసం స్వీకరించటానికి శాస్త్రం ఒప్పుకోదు అని వాదిస్తాడు పూర్వపక్షి.

కాకపోతే అక్కడక్కడ శాస్త్రంలో చెదురుమదురుగా సన్న్యాసం గురించి రాకపోలేదు అంటాడు పూర్వపక్షి. కాని అది కూడా ఎవరి గురించి? శారీరక లోపాలు ఉన్నవారి గురించి. కుంటివాడు, గుడ్డివాడు, చెవిటివాడు– ఇలాంటి వారి గురించి చెప్పింది. అంటే ఏదో **శారీరక అవకరం** ఉన్నవారు మాత్రమే సన్న్యాసం స్వీకరించవచ్చు. అది కూడా ఎందుకు? వారికి యజ్ఞం చేసే అర్హత ఉండదు కాబట్టి.

ఇంకోరకం మనుష్యులకు కూడా శాస్త్రం అనుమతి ఇస్తుందంటాడు పూర్వపక్షి. అది ఎవరు? విశ్వజిత్‌యాగం లేదా సర్వమేధయాగం చేసినవారు. ఎందుకంటే ఈ రెండు యజ్ఞాల్లో వారికున్న ధనధాన్యపశుసంపదలన్నీ దానం చేసేయాలి. ఉన్నదంతా దానం చేస్తే ఏమవుతుంది? అతని చేతిలో చిల్లిగవ్వ మిగలదు. అలాంటప్పుడు దాని తర్వాత అతను వేరే కర్మలను ఎలా చేస్తాడు? కాబట్టి అతను కూడా సన్న్యాసం స్వీకరించవచ్చు. కాని మామూలు గృహస్థులు చక్కగా గృహస్థాశ్రమంలోనే ఉంటూ, ఆనందంగా జీవించాలి.

ఒక ముక్కలో చెప్పాలంటే పూర్వపక్షి వాదనలు రెండు –

1. శాస్త్రం ఎక్కడా సన్న్యాసం స్వీకరించమని చెప్పలేదు.
2. ఒకవేళ స్వీకరించమని చెప్పినా అది వికలాంగులకు, బీదవారికి మాత్రమే చెప్పింది.

**శంకరులవారి జవాబు** – దీనికి జవాబు శంకరులవారు రెండురకాల సన్న్యాసాలవైపునుంచి చెబుతారు.

ఆ రెండు రకాల సన్న్యాసుల గురించీ మనం ఇంతకుముందే చూశాము. అవి విద్వత్ సన్న్యాసం, వివిదిషా సన్న్యాసం. జ్ఞానం పొందిన వ్యక్తి నిదిధ్యాసనం చెయ్యటంకోసం సన్న్యాసాన్ని స్వీకరించటాన్ని విద్వత్ సన్న్యాసం అంటారు. జ్ఞానం పొందటానికే అంటే శ్రవణ, మననాలు చెయ్యటానికే సన్న్యాసాన్ని స్వీకరించటాన్ని వివిదిషా సన్న్యాసం అంటారు.

**విద్వత్ సన్న్యాసం పక్షంగా –**

విద్వత్ సన్న్యాసం ఎందుకు తీసుకోవచ్చో సూచిస్తూ శంకరులవారు రెండు వాదనలు చేస్తున్నారు. అవి శ్రుతిపరంగా, తర్కపరంగా. అంటే మొదటి వాదనకు శ్రుతిలోని వాక్యాలను ఉటంకిస్తూ, సన్న్యాసం ఎందుకు స్వీకరించవచ్చో చెబుతారు. రెండవది జ్ఞానం, కర్మ రెండు పరస్పరవిరుద్ధాలు కాబట్టి కర్మను వదిలి, సన్న్యాసం తీసుకోవాలి అని నిరూపిస్తారు. అవి వివరంగా చూద్దాము.

**1. శ్రుతిపరంగా –** మోక్షం పొందటానికి జ్ఞానం మాత్రమే చాలు. ఎప్పుడైతే జ్ఞానం పొందుతాడో అప్పుడే జ్ఞానాగ్ని అతని కర్మలను, అజ్ఞానాన్ని నాశనం చేస్తుంది. అతను సంసారంనుంచి బంధవిముక్తుడు అవుతాడు అని శ్రుతి అనేకచోట్ల చెబుతుంది.

**జ్ఞానాదేవ కైవల్యమ్**

**ఏతావదరే ఖల్వమమృతత్వమ్ – 4.5.15**

రెండవదాన్ని ఇంతకు ముందే చూశాము. అందువల్ల కర్మ, పూజ, జపంవంటివి ఏవీ సాక్షాత్తు మోక్షాన్ని ఇవ్వవు. జ్ఞానం మాత్రమే చాలు కాబట్టి జ్ఞాని కర్మ చెయ్యనవసరం లేదు. కర్మ అంటే గృహస్థాశ్రమం అని అర్థం వస్తుంది. ఎందుకంటే కర్మ అనుష్ఠానాన్ని గృహస్థు తప్ప, తక్కిన ముగ్గురూ చెయ్యలేరు. అందువల్ల గృహస్థు చేసే కర్మను ధర్మాచరణం అంటారు. అందువల్లనే భార్యను సహధర్మచారిణి అంటారు.

ధర్మం అంటే కర్మ. అన్ని కర్మలకూ భార్య ఉండి తీరాలి. భార్య లేకుండా యజ్ఞాలు చెయ్యలేరు. కాని జ్ఞానికి కర్మలు చేసేపని లేదు కాబట్టి, అతను కుటుంబ జీవనాన్ని వదిలి, సన్న్యాసం స్వీకరించవచ్చు. అది సహజం. యాజ్ఞవల్క్యుడు దీనికి ఉదాహరణ.

కర్మ ఎంతవరకు అవసరం? జ్ఞానం పొందేవరకూ. జ్ఞానం పొందాక జ్ఞాని కర్మజ్ఞానసముచ్చయం చెయ్యనవసరం లేదు. అంటే జ్ఞానంతో పాటు కర్మను చెయ్యనవసరం లేదు. ఉదాహరణకు, దీపం వెలిగించటానికి అగ్గిపెట్టె అవసరం. కాని ఎప్పుడైతే దీపం వెలిగిందో, ఆ జ్యోతికి అగ్నిపెట్టె అవసరం లేదు అంటారు శంకరులవారు. అలాగే జ్ఞానం ఉత్పత్తి చెందేవరకే కర్మ కావాలి; జ్ఞానం పొందాక జ్ఞానఫలం పొందటానికి కర్మ అవసరం లేదు.

**ఫలస్య కారణం పుష్పం ఫలం పుష్ప వివర్జితమ్**

**జ్ఞానస్య కారణం కర్మ జ్ఞానం కర్మ వివర్జితమ్**

ఫలంగా మారటానికి పుష్పం కావాలి, కాని అది ఫలం అయ్యాక పుష్పం అవసరం లేదు. అలాగే జ్ఞానం పొందటానికి కర్మ కావాలి. కర్మ చిత్తశుద్ధిని కలుగజేస్తుంది. కాని ఒకసారి జ్ఞానం పొందాక, కర్మ అవసరం లేదు. అందువల్ల విద్వత్ సన్న్యాసి సన్న్యాసాన్ని స్వీకరించవచ్చు. ఇది మొదటి వాదన.

**2. తర్కపరంగా** – జ్ఞానకర్మసముచ్చయం కుదరదు. ఎందుకంటే ఇవి రెండూ పరస్పర విరుద్ధాలు –

ఎ) **హేతుభేదం** – జ్ఞానికి వైరాగ్యం ఉంటే కర్మ చేసే వ్యక్తికి రాగం ఉంటుంది. జ్ఞానం అంటే నేను అనే అహంకారం పోతుంది. నేను బ్రాహ్మణుడిని, నేను ధనవంతుడిని, నేను వ్యాపారవేత్తను అనుకోడు. అంటే అహంకారం ఉండదు. కాని కర్మ చెయ్యాలంటే ఈ గొప్పలన్నీ వస్తాయి – కులం, గోత్రం, ఆస్తి, అంతస్తు, హెూదా, ఇలాంటివన్నీ చూస్తారు.

ఒక కార్యక్రమానికి వెళ్ళినా, అందులో వేసిన కుర్చీలో స్థాయీభేదాలను ప్రత్యేకించి ఎత్తి చూపుతాయి. ఈ స్థాయీభేదాలను నేనైనా నిరంతరం ఎత్తి చూపుతాను లేదా సమాజం నాకు ఎత్తి చూపుతుంది. ఈ స్థాయీ భేదాలు వేసుకునే దుస్తులనుంచి మొదలవుతుంది. పెళ్ళికి ఒకరకం దుస్తులు, మీటింగుకు ఒకరకం దుస్తులు ఉంటాయి. సన్న్యాసికి ఆ బాధ లేదు. అన్నిటికీ ఒకటే.

బి) **స్వరూపభేదం** – జ్ఞాని ఉన్నదంతా ఒకటే అంటాడు. అద్వైతాన్ని అనుభవిస్తాడు. కాని కర్మఠుడు నానాత్వాన్ని చూస్తాడు. అంటే ద్వైతాన్ని చూస్తాడు – అతను భగవంతుడు వేరు, నేను వేరు అనుకుంటేనే యజ్ఞాలు చెయ్యగలడు. జ్ఞాని నేను, భగవంతుడు ఒకరే అంటాడు.

సి) **ఫలభేదం** – జ్ఞానఫలం అనంతం, పూర్ణత్వం, సంసారబంధంనుంచి విముక్తి. కర్మఫలం అశాశ్వతం, అపూర్ణం, జనన మరణవృత్తం. కర్మ నిత్యం కానప్పుడు, అనిత్య కర్మనుంచి వచ్చే ఫలం నిత్యం ఎలా అవుతుంది.

హేతుభేదంవల్ల, స్వరూపభేదంవల్ల, ఫలభేదంవల్ల జ్ఞానకర్మ సముచ్చయం కుదరదు. అందువల్ల జ్ఞానం పొందిన వ్యక్తి సన్న్యాసం తీసుకోవచ్చు అని నిరూపించారు శంకరులవారు.

**పూర్వపక్షి వాదన** – జ్ఞానం, కర్మ పరస్పర విరుద్ధాలు అయితే, జ్ఞాని కర్మలను మానేస్తే, మొత్తం కర్మకాండ అప్రమాణం అయిపోతుంది అంటాడు పూర్వపక్షి. కర్మలు చెయ్యకపోతే, వేదం కర్మలను ఎందుకు చెప్పినట్టు?

**శంకరులవారి జవాబు** –

ఎ) కర్మకాండ మొత్తం ఎందుకు అప్రమాణం అవుతుంది? కర్మకాండ జ్ఞానికి అవసరం లేదు అన్నారు. అజ్ఞానులు బోలెడుమంది ఉన్నారు. వారికి కర్మకాండ అవసరం ఉంది.

బి) కామ్యకర్మలు అందరికీ వర్తించవు. పుత్రకామేష్టి యాగం, పశుకామేష్టి యాగం, వృష్టికామేష్టి యాగంలాంటి కామ్యకర్మలు అందరికీ సమానంగా వర్తించవు. పుత్రులు లేనివారు మాత్రమే పుత్రకామేష్టి యాగం చేస్తారు. అలాగే వానలు కురవని ప్రాంతంలో మాత్రమే వృష్టికామేష్టి యాగం చేస్తారు. అలా ఎవరికి ఏ దోషం ఉంటే, దానికి తగ్గ కర్మను చేస్తారు. అంతేకాని కర్మకాండలో ఉన్న అన్ని విధివాక్యాలూ అందరికీ సమానంగా వర్తించవు.

అదే విధంగా అజ్ఞాన దోషం ఉన్నవారికి కర్మకాండ అవసరం. కామం పోతే కామ్యకర్మలు అవసరం లేదు. అజ్ఞానం పోతే కర్మకాండ అవసరం లేదు. ఒక వ్యక్తికి ఏం కావాలో, ఏం అవసరం లేదో అనేది అతని వ్యక్తిగత నిర్ణయం. శాస్త్రం వ్యక్తిగత సమస్యల్లో తల దూర్చదు. అతనికి కామదోషాలు ఉంటే, కామ్యకర్మలను సూచిస్తుంది.

అతనికి ఏ కోరిక ఉంటే అది తీరుస్తుంది. పుత్రులు కావాలనుకునే వ్యక్తికి పుత్రులను ఇస్తుంది కాని, మోక్షాన్ని ఇస్తాను రమ్మనదు. వేదం అతనికి మోక్షం ఇచ్చినా, అతను స్వీకరించదు.

ధర్మార్థ కామాల్లో ఎవరు ఏది కోరితే వేదం వారికి అది ఇస్తుంది. అవే అంతిమ లక్ష్యాలుగా వేదం భావించదు కాని, వారు భావిస్తారు కాబట్టి అవి తీరుస్తుంది. అదే విధంగా జ్ఞానం పొందిన వ్యక్తికి ధర్మార్థ కామాలమీద వైరాగ్యం ఏర్పడితే, అతనికి ప్రత్యేకించి వాటికి సంబంధించిన కర్మలను చెప్పదు వేదం.

అంటే కామదోషం ఉన్నవారికి కామ్యకర్మలు కావాలి; అజ్ఞానదోషం ఉన్నవారికి కర్మకాండ కావాలి. జ్ఞానికి రెండూ అవసరం లేదు. నువ్వు ఏ దశలో ఉన్నావో నువ్వే తేల్చుకో అంటుంది శాస్త్రం. అంతమాత్రాన అసలు కర్మకాండనే త్రోసివేయటం లేదు.

ఈ విధంగా కర్మకాండ పూర్తిగా అప్రమాణం అవదనీ, జ్ఞానులు మాత్రమే కర్మ చెయ్యరనీ నిరూపిస్తారు శంకరులవారు. ఇంతవరకూ విద్వత్ సన్న్యాసానికి సంబంధించిన వాద, ప్రతివాదనలు చూశాము. ఇప్పుడు వివిదిషా సన్న్యాసం గురించి చూద్దాము.

**వివిదిషా సన్న్యాసం పక్షంగా –**

వివిదిషా అంటే తెలుసుకోవాలనే కోరిక. జిజ్ఞాసువు ఈ సన్న్యాసాన్ని స్వీకరిస్తాడు. జ్ఞాని విద్వత్ సన్న్యాసి అవుతాడు. జిజ్ఞాసు వివిదిషా సన్న్యాసి అవుతాడు. అంటే జ్ఞానీ సన్న్యాసం స్వీకరిస్తాడు; రెండవరకం సన్న్యాసంలో అజ్ఞానీ సన్న్యాసం స్వీకరిస్తాడు.

వివిదిషా సన్న్యాసం గురించి కూడా అనేక వాదనలు ఉన్నాయి. కాని శంకరులవారు ఇక్కడ రెండు రకాల సాధనలు తీసుకున్నారు. వాటిని బహిరంగ సాధనలు, అంతరంగ సాధనలు అంటారు.

ఈ అధ్యాయములోనే నాలుగు రకాల ఆశ్రమజీవితాలు కూడా మోక్షానికి పరోక్షంగా తోడ్పడుతాయి అని చూశాము. మొదటి మూడు ఆశ్రమధర్మాలూ పరోక్షంగా తోడ్పడితే, సన్న్యాసాశ్రమం ప్రత్యక్షంగా తోడ్పడుతుంది.

కర్మయోగం చిత్తశుద్ధిని కలుగజేస్తుంది. చిత్తశుద్ధి జ్ఞానం పొందాలనే కోరికను కలుగజేస్తుంది. జ్ఞానం పొందాలనే కోరిక శ్రవణం చేసేందుకు అవకాశాన్ని ఇస్తుంది. శ్రవణం జ్ఞానాన్ని కలుగజేస్తుంది. జ్ఞానం మోక్షాన్ని ఇస్తుంది. ఈ విధంగా కర్మ మోక్షాన్ని ప్రత్యక్షంగా ఇవ్వదు కాని మోక్షానికి దోహదకారి అవుతుంది.

ఈ విషయం వివరించటానికి రెండు సాంకేతిక పదాలను వాడతాము. అవి బహిరంగసాధన, అంతరంగసాధన. బహిరంగసాధన బాహ్యంగా జరిగేది, దూరంగా ఉన్నది. అంతరంగసాధన లోపల జరిగేది, దగ్గరగా ఉన్నది. కర్మయోగసాధనను బహిరంగసాధన అనీ, జ్ఞానయోగసాధనను అంతరంగసాధన అనీ అంటారు. వీటికి రెండు సాధనలను చెబుతుంది శాస్త్రం. అవి **యమ, నియమాలు**. గృహస్థాశ్రమం నియమ ప్రధానం. యమ ఉండదని కాదు కాని అవి ముఖ్యం కాదు. సన్న్యాసి విషయంలో ఇది వ్యతిరేకంగా ఉంటుంది. అంటే అతనికి యమ ముఖ్యం అవుతుంది, నియమం అముఖ్యం అవుతుంది. ఐదు నియమాలు – శౌచం, సంతోషం, తపస్సు, స్వాధ్యాయం, ఈశ్వర ప్రణిధానం. ఐదు యమలు – అహింస, సత్యం, అస్తేయం, బ్రహ్మచర్యం, అపరిగ్రహం. వీటిని వివరంగా చూద్దాము.

**ఐదు నియమాలు**

**1. శౌచమ్** – శౌచం అంటే శుభ్రత. ఇక్కడ మనం బాహ్యమైన శుభ్రత గురించి మాట్లాడటం లేదు; అంతర శుభ్రత గురించి మాట్లాడుతున్నాము. గృహస్థుకి ఈ శౌచం ముఖ్యం. దానికి రెండు కారణాలు –

ఎ) గృహస్థుకు చాలా బంధుత్వాలు ఉంటాయి. అందువల్ల ఎప్పుడూ ఏదో పుట్టుకో, చావో జరుగుతూ ఉంటుంది. దానికి తగ్గ శౌచాన్ని పాటించాలి.

బి) గృహస్థు అనేక కర్మలు, యజ్ఞాలు చెయ్యాల్సి ఉంటుంది. వాటికి అంతరశౌచం అవసరం. అది లేకపోతే అతని యజ్ఞాలు ఆశించిన ఫలితాన్ని ఇవ్వవు. ఇది యజ్ఞంలో ముఖ్యమైన అంశము.

సన్న్యాసికి బంధుత్వాలు ఉండవు కాబట్టి చావు, పుట్టుకలకు సంబంధించిన అశౌచం ఏర్పడే అవకాశం ఉండదు. కర్మలు, యజ్ఞాలు చెయ్యనవసరం లేదు కాబట్టి, ఆ విషయంలో శౌచం కూడా అవసరం లేదు. మహా అయితే శారీరక శౌచం పాటించాలి సన్న్యాసి, అంతే.

**2. సంతోషము** – గృహస్థుకు సంసారం నడపటానికి ఆస్తిపాస్తులు ఉండాలి. అతను పిల్లలను పెంచి పెద్ద చెయ్యాలి; అనేక కర్మలు చెయ్యాలి; దక్షిణలు ఇవ్వాలి; భిక్ష ఇవ్వాలి. వీటన్నిటికోసం డబ్బు సంపాదించాలి. డబ్బు సంపాదన మోజులో పడితే దురాశ పెరిగే అవకాశం ఉంది. అందుకని, అతని ఆశను అదుపులో పెట్టటంకోసం సంతోషం అనే నియమాన్ని గృహస్థుకు నిర్దేశించింది శాస్త్రం. ఆశ ఉండాలి కాని దురాశ ఉండకూడదు. డబ్బు సంపాదించాలి కాని డబ్బు వెంట పరుగులు తీయకూడదు. హద్దుమీరిన సంపాదనకోసం అర్రులు చాచకూడదు.

సన్న్యాసికి ఆస్తిపాస్తులు ఉండవు కాబట్టి, అది చాలదనే ప్రసక్తే లేదు. అతని ఆస్తి కేవలం అతని కౌపీనం మాత్రమే. ఉత్తర భారతదేశంలో ఉంటే చలిని తట్టుకోవటానికి కంబళి అవసరం. దక్షిణ భారతదేశంలో ఉంటే అది కూడా అవసరం లేదు. భిక్షాపాత్ర ఉంటే ఉంటుంది, లేకపోతే అవసరమైనప్పుడు రెండు చేతులే భిక్షాపాత్రగా అవుతాయి, అవసరం తీరినప్పుడు విడిపోతాయి. అందువల్ల సన్న్యాసికి సంతోషం అనే నియమం కూడా అవసరం లేదు.

**3. తపస్సు** – తపస్సు అంటే ఇంద్రియనిగ్రహం కూడా వస్తుంది. గృహస్థు ఇంద్రియసుఖం అనుభవించకూడదు కాని సుఖం అనుభవించవచ్చు అంటే దానికి ఇక్కడిదాకానే అనే గీత గీయటం కష్టం. అందువల్ల గృహస్థుకు తపస్సు అనే నియమం విధించటమైనది. ఉదాహరణకు గృహస్థు జిహ్వాచాపల్యం కొద్దీ అతిగా తినే ప్రమాదం ఉంది. దాన్ని అరికట్టటానికి, ఏకాదశి ఉపవాసం నియమించబడింది గృహస్థుకు.

సన్న్యాసికి ఇంద్రియసుఖాలు ఉండవు. అతను అతిగా తినే అవకాశమూ లేదు; అందువల్ల అతనికి ఏకాదశి ఉపవాస నియమమూ లేదు. అతను ఉపవాసం ఉండాలనుకుంటే ఉండవచ్చు కాని అది విధివాక్యం కాదు.

**4. స్వాధ్యాయము** – వేదాలను రోజూ పారాయణం చెయ్యటం. ఇది పంచమహాయజ్ఞాల్లో బ్రహ్మయజ్ఞం కిందికి వస్తుంది. ఇది కర్మ కాబట్టి గృహస్థు చేసి తీరాలి. ఇది కర్మ కాబట్టి సన్న్యాసి చెయ్యనవసరం లేదు.

**5. ఈశ్వర ప్రణిధానము** – ఇది కూడా రోజువారీ పూజ. ఇది కూడా కర్మలోకి వస్తుంది. ఈ కర్మ, పంచమహాయజ్ఞాల్లో దేవయజ్ఞం కిందికి వస్తుంది. గృహస్థు ఇది చేసి తీరాలి.

సన్న్యాసి కర్మలను త్యజించాడు కాబట్టి, ఈ కర్మను కూడా సన్న్యాసి చెయ్యనవసరం లేదు. ఆ మాటకొస్తే సన్న్యాసి పంచమహాయజ్ఞాలను చెయ్యనవసరం లేదు.

దీనివల్ల నియమాలు గృహస్థుకు ప్రధానంగా వర్తిస్తాయి కాని సన్న్యాసికి కాదు అని తెలుస్తున్నది.

**పంచ యమలు**

ఇవి సన్న్యాసికి ప్రధానంగా ఉంటాయి కాని గృహస్థుకు కాదు.

**1. అహింస** – గృహస్థు విషయంలో పూర్తిగా అహింస పాటించటం అసంభవం. ఎందుకంటే అతను చేసే కొన్ని క్రతువులలో జంతుబలి ఉంటుంది. హింస కర్మలో భాగం కాబట్టి అతను పూర్తిగా అహింసావాదిగా మారలేడు. అంతేకాదు ఇల్లు నడిపే వ్యవహారంలో భాగంగా బొద్దింకలను చంపుతాడు. ఇది కూడా తప్పదు.

ఆ విధంగా గృహస్థు చేసే పంచమహా హింసలు ఉన్నాయి, వాటికి ప్రాయశ్చితంగానే అతనికి పంచమహాయజ్ఞాలు నియమించబడ్డాయి. ఒక గృహం నడపాలన్నా, ఒక సంస్థ నడపాలన్నా కూడా కొంతమేరకు హింస చేయక తప్పదు. క్రమశిక్షణ పాటించని వ్యక్తిని సామదానభేదదండోపాయాలలో ఏదో ఒక పద్ధతిద్వారా దండించాల్సి ఉంటుంది.

గృహస్థు ఎన్నోసార్లు ధర్మసంకటంలో పడతాడు. ఒక వ్యక్తి తన ధర్మాన్ని సరిగ్గా నిర్వర్తించనప్పుడు, అతన్ని ఉద్యోగంలోంచి తొలగిస్తే అతని భార్యా, పిల్లలు వీధిన పడతారు; అతనిమీద జాలిపడి అతన్ని ఉద్యోగంలో కొనసాగిస్తే అతని సంస్థ దెబ్బతినే ప్రమాదముంది. అందువల్ల గృహస్థు పూర్తి అహింస చూపించే అవకాశం ఉండదు.

అదే సన్న్యాసి విషయానికి వచ్చేసరికి, అతను వ్యవహారాలు నడపడు, నడపకూడదు. అతనికి సంస్థలు ఉండవు. అందువల్ల అతను హింస చేసే అవకాశం ఉండదు. క్రిమికీటకాలకు కూడా సన్న్యాసి హాని చెయ్యకూడదనే ఉద్దేశంతోనే అతనికి చాతుర్మాస్య వ్రతం నియమింపబడింది. అంటే వర్షాకాలంలో క్రిమికీటకాలు ఎక్కువగా బయటకు వస్తాయి కాబట్టి, సన్న్యాసిని ఎక్కువగా సంచరించకుండా, ఒకేచోట ఉండేలా ఆదేశించింది.

ఈ విధంగా సన్న్యాసి అహింస పాటించాలి.

**2. సత్యమ్** – గృహస్థు నూటికి నూరుపాళ్ళూ సత్యమే పలికితే అతను అనేక సమస్యలను ఎదుర్కోవలసి ఉంటుంది. యదార్థవాదీ లోకవిరోధీ అనే సామెత ఉండనే ఉంది. ఏదైనా విషయంలో అతని అభిప్రాయం అడిగితే, అతను ఇబ్బందిలో పడతాడు.

అదే సన్న్యాసి విషయానికి వస్తే, అతనికి ఆ సమస్య ఉండదు. అతను లౌకిక విషయాలకు దూరంగా ఉంటాడు కాబట్టి, ఎవరైనా అతని అభిప్రాయం అడిగినా, అతను జవాబు చెప్పకుండా తప్పించుకోవచ్చు. అతన్ని ఎవరూ తప్పుపట్టలేరు కూడా. అందువల్ల సన్న్యాసి సత్యం పాటించాలి.

**3. అస్తేయమ్** – అస్తేయం అంటే దొంగతనం చెయ్యకుండా ఉండటం. దొంగతనం చెయ్యటం అంటే ఎదుటివారి సొమ్ము తీసుకోవటమే కాదు, మనం ఇవ్వాల్సిన సొమ్ము ఇవ్వకపోవటం కూడా. ఉదాహరణకు ప్రభుత్వానికి కట్టాల్సిన పన్నులు కట్టకుండా ఎగ్గొట్టటం కూడా దొంగతనం కిందకే వస్తుంది, కాని గృహస్థు కొంత ఎగ్గొట్టటానికే ప్రయత్నిస్తాడు.

సన్న్యాసికి ఆదాయమూ లేదు, పన్నూ లేదు. అందువల్ల సన్న్యాసి అస్తేయం పాటించాలి.

**4. బ్రహ్మచర్యమ్** – గృహస్థు ముఖ్యబ్రహ్మచర్యం పాటించనవసరం లేదు. అతను గృహస్థు అయ్యింది పిల్లలను కనటంకోసం కాబట్టి అతను ముఖ్యబ్రహ్మచర్యం పాటించలేడు. అతనికి గౌణబ్రహ్మచర్యం వర్తిస్తుంది. అంటే పరస్త్రీవ్యామోహం ఉండకూడదు.

సన్న్యాసికి భార్య లేదు కాబట్టి అతను ముఖ్యబ్రహ్మచర్యం పాటించాలి.

**5. అపరిగ్రహమ్** – గృహస్థు తన ఇంటిని, తన సంస్థను నడపటానికి ఆస్తిపాస్తులు కావాలి.

కాని సన్న్యాసి వ్యవహారాలు నడపడు కాబట్టి అతను అపరిగ్రహం పాటించాలి.

అందువల్ల సన్న్యాసాశ్రమం యమప్రధానం అయితే, గృహస్థాశ్రమం నియమ ప్రధానం అయింది. యమ అంతరంగసాధన అయితే, నియమ బహిరంగసాధన అయింది. యమ జ్ఞానం పొందటానికి తోడ్పడుతుంది. అందువల్ల ఒక సాధకుడు ముందు నియమం పాటించి, తర్వాత సన్న్యాసం స్వీకరించి, యమ పాటించాలి. ఎందుకంటే గృహస్థాశ్రమంలో యమలు పాటించటం కష్టం అని చూశాము కదా.

అందువల్ల వివిదిషా సన్న్యాసం జ్ఞానం పొందటానికి అనుకూలంగా ఉంటుంది అని శంకరులవారి వాదన. శాస్త్రం కూడా వివిదిషా సన్న్యాసాన్ని సూచించింది.

**సన్న్యస్య శ్రవణం కుర్యాత్**

శమాది షట్కసంపత్తిలో ఒక అంశం ఉపరతి. ఉపరతియొక్క ప్రాథమిక అర్థం సన్న్యాసం. కొంతమంది బ్రహ్మచారులకు సంసారం నిస్సారంగా అనిపిస్తుంది. వారికి మోక్షం, బ్రహ్మ మాత్రమే సారవంతంగా అనిపిస్తాయి. అందువల్ల వారు గృహస్థాశ్రమాన్ని స్వీకరించకుండా బ్రహ్మచర్యం నుంచే సన్న్యాసాశ్రమానికి వెళ్ళిపోతారు.

ఈ విధంగా శంకరులవారు రెండు రకాల సన్న్యాసాలనూ అంటే – విద్వత్ సన్న్యాసం, వివిదిషా సన్న్యాసం సమర్థిస్తూ చెప్పారు.

ఇదంతా విన్నాక ఇంతకీ అసలు సన్న్యాసం తీసుకోవాలా, అవసరం లేదా? ఈ ప్రశ్న మనకు ఉదయిస్తుంది. జ్ఞానం పొందటానికి బాహ్యంగా సన్న్యాసం తీసుకు తీరాలని నియమం లేదు. జ్ఞానం పొందటానికి కావాల్సిన ప్రాథమిక అర్హత – శమాదిషట్క సంపత్తి, యమ, నియమాలు. ముఖ్యంగా యమ – దీన్నే అమానిత్వం అని కూడా అంటారు. ఇవి జ్ఞానం పొందటానికి అవసరం.

ఇప్పుడు గృహస్థు నేను జ్ఞానం పొందటానికి సన్యాసం స్వీకరించాలా, వద్దా అని అడిగితే అతనిని ఎదురు ప్రశ్నించాలి. 'నువ్వు గృహస్థుగా ఉంటూ శమాదిషట్కసంపత్తి పాటించగలవా, లేదా?' 'నేను పాటించగలను, నేను గృహస్థుగా ఉంటూ కూడా నేను విలువలను పోగొట్టుకోలేదు; విలువలను పాటిస్తూనే ఉన్నాను,' అంటే అయితే అతనికి సన్యాసం అవసరం లేదు అని చెప్పవచ్చు. నిజానికి గృహస్థును కీర్తిస్తాడు కృష్ణపరమాత్మ భగవద్గీతలో.

ఒకవేళ 'నేను గృహస్థుగా ఉంటూ, యమ నియమాలను పాటించలేను. నాకు శమాదిషట్కసంపత్తి లేదు,' అని ఎవరైనా అంటే, అతను జ్ఞానం, మోక్షం పొందాలనుకుంటే' గృహస్థుగా ఉంటూ అవి సాధ్యం కాదు.

అందువల్ల సన్యాసం స్వీకరించాలా, వద్దా అనేది వ్యక్తిగతమైనది. గృహస్థుగా ఉండి శమాదిషట్కసంపత్తి పాటించి జ్ఞానం పొందగలగితే, సన్యాసం స్వీకరించనవసరం లేదు. అలా జ్ఞానం పొందలేను అనుకుంటే స్వీకరించాలి.

ఇక్కడితో సన్యాస భాష్యం – 3 అయిపోయింది.

# 4.6 - వంశ బ్రాహ్మణము

ఈ బ్రాహ్మణము గురుశిష్య పరంపరను ఇస్తుంది కాబట్టి దీన్ని వంశ బ్రాహ్మణము అంటారు. విద్యాస్తుతికోసం ఈ గురుశిష్య పరంపర ఇవ్వబడింది. ఈ విద్య సాక్షాత్తూ పరమాత్మనుంచే వచ్చింది. అందువల్ల అది పదికాలాలు నిలిచింది, దీనిమీద శ్రద్ధ ఏర్పడింది. ఈ బ్రహ్మవిద్య కర్ణపరంపరగా వచ్చింది. ఈ బోధ వ్రాతపూర్వకంగా లేదు; ఇది విని నేర్చుకున్నారు శిష్యులు. అందువల్ల సంస్కృతానికి అక్షరమాల లేదు. ఇప్పుడు మనం సంస్కృతం అర్థం చేసుకోవటానికి వాడే భాషను దేవనాగరిభాష అంటారు.

ఇది గురుశిష్యుల పరంపర అన్నారు కదా. మొదటి పదం శిష్యుడిని, రెండవ పదం గురువును సూచిస్తుంది. ఉదాహరణకు **పౌతిమాష్యో గౌపవనాత్** అంటే పౌతిమాష్యుడు అనే శిష్యుడు గౌపవనుడు అనే గురువునుంచి నేర్చుకున్నాడు. **గౌపవనః పౌతిమాష్యాత్** – గౌపవనుడు పౌతిమాష్యునినుంచి నేర్చుకున్నాడు. ఈ పౌతిమాష్యుడు, రెండవ పౌతిమాష్యుడు. అలా ఒక పేరుతో ఇద్దరు ఉండవచ్చు. అందువల్ల ఈ మంత్రాల సారాంశం చూద్దాము.

మంత్రం 4.6.1

**అథ వగ్ంశః పౌతిమాష్యో గౌపవనాద్గౌపవనః పౌతిమాష్యాత్పౌతిమాష్యో గౌపవనాద్గౌపవనః కౌశికాత్కౌశికః కౌణ్డిన్యాత్కౌణ్డిన్యశ్శాణ్డిల్యాచ్ఛాణ్డిల్యః కౌశికాచ్చ గౌతమాచ్చ గౌతమః ॥**

తర్వాత ఇప్పుడు వంశం. పౌతిమాష్యుడు గౌపవనునినుంచి; గౌపవనుడు (ఇంకొక) పౌతిమాష్యునినుంచి; పౌతిమాష్యుడు (ఇంకొక) గౌపవనునినుంచి, గౌపవనుడు కౌశికునినుంచి, కౌశికుడు కౌండిన్యునినుంచి, కౌండిన్యుడు శాండిల్యునినుంచి, శాండిల్యుడు (ఇంకొక) కౌశికుడు మరియు గౌతముడు అనే ఇద్దరినుంచి, గౌతముడు (అగ్నివేశ్యునినుంచి బ్రహ్మవిద్యను గ్రహించారు).

మంత్రం 4.6.2

**ఆగ్నివేశ్యాదాగ్నివేశ్యో గార్గ్యాద్గార్గ్యో గార్గ్యాద్గార్గ్యో గౌతమాద్గౌతమస్సైతవాత్సైతవః పారాశర్యాయణాత్పారాశర్యాయణో గార్గ్యాయణాద్గార్గ్యాయణ ఉద్దాలకాయనాదుద్దాలకాయనో జాబాలాయనాజ్జాబాలాయనో మాధ్యన్దినాయనాన్మాధ్యన్దినాయనస్సౌకరాయణాత్సౌకరాయణః కాషాయణాత్కాషాయణస్సాయకాయనాత్సాయకాయనః కౌశికాయనేః కౌశికాయనిః ॥**

ఈ వంశ బ్రాహ్మణమూ 2.6లో వచ్చిన వంశ బ్రాహ్మణమూ ఇంచుమించు ఒకటే. ఒకటవ మంత్రం, మూడవ మంత్రం రెండింటిలోనూ అక్షరాలా ఒకటే. ఈ రెండవ మంత్రంలోనే గురు, శిష్యుల పేర్లు మారతాయి. ఇది ఇంకో సమాంతర గురుశిష్యుల పరంపర అయి ఉండవచ్చు. గురువుకు అనేకమంది శిష్యులు కూడా ఉండవచ్చు. అందువల్ల ఈ మంత్రం కొద్దిగా భిన్నంగా ఉంది.

(గౌతముడు) అగ్నివేశ్యునినుంచి, అగ్నివేశ్యుడు గార్గ్యునినుంచి, గార్గ్యుడు (ఇంకో) గార్గ్యునినుంచి, గార్గ్యుడు గౌతమునినుంచి, గౌతముడు సైతవునినుంచి, సైతవుడు పారాశర్యాయణునినుంచి, పారాశర్యాయణుడు గార్గ్యాయణనునినుంచి, గార్గ్యాయణుడు ఉద్దాలకాయనునినుంచి, ఉద్దాలకాయనుడు జాబాలయనునినుంచి, జాబాలాయనుడు మాధ్యందినాయనునినుంచి, మాధ్యందినాయనుడు సౌకరాయణునినుంచి, సౌకరాయణుడు కాషాయణునినుంచి, కాషాయణుడు సాయకాయనునినుంచి, సాయకాయనుడు కౌశికాయనునినుంచి, కౌశికాయనుడు (ఘృతకౌశికునినుంచి బ్రహ్మవిద్యను గ్రహించారు.)

## మంత్రం 4.6.3

**ఘృతకౌశికాద్ఘృతకౌశికః పారాశర్యాయణాత్పారాశర్యాయణః పారాశర్యాత్పారాశర్యో జాతూ కర్ణ్యాజ్జాతూకర్ణ్య ఆసురాయణాచ్చ యాస్కాచ్చాసురాయణస్త్రైవణేస్త్రైవణిరౌపజన్ధనేరౌపజన్ధ నిరాసురేరాసురిర్భారద్వాజాద్భారద్వాజ ఆత్రేయాదాత్రేయో మాణ్టేర్మాణ్టిర్గౌతమాద్గౌతమో గౌతమాద్గౌతమో వాత్స్యాద్వాత్స్యశ్శాణ్డిల్యాచ్ఛాణ్డిల్యః కైశోర్యాత్కాప్యాత్కైశోర్యఃకాప్యః కుమారహారితా త్కుమారహారితో గాలవాద్గాలవో విదర్భీకౌణ్డిన్యాద్విదర్భీకౌణ్డిన్యో వత్సనపాతో బాభ్రవాద్వత్సనపాద్బాభ్రవః పథస్సౌభరాత్పన్థాస్సౌభరోఽయాస్యాదాఙ్గిరసాదయాస్య ఆఙ్గిరస ఆభూతేస్త్వాష్ట్రాదాభూతిస్త్వాష్ట్రో విశ్వరూపాత్త్వాష్ట్రాద్విశ్వరూపస్త్వాష్ట్రోశ్విభ్యామశ్వినౌ దధీచ ఆథర్వణాద్దధ్యఙ్ఙాథర్వణోఽథర్వణో దైవాదథర్వా దైవో మృత్యోః ప్రాధ్వగ్ంసనాన్మృత్యుః ప్రాధ్వగ్ంసనః ప్రధ్వగ్ంసనాత్ప్రధ్వగ్ంసన ఏకర్షేరేకర్షిర్విప్రచిత్తేర్విప్రచిత్తిర్వ్యష్టేర్వ్యష్టిస్సనారోస్సనారుస్సనాతనాత్స నాతనస్సనగాత్సనగః పరమేష్ఠినః పరమేష్ఠీ బ్రహ్మణో బ్రహ్మ స్వయమ్భు బ్రహ్మణే నమః ॥**

(కౌశికాయనుడు) ఘృతకౌశికునినుంచి; ఘృతకౌశికుడు పారాశర్యాయణునినుంచి, పారాశర్యాయణుడు పారాశర్యునినుంచి, పారాశర్యుడు జాతూకర్ణ్యునినుంచి, జాతూకర్ణ్యుడు ఆసురాయణుడు మరియు యాస్కులనుంచి, ఆసురాయణుడు త్రైవణినుంచి, త్రైవణి ఔపజంధనినుంచి, ఔపజంధని ఆసురినుంచి, ఆసురి భారద్వాజునినుంచి, భారద్వాజుడు ఆత్రేయునినుంచి, ఆత్రేయుడు మాంటినుంచి, మాంటి గౌతమునినుంచి, గౌతముడు (ఇంకో) గౌతమునినుంచి, గౌతముడు వాత్స్యునినుంచి, వాత్స్యుడు శాండిల్యునినుంచి, శాండిల్యుడు కైశోర్య కాప్యునినుంచి, కైశోర్యకాప్యుడు కుమారహారితునినుంచి, కుమారహారితుడు గాలవునినుంచి, గాలవుడు విదర్భీ కౌండిన్యునినుంచి, విదర్భీ కౌండిన్యుడు వత్సనపాత్ బాభ్రవునినుంచి, వత్సనపాత్ బాభ్రవుడు పంథా సౌభరునినుంచి, పంథా సౌభరుడు అయాస్య అంగిరసునినుంచి, అయాస్య అంగిరసుడు అభూతిత్వాష్టునినుంచి, అభూతిత్వాష్టుడు విశ్వరూప త్వాష్టునినుంచి, విశ్వరూప త్వాష్టుడు అశ్వినీ దేవతలనుంచి, అశ్వినీ దేవతలు దధ్యఙ్ అథర్వణునినుంచి, దధ్యఙ్ అథర్వణుడు అథర్వణ దైవునినుంచి, అథర్వణ దైవుడు మృత్యు ప్రాధ్వంసనునినుంచి, మృత్యు ప్రాధ్వంసనుడు ప్రధ్వంసనునినుంచి, ప్రధ్వంసునుడు ఏకర్షినుంచి, ఏకర్షి విప్రచిత్తినుంచి, విప్రచిత్తి వ్యష్టినుంచి, వ్యష్టి సనారువు

నుంచి, సనారువు సనాతనునినుంచి, సనాతనుడు సనగునినుంచి, సనగుడు పరమేష్ఠినుంచి, పరమేష్ఠి బ్రహ్మనుంచి బ్రహ్మవిద్యను (గ్రహించారు). బ్రహ్మ స్వయంభువు. బ్రహ్మకొరకు నమస్కారము.

పరమేష్ఠి అంటే విరాట్; బ్రహ్మ అంటే హిరణ్యగర్భ, విరాట్ హిరణ్యగర్భునుంచి బ్రహ్మవిద్య పొందాడు. హిరణ్యగర్భ ఎవరినుంచి పొందాడు? ఆయన స్వయంభువు. ఆయన ఎవరినుంచి నేర్చుకోనవసరం లేదు. అందువల్ల బ్రహ్మ ఆదిగురువు. ఆ ఆదిగురువుకు నా నమస్కారము. ఆదిగురువుకు నమస్కారం చేస్తే శిష్యపరంపర అంతటికీ ఈ నమస్కారం వెళుతుంది.

దీనితో ఆరవ బ్రాహ్మణము అయిపోయింది. నాలుగవ అధ్యాయము అయిపోయింది. ముని కాండము అయిపోయింది.

# అధ్యాయము 4 - సారాంశము

నాలుగవ అధ్యాయము వాద ప్రధానంగా ఉంటుంది. ఇక్కడ ఎదుటి వ్యక్తిని ఓడించటమో, అతని గర్వభంగం చెయ్యటమో కాదు ముఖ్యం; అతను అడిగిన విషయంలో జ్ఞానబోధ చెయ్యటం ముఖ్యం. ఈ అధ్యాయములో ఆరు బ్రాహ్మణాలు ఉన్నాయి; వాటిల్లో ఎక్కువగా యాజ్ఞవల్క్యుడే గురువు. జనక మహారాజే శిష్యుడు. ఈ ఆరు బ్రాహ్మణాల్లో మొదటి బ్రాహ్మణము ఉపాసన గురించి చెపితే, ఆఖరి బ్రాహ్మణము గురుశిష్య పరంపరలను చెబుతుంది. ఈ ఆరవ బ్రాహ్మణాన్ని వంశ బ్రాహ్మణము అంటారు. మధ్యలో ఉన్న నాలుగు బ్రాహ్మణాలూ ఆత్మవిద్యను బోధిస్తాయి.ఎక్కువగా యాజ్ఞవల్క్యుడు గురువు కాబట్టి దీన్ని ముని కాండము అంటారు.

ఇప్పుడు ఒక్కొక్క బ్రాహ్మణము గురించి చూద్దాము.

**4.1 – షడాచార్య బ్రాహ్మణము –** మొదటి బ్రాహ్మణాన్ని షడాచార్య బ్రాహ్మణము అంటారు. ఎందుకంటే యాజ్ఞవల్క్యుడు జనక మహారాజును కలిసి, మీరు తక్కిన ఆచార్యుల దగ్గర ఏం నేర్చుకున్నారని అడిగాడు. అప్పుడు జనక మహారాజు తను ఆరుగురు ఆచార్యుల దగ్గర నేర్చుకున్న విషయాలను పేర్కొన్నాడు. వారు నేర్పినది సగుణబ్రహ్మ గురించి. యాజ్ఞవల్క్యుడు వారు చెప్పింది సరియైనదే అని చెబుతూ, కాని అది అసంపూర్ణంగా ఉంది అన్నాడు. అది ఒక్కపాదం మాత్రమే అవుతుంది, పూర్ణసగుణ బ్రహ్మ చతుష్పాద బ్రహ్మ అన్నాడు. ఆ తక్కిన పాదాలగురించి యాజ్ఞవల్క్యుడు బోధించాడు

**4.2 – కూర్చ బ్రాహ్మణము –** జనకుడు **కూర్చం**నుంచి దిగివచ్చాడు కాబట్టి ఈ అధ్యాయము ఈ పదంతో మొదలవుతుంది కాబట్టి దీన్ని కూర్చ బ్రాహ్మణము అంటారు. సగుణ బ్రహ్మ ఉపాసన చేసిన వ్యక్తి అంతిమ గమ్యం నిర్గుణ బ్రహ్మ. ఆ నిర్గుణ బ్రహ్మ జ్ఞానాన్ని అవస్థాత్రయ విచారణ ద్వారా యాజ్ఞవల్క్యుడు బోధించాడు.మూడు అవస్థలను మూడు జంటలుగా వర్ణించాడు. అవి విశ్వ–విరాట్, తైజస–హిరణ్యగర్భ, ప్రాజ్ఞ–ఈశ్వర. తురీయాన్ని నేతి నేతి పద్ధతి ద్వారా వివరించాడు.

**4.3 – స్వయంజ్యోతిర్బ్రాహ్మణము –** ఈ బ్రాహ్మణము కూడా యాజ్ఞవల్క్య, జనకుల సంవాదరూపంలో సాగుతుంది. ఆత్మజ్యోతిగురించిన బోధ కాబట్టి, దీన్ని స్వయంజ్యోతి బ్రాహ్మణము అంటారు. ఇది మొత్తం బృహదారణ్యకంలోనే అత్యంత పెద్ద బ్రాహ్మణము.ఈ బ్రాహ్మణము బృహదారణ్యకోపనిషత్తుకే మకుటం.

**మంత్రాలు 1-6: దేహ వ్యతిరిక్త ఆత్మజ్యోతి** – స్వప్నవృత్తాంతంద్వారా యాజ్ఞవల్క్యుడు ఆత్మజ్యోతిని తర్కపరంగా వివరించాడు. **ఆంతరజ్యోతి అభౌతికం**– ఆంతరజ్యోతి ఇంద్రియాలకు అందదు కాబట్టి స్వప్నజ్యోతి అభౌతికం.

**మంత్రాలు 7–19 : ఆత్మజ్యోతి స్వరూపం**– మళ్ళీ స్వప్నవృత్తాంత విశ్లేషణద్వారా ఆత్మజ్యోతిస్వరూపాన్ని వివరించాడు.

**మంత్రం 20: విద్య అవిద్యల ఫలం** – విద్యాఫలం అంటే జ్ఞానఫలం, అవిద్యాఫలం అంటే అజ్ఞానఫలం.

**మంత్రాలు 21–33: సుషుప్తిద్వారా మోక్ష వర్ణన** – సుషుప్తిని మోక్షంతో సమానం చేశాడు యాజ్ఞవల్క్యుడు.

**మంత్రాలు 34–38: జీవాత్మ స్వరూపం** – ఆత్మస్వరూపాన్ని జీవాత్మపరంగా వర్ణించాడు ఈ మంత్రాల్లో.

**4.4 - శారీరక బ్రాహ్మణము -** ఈ బ్రాహ్మణాన్ని శారీరక బ్రాహ్మణము అంటారు. శారీరక అంటే బాధాతప్త జీవాత్మ. శరీరం అంటే స్థూలశరీరం; శారీరకం అంటే శరీరంలో ఉండేది.

**మంత్రాలు 1-6: సంసారవర్ణన** – ఈ మంత్రాల్లో ముందు బ్రాహ్మణములో మొదలైన సంసారవర్ణన కొనసాగింది. అది స్వయంజ్యోతి బ్రాహ్మణంలో 4.3.24లో మొదలై 4.4.6 వరకూ సాగింది.

**మంత్రం 6(చివర్లో),7 : మోక్షవర్ణన** – ఇందులో చాలా టూకీగా మోక్షం గురించి చెప్పాడు యాజ్ఞవల్క్యుడు.

**మంత్రాలు 8-21: జ్ఞానమార్గ స్తుతి** – యాజ్ఞవల్క్యుడు తన బోధలో భాగంగా కొన్ని ఋగ్మంత్రాలను ఏరి జ్ఞానాన్ని స్తుతించాడు.

**మంత్రాలు 22, 23: జ్ఞానసాధనం, జ్ఞానఫలం** – 22వ మంత్రం చాలా పెద్దది, చాలా ముఖ్యమైనది. జ్ఞానమార్గస్తుతి, జ్ఞానసాధనలు, జ్ఞానఫలం వస్తాయి.

**మంత్రాలు 24, 25: సగుణ ఉపాసన, నిర్గుణ జ్ఞానము** – ఉపనిషత్తే ఈ రెండు మంత్రాల్లో సగుణ ఈశ్వర ఉపాసన, నిర్గుణ బ్రహ్మజ్ఞానం గురించి చెప్పింది.

**4.5 - మైత్రేయీ బ్రాహ్మణము - 4.మైత్రేయీ బ్రాహ్మణము** – మైత్రేయీ బ్రాహ్మణాన్ని రెండవ అధ్యాయములో నాలుగవ బ్రాహ్మణముగా చూశాము. ఇప్పుడు ఇంచుమించు అదే మంత్రాలతో, అదే పేరుతో మళ్ళీ నాలుగవ అధ్యాయములో, ఐదవ బ్రాహ్మణముగా వచ్చింది. ఈ అధ్యాయములోని మైత్రేయీ బ్రాహ్మణాన్ని నిగమస్థానీయం అనీ, ముందు చెప్పిన మైత్రేయీ బ్రాహ్మణాన్ని ప్రతిజ్ఞాస్థానీయం అనీ అనవచ్చు.ఇందులో యాజ్ఞవల్క్యుడు, మైత్రేయిాల మధ్య సంవాదం రూపంలో ముందు **ఆత్మ పరమానంద రూపం** అనే బోధ వస్తుంది. చాలా ముఖ్యమైన సూత్రంద్వారా దాన్ని నిర్వచిస్తాడు.

ఆత్మనస్తు కామాయ సర్వం ప్రియం భవతి

**ఆత్మజ్ఞానం పొందే మార్గం** చాలా స్పష్టంగా వస్తుంది.

**ఆత్మా వా అరే ద్రష్టవ్యశ్శ్రోతవ్యో మన్తవ్యో నిదిధ్యాసితవ్య**

ఆత్మజ్ఞానం శ్రవణ, మనన, నిదిధ్యాసనలద్వారానే పొందగలము, వేరే మార్గం లేదు.

**సర్వాత్మ భావన** – ఆత్మ సర్వాత్మభావనను కూడా ఇందులో చాలా స్పష్టంగా చూస్తాము.

**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా**

**ఆత్మ జగత్ కారణం** – ఆత్మను జగత్ సృష్టి, స్థితి, లయ కారణంగా చూస్తాము.

**4.6 - వంశ బ్రాహ్మణము -**గురుశిష్యుల పరంపర వస్తుంది. దీనికి కూడా రెండు కారణాలు ఉన్నాయి –

1. విద్యాస్తుతికోసం 2. జపం చేయటంకోసం.